# పొన్నియిన్ సెల్వన్

**(Ponni's Beloved)**

**తమిళ మూలం: కల్కి**

**తెలుగు అనువాదం: కె. నాగరాజన్ (2017)**

**email: knr_sh@yahoo.com**
**website: http://taoofeverything.in/**

Ponniyin Selvan © Kalki | Telugu translation by K. Nagarajan

# భాగము - 1

# కొత్త వెల్లువ

## అధ్యాయము - 1

## ఆడి (ఆషాడ) తిరునాళ్ళు

ఆద్యంతాలు లేని కాలప్రవాహంలో కల్పన అనే ఓడెక్కి మాతోబాటు కాసేపు ప్రయాణం చేయమని పాఠకులను ఆహ్వానిస్తున్నాము.క్షణానికి ఒక శతాబ్దిగా ప్రయాణం చేసి ఇప్పటికి (1950s) తొమ్మిది వందల ఎనభైరెండు సంవత్సరాల మునుపటి కాలానికి వెళదాం.

తొండైమండలానికి, చోళనాడుకు మధ్యవున్న తిరుమునైప్పాడి దక్షిణభాగాన, తిల్లై చిట్టంబలానికి పశ్చిమంగా రెండు కోసుల దూరాన, సముద్రంలాంటి ఒక పెద్ద చెరువుంది. దాని పేరు **వీరనారాయయణపురం చెరువు.** అది ఉత్తర-దక్షిణ దిశలో సుమారు ఒకటిన్నర కోసుల పొడవు, తూర్పు-పశ్చిమంగా అర్ధ కోసు వెడల్పున్న చెరువు. కాలక్రమేణా దాని పేరు మారిపోయి, ఇప్పుడు 'వీరాణం చెరువు' అని పిలువబడుతోంది. కొత్త వెల్లువ వచ్చి చెరువు నిండి తొణుకుతుండే ఆషాడ, శ్రావణ మాసాల్లో చూసినవారెవ్వరూ మన పాత తమిళనాడు పూర్వీకులు తమ జీవితకాలంలో సాధించిన మహత్తరకార్యాల గురించి సగర్వంగా చెప్పుకొని ఆశ్చర్యపడకుండ ఉండలేరు. మన తాత ముత్తాతలు తమ శ్రేయస్సు కోసం, తమ కాలంనాటి ప్రజల కోసం మాత్రమేనా అటువంటి ఘనకార్యాలు చేశారు? మాతృభూమిలో తమ తర్వాతి కాలంలోజీవించబోయే తమ పిదప సంతతివారు కూడ చల్లగా జీవించాలని కద అటువంటి మహాకార్యాలను చేసి వెళ్ళారు?

ఆషాడమాసం పద్దెనిమిదో రోజుకు మునుపటి సాయంత్రం ఆ సముద్రంలాంటి వీరనారాయణపురం చెరువు గట్టు వెంబడి ఒక వీరయువకుడు గుర్రమెక్కి ప్రయాణం చేస్తున్నాడు. అతడు తమిళనాడు చరిత్రలో పేరుప్రఖ్యాతులుగాంచిన వాణర్‌కులానికి చెందినవాడు. వల్లవరయ్యన్ వంతిదేవుడన్నది అతడి పేరు. చాలదూరం ప్రయాణం చేసి అలసిపోయిన అతడి గుర్రం మెల్లమెల్లగా వెళుతూంది. అందుగురించి ఆ యువవీరుడు దిగులుపడలేదు. అంతులేనట్లున్న ఆ చెరువు అతడి ధ్యాసను అంతగా చూరగొంది.

ఆషాడమాసం పద్దెనిమిదో దినం (తమిళంలో 'పదినెట్టాంపెరుక్కు') చోళనాడులో పారే నదులన్నింటిలో వెల్లువ ఇరుపైపులా గట్లను తాకుతూ ప్రవహించడం పరిపాటి. ఆ నదుల నీరు చెరువుల్లోకి

పారి, అవి నిండి చెరువు గట్లను గుద్దుకొంటూ పెద్ద అలలను లేపడం కూడ కద్దు. 'ఉత్తర కావేరి' అని భక్తుల చేత, 'కొళ్ళిడం' అని సాధారణప్రజల చేత పిలువబడే నదినుంచి వెల్లువ 'వడవాట్రు'నదిగుండా పారి ఆ చెరువులో పడి దాన్ని ఒక అలల కడలిగా చేస్తూంది. ఆ చెరువు డెబ్బైనాలుగు కాలువలగుండా నీరు గుప్పుగుప్పుమని పారి ఆ చుట్టుపక్కలున్న ప్రదేశాలనన్నింటినీ సస్యశ్యామలం చేస్తూంది. చుట్టుపక్కల మళ్ళలో, చేలలో వ్యవసాయం చేస్తున్న రైతులు, నారు నాటుతున్న స్త్రీలు ఇంపైన పాటలు చాల కుతూహలంతో పాడుతుండడం అగుపించింది. ఇదంతా వింటూ, అలిసిపోయిన గుర్రాన్ని అదిలించక మెల్లగానే నడుపుకొంటూ వెళ్ళాడు వంతిదేవుడు. చెరువు గట్టెక్కినప్పటినుంచి, ఆ చెరువుకు డెబ్బైనాలుగు కాలువలున్నాయని విన్నది నిజమేనా అని తెలుసుకొనే ఉద్దేశంతో ఆ కాలువలను లెక్కించుకొంటూ వస్తున్నాడు. ఇంచుమించు ఒకటిన్నర కోసుల దూరం ఆ చెరువు గట్టు వెంబడి సాగిన తర్వాత డెబ్బై కాలువలను లెక్కవేయగలిగాడు.

ఆహా! ఇదెంతటి బ్రహ్మాండమైన చెరువు? ఎంత నీరు? ఎంతటి విస్తీర్ణం? తొండైమండలంలో పల్లవరాజుల కాలంలో తవ్వించిన చెరువులన్నీ ఈ చెరువు ముందు చిన్నపాటి కొలనులనే చెప్పాలి కద? ఉత్తర కావేరిలో వృధాగా పారి సముద్రంలో కలిసే నదీజలాలను సదుపయోగపరిచే ఉద్దేశంతో పరాంతక చక్రవర్తి కుమారుడైన రాజాదిత్యులు ఈ సముద్రంలాంటి చెరువును కట్టించాలని అనుకొన్నారు కద? అనుకోవడమేగాక, చేతల్లో చేసి చూపించేశారు కద! ఆయన ఎంతటి వివేకవంతులై ఉండాలి? అంతేగాక, వీరశౌర్యాలలో ఆయనకెవరు సాటి? తక్కోలంలో జరిగిన యుద్ధంలో తామే ముందు నిలిచి, ఏనుగెక్కి యుద్ధం చేశారు కద? పోరాడుతూ, శత్రువుల వంచనవల్ల ఆ ఏనుగు మీదే మరణించారు కద? అందువల్ల 'ఏనుగు మీద మరణించిన దేవరు' అన్న పేరుగాంచి వీరస్వర్గం చేరుకొన్నారు కద?

ఈ చోళవంశ రాజులే చాల విశిష్టమైనవారు. వీరత్వంలోనేగాక వివేకంలోను సాటిలేనివారు. అలాగే దైవభక్తిలోను. అటువంటి చోళవంశరాజులతో స్నేహం ఏర్పడే భాగ్యం తనకు కలిగింది కద అని తలుచుకొని వంతిదేవుడు రొమ్ము విరుచుకొన్నాడు. పడమటినుంచి రివ్వున వీస్తున్న గాలివల్ల ఆ చెరువులో లేచిన అలలలాగ అతడి మనసు కూడ పొంగింది.

ఇలా ఆలోచిస్తూ వంతిదేవుడు ఆ వీరనారాయణపురం చెరువు దక్షిణపు మూలకు వచ్చి చేరాడు. అక్కడ ఉత్తర కావేరినుంచి విడివడి పారే వడవాట్రు నది వచ్చి చెరువుతో చేరడాన్ని చూశాడు. చెరువు గట్టునుంచి కాస్త దూరం వరకు చెరువు లోపలి నేల కాస్త సమతలంగా, తక్కువ ఏటవాలుగా ఉంది. వరద వచ్చినప్పుడు చెరువ గట్టు దెబ్బతినకూడదని ఆ గట్టు వెంబడి చెట్లు నాటారు. నైఋతి దిశనుంచి, ఇరువైపులా దట్టమైన చెట్లతో వడవాట్రు నది వెల్లువ వచ్చి చెరువులో పడుతున్న దృశ్యాన్ని చూస్తున్నప్పుడు ఒక అందమైన రంగురంగుల ముగ్గులాగ తోచింది.

ఈ మనోహరమైన దృశ్యాన్ని ఇంకా ఇనుమడింపజేసే మరి కొన్ని దృశ్యాలను వంతిదేవుడు చూశాడు.

ఆ రోజు ఆషాడమాసం పద్దెనిమిదో దినం తిరునాళ్ళు కద? చుట్టుపక్కల గ్రామాలనుంచి జనాలు ఎడ్లబళ్ళలో గుంపులు గుంపులుగా వస్తున్నారు. స్త్రీపురుషులు, చిన్న పిల్లలు, వయసు మళ్ళినవారు కూడ కొత్తబట్టలు ధరించి చక్కగా అలంకరించుకొని వస్తున్నారు. స్త్రీల జడలు మొగలి, మల్లె, సంపంగి పూలచేత అలంకరించబడివున్నాయి. చిత్రాన్నం, పొంగలి తీసుకొని చాలమంది సకుటుంబ సమేతంగా వస్తున్నారు. ఇంకొందరు చెరువు గట్టు మీద కూర్చొని చిత్రాన్నాన్ని విస్తరాకుల్లోన, దొన్నల్లోను వడ్డించుకొని తింటున్నారు. మరింకొందరు ధైర్యశాలురు నీటిలో దిగి వడవాట్రు నది తీరం వరకు నడిచివెళ్ళి, అక్కడ నిలబడి భోజనమారగిస్తున్నారు. చిన్నపిల్లలు తిన్న తర్వాత దొన్నలను నది ప్రవాహంలో విసిరి, అవి పడవల్లాగ తేలుతూ వెళుతుండడాన్ని చూసి కేరింతలు కొడుతున్నారు. కొందరు కొంటె యువకులు తమ ప్రేయసీమణుల జడలనుంచి పూలను దొంగిలించి వారికి తెలియకుండ కాలువ వారగా వాటిని నీట వదిలి, అవి చెరువు గట్టుకవతల తేలి రావడాన్ని చూసి ఆనందించసాగారు. వంతిదేవుడు ఇదంతా చూస్తూ అక్కడే కాసేపు నిలబడ్డాడు. అక్కడ నిలబడ్డ యువతుల్లో ఇంపైన గొంతుగల కొంతమంది పాడగా, అది కూడ కాసేపు విన్నాడు. వారు పడవ పాటలు, వెల్లువ పాటలు, గొబ్బి పాటలు పాడారు.

ఇంకొందరు చోళకుల రాజుల కీర్తిప్రతిష్టల గురించి పాడారు.ముప్పైరెండు యుద్ధాల్లో పోరాడి తొంభైయారు గాయాలను భరించిన విజయాలయ చోళుల వీరత్వాన్ని పొగడుతూ కొందరు యువతులు పాడారు. అతడి కుమారుడైన ఆదిత్యచోళుని వీరత్వాన్ని పొగడి, అతడు కావేరి జన్మస్థలం నుంచి ఆ నది సముద్రంలో కలిసే వరకు ఆ నదీతీరం వెంబడి అరపైనాలుగు శివాలయాలను కట్టించిన వైభవాన్ని ఒక మధురమైన పాట రూపంలో ఒక అమ్మాయి పాడింది.

ఆదిత్య చోళుని కుమారుడైన పరాంతక చక్రవర్తి పాండ్యులను, పల్లవులను, చేరులను జయించి, లంక మీద ఒక పెద్ద సైన్యంతోదండయాత్ర చేసి అక్కడ పులిజెండాను ఎగురవేసిన వృత్తాంతాన్ని ఇంకొక వనిత ఉత్సాహంతో పాడి వినిపించింది. ఒక్కొక్క యువతి పాడినప్పుడు ఆమె చుట్టూ పలువురు నిలబడి విన్నారు. అప్పుడప్పుడు "ఆహా!", "ఓహో!" అని ఘోషించి తమ సంతోషాన్ని వెలిబుచ్చారు.

గుర్రంమీద ఉన్నపళంగానే ఆ పాటలను వింటున్న వంతిదేవుని ఒక ప్రౌఢవనిత గమనించింది. "తమ్ముడూ! చాలదూరం ప్రయాణం చేసి అలిసిపోయావు. గుర్రంమీదినుంచి దిగి వనభోజనమారగించు!" అన్నది.

వెంటనే పలువురు యువతులు మన యువప్రయాణికుడిని చూశారు. అతడి రూపురేఖల గురించి తమలో తాము రహస్యంగా మాట్లాడుకొని, గలగలమని నవ్వారు. వంతిదేవుని ఒకవైపు సిగ్గు,

ఇంకొకవైపు కుతూహలం పట్టి పీడించాయి. ఆ ప్రౌఢవనిత చెప్పినట్లు గుర్రం దిగి వెళ్ళి వారందరితో భోజనం చేద్దామా అని ఒక క్షణంపాటు అనుకొన్నాడు. అలా చేస్తే అక్కడున్న యువతులు తనను చుట్టుముట్టి పరిహాసం చేస్తారన్నది తథ్యం. అయితేనేమి? అంతమంది అందమైన అమ్మాయిలను ఒకేచోట ఒకేసారి చూడగలగడం సులభసాధ్యమా? వారు తనను చూసి పరిహసిస్తూ నవ్వినా, అది దేవగానంలాగే ఉంటుంది. వంతిదేవుని యువ నేత్రాలకు ఆ చెరువు గట్టున నిలబడ్డ ఆ యువతులు రంభ, ఊర్వశి, మేనకల్లాగ కనిపించారు!

అదే సమయాన నైఋతి దిక్కున వడవాఱ్ఱు నదీప్రవాహాన కనిపించిన ఒక దృశ్యం చూసి అతడు కాస్త జంకాడు. తెల్లటి తెరచాపలు విప్పిన ఏడెనిమిది పెద్ద ఓడలు, తెల్లటి రెక్కలు విప్పుకొని నీట తేలుతూ వచ్చే రాజహంసల్లాగ, వీస్తున్న గాలివల్ల వేగంగా వస్తూ కనిపించాయి.

చెరువు గట్టున పలువిధాలైన వినోదాల్లో నిమగ్నమైన జనాలందరూ ఒక్కసారిగా ఆ వస్తున్న ఓడలవైపే ఆసక్తితో చూడసాగారు.

ఆ ఓడల్లో అన్నిటికన్న ముందున్నది తక్కినవాటికన్న అతివేగంగా వచ్చి చెరువు గట్టు ఉత్తరదిశగా మలుపు తిరిగే చోట వచ్చి ఆగింది. ఆ ఓడలో తళతళ మెరుస్తున్న శూలాలను చేతబట్టిన వీరులు పలువురున్నారు.

వారిలో కొందరు గట్టుమీదికి దూకి అక్కడ గుమిగూడిన జనాలను "వెళ్ళండి! వెళ్ళండి!" అని చెదరగొట్టసాగారు. జనాలు కూడ, ఆ వీరులు ఎక్కువగా అదిలించనవసరం లేకుండ, తమ తమ పాత్రలను తొందరగా తీసుకొని గట్టెక్కారు.

వంతిదేవునికిది ఏ మాత్రం అర్థం కాలేదు. ఈ వీరులెవరు? వెనక వస్తున్న ఓడల్లో ఎవరు వస్తున్నారు? ఎక్కడినుంచి? ఒకవేళ రాజకుటుంబానికి చెందినవారా?

చెరువు గట్టుమీద చేత కర్రబట్టుకొని నిలబడ్డ ఒక పెద్దాయనను సమీపించాడు. "అయ్యా! ఈ వీరులు ఎవరికి చెందినవారు? ఆ వెనుక వస్తున్న ఓడలు ఎవరివి? ఎందుకని ఆ వీరులు జనాలను అదిలించి చెదరగొడుతున్నారు? జనాలు కూడ ఎందుకని వేగంగా అవతలికి వెళుతున్నారు?" అని ప్రశ్నల వర్షం కురిపించాడు.

"తమ్ముడూ! నీకు తెలియడం లేదా, ఏమి? అదిగో ఆ ఓడల్లో మధ్యనున్నదాని మీద ఒక జెండా ఎగురుతుంది చూశావా? దాని మీద ఏం చిత్రించబడివుంది చూడు!" అన్నారా పెద్దాయన.

"తాటిచెట్టులాగ అగుపిస్తూంది."

"తాటిచెట్టే! తాటిచెట్టు చిహ్నం పళువేట్టరయ్యర్ చిహ్నమని నీకు తెలియదా?"

“మహావీరులైన పెద్ద పళువేట్టరయ్యరా వస్తున్నారు?” అని అదిరిపడి అడిగాడు వంతిదేవుడు.

“అలాగే ఉండాలి; తాటిచెట్టు చిహ్నమున్న జెండాను ఎగురవేస్తూ ఇంకెవరు రాగలరు?” అన్నారు పెద్దాయన.

వంతిదేవుని కళ్ళు ఎనలేని ఆశ్చర్యంతో ఓడలు వస్తున్న దిశగా చూశాయి. పళువేట్టరయ్యర్ గురించి వంతిదేవుడు చాల విన్నాడు. ఎవరు మాత్రం వినివుండరు? దక్షిణాన లంకనుంచి ఉత్తరాన కళింగదేశం వరకు అన్నదమ్ములైన పెద్ద పళువేట్టరయ్యర్, చిన్న పళువేట్టరయ్యర్ల పేర్లు ప్రసిద్ధికెక్కాయి. ఉరైయూర్ పక్కనున్న ఉత్తర కావేరి నది ఉత్తరతీరానున్న పళువూర్ వారి నగరం. విజయాలయ చోళుల కాలం నుంచి పళువేట్టరయ్యర్ల కులం వీరత్వానికి పేరుగాంచినది. ఆ కులస్థులకు చోళకులంతో ఇచ్చిపుచ్చుకోవడాలున్నాయి. ఈ కారణం వల్లను, వారి కులచరిత్ర వల్లను, చోళకులంతో ఉన్న దగ్గరి సంబంధాల వల్లను పళువేట్టరయ్యర్ కులం అన్ని విధాలుగాను రాజవంశంగా విరాజిల్లింది. ప్రత్యేకంగా తమదైన జెండాను ఎగురవేసుకొనే హక్కు కూడ ఆ కులానికి ఇవ్వబడింది.

ఇప్పుడున్న పళువేట్టరయ్యర్లలో పెద్దాయన ఇరవైనాలుగు యుద్ధాలలో పోరాడారు. ఆయన కాలంలో ఆయనకు సాటియైన వీరుడింకెవరూ లేరని కీర్తిగాంచినవారు. ఇప్పుడు వయసు యాభైయేళ్ళకు పైబడ్డంవల్ల యుద్ధరంగాలకు వెళ్ళడం లేదు. కానీ చోళసామ్రాజ్యంలో చాల ఉన్నతమైన పదవులెన్నో నిర్వహించినవారు. ఆయన చోళసామ్రాజ్యానికి ధనాధికారి, ధాన్యాధికారి; ధన, ధాన్యభండారాలు రెండూ ఆయన అధీనంలో ఉన్నాయి. రాజ్యాన్ని నడిపేందుకు కావలసినంత పన్ను విధించి, వసూలు చేసే అధికారం కూడ ఆయనదే. ఏ సామంతరాజునైనా, ఏ పెద్దింటివారినైనా, “ఈ సంవత్సరం ఇంత పన్ను కట్టే తీరాలి" అని ఆజ్ఞాపించే అధికారం ఆయనకుంది. కాబట్టి, సుందర చోళ చక్రవర్తి తర్వాత చోళసామ్రాజ్యంలో అధికారం, చెల్లుబడి కలిగినవారు పెద్ద పళువేట్టరయ్యరే.

అటువంటి మహావీరులు, అదికారం, బలం కలిగినవారైన పెద్ద పళువేట్టరయ్యర్ని చూడాలన్న కుతూహలం, ఆసక్తి వంతిదేవుని మనసులో పొంగాయి. కానీ అదే సమయాన, కంచిలో బంగారు మాళిగలో యువరాజు ఆదిత్య కరికాలన్ చెప్పిన ఆంతరంగికమైన మాటలు గుర్తుకొచ్చాయి:

“వంతిదేవా! నీవు విలక్షణమైన వీరుడవని నేనెరుగుదును. దానితోబాటు నీవు చాల తెలివిమంతుడవని నమ్మి ఈ పెద్ద బాధ్యతను నీకప్పగిస్తున్నాను. నేనిచ్చిన రెండు తాళపత్రాలలో ఒకదాన్ని నా తండ్రియైన మహారాజుకు, ఇంకొకదాన్ని నా సహోదరికి అందజేయాలి. తంజావూరులోని రాజ్యాంగానికి చెందిన పెద్ద పెద్ద అధికారుల గురించి ఏవేవో వింటున్నాను. కాబట్టి నేను పంపుతున్న సందేశం ఎవరికీ తెలియకూడదు. ఎంతటి ముఖ్యమైనవారైనా కూడ, నీవు నానుంచి తాళపత్ర సందేశాలు తీసుకొని వెళుతున్నావని వారికి తెలియకూడదు.దారిలో ఎవరితోను దెబ్బలాటకు దిగకూడదు. నీకై నీవే

దెబ్బలాటకు కాలు దువ్వకుండడం మాత్రం చాలదు. ఎదుటివారు నిన్ను కయ్యానికి లాగినా, నీవు అందులో చిక్కుకోకూడదు. నీ వీరత్వాన్ని నేను బాగ ఎరుగుదును. ఎన్నెన్నోసార్లు దాన్ని నిరూపించావు కూడాను. కాబట్టి, అనవసరమైన కయ్యాలనుంచి నీవు పైదొలగినా కూడ నీ గౌరవానికేం కొరత రాదు. ముఖ్యంగా, నీవు పళువేట్టరయ్యర్లతోను, నా పినతండ్రి మధురాంతకునితోను నీవు చాల జాగ్రత్తగా మసలుకోవాలి. వారికి నీవు 'ఫలానా మనిషివి' అని తెలియనే కూడదు! నీవు ఎందుకు వెళుతున్నావన్నది వారికి  తెలియనే కూడదు!''

చోళసామ్రాజ్యానికి పట్టపు యువరాజు, ఉత్తర సైన్యానికి మాతండ నాయకులు అయిన ఆదిత్య కరికాలన్ ఇలా చెప్పి పంపారు. ఇంకా, వంతిదేవుడు నడుచుకోవలసిన విధానం గురించి మరీ మరీ వివరించి చెప్పారు. ఇవన్నీ గుర్తుకు రాగానే, పళువేట్టరయ్యర్ని చూడాలన్న కుతూహలాన్ని/ఆసక్తిని అదిమిపెట్టాడు వంతిదేవుడు. గుర్రాన్ని అదిలించి వేగంగా వెళ్ళడానికి ప్రయత్నించాడు. ఎంత అదిలించినా కూడ, అలిసిపోయిన ఆ గుర్రం మెల్లగానే ముందుకు సాగింది. ఈరోజు రాత్రి కడంబూర్ శంబువరయ్యర్ మాళిగలో బస చేసి, రేపు ఉదయం బయల్దేరేటప్పుడు ఇంకొక గుర్రాన్ని సంపాదించుకోవాలని తీర్మానించుకొన్నాడు.

~~~
~~~

# అధ్యాయము - 2

## ఆళ్వార్ కట్టియాన్ నంబి

చెరువు గట్టుమీదినుంచి కిందకు దిగి అక్కడినుంచి దక్షిణంగా వెళుతున్న దారివెంబడి గుర్రాన్ని నడిపించినప్పుడు వంతిదేవుని మనసు ఆ చెరువు అలలమీద నాట్యమాడుతున్న పడవల్లాగ ఆనందంతో ఉర్రూతలాడింది. మనసు లోలోపల దాగివున్న కుతూహలం పొంగిపొర్లింది. జీవితంలో ఎవరూ చూడని విచిత్రమైన అనుభవాలను తాను అనుభవించబోతానని అతడి అంతరానుభూతి చెప్పింది. చోళనాడును సమీపించేటప్పుడే ఇంతటి ఆనంద కోలాహలంగా ఉంది కద? ఇక కొళ్ళిడం నదిని దాటిన తర్వాత ఆ నాడు జలసమృద్ధి, ధాన్యసమృద్ధి ఎలా ఉంటుంది? ఆ నాడులో జీవించే ప్రజలు, కులస్త్రీలు ఎలా ఉంటారు? ఎన్నెన్ని నదులు! ఎన్నెన్ని కొలనులు! కవితల్లోను, కావ్యాల్లోను కొనియాడబడ్డ పొన్ని నది ఎలా ఉంటుంది? దాని తీరాల వెంబడి ఏపుగా పెరిగిన పొన్న చెట్లు, సంపంగి చెట్లు ఎంతటి కమనీయ దృశ్యాలను తన ముందుంచుతాయి? కొలనుల్లో కలువలు, తామరలు విరిసి విప్పారి స్వాగతించే దృశ్యం ఎంత మనోహరంగా ఉంటుంది? కావేరి నది రెండు తీరాల వెంబడి చోళవంశ రాజులు అద్భుతంగా కట్టించిన ఆలయాలు ఎంత కమనీయంగా ఉంటాయి?

ఆహా! పళైయారై నగరం! చోళరాజుల రాజధాని! పూంపుహార్, ఉరైయూర్ నగరాలను కుగ్రామాలుగా చేసేసిన పళైయారై! ఆ నగరంలోని మేడలు, మాళిగలు, గోపురాలు, సైన్యాల ఇళ్ళు, అంగడి వీధులు, శివాలయాలు, విష్ణువాలయాలు ఎలా ఉంటాయి? ఆ ఆలయాలలో గాయకశిఖామణులు మధురమైన స్వరంతో దేవారాలను, పాశురాలను పాడగా విని భక్తులు పరవశించిపోతారని వంతిదేవుడు విన్నాడు. అవన్నీ వినే అవకాశం త్వరలోనే తనకు దక్కబోతూంది. అంతేనా? కొన్నాళ్ళ క్రితం వరకు తాను కలలో కూడ ఊహించని కొన్ని అనుభవాలు తనకు దొరకబోతున్నాయి - వీరత్వంలో శూలాయుధపాణి సుబ్రమణ్యునికి, అందంలో మన్మధునికి సాటియైన పరాంతక సుందర చోళ చక్రవర్తిని ప్రత్యక్షంగా చూసే భాగ్యం కలగబోతూంది కద? అంతేనా? ఆయన ప్రియపుత్రిక, సాటిలేని నారీమణి కుందవై రాకుమారిని చూడబోతున్నాడు.

కానీ దారిలో ఆటంకాలేవీ కలగకుండాలి. ఏ ఆటంకం వస్తేనేమి? చేత శూలముంది. ఒరలో ఖడ్గముంది; వక్షస్థలానికి కవచముంది; హృదయంలో ధైర్యముంది. కానీ మహాదండనాయకులైన యువరాజు ఆదిత్యులు ఒక షరతు పెట్టారు - ఒప్పజెప్పిన కార్యం ముగిసేవరకు ఎవరితోను దెబ్బలాటకు, కయ్యానికి దిగకూడదు. దాన్ని పాటించడమే చాల కష్టంగా ఉంది. ఏదో ఇంతదూరం ఎవరితోను కయ్యానికి దిగకుండ ప్రయాణం చేసి రావడమైంది. ఇక రెండు రోజుల ప్రయాణమే కద మిగిలివుంది? ఎలాగోలా

ఓపికపడదాము.

సూర్యుడస్తమించేలోగా కడంబూర్ మాళిగను చేరుకోవాలన్న ఉద్దేశంతో వెళుతున్న వంతిదేవుడు కాసేపటికల్లా వీరనారాయణపురం విణ్ణకర్ (విష్ణువు) దేవాలయాన్ని సమీపించాడు.

ఆ రోజు ఆషాడమాసం తిరుమంజనం పర్వదినం కూడ కావడంతో గుడి చుట్టుపక్కలున్న తోపుల్లో జనాలు తండోపతండాలుగా గుమిగూడివున్నారు.

పనసతొనలు, అరటిపండ్లు, చెరుకుగెడలు అమ్మేవారు అక్కడక్కడ అంగళ్ళు తెరిచి వాటిని అమ్ముతున్నారు. ఆడవాళ్ళు జడల్లో తురుముకొనే పూలు, పూజకు ఉపయోగించే తామరమొగ్గలు కూడ కొందరు అమ్ముతున్నారు. కొబ్బరికాయలు, కొబ్బరిబొండాలు, బెల్లం, చందనం, త్రమలపాకులు, అటుకులు, బొరుగులు మొదలైనవాటిని ఇంకొందరు కుప్పలు, కుప్పలుగా వేసి అమ్ముతున్నారు. అక్కడక్కడ వింతలు, వినోదాలు జరుగుతున్నాయి. జ్యోతిష్కులు, హస్తసాముద్రికులు, సోది చెప్పేవారు, విషసర్పాల కాటుకు మంత్రంవేసేవారు - వీరికక్కడ కొరతే లేదు. ఇదంతా చూసుకొంటూ వెళుతున్న వంతిదేవుడు ఒక చోట జనం గుమిగూడివుండడం, ఆ గుంపు మధ్య ఎవరో పెద్దగా వాగ్వివాదం చేస్తూండడం గమనించాడు. ఏం వాగ్వివాదం జరుగుతోందని తెలుసుకోవాలన్న ఆసక్తి అతడికి పొంగుకొచ్చింది. దాన్ని అదిమిపెట్టలేక, బాట వారగా గుర్రాన్ని ఆపి కిందకు దిగాడు. గుర్రాన్ని అక్కడే నిలబడమని సైగతో చెప్పి, మెత్తగా చరిచి, గుంపులోకి దూరాడు.

అక్కడ వివాదంలో పాల్గొంటున్నది ముగ్గురే అన్న విషయం చూసి అతడికి చాల ఆశ్చర్యం కలిగింది. కానీ గుంపులోని జనాలు, వాగ్వివాదంలో ఎవరి వాదం తమకు నచ్చితే వారిని ఉత్తేజపరుస్తూ ఘోషిస్తున్నారు. అందుకే అంత పెద్దగా శబ్దం లేచింది అని గ్రహించాడు వంతిదేవుడు. తర్వాత దేనిగురించి వాగ్వివాదం జరుగుతోందన్నది గమనించాడు.

వాగ్వివాదం చేస్తున్న ముగ్గురిలో ఒకడు ఒళ్ళంతా ఊర్ధ్వపుండ్రాలుగా చందనం పూసుకొని, ముందు పిలకవున్న వైష్ణవ భక్తశిఖామణి. చేత ఒక బడితె కూడ పట్టుకొనివున్నాడాయన. పొట్టిది, బలిష్టమైనదిగా ఉన్న మేనుగలవాడు.ఇంకొకాయన ఒళ్ళంతా విభూతి రాసుకొన్న శివభక్తులు. మూడో ఆయన కాషాయవస్త్రాలు ధరించి, శిరోముండనం చేసుకొని ఉన్నారు. ఆయన శైవులు కారు, వైష్ణవులు కారు, రెండింటినీ మించిన అద్వైత వేదాంతి అని తెలుస్తూంది.

శైవులన్నారు: ''ఓ ఆళ్వార్ కట్టియాన్ నంబి! దీనికి బదులు చెప్పు! శివపరమాత్మ జుట్టుముడిని కనిపెట్టేందుకు బ్రహ్మ, పాదాల అడుగుభాగాన్ని కనిపెట్టేందుకు విష్ణువు బయల్దేరారు కద? రెండూ కనిపించక ఇద్దరూ తిరిగి వచ్చి శివపరమాత్మ కాళ్ళమీద పడి శరణు కోరారు కద? అలా ఉండగా, శివపరమాత్మ కన్న, మీ విష్ణువు ఎలా పెద్ద దైవం కాగలరు?''

ఇది విన్న ఆళ్వార్ కట్టియాన్ నంబి తన చేతి బెత్తాన్ని అటూ ఇటూ ఊపుతూ, "సరిపోయింది! వీరశైవ పాదధూళి శివభక్త భట్టుగారూ! ఆపండి మీ మాటలు! లంకాధిపతియైన దశకంఠుడు రావణునికి మీ శివపరమాత్మ వరాలిచ్చాడు కద? ఆ వరాలన్నీ మా విష్ణుపరమాత్మ రూపమైన శ్రీరాముని కోదండం ముందు పనికి రాకుండపోయాయి కద? అలా ఉండగా, మా విష్ణుపరమాత్మ (పెరుమాళ్ళు) కన్న మీ శివపరమాత్మ ఎలా పెద్ద దైవం కాగలరు?''

ఈ సమయాన అద్వైత సన్యాసిగారు వాగ్వివాదంలో తలదూర్చి, ఇలా అన్నారు: ''మీరిద్దరూ ఎందుకిలా వృధాగా వాదిస్తున్నారు? శివుడు పెద్ద దైవమా, విష్ణువు పెద్ద దైవమా అని మీరెంతసేపు వాదించినా, వివాదం తీరదు. ఈ ప్రశ్నకు సమాధానాన్ని వేదాంతం చెబుతూంది. మీరు కిందవున్న భక్తిమార్గంలో వెళుతున్నంతవరకే శివుడు - విష్ణువు అని దెబ్బలాడుతుంటారు. భక్తిమార్గం పైన జ్ఞానమార్గం ఉంది. జ్ఞానానికి పైన జ్ఞాసం అని ఒకటుంది. ఆ స్థితిని చేరుకొంటే శివుడు లేదు, విష్ణువు లేదు. సర్వం బ్రహ్మమయం జగత్. శ్రీ శంకర భగవత్ పాదాచార్యులు బ్రహ్మసూత్ర భాష్యంలో ఏమని చెప్పారంటే...''

అంతలో ఆళ్వార్ కట్టియాన్ అడ్డొచ్చి, ''సరే, ఆపండి! మీ శంకరాచార్యులు ఉపనిషత్తులకు, భగవద్గీతకు, బ్రహ్మసూత్రానికి భాష్యం రాసేసి, చివరగా ఏం చెప్పారో తెలుసా?

'భజ గోవిందం భజ గోవిందం

గోవిందం భజ మూఢమతే!'

అని మూడుసార్లు చెప్పారు. మీలాంటి మూఢులను చూసే, మీ శంకరాచార్యులు 'మూఢమతే!' అన్నారు!'' అన్న వెంటనే, ఆ గుంపులో 'ఆహా' కారాలు, పరిహాసపు నవ్వులు, చప్పట్లు లేచాయి.

కానీ సన్యాసి ఊరుకోలేదు. ''ఒరే! ముందు పిలక నంబి! నేను 'మూఢమతి' అని నీవు చెప్పింది సరి అంటే, చేత ఒట్టి బడితె పట్టుకొన్న నీవు ఒట్టి లావుపాటి దద్దమ్మవి. నీలాంటి దద్దమ్మతో మాట్లాడేందుకు వచ్చిన నేను మూఢమతినే కద?'' అన్నారు.

''ఓ స్వాములారా! నాచేతనున్నది ఒట్టి బడితె కాదు. కావలసినప్పుడు మీ బోడి తలను పగలగొట్టగల శక్తిగలది, తెలుసుకోండి!'' అంటూనే ఆళ్వార్ కట్టియాన్ చేతనున్న బడితెను పైకెత్తాడు. అది చూసి అతడి పక్షంవారు 'ఓహో!' అని ఘోషించారు.

అప్పుడా అద్వైత స్వాములు, ''అయ్యా! ఆపు! ఆ బడితె నీ చేతిలోనే ఉండనీ. అలా ఒకవేళ నీవా బడితెతో నన్ను కొట్టినా నేను కోపగించుకోను. నీతో దెబ్బలాడను కూడ. కొట్టడం బ్రహ్మ; కొట్టబడడం బ్రహ్మ. నీవు నన్ను కొడితే, నిన్ను నీవే కొట్టుకొన్నట్లవుతుంది!'' అన్నారు.

ఆళ్వార్ కట్టియాన్ నంబి, ''ఇదిగో అందరూ చూడండి! బ్రహ్మను బ్రహ్మ 'శ్రీ'దెబ్బ కొట్టబోతూంది. నన్ను నేనే బడితెతో కొట్టబోతున్నాను!'' అంటూనే బడితెను గిరగిరా తిప్పుతూ ఆ అద్వైత స్వాములను

సమీపించాడు.

ఇదంతా చూస్తున్న వంతిదేవునికి ఆ ముందు పిలక నంబిని అడ్డగించి, అతడి చేతినుంచి బడితె లాక్కొని అతన్ని ఆ బడితెతోనే రెండు లాగించుదామా అనిపించింది.

కానీ ఉన్నట్లుండి స్వాములు కనిపించలేదు! గుంపులో దూరి ఆయన మాయమైపోయారు. అది చూస్తున్న వైష్ణవబృందం మరింత పెద్దగా ఘోషించారు.

ఆళ్వార్ కట్టియాన్ వీరశైవులవైపు తిరిగి చూసి, "ఓ పాదధూళి భట్టుగారూ! మీరేమంటారు? ఇంకా వాగ్వివాదం చేయగోరుతున్నారా? లేక, స్వాముల్లాగ మీరు కూడ పరుగు లంకిస్తారా?" అన్నాడు.

"నేనా? ముమ్మాటికీ ఆ ఒట్టి వేదాంతిలాగ పారిపోను. నన్ను కూడ మీ కన్నయ్య అనుకొన్నారేమి? గోపికల ఇళ్ళలో వెన్న దొంగిలించి తినేసి కవ్వంతో కొట్టేవాడే కద మీ కన్నయ్య!..." అని పాదధూళి భట్టుగారు చెప్పేలోపు, ఆళ్వార్ కట్టియాన్ అడ్డొచ్చి, "ఎందుకు లేడు? మీ పరమశివుడు మట్టి మోసి దెబ్బలు తిన్న విషయం మరిచిపోయారా?" అని అడుగుతూనే చేతి బడితెను మళ్ళీ గిరగిరా తిప్పుతూ వీరశైవులను సమీపించాడు.

ఆళ్వార్ కట్టియాన్ మంచి స్థూలకాయుడు. ఆ వీరశైవులేమో రివటలాగున్నారు.

పై ఇద్దరినీ ప్రోత్సాహిస్తూ వస్తున్న జనాలు తాము కూడ చేతికి చేయి కలిపేందుకు ఆయత్తమై హాహాకారాలు చేయనారంభించారు.

ఈ మూర్ఖపు దెబ్బలాటను ఆపాలన్న ఆలోచన వంతిదేవుని మనసులో తట్టింది.

అతడు నించొన్న చోటినుంచి కాస్త ముందుకు వచ్చి, "అయ్యా! ఎందుకని మీరంతా దెబ్బలాటకు దిగుతున్నారు? మీకింకేం పని లేదా? దెబ్బలాడేందుకంత తీటగా ఉంటే లంకకు వెళ్ళండేం? అక్కడ మహాయుద్ధం జరుగుతోంది కద?" అన్నాడు.

నంబి చటుక్కున అతడివైపు తిరిగి చూసి, "వీడెవడయ్యా మనకు న్యాయం చెప్పడానికి వచ్చినవాడు?" అన్నాడు.

గుంపులో కొందరికి వంతిదేవుని వీర క్షత్రియ రూపం, అతడి అందమైన ముఖం చాల నచ్చాయి.

"తమ్ముడూ! నీవే చెప్పు! కయ్యానికి కాలుదువ్వుతున్న వీళ్ళకు నీవే న్యాయం చెప్పు! నీకు పక్కబలంగా మేమున్నాము!" అన్నారు వాళ్ళు.

"నాకు తెలిసిన న్యాయాన్ని చెబుతాను. శివపరమాత్మ, నారాయణమూర్తి తమలో తాము పోట్లాడుకొనేటట్లు అగుపించడం లేదు. వారు స్నేహభావంతోను, సుముఖంగాను ఉంటున్నారు. అదలా

ఉండగా,  ఈ నంబి, భట్టుగారు ఎందుకు దెబ్బలాడుకోవాలి?'' అని వల్లవరయ్యన్ వంతిదేవుడు అనగానే గుంపులో పలువురు నవ్వారు.

అప్పుడు వీరశైవులు, ''ఈ అబ్బాయి చాల తెలివిగలవాడేనని తోస్తూంది. కానీ హాస్యసంభాషణలతో వివాదం తీరుతుందా? శివపరమాత్మ కన్న పెరుమాళ్ళు పెద్ద దైవమా కాదా అన్న ప్రశ్నకు ఈ అబ్బాయి ఉత్తరమివ్వనీ!'' అన్నారు.

''శివుడూ పెద్ద దైవమే; విష్ణువు కూడ పెద్ద దైవమే. ఇద్దరు సమానులు. ఎవరిని కావాలంటే వారిని సేవించండి. దెబ్బలాటెందుకు?'' అన్నాడు వంతిదేవుడు.

''అదెలా సాధ్యం? శివుడు, విష్ణువు సమాన దైవాలే అనడానికి ఆధారమేమి?'' అని గద్దించి అడిగాడు ఆళ్వార్ కట్టియాన్.

''ఆధారమా? ఇదిగో చెబుతున్నా, వినండి! నిన్న సాయంత్రం వైకుంఠానికి వెళ్ళాను. అదే సమయాన పరమశివుడు కూడ అక్కడికి వచ్చివున్నారు. ఇద్దరూ సమాన ఆసనాల్లో ఆసీనులైవున్నారు. వారి ఎత్తు కూడ ఒకటే. కానీ సందేహానికి తావివ్వకుండ నా చేత్తో ఇద్దరి ఎత్తు మూరవేసి కొలిచి చూశాను...''

''ఒరే అబ్బాయ్! పరిహాసమా చేస్తున్నావు?'' అని గర్జించాడు ఆళ్వార్ కట్టియాన్.

గుంపులోని జనాలు, ''చెప్పు, తమ్ముడూ! చెప్పు!'' అని ఘోషించారు.

''కొలిచి చూడగా, ఇద్దరి ఎత్తు కూడ ఒకటేనని తెలిసింది. దానితో వదలక, ఇద్దరినీ ప్రత్యక్షంగా అడిగేశాను. వారేం చెప్పారో, తెలుసా? 'ఎరుక శివుడు ఒకటి, ఎరగని వాళ్ళ నోట మట్టి' అన్నారు. అలా చెప్పి, తమ గురించి దెబ్బలాడేవాళ్ళ నోట వేసేందుకు ఒక పిడికిలి మట్టి కూడ ఇచ్చారు!'' అన్న వల్లవరయ్యన్, మూసివున్న తన కుడిచేతి పిడికిలిని తెరిచాడు. అందులో నిజంగానే ఒక పిడికిలి మట్టి ఉంది. దాన్ని తీసి విసిరాడు.

గుంపులో ఉన్న చాలమంది అప్పుడు ఉత్సాహంతో తలా ఒక పిడికిలి మట్టి తీసి ఆళ్వార్ కట్టియాన్ తల మీద, వీరశైవుల తల మీద వేయనారంభించారు. ఈ ధూర్తత్వాన్ని కొందరు అడ్డుకోజూశారు.

''ఒరే, ధూర్తులారా! నాస్తికులారా!'' అంటూ చేతి బడితెను గిరగిరా తిప్పుతూ గుంపులో దూరాడు ఆళ్వార్ కట్టియాన్.

ఒక పెద్ద యుద్ధం, కలవరపాటు అక్కడ ఏర్పడుతుందనిపించింది. అదృష్టవశాత్తు, అప్పుడా సమయాన కాస్త దూరంలో ఒక కలకలం లేచింది.

''వీరాధివీరులు, శూరాధిశూరులు, వీరపాండ్యుని సైన్యాన్ని సమూలంగా తుడిచిపెట్టిన మహావీరులు, ఇరవైనాలుగు యుద్ధాల్లో పోరాడి అరవైనాలుగు గాయాలను భరించిన మహావీరులు,

చోళనాడు ధనాధికారి, ధాన్యభండారాధికారి, పన్ను విధించే దేవరు పెద్ద పళువేట్టరయ్యర్ విజయం చేస్తున్నారు! పరాక్! బహుపరాక్!" అని పిడుగులాంటి వందిమాగధుల ఘోష వినవచ్చింది.

ఆ వందిమాగధులు ముందు వరుసలో వచ్చారు. వారి వెనకనే భేరీలు మోగించేవారు వచ్చారు. వారి వెనక తాటిచెట్టు చిహ్నమున్న జెండాను పట్టుకొన్న భటులు వచ్చారు. తర్వాత, చేత శూలాలు పట్టుకొన్న కొందరు వీరులు గంభీరంగా నడిచి వచ్చారు. వారి వెనక అలంకరించబడిన ఏనుగు మీద ఆజానుబాహువైన నల్లటిదేహం కలిగిన ఒకరు ఆసీనులైవున్నారు.

గుంపులో ఉన్నవారందరూ బాటకిరువైపుల వచ్చి నిలబడినట్లే వల్లవరయ్యన్ వంతిదేవుడు కూడ వచ్చి నిలబడి చూశాడు. ఆ మత్తగజం మీదున్నవారే పెద్ద పళువేట్టరయ్యర్ అని ఊహించి తెలుసుకొన్నాడు.

ఏనుగు వెనక పట్టువస్త్రంతో మూయబడ్డ ఒక పల్లకి వస్తూంది. అందులో ఉన్నది ఎవరో అని వంతిదేవుడు ఆలోచిస్తుండగానే, ఎర్రటి గాజులు, కంకణాలు ధరించిన ఒక చేయి ఆ పల్లకిలోపలినుంచి బయటికొచ్చి పట్టువస్త్రాన్ని కాస్త తొలగించింది. మేఘాలతో మూయబడిన చంద్రుడు ఆ మబ్బుతెర వీడగానే తళుక్కున వెల్లివిరిసినట్లు, పల్లకి లోపల కాంతిమయమైన ఒక స్త్రీముఖం అగుపించింది.

స్త్రీల అందాన్ని చూసి ఆనందించే వల్లవరయ్యన్, ఆ స్త్రీ ముఖారవిందం పూర్ణచంద్రునిలాగ ప్రకాశిస్తున్నా కూడ, ఆమెను చూసినప్పుడు అతడంతగా ఆనందపడి, ముగ్ధుడు కాలేదు. ఇదీ అని తెలియని భయం, ఏవగింపు కలిగాయి.

అదే సమయాన ఆ స్త్రీ కళ్ళు వంతిదేవుని సమీపాన గుచ్చి చూశాయి. మరుక్షణం భీతిగొన్న ఒక స్త్రీ గొంతు 'కీచు'మని కేక వేయగా, పల్లకి పట్టు తెర మూసుకొంది.

వంతిదేవుడు చుట్టుపక్కల చూశాడు. తన సమీపాన దేన్నో, లేదా ఎవరినో చూసినందువల్ల ఆ స్త్రీ కీచుమని భయంతో కేకవేసిందని వంతిదేవుడు తన సూక్ష్మబుద్ధితో గ్రహించాడు. కాబట్టి చుట్టూ పరికించి చూశాడు. ఆళ్వార్ కట్టియాన తన వెనక ఒక చింతచెట్టునానుకొని నించొనివుండడాన్ని గమనించాడు. ఆ వీరవైష్ణవుని ముఖం వర్ణించనలవిగాని వికారంతో, చూడడానికి ఘోరంగా అగుపిస్తుండడాన్ని కూడ గమనించాడు. వల్లవరయ్యన్ మనసులో కారణం తెలియని ఆశ్చర్యం, ఏవగింపు కలిగాయి.

~~~
~~~

# అధ్యాయము - 3

## విణ్ణకర్ దేవాలయం

**ఒక్కొక్క సారి** చిన్నచిన్న విషయాలనుంచి చివరికి మహాసంభవాలు పుడుతుంటాయి. వంతిదేవుని జీవితంలో ఇప్పుడు అటువంటి చిన్న సంఘటన ఒకటి ఎదురైంది.

ఆ బాట అంచున నిలబడి ధనాధికారి పళువేట్టరయ్యర్ పరివారం వెళుతూండడాన్ని వంతిదేవుడు చూస్తూన్నాడు కదా? అతను నిలబడ్డ చోటుకు కాస్త దూరంలోనే అతని గుర్రం కూడా నిలబడివుంది.

ఆ పరివారంలో చివరగా వెళ్తున్న కొంతమంది చూపులు ఆగుర్రం పైన పడ్డాయి.

"అరే! ఈ గురాన్ని చూశావా?" అన్నాడు ఒకడు.

"గురం అని చెప్పకు. గుర్రం అని చెప్పు!" అన్నాడు ఇంకొకడు.

"మీ భాషాపరిశోధన అలా ఉండనీ; ముందు అది గుర్రమో లేదా గాడిదో తెలుసుకోండి!" అన్నాడు ఇంకొక పరిహాసప్రియుడు.

"అది కూడా చూసేద్దాం!" అని అంటూనే ఒకడు గుర్రం దగ్గరికి వచ్చాడు. తనపైకి ఎగిరి కూర్చొనేందుకు చూస్తున్నది తన యజమాని కాదని ఆ బుద్ధిశాలి గుర్రం తెలుసుకొంది. ఆ అన్యుని తనపైకి ఎక్కించుకోనని మొరాయించింది!

"ఇది మాచెడ్డ గుర్రమర్రోయ్! దీని పైన నేను ఎక్కకూడదట! రాజవంశ పరంపరలో వచ్చిన వాడు మాత్రమే ఎక్కాలట! అలాగైతే తంజావూరు ముత్తరయ్యర్ తిరిగి వచ్చి దీని పైన ఎక్కాలి!" అని వాడు చమత్కారంగా చెప్పింది విని తక్కిన వీరులందరూ ఫక్కున నవ్వారు.

ఎందుకంటే, తంజావూరు ముత్తరయ్యర్ వంశం నశించి పోయి అప్పటికి వంద సంవత్సరాలు కావచ్చింది.ఇప్పుడు చోళరాజుల పులి జెండా తంజావూరులో ఎగురుతోంది.

"గుర్రం ఉద్దేశ్యం అలా ఉండవచ్చు. కాని, చనిపోయిన తంజావూరు ముత్తరయ్యర్ కన్నాబ్రతికున్న తాండవ రాయలే నయం అంటాను!" అన్నాడు ఇంకొకడు.

"తాండవరాయా! నిన్నెక్కించుకోనని మొరాయిస్తున్న ఈ గుర్రం నిజమైన గుర్రమేనా అని ఒకసారి చూసెయ్! తిరునాళ్ళకి తీసుకెళ్ళుతున్న గుర్రం కావచ్చు!" అన్నాడింకొకడు పరిహాసంగా.

"అది కూడా పరిశోధించి చూసేస్తాను" అని అంటూనే గుర్రం పైకి ఎక్కజూసిన తాండవరాయుడు దాని తోకను మెలి పెట్టాడు. రోషమున్న ఆ గుర్రం వెంటనే వెనకటి కాళ్ళను రెండు సార్లు విసిరి తన్ని,

పరుగు లంకించుకుంది.

“గుర్రం పరుగెడుతోందిరా! నిజమైన గుర్రమేరా!” అని ఆ వీరులందరు కేకలేసి, “ఉయ్! ఉయ్!” అని అంటూ, పరుగెడుతున్న గుర్రాన్ని ఇంకా తరిమారు.

-:-

**గుర్రం** తిరునాళ్ళగుంపులో దూరి పరుగెత్తింది.జనాలు దాని కాళ్ళకింద తొక్కబడకుండా అటూఇటూ తప్పుకోసాగారు. అప్పటికీ కొంతమంది దానిదగ్గర తన్నులు తిని కింద పడ్డారు. గుర్రం దారితప్పి వెర్రిగా పరుగెత్తింది.

ఇదంతా వంతిదేవుని కళ్ళముందు ఒక్క క్షణంలో జరిగిపోయింది. అతని ముఖకవళికనుంచి అది అతని గుర్రమేనని ఆళ్వార్ కట్టియాన్ తెలుసుకున్నాడు.

“చూశావా తమ్ముడూ! ఆ పళువూరు దుండగులు చేసిన పని? నా దగ్గర చూపించేందుకు బదులు వాళ్ళదగ్గర చూపించవచ్చుగదా నీ పరాక్రమాన్ని?” అని దెప్పి పొడిచాడు.

వంతిదేవునికి కోపం పొంగుకొచ్చింది. కానీ పళ్ళు గిట్టకరుచుకొని కోపాన్ని అదిమి పెట్టుకొన్నాడు. పళువూరు వీరులు చాలామంది వున్నారు కాబట్టి వారందరితో ఒకేసారి పోట్లాడంలో అర్థం లేదు. వాళ్ళూ ఇతనితో పోట్లాడేందుకు కాచివుండలేదు కూడా. గుర్రం పరుగేత్తిపోవడం చూసి నవ్వేసి వారి దారిన వారు వెళ్ళిపోయారు.

గుర్రం వెళ్ళిన దిశగా వంతిదేవుడు వెళ్ళాడు. అది కొంతదూరం పరుగెత్తిన తరువాత తనకు తానే నిలబడి పోతుందని తనకు తెలుసు. కాబట్టి దాని గురించి అతనేం దిగులు పడలేదు. కొవ్వెక్కిన ఆ పళువూరు మనుషులకు ఎప్పుడైనా ఒకరోజు బాగా బుద్ధి  చెప్పాలనే ఆలోచన అతని మనస్సులో దృఢపడింది.

-:-

చింతతోపు దాటి జనసంచారం లేని ఒక బయలు ప్రదేశంలో శోకమే అవతారమెత్తినట్లు ఆగుర్రం నిల్చుండడం కనిపించింది. వంతిదేవుడు దానిదగ్గకు వెళ్ళినవెంతనే అది సకిలించింది. “ఎందుకు నన్ను వదిలేసి వెళ్ళిపోయి నన్ని సంకట పరిస్థితికి గురి చేశావు?” అని ఆ మూగ జీవి అడిగినట్లనిపించింది. వంతిదేవుడు దాని వెన్ను నిమిరి శాంతింపజేశాడు. తరువాత దాన్ని బాట వైపు తిప్పి తీసుకువచ్చాడు. తిరునాళ్ళగుంపులో చాలామంది, “ఈ మొరటు గుర్రాన్ని ఎందుకు ప్రజల మధ్యకు తెచ్చావు, తమ్ముడూ! ఎంతమందిని అది తన్ని పడదోసింది?” అన్నారు.

“ఈ అబ్బాయి ఏం చేస్తాడు? గుర్రం మాత్రం ఏం చేస్తుంది? ఆ పళువేట్టరయ్యర్ గారి మొరటు మనుషులు కదా ఇలా చేశారు?” అని ఇంకొందరు సమాధానం చెప్పారు.

ఆళ్వార్ కట్టియాన్ ఇంకా బాటలోనే వేచి నిలబడివున్నాడు. "ఇదేం శని పీడ?వీడు మనల్ని వదలేటట్లు లేడే!" అనుకొని వంతిదేవుడు ముఖం చిట్లించాడు.

"తమ్ముడూ! నీవెటు వైపు వెళ్ళబోతున్నావు?" అని ఆళ్వార్ కట్టియాన్ అడిగాడు.

"నేనా? కాస్త పశ్చిమం వైపు, తరువాత కాస్త దక్షిణం వైపు, ఆ తరువాత కాస్త తూర్పు వైపు మలుపు తిరిగి వెళ్ళి తరువాత మళ్ళీ దక్షిణం వైపు వెళతాను!" అన్నాడు వంతిదేవుడు.

"నేనదంతా అడగలేదు. ఈ రాత్రి నీవెక్కడ ఉండబోతున్నావని  అడిగానంతే."

"నీవెందుకది అడుగుతున్నావు?"

"ఒకవేళ కడంబూరు శంబువరయ్యర్ గారి భవంతిలో విడిది చేసేటట్లుంటే, నాకక్కడ ఒక పని ఉంది."

"నీకు మంత్రతంత్రాలు తెలుసా ఏమి?నేను అక్కడికే వెళుతున్నాని నీకెలా తెలుసు!?"

"దీంట్లో ఏమి ఆశ్చర్యం? ఈరోజు చాలా ఊళ్ళనుంచి చాలామంది అతిథులు అక్కడికి వస్తున్నారు. పళువేట్టరయ్యర్ గారు, ఆయన పరివారం కూడా అక్కడికే వెళుతున్నారు."

"నిజంగానా?" అని వంతిదేవుడు ఆశ్చర్యాన్ని వెళ్ళబుచ్చాడు.

"నిజంగానే! అది నీకు తెలియదా, ఏమి? ఏనుగులు, గుర్రాలు, పల్లకీలు, పరివారజనం అంతా శంబువరయ్యర్ గారి భవనానికి చెందినవే. పళువేట్టరయ్యర్ గారికి ఎదురేగి వారికి స్వాగతం పలికి పిలుచుకు వచ్చేందుకే ఇవన్నీ వెళుతున్నాయి.ఆయన ఎక్కడ వెళ్ళినా ఈ మర్యాదలన్నీ జరిగి తీరాల్సిందే."

-:-

వంతిదేవుడు సుదీర్ఘాలోచనలో మునిగాడు. పళువేట్టరయ్యర్ విడిది చేసే చోటే తాను కూడా విడిది చేయగలిగే అవకాశం అంత సులభంగా దొరకదు. అంతేగాక ఆ మహావీరుని పరిచయం కలిగే మహదవకాశం కూడా దొరకవచ్చు. కానీ ఆయన గారి మొరటు మనుషులతో జరిగిన చేదు అనుభవం అతనింకా మరిచిపోలేదు.

"తమ్ముడూ! నీవు నాకొక సహాయం చేస్తావా?" అని ఆళ్వార్ కట్టియాన్ దయనీయమైన స్వరంతో అడిగాడు.

"నేను నీకు చేయగల సహాయమేమి ఉండగలదు? నేనీ ఊరికి కొత్తవాణ్ణి."

"నీవల్ల కాగలిగిన కార్యమే చెబుతాను. ఈరాత్రి నన్ను కడంబూర్ భవనానికి తీసుకు వెళ్ళు!"

"ఎందుకు? అక్కడికెవరైనా వీరశైవులు వస్తున్నారా? 'శివుడు గొప్పా, విష్ణువు గొప్పా?' అని

వివాదించి తీర్మానం చేయబోతున్నారా?"

"లేదు, లేదు. దెబ్బలాడడమే నా పని అనుకోవద్దు. ఈ రాత్రి కడంబూర్ రాజగృహంలో ఒక పెద్ద విందు జరగబోతోంది. విందు తరువాత అనేక రకాలైన ఆటపాటలు (కళియాట్టం, సామియాట్టం, కురవై ఆట) అన్నీ ఉంటాయి. కురవై ఆట (కూత్తు) చూడాలని నాకు చాలా ఆశ!"

"కావచ్చు, కానీ నేను నిన్ను ఎలా పిలుచుకు వెళ్ళ గలను?"

"నేను నీ పనివాడినని చెబితే పోతుంది."

వంతిదేవునికి ఇంతకు ముందు ఏర్పడ్డ సందేహం బలపడింది.

"ఏమార్చి మోసగించేందుకు ఇంకెవరినైనా వెతుక్కో. నీలాంటి పనివాడు నాకవసరం లేదు. చెబితే ఎవరూ నమ్మరు కూడా. అదీగాక, నీవు చెప్పిందంతా ఆలోచించి చూస్తే, నన్నే ఈ రోజు కోట లోపలికి వెళ్ళేందుకు అనుమతిస్తారో లేదోనని అనిపిస్తోంది."

"అలాగైతే, నీవు కడంబూరుకు ఆహ్వానించబడి వెళుతుండడం లేదని చెప్పు!"

"ఒకవిధంగా నాకు ఆహ్వానం ఉంది. శంబువరయ్యర్ కుమారుడైన గందమారవేల్ నా ప్రగాఢ స్నేహితుడు. ఇటువైపు వస్తే వారి రాజగృహానికి తప్పకుండా రావాలని నన్ను చాలా సార్లు పిలిచి ఉన్నాడు."

"ఇంతేనా? అలాగైతే నీవే చాలా ఇక్కట్లు పడాల్సి వస్తుందనిపిస్తోంది."

ఇద్దరూ కాసేపు మౌనంగా ముందుకు సాగారు.

"ఇంకా నా వెన్నంటి వస్తున్నావు?" అని వంతిదేవుడు అడిగాడు.

"అదే ప్రశ్న నేను నిన్ను తిరిగి అడగాలి. నీవెందుకు నన్ను వెంబడిస్తున్నావు? నీ దారిన నీవు పోవచ్చుగదా?"

"దారి తెలియక పోవడం వల్లనే. నంబీ! నీవెక్కడి వెళుతున్నావు? ఒకవేళ కడంబూరు వైపు..."

"కాదు. నీవే కదా నన్ను అక్కడికి పిలుచుకు వెళ్ళలేనని చెప్పేశావు గదా? నేను విణ్ణకర్ దేవాలయాని వెళుతున్నాను ."

"వీరనారాయణ పెరుమాళ్ళు సన్నిధికేగా?"

"ఔను."

"నేను కూడా ఆ ఆలయానికి వచ్చి దేవుని సేవించాలని ఇష్ట పడుతున్నాను."

"ఒకవేళ నీవు వైష్ణవాలయానికి రావేమోననుకున్నాను. చూడవలసిన గుడి; దర్శించవలసిన

సన్నిధి. ఇక్కడ ఈశ్వరముని అనే అర్చకుడు దేవునికి కైంకర్యం చేస్తూ వస్తున్నాడు. మహానుభావుడు.''

''నేనుకూడా వినివున్నాను. చాలా జనం క్రిక్కిరి వున్నారే? గుడిలో ఏమైనా విశేష ఉత్సవం జరుగుతోందా?''

''ఔను. ఈరోజు ఆండాళ్ళు దివ్యనక్షత్రం. ఆడి (ఆషాడం) పద్దెనిమిదవ రోజు (కావేరి నది పొంగి పారే రోజు), ఆండాళ్ దివ్యనక్షత్రం రెండూ ఒకే రోజు కూడి/కలిసి వచ్చాయి. అందుకే ఇంత కోలాహలం. తమ్ముడూ, ఆండాళ్ పాశురం (స్తోత్రం) ఏదైనా వినివున్నావా?''

''లేదు.''

''వినవద్దు. అది చెవిలో కూడా వేసుకోవద్దు.''

''ఎందుకంత వైషమ్యం?''

''వైషమ్యం కాదు. విరోధం కూడా కాదు. నీ మంచికోసం చెప్పాను. ఆండాళ్ పాశురం విన్నావంటే, ఖడ్గాన్ని, శూలాన్ని విసిరేసి, నాలాగ నీవుకూడా కన్నయ్య పై ప్రేమ పెంచుకుని విణ్ణకర్ యాత్రకు బయల్దేరేస్తావు.''

''నీకు ఆండాళ్ పాశురాలు తెలుసా? పాడుతావా?''

''కొన్ని తెలుసు. వేదాలను తమిళానికి అనువదించిన నమ్మాళ్వారు రచించిన కొన్ని పాశురారు తెలుసు. పెరుమాళ్ళు సన్నిధిలో పాడబోతున్నాను. కావాలంటే వినుకో! ఇదిగో గుడి కూడా వచ్చేసింది!''

ఇంతలో వారు నిజంగానే వీరనారాయణ పెరుమాళ్ గుడి దగ్గరకు వచ్చేసారు.

-:-

విజయాలయ చోళుని మనుమడైన మొదటి పరాంతక చోళుడు 'మదురై నగరాన్ని, ఈలం (లంక)ను జయించిన కోప్పరకేసరి' అన్న పట్టాన్ని (బిరుదును) పొందిన వాడు. చోళ సామ్రాజ్యానికి పునాదులు వేసినవాడు అతనే. తిల్లై చిట్రమ్ పలానికి బంగారపు గొడుగు చేయించి చరిత్రలో ప్రసిద్ధికెక్కాడు. 'చోళశిఖామణి, శూరశిఖామణి' వంటి బిరుదులు పొందాడు.

పరాంతకుని కాలంలో ఉత్తరదిక్కులో రెట్టై/జంటమండలాలలో రాష్ట్రకూట రాజుల బలం పెరిగి విరాజిల్లారు. మాన్యకేతం నుంచి వారు దండెత్తి రావచ్చని పరాంతకుడు ఊహించాడు. కాబట్టి తన మొదటి కొడుకైన యువరాజు రాజాదిత్యుని ఒక పెద్ద సైన్యంతో తిరుమునైప్పాడిలో సిద్ధంగా ఉండమని చెప్పాడు. ఆ సైన్యంలోని లక్షలాది వీరులు ఏ పనీ లేక ఊరకే ఉండాల్సిన పరిస్థితిలో రాజాదిత్యుడు ఒక మంచి ఉపాయం ఆలోచించాడు. ప్రజలకు ఉపయోగపడే ఒక పెద్ద కార్యాన్ని వారిచేత చేయించనుద్దేశించాడు. ఉత్తర కావేరి అని భక్తులచేత, కొళ్ళిడం అని ఇతరులచేత పిలువబడే ఆ పెన్నానదివెంబడి అమితమైన వరద నీరు

వృథాగా కడలికి చేరుతుండేది. దానిలో ఒక భాగాన్ని, ప్రజలకు ఉపయోగించనుద్దేశించి సముద్రంలాంటి ఒక పెద్ద చెరువును కట్టించాడు. దానికి తన ప్రియమైన తండ్రి మీది ప్రేమతో 'వీరనారాయణ చెరువు' అని పేరు పెట్టాడు. దాని ఒడ్డున వీరనారాయణ పురాన్ని స్థాపించి, ఆ ఊరిలో విణ్ణకర్ దేవాలయాన్ని కూడా కట్టించాడు. విష్ణుగృహం ఆ కాలంలో విణ్ణకరం అని తమిళంలో పిలువబడేది. శ్రీమద్ నారాయణమూర్తి నీటిలో ఉద్భవించి జలమయుడై ఉండేవాడు కదా? కాబట్టి, చెరువులను కాపాడేందుకు చెరువుల ఒడ్డునే శ్రీనారాయణమూర్తికి గుడి కట్టడం ఆకాలపు పద్ధతి. ఆ విధంగానే, చెరువు ఒడ్డున కట్టించిన ఆ వీరనారాయణపురపు దేవాలయంలో శ్రీనారాయణమూర్తిని ప్రతిష్ట చేయించాడు.

అటువంటి చారిత్రాత్మమైన దేవాలయానికే ఇప్పుడు వంతిదేవుడు, ఆళ్వార్ కట్టియాన్ వెళ్ళారు. దైవసన్నిధికి వచ్చి చేరిన వెంటనే ఆళ్వార్ కట్టియాన్ పాడనారంభించాడు. ఆండాళ్ పాశురాలు కొన్ని పాడిన తరువాత, ఆళ్వార్ రాసిన తమిళ వేదంనుంచి కొన్ని పాశురాలను పాడాడు.

<< పాశురాలను అనువదించవలసి ఉంది >>

ఇలా పాడుతుండగా ఆళ్వార్ కట్టియాన్ కళ్ళనుంచి ధారగా కన్నీరు ప్రవహించనారంభించింది. వంతిదేవుడు ఆ పాటలను శ్రద్ధగానే వింటూవచ్చాడు. అతనికి కన్నీరు రాకపోయినా మనసు ద్రవించింది. ఆళ్వార్ కట్టియాన్ గురించిన అతని అభిప్రాయం కూడా మారింది. 'ఇతను పరమ భక్తుడు!' అని అనుకొన్నాడు.

వంతిదేవుని లాగానే, ఇంకొందరు ఆ పాశురాలను బహు శ్రద్ధగా వింటూవచ్చారు. అర్చకులు ఈశ్వరభట్టు కూడా కన్నీళ్ళు నిండిన కళ్ళతో విన్నారు. ఆయన సమీపంలో ఆయన కుమారుడైన ఒక పసిబాలుడు కూడా నిలబడి ఆ పాశురాలను విన్నాడు.

ఆళ్వార్ కట్టియాన్ పది పాశురాలను పాడిన తరువాత చివరి పాశురం పాడి ముగించాడు.

<< చివరి పాశురాన్ని అనువదించవలసి వుంది >>

వింటూ నిల్చున్న అర్చకుని కుమారుడు తన తండ్రితో ఏదో చెప్పాడు. ఆయన తన కళ్ళను తుడుచుకొని, ''అయ్యా! గురుకూర్ శఠగోపర్ అనే నమ్మాళ్వారు వెయ్యి పాటలు పాడారని విన్నాను. అన్ని పాటలూ మీకు తెలుసా?'' అని అడిగారు.

''ఈ దాసుడు అంత భాగ్యం చెయ్యలేదు. నాకు కొన్ని మాత్రమే తెలుసు.'' అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

''మీకు తెలిసినంతవరకు ఈ బాలునికి నేర్పించాలి" అని అన్నారు అర్చకులు.

-:-

మున్ముందు ఈ వీరనారాయణపురం చాల పేరు ప్రఖ్యాతులు గాంచి ప్రసిద్ధికెక్కనుంది. పాలుగారే ముఖంలో తేజస్సుతో పాశురాలను విన్న ఆ బాలుడు, పెరిగి పెద్దవాడై, 'నాదముని ' అన్న దివ్యనామంతో, వైష్ణవ గురుపరంపరలో మొదటి ఆచార్యుడు కాబోతున్నాడు. గురుకూర్ అనే ఆళ్వార్ తిరునగరికి వెళ్ళి, 'వేదాన్ని తమిళీకరించిన నమ్మాళ్వారు ' రచించిన వెయ్యి పాశురాలనూ వెతికి సేకరించబోతున్నారు. ఆ పాశురాలను ఆయన శిష్యులు వీనుల విందుగా పాడుతూ దేశమంతటా వ్యాపింపజేయనున్నారు.

నాదమునుల మనుమడుగా అవతరించబోతున్న ఆళవందార్ ఎన్నో అద్భుతాలను చేయబోతున్నారు.

ఈ ఇద్దరు అవతరించిన క్షేత్రాన్ని దర్శించేందుకు, శ్రీ రామానుజాచార్యులే ఒక రోజు రాబోతున్నారు.వచ్చేటప్పుడు వీరనారాయణపురం చెరువు మీదుగా వస్తూ ఆ చెరువుకున్న నాలుగు కాల్వలను చూసి ఆశ్చర్యబోతారు. చెరువునిండి నీరు ఆ కాల్వలగుండా పారి ప్రజలకు జీవనాధారమైన విధంగానే, ఆ నారాయణుని కరుణ వెల్లువ జీవకోటికి అందింపజేసేందుకు డెబ్బైనాలుగు ఆచార్యపీఠాలను స్థాపించాలనే సంకల్పం ఆ మహానుభావుని మనస్సులో ఉద్భవించబోతూంది. ఆవిధంగానే, డెబ్బైనాలుగు వైష్ణవాచార్యపురుషులు 'సింహాసనాధిపతులు ' అన్న బిరుదుతో విరాజిల్లబోతున్నారు.

ఈ మహత్తర కార్యాలన్నీ వైష్ణవ గురుపరంపరకు చెందిన చరిత్రగా పరిగణించి, ఇప్పుడు మనం మళ్ళీ వంతిదేవుని విషయానికి వద్దాం.

పెరుమాళ్ సేవ ముగించి గుడినుంచి బయటకు వచ్చిన వెంటనే వంతిదేవుడు ఆళ్వార్ కట్టియాన్ వైపు చూసి, "నంబిగారూ, మీరిటువంటి పరమ భక్తులనీ, పండిత శిఖామణులనీ నాకు తెలియకపోయింది. నేను ఏమైనా తప్పుగా మాట్లాడివుంటే మన్నించండి" అన్నాడు.

"మన్నించేస్తున్నాను తమ్ముడూ! ఐతే, ఇప్పుడు నాకొక సహాయం చేస్తావా, చెప్పు!"

"మీరడిగే సహాయం నావల్ల కాదని చెప్పాను గదా? మీరు కూడా ఒప్పుకొన్నారుగదా ?"

"ఇది వేరే విషయం. ఒక చిన్న చీటీ రాసిస్తాను. నీవు కడంబూర్ రాజగృహంలో విడిది చేసేటట్లుంటే తగిన సమయం చూసి దాన్ని ఒకరికి ఇవ్వాలి."

"ఎవరికి?"

"పళువేట్టరయ్యర్ గారి ఏనుగు వెనుక ఒక మూసిన పల్లకిలో వెళ్ళిందే, ఆమెకే!"

"నంబిగారూ! నన్నెవరనుకున్నారు ? ఇటువంటి పనులకు నేనేనా దొరికాను? మీరుగాక ఇంకెవరైనా నాదగ్గర ఇలా మాట్లాడివుంటే...."

“తమ్ముడూ, కోపంవద్దు! నీవల్ల కాదంటే ఫరవాలేదు. మహారాజుగా వెళ్ళిరా! కానీ నాకు నీవీ సహాయం చేసివుంటే, ఏదైనా ఒక సందర్భంలో నీకూ నా సహాయం లభించివుండేది. ఫరవాలేదు. వెళ్ళిరా!”

వంతిదేవుడు అక్కడ ఇంకొక్క క్షణంకూడా ఆగలేదు. గుర్రంపైకెగిరి కూర్చొని వేగంగా కడంబూర్ వైపు సాగాడు.

~~~
~~~

# అధ్యాయము - 4

## కడంబూర్ భవనం

ఇంతసేపు సేదదీరిన వంతిదేవుని గుర్రం ఇప్పుడు చురుగ్గా పరుగెత్తనారంభించింది. ఒక ఘడియలో కడంబూర్ శంబువరయ్యర్ గారి భవనం వాకిలి ముందు నిల్చింది. ఆకాలంలో చోళదేశపు పెద్దల్లో 'ఎర్రకంటి శంబువరయ్యర్ ' ఒకరు. ఆయనగారి భవనపు వాకిలి ఒక పెద్ద నగరపు కోటవాకిలంత పెద్దగా ఉండేది. వాకిలికి రెండువైపులా లేచిన ఎత్తైన గోడలు కోటగోడల్లాగానే పొడవుగా వంపుదిరిగి భవనాన్ని చుట్టివున్నాయి.

కోట వాకిట ఏనుగులు, గుర్రాలు, వృషభాలు (దున్నపోతులు), ఆమృగాలనన్నీ పట్టి కట్టేవారు, వాటికి నీరు తాగించేవారు, అక్కడక్కడా దివిటీలు పట్టుకొని నిల్చున్నవారు, ఆ దివిటీలకు నూనె పోసేవారితో ఆ ప్రదేశమంతా మహా కోలాహలంగావుంది. ఇదంతా చూసిన వల్లవరయ్యన్ (వంతిదేవుడు) మనసులో కాస్త జంకూ, కాస్త తెంపరితనంకూడా కలిగాయి. "ఇక్కడేదో పెద్ద విశేషమైన కార్యక్రమం జరగబోతోంది ; ఇటువంటప్పుడు మనం ఇక్కడకు వచ్చి చేరాం కద!" అనుకొన్నాడు. అదేమిటని తెలుసుకోవాలనే ఆసక్తికూడా ఎక్కువైంది. కోట వాకిలి తెరిచేవుంది. కాని చేత శూలాలు పట్టుకున్న వీరులు కొందరు వాకిట నిల్చొనివున్నారు. వారిని చూస్తే యమకింకరుల్లాగా ఉన్నారు.

జంకి నిలబడివుంటే వారు తనని ఆపేస్తారని, ధైర్యంగా గుర్రాన్ని వేగంగా నడుపుకొని లోపలికి వెళ్ళడమే ఉచితమని ఆ వీరయువకుడు నిశ్చయించాడు. ఆ ఆలోచనని వెంటనే చేతల్లో చూపించాడు. కానీ ఏమి ఏమార్పు? గుర్రం కోటను సమీపించిన వెంటనే శూలాయుధులైన ఇద్దరు వీరులు తమ శూలాలను అతని దారికడ్డం పెట్టారు. ఇంకా నలుగురు వీరులు ముందుకు వచ్చి గుర్రపు ముక్కుతాడును పట్టుకొన్నారు. వారిలో ఒకడు వంతిదేవుని పరికించి చూశాడు. ఇంకొకడు దివిటీ తీసుకొనివచ్చి అతని ముఖంపైన బాగా వెలుతురు పడేలా పట్టుకున్నాడు.

వల్లవరయ్యన్ (వంతిదేవుడు) ముఖంలో కోపం ఉట్టిపడుతుండగా, "ఇదేనా మీ ఊరి సంప్రదాయం? వచ్చిన అతిథులను వాకిటనే అడ్డుపడి నిలపడం...?" అన్నాడు.

"నీవెవరు తమ్ముడూ, ఇంత దుడుకుతనంగా మాట్లాడుతున్నావు? ఏవూరు?" అన్నాడు కాపలా వీరుడు.

"నా ఊరూ పేరా అడుగుతున్నావు? వాణకప్పాడి దేశపు తిరువల్లం నా ఊరు. నా కుల పూర్వీకుల పేర్లు ఒకప్పుడు మీదేశపు వీరులు తమ గుండెలపైన రాసుకొని గర్వపడేవారు ! నాపేరు

వల్లవరయ్యన్  అనే వంతిదేవుడు! తెల్సిందా?" అన్నాడు.

"ఇదంతా చెప్పేందుకు ఒక కథకుడిని/వందిమాగధుని వెంట తీసుకురావలసింది!" అన్నాడు కాపలాదార్లలో ఒకడు. ఇది విని తక్కిన వారు నవ్వారు.

"నీవెవరైనా కావచ్చు. ఈరోజు రావలసిన అతిథులందరు వచ్చి చేరడమైంది. ఇక ఎవ్వరినీ లోపలికి వదలవద్దని మా యజమాని ఆజ్ఞ!" అన్నాడు కాపలాదార్ల నాయకుడు.

-:-

కోట వాకిట ఏదో వాగ్వివాదం జరగడాన్ని చూసి కోట లోపల కాస్త దూరంగా నిలబడివున్న కొందరు వీరులు దగ్గరికి వచ్చారు. వారిలో ఒకడు, "అరే! మనమక్కడ తిరునాళ్ళలో తరిమికొట్టామే, ఆ గుర్రంలానే వుందే!" అన్నాడు.

ఇంకొకడు, "గాడిద అని చెప్పరా!" అన్నాడు.

"గాడిదపైన కూర్చొన్నవాడు ఎంత దర్పంగా కూర్చొనివున్నాడో చూడవోయ్!" అన్నాడింకొకడు.

వంతిదేవుని చెవిలో ఈ మాటలన్నీ పడ్డాయి. అతను మనసులో, "ఎందుకీ తంట? తిరిగి వెళ్ళిపోదామా? లేక, యువరాజు ఆదిత్య కరికాలన్ రాజముద్ర పొదిగిన రాజలాంఛనాన్ని వీరికి చూపించి లోపలికి పోదామా?" అన్న ఆలోచన వచ్చింది. ఉత్తర సైన్యానికి మాతండ నాయకుడైన యువరాజు రాజలాంఛనాన్ని చూసిన తర్వాత కూడా తనని అడ్డగించగలిగేవాళ్ళు ఉత్తర పెన్న నుంచి కన్యాకుమారి వరకు ఎవరూ లేరు కద?

ఇలా వంతిదేవుడు తనలోతాను తర్జనభర్జనలు చేసుకొంటున్నప్పుడు, పళువేట్టరయ్యర్ గారి మనుషుల పరిహాసపు మాటలు అతని చెవిన పడ్డాయి. వెంటనే ఏమి చేయాలో ఒక తీర్మానానికి వచ్చాడు.

"నా గుర్రాన్ని వదలండి. నేను తిరిగి వెళ్ళిపోతాను!" అన్నాడు.

అడ్డగించిన వీరులు అతని గుర్రపు ముక్కుతాడును వదిలివేశారు.

అంతే! గుర్రపు డొక్కను తన రెండు కాళ్ళతో ఒక్క అదుము అదిమాడు. అదే సమయంలో ఒరనుంచి కత్తిని తీశాడు. కళ్ళకు మిరుమిట్లుగొలిపే ఆ ఖడ్గాన్ని అతను ఎంత వేగంగా తిప్పుతున్నాడంటే, సాక్షాత్తు మహావిష్ణువు తన చక్రాయుధాన్ని గిరగిరా తిప్పుతున్నట్లనిపించింది.. గుర్రం కోటలోపలికి దూసుకువెళ్ళింది. దారిలో నిలబడ్డ వీరులు అధాటున కింద పడ్డారు. వారు చేతబట్టిన శూలాలు పటపటా కింద పడ్డాయి. ఇంతకు మునుపు అతడిని ఎద్దేవా చేసిన పళువూర్ వీరులవైపు గుర్రం దూసుకువెళ్ళింది. ఈ మెరుపుదాడిని ఏమాత్రం ఎదురుచూడని ఆ వీరులందరూ తలా ఒక్కోదిక్కుకు చెల్లాచెదరయ్యారు

ఇంతలో, అనుకోనివిధంగా చాలా సంఘటనలు తృటిలో జరిగిపోయాయి. కోటద్వారాలు

ధడేల్మని మూయబడ్డాయి. "పట్టండి! పట్టండి!" అన్న కేకలు లేచాయి. కత్తులు, శూలాలు రాసుకుని, 'ఖణేల్', 'ఖణేల్' మనే శబ్దం లేచింది. ఉన్నట్లుండి అపాయాన్ని సూచించే నగారా 'ఢం!' 'ఢం!' అని మోగనారంభించింది.

వంతిదేవుని గుర్రాన్ని వీరులు చుట్టుముట్టారు. ఇరవై, ముప్పై, నలభై మందికి పైనే ఉండవచ్చు. వంతిదేవుడు గుర్రంపైనుంచి ఎగిరి కిందకు దూకాడు. చేతబట్టిన కత్తిని గిరగిరా తిప్పుతూనే, "గందమారా! గందమారా! నీ మనుషులు నన్ను చంపేస్తున్నారు!" అని అరిచాడు.

ఇది విన్నవెంటనే అతన్ని చుట్టుముట్టిన వీరులు కాస్త భయపడి వెనుకంజ వేశారు.

అదే సమయంలో భవనపు పైమేడనుంచి, "ఏమక్కడ కూతలు? ఆపండి!" అన్న పిడుగులాంటి గొంతు వినిపించింది. ఆ గొంతు వినవచ్చిన తావులో ఏడెనిమిది మంది నిలబడివున్నారు.

"అయ్యగారూ! ఎవరో ఒక ఆగంతకుడు మన కావలి వాళ్ళను దాటుకొని లోపలికి వచ్చేశాడు. చిన్నయ్యగారి పేరు చెబుతున్నాడు!" అని కిందవున్న ఒకడు చెప్పాడు.

"గందమారా! నీవెళ్ళి ఆ కలకలమేమని చూడు!" - ఇలా పైమేడనుంచి అదే పిడుగులాంటి స్వరం ఆదేశించింది. ఆ స్వరపు యజమానే శంబువరయ్యర్ కాబోలని వంతిదేవుడు ఊహించుకొన్నాడు.

అతను, అతని చుట్టూ నిలబడ్డ వీరులూ కాసేపలాగే చేష్టలుడిగి నిలబడ్డారు.

"ఇక్కడేమిటి ఆర్భాటం?" అన్న ఒక యువ స్వరం వినిపించింది. అక్కడ నిలబడ్డవారు పక్కకు తొలగి దారి వదిలారు. ఒక యువకుడు ఆ దారివెంబడి వేగంగా వచ్చాడు. చేతబట్టిన కత్తిని సుతారంగా తిప్పుతూ, అసురసంహారం చేసి నిలబడ్డ సుబ్రమణ్య స్వామిలా నిల్చున్న వంతిదేవుని ఒక క్షణం ఆశ్చర్యంతో చూశాడు.

"వల్లవా! నా ప్రియమిత్రమా! నిజంగా నీవేనా?" అని ఆర్ద్రత నిండిన గొంతుతో పలుకుతూ వరుగెత్తి వెళ్ళి వంతిదేవుని గాఢంగా కౌగలించుకొన్నాడు.

"గందమారా! నీవు ఎన్నోసార్లు నేను మీ ఇంటికి తప్పకుండా రావాలని నొక్కిచెప్పావు గదా అని మీఇంటికి వచ్చాను. వచ్చిన చోట, నాకిటే వీర స్వాగతం లభించింది!" అని వంతిదేవుడు తనను చుట్టి నిలబడ్డ వీరులను చూపించాడు.

"ఛీ! మూర్ఖులారా! వెళ్ళండి! మీ బుద్ధి బంక మన్నే!" అని గందమారన్ వాళ్లను చీవాట్లు వేశాడు.

గందమారన్ వంతిదేవుని చేయి పట్టుకొని చరచరా లాక్కొని వెళ్ళాడు. అతని కాళ్ళు నేలనంటక, గాలిలో తేలిపోతున్నట్లనిపించింది. అతని మనస్సుకూడా తుళ్ళిపడసాగింది. యవ్వనప్రాయంలో

మనస్సుకు నచ్చిన ప్రాణస్నేహితుడొక్కడు దొరికితే, అంతకన్న పరవశింపజేసే విషయమింకేముంటుంది? అవును, ప్రేమ అనేదొకటుండనే వుంది. కానీ, ప్రేమలో ఇంపూ, కుతూహలమూ ఎంత వుంటాయో, అంతకన్నా దుఃఖమూ వేదనా ఎక్కువ. యవ్వనపు స్నేహ మాధుర్యంలో దుఃఖానికి తావేలేదు. ఆనందమయమైన పరవశమే నిండివుంటుంది.

వెళ్తూ వెళ్తూ, వంతిదేవుడు, "గందమారా! ఈరోజు ఇక్కడ ఏమి విశేషం? ఇంత గట్టి బందోబస్తు ఎందుకు?" అని అడిగాడు.

"ఇక్కడ ఏమి విశేషమని తర్వాత విశదంగా చెబుతాను. నీవూ, నేనూ పెన్నానది ఒడ్డున మన ఎల్లల కాపలా చేస్తున్నప్పుడు, 'పళువేట్టరయ్యర్ గారిని చూడాలి, మళవరై చూడాలి, వారిని చూడాలి, వీరిని చూడాలి,' అనేవాడివి కదా? ఆ 'వారు, వీరు' అందరినీ ఈరోజు నీవిక్కడ చూడవచ్చు!" అన్నాడు గందమారన్.

తర్వాత, అతిథులందరూ సమావేశమైవున్న పైమేడ గదికి వంతిదేవుని గందమారన్ తీసుకొనివెళ్ళాడు. మొదట, తన తండ్రైన శంబువరయ్యర్ గారి వద్దకు తీసుకొనివెళ్ళి, "నాన్నా! నా స్నేహితుడు వాణర్ కులపు వంతిదేవుడని తరచూ చెప్పేవాడిని గదా? ఇతనే!" అన్నాడు. వంతిదేవుడు పెద్దవారికి దండం పెట్టాడు. అందుగురించి పెద్దాయన అంతగా సంతసించినట్లు కనిపించలేదు.

"అలాగా? కింద ఇంటిముందు అంత కలకలం రేపింది ఇతనేనా?" అని అడిగారు.

"కలకలానికి నా స్నేహితుడు కారణం కాదు; కాపలాకోసం మనమేర్పాటు చేసిన మూర్ఖులే!" అన్నాడు గందమారన్.

"ఐనప్పటికీ, ఈరోజు చూసి, అదీ చీకటి పడ్డాక, ఇతనింత ఆర్భాటంతో వచ్చివుండకూడదు!" అన్నారాయన.

-:-

గందమారన్ ముఖం కమిలింది. ఇంకా తండ్రితో వాదించడానికిష్టపడలేదు. తన స్నేహితుని అవతలికి తీసుకొనివెళ్ళాడు. అతిథుల మధ్య ఒక ఎత్తైన సింహాసనంపైన ఆసీనుడైన పళువేట్టరయ్యర్ గారి దగ్గరకు తీసుకొనివెళ్ళి, "మామా! ఇతడు నా ప్రాణస్నేహితుడు వంతిదేవుడు. వాణర్ రాజకులస్థుడు. నేనూ, వీడూ ఉత్తర పెన్నానది ఒడ్డున మన ఎల్లల కాపలా కాసేవారము. అప్పుడల్లా, 'వీరాధివీరుడైన పెద్ద పళువేట్టరయ్యర్ గారిని చూడాలి' అని ఎప్పుడూ పలవరించేవాడు. 'ఆయన శరీరంపైన అరవైనాలుగు యుద్ధగాయాలున్న విషయం నిజమేనా?' అడిగేవాడు. 'ఒకరోజు నీవే లెక్కవేసి చూసుకో!' అని నేననేవాడిని." అన్నాడు.

పళువేట్టరయ్యర్ ముడుచుకొన్న ముఖంతో, "అలాగా, తమ్ముడూ? నీవే ఎంచి చూస్తే తప్ప

నమ్మవా? అంత అపనమ్మకమా నీకు? 'వాణర్ కులం తప్ప ఇంకే కులంలోనైనా వీరులుండగలరా?' అన్న సందేహమా?'' అన్నారు.

మిత్రులిద్దరూ అదిరిపడ్డారు. సరదాగా అన్న మాటకు ఆయన విపరీతార్థం తీస్తారని వారు ఎదురుచూడలేదు.

వంతిదేవుడు మనసులో చిరాకు/మండి పడ్డాడు. కానీ పైకేమీ చూపించుకోక, ''అయ్యా! పళువేట్టరయ్యర్ కుల పేరుప్రఖ్యాతులు కన్యాకుమారి నుంచి హిమాలయాలవరకు విస్తరించివున్నాయి. దాని గురించి సందేహపడేందుకు నేనెవరు?'' అని వినయపూర్వకంగా అన్నాడు.

''మంచి ఉత్తరం; తెలివైన, చురుకైన అబ్బాయి!'' అన్నారు.

'అమ్మయ్య! బతికాం' అనుకొని యువకులిద్దరూ అక్కడినుంచి అవతలపడ్డారు. అప్పుడు శంబువరయ్యర్ తన కుమారుని చెవిలో కాస్త రహస్యంగా, ''నీ స్నేహితునికి శీఘ్రంగా భోజనపు వసతి చేయించి, ఎక్కడైనా కాస్త ఎడంగా పడుకోమని చెప్పు! దూరప్రయాణం చేసివచ్చి అలిసిపోయినట్లున్నాడు' అన్నారు. మారవేల్ (గందమారవేల్ / గందమారన్) కోపంతో తల ఆడించి అవతలకు వెళ్ళాడు.

తర్వాత గందమారన్ వంతిదేవుని అంతఃపురానికి తీసుకొనివెళ్ళాడు. అక్కడ స్త్రీలు కొందరున్నారు. వారిలో గందమారవేల్ తల్లికి వంతిదేవుడు నమస్కరించాడు. ఆమెవెనుక కాస్త జంకుతూ నిలబడ్డ అమ్మాయే గందమారన్ సహోదరియై వుండాలని ఊహించుకొన్నాడు.

'చెల్లాయి' గురించి గందమారవేల్ చాలాసార్లు చెప్పిందంతా తలుచుకొని ఆమె గురించి ఏమేమో ఊహించుకొన్నాడు. కానీ ఇప్పుడు ఆమెను చూసిన తర్వాత కాస్త నిరుత్సాహ పడ్డాడు.

ఆ స్త్రీసమూహంలో పళువేట్టరయ్యర్ తో పల్లకిలో వచ్చిన మహిళ కూడా వుండవచ్చని అతని కళ్ళు వెతకసాగాయి.

~~~
~~~

# అధ్యాయము - 5

## కురపై ఆట

అంతఃపురంనుంచి స్నేహితులిద్దరూ బయటికొచ్చారు. లోపలినుంచి ఒక స్త్రీ స్వరం, "గందమారా! గందమారా!" అని పిలిచింది.

"అమ్మ నన్ను పిలుస్తోంది. ఇక్కడే ఉండు. ఇప్పుడే వచ్చేస్తాను!" అని చెప్పి గందమారన్ లోపలికి వెళ్ళాడు. వెంటనే చాలామంది స్త్రీలు ప్రశ్నలడగడమూ, గందమారవేల్ తడబడుతూ బదులివ్వడమూ వంతిదేవుని చెవినబడ్డాయి. తర్వాత ఆ స్త్రీలు గలగలా నవ్వడమూ విన్పించింది.

వారు తనగురించే అలా పరిహాసంచేస్తూ నవ్వుతున్నారనుకొని వంతిదేవుడు సిగ్గుపడ్డాడు. కోపంకూడాతెచ్చుకొన్నాడు. గందమారన్ బయటకు వచ్చినవెంటనే వంతిదేవుని చేయి పట్టుకొని, "నాతో రా! మా మాళిగ చూసివద్దాం!" అని చెప్తూ లాక్కొని వెళ్ళాడు.

కడంబూర్ భవనంలోని వెన్నెలడాబాలు, ఆటపాటలకుద్దేశించిన స్థలాలు, వంటశాలలు, చలువరాతి మంటపాలు, గోపురాలు, గుర్రపుశాలలు మొదలైనవన్నీ వంతిదేవునికి చూపిస్తూవెళ్ళాడు.

మధ్యలో వంతిదేవుడు, "గందమారా! నన్ను అంతఃపురపు వాకిలిలో నిలబెట్టి, నీవు మళ్ళీ లోపలికి వెళ్ళినప్పుడు, అంతఃపురంలో ఒకటే నవ్వులూ, కేరింతలూ వినపించాయే, ఏమది విశేషం? నీ స్నేహితుని చూసినందుకు వారికంత సంతోషమా?" అని అడిగాడు.

"నిన్ను చూసినందుకు వారందరికీ సంతోషమే. నిన్ను మా అమ్మ, తక్కినవారు ఇష్టపడ్డారట. కానీ, నీ గురించి వారు నవ్వలేదు..."

"మరెందుకు నవ్వారట?"

"పళువేట్టరయ్యర్ ఉన్నాడుగదా? ఇంత పండు ముదుసలి వయసులో ఒక నవయవ్వనవతిని పెళ్ళి చేసుకొన్నాడాయన.  ఆమెను ఒక మూసిన పల్లకిలో ఉంచి ఇక్కడికి రప్పించివున్నాడు. కానీ, ఆమెను ఈ అంతఃపురానికి పంపించకుండా తన విడిదిలోనే తాళంవేసి వుంచుకొన్నాడట! ఆమెను మేడపై వసారా నుంచి నిక్కి చూసివచ్చిన ఒక దాది ఆమె సౌందర్యాన్ని వర్ణించిందట. దానిగురించే వారి నవ్వులు! ఆమె సింహళపు వనితో, కళింగదేశపు స్త్రీనో లేదా చేరనాటి మహిళో అని చర్చ జరుగుతోంది. ఆయన పూర్వీకులు చేరనాడునుంచి తమిళనాడుకి వచ్చినవారని నీకు తెలుసుకదా?"

"వినివున్నాను. ఎందుకు, నువ్వే ఒకసారి నాకు చెప్పావుగద? సరే, అదలావుండనీ, ఈయన ఈ మర్మసుందరిని పెళ్ళి చేసుకొని ఎంత కాలమైంది?"

“రెండేళ్ళే అయివుండవచ్చు. పెళ్ళి చేసుకొన్నప్పటినుంచి ఆమెను ఒక్క క్షణం విడిచివుండటంలేదట! ఎక్కడికి వెళ్ళినాకూడా తన ప్రియనాయకిని పల్లకిలో తీసుకు వెళ్తాడట. దీనిగురించి దేశమంతటా కాస్త పరిహాసపు మాటలు వినవస్తున్నాయి. వంతిదేవా! ఒక వయసు మించిన తర్వాత ఈవిధంగా స్త్రీచాపల్యానికి లోనైతే కాస్త పరిహాసంగానే కద ఉంటుంది?”

“కారణమదేం కాదు. నిజమైన కారణమేమిటో చెప్పనా, గందమారా? స్త్రీలెప్పుడూ కాస్త అసూయాపరులు. మీయింటి ఆడవాళ్ళను గురించి లోకువగా మాట్లాడుతున్నాననుకోకు! స్త్రీలోకమే అంతే! నీ కుటుంబస్త్రీలు శ్యామవర్ణపు సౌందర్యవతులు. పళువేట్టరయ్యర్ ప్రియనాయకి ఏమో ఎర్రని అందగత్తె. కాబట్టి వారికి ఈమె నచ్చలేదు! ఆ కారణంపైన ఏవేవో కట్టుకథలు చెబుతున్నారు!...”

“అరె! ఇదేమి వింత! నీకామె మేనిరంగు ఎలా తెలుసు? నీవామెను చూశావా, ఏమి? ఎప్పుడు, ఎక్కడ, ఎలా చూశావు? పళువేట్టరయ్యర్‌కి ఈ సంగతి తెలిస్తే, నీ కథ అంతే!...”

“గందమారా! దీనికంతా నేను భయపడేవాడిని కాను. ఆ విషయం నీకు తెలిసిందే. పైగా, నేను అనుచితకార్యమేమీ చేయలేదు. వీరనారాయణపురంలో పళువేట్టరయ్యర్ గారి పరివారాలు దారివెంబడి వెళుతున్నప్పుడు గుంపుతోబాటు నేనుకూడా బాటపక్కన ఒదిగినిల్చొని చూస్తూవున్నాను. ఏనుగులు, గుర్రారు, పల్లకీలు, తక్కిన పరివారమూ అదంతా మీరు పంపించినదట కద? నిజమేనా?”

“ఔను. అవన్నీ మేము పంపించినవే. దాని వల్ల ఇప్పుడేమైంది?...”

“దాని వల్ల ఏమైంది? ఏమీ లేదు. పళువేట్టరయ్యర్ గారికి మీరిచ్చిన్న స్వాగత మర్యాదల్ని, నాకిచ్చిన స్వాగతాన్ని కాస్త పోల్చిచూసుకొన్నాను. ఇంకేమీలేదు...!”

గందమారన్ చిన్నగా నవ్వేసి, “పన్ను విధించే ధనాధికారికి తగిన స్వాగత సత్కారాలు ఆయనకు ఇచ్చాము;  ఒక విలక్షణమైన వీరుడికివ్వాల్సిన స్వాగతం నీకిచ్చాం! మున్ముందు, మురుగన్ (సుబ్రమణ్యస్వామి) దయవల్ల నీవు ఈఇంటి అల్లుడవైతే, అప్పుడు తగిన స్వాగతసత్కారాలు చేస్తాము!” అన్నాడు. తర్వాత, “ఇంకేమిటో చెప్పొచ్చావు; అంతలోపల మాట మారిపోయింది. ఔనూ, పళువేట్టరయ్యర్ గారి ప్రియనాయకిది బంగారపు వన్నె అన్నావుగదా? అది నీకెలా తెలుసు?” అన్నాడు.

“కడంబూర్ మత్తగజంపైన పళువేట్టరయ్యర్, దున్నపోతుపైన యమధర్మరాజులాగా వస్తూవున్నాడు! నా చూపంతా ఆయనపైనే. ఎప్పటికైనా నేనుకూడా ఆయనలాగ కావాలని అనుకొంటున్నప్పుడు, ఒక మూసిన పల్లకి వచ్చింది. దానిలో ఎవరుండవచ్చని నేనాలోచిస్తున్నప్పుడే, ఆ పల్లకిలోపలినుంచి ఒక అందమైన చేయి  పల్లకి తెరను కాస్త పక్కకు తొలగించింది. తొలగిన తెరపక్కనుంచి ఒక ముఖంకూడా కనిపించింది. చేయీ, ముఖమూ మంచి బంగారు వన్నె! అంతే నేను చూసిందంతా! నీవిప్పుడు చెప్పినదాన్నిబట్టి  ఆమే పళువేట్టరయ్యర్ ప్రియనాయకి అని ఊహిస్తున్నాను.”

“వంతిదేవా! నీవదృష్టశాలివి. మగవాడెవ్వడూ ఆ పళువూర్ యువరాణిని కళ్ళారా చూసిందిలేదని వినకిడి. ఒక క్షణంపాటైనా ఆమె చేతిని, ముఖాన్ని నీవు చూశావుగదా? చూసినంతలో ఆమె  ఏదేశపు సుందరికావచ్చని నీవనుకొంటున్నావు?” అని గందమారన్ అడిగాడు.

“అప్పుడు సేనావిషయం గురించి ఆలోచించలేదు. ఇప్పుడు ఆలోచించి చూస్తుంటే, ఆమె ఒకవేళ కాశ్మీరదేశపు స్త్రీ కావచ్చేమో; లేదా సముద్రాలకవతల ఉన్నటువంటి శావకం, కటారం, యవణం, మిశిరం మొదలైన దేశాలలో ఏదైనా ఒక దేశం నుంచి వచ్చివుండవచ్చనిస్తోంది. ఒకవేళ అరబ్బు దేశపు స్త్రీగా కూడావుండవచ్చు. ఆ దేశంలో మాత్రమే స్త్రీలు పుట్టినప్పటినుంచి  చనిపోయేవరకు ముఖం చాటు చేసుకొనేవుంటారట!”

-:-

సరిగ్గా అప్పుడు ఎక్కడో సమీపంనుంచి పిల్లనగ్రోవి, మద్దెల, డోలు మొదలైన వాద్యాలనాదం వినిపించనారంభించింది.

“ఇదేమి సందడి?” అని అడిగాడు వంతిదేవుడు.

“కురవై ఆట ఆడబోతున్నారు! దానికి నాంది ఇది. నీవు కురవై ఆట చూసేందుకు ఇష్టపడతావా? లేదా,  పెందలకడనే భోజనంచేసి నెమ్మదిగా నిద్రపోతావా?”

ఆళ్వార్ కట్టియాన్ కురవై ఆట గురించి చెప్పింది వంతిదేవునికప్పుడు జ్ఞాపకం వచ్చింది.

“కురవై ఆట నేను చూసిందే లేదు; తప్పకుండా చూడాలి" అన్నాడు. ఆ మిత్రులు నాలుగడుగులు ముందుకు వెళ్ళి ఒక మలుపు తిరిగిన వెంటనే కురవై ఆట ఆడబోయే మేడ వారికగుపించింది. మేడముందు ప్రేక్షకులు వచ్చిచేరడంకూడా మొదలైంది.

-:-

ఎత్తైన అంతఃపురపు గోడలమధ్య తెల్లని ఇసుక పరిచిన ఒక విశాలమైన బయలు ప్రదేశంలో ఆ కురవై ఆటకు మేడను అమర్చారు. మేడపైన కోడి, నెమలి, జింక మొదలైన ప్రాణుల చిత్రాలను చిత్రించివున్నారు. ఎర్రగా వేయించిన వడ్లు, పసుపు కలిపిన బియ్యం, రంగురంగుల పూలు, గురివింద గింజలు మొదలైన వివిధ వస్తువులతో ఆమేడను చాలా సుందరంగా అలంకరించారు. స్తంభదీపాలు దివిటీలతోబాటు చీకటిని పారద్రోలసాగాయి. కానీ, సాంబ్రాణివంటి సువాసన ధూపాలతోబాటు ఆ దివిటీల పొగకూడా చేరుకొని ఆ దీపాల వెలుతురును మంచుకమ్మినట్లు కాస్త మసకబార్చింది. మేడకు ఎదురుగా, రెండువైపులా వాద్యకారులు కూర్చొని తమతమ వాద్యాలను చాల ఉత్సాహంతో వాయించసాగారు. పూల సువాసన, దీపాల వాసన, వాద్యఘోష అన్నీ చేరి వంతిదేవుని తల తిరగజేశాయి.

ముఖ్య అతిథులందరు వచ్చిన వెంటనే కురవై ఆట ఆడే స్త్రీలు తొమ్మిదిమంది మేడపైకి వచ్చారు. ఆటకు తగినట్లు దుస్తులు గట్టిగా బిగించి కట్టుకొని, ఒంటినంటుకొన్నట్లు నగలు, కాళ్ళకు గజ్జెలు ధరించి, <<పునుగు >>, జవ్వాది, చంపకం మొదలైన సుబ్రమణ్యస్వామికిష్టమైన పూలు తురుముకొని సిద్ధమైవున్నారు. ఆపూలన్నీ చేర్చి కట్టిన ఒక పొడపైన కదంబమాలతో వారు ఒకరినొకరు పెనవేసుకొన్నట్లు మేడపై వచ్చి నిలబడ్డారు. కొందరు చందనపు చెక్కతో చేసిన బొమ్మలను చేతిలో అలవోకగా పట్టుకొని నిలబడ్డారు.

సభికులకు నమస్కరించి, ఆటపాటలు ప్రారంభించారు. సుబ్రమణ్యస్వామిని శ్లాఘించే పాటలు పాడారు. తర్వాత ఆ స్వామి వీరకృత్యాలను  పొగిడి పాడారు. శూరపద్ముడు, గజముఖుడు మొదలైన అసురులను సంహరించి, సముద్రాన్ని ఎండబెట్టిన ఆ స్వామి ధీరత్వాన్ని గురించి పాడారు. దేవకన్యలెందరో తనకోసం తపస్సుచేసి తపించిపోతుండడం వల్ల, ఆ శివకుమారుడు ఈ భూలోకంలో తమిళనాడుకు వచ్చి, అడవిలో ఒక కోయనాయకుడి కూతురుని పెళ్ళిచేసుకోవడం గురించి శ్లాఘించారు. ఆ స్వామి కరుణాగుణాన్ని పొగిడారు. ఇటువంటి ఆటలు, పాటలను వాద్యసంగీతసమేతంగా వింటున్న ప్రేక్షకులు ఉన్మత్తులైనారు.

‘‘ఆకలి, రోగాలు, వైరము నశించనీ!

వాన, పంటలు, సిరి సంపదలు వర్ధిల్లనీ!’’

అన్న దీవెనతో కురవై ఆట ముగిసింది. ఆడిన స్త్రీలు మేడ దిగివెళ్ళారు.

-:-

తర్వాత, ’దేవరాళన్, దేవరాట్టి’ అనే ఆటగాడు, ఆటగత్తె వేలన్ (సుబ్రమణ్యస్వామి) ఆట ఆడేందుకు మేడపైకి వచ్చి నిల్చున్నారు. వారు రక్తవర్ణపు వస్త్రాలు ధరించారు. ఎర్రని రక్తవర్ణపు పూలమాలను ధరించారు. నుదుట రక్తవర్ణపు కుంకుమ పెట్టుకొన్నారు. తమలపాకు బాగా నమిలివుండడంతో వారి నోళ్ళుకూడా అదే వర్ణంతో వున్నాయి.

మొదట్లో వారి ఆట శాంతంగానే ప్రారంభమైంది. వేర్వేరుగా, తర్వాత చేతులు కలిపి ఆడారు. పోనుపోను ఆటలో ఉద్రేకం అధికం కాసాగింది. మేడపైన ఒకవారగా ఆనించిపెట్టివున్న శూలాన్ని దేవరాట్టి చేతిలోకి తీసుకొంది. దాన్ని ఆమె చేతినుంచి లాక్కొనేందుకు దేవరాళన్ ప్రయత్నించాడు. ఆమె కాస్త జంకింది. చివరికి, దేవరాళన్ మేడ అదిరేటట్లు ఒక కేకవేసి ఒక్కసారిగా ఒక గెంతు గెంతి ఆమె చేతినుంచి శూలాన్ని లాగేసుకొన్నాడు. దేవరాట్టి ఆ శూలాన్ని చూసి భయపడినట్లు నటించి మేడపైనుంచి దిగివెళ్ళింది.

తర్వాత, దేవరాళన్ ఒక్కడే శూలాన్ని చేతబట్టుకొని మేడపై వెర్రాట ఆడాడు. శూరుడు మొదలైన అసురగణాలు తెగి ముక్కలై పడ్డారు. తెగి పడ్డ శూరాసురుని తల మళ్ళీమళ్ళీ మొలిచింది. దానితో సుబ్రమణ్యస్వామి కోపం పెరగసాగింది. అతని కళ్ళనుంచి నిప్పురవ్వలు ఎగిరాయి. చివరికి శూరాసురుడు చచ్చిపడ్డాడు. దేవరాళన్ కూడా శూలాన్ని కింద పడవేశాడు.

ఇప్పుడు తక్కిన వాద్యాలన్నీ ఆగిపోయాయి. చిన్న ఢమరుకం శబ్దం మాత్రం వినిపించసాగింది. మేడదగ్గర నిలబడి పూజారి ఆవేశంతో ఆ ఢమరుకాన్ని వాయించసాగాడు. దేవరాళన్ శరీరంలో ఒక్కొక్క అణువూ కంపించసాగింది. “శాంతం వచ్చేసింది", అని సభలో అందరూ ఒకరికొకరు చెప్పుకోసాగారు.

కాసేపటికంతా పూజారి ఆవేశంవచ్చి ఆడిన దేవరాళన్ వైపుచూసి, “వేలా! మురుగా! దేవసేనాపతీ! కందా! శూరసంహారా! నీ దాసులను కరుణించి దీవించాలి!” అని వేడుకొన్నాడు.

“చెప్తున్నా వినుకోరా! ఏం కావాలో అడుగు!” అని అన్నాడిప్పుడు పూర్తిగా శాంతించిన దేవరాళన్.

“వాన కురుస్తుందా? వరదలొస్తాయా? దేశానికి మేలు కలుగుతుందా? అనుకొన్నది జరుగుతుందా?” అని పూజారి అడిగాడు.

“వానలు కురుస్తాయి! వరదలొస్తాయి! దేశం సుభిక్షమౌతుంది! అనుకొన్నది జరుగుతుంది. కానీ నా తల్లికి మీరు పూజ చేయలేదు. దుర్గ బలి కావాలంటోంది! భద్రకాళి బలి అడుగుతోంది. మహిషాసురుణ్ణి వధించిన చండికేశ్వరి బలి అడుగుతోంది!...” అని దేవరాళన్ ఆవేశంతో అరిచాడు.

“ఏం బలి కావాలి?” అని పూజారి అడిగాడు.

“అడిగింది ఇస్తారా?” అన్నాడా పూనకం వచ్చిన దేవరాళన్.

“ఇస్తాము; తప్పకుండా ఇస్తాము!” అన్నాడు పూజారి.

“రాజకులపు రక్తం అడుగుతోంది! వేయి సంవత్సరాల రాజవంశపు రక్తం అడుగుతోంది!” అని అతిభయంకరమైన స్వరంతో అరిచాడా పూనకంపట్టిన దేవరాళన్.

మేడముందు కూర్చొన్న పళువేట్టరయ్యర్, శంబువరయ్యర్, మళవరయ్యర్ మొదలగువారు ఒకరిముఖాలొకరు చూసుకొన్నారు. వారు కనుసైగలతో ఏదో మాట్లాడుకొన్నారు.

శంబువరయ్యర్ పూజారివైపు చూసి తల ఆడించి సైగ చేశారు.

పూజారి ఢమరుకాన్ని ఆపాడు. పూనకం పట్టి ఆడిన దేవరాళన్ కొట్టేసిన చెట్టులా మేడపై పడ్డాడు. దేవరాట్టి పరుగెత్తివచ్చి వాడినెత్తుకొని వెళ్ళింది.

సభ మెల్లగా చెదిరిపోసాగింది. బయట ఎక్కడో దూరంగా నక్కలు ఈల వేయడం వినిపించింది.

ఇంతసేపు ఇదంతా చూసి, విని ఉద్రిక్తుడైన వంతిదేవుడు, నక్కల ఈల శబ్దం వచ్చిన వైపు చూశాడు. అక్కడ, ఆ భవనపు బయటి గోడపైన ఒక తల కనిపించింది. అది ఆళ్వార్ కట్టియాన్ తలే! ఒక క్షణం వంతిదేవుడు ఒక భయంకరమైన అనుభూతికి లోనైనాడు. ఆళ్వార్ కట్టియాన్ తలను కొట్టేసి కోట గోడపైన ఎవరో పెట్టినట్లు అతనికి భ్రమ కలిగింది. కళ్ళు ఒకసారి మూసి తెరిచి చూస్తే ఆ తల అక్కడ అగుపడలేదు! ఊరికే అటువంటి చిత్తభ్రమకు లోనైనందుకు సిగ్గుపడ్డాడు. ఇంతవరకు అనుభవించని కొన్ని అనుభూతులు  అతని మనస్సును కలతబారజేశాయి.

~~~
~~~

# అధ్యాయము - 6

## అర్ధరాత్రి సమావేశం

కురవై ఆట, పూనకం ఆట ముగిసిన తర్వాత, వచ్చిన అతిథులందరికి ఒక పెద్ద విందుభోజనం వడ్డించారు.వంతిదేవునికి విందు రుచించలేదు. అతని ఒడలు అలిసిపోయివుంది; మనసేమో కలతబారింది. కానీ, అతనిపక్కనవున్న అతని మిత్రుడు గందమారన్ వచ్చిన అతిథులెవరెవరెవరన్నది చాలా కుతూహలంతో వివరించి చెప్పాడు.

పళువేట్టరయ్యర్, శంబువరయ్యర్ తోబాటు అక్కడ మళవరయ్యర్ వేంచేశారు; కుండ్రత్తూర్ పెరునిలక్కిళార్ వచ్చివున్నారు. తాన్తోంగి కళింగరాయర్, వణంగాముడి ముణైయరయ్యర్, దేవసేనాధిపతి పూవరయ్యర్, భయంలేని ('అంజాద') సింహముత్తరయ్యర్, జంట గొడుగుల రాజాళియార్ (అంటే రారాజు అని అర్థం), కొల్లిమలై పెరునిల వేళార్ మొదలైనవారిని గందమారవేల్ తన స్నేహితునికి గుర్తించి చూపించి ఎవరికీ వినిపించనట్లు మెల్లగా చెవిలో చెప్పాడు.

ఈ ప్రముఖులు సామాన్యులు కారు; సులభంగా ఒకచోట సమావేశమయ్యేవారు కూడాకాదు. ఇంచుమించు అందరూ చిన్నపాటి రాజులే; లేదా తమ వీరకృత్యాలవల్ల అటువంటి రాజమర్యాదలను సంపాదించుకొన్నవారు. ఆ కాలంలో రాజు లేదా అరసు అన్న పట్టం 'అరయ్యర్'గా మారి, రాజవంశస్థులకు, రాజవంశస్థుల హోదాలో ఉన్నవారికి వర్తించబడేది ('పళువేట్టరయ్యర్", 'శంబువర్రయర్' మొదలగు పట్టాలు, బిరుదులు అలా వచ్చినవే). వారికింద వున్న ఊరి పేరుకు 'అరయ్యర్' అని చేర్చి వారిని పిలవడమూ కద్దు.

ఆ రోజుల్లో, చిన్నరాజులంటే 'అరసు' అన్న పట్టంపొంది, రాజ భవనంలో కూర్చొని సుఖభోగాలనుభవించేవారని అర్థంకాదు. యుద్ధరంగంలో ముందు నిలబడి పోరాడేందుకు సిద్ధమైనవారు మాత్రమే తమ రాజసత్వాన్ని, హక్కును నిలబెట్టుకోగలరు. కాబట్టి, వారొక్కొక్కరూ ఎన్నో యుద్ధాల్లో పాల్గొని కీర్తితోపాటు గాయాలను ధరించినవారు. ఇప్పుడు వారందరూ పళైయారై సుందర చోళ చక్రవర్తి అధికారంలో, తమతమ పరిధుల్లోపల తమ పాలనను నడిపించుకొస్తున్నవారు. కొందరు చోళసామ్రాజ్యంలో పెద్దపెద్ద పదవుల్లో వున్నారుకూడా.

ఇంతమంది చోళసామ్రాజ్యపు ప్రముఖులను ఒకేచోట చూసి వల్లవర్రయన్ సంబరపడివుండాలి. కాని, అతనికలాంటి ఉత్సాహం కలగలేదు.

"ఇంతమందీ ఇక్కడెందుకు కూడివున్నారు?" అన్న ఆలోచన అతనికి మళ్ళీమళ్ళీ

రాసాగింది.ఏవేవో అస్పష్టమైన సందేహాలతని మనసులో మెదలసాగాయి.

ఇలా ఆందోళనాపూరితమైన మనస్సుతో వంతిదేవుడు తనకోసం గందమారన్ సిద్ధంచేసివుంచిన స్థలానికి వెళ్ళి పడుకొన్నాడు. అతిథులు చాలామంది వచ్చివున్నందువల్ల, వంతిదేవునికి డాబామీద ఒకమూలలోవున్న ఒక బయలు మంటపం మాత్రమే దొరికింది. “నీవు చాలా అలిసిపోయివున్నావు. కాబట్టి వెంటనే పడుకొని నెమ్మదిగా నిద్రపో. తక్కిన అతిథులందరి ఏర్పాట్లు చూసేసి, నేను నీ పక్కనే వచ్చి పడుకొంటాను" అని గందమారన్ చెప్పేసి వెళ్ళాడు.

-:-

పడుకొన్నవెంటనే వంతిదేవునికి నిద్ర ముంచుకొచ్చింది. అతిత్వరలో నిద్రాదేవి అతన్ని తన కౌగిలిలోకి తీసుకొంది. కాని ఏం ఉపయోగం? మనస్సనేదొకటుంది కద? దాన్ని నిద్రాదేవికూడా కట్టిపడవేయలేదు. ఒళ్ళు కదలకుండా పడివున్నప్పటికీ, కళ్ళు మూసివున్నప్పటికీ మనస్సు లోతుల్లో దాగివున్న ఆలోచనలు స్వప్నాలుగా రూపొందుతున్నాయి.. అర్థంలేని, బుద్ధికందని అనుభవాలు, సంఘటనలు ఆ స్వప్నలోకంలో పుడుతున్నాయి.

ఎక్కడో దూరంనుంచి ఒక నక్క ఈల వేయడం వినిపించింది. ఒక నక్క, పది, నూరు నక్కలుగా పెరిగి ఈల వేయనారంభించాయి! ఈలవేస్తూనే, వంతిదేవునికి మరింత దగ్గరగా రాసాగాయి. ఆ కారుచీకటిలో ఆ నక్కల కళ్ళు చిన్నచిన్న నిప్పుకణికల్లాగా మెరుస్తుండగా అతని దగ్గరకు రాసాగాయి.

వెనక్కు తిరిగి పరుగెత్తిపోయి తప్పించుకొందామనుకొన్నాడు వంతిదేవుడు. అతను తిరిగి చూసినవైపు పది, నూరు, వెయ్యి కుక్కలు ఒకేమందగా మొరుగుతూ రాసాగాయి. ఆ వేటకుక్కల కళ్ళు కూడ నిప్పుకణికల్లాగా మెరుస్తున్నాయి.

నక్కలకు, వేటకుక్కలకు మధ్య చిక్కుకొంటే తన గతి ఏమౌతుందన్నది ఊహించుకొని వంతిదేవుడు గడగడ వణికాడు. అదృష్టవశాత్తు, అతనికెదురుగా ఒక గుడి కనిపించింది. ఒక్కదూకులో పరుగెత్తిపోయి ఆ గుడిలో దూరి వాకిలికి తాళం వేశాడు. తిరిగిచూస్తే, అది కాళి గుడి అని తెలిసింది. భయంకరంగా నోరు తెరుచుకొనివున్న ఆ కాళీమాత విగ్రహం వెనకనుంచి ఒక పూజారి బయటికొచ్చాడు. అతని చేతిలో ఒక భయంకరమైన వేటకత్తి ఉంది. “వచ్చావా! రా!” అని అంటూనే పూజారి మరింత దగ్గరికి వచ్చాడు.

“నీవు పుట్టిన రాజవంశపు వృత్తాంతమేమి? ఎన్ని సంవత్సరాలు మీకులస్థులు రాజ్యమేలారు? నిజం చెప్పు" అని పూజారి అడిగాడు.

“వాణర్ కులపు రాజులు మూడువందల సంవత్సరాలు రాజ్యమేలారు; నాతండ్రి కాలంలో

పైదుంబరాయల కారణంగా రాజ్యం కోల్పోయాము" అన్నాడు వంతిదేవుడు.

"అలాగైతే, నీవు తగిన బలి కాదు! పారిపో!" అన్నాడు పూజారి.

ఉన్నట్టుండి కాళీమాత స్థానంలో కన్నయ్య (శ్రీకృష్ణుడు) సాక్షాత్కరించాడు. ఆయన సన్నిధిలో ఇద్దరు స్త్రీలు చేత పూమాలలతో పాశురాలను పాడుతూ నాట్యం చేయసాగారు. ఇది చూసి వంతిదేవుడు పరవశించివుండగా, అతని వెనుకనుంచి, "చూశాం, చూశాం, కంటికింపైన వాడిని చూశాం!" అన్న పాటను విని తిరిగిచూశాడు. పాడినవాడు ఆళ్వార్ కట్టియానే! కాదు, కాదు, ఆళ్వార్ కట్టియాన్ తల పాడింది! ఆ తలమాత్రం బలిపీఠంపైన పెట్టబడివుంది!

ఈ దృశ్యాన్ని చూడలేక వంతిదేవుడు వెనుదిరిగాడు; స్తంభానికి గుద్దుకొన్నాడు. కల చెదిరింది. కళ్ళు తెరిచాయి. కాని కలను, ఇలనూ ఒకటి చేసే ఒక దృశ్యం అతని కంటబడింది. అతను పడుకొన్న తావుకు ఎదురుగా కడంబూర్ మాళిగ ప్రాకారపు గోడపైన ఒక తల కనిపించింది. అది ఆళ్వార్ కట్టియాన్ తలే! ఈసారి అది కల కాదు, భ్రమకూడా కాదన్నది నిజం. ఎందుకంటే, ఎంతసేపు చూసినా ఆ తల అక్కడినుంచి కదలలేదు. అక్కడే ఉంది. అది ఒట్టి తలకాదు, తలవెనుక శరీరంకూడా ఉందని సులభంగా ఊహించగలిగాడు. ఎందుకంటే, ఆళ్వార్ కట్టియాన్ చేతులు ఆగోడ అంచును పట్టుకొనివున్నాయి. అదీగాక, అతను కోట గోడలోపల కిందిభాగాన్ని చాలా శ్రద్ధగా చూస్తూన్నాడు!... దీంట్లో ఏదో కుట్ర ఉండనే వుండాలి. ఆళ్వార్ కట్టియాన్ మంచి ఉద్దేశ్యంతో అక్కడికి వచ్చివుండే అవకాశంలేదు. ఏదో దురుద్దేశంతో ఒక చెడు కార్యం చేసేందుకే వచ్చివున్నాడు. అతడలా చెడుకార్యం చేయకుండా ఆపడం గందమారన్ ప్రాణస్నేహితుడైన తన కర్తవ్యం కదా? తనకొక పూట అన్నంపెట్టిన ఇంటివారికి రానున్న అపాయాన్ని ఆపకుండా ఊరకుండడం తగునా?

వల్లవర్రయన్ దిగ్గున లేచాడు. పక్కన ఒరలోవున్న కత్తిని ఒరతోబాటు నడుము బట్టలో దూర్చుకొన్నాడు. ఆళ్వార్ కట్టియాన్ తల కనిపించిన దిశగా నడిచాడు.

మాళిగ పైమేడలోవున్న ఒక మంటపంలో కద వంతిదేవుడు పడుకొనివున్నాడు? అక్కడినుంచి బయలుదేరి కోటగోడవైపు నడిచినప్పుడు, పైమేడను అలంకరించివున్న మంటప శిఖరాలు, మేడలు, విమాన స్తూపాలు, స్తంభాలు మొదలైనవాటిని దాటుకొని, చుట్టుతిరిగి వెళ్ళవలసివచ్చింది. అలా కాస్త దూరం నడిచి వెళ్ళిన తర్వాత, ఉన్నట్టుండి ఎక్కడినుంచో మాటలు వినబడసాగాయి. వేంటనే వంతిదేవుడు నిలబడిపోయాడు. అక్కడున్న ఒక స్తంభం వెనుక మరుగ్గా నిలబడి తొంగిచూశాడు. కింద ఇరుకైన ఒక డాబాలో, మూడుపక్కలా ఎత్తైన గోడలున్న ఒకమూలలో పది పన్నెండు మంది కూర్చొనివున్నారు. ఆ ఎత్తైన గోడలు దీపాల వెలుతురును సగానికి పైగా అడ్డగిస్తున్నా, ఒక గోడలో పొదిగివుంచిన ఒక ఇనుప ప్రమిద కాస్త వెలుతురునిచ్చింది.

అక్కడున్నవారందరూ ఆ రాత్రి విందులో అతను చూసిన ప్రముఖులే; చిన్నరాజులు, చోళసామ్రాజ్యపు అధికారులే. వీరు ఏదో ఒక ముఖ్యమైన విషయంగురించి చర్చించేందుకే అలా అర్థరాత్రి అక్కడ సమావేశమైవుండాలి. వారు ఏం చేస్తున్నారు, ఏం మాట్లాడుతున్నారన్న దాన్ని తెలుసుకోవడంకోసమే ఆళ్వార్ కట్టియాన్ కోటగోడపైనుంచి అంత శ్రద్ధగా చూస్తున్నాడు. ఆళ్వార్ కట్టియాన్ మాచెడ్డ తెలివైనవాడనడంలో సందేహలేదు. అతనున్న చోటినుంచి కిందవున్నవారిని బాగా చూడవచ్చు, వారి మాటలు వినవచ్చు. కానీ, కిందవున్నవారు అతన్ని చూడలేరు. ఆచోట అంతఃపురపు గోడలు, కోటగోడలు అలా అమరివున్నాయి. అటువంటి స్థలాన్ని ఆళ్వార్ కట్టియాన్ కనిపెట్టి వచ్చివున్నాడు! చాలా తెలివైనవాడే; సందేహంలేదు. కానీ, అతని పప్పులు ఈ వాణర్ కులపు వీరుడి దగ్గర ఉడకవు! ఆ కపట వైష్ణవుడిని పట్టి లాక్కొని వచ్చి... కానీ, అతన్ని అలా పోయి పట్టుకోవాలంటే, కిందవున్నవారు తనను గమనించకుండా, అతనున్న గోడ దగ్గరికి వెళ్ళడం అసాధ్యం. అలా వారు చూసేటట్లు తాను వెళ్ళడంలో ఏదైనా అపాయం ఉండవచ్చు. "ఈ రోజు చూసి వీడిక్కడి వచ్చివుండకూడదు!", అని శంబువరయ్యర్ తనగురించి  చెప్పినది అతనికి జ్ఞాపకం వచ్చింది. వీరంతా ఏదో ఒక ముఖ్యమైన విషయంగురించి చర్చించేందుకు ఇక్కడ సమావేశమైవున్నారు. వారి మంత్రాలోచనలు ఇతరులకు తెలియడం వారికిష్టం లేదన్నది స్పష్టం. అలావున్నప్పుడు, తనను ఉన్నట్టుండి చూస్తే, వారు సందేహపడవచ్చుగద? ఆళ్వార్ కట్టియాన్ గురించి తాను వారికి చెప్పేలోపల వాడు గోడదూకి పారిపోతాడు. కాబట్టి తనగురించి సందేహం ఏర్పడడం తప్ప ఇంకేమీ ప్రయోజనంవుండదు. "పడుకొని ఉన్నవాడివి ఇక్కడికెందుకొచ్చావు?" అని అడిగితే, ఏం బదులు చెప్పాలి? గందమారన్ తప్పకుండా ఇరకాటంలో పడతాడు. ఆహ్! గందమారవేల్ ఆ గుంపులో ఒక మూల కూర్చొనివున్నాడు. వాడూ ఈ సమావేశంలో పాల్గొంటున్నాడు కాబోలు! పొద్దున వాడిని అడిగితే అంతా తెలుస్తుంది.

అప్పుడు అక్కడున్నవారి పక్కన పెట్టివున్న మూసిన పల్లకి అతను గమనించాడు. ఆః! అది పళువేట్టరయ్యర్ ఏనుగు వెంటవచ్చిన పల్లకేగదా? దానిలో వచ్చిన స్త్రీ, ఒక్కక్షణం తెర తొలగించి చూసిన స్త్రీ, ఇప్పుడు ఈ అంతఃపురంలోపలెక్కడుందో ? ఈ ముసలాయన ఆమెను అంతఃపురానిక్కూడా పంపించలేదటగదా? వయసుమీరిన వారు లేతవయసు అమ్మాయిని పెళ్ళిచేసుకొంటే వచ్చే ఇక్కట్టే ఇది. సందేహం వారిప్రాణం తీస్తుంది. ఒక్క నిమిషంకూడా తమ యవ్వనసఖిని విడిచివుండేందుకు వారి మనసొప్పదు. ఒకవేళ, ఇప్పుడుకూడా, పళువేట్టరయ్యర్ భార్య ఆ పల్లకిలోవుందో, ఏమో? ఆహ్! ఈ వీరాధివీరుని తలవిధి చూడు! ఈ వయసులో ఒక లేతవయసు అమ్మాయిచేత చిక్కుకొని అవస్థపడుతున్నాడు! అప్పటికీ, ఆమె ఏమీ రంభో, ఊర్వశో, తిలోత్తమనో కాదు! వంతిదేవుడు ఆమెనొక క్షణం పాటు చూసినప్పుడు అతనికేర్పడిన జుగుప్సాభావం ఇంకా మర్చిపోలేదు. అటువంటామె పట్ల ఈ వీరపురుషునికి ఏం మోహమో, తెలియలేదు. దీనికన్న చోద్యం ఆళ్వార్ కట్టియాన్ విషయం. ఆ పల్లకిని

చూసేందుకే కాబోలు గోడపైనుంచి అలా చూస్తున్నాడు! కానీ, అతనికి, ఆమెకు ఏమి సంబంధమో మనకేం తెలుసు? ఒకవేళ ఆమె అతని సహోదరి కావచ్చు, లేదా ప్రేయసికూడా కావచ్చు. పళువేట్టరయ్యర్ ఆమెను బలవంతంగా ఎత్తుకొనిపోయివుండవచ్చు! ఆయనలా చేయగలవాడే. కాబట్టి, ఆమెను చూసి ఒక్కసారి మాట్లాడేందుకోసం ఆళ్వార్ కట్టియాన్ ఇలాగ తిరుగాడుతున్నాడు కాబోలు! దీనిగురించి మనకేల? ఊరక పోయి పడుకొని నిద్రపోదాం.

ఇలా ఆ యువకుడు తీర్మానించుకొన్నప్పుడు, కిందవున్నవారి మాటల్లో అతని పేరు వినిపించింది. వెంటనే ఒకింత శ్రద్ధగా వినసాగాడు.

“మీ అబ్బాయి స్నేహితుడని చెప్పుకొంటూ వచ్చాడే ఒక అబ్బాయి - ఆ అబ్బాయి ఎక్కడ పడుకొనివున్నాడూ? మన మాటలేమీ అతని చెవిలో పడకూడదు. అతడు ఉత్తరదిశ మాతండ నాయకుని కింద పనిచేసేవాడన్నది మర్చిపోకూడదు. మనం పన్నుతున్న ఉపాయం నెరవేరే సమయం వచ్చేవరకు, ఈ విషయం ఎవ్వరికీ తెలియకూడదు. ఆ అబ్బాయికి ఈ విషయం ఏమాత్రం తెలిసిందని సందేహంవచ్చినా, అతన్ని ఈ కోటనుంచి బయటకు పంపించకూడదు. వాడిని ముగించేయడమే ఉచితం...”

ఇది విన్న వంతిదేవునికెలా అనిపించి ఉంటుందనేది పాఠకులు ఊహించుకోవచ్చు. కానీ, అతను ఆ స్థలం విడిచి జరగలేదు. వారి మాటలు పూర్తిగా వినితీరాలని నిశ్చయించుకొన్నాడు. ఉత్తరదిశ మాతండ నాయకుడెవరు? సుందర చోళచక్రవర్తి మొదటి కుమారుడు. చక్రవర్తి తర్వాత సింహాసనమెక్కవలసిన పట్టపు యువరాజు. ఆయన దగ్గర తాను పనిచేయడంలో వీరికేమి ఆక్షేపణ? ఆయనకు తెలియకూడని సంగతి వీరు ఏమి మాట్లాడబోతున్నారు?

అప్పుడు, గందమారన్ తన స్నేహితుని వెనకేసుకొని మాట్లాడడం అతనికి వినిపించింది.

“పైమేడ మూలలోవున్న మంటపంలో వంతిదేవుడు పడుకొని నెమ్మదిగా నిద్రపోతున్నాడు. ఈ కూటమి మాటలు అతని చెవిన పడబోవు. తనకు సంబంధంలేని విషయంలో తలదూర్చడు కూడాను. అప్పటికీ, వాడేమైనా తెలుసుకొంటే, అందునించి మీకే హానీ కలగకుండా చూసుకోవడం నా బాధ్యత!” అన్నాడు గందమారన్.

“నీకతనిపైన అంత నమ్మకం ఉండడం గురించి నాక్కూడా సంతోషమే. కానీ, మాలో ఎవరికీ అతని పూర్వాపరాలు తెలియవు. కాబట్టే హెచ్చరించాను. మనమిప్పుడు మాట్లాడబోయే విషయమేమో ఒక మహాసామ్రాజ్యపు హక్కును గురించి. అజాగ్రత కారణంగా ఒక్కమాట బయటికి పొక్కినా, విపరీత పరిణామాలు ఏర్పడవచ్చు. ఇది మీరందరూ జ్ఞాపకంవుంచుకోవాలి !" అన్నారు పళువేట్టరయ్యర్.

~~~
~~~

# అధ్యాయము - 7

## నవ్వు - కోపమూ

రాజ్యాధికారంగురించి పళువేట్టరయ్యర్ చెప్పినది విన్నవెంటనే వంతిదేవుడు ఒక తీర్మానానికి వచ్చాడు. రాజ్యాధికారంగురించి వీరేం మాట్లాడబోతున్నారు? అసలు ఆ విషయంగురించి మాట్లాడేందుకు వీళ్ళెవరు ? ఈ రహస్యసమావేశంలో ఏం జరగబోతోందో తెలుసుకొనే తీరాలి! ఇక్కడే కూర్చోవలసిందే. దీనికన్న అనువైన చోటు దొరకదు. ఆళ్వార్ కట్టియాన్ ఏమైనా ఐపోనీ. అతడిగురించి మనకెందుకు దిగులు?

ఇక్కడ ఈరోజు ఏదో ఒక మర్మమైన కార్యక్రమం జరగబోతోందనే ఆలోచన వంతిదేవుని మనసులో అప్పటికే గట్టిగా ఏర్పడివుంది. నిగూఢార్థాలనిచ్చే ఆళ్వార్ కట్టియాన్ మాటలు, కోటవాకిలి దగ్గర కాపలాదారుల దుడుకుతనం, శంబువరయ్యర్ అర్ధమనస్కంగా తనకిచ్చిన స్వాగతం, పూనకం వచ్చినట్లు ఆడిన వాడి ఆవేశపూరితమైన మాటలు - ఇవన్నీ అతని మనస్సులో ఏవేవో సందేహాలను పుట్టించాయి. ఆ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి, నిజాన్ని తెలుసుకోవడానికి ఇదొక మంచి అవకాశం దొరికింది. దాన్నెందుకు వదులుకోవాలి?

ఆహా! తన ప్రాణానికి ప్రాణమైన స్నేహితుడని చెప్పుకొచ్చిన గందమారన్ కూడా తనకు నిజాన్ని చెప్పలేదు. తనను నిద్రపుచ్చేసి ఈ అర్ధరాత్రి రహస్యసమావేశానికి వచ్చివున్నాడు. వాడిని రేపు ఒక పట్టు పట్టాల్సిందే.

ఇంతలో కింద పళువేట్టరయ్యర్ మాట్లాడనారంభించారు. వంతిదేవుడు చెవులు రిక్కించి వినసాగాడు.

“మీకందరికీ ఒక ముఖ్యమైన సమాచారాన్ని చెప్పేందుకే నేనిక్కడికి వచ్చాను. అందుకోసమే శంబువరయ్యర్ ఈ సభనేర్పాటు చేశారు. సుందర చోళచక్రవర్తి దేహపరిస్థితి చాలా దుఃఖకరంగావుంది. అంతఃపురవైద్యులను అంతరంగసమావేశంలో ప్రశ్నించి చూశాను. 'ఇక నమ్మకంలేదు. చాలారోజులు బతికుండడం కష్టం' అని చెప్పేశారు. కాబట్టి, ఇకముందు జరగబోయే కార్యక్రమాలగురించి మనం ఆలోచించేతీరాలి!' అని చెప్పి నిలిపారు.

“జ్యోతిష్కులు ఏమంటున్నారు?” అని కూటమిలో ఒకరడిగారు.

“జ్యోతిష్కులనా అడుగుతారెవరైనా ? కొన్నిరోజులుగా ఉదయకాలంలో తోకచుక్క కనిపిస్తోంది కదా? అది చాలదా?” అన్నారింకొకరు.

అందుకు పళువేట్టరయ్యర్ అన్నారు: "జ్యోతిష్కులను కూడా అడగడమైంది. వారు కొన్నిరోజులు పొడిగించి చెప్తున్నారంతే. ఎలావున్నా, పట్టానికి చక్రవర్తి తర్వాత అర్హుడెవరన్నది మనం ఆలోచించవలసిందే..." అని.

"అందుగురించి ఇంకా ఆలోచించడమేమి? రెండు సంవత్సరాలకు మునుపే ఆదిత్య కరికాలన్‌కి యువరాజపట్టాభిషేకం చేయడమైందికదా!" అని ఇంకొకరు మెల్లగా అన్నారు.

"నిజమే. కానీ, అలా యువరాజు పట్టం కట్టేముందు మనలో ఎవరినైనా ఒకమాట అడిగారా అని తెలుసుకోగోరుతున్నాను. ఇక్కడ కూడివున్న ఒక్కొక్కరమూ, సుమారు నూరు సంవత్సరాలకు పైగా, నాలుగు తరాలుగా చోళసామ్రాజ్యపు మేలుకోసం పాట్లు పడ్డ పురాతన వంశస్థులమే. నా తాతగారి తండ్రి తిరుప్పురంపయం యుద్ధంలో మరణించారు. నా తాతగారు వేళూర్ సంగ్రామంలో ప్రాణత్యాగం చేశారు. నా తండ్రి తక్కోలం యుద్ధంలో మరణించారు. అలాగే మీ ఒక్కొక్కరి పూర్వీకులుకూడా ఈ చోళసామ్రాజ్యాన్ని స్థాపించి విస్తరించేందుకు ప్రాణత్యాగం చేసివున్నారు. మన ఒక్కొక్కరి ఇంటినుంచీ ఎందరో యువవీరులు యుద్ధరంగంలో ప్రాణత్యాగంచేసివున్నారు.. ఇప్పుడుకూడా లంకలో మన కులానికి, కుటుంబానికి చెందిన అబ్బాయిలెందరో యుద్ధంచేస్తున్నారు. కానీ, ఇకముందు సింహాసనమెక్కవలసిన దెవరని తీర్మానించడంలో మహారాజు మన అభిప్రాయాన్ని అడగలేదు. దశరథుడుకూడా, రాముడికి పట్టంకట్టే విషయంగురించి సభకూర్చి మంత్రాలోచన చేశాడు. మంత్రులను, సామంతులను, సేనాధిపతులను, చిన్నరాజులను సంప్రదించాడు. కానీ సుందర చోళచక్రవర్తి ఎవరి అభిప్రాయాన్ని అడగాలనికూడా అనుకోలేదు..."

"మనల్నడగలేదనేది  నిజమే. కానీ ఎవరినీ అడగలేదని ధనాధికారి చెప్పడం సరికాదు. పెద్దరాణిగారైన శెంబియన్ మహాదేవిని, యువరాకుమారి కుందవైదేవిని సంప్రదించ లేదని పళువేట్టరయ్యర్ చెప్పగలరా?" అని ఒకరు కాస్త పరిహాసస్వరంతో అనడంతో, కూటమిలో కొందరు నవ్వారు.

"ఆహా! మీరు నవ్వుతున్నారా? మీకెలా నవ్వాలనిపిస్తుందో నేనెరుగను. తలుచుకొనేకొద్దీ, నాకు కడుపు మండిపోతోంది; రక్తం ఉడుకుతోంది. ఎందుకీ సిగ్గులేని బతుకు బతకాలనిపిస్తోంది. ఈరోజు పూనకంవచ్చి ఆడిన 'దేవరాళన్' దుర్గాదేవి బలి అడుగుతోందన్నాడు. 'వెయ్యేండ్ల పరంపరవున్న రాజవంశపు నరబలి' కావాలంటోంది అన్నాడు. నన్ను బలి ఇచ్చేయండి. నాకులం వెయ్యేళ్ళకన్నా పాతది. మీరొక్కొక్కరు మీ కత్తితో ఒక్కవేటు వేసి, నన్ను బలి ఇచ్చేయండి. తల్లి దుర్గ తృప్తి పడుతుంది; నా ఆత్మకూడా శాంతిస్తుంది..."

-:-

ఇలా పూనకంవచ్చిన ఆ దేవరాళన్ లాగానే ఆవేశంతో మాట్లాడి నిలిపారు పళువేట్టరయ్యర్. కానేపక్కడ మౌనం నెలకొంది. పడమటినుంచి వీస్తున్న గాలి శబ్దం, కోటగోడకవతలవున్న చెట్ల ఆకుల

గలగల శబ్దం మాత్రంవినిపించాయి.

"ఏదో తెలియనితనంగా మాట్లాడేసిన పరిహాసపు మాటల్నీ, దానివల్ల పుట్టిన నవ్వుల్నీ పళువూర్ ఏలిక పెద్దగా తీసుకోకుండా మన్నించాలి. మీరు సాటిలేని మేటి నాయకులు మాకు. మీరు వేసే ఆజ్ఞను నెరవేర్చేందుకు ఇక్కడున్నవారందరూ  సిద్ధం. మీరు చూపిన దోవలో నడుస్తాము. దయచేసి మన్నించాలి!" అని శంబువరయ్యర్ భావోద్వేగంతో అన్నారు.

"నేనూకాస్త ఓరిమి కోల్పోయాను. దానికి మీరుకూడా నన్ను మన్నించాలి. ఒకవిషయం ఆలోచించి చూడండి. సరిగ్గా ఇప్పటికి నూరేళ్ళమునుపు విజయాలయ చోళ చక్రవర్తి ముత్తరయ్యర్లను యుద్ధరంగంలో ఓడించి తంజావూరును కైవసం చేసుకొన్నారు. తిరుప్పురంపయం పోరులో పల్లవసైన్యానికి తోడుగానిలిచి మదురై పాండ్య సైన్యాన్ని నిర్మూలంచేశారు. అప్పటినుంచి చోళసామ్రాజ్యం రోజుకురోజు పెరుగుతూ విస్తరించరించబడుతూ వచ్చింది. కావేరినదికి ఎల్లలు గీచిన కరికాల్ వళవర్ కాలంలోకూడా చోళసామ్రాజ్యం ఇంత మహోన్నతస్థితికి చేరలేదు. ఈరోజు దక్షిణాన కన్యాకుమరి నుంచి ఉత్తరాన తుంగభద్ర-కృష్ణలవరకు చోళసామ్రాజ్యం విస్తరించివుంది. పాండ్య నాడు, నాంజిల్ నాడు, ఎవరికీ ఇంతవరకు లొంగని చేరనాడు, తొండైమండలం, భాగి నాడు, గంగపాడి, నుళంపాడి, వైతుంబర్ నాడు - మొదలైన ఇన్ని దేశాలూ చోళసామ్రాజ్యపు అధికారానికి లొంగి కప్పం కడుతూ వస్తున్నారు. ఇన్ని దేశాల్లోనూ మన చోళదేశపు పులిజెండా ఎగురుతోంది. దక్షిణాన లంక, ఉత్తరాన జంటమండలాలు, వేంగినాడూ మనకు లొంగివుండాలి. అలా లొంగివుండక పోవడానికి కారణాలు మీకందరికీ తెలుసు!..."

"అవును; అందరికీ తెలుసు. లంకా, జంటమండలాలు, వేంగినాడు, కళింగదేశమూ లొంగకపోవడానికి రెండు కారణాలున్నాయి. ఒక కారణం ఉత్తరదిక్కుకు మాతండనాయకుడైన యువరాజు ఆదిత్య కరికాలన్; రెండో కారణం దక్షిణసైన్యపు నాయకుడైన ఆయన తమ్ముడు అరుళ్మొళివర్మ...."

"మళవరయ్యర్ చెప్పిన రెండు కారణాలనూ నేనొప్పుకొంటాను. తరతరాలుగా ఈ చోళనాట సేనాధిపతులను నియమించే పద్ధతి వేరుగా వుండేది. పలు యద్ధాలలో పాల్గొని అనుభవం సాధించిన వీరాధివీరులను మాత్రమే సేనాధిపతులుగా నియమిస్తారు. కానీ ఇప్పుడు జరిగిందేమిటి? మొదటి యువరాజు ఉత్తర సైన్యపు సేనాపతి. ఆయనేం చేస్తున్నారు? జంటమండలాల పైనగానీ, వేంగిదేశంపైనగానీ దండెత్తి పోవడంలేదు. కాంచీపురంలో కూర్చొని బంగారు మాళిగ కట్టిస్తున్నారు. వీరవంశంలో పుట్టిన మిమ్మల్ని ఈ ప్రశ్న అడగగోరుతాను. ఇంతకు మునుపు తమిళదేశంలో ఏరాజైనా తాను వసించేందుకు స్వర్ణభవనాన్ని కట్టించుకొన్నాడా? ప్రపంచ ప్రఖ్యాతి గాంచి మదురైని, లంకను కూడా జయించిన పరాంతక చోళ చక్రవర్తికూడా తాము వసించేందుకు బంగారపు మాళిగ కట్టుకోలేదు. తిల్లై గుడికి మాత్రమే బంగారపు చూరు కట్టించారు. కానీ యువరాజు ఆదిత్యకరికాలన్ తాను వసించేందుకు బంగారు మాళిగ కట్టిస్తున్నారు.!

పల్లవ చక్రవర్తులు తరతరాలుగా వసించి రాజ్యభారంమోసిన అంతఃపురాలు వీరి అంతస్తుకు తగలేదు కాబోలు. బంగారపు అంతఃపురం కడుతున్నారు. రత్నాలను, వైఢూర్యాలను ఆ సౌధపు గోడలలో పొదిగిస్తున్నారు. గంగపాడి, నుళంపాడి, కొడగు మొదలైన దేశాలలో విజయం సాధించి కైవసంచేసుకొన్న ధనరాసుల్లో ఒక్క రాగి కాసు కూడా ఆయన రాజధాని బొక్కసానికింతవరకూ పంపలేదు...''

''స్వర్ణభవనం కట్టి ముగించడమైందా?''

''అవును, ముగించడమైందని నా అంతరంగ గూఢచారుల మూలంగా తెలుసుకొన్నాను. అంతేగాక, సుందరచోళ మహారాజుకు ఆయన ప్రియప్రథమపుత్రుడి నుంచి ఉత్తరాలుకూడా చాలానే వచ్చివున్నాయి - కొత్తగా నిర్మించివున్న స్వర్ణమాళిగలో మహారాజుగారు కొన్నిరోజులు వచ్చివుండాలని.''

''మహారాజు కంచికి పోబోతున్నారా?'' అని ఒకరు దిగులుతో కూడిన స్వరంతో అడిగారు.

''అటువంటి దిగులు మీకవసరం లేదు. అలా జరగకుండా నేను చూసుకొంటాను. తంజావూరు కోట నా తమ్ముడు చిన్న పళువేట్టరయ్యర్ కాపలాలోవుంది. అతని అనుమతి లేకుండా ఎవరూ కోటలోపల జొరబడలేరు. నాకు తెలియకుండా ఎవరూ మహారాజుగారిని కలవలేరు. తాళపత్రమిచ్చేందుకూ వీలుపడదు. ఇంతవరకు వచ్చిన రెండు మూడు పత్రాలను నిలిపివుంచేశాను.''

''పళువేట్టరయ్యర్ గారికి జయహో! పళువూర్ ప్రభువుల చాణక్య తంత్రానికి జయహో! బహుకాలం జీవించనీ వారి వీరత్వం!'' అని సభికులు ఘోషించారు.

''ఇంకావినండి. పట్టపు యువరాజు చేస్తున్న పనుల కన్నా, లంకకు వెళ్ళివున్న చిన్నయువరాజు అరుళ్మొళివర్మ చేస్తున్న కార్యాలు ఇంకా విచిత్రంగా వున్నాయి.యుద్ధధర్మంగురించి మనం తెలుసుకొన్నదేమి? తరతరాలుగా మన పూర్వీకులు పాటిస్తూ వస్తున్నదేమి? మన దేశపు సైన్యాలు ఇంకోదేశంపైన దండెత్తివెళ్ళినప్పుడు, మన సైన్యానికి కావలసిన అన్నపానీయాలు ఆ విదేశంలోనే సంపాదించుకోవాలి. ఆ దేశంలో చేజిక్కించుకొన్న వస్తువులనాధారంచెసుకొనే  మన వీరులకు జీతమూ ఇవ్వాలి. మిగిలిన వస్తువులను రాజధానిలోని ప్రధాన ఖజానాకు పంపించాలి. కానీ, యువరాజు అరుళ్మొళివర్మ ఏంచేస్తున్నారో తెలుసా? లంకలోవున్న మన వీరులకు, ఇక్కడినుంచి ఓడల్లో ధాన్యం పంపించాలట! ఒక సంవత్సరంగా నేనూ పదిసార్లు ఓడల్లో ధాన్యం పంపించివున్నాను....''

''విచిత్రం! వింత!'', ''ఈ విపరీతాన్ని ఓర్చలేం!'', ''ఇటువంటిది వినివుండనేలేదు!'' అన్న మాటలు వినవచ్చాయి.

''ఈ విచిత్రకార్యానికి అరుళ్మొళివర్మగారు చెప్పే కారణాన్నికూడా వినండి. దండెత్తివెళ్ళిన దేశంనుంచి మనవీరులకు ఆహారం సంపాదించడమంటే, అక్కడి ప్రజల అసంతృప్తికి లోనుకావలసి వస్తుందట. మనకూ, లంక రాజులకు యుద్ధమే తప్ప, అక్కడి ప్రజలతో ఎటువంటి యుద్ధమూ లేదట. కాబట్టి

వారిని ఏవిధంగానూ కష్టపెట్టకూడదట! ఆ రాజవంశస్థులతో యుద్ధంచేసి గెలిచిన తర్వాత ఆ ప్రజలు మనసారా ఇష్టపడితే రాజ్యమేలాలట. కాబట్టి, ధనమూ, ధాన్యమూ ఇక్కడినుంచి పంపాలట!"

"దండెత్తి వెళ్ళిన దేశాల ప్రజలను ఏమీ అడగకూడదు, వాళ్ళ కాళ్ళకుపడి దండంపెట్టాలన్న యుద్ధధర్మాన్ని మేమింతవరకు వినేవుండలేదు" అని ఒకరన్నారు.

"దానివల్ల జరగబోయే విపరీత పరిణామాలను కూడా వినండి. ఇద్దరు యువరాజులు చేస్తున్న ఇటువంటి కార్యాలవల్ల తంజావూరులోని బొక్కసంలో ధనము, ధాన్యాలుకూడా తరిగిపోతున్నాయి. మీకంతా ఎక్కువ పన్నులు విధించి వసూలు చేయవలసిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇందుకోసమే నన్ను పన్నుల అధికారిగా నియమించివున్నారు! చోళదేశపు మేలుకోసమని చెప్పివుండక పోతే నేనీ పదవిని ఎప్పుడో త్రోసిపుచ్చివుండేవాడిని!"

"ఆ! కూడనే కూడదు! మీరీ పదవిలోవుండడమే మాకు పెద్ద అండ. ఈ సిగ్గుమాలిన కార్యాలను గురించి మహారాజుగారికి చెప్పి చూడలేదా?"

"చెప్పకేం? చాలాసార్లు చెప్పడమైంది. ప్రతిసారి, 'పెద్ద రాణిగారిని అడగండి, యువరాకుమారి (కుందవైదేవి)ని అడగండి!' అన్న బదులే వస్తోంది. ముందే చెప్పానుగదా, మహారాజుగారికి స్వయాలోచనాశక్తి నశించిపోయిందని! ముఖ్యమైన విషయాలలో మన అభిప్రాయాన్ని అడగడంకూడా లేదు. ఆయన పెత్తల్లి శెంబియన్ మహాదేవిగారి (పెద్దరాణిగారు) మాట మాత్రమే ఆయనకు దేవవాక్కు. తర్వాత, ఆయన ముద్దుల కుమార్తె కుందవైదేవిని అడగమంటారు. రాజ్య సేవలో తలనెరిసిపోయిన నేనూ, ఇతర మంత్రులూ ఆ చిన్నారి అమ్మాయి దగ్గర – కొళ్ళిడంనుంచి ఉత్తరానికి, కుడమురుట్టినుంచి దక్షిణానికి దాటివెళ్ళి ఎరుగని అమ్మాయి దగ్గర – మంత్రాలోచన అడిగేందుకు వెళ్ళి నిల్చోవాలి. ఎలావుంది కథ! ఈ చోళాసామ్రాజ్యం ప్రారంభమైనప్పటినుంచి ఇలా రాజకార్యాలలో స్త్రీలు తలదూర్చడం మేమెప్పుడూ వినలేదు! ఇటువంటి అవమానాన్ని ఇంకెన్ని రోజులు సహించివుండగలం? లేదా, మీరంతా ఒకే మాటగా చెబితే, నేను ఈ రాజ్యాంగ భారాన్ని, పన్ను విధించి రాజ్య బొక్కసాన్ని నింపే చీదరను వదిలేసి నా సొంతవూరికి వెళ్ళపోతాను..."

"కూడదు! కూడదు! పళువూర్ దేవరు మమ్మల్ని అలా వదిలిపెట్టి పోకూడదు. అష్టకష్టాలు పడి, వేలాది వీరులు నాలుగు తరాలుగా తమ రక్తాన్ని అర్పించి స్థాపించిన చోళసామ్రాజ్యం ఒక క్షణంలో చిన్నాభిన్నమైపోతుంది!" అన్నారు శంబువరయ్యర్.

"అలాగైతే ఇలాంటి పరిస్థితిలో ఏంచేయాలో మీరే నాకు ఆలోచన చెప్పాలి. ఈ ఆడవాళ్ళ సామ్రాజ్యానికి పరిహారం ఏమిటో మీరే చెప్పాలి" అన్నారు పళువేట్టరయ్యర్.

~~~
~~~

## అధ్యాయము - 8

## పల్లకిలో ఎవరు ??

కాసేపు ఆకూటమిలో ఒకరితోనొకరు ఏదో మాట్లాడుకొంటూ తర్జనభర్జనలు చేసుకొన్నారు. చాలా గొంతులు ఒకేసారి వినరావడంతో వంతిదేవునికి వారేమంటున్నారో స్పష్టంగా వినపడలేదు.

శంబువరయ్యర్ బిగ్గరగా, "పళువూర్ ప్రభువులు అడిగిన ప్రశ్నకు మనం బదులు చెప్పాలిగదా? తలా ఒక మాట మాట్లాడితే ఏం ప్రయోజనం? రాత్రి మూడోజాము మొదలైపోయింది. అదిగో, చంద్రుడుకూడా పైకి వచ్చేశాడు" అన్నారు.

"నాదొక సందేహం. నాలాగే ఇంకొంతమంది మనసులోకూడా ఈ సందేహంవుండవచ్చు. పళువూర్ దేవరు కోపించుకోరంటే, దాన్ని గురించి అడిగేందుకు ఇష్టపడతాను!" అని ఇంతకుమునుపు మాట్లాడిన గొంతే అంది.

"ఇప్పుడు మాట్లాడుతోంది వణంగాముడియారేకద? లేచి వెలుతుర్లోకి వచ్చి నిలబడాలి!" అన్నారు పళువేట్టరయ్యర్.

"అవును, నేనే, ఇదిగో వెలుతుర్లోకి వచ్చి నిలబడ్డాను!"

"నా కోపాన్నంతా యుద్ధరంగంలో మాత్రం చూపడమే నా అలవాటు; పగవారిపై చూపడం అలవాటు. నా స్నేహితులపైన చూపను. కాబట్టి ఏమడగాలనుకొన్నా మనసువిప్పి ధారాళంగా అడగవచ్చు."

"అలాగైతే అడుగుతాను. పళువేట్టరయ్యర్ గారు సుందర చోళ మహారాజుగారిపై ఏ నింద మోపుతున్నారో, అదే నిందను పళువేట్టరయ్యర్ గారిపై మోపుతున్నారు కొందరు! దాన్ని నేను నమ్మకపోయినా, ఈ సందర్భంలో అడిగి తెలుసుకోగోరుతున్నాను!" అన్నారు వణంగాముడియార్.

"అదేమి? ఎలా? వివరాలు కావాలి!"

"పళువూర్ దేవరు రెండేళ్ళకు మునుపు ఒక యుక్తవయస్కురాలిని పెండ్లి చేసుకొన్న విషయం మనందరికీ తెలుసు..."

అప్పుడు శంబువరయ్యర్ కోపస్వరంతో, "వణంగాముడియార్ ఈ విషయాన్ని ప్రస్తావించడాన్ని మేము ఆపేక్షిస్తున్నాం. మన మహానాయకులను, మన ప్రధమ అతిథిని, ఇటువంటి అసందర్భ ప్రశ్న అడగడం కొంచెంకూడా సరికాదు..." అన్నారు.

"శంబువరయ్యర్ ఓరిమి కోల్పోకూడదని నేను చాలా వేడుకొంటున్నాను. వణంగాముడియార్

అడగగోరుకొనే విషయాన్ని ధారాళంగా అడగనీ. మనసులో ఏదో సందేహాన్నుంచుకొని వుండడంకన్నా, అడిగితెలుసుకోవడమే మంచిది. యాభైఐదు ఏండ్ల వయసు దాటిన తర్వాత నేనొక యుక్తవయస్కురాలిని పెళ్ళిచేసుకొన్నమాట నిజమే. దాన్ని ధారాళంగా ఒప్పుకొంటాను. కానీ, నేనే కలియుగ రామావతారమని చెప్పుకోలేదు. ఏకపత్నీవ్రతం చేపట్టిన వాడినని కూడా చెప్పుకోలేదు. ఆమెను నేను ప్రేమించాను; ఆమెకూడా నన్ను ప్రేమించింది. పాత తమిళకాలపు సంప్రదాయం ప్రకారం ఇష్టపడి వివాహంచేసుకొన్నాము. ఇందులో ఏం తప్పు?"

"ఏమీ తప్పులేదు!" అని చాలా స్వరాలు వినవచ్చాయి.

"పెళ్ళి చేసుకొన్నది తప్పని చెప్పడంలేదు. మనలో మాత్రం ఎవరు ఏకధారావ్రతం పూనివున్నారు? కానీ...కానీ..."

"కానీ ఏమి? జంకకుండా మనసువిప్పి అడిగివేయండి!"

"కొత్తగా పెళ్ళిచేసుకొన్న యువరాణి మాటపైనే పళువేట్టరయ్యర్ నడుస్తారని కొందరంటున్నారు. రాచకార్యాల్లోకూడ యువరాణి ఆలోచన వింటారని వినికిడి. మీరు వెళ్ళేచోటల్లా యువరాణిని తీసుకువెళ్తారని అంటున్నారు..."

ఇప్పుడు కూటమిలో చిరునవ్వులు వినిపించాయి.

-:-

శంబువరయ్యర్ దిగ్గున లేచినిలబడి, "నవ్వెందెవరు? వెంటనే ముందుకువచ్చి నవ్వినందుకు కారణం చెప్పాలి!" అని గర్జిస్తూ ఒరనుంచి కత్తిని దూశారు.

"నేనే నవ్వింది! వదరకు శంబువరయ్యరే!" అన్నారు పళువేట్టరయ్యర్.. తర్వాత, "వణంగాముడియార్! తాళి కట్టిన పెళ్ళాన్ని నేను వెళ్ళినచోటికంతా తీసుకెళ్ళడం తప్పా? అలా నేను తీసుకువెళ్ళడం నిజమే. కానీ, రాజకార్యాలలో యువరాణి సలహా అడుగుతాననడం మాత్రం పొరపాటు. అలా నేనెప్పుడూ చేయను..."

"అలాగైతే, ఇంకా ఒకే ఒక్క సందేహాన్ని నివృత్తి చేయమని పళువూర్ ప్రభువులను వేడుకొంటాను. అంతఃపురంలోపల ఉండవలసిన పల్లకి మనమిక్కడ అంతరంగసమాలోచన చేస్తున్నచోట ఎందుకుంది? పల్లకిలోపల ఎవరైనా ఉన్నారా, లేదా? లేకపోతే, కాసేపటికి మునుపు వినిపించిన గొంతు సవరింపు శబ్దమూ, గాజుల గలగల ఎక్కడినుంచి వచ్చాయి?"

ఇలా వణంగాముడియార్ అడిగిన వెంటనే ఆ కూటమిలో ఒక విచిత్రమైన నిశ్శబ్దం నెలకొంది. పలువురి మనస్సుల్లోకూడా ఇదేవిధమైన సందేహమూ, ప్రశ్నలూ తోచినందువల్ల, వణంగాముడియార్ గారిని ఎదిరించి మాట్లాడేందుకు ధైర్యం చాల్లేదు. శంబువరయ్యర్‌గారి పెదవులు ఏదో గొణిగాయి. కానీ,

ఆయన నోటినుంచి మాటలేమీ వెలువడలేదు.

ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకొని పళువేట్టరయ్యర్ ఘంటానాదంతో ఇలా అన్నారు: "సరైన ప్రశ్న; ఉత్తరం చెప్పేందుకు నేను బాధ్యుడనైవున్నాను. ఈ కూటమి చెదరిపోకమునుపు మీ సందేహాన్ని తీర్చివేస్తాను. ఇంకా అరఘుడియ ఓపికపట్టవచ్చుగద ?అంత నమ్మకం మీకు నాపైన ఉందిగద?"

"ఉంది, ఉంది. పళువేట్టరయ్యర్ గారి పైన మాకు పరిపూర్ణ నమ్మకం ఉంది!" అని పలువురు ఘోషించారు.

"మిగిలిన వారికన్న పళువేట్టరయ్యర్ పట్ల నాకు భక్తి, మర్యాద తక్కువని అనుకోకండి. ఆయన మనసు విప్పి అడగమన్నందువల్ల అడిగాను. అంతేతప్ప, ఆయన విధించిన ఆజ్ఞను నెరవేర్చేందుకు నేను సిద్ధం. ఈ క్షణం నా ప్రాణమివ్వమన్నా సిద్ధమే!" అన్నారు వణంగాముడియార్.

"వణంగాముడియార్ గారి మనస్సు నాకు తెలుసు. మీరందరు నాపైవుంచిన నమ్మకమూ తెలుసు. కాబట్టి మనందరం ఈరోజు ఇక్కడెందుకు సమావేశమైనామో అది తీర్మానించుకొందాము. సుందర చోళ మహారాజుగారు చిరకాలం జీవించి ఈ సామ్రాజ్యాన్ని ఏలనీ. కానీ, ఆయనకేమైనా జరిగి, వైద్యుల వాక్కు ఫలిస్తే, కొన్నిరోజులుగా కనిపిస్తున్న ధూమకేతువు వంటి ఉత్పాతాలు నిజమైతే, తర్వాత ఈ చోళసామ్రాజ్యాన్ని ఏలేందుకు అర్హులెవరన్నది మనం తీర్మానించాల్సివుంది."

"ఆ విషయంగురించి మీ అభిప్రాయాన్ని తెలియజేయాలని కోరుతున్నాము. మీ అభిప్రాయానికెదురుగా చెప్పదగినవారు ఈ కూటమిలో ఎవరూ లేరు."

"అది సరికాదు. ఒక్కొక్కరూ ఆలోచించి మీ అభిప్రాయాన్ని వెలిబుచ్చాలి. కొన్ని పాత సంగతులను మీకు జ్ఞాపకంచేయగోరుతాను. మహావీరుడు, మహాజ్ఞాని, పుణ్యపురుషుడూ అయిన గండరాదిత్యులు ఇరవైనాలుగేళ్లకు మునుపు అకాలమరణంచెందారు. అప్పుడు ఆయన కుమారుడైన మధురాంతకదేవులు ఒక్కసంవత్సరపు బిడ్డ. కాబట్టి తమ సోదరుడైన అరింజయులు సింహాసనమెక్కవలసిందని నోరారా చెప్పివెళ్ళారు. దీన్ని ఆయన ధర్మపత్ని, పట్టమహిషియైన శెంబియన్ మహాదేవిగారే మనకు తెలియజేశారు. ఆవిధంగానే అరింజయచోళులకు పట్టంకట్టి సింహాసనంపైన కూర్చోబెట్టాము. కానీ, విధివశాత్తు ఆయన ఒకయేడుకన్నా రాజపీఠంపై కూర్చోలేదు. ఆయన ప్రధమపుత్రుడైన పరాంతక సుందర చోళుడు ఇరవైఏళ్లకే రాజ్యభారంమోయగల సామర్థ్యాన్ని కలిగివున్నారు. కాబట్టి, రాజ్యశ్రేయస్సుకోరి మంత్రులు, సామంతులు, చిన్నరాజులు, నగరాధిపతులు కూడి సమాలోచనచేసి పరాంతక సుందర చోళులకు పట్టంకట్టాం. అందుగురించి ఎవరూ దిగులు పడనాస్కారంలేదు. ఎందుకంటే, సుందరచోళ మహారాజు రెండేళ్ళకు మునుపటిదాక నీతి తప్పకుండా పరిపాలిస్తూ వచ్చారు. మన అభిప్రాయాలకు విలువిచ్చి రాజ్యాన్నేలారు. ఇందువల్ల చోళసామ్రాజ్యం ఇంకా

విస్తరించి అభివృద్ధి చెందుతూ వచ్చింది. ఇప్పుడు ఆయన ఆరోగ్యస్థితి మన దిగులుకు కారణమైవుంది. ఈ పరిస్థితిలో పట్టానికి అర్హులెవరు? గండరాదిత్యుల కుమారుడైన మధురాంతకులు ఇప్పుడు ప్రాయానికి వచ్చి, రాజ్యపరిపాలన చేయదగినవారై వున్నారు.. బుద్ధి, విద్య, భక్తి అన్నివిధాలుగా రాజ్యపాలనకు అర్హులైవున్నారు. ఆయనకన్న ఒకయేడు చిన్నవారైన ఆదిత్యకరికాలన్ - సుందరచోళ చక్రవర్తి ప్రధమపుత్రులు - ఉత్తరపు సేనకు అధిపతిగా వుంటూ వస్తున్నారు. ఈ ఇద్దరిలో ఎవరు సింహాసనమెక్కడం న్యాయం? కులసంప్రదాయమేమి? మను నీతి ఏమి? తమిళనాడు పాత ఒరవడి ఏమి? ప్రధమపుత్రుని కుమారుడు మధురాంతకులు పట్టానికి రావడం న్యాయమా? లేక ద్వితీయుని మనుమడికి పట్టంకట్టడం తగునా? మీరొక్కొక్కరు మనసు విప్పి మీ అభిప్రాయాన్ని చెప్పాలి...''

''మొదటివారైన గండరాదిత్యుల కుమారుడైన మధురాంతకులు పట్టానికర్హులు. అదే న్యాయం, ధర్మం, సంప్రదాయం" అన్నారు శంబువరయ్యరే.

''నా అభిప్రాయమూ అదే", ''నేను చెప్పేదీ అదే" అని ఆ కూటమిలో ఒక్కొక్కరూ చెప్పుకొచ్చారు.

''మీ అభిప్రాయమే నా అభిప్రాయంకూడాను. మధురాంతకదేవరే పట్టానికర్హులు. కానీ, ఆ అర్హతను నెలకొల్ప ప్రయత్నించేందుకు మనమందరమూ సిద్ధంగావున్నామా? శరీరాన్ని, ప్రాణాన్ని, ఆత్మనూ ధారబోసేందుకు సిద్ధమా? ఈ నిమిషం దుర్గాదేవి పాదాలపై ఆన చేసేందుకు సిద్ధంగావున్నామా?'' అని పళువేట్టరయ్యర్ అడిగినప్పుడు అప్పటిదాకా లేని ఆవేశం ఆయన గొంతులోధ్వనించింది.

-:-

కూటమిలో కాసేపు మౌనం నెలకొంది. తర్వాత శంబువరయ్యర్, ''అలాగే దైవసాక్షిగా శపథం చేసేందుకు సిద్ధంగావున్నాము. కానీ, శపథం చేసేందుకు మునుపు మీరొక విషయం స్పష్టపరచాలి. యువరాజు మధురాంతకుల అభిప్రాయం ఏమి? ఆయన సింహాసనమెక్కి రాజ్యభారాన్ని మోయ సిద్ధమా? గండరాదిత్యుల కుమారులు లౌకికజీవనంపై విరక్తిగొని శివభక్తిలో పూర్తిగా నిమగ్నమైవున్నారని విన్నాము. రాజ్యమేలడంలో ఆయనకిష్టంలేదని పలువురు చెప్పడమూ విన్నాము. ఆయన తల్లి శెంబియన్ మహాదేవికి తన కుమారుడు సింహాసనమెక్కడం ఏమాత్రం ఇష్టంలేదనికూడా విన్నాము. మీనుంచి ఇందుగురించిన నిజాన్ని తెలుసుకోగోరుతున్నాము.''

''సరైన ప్రశ్న; తగిన సమయంలో అడుగుతున్నారు. దీన్ని విశదపరిచే బాధ్యతకూడా నాకువుంది. ముందే చెప్పివుండవలసింది. చెప్పనందుకు మన్నించండి,'' అని పీఠంపేసుకొని కూర్చొని పళువేట్టరయ్యర్ ఇలా చెప్పసాగారు:''శెంబియన్ మహాదేవి తన ఏకైకపుత్రుని రాజ్యకాంక్షనుంచి దూరంచేసేందుకు శివభక్తిమార్గంలోకి తీసుకువెళ్ళారన్న విషయం దేశంలో అందరూ ఎరిగిందే. కానీ ఇందుకు

మూలకారణం దేశానికీ తెలియదు, ప్రజలకూ తెలియదు. మధురాంతకదేవులకు రాజ్యమేలే కోరికవుందని తెలిస్తే ఆయన ప్రాణానికే అపాయం రావచ్చని పెద్దరాణిగారు (శెంబియన్ మహాదేవి) భయపడ్డదే కారణం..."

"ఆహా!", "అలాగా!" అన్న విస్మయపూరిత ధ్వనులు కూటమిలో వినిపించాయి.

"అవును; కన్నతల్లికి తన ఏకైకపుత్రుడు సింహాసనమెక్కడంకన్నా ప్రాణాలతోవుండాలనే ఆశేకదా అధికంగా ఉంటుంది? తల్లివాక్కే దైవవాక్కుగా ఎంచి మధురాంతకదేవులుకూడా మనసును విరక్తిమార్గంలోకి మళ్ళించుకొన్నారు. శివభక్తిలో పూర్తిగా మునిగివున్నారు. కానీ కొంతకాలంగా ఆయన మనసు కొద్దికొద్దిగా మారుతూ వస్తోంది. ఈ చోళసామ్రాజ్యం తమ హక్కు, దాన్ని ఏలడం తమ కర్తవ్యం అన్న భావం ఆయన మనసులో వేళ్ళూని పెరుగుతూ వస్తోంది. మీరందరూ ఆయనను ఆదరిస్తారని తెలిస్తే, బహిరంగంగా ముందుకువచ్చి చెప్పడానికికూడా సిద్ధంగావున్నారు...."

"అందుకు నిదర్శనమేమి?"

"మీ అందరికీ తృప్తినిచ్చే నిదర్శనాన్ని ఇప్పుడే మీముందుంచబోతున్నాను. అలా చేస్తే మీరందరూ ప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నారా?"

చాలాగొంతులు, "ఉన్నాము! ఉన్నాము!" అని ధ్వనించాయి.

"ఎవరి మనస్సులోకూడా ఇంకేవిధమైన సందేహంలేదు కదా?"

"లేదు! లేదు!"

"అలాగైతే ఇదిగో ఇప్పుడే ఆ నిదర్శనాన్ని మీముందుకు తెస్తున్నాను. వణంగాముడియార్ సందేహాన్నికూడా ఇప్పుడే తీర్చేస్తాను!" అని చెప్తూనే పళువేట్టరయ్యర్ లేచారు. గంభీరమైన నడకతో అక్కడే సమీపంలో వున్న మూసిన పల్లకి దగ్గరికి వెళ్ళారు.

"యువరాజా! పల్లకి తెర తొలగించుకొని బయటకు రావాలి. తమకోసం తమ తను, మన, ప్రాణాలను త్యాగంచేసేందుకు సిద్ధంగావున్న ఈ వీరాధివీరులకు తమ ముఖదర్శనమిచ్చి కరుణించాలి" అని మిక్కిలి వినయస్వరంతో అన్నారు.

పైన మేడ స్తంభం మరుగున కూర్చొని ఒక్క మాటకూడా విడిచిపెట్టకుండా ఆగని కుతూహలంతో వింటూవస్తున్న వంతిదేవుడిప్పుడు అతిజాగ్రతతో కిందకు చూశాడు. పల్లకి తెరను మునుపటిలాగానే ఒక చేయి పక్కకు తొలగించింది. అది బంగారు వన్నె చేయి. ముందొకసారి అతను చూసిన ఎర్రటి చెయ్యే. కానీ, అతను గాజులనుకొన్నది నిజానికి రాజకుమారుడు ధరించే కంకణమని ఇప్పుడు తెలిసింది. తక్షణం పూర్ణచంద్రునివంటి ముఖం అగుపించింది. మన్మధునికి దీటైన ఒక సుందరమైన ఆకారం పల్లకినుంచి బయటికి వచ్చి చిరునవ్వుతో నిలిచింది. ఆహా! గండరాదిత్యుల

కుమారులు మధురాంతకులా ఈయన!పల్లకిలో ఉన్నందువల్ల స్త్రీ అయివుండాలని అనుకొన్నది ఎంత తప్పిదమైంది? తనలాగానే పొరపాటుచేసిన ఆళ్వార్ కట్టియాన్ కూడా గోడపైనుంచి నిక్కి చూస్తున్నాడా అని అటువైపు చూశాడు. అక్కడ చెట్టునీడవల్ల ఏమీ కనిపించలేదు.

ఇంతలో కింద, "మధురాంతక దేవరు నూరేళ్ళుండనీ! పట్టపు యువరాజుకు జయహో! వీరవేల్!" అన్న ఆవేశపూరిత ధ్వానాలు లేచాయి. కూటమిలో ఉన్నవారందరూ లేచి నిలబడి తమతమ కత్తులను, శూలాలను పైకెత్తిపట్టుకొని పైవిధంగా ఘోషించడం వంతిదేవుడు చూశాడు. ఇక అక్కడవుండడం అపాయకరమని ఎంచి తానింతకుమునుపు పడుకొనివున్న చోటుకు వేగంగా వెళ్ళి పడుకొన్నాడు.

~~~
~~~

# అధ్యాయము - 9

## దారిలో సంభాషణలు

పాలాట్రు నదికి ఉత్తరంగా ఉన్న బీడుప్రదేశాలలో మాత్రమే తన జీవనకాలమంతా వెళ్లబుచ్చిన వాడవడంవల్ల వంతిదేవునికి పొంగుతున్న నదినీదడం రాదు. ఒకసారి ఉత్తరపెన్న ఎల్లలను కాపలా కాస్తున్నప్పుడు స్నానంచెసేందుకు నదిలోకి దిగాడు. ఒక పెద్ద సుడిగుండంలో చిక్కుకొన్నాడు. ఆ సుడిగుండం అతన్ని తిప్పి తిప్పి కొట్టింది. అదే సమయంలో అది అతన్నికిందకూ లాగనారంభించింది. అతివేగంగా ఆ సుడిగుండం అతని శక్తినంతా లాగేసుకొంది. "ఇక బతకలేం! సుడిగుండంలో మునిగి చావాల్సిందే!" అని వంతిదేవుడు నిరాశపడుతున్నప్పుడు దైవాధీనంగా నది సుడిగుండంనుంచి బయటపడ్డాడు. వరద అతన్ని కొట్టుకొనిపోయి తీరానికి చేర్చింది!

ఆ రాత్రి పళువూర్ భవనంలో అతను తిరిగి తన చోటికి పోయి పడుకొన్నప్పుడు సుడిగుండంలో చిక్కుకొన్నప్పటి గగుర్పాటే కలిగింది. ఒక పెద్ద రాజకీయ సుడిగుండంలో తన ప్రమేయం, ఇష్టంలేకుండానే పడి చిక్కుకొని విలవిల్లాడుతున్నట్లనిపించింది. ఆ నది సుడిగుండంనుంచి తప్పించుకొన్నట్లు ఈ రాజకీయ కుట్ర అనే సుడిగుండంనుంచి తప్పించుకోగలమా? దేవుడు తన్ని ఇంకోసారి కాపాడుతాడా?

అతనారోజు కడంబూర్ భవనంలో జరిగిన నడిరాత్రి సమావేశంనుంచి తెలుసుకొన్న విషయాలు అతన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. చోళసామ్రాజ్యానికి బయటినుంచి ఏర్పడ్డ ఇబ్బందులు తొలగి కొన్నేళ్ళు మాత్రమే గడిచాయి. యువరాజు ఆదిత్యకరికాలన్ మహావీరుడు; యుద్ధకళలో నిపుణుడు; రాజతంత్రంలో చాణక్యుడు. తన ధీశక్తిని, చోళసామ్రాజ్య సేన యొక్క పరాక్రమాన్ని ఉపయోగించి జంట మండలపు కృష్ణరాజు ఆధిక్యతను తొండైమండలంనుంచి కూకటివేళ్లతో పెకలించివేశాడు. దానితో బయటి అపాయాలు తొలగాయి. ఈ సమయంలో అంతర్కలహమూ, కుట్రా తలెత్తుతున్నాయి. బాహ్య కలహంకన్నా అపాయకరమైన ఈ అంతర్కలహం ఎటువంటి పరిణామాలకు దారి తీయబోతోంది?

చోళదేశపు పేరుగాంచిన వీరులు, మంత్రులు, పెద్దలు, అధికారులు కదా ఈ భయంకరమైన కుట్రలో పాల్గొంటున్నారు? పళువేట్టరయ్యర్ ,ఆయన తమ్ముడు ఎంతటివారు? వారి శక్తి ఏమి? పలుకుబడి ఏమి? ఈరోజిక్కడ చేరిన ఇతరులు మాత్రం ఏం తక్కువ? వారి పేరుప్రఖ్యాతులు, వీరపరాక్రమాలు, పలుకుబడి ఏమి? ఇటువంటి కూటమి చేరడం ఇదే మొదటిసారా? పళువేట్టరయ్యర్ మూసిన పల్లకిలో మధురాంతకులను తీసుకొని ఇంకెన్ని చోట్లకు వెళ్ళివున్నారో? అరెరే! పండువయసులో ఒక యువతిని పెళ్ళిచేసుకొన్నది ఎంత అక్కరకొచ్చింది!

చోళసింహాసనానికి అర్హులు ఆదిత్యకరికాలన్ అన్న విషయం గురించి ఈరోజువరకు వంతిదేవుని మనసులో ఎలాంటి సందేహంలేదు. దానికి ఒక పోటీ ఏర్పడవచ్చని కలలో కూడా అనుకోలేదు. గండరాదిత్యుల కుమారులు మధురాంతకుల గురించి అతను వినివున్నాడు. తండ్రిలాగానే కుమారుడు కూడా శివభక్తిపరాయణుడని తెలుసు. కానీ, ఆయన రాజ్యాన్నేలేందుకు అర్హుడనిగాని, దానికోసం పోటీ చేయగలవాడనిగాని ఇంతవరకు వినలేదు. ఆ ఆలోచనే అతన మనసులో కలగలేదు.

కానీ న్యాయాన్యాయాలు ఎలా? పట్టానికర్హులు నిజానికి ఎవరు? ఆదిత్యకరికాలన్‌గారా? మధురాంతకులా? ఆలోచించి చూస్తే ఇరుపైపులా న్యాయమున్నట్లు కనిపిస్తోంది. నిజంగా పోటీ జరిగితే, వీరిద్దరిలో ఎవరు గెలుస్తారు? తన కర్తవ్యమేమి? ఆహా! మనసులో ఏమేమో కోటలు కట్టుకొని కంచినుంచి ఈ యాత్రకు బయలుదేరాముగద? పట్టపు యువరాజు ఆదిత్యకరికాలన్‌కి తగినట్లు నడుచుకొని చోళసామ్రాజ్యంలో పెద్దపెద్ద పదవులు పొందవచ్చని కలలుగన్నాము కద! నెమ్మదిగా వాణర్ కులపు రాజ్యాన్ని కూడా తిరిగిపొందవచ్చని అనుకొన్నామే?...ఇదంతా సాధించేందుకు ఏ రెమ్మ పట్టుకొన్నామో అదే విరిగిపోయేటట్లుందే! ఇటువంటి చింతనతో రెండోసారి వచ్చి పడుకొన్న వంతిదేవుడు చాలాసేపు నిద్రపట్టక అవస్థపడ్డాడు. చివరికి రాత్రి నాలుగవ జాము గడిచి పొద్దు పొడిచే సమయానికి కాస్త కునుకు పట్టింది.

-:-

మర్నాడు పొద్దున సూర్యకిరణాలు చుర్రుమనిపించినప్పుడు కూడా వంతిదేవుడు లేవలేదు. గందమారన్ వచ్చి తట్టి లేపినప్పుడే అదరాబదరా లేచాడు.

"రాత్రి బాగా నిద్ర పట్టిందా?" అని గందమారన్ అతిథులను పరామర్శించేలా అడిగాడు. తర్వాత తానే, " అందరు అతిథులు నిద్రపోయిన తర్వాత వచ్చిచూశాను. నీవు బాగా కుంభకర్ణసేవ చేస్తున్నావు!" అన్నాడు.

వంతిదేవుడు మనసులో పొంగివచ్చిన ఆలోచనలన్నీ అదిమిపెట్టి, "కురవై ఆట చూసివచ్చి ఇక్కడ పడుకొన్నది మాత్రం తెలుసు. ఇప్పుడే లేస్తున్నాను. అరెరే! ఇంత పొద్దెక్కిపోయిందే! పొద్దుపొడిచి ఒక జామై ఉంటుందనిపిస్తోందే! నేను వెంటనే బయలుదేరాలి. గందమారా! గుర్రాన్ని ఆయత్తం చేయమని మీ పనిమనుషులకు చెప్పు!" అన్నాడు.

"బాగుంది! అంతలోపల నీవు బయల్దేరడమా? ఎందుకంత తొందర? పదిరోజులైనా నీవిక్కడ విడిదిచేసే వెళ్ళాలి!" అన్నాడు గందమారన్.

"లేదోయీ! తంజావూరులో నామామకు ఒంట్లో బాలేదు. బతకడమే దుర్లభమని సమాచారమందింది. కాబట్టి వీలైనంత త్వరలో వెళ్ళి ఆయనను చూడాలి. వెంటనే బయల్దేరాలి!" అని స్థిర నిర్ణయంతో అన్నాడు వల్లవరయ్యన్.

"అలాగైతే, తిరిగివచ్చేటప్పుడైనా, ఇక్కడ కొన్నిరోజులు ఉండి వెళ్ళాలి."

"దానికేమి? అప్పుడు చూసుకొందాము. ఇప్పుడు నేను బయల్దేరేందుకు సెలవివ్వు!"

"అంత తొందరపడకు. పొద్దుటి భోజనం చేసి బయల్దేరవచ్చు. నేనుకూడా కొళ్ళిడం నదివరకు నీతో వస్తాను."

"అదెలా కుదురుతుంది? ఎవరెవరో పెద్దపెద్ద అతిథులు వచ్చివున్నప్పుడు, వారిని వదిలేసి...."

"నీకన్నా పెద్ద అతిథి నాకెవ్వరూ లేరు!..." అన్న గందమారన్ చట్టున నిలిపేశాడు. "వచ్చినవారు పెద్ద అతిథులే. కానీ వారిని చూసుకోవడానికి మానాన్న ఉన్నారు. అంతఃపుర అధికారులుకూడా ఉన్నారు. నీతో నిన్న రాత్రికూడా నేనెక్కువ సేపు మాట్లాడలేదు. వెళ్ళేదారిలోనైనా నీతో కాసేపు సరదాగా మాట్లాడుకొంటేనే నా మనసు తృప్తిపడుతుంది. తప్పక కొళ్ళిడపు తీరంవరకు నీతో వచ్చేతీరుతాను!" అన్నాడు.

"నాకు ఆక్షేపణ ఏమీ లేదు. నీ ఇష్టం, నీ సౌకర్యం" అన్నాడు వంతిదేవుడు.

-:-

ఒక ఘడియ తర్వాత ఇద్దరు మిత్రులూ రెండు గుర్రాలెక్కి శంబువరయ్యర్ మాళిగ నుంచి బయల్దేరారు. గుర్రాలు మెల్లగానే వెళ్ళసాగాయి. ప్రయాణం చాలా సరదాగా గడిచింది. గాలికి దుమ్ము తమమీదికి ఎగిరి పడడంకూడా ఆ మిత్రులు పట్టించుకోలేదు. పాతజ్ఞాపకాలను నెమరువేసుకోవడంలో వారంత గాఢంగా నిమగ్నమైపోయారు.

కాసేపైన తర్వాత వంతిదేవుడన్నాడు: "గందమారా! నీయింట్లో ఒకేఒక్క రోజుండినా అది నాకెంతో ఉపయోగమైంది. అయితే ఒకేఒక్క ఆశాభంగం. నీ సహోదరి గురించి ఉత్తరపెన్న తీరంలో ఏమేమో వర్ణించి చెప్పావు. ఆమెను బాగా చూసేందుకు కూడా వీలుపడలేదు. మీ తల్లి వెనుక దాక్కొని నిల్చొన్నప్పుడు, ఆమె ముఖంలో ఎనిమిదో వంతు మాత్రమే చూడగలిగాను! అమ్మాయిలకు సిగ్గువుండాల్సిందేగాని మీ చెల్లెలికి కాస్త ఎక్కువే ఉంది."

గందమారన్ పెదవులు నోరు ఏదో చెప్పాలని తహతహలాడాయి. కానీ ఏమీ బయటకు రాలేదు.

"కానీ పరవాలేదు. నీవేకద నేను తిరిగివచ్చేటప్పుడైనా కొన్నిరోజులు ఇక్కడ ఉండాలన్నావు? అప్పుడు చూసి మాట్లాడితే చాలు. అంతలోపల మీ చెల్లాయి జంకుకూడా కాస్త తగ్గవచ్చుగద? గందమారా, నీ చెల్లెలి పేరేమన్నావు?"

"మణిమేఖల!"

"ఆహా! ఎంత ఇంపైన పేరు! పేరులాగానే అందమూ, గుణమూ ఉంటే..."

గందమారన్ అడ్డుపడి, "మిత్రమా! నీవు నా చెల్లెలిని మరిచిపో. ఆమెగురించి నేను చెప్పినదంతాను మరిచిపో. ఆమె ఊసే ఎత్తకు!" అన్నాడు.

"ఇదేమి గందమారా! తలకిందులుగా ఉందే సంగతి! నిన్న రాత్రికూడా నేను ఈ ఇంటికి అల్లుడిగా రావడంగురించి చూచాయగా అన్నావే!"

"నేనలా చెప్పింది నిజమే. కానీ తర్వాత పరిస్థితి మారిపోయింది. నాతలిదండ్రులు నా చెల్లాయిని ఇంకొకింటికి పెళ్ళిచేసి పంపేటట్లు తీర్మానించేశారు. మణిమేఖలకూడా అందుకు సమ్మతించేసింది!"

వంతిదేవుడు మనసులో, "మణిమేఖల నూరేళ్ళుండనీ!" అనుకొన్నాడు. ఆమెను ఎవరికివ్వాలని అనుకొనివుంటారని ఊహించడమేమంత కష్టమనిపించలేదు. మూసిన పల్లకిలో వచ్చిన మధురాంతకులకు ఇవ్వడానికే నిశ్చయించివుంటారు. మధురాంతకుల పక్షానికి బలం పెంపుజేయడానికి ఇలా బంధుత్వంకూడా ఏర్పరుచుకొంటున్నారు కాబోలు. పళువేట్టరయ్యర్ భలే తెలివిపరుడే!

"ఆహా! నిన్న వచ్చిన ధనవంతులైన అతిథుల్లో ఒకరిని అల్లుడుగా చేసుకొనేందుకు నిశ్చయించారు కాబోలు! గందమారా! ఇందులో నాకు అచ్చెరువూ లేదు; ఆశాభంగమూ లేదు. నేనొకవిధంగా ఎదురుచూసిందే..."

"ఎదురుచూశావా? అదెలా?"

"నాలాంటి ఒక బీద అనాధకు ఎవరు అమ్మాయినిస్తారు? ఇల్లూ ఊరూ లేనివాడిని ఏ అమ్మాయి ఇష్టపడుతుంది? ఎప్పుడో నా పూర్వీకులు రాజ్యమేలారంటే అదిప్పుడు దేనికొస్తుంది?"

"మిత్రమా! చాలు, ఆపు! నన్నుగురించి, నా కుటుంబాన్ని గురించి అంత లోకువగా మాట్లాడకు! నీవు చెప్పినదేదీ కారణంకాదు. వేరొక ముఖ్యకారణముంది. దాన్ని తెలుసుకొంటే నీవే ఒప్పుకొంటావు. కానీ నేనిప్పుడు దాన్ని బయటపెట్టలేను. సమయంవచ్చినప్పుడు నీవే తెలుసుకొంటావు!"

"గందమారా! ఇదేమి, నర్మగర్భమైన మాటలాడుతున్నావీరోజు?"

"అందుకు నన్ను మన్నించాలి. నీదగ్గరకూడా మనసువిప్పి చెప్పలేని ఒక పెద్ద కార్యమిది. ఏదేమైనా మన స్నేహం వమ్ము కాదని నమ్ము. విషయం బయటపడాల్సినప్పుడు, ఒక్క పరుగుతో వచ్చి నీకే మొట్టమొదట ఈ సంగతి చెబుతాను. అప్పటిదాకా నామీద నమ్మకంవుంచు. నేనెప్పుడూ నీచేయి వదలను. నన్ను నమ్ము!..."

"ఈ వాగ్దానంకోసం చాల వందనాలు. కానీ నాచేయి వదిలిపెట్టేటటువంటి పరిస్థితి ఏమని అర్థంకావడంలేదు! నేనలా ఇంకొకరిని నమ్మి బతికేవాడినికూడా కాదు, గందమారా! నా ఒరలోని కత్తిని, చేతిలోని శూలాన్ని మాత్రమే నమ్మినవాడిని!"

"నీవు నీ కత్తిని, శూలాన్నికూడా ఉపయోగించాల్సిన సమయంకూడా త్వరలో రావచ్చు. అప్పుడు మనమిద్దరం పక్కపక్క నిలబడి యుద్ధం చేద్దాం. అందువల్ల నీ ఉద్దేశ్యంకూడా నెరవేరవచ్చు..."

"ఇదేమి? ఏదైనా యుద్ధాన్ని త్వరలో ఎదురుచూస్తున్నావా? లేక, లంకలో జరుగుతున్న యుద్ధానికి వెళ్ళే ఉద్దేశ్యమేమైనా ఉందా?"

"లంకకా? అక్కడ జరుగుతున్న యుద్ధం గురించి నీవు వింటే అచ్చెరువొందిపోతావు! అక్కడవున్న మన వీరులకోసం మన చోళదేశంనుంచి బియ్యమూ, ఇతర తినుబండారాలూ వెళ్ళాలట! సిగ్గుచేటు! నేను చెప్తున్నది వేరే విషయం. కొంచెం ఓపికపట్టు. సమయంవచ్చినప్పుడు చెప్తాను. దయచేసి ఇప్పుడు నన్ను బలవంతం చేయకు!"

"సరే, సరే! నీకిష్టంలేకపోతే ఏమీ చెప్పకు. నోరుకూడా విప్పకు. అదిగో కొళ్ళిడం కనిపిస్తోంది!" అన్నాడు వంతిదేవుడు.

నిజంగానే కాస్త దూరంలో ఆ మహానది వెల్లువ కనిపించింది. కాసేపట్లో మిత్రులు నదీతీరం చేరారు.

-:-

ఆషాడమాసపు కొత్త వెల్లువ ఆ మహానది ఒడ్డు దాటి పారింది. అవతలి ఒడ్డు చాలా దూరంలో ఉన్నట్లనిపించింది. అవతలి ఒడ్డుపైనున్న పెద్ద చెట్లు చిన్నచిన్న చెట్లుగా కనిపించాయి. ఎర్రటి కొత్త వెల్లువ సుడులు, సుడిగుండాలతో ఒడ్డును తెంచుకొని పారుతుందేమోననిపిస్తుంది. హోరున శబ్దంచేసుకొంటూ సముద్రంపైపు ఉరకలు వేస్తున్న ఆ మహానదిని వంతిదేవుడు దిగ్భ్రమించి చూస్తూ నిలబడిపోయాడు.

'తోణి' వాగులో ఒక పడవ నిలబడివుంది. పడవ నడిపేవారిద్దరు చేతిలో తెడ్లతో సిద్ధంగా నిలబడివున్నారు. పడవలో అప్పటికే ఒకరు ఎక్కి కూర్చొనివున్నాడు. ఆయనను చూస్తే పెద్ద శివభక్త శిఖామణిలా కనిపించాడు.

ఒడ్డున వస్తూన్న ఈ ఇద్దరు మిత్రులనూ చూసి పడవ నడిపేవారిలో ఒకడు, "అయ్యా! పడవలో వస్తారా?" అని అడిగాడు.

"అవును. ఈయన వస్తున్నారు. పడవను కాస్త ఆపండి!" అన్నాడు గందమారన్.

ఇద్దరు మిత్రులూ గుర్రాలపైనుంచి కిందికి దూకారు.

"యోచించకుండా వచ్చేశానే! ఇప్పుడీ గుర్రాన్ని ఏం చేయడం? పడవలోకి ఎక్కించవచ్చా?" అని అడిగాడు వంతిదేవుడు.

"అవసరంలేదు. మనవెంటడే ఇద్దరు మనుషులు వచ్చివున్నారు. ఒకడు నీ గుర్రాన్ని

కడంబూరుకు తీసుకుపెళ్తాడు. ఇంకొకడు నీతో పడవలో వచ్చి అవతలి ఒడ్డున నీకింకొక గుర్రం సంపాదించి ఇస్తాడు!" అన్నాడు గందమారన్.

"ఆహా! ఎంత ముందాలోచన! నిజమైన స్నేహితుడంటే నీవేకదా!" అన్నాడు వంతిదేవుడు.

"నీవు ఈ కొళ్ళిడం నదికూడా పెన్నానదిలానే ఉంటుందని ఊహించుకొనివుంటావు. ఈ నదిని గుర్రాన్ని తీసుకొని దాటలేమని నీవనుకొని ఉండవు!"

"అవును; అలా మీ చోళదేశపు నదుల గురించి చులకనగా అనుకొన్నందు మన్నించు! అబ్బబ్బ, ఇదేమి నది! ఇదేమి పెల్లువ! సముద్రంలా కదా పొంగివస్తోంది!"

ఇద్దరు మిత్రులూ ఒకరినొకరు కౌగలించుకొని సెలవు తీసుకొన్నారు.

వంతిదేవుడు నదీతీరం వెంబడి నడిచిపెళ్ళి పడవెక్కాడు. గందమారన్ వెంటవచ్చిన ఒక మనిషి అతనితోబాటు పడవెక్కాడు.

పడవ కదిలేందుకు సిద్ధమైంది. పడవ నడిపేవారు తెడ్డువేయనారంబించారు.

ఉన్నట్లుండి, కొంతదూరంనుంచి, "ఆపు, ఆపు! పడవనాపు" అన్న కేక వినిపించింది.

నావికులు తెడ్డువేయడం కాసేపు నిలిపారు.

కేక వేస్తూ వచ్చిన వ్యక్తి అతివేగంగా ఒడ్డు చేరాడు. మొదటిచూపులోనే అతనెవరన్నది వంతిదేవునికి తెలిసిపోయింది. అతను ఆళ్వార్ కట్టియానే.

వస్తున్నది ఒక వైష్ణవుడని తెలిసినవెంటనే పడవలోవున్న శైవులు, "పోనీ, పోనీ, పడవను నిలపక ముందుకు పోనీ! ఆ పాషండునితో నేను ఈ పడవలో రాను. వాడు తర్వాతి పడవలొ రానీ!" అన్నారు.

కానీ వంతిదేవుడు నావికులను చూసి, "కాస్త ఆగండి. ఆయనకూడా రానీ! పడవలో చాలా స్థలంవుందికదా! ఎక్కించుకొని పోదాము!" అన్నాడు.

ఆళ్వార్ కట్టియాన్ వద్దనుంచి నిన్న రాత్రి జరిగిన సంఘటనలగురించి చాలావిషయాలు తెలుసుకోగోరాడు వంతిదేవుడు.

~~~
~~~

# అధ్యాయము - 10

## కుడంద్తై జ్యోతిష్కులు

కొడగు నాట పుట్టి పెరిగిన పొన్ని నది ఈడొచ్చిన తర్వాత తన నాధుడైన సముద్రుడి చెంతకు చేర ఉవ్విళ్ళూరింది. అడవులు, కొండలు, కోనలు దాటుకొని ఉరకలు పరుగులతో వెళ్ళింది. సముద్రరాజు దగ్గరపడేకొద్ది, తన నాయకుని చేరబోతున్నామన్న కుతూహలంతోటి మరింత ఉత్సాహంతో ఉప్పొంగి పారింది. ఇంకాస్త దూరంవెళ్ళాక, తన ప్రియుడిని హత్తుకొనేందుకు రెండు చేతులు పుట్టుకొచ్చాయి. రెండు చేతులను బారచాపి ముందుకు దూకింది. కానీ ఎదలో పొంగిన ఉత్సాహానికి రెండు చేతులు చాలవనిపించాయి. రెండు చేతులు నాలుగు, ఆరు నూరై పెరిగాయి.అన్ని చేతులనూ కుతూహలంతోటి ముందుకు చాచి సముద్రరాజు చెంతకు పరుగెట్టింది. ఆ పెళ్ళికూతురికి ప్రకృతిమాత చేసిన అలంకారాలేమో వర్ణనాతీతం! ఎన్నెన్ని అందమైన పచ్చని చీరలు కట్టబెట్టింది! ఎన్నెన్ని అందమైన పూలు ముడిచింది! ఎన్నెన్ని పరిమళద్రవ్యాలను పులిమింది!

ఆహా! రెండుతీరాలవెంబడి పెరిగిన పొన్న చెట్లు, కదంబ చెట్లు ముత్యాలు, రత్నాలవంటి పూలను పూయించి విరబోశాయి! దేవతలు కురిపించే పూలవర్షం దీనికి సాటి కాగలదా?

ఓ పొన్నీ! నిన్ను చూసి ఆనందించని స్త్రీలుంటారా? నీ సుందర అలంకారాలను చూసి మనసుప్పొంగని పడుచులుండగరా?

పెళ్ళికూతురిని చుట్టూ ఇరుగు పొరుగు అమ్మాయిలందరూ గుమిగూడినట్లు నీ చుట్టూ స్త్రీలు వచ్చి చేరడం సహజమే కదా!

పొన్ని తన నాధుడిని (సముద్రుడిని) ఆశతో కావలించుకోవడానికి చాచిన బంగారపు చేతులలో ఒకటే అరిసిలారు (నది)! కావేరీనదికి దక్షిణంవైపు అతిదగ్గరగా ఈ సొగసైన నది పారుతోంది. అలా ఒక నది ఉందని దగ్గరకు వచ్చిన తర్వాతే తెలుస్తుంది. నదికి రెండుతీరాలవెంబడి దట్టంగా పెరిగి ఆనదిని మరుగుపరుస్తున్న చెట్లే అందుకు కారణం. పుట్టినప్పటినుంచి అంతఃపురం దాటని రాజవంశపు కన్య అనే చెప్పవచ్చు ఆ సొగసైన నదిని. అతిలోకసుందరి ఆ నదీకన్య.

-:-

మంచిది; కాసేపు అంతఃపురంగురించి మరిచిపోయి పాఠకులు అరిసిలానదీతీరానికి వత్తురుగాక. తీరంవెంబడి దట్టంగా పెరిగిన చెట్లమధ్యనుంచి నదిదగ్గరికి వత్తురుగాక! ఆహా! ఏమీ కమనీయ దృశ్యం! అందానికే అందం అబ్బించేటట్లు, అమృతానికే తీయదనాన్ని కూర్చేటట్లుగదా ఉంది ఈ దృశ్యం!

చిత్రవిచిత్రంగా నిర్మించబడి చూడ బహుసుందరంగా ఉన్న ఆ నావలో ఆసీనులైవున్న ఆ

వనితామణులెవ్వరు? వారి మధ్య నాయకురాలిలాగ, నక్షత్రాల నడుమ పూర్ణచంద్రునిలాగ, ఏడేడు లోకాలను ఏలేందుకు పుట్టిన సామ్రాజ్ఞిలాగ వెలిగిపోతున్న ఆ నారీమణి ఎవ్వరు? ఆమెచెంత చేత వీణతో అమరివున్న శాంతసుందరి ఎవ్వరు? మధురస్వరంతో పాడుతూ ఈ నదీప్రవాహంతోబాటు సంగీతధారను ప్రవహింపజేస్తున్న ఈ గంధర్వకన్యలెవ్వరు? వారిలో ఒకరు మీనలోచని; ఇంకొకరు నీలలోచని. ఇంకొకరు పద్మముఖి; ఇంకొకరు పద్మలోచని. ఆహా! వీణను మీటుతున్న ఆ శాంతసుందరి వేళ్ల సౌందర్యాన్ని చూస్తూ మైమరచిపోవచ్చు.

ఆ సంగీతమాధుర్యాన్ని ఏమని వర్ణించగలం? ఆ సంగీతాన్ని వినేందుకే కద నదికూడ తన వెల్లువ శబ్దాన్ని ఆపివుంది? నదీతీరపు చెట్లపైకూర్చొన్న పక్షులు కూడ తమ కలకలారావాలను నిలిపి ఆ సుమధుర సంగీతాన్ని ఆస్వాదిస్తున్నాయిగద! అటువంటప్పుడు మనుషులా సంగీతాన్ని విని పరవశించడంలో ఆశ్చర్యమేముంది?

పడవలో వస్తున్న ఆ రమణీమణులు ఏం పాడుతున్నారో విందాం:

<< ఆ కమ్మని పాటను అనువదించవలసి ఉంది >>

ఈ తీయని పాటలను ఎక్కడో విన్నట్లుంది కదా? ఔను, '*సిలప్పధికారం* 'లోని పాటలే ఇవి. కానీ వీరు పాడుతున్నప్పుడు ఇంతకుమునుపెన్నడూ వినపించని ఇంపుదనం, ఆకర్షణ నింపుకొని అలరిస్తున్నాయి! వీరు పొన్ని నది అనుంగు చెలికత్తెలు కాబోలు! కాబట్టే అంత పరవశించి పాడుతున్నారేమో! ఆహా! భావమూ, గీతమూ ఎంత మధురంగా కలగలిసి అమృతధారగా ప్రవహిస్తున్నాయి! ఇదంతా ఒక స్వప్నలోకమై పాడుతున్నవారు, వింటున్నవారుకూడా అందులో కరిగిపోయేటటువంటి మాయాజాలమిది!

-:-

పడవ నెమ్మదిగా తేలివచ్చి చెట్లు కాస్త తెరపిచ్చిన చోట ఒడ్డుకు చేరింది. ఇద్దరు వనితలు పడవనుంచి దిగారు. అందులో ఒకరు ఏడేడులోకాలను ఏలగల గంభీరతను గొన్న నారీమణి. ఇంకొకరు వీణ తంతులపై తన సుతిమెత్తని వేళ్లను పరుగెట్టించి సుమధుర సంగీతాన్ని వినపించిన కోమలాంగి. ఇద్దరూ అందగత్తెలైనాకూడా ఒకరి అందానికి ఇంకొకరి అందానికి చాలా తేడావుంది. ఒకరిది ఎర్రతామరనుబోలిన గంభీరసౌందర్యం. ఇంకొకరిది కుముదపుష్పాన్నిబోలిన సుమధురసౌందర్యం. ఒకరు పూర్ణచంద్రబింబం; ఇంకొకరు ప్రాతఃకాలసూర్యబింబం; ఒకరు ఆడే నెమలి, ఇంకొకరు పాడే కోయిల. ఒకరు ఇంద్రాణి; ఇంకొకరు మన్మధుని ప్రేయసి. ఒకరు వేగవాహినియైన గంగానది; ఇంకొకరు సుడులు తిరుగుతూ పారే కావేరి.

పాఠకులను ఇంకా సందేహావస్థలో ఉంచక, వారెవరన్నది చెప్పబోతున్నాము. ఆ గంభీరవదనే

సుందర చోళచక్రవర్తుల ముద్దుల కూతురు కుందవై. చరిత్రలో రాజరాజచోళుడని కీర్తిగాంచిన అరుళ్మొళి వర్మ సహోదరి (అక్క).చిన్నరాణిగా ప్రజలచేత పిలువబడ్డ రాజకుమారి. రాజరాజచోళుని (అరుళ్మొళివర్మ) కుమారుడైన రాజేంద్రచోళుని పెంచిపెద్ద చేసి వీరాధివీరునిగా, రారాజుగా చేసిన ధీరవనిత.

ఇంకొకతె కుందవైదేవి చెలికత్తెగా కొనసాగే భాగ్యాన్ని పొందిన కొడుంబాళూర్ రాజకుమారి వాణతి. ముమ్ముందు చరిత్రలోనే సాటిలేని భాగ్యాన్ని పొందబోయే అదృష్టశాలి. ఈరోజు వినయమూ, శాంతమూ రూపుగొన్న ముగ్ధ.

-:-

ఈ ఇద్దరు వనితలు పడవనుంచి దిగారు. కుందవై మిగిలిన చెలికత్తెలను చూసి, "మీరిక్కడే ఉండండి. ఒక ఘడియలో వచ్చేస్తాము!" అన్నది. ఆ చెలికత్తెలందరు తమిళదేశంలో వేర్వేరు చిన్నరాజుల అంతఃపురాలలో పుట్టిన రాజకుమార్తెలు. కుందవైదేవికి చెలికత్తెలుగా ఉండేందుకు పళైయార్రై అంతఃపురానికి వచ్చారు. ఇప్పుడు కుందవైదేవి తమలో ఒక్కతెను మాత్రం వెంటతీసుకొని, 'వెంటనే తిరిగి వచ్చేస్తాను', అని వెళ్ళడం వారికి కాస్త ఏమార్పు, అసూయా కలిగించాయి.

ఒడ్డున గుర్రాలు పూన్చిన ఒక రథం సిద్ధంగావుంది. "వాణతి! రథంలోకెక్కు!" అన్నది కుందవైదేవి తన చెలికత్తెను చూసి. వాణతి ఎక్కిన వెంటనే తానూ రథమెక్కింది. రథం వేగంగా కదిలింది.

"అక్కా! మనమెక్కడికి వెళ్తున్నాము? నాకు చెప్పొచ్చా?" అని వాణతి అడిగింది.

"చెప్పకేం? కుడంద్రై జ్యోతిష్కుల ఇంటికి వెళ్తున్నాము!" అన్నది కుందవై.

"జోస్యుల ఇంటికి ఎందుకు వెళ్తున్నామక్కా? దేనిగురించి అడిగేందుకు?"

"ఇంకెందుకు? నిన్నుగురించి అడిగేందుకే. కొన్ని నెలలుగా నీవు మతిభ్రమించినట్లు ప్రవర్తిస్తున్నావా? అదీగాక అప్పుడప్పుడు నీకొంట్లోబాగుండట్లేదు. నీవీ ఇబ్బందులనుంచి ఎప్పుడు బయటపడుతావని అడిగేందుకే!"

"అక్కా! మీకు పుణ్యముంటుంది. నాకొంట్లో బాగానేవుంది. ఏఅనారోగ్యమూ, చిత్తభ్రమకూడాలేదు. కాబట్టి నాగురించి అడగనవసరంలేదు. తిరిగివెళ్ళిపోదాం!"

"లేదు తల్లీ, లేదు! నీగురించి అడిగేందుక్కాదు. నాగురించి అడిగేందుకే వెళ్తున్నాను."

"మీగురించి ఏమడిగి తెలుసుకోబోతున్నారు? జ్యోతిష్కులవద్ద ఏమడిగి తెలుసుకోబోతున్నారు?"

"నాకు పెళ్ళౌతుందా? లేక, చివరిదాక కన్యగానే మిగిలిపోతానా? అని అడగబోతున్నాను."

"అక్కా! దీనికి జోస్యులనడగాలేం? మీమనసునడిగితే తెలుస్తుంది కద? మీరొక్కసారి తలూపితే

చాలు! హిమాలయాలనుంచి కన్యాకుమారివరకున్న యాభై దేశాల రాజులు ఒకరితోఒకరు పోటీ వేసుకుని రారా? ఏల? సముద్రాలకవతల ఉన్న దేశాలనుంచి కూడా వచ్చి వాలుతారుగద? మీతో పాణిగ్రహణానికి ఎవరు పుణ్యంచేసివున్నారో కద? దాన్ని మీరు కద తీర్మానించవలసివుంది?"

"వాణతి! నీవు చెబుతున్నదంతా నిజమేనని అనుకొన్నా, అందుకు ఒక ఆటంకముంది. నేనే దేశరాజకుమారుని వరిస్తానో ఆ దేశానికి వెళ్లవలసివస్తుంది కదా? నాకీ పొన్ని నది పారే చోళదేశంవిడిచి వెళ్ళడం ఇష్టమేలేదు! నేనింకో దేశానికి వెళ్ళనని శపథం పూనివున్నాను..."

"అదొక అడ్డంకి కాజాలదు. మిమ్మల్ని వరించి పెళ్ళాడే ఏరాకుమారుడైనా మీపాదదాసుడై ఉంటాడు.ఇక్కడేవుండాలంటే ఉండిపోతాడు."

"ఆహా! పులిని పట్టి ఒళ్ళో కట్టిపెట్టుకొన్నట్లు, ఇంకోదేశపు రాకుమారుణ్ణి మనవూరిలోనే ఉంచేసుకోవాలనా సలహా ఇస్తున్నావు? అందువల్ల ఎన్నెన్ని కష్టాలొస్తాయో తెలుసా?"

"ఏదేమైనా, ఆడవారై పుట్టినవారు ఎప్పుడో ఒకరోజు పెళ్ళి చేసుకొనే తీరాలిగద?"

"అలా ఏ శాస్త్రంలోకూడా చెప్పలేదే, వాణతి! అవ్వయ్యారును చూడు! ఆమె చివరివరకు కన్యగానే జీవించి కవీశ్వరిగా వెలుగొందలేదా?"

"అవ్వయ్యార్ చిరుప్రాయంలోనే దేవుని వరంవల్ల వృద్ధాప్యంపొందింది.. మీరలా కాలేదుగద?"

"సరి, అలా ఒకవేళ పెళ్ళిచేసుకొన్నాకూడా, ఈ చోళదేశంలో ఒక అనాధుడైన ఒక వీరుణ్ణి పెళ్ళి చేసుకొంటాను. అప్పుడతను నన్ను తనతో ఇంకొక దేశానికి తీసుకువెళ్ళేందుకు ఆస్కారంవుండదు. ఇక్కడే మన చోళదేశంలోనే ఉండిపోతాడు."

"అక్కా! అలాగైతే ఈ చోళదేశం విడిచి వెళ్ళరుగద?"

"ఏనాటికీ వెళ్ళను. స్వర్గలోకానికి నన్ను రాణిని చేస్తామని చెప్పినా వెళ్ళను."

"అమ్మయ్య! ఇప్పుడు నామనసుకు నెమ్మదికలిగింది."

"అదేమే?"

"మీరు ఇంకోదేశానికి వెళితే నేనుకూడా మీతో వచ్చేతీరాలి. నేను మిమ్మల్ని విడిచిపెట్టి ఉండలేను. అదే సమయాన, ఈ చోళదేశాన్ని విడిచివెళ్ళడానికి కూడ మనసురావడంలేదు.."

"పెళ్ళైతే మనం విడిపోవలసిందేకదా?"

"నేను పెళ్ళే చేసుకోబోవడంలేదక్కా!"

"అరె! నాకు చేసిన ఉపదేశమంతా ఎక్కడికి పోయింది?"

"నేను మీలాగా?"

"ఒసే దొంగా! నాకంతా తెలుసు. నా కంట్లో దుమ్ముకొట్టవచ్చనా అనుకొంటున్నావు? నీకీ చోళదేశంపైన అభిమానమేంలేదు! నీవు ఆశపడుతున్న చోళదేశం కత్తి, శూలం ధరించి లంకకు కదా పోయివుంది? నీ అంతరంగం నాకు తెలియదుకొన్నావా?"

"అక్కా! నేనంత మూఢమతినా? సూర్యుడెక్కడ? మంచుబిందువెక్కడ? మంచుబిందువు సూర్యుని పొందుకోసం ప్రయత్నపడి ఏం ప్రయోజనం?"

"మంచుబిందువు చిన్నదే! సూర్యుడు పెద్దదే, ప్రకాశవంతమైనదే! కానీ, మంచుబిందువు సూర్యుని ప్రతిబింబాన్ని తనలో ఇముడ్చుకొంటోందా, లేదా?"

వాణతి ఉత్సాహపూరితస్వరంతో, "అలాగా చెప్తున్నారు? మంచుబిందువు కూడా సూర్యుని చేరవచ్చంటున్నారా?" అన్నది. తర్వాత ఉన్నట్లుండి నిరుత్సాహపడిపోయింది.. "మంచుబిందువు ఆశపడుతోంది; సూర్యుని తనలో చెరపడుతోంది. కానీ ఏం ప్రయోజనం? కాసేపటికల్లా సరైన శిక్షకు లోనౌతోంది. ఎండకు ఆవిరైపోయి, ఉన్నచోటుకూడ తెలియనట్లు మాయమైపోతోంది!"

"అలా అనుకోవడం తప్పు వాణతి! సూర్యుడు హిమబిందువు కోరిక తెలుసుకొని దాన్ని తనలో ఐక్యం చేసుకొంటున్నాడు. తానిష్టపడిన మంచుబిందువు పరపురుషుల కంట పడకూడదని సూర్యుని ఉద్దేశ్యం. రాత్రికాగానే మళ్ళీ బయటకు వదిలిపెట్టేస్తున్నాడు. మరుగైన హిమబిందువు మళ్ళీ ఉదయిస్తోందికదా?"

"అక్కా! మీరిదంతా నన్ను ఉత్సాహపరిచేందుకు చెప్తున్నారు."

"అలాగైతే నీ మనసులో ఏదో ఒక కొరతవుందని చెప్పు. ఇన్ని రోజులు, 'లేనే లేదు!' అని మొండిపట్టు పట్టావుగద! అందుకే ఇప్పుడు కుడంద్తై జ్యోతిష్కులవద్దకు వెళ్తున్నాను."

"నా మనసులో కొరతవుంటే ఆ జ్యోతిష్కులనడిగి ఏం ప్రయోజనం?" అనేసి, వాణతి పెద్దగా నిట్టూర్చింది.

-:-

కుడంద్తై జ్యోతిష్కుల ఇల్లు ఆ నగరిలో ఒకమూల కాళీమాత కోవెల దగ్గర ఒంటిల్లు. కుడంద్తై నగరిలోపలకు వెళ్ళకుండానే రథం నగరిని చుట్టుతిరిగి ఆ ఇంటిని చేరింది. రథసారథి రథాన్నిఎక్కడా నిలపకుండా వేగంగా నడుపుకొంటూ ఆఇంటికి చేర్చిన తీరుచూస్తే, అతను ఇంతకుమునుపు చాలాసార్లు అక్కడికి రథాన్ని నడుపుకొని వెళ్ళినట్లనిపిస్తోంది.

వారు ఆఇంటివాకిలి చేరేటప్పటికి ఒక శిష్యుడక్కడ ఆయత్తంగా నిలబడివున్నాడు. జ్యోతిష్కులు వచ్చినవారిని చాల భక్తిమర్యాదలతో స్వాగతించారు.

“మహాదేవీ!  ముగురమ్మల రూపంగొన్న తల్లీ!  వేంచేయాలి! వేంచేయాలి! ఈ పేదవాని గుడిశె చేసిన పుణ్యం, తమరు మళ్ళీ ఈ గుడిశెను వెతుక్కొని వచ్చారు!” అన్నారు.

“అయ్యా! ఈ వేళలో మిమ్మల్ని వెతుక్కొంటూ ఇంకెవ్వరూ రారుగద?” అని అడిగింది కుందవై.

“రారు, తల్లీ! ఇప్పుడంతా నాకోసం ఎక్కువమంది రావడమేలేదు. లోకంలో కష్టాలెక్కువైనప్పుడే ప్రజలు జోస్యులను వెతుక్కొంటూ వస్తారు.ఇప్పుడు మీ తండ్రి రాజ్యపాలనలో ప్రజలకు కష్టమనేదేలేదు. అందరూ సుఖసంతోషాలతో సకలసంపత్తులతో ఆనందంగా జీవిస్తున్నారు. నన్ను వెతుక్కొంటూ ఎందుకు వస్తారు?” అన్నారు జ్యోతిష్కులు.

“అలాగైతే నాకేదో కష్టం వచ్చినందువల్లనే మిమ్మల్ని వెతుక్కొంటూ వచ్చాననంటారు!”

“లేదు, తల్లీ! కానేకాదు! నవనిధులూ పొందిన పళైయారై ఏలిక ముద్దుల కూతురికి కష్టంవచ్చిందని ఏ గుడ్డివాడంటాడు! లోకంలో ప్రజలకు కష్టాలే లేకుండాపోవడంవల్ల ఈ జోస్యునికి మాత్రం కష్టంవచ్చింది. వీడిని చూసేవారెవరూ లేరు. కాబట్టి ఈ పేదవాని కష్టాలను తీర్చేందుకు అంబికలా వచ్చివున్నారు. తల్లీ! గుడిశె లోపలకు వచ్చి కరుణించాలి. ఇక్కడే మిమ్మల్ని నిలిపివేయడం నా అపచారం!” అని జ్యోతిష్కులు చమత్కారంగా అన్నారు.

రధసారధిని చూసి కుందవై, “రధాన్ని తీసుకువెళ్ళి, ఆలయం దగ్గర మర్రిచెట్టునీడలో నిలిపివుంచు!” అన్నది.

తర్వాత జ్యోతిష్కులు దారిచూపుతూ ముందువెళ్ళగా, కుందవై, వాణతి ఆయింటిలోనికి వెళ్ళారు.

జ్యోతిష్కులు తమ శిష్యుని చూసి, “అబ్బాయీ! వాకిలిదగ్గర జాగ్రత్తగా కాపలా కాస్తూ నిలబడివుండు. పొరబాటునకూడ ఎవరినీ లోపలికి రానీయకు!” అని హెచ్చరించారు.

-:-

రాజకుమారిని స్వాగతించేందుకు తగినట్లుగా జ్యోతిష్కుల ఇల్లు అలంకరించబడివుంది. గోడపైన ఒకవైపు అంబిక పటం అలంకరించబడివుంది. కూర్చోవడానికి రెండు పీటలు సిద్ధంగావున్నాయి. స్తంభదీపం వెలుగుతోంది. అక్కడక్కడా ముగ్గులు అందంగా కనిపించాయి. రాశిచక్రాలు వేసిన పలకలు, తాళపత్రాలు అక్కడక్కడా చెల్లాచెదరైవున్నాయి.

ఆ వనితామణులిద్దరు పీటలపై కూర్చొన్న తర్వాత, జోస్యులుకూడా కూర్చొన్నారు.

“అమ్మా! వచ్చిన కార్యమేమని చెప్పి నాపై దయవుంచాలి!” అన్నారు.

“జ్యోతిష్కులుగారూ! అదికూడా మీ జ్యోతిష్కశక్తి ఉపయోగించి తెలుసుకోకూడదా?” అన్నది

కుందవైదేవి.

"అలాగే తల్లీ!" అని చెప్పి జ్యోతిష్కులు కాసేపు కళ్ళు మూసుకొని ఏదో మంత్రం జపించారు.

తర్వాత కళ్ళు తెరిచి, "యువరాణీ! ఈ కన్నెపిల్ల జాతకం గురించి అడిగేందుకే ఈరోజు ముఖ్యంగా మీరు వచ్చివున్నారు. అలాగని దేవి పరాశక్తి చెబుతోంది. నిజమేనా?" అన్నారు.

"ఆహా! అద్భుతం! మీ శక్తిని ఏమని వర్ణించాలి? అవును, జ్యోతిష్కులుగారూ! ఈ అమ్మాయిగురించి అడిగేందుకే వచ్చాను. ఒక సంవత్సరానికి మునుపు ఈమె పళైయారై అంతఃపురానికి వచ్చింది. వచ్చి ఎనిమిది నెలలపాటు చాలా ఉత్సాహంగావుంటూ వచ్చింది. నా చెలికత్తెలందరిలో ఈమే నవ్వుతూ తుళ్ళుతూ సరదాగా ఉండేది. నాలుగు నెలలుగా ఈమెకేమో పట్టుకొంది. తరచుగా కళ్ళు తిరిగిపడిపోతోంది. ఏదో చిత్తభ్రమ పట్టుకొన్నట్లు ప్రవర్తిస్తోంది. నవ్వడమే మర్చిపోయింది. ఒంట్లో బాగానేవుంది అంటుంది. ఈమె కన్నవాళ్ళు రేపు వచ్చి అడిగితే ఏం చెప్పాలో తోచడంలేదు...."

"తల్లీ! కొడుంబాళూర్ రాణిగారి ముద్దుల కూతురే కదా వీరు? వీరి పేరు వాణతి కదా?" అని అడిగారు.

"అవును; మీకంతా తెలిసివుందే!"

"ఈ రాజకుమారి జాతకం నాదగ్గర ఉంది. సేకరించిపెట్టాను! కాస్త వేచివుండాలి!" అని చెప్పి, జ్యోతిష్కులు పక్కనేవున్న ఒక పాతపెట్టెను తెరిచి కాసేపు వెతికారు. తర్వాత, ఒక జాతకాన్ని తీసి శ్రద్ధగా పరిశీలించారు.

~~~
~~~

# అధ్యాయము - 11

## హఠాత్ప్రవేశం

ఇప్పుడు కుంభకోణం అని పిలువబడుతున్న నగరం, మన కథ జరిగిన కాలంలో కుడంద్రై, కుడమూక్కు అనే పేర్లతో పిలువబడేది. పుణ్యస్థల మహిమతో అది 'కుడంద్రై జ్యోతిష్కుల' వల్ల గొప్ప పేరుగాంచింది.

కుడంద్రై నగరానికి కాస్త దక్షిణ-పశ్చిమ దిశలో చోళుల తాత్కాలిక రాజధాని 'పళైయారై', ఆకాశాన్నంటే రాజభవనాలతో, ఆలయ గోపురాలతో విరాజిల్లేది.

పళైయారై అంతఃపురంలో నివసించిన, నివసిస్తున్న అందరి జాతకాలను ఆ జ్యోతిష్కులు సేకరించి భద్రపరిచివున్నారు. అలా సేకరించిన జాతకాలనుంచే ఆయన వాణతి జాతకాన్ని వెతికితీశారు.

కాసేపు జాతకాన్ని పరిశీలించిన తర్వాత, జ్యోతిష్కులు వాణతి ముఖాన్ని ఎగాదిగా చూశారు. మళ్ళీ జాతకాన్ని చూశారు. ఇలా జాతకాన్ని, ఆమె ముఖాన్ని మార్చి మార్చి చూస్తున్నారే తప్ప, నోరువిప్పి ఏమీ చెప్పేటట్లు కనిపించలేదు.

“ఏమి, జ్యోతిష్కులుగారూ! ఏమైనా చెప్పబోతున్నారా, లేదా?” అని అడిగింది కుందవై.

“తల్లీ! ఏం చెప్పను? ఎలా చెప్పను? మునుపొకసారి యధాలాపంగా ఈ జాతకాన్ని చూశాను. నాకే నమ్మశక్యంకాలేదు. ఇలాకూడా వుండవచ్చా అని సందేహంవచ్చి తిరిగిపెట్టేశాను. ఇప్పుడు ఈ అమ్మాయి ముఖారవిందాన్ని, జాతకాన్ని చేర్చి చూసినప్పుడు ఆశ్చర్యపడక తప్పడంలేదు!”

“ఆశ్చర్యపడండి! చాలినంత ఆశ్చర్యపడిన తర్వాత ఏదైనా సూచించండి!”

“ఇది మిక్కిలి అదృష్టజాతకం తల్లీ! తమరు అపార్థం చేసుకోరని చెప్తున్నాను - తమ జాతకంకన్న ఇది ఒక పాలు మేలైనది. ఇటువంటి అదృష్టజాతకాన్ని నేనింతవరకు చూసిందేలేదు!”

కుందవైదేవి చిరునవ్వు నవ్వింది. వాణతి సిగ్గుపడి, “అక్కా! ఈ దురదృష్టశాలిని ఈయన లోకమెరుగని అదృష్టశాలి అంటున్నారే! ఈయన మాటలన్నీ ఇలాగే ఉంటాయి కాబోలు!”

“అమ్మా! ఏమంటున్నారు? నేను చెప్పింది తప్పైతే నేను నా వృత్తినే వదిలిపెట్టేస్తాను!” అన్నారు జ్యోతిష్కులు.

“వద్దు, జ్యోతిష్కులుగారూ! వద్దు! అలా ఏం చేయకండి. ఏదో నలుగురికి మంచి మాటలు చెప్తూండండి. కానీ, ఏవో పైపైమాటలు చెప్తున్నారుగాని, ప్రత్యేకంగా సూచించి ఏమీ చెప్పలేదే? అందుకనే

ఈమె సందేహపడుతోంది!"

"విశదంగా చెప్పాలా? ఇదిగో చెప్తున్నాను! నాలుగు నెలలకు మునుపు అపశకునంలాగ తోచగల ఒక సంఘటన జరిగింది. ఏదో ఒక వస్తువు జారిపడింది. కానీ అది నిజానికి అపశకునంకాదు. దానినుంచే ఈ రాకుమారికి అన్ని అదృష్టాలు పట్టబోతున్నాయి!"

"వాణతి! నేనేం చెప్పాను? చూశావా?" అన్నది కుందవైదేవి.

"ముందే ఈయనకు మీరు చెప్పివుంచినట్లుందే!" అన్నది వాణతి.

"చూశారా, జ్యోతిష్కులుగారూ, ఈమె మాటలు!"

"అననీ, తల్లీ! ఇప్పుడు ఏమైనా మాట్లాడనీ!రేపు రారాజును పెళ్ళి చేసుకొన్నప్పుడు...."

"అలా చెప్పండి. కన్నెవయసు ఆడపిల్లలవద్ద పెళ్ళిమాటలు మాట్లాడితేనీ కద ఇష్టపడి వింటారు?..."

"అదే నేనూ చెప్పబోతున్నాను, తల్లీ! ఉన్నట్లుండి పెళ్ళి మాటెత్తకూడదు కద? ఎత్తితే, 'ఈ ముసలివాడికి పిచ్చిపట్టింది' అనుకొంటారు!"

"ఈమెకు వరుడెక్కడినుంచి వస్తాడు? ఎప్పుడు వస్తాడు? అతని గుర్తులేమి? జాతకంనుంచి ఇదంతా చెప్పగలుగుతారా, జ్యోతిష్కులుగారూ?"

"ఆహా! చెప్పలేకేం? బాగా చెప్పవచ్చు!" అని చెప్పి, జ్యోతిష్కులు మళ్ళీ జాతకాన్ని పరిశీలించారు. పరిశీలించి చూశారో, లేక అలా నటించారో, మనకు తెలియదు.

-:-

తర్వాత, తలెత్తి చూసి, "అమ్మా! ఈ రాకుమారికి వరుడు చాల దూరంనుంచి రానవసరంలేదు. సమీపంలో ఉన్నవాడే. కానీ ఆ వీరాధివీరుడు ఇప్పుడు ఈ దేశంలో లేడు. కడలిదాటి వెళ్ళివున్నాడు.!" అన్నారు జ్యోతిష్కులు.

ఇది విన్నవెంటనే కుందవై వాణతి వైపు చూసింది. వాణతి మనస్సులో పొంగిన భావాలను ఆమె అదిమిపెట్టాలనుకొన్నా సాధ్యంకాలేదు. ముఖంపైన కనిపించేశాయి.

"తర్వాత? అతనెవ్వడు? ఏకులంవాడు? కనిపెట్టేందుకు ఏమైనా గుర్తులున్నాయా?"

"బాగానే ఉన్నాయి. ఈ యువతిని పెళ్ళాడే భాగ్యశాలి చేతిలో శంఖ – చక్ర రేఖలుంటాయి, తల్లీ!"

మళ్ళీ కుందవై వాణతివైపు చూసింది. వాణతి కళ్ళు నేలను చూస్తున్నాయి.

"అలాగైతే, ఈమె చేతుల్లోనూ ఏవైనా గుర్తులుండకుండా ఉంటాయా?" అన్నది కుందవైదేవి.

"తల్లీ, ఈమె పాదాలను మీరెప్పుడైనా చూశారా?..."

"ఏంజ్యోతిష్కులుగారూ! నేనీమె కాళ్ళు పట్టుకోవాలంటున్నారా?"

"తల్లీ, నేనలా చెప్పలేదు! కానీ, రాబోయే రోజుల్లో వేలాది రాజవంశపు స్త్రీలు, పట్టమహిషులు, రాకుమార్తెలు, రాణులు, మహారాణులు ఈ మహిళామణి పాదాలను తాకే భాగ్యంకోసం తపించబోతున్నారు!"

"అక్కా! ఈ ముసలాయన నన్ను పరిహాసం చేస్తున్నారు. ఇందుకా మీరు నన్నిక్కడికి తీసుకొచ్చారు? లేవండి, వెళ్దాం!" అని నిజంగానే పొంగుకొచ్చిన కోపంతో అన్నది వాణతి.

"నీవెందుకు పేలుతున్నావే, అమ్మాయ్! ఆయన ఏమైనా చెప్పుకుపోనీ..."

"నేను ఏదో నోటికొచ్చింది చెప్పడంలేదు. అంతా ఈ జాతకంలో సూచించిన విధంగానే చూసి చెప్తున్నాను. 'పాదపద్మం' అని ఏదో కవులు ఊరికే వర్ణిస్తుంటారు. కానీ, ఈమె అరికాలు కాస్త చూపించమనండి. ఎర్రతామర రేఖలు తప్పకుండా ఉంటాయి..."

"చాలు, జ్యోతిష్కులుగారూ! ఈమె గురించి ఇంకా ఏమైనా చెప్తే, నన్ను చేయిపట్టుకొని లాక్కొని వెళ్ళిపోతుంది. అదలావుండనీ. ఈమెకు రాబోయే భర్తగురించి కాస్త చెప్పండి...."

"ఓ! అలాగే చెప్తాను! ఈమె చేయిపట్టే పురుషుడు వీరాధివీరుడైవుంటాడు! నూరేసి యుద్ధాలలో ముందునిలిచి విజయమాలలు పొందుతాడు. రాజాధిరాజౌతాడు; వేలాది రాజులు చేరి అమర్చిన సింహాసనంపై కూర్చొని బహుకాలంపాటు పరిపాలిస్తాడు..."

"మీరన్నది నేను నమ్మను; అదెలా సాధ్యం?" అని అడిగిన కుందవైదేవి మోముపై కుతూహలమూ, సంతోషమూ, సందేహమూ, దిగులు కలగలిసి తాండవమాడాయి.

"నేనూ నమ్మడంలేదు. ఈయన ఏదో అనుకొని ఇంకెదో చెప్తున్నారు. ఇలా చెప్తే మీరు సంతోషపడుతారని చెప్తున్నారు!" అన్నది వాణతి.

"ఈరోజు మీరు నమ్మకపోతే ఫరవాలేదు. ఒక రోజు నమ్మేతీరుతారు. అప్పుడు ఈ పేద జ్యోతిష్కుని మరిచిపోకండి..."

"అక్కా! మనం వెళదామా?" అని మళ్ళీ అడిగింది వాణతి. ఆమె నల్లని కనుకొనల్లో రెండు కన్నీటిబిందువులు తొంగిచూశాయి.

"ఇంక ఒకేఒక్క విషయం చెప్పేస్తాను. ఆ తర్వాత బయలుదేరండి. ఈ రాకుమారిని వరించబోయే వీరునికి ఎన్నెన్నో అపాయాలూ, గండాలు ఎదురౌతాయి. పగవారు చాలామంది..."

"అయ్యో!"

"కానీ, అన్ని అపాయాలు, గండాలు చివరికి ఎగిరిపోతాయి. పగవారు నాశనమైపోతారు. ఈ దేవిని పొందే నాయకుడు అన్ని ఆటంకాలను దాటి మహోన్నత స్థితిని చేరుతాడు..దీనికన్న ముఖ్యమైన సంగతి ఇంకొకటుంది, తల్లీ! నేను వయసుమళ్ళిన వాడిని. కాబట్టి ఉన్నది ఉన్నట్లు దాచకుండా చెప్పేస్తున్నాను. ఎప్పుడైనా ఒకరోజు మీరీ అమ్మాయి కడుపు చూడండి. ఈమె కడుపుపైన మర్రాకు రేఖలు లేకుంటే నేను ఈ జ్యోతిష్కవృత్తినే వదిలేస్తాను..."

"మర్రాకు రేఖలలో ఏం విశేషం, జ్యోతిష్కులుగారూ?"

"వటపత్రశాయి ఎవరని తెలియదా, తల్లీ? ఆ మహావిష్ణువు అంశతో ఒక పిల్లవాడు ఈమె కడుపున పుడుతాడు. ఈ వనిత నాయకునికేమో అనేక గండాలు, అపాయాలు ఎదురౌతాయి. కానీ ఈమె కుమారునికి అటువంటి ఆటంకాలే లేవు. అతను అనుకొన్నదంతా చేకూరుతుంది; చేపట్టిన కార్యాలన్నీ జయమౌతాయి; అతను పట్టినదంతా బంగారమౌతుంది; కాలుపెట్టిన తావులన్నీ అతని పాలనకిందకు వస్తాయి; చూసిన చోట పులిజెండా ఎగురుతుంది. తల్లీ! ఈమె కుమారుని సైన్యం పొన్ని నది కొత్త వరదలాగ ఎటువంటి ఆటంకంలేకుండా ముందుకు సాగుతుంది. విజయలక్ష్మి చేతులుకట్టుకొని అతనిముందు నిలబడుతుంది. అతని మాతృభూమి ఖ్యాతి ముల్లోకాలకు వ్యాపిస్తుంది. అతని కులకీర్తి లోకమంతటా నెలకొంటుంది!..."

ఇలా జ్యోతిష్కులు ఆవేశం వచ్చినవానిలాగ చెప్తున్నప్పుడు, కుందవైదేవి ఆయన మాటలు ఒక్కటికూడ పొల్లుపోకుండా శ్రద్ధగా విన్నది.

"అక్కా!" అన్న దీనమైన స్వరం విని అదిరిపడి తిరిగిచూసింది.

"నాకు ఏమో ఔతోంది!" అని మళ్ళీ దీన, హీనస్వరంతో చెప్పి, ఉన్నట్లుండి నేలపై ఒరిగింది.

"జ్యోతిష్కులుగారూ! వెంటనే కొంచెం నీళ్ళు తీసుకురండి!" అని చెప్పేసి, కుందవైదేవి వాణతిని ఎత్తి ఒడిలో వేసుకొంది. జ్యోతిష్కులు నీరు తీసుకొని వచ్చారు. కుందవై నీళ్ళు వాణతి ముఖంపైన నీళ్ళు చల్లింది.

"ఏమీ వాటిల్లదు, తల్లీ! కంగారుపడకండి..." అన్నారు జ్యోతిష్కులు.

"ఏ దిగులూ లేదు. ఈమెకిది అలవాటే. ఇలాగ ఇంతకుమునుపు ఐదారుసార్లు జరిగింది! కాసేపటికి కళ్ళు తెరిచి లేస్తుంది. లేచినవెంటనే ఇది భూలోకమా, కైలాసమా అని అడుగుతుంది!" అన్నది కుందవై.

తర్వాత, మెల్లని స్వరంతో, "జ్యోతిష్కులుగారూ! ముఖ్యంగా ఒకవిషయం మిమ్మల్ని అడగడానికే వచ్చాను. దేశమంతటా ప్రజలు ఏదేదో మాట్లాడుకొంటున్నారటకదా? ఆకాశంలో కొన్ని రోజులుగా తోకచుక్క కనిపిస్తోందికదా? వీటిలో నిజంగా ఏమైనా అంతరార్థం ఉందా? రాజ్యానికి ఏదైనా ఆపత్తు

కలుగబోతోందా? ఏదైన మార్పిడి, సంక్షోభాలు ఏర్పడుతాయా?'' అని యువరాణి అడిగింది.

''అది మాత్రం నన్నడగకండి, తల్లీ! దేశాలు, రాజ్యాలు, రాజ్యాంగ కార్యక్రమాలు - వీటన్నిటికీ జాతకాలూ లేవు, జోస్యం చెప్పేందుకూ వీలుకాదు. నేను నేర్చిన విద్యలో అవన్నీ లేవు. జ్ఞానులు, ఋషులు, మహాత్ములు, యోగులు ఒకవేళ జ్ఞానదృష్టితో చెప్పగలరేమో. ఈ పేదవానికి ఆ శక్తిలేదు. రాజకీయవిషయాలలో దిన, వార, నక్షత్ర, జాతకాలు నిశ్శక్తమైపోతున్నాయి...''

''జ్యోతిష్కులుగారూ! చాలా సమర్థవంతంగా మాట్లాడుతున్నారు. రాజకీయాలకు జాతకం చూడనవసరంలేదు. కానీ, మా తండ్రిగురించి, నా సహోదరులగురించి చూసి చెప్పవచ్చుగద? వారి జాతకాలు చూస్తే, రాజ్యాంగపు జాతకం చూసినట్లే కద?''

''సావకాశంగా ఇంకొకరోజు చూసి చెప్తాను, తల్లీ! ఇది సంక్షోభాలు, అపాయాలు నిండిన కాలం. అందరూ కాస్త జాగ్రతగా ఉండవలసిందే...''

''జ్యోతిష్కులుగారూ! నా తండ్రి - చక్రవర్తి - పళైయారై విడిచిపెట్టి, తంజావూరు వెళ్ళినప్పటినుంచి నాకు చాల దిగులుగా ఉంది...''

''ముందే చెప్పానుగదా, తల్లీ! మహారాజుకు పెద్ద గండం ఉంది. మీ కుటుంబానికి పెద్ద అపాయాలున్నాయి. దుర్గాదేవి కరుణామహిమ వల్ల అన్నీ నివృత్తి అవుతాయి.''

''అక్కా! మనమెక్కడ ఉన్నాము?'' అన్న వానతి దీనస్వరం వినవచ్చింది.

కుందపై ఒడిలో తలపెట్టుకొని పడుకొనివున్న వాణతి నల్లతుమ్మెద రెక్కలవంటి తన కనురెప్పలను టపటపలాడించి చుట్టూ చూసింది.

''ముద్దూ! చిన్నారీ! మనమింకా ఈ భూలోకంలోనే ఉన్నాము! స్వర్గలోకానికి తీసుకొని వెళ్ళేందుకు పుష్పకవిమానం ఇంకా రాలేదు! లేలే! మన గుర్రాలు పూన్చిన రథంలోనే అంతఃపురానికి వెళ్దాం!'' అన్నది కుందవైదేవి.

-:-

వాణతి లేచి కూర్చొని, ''నేను మైకంవచ్చి పడిపోయానా?'' అని అడిగింది.

''మైకంకాదు! అక్క ఒడిలో పడుకొని కాసేపు నిద్రపోయావు. లాలిపాట పాడాను. వినిపించలేదా?''

''కోపించుకోకండక్కా! నాకు తెలియకుండానే తల తిరిగి పడిపోయాను.''

''ఔనౌను. అలాగే తల తిరుగుతుందిలే! ఈ జ్యోతిష్కులు నాక్కూడ అలాంటి జోస్యం చెప్పివుంటే నాక్కూడా తలతిరిగే ఉంటుంది....''

“అందువల్ల కాదు. అక్కా! ఈయన చెప్పినదంతా నేను నమ్మేశానా?”

“నీవు నమ్మావో, లేదో? కానీ, జ్యోతిష్కులు బెదిరిపోయారు! నీలాంటి బెదురుగొడ్డును ఇకమీదట ఎక్కడికీ పిల్చుకొని పోకూడదు...”

“నేను జోస్యులవద్దకు రానని చెప్పానుగదా? మీరేగద...?”

“నా తప్పే. లే. వెళ్దాం. వాకిలిదాకా నాలుగడుగులు నడవగలవా? లేక చంకలో ఎత్తుకొని తీసుకెళ్ళాలా?”

“వద్దు, వద్దు! బాగానే నడవగలను.”

“కాస్త ఆగండి, తల్లీ! దేవి ప్రసాదం ఇస్తాను, తీసుకొని వెళ్ళండి" అని జ్యోతిష్కులు జాతకపత్రాలను చుట్టిపెట్టనారంభించారు.

“జ్యోతిష్కులుగారూ! నాకేమేమో చెప్పారు. అక్కకు ఏమీ చెప్పనేలేదే?” అని వాణతి అన్నది.

“అమ్మా! యువరాకుమారికి అన్నీ చెప్పివున్నాను. ఇంకా ఏం చెప్పాలి?”

“అక్కను పెళ్ళాడబోయే వీరాధివీరుడు...”

“అసహాయశూరుడు" అని కుందవై అడ్డుపడి అన్నది.

“సందేహమేమి? మహాపరాక్రమశాలియైన రాకుమారుడు...”

“ముప్పైరెండు సాముద్రికా లక్షణాలూ కలిగినవాడు; బుద్ధిలో బృహస్పతి; విద్యలో సరస్వతి; అందంలో మన్మధుడు; వీరత్వంలో అర్జునుడు!”

“యువరాకుమారికి తగిన ఆ సుకుమారుడైన రాకుమారుడు ఎక్కడినుంచి ఎప్పుడు వస్తాడు?...”

“వస్తున్నారు, తల్లీ! వస్తున్నారు! తప్పకుండా రాబోతున్నారు! అతిత్వరలోనే వస్తారు.”

“ఎలా వస్తారు? గుర్రంపైన వస్తారా? రధమెక్కి వస్తారా? ఏనుగుపైన వస్తారా? కాలినడకన వస్తారా? లేక నేరుగా ఆకాశంనుంచి చూరు చీల్చుకొని వచ్చి దూకుతారా!” అని కుందవైదేవి పరిహాసంగా అడిగింది.

“అక్కా! గుర్రపు కాలి చప్పుడు వినిపిస్తోంది!” అని వాణతి కాస్త ఆదుర్దాగా అన్నది.

“ఎవ్వరికీ వినిపించనిది నీకుమాత్రం విచిత్రంగా వినిపిస్తుంది!”

“లేదు. తమాషాకు చెప్పలేదు. ఇదిగో వినండి!”

అప్పుడు నిజంగానే వీధిలో ఒక గుర్రం వేగంగా వస్తున్న శబ్దం వినిపించింది.

“వింటే ఏమే? కుడంద్దై పట్టణపు వీధుల్లో గుర్రాలు తిరుగాడకుండ ఉంటాయా?” అన్నది కుందవై.

“లేదు. ఇక్కడికే వస్తున్నట్లనిపిస్తోంది!”

“నీకన్నీ విచిత్రంగానే తోస్తాయి. లే, వెళ్దాం!”

-:-

అదేసమయంలో ఆఇంటి వాకిట ఏదో గడబిడ వినిపించింది. ఏవోగొంతులూ వినిపించాయి.

“ఇదేకదా జ్యోతిష్కుల ఇల్లు?”

“అవును; నీవెవ్వరు?”

“జ్యోతిష్కులు ఉన్నారా?”

“లోపల పోకూడదు!”

“నేను వెళ్ళే తీరుతాను!”

“వదలను!”

“జ్యోతిష్కులను చూడాలి!”

“తర్వాత రా.”

“తర్వాత రావడం కుదరదు. నేను చాలా తొందరలో ఉన్నాను"!

“అరే! నిలు! నిలు!”

“ఛట్! తొలగవతలికి! నన్నడగించకు, చంపేస్తాను...”

“అయ్యో, అయ్యో! వద్దు, లోపలికి వెళ్లవద్దు!” - ఇటువంటి గందరగోళమైన అరుపులు మరీ దగ్గరగా వినపించసాగాయి. ధడేల్మని వాకిలి తలుపు తెరుచుకొంది.

అంత ఆర్భాటంగా హఠాత్ప్రవేశం చేశాడా యువకుడు!

అతని వెన్వెంటనే అతని భుజాలు పట్టుకొని వెనక్కు లాగేందుకు ఒకతను ప్రయత్నించడం అగుపడింది.

యువకుడు కష్టపడుతూ గడపదాటి లోపలికొచ్చాడు.

వచ్చిన యువకుడెవరని పాఠకులు ఊహించవచ్చు. మన వీరుడు వంతిదేవుడే!

ఇంటిలోపల ఉన్న ముగ్గురి కళ్ళూ ఒకేసారి అతన్ని చూశాయి.

-:-

వంతిదేవుడుకూడ లోపల ఉన్న వారిని చూశాడు. కాదు; లోపలవున్న వారిలో ఒకరిని మాత్రమే చూశాడు. అదికూడా కాదు. కుందవైదేవిని అతను పూర్తిగా చూడలేదు. ఆమె సుందరవదనాన్ని మాత్రమే చూశాడు. ముఖారవిందాన్ని కూడా పూర్తిగా చూశాడా అంటే, అది కూడా లేదు! గగుర్పాటువల్ల కాస్త విప్పారిన పగడాలవంటి ఎర్రని పెదవులను చూశాడు. గంభీరమూ, ఆశ్చర్యమూ, అల్లరి నవ్వూ కలిసి విప్పారిన కళ్ళను చూశాడు. కనురెప్పలను, నల్లని కనుబొమలను చూశాడు; దంతవర్ణపు నుదుటిని చూశాడు; కుంకుమలాగ ఎరుపెక్కిన చెంపలను చూశాడు. ఇంతటినీ ఒక్క క్షణంలో వేర్వేరుగా చూశాడు. వేర్వేరుగా అవి అతని మనసులో పదిలమైనాయి.

ఇదంతా కొన్ని క్షణాలు మాత్రమే. వెంటనే చట్టున తిరిగి జ్యోతిష్కుల శిష్యుని చూసి, "ఏమయ్యా! లోపల ఆడవాళ్ళున్నారని చెప్పకూడదా? చెప్పివుంటే నేనిలా వచ్చివుంటానా?" అని అంటూనే శిష్యుని అవతలకు తోసేస్తూ మళ్ళీ గడప దాటాడు. కానీ, వెళ్ళేముందు ఇంకొకసారి కుందవైదేవిని మళ్ళీ తిరిగిచూసేసే వెళ్ళాడు. "ఓయబ్బ! సుడిగాలి వీచి నిలిచినట్లు కదావుంది!" అన్నది కుందవై యువరాకుమారి.

"ఇంకా తెరపివ్వలేదు. అదిగో వినండి!" అన్నది కొడుంబాళూర్ రాకుమారి.

వాకిట వంతిదేవునికి, జ్యోతిష్కుల శిష్యునికి మధ్య ఇంకా తర్కం జరుగుతూంది.

"జ్యోతిష్కులుగారూ! ఈయన ఎవరు?" అని అడిగింది కుందవైదేవి.

"తెలియదు, తల్లీ! ఎవరో బయటి ఊరివానిలాగా కనిపిస్తున్నాడు. చాలా మొరటబ్బాయిలాగ కనిపిస్తున్నాడు."

కుందవై ఉన్నట్లుండి ఏదో తలుచుకొని గలగలా నవ్వింది.

"ఎందుకక్కా, నవ్వుతున్నారు?"

"ఎందుకా? నా కాబోయే నాథుడు గుర్రంపైన వస్తాడా, ఏనుగుపైన వస్తాడా, లేక చూరునుంచి దూకుతాడా అని మాట్లాడుకొంటూ ఉన్నాముకద, అది తలుచుకొని నవ్వొచ్చింది!"

ఇప్పుడు వాణతికూడా నవ్వాపుకోలేకపోయింది.

వీరి నవ్వులు అలలై లేచాయి.

జ్యోతిష్కులు దీర్ఘాలోచనలో మునిగిన వారై, ఇద్దరు రాకుమార్తెలకు కుంకుమ ఇచ్చారు.

కుంకుమ తీసుకుని ఇద్దరూ పీటలపైనుంచి లేచి ఇంటి బయటకు వచ్చారు.

జ్యోతిష్కులుకూడా వెంట వచ్చారు.

ఇంటివాకిట కాస్త పక్కకు ఒదిగి నిలబడ్డ వంతిదేవుడు, మహిళామణులిద్దరిని చూసిన వెంటనే,

“మన్నించాలి. లోపల స్త్రీలున్నారని ఈ బుద్ధిశాలి నాకు చెప్పలేదు. అందుకే అలా తొందరపాటుతో వచ్చాను. అందుకు క్షమించాలి!” అని ఉద్విగ్న స్వరంతో అన్నాడు.

కుందవై వికసించిన ముఖంతో అల్లరి, పరిహాసం కలిసి ఉప్పొంగిన కనులతో వంతిదేవుని ఒకసారి ఎగాదిగా చూసింది. ఒకమాటకూడా ఉత్తరమివ్వలేదు. వాణతిని ఒక చేత్తోపట్టుకొని మర్రిచెట్టునీడలో నిలిపివున్న రథంవైపు నడిచింది.

“కుడంద్దై నగరపు స్త్రీలకు మర్యాదే తెలియదు కాబోలు. ఏమర్రా, ఒక మనిషి తనకుతానే వచ్చి మాట్లాడుతున్నాడనైనా ఎంచి ఒక మాట బదులు చెప్పి వెళ్ళకూడదా?” అని వంతిదేవుడు గట్టిగా చెప్పడం వారి చెవిన పడింది.

రథానికి గుర్రాలను పూన్చి సిద్ధంగావుంచి ఉన్నాడు రథసారథి.

యువరాకుమార్తెలిద్దరు ఎక్కి కూర్చొన్నతర్వాత, సారథికూడా ఎక్కి తన స్థానంలో కూర్చొన్నాడు.

రథం అరిసిలార్ నది వైపు వేగంగా సాగింది.

వంతిదేవుడు రథం కనుమరుగయ్యే వరకు చూస్తూ నిలబడ్డాడు.

~~~
~~~

# అధ్యాయము - 12

## నందిని

కొళ్ళిడం నదీతీరంలో మనం పడవనెక్కించి వదిలిపెట్టిన వంతిదేవుడు ఆసమయాన జ్యోతిష్కుల ఇంటికి ఎలా చేరాడన్నది చెప్పాలిగద?

ఆళ్వార్ కట్టియాన్ పడవలో ఎక్కడాన్ని ఆక్షేపించిన శివభక్తులు, పడవ కదిలిన వెంటనే, “తమ్ముడూ! నీకోసం పోతేపోనీ అని వీడిని ఎక్కనిచ్చాను. కానీ, పడవలో ఉన్నంతవరకు వీడు ఆ ఎనిమిదక్షరాల పేరెత్తకూడదు. ఎత్తితే, వీడిని ఈ కొళ్ళిడం నదిలోకి ఎత్తి విసిరేయమంటాను. పడవ నడిపేవాళ్ళు నా మనుషులు!” అన్నారు .

“నంబి దాసులూ! తమ శ్రీశ్రవణాలలో ఆ మాటలు పడ్డాయా?” అని అడిగాడు వంతిదేవుడు.

“ఈయన ఐదక్షరాల పేరెత్తకపోతే నేనూ ఎనిమిదక్షరాల శ్రీ నామాన్ని ఎత్తను!” అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

“సాక్షాత్తు శివపెరుమాళ్ శ్రీమంత్రాన్ని చెప్పకూడదని చెప్పడానికి వీడెవడు? వీల్లేదు! వీల్లేదంటే వీల్లేదు!” అని చెప్పి ఒక శివ శ్లోకాన్ని చెప్పారు.

వెంటనే, ఆళ్వార్ కట్టియాన్ పెద్దగా విష్ణుకీర్తనలను పాడ మొదలుపెట్టాడు.

“శివ, శివా!” అని శివభక్తుడు తన రెండు చెవులనూ మూసుకొన్నాడు.

ఆళ్వార్ కట్టియాన్ పాడడం ఆపినవెంటనే ఆయన చెవులనుంచి వేళ్ళను తీశాడు.

ఆళ్వార్ కట్టియాన్ వంతిదేవుని చూసి, “తమ్ముడూ, నీవే ఆ వీరశైవుని కాస్త అడుగు. ఈయన శ్రీవారి పేరు వినేందుకే ఇంత కష్టపడుతున్నాడే? శ్రీరంగంలో నెలకొన్న పెరుమాళ్ళ పాదపద్మాలను కడిగేకదా ఈ కొళ్ళిడం నది ఇక్కడికి దిగి వస్తోంది? పెరుమాళ్ళ పాదాలు తాకిన పుణ్యతీర్థమనే కదా శివపెరుమాళ్ తిరువాణైకావల్ లో ఆ నీటిలో మునకవేసి తపస్సుకు కూర్చొన్నాడు?” అని ఆళ్వార్ కట్టియాన్ చెప్పి ముగించేలోపల ఆ వీరశైవుడు అతనిపైకి లంఘించాడు. పడవలో ఒక వైపు ఆఇద్దరు కుస్తీపట్లు పట్టడంతో పడవే తలకిందులైపోతుందనిపించింది. వంతిదేవుడు, నావికులు వారిద్దరిని విడదీశారు.

“భక్త శిరోమణులారా! మీరిద్దరూ ఈ కొళ్ళిడం వరదలోపడి నేరుగా మోక్షం పొందేందుకు ఇష్టపడుతున్నట్లనిపిస్తున్నది. కానీ నేనీ లోకంలో చేయవలసిన పనులింకా చాలా మిగిలివున్నాయి!” అన్నాడు వంతిదేవుడు.

పడవ నడిపేవారిలో ఒకడు, “కొళ్ళిడం నదిలో పడితే మోక్షం దొరుకుతుందో లేదో తెలియదు

కాని మొసళ్ల నోటికి చిక్కడం మాత్రం ఖాయం!" అన్నాడు.

వాడు వేలెట్టి చూపించిన చోట ఒక మొసలి భయంకరంగా నోరు తెరుచుకొని కనిపించింది.

"నాకు మొసళ్ళను చూస్తే కించిత్తూ భయంలేదు; గజేంద్రుని రక్షించిన ఆదివిష్ణువు ఎక్కడికి పోతాడు?" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"ఎక్కడికి పోయాడా? బృందావనపు గోపికల చీర కొంగులో దాక్కొన్నాడేమో!" అన్నారు వీరశైవులు.

"లేక, భస్మాసురునికి వరమిచ్చేసి, లబోదిబోమని నెత్తి నోరుకొట్టుకుంటూ పరుగెత్తిన శివుని ఇంకేమైన అటువంటి సంకటంనుంచి రక్షించేందుకు వెళ్ళివుండవచ్చు" అన్నాడు నంబి (ఆళ్వార్ కట్టియాన్).

"త్రిపురసంహార సమయంలో విష్ణువు పొందిన భంగపాటు ఈ వైష్ణవుడికి జ్ఞాపకం లేనట్లుంది!" అన్నారు శైవులు.

"స్వాములూ ! మీరెందుకిలా దెబ్బలాడుతున్నారో , తెలియలేదు ! ఎవరికి ఏదేవునిపైన భక్తివుందో , ఆ దేవుని కొలవడమే గదా !" అన్నాడు వంతిదేవుడు .

-:-

ఆ వీరశైవులు, ఆళ్వార్ కట్టియాన్ ఎందుకు దెబ్బలాడుకొన్నారు ? వీరనారాయణపురంలో కూడా ఇదేవిధంగా వాగ్యుద్ధం ఎందుకు జరిగిందని పాఠకులకు ఇప్పుడు చెప్పడం ఉచితంగా ఉంటుంది .

పాత తమిళనాడులో ఇంచుమించు ఆరువందల సంవత్సరాలపాటు బౌద్ధమతమూ , జైనమతమూ ప్రాధాన్యత కలిగివుండేవి . అందువల్ల తమిళనాడుకు చాలా విధాలుగా మేలు చేకూరిందని చెప్పవచ్చు . శిల్పం , చిత్రలేఖనం , కవిత్వం , కావ్యరచన మొదలైన కళలు పెంపొందాయి . తర్వాత ఆళ్వారులు , నాయన్మారులు ఉద్భవించారు . అమృతధారలవంటి మధురమైన పాశురాలను రచించారు . శైవాన్ని , వైష్ణవాన్ని మళ్ళీ పైకెత్తారు . వీరి ప్రచార విధానం బహు శక్తివంతంగావుండేది . జైనమత ప్రచారానికి శిల్పకళతోపాటు సంగీతంకూడా ఉపయోగించేవారు . అలాగే ఆళ్వారులు పాశురాలను , దేవారాలను (ఇంకొకవిధమైన దైవ భక్తి గీతాలు) దేవగానానికి తగిన సంగీతాన్నమర్చి పాడనారంభించారు . అవి విన్నవారిని పరవశింపజేసి భక్తి మార్గంలోకి లాగేవి . ఆళ్వారుల పాటలు అంకితంచేయబడ్డ వైష్ణవ క్షేత్రాలు , నాయన్మారుల దేవారాలు అంకితంచేయబడ్డ శైవక్షేత్రాలు మహా పుణ్య క్షేత్రాలుగా పేరుగాంచాయి . అంతకు మునుపు ఎర్రరాతితో , చెక్కతో కట్టబడ్డ దేవాలయాలు నల్లరాతితో పునర్నిర్మించబడ్డాయి . ఈ ఆలయ కైంకర్యాలను విజయాలయ చోళుని కాలంనుంచి రాజులు , రాజవంశస్థులు విరివిగా చేయసాగారు .

అదే సమయంలో కేరళదేశంలో ఒక విశేష సంభవం జరిగింది.కాలడి అనే చోట ఒక మహాత్ముడు జన్మించాడు. చిరుప్రాయంలోనే ఆయన ఈ లౌకికజీవనాన్ని విడిచి సన్యాసి అయ్యాడు. ఉత్తరభాషలో (అంటే ఇప్పటి ఉత్తర భారతదేశపు భాష) ఉన్న శాస్త్రాలన్నిటినీ చదివి జీర్ణించుకున్నాడు. వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రం - వీటన్నిటిని ఆధారంగా తీసుకొని అద్వైత వేదాంత ధర్మాన్ని నెలకొల్పాడు. ఉత్తరభాషలో సాధించిన పాండిత్యాన్ని ఉపయోగించుకొని సమస్త భారతదేశ సంచారంచేసి, దేశం అన్ని మూలలా ఎనిమిది అద్వైత మఠాలను స్థాపించాడు. ఈయన ధర్మసూత్రాలను అవలంబించిన అద్వైత సన్యాసులు దేశమంతటా వ్యాపించారు.

ఈవిధంగా తమిళదేశంలో మన కథ జరిగిన కాలానికి, అంటే సుమారు 980[1] సంవత్సరాలకు మునుపు, ఒక పెద్ద సంక్షోభం ఏర్పడింది. ఈ సంక్షోభంనుంచి కొన్ని చెడు అంశాలుకూడా పుట్టుకొచ్చాయి. వీరశైవులు, వీరవైష్ణవులూ అక్కడక్కడా పుట్టుకొచ్చారు. వీరు ఎక్కడంటే అక్కడ వాగ్వివాదాలకు దిగసాగారు. ఈ వాగ్వివాదాల్లో ఒక్కోసారి అద్వైతులు కూడా చేరుకొనేవారు. అవి ఒక్కోసారి దెబ్బలాటలుగా కూడా మారేవి.

ఆ కాలపు శైవ-వైష్ణవ యుద్ధాలను వివరించే ఆసక్తికరమైన కథ ఒకటుంది.

ఒకసారి శ్రీరంగపు వైష్ణవులొకరు తిరువాణక్కావల్ ఆలయప్రాకారపు గోడపక్కగా నడిచివెళ్తున్నారట. ఉన్నట్లుండి తలపైన ఒక రాయి పడింది. గాయమై రక్తంవచ్చింది. వైష్ణవులు తలెత్తి చూశారు. గోపురంపైన ఒక కాకి కూర్చొనివుండడంతో దానివల్లే ఒక రాయి ఊడిపడి ఉండాలని గ్రహించారు. వెంటనే ఆయనకు గాయమూ, నెప్పి మరిచిపోయి ఒకవిధమైన కుతూహలం కలిగింది. "ఓ శ్రీరంగపు వైష్ణవ కాకీ! తిరువాణక్కావల్ శివాలయాన్ని బాగా పడగొట్టు!" అన్నారట.

ఆ కాలంలో ఇటువంటి శైవ-వైష్ణవ వైరుధ్యం బాగా ప్రబలివుండేది. ఇది తెలుసుకొంటే, మున్ముందు ఈ కథను అర్థం చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది.

-:-

ఓడ అవతలి గట్టు చేరినవెంటనే, ఆ వీరశైవులు ఆళ్వార్ కట్టియాన్ వైపు చూసి, "నీవు నాశనమైపోతావు!" అని చివరి శాపం పెట్టి తన దారిన తాను పోయారు.

వంతిదేవునితో వచ్చిన కడంబూర్ వీరుడు (గందమారన్ పంపించినవాడు) పక్కనవున్న తిరుప్పణంతాళ్ అనే ఊరికివెళ్ళి గుర్రాన్ని సంపాదించుకొని వస్తానని చెప్పివెళ్ళాడు. వంతిదేవుడు, ఆళ్వార్ కట్టియాన్ నదీతీరంలో ఉన్న రావిచెట్టు కింద కూర్చొన్నారు. ఆ విశాలమైన చెట్టుపైన వందలకొద్ది పక్షులు

1 అమరులు కల్కి ఈ మహాకావ్యాన్ని 1950 దశాబ్దంలో లో రాశారు . ఆ ప్రకారంగా కథాకాలాన్ని పాఠకులు లెక్కవేసుకోవాలి .

కూర్చొని మధురమైన కలకలారావాలను వినిపించసాగాయి.

ఇద్దరూ ఎలాగైనా ఎదుటివారిని మాట్లాడింపజేసి విశేషాలేమైనా తెలుసుకోవాలని కుతూహలపడ్డారు. కాసేపు తిన్నగా విషయానికి రాక ఏవేవో మట్లాడారు.

“ఏం తమ్ముడూ! కడంబూర్ భవనానికి నన్ను వదిలిపెట్టి వెళ్ళావుగద?”

“నేను లోపలికి వెళ్ళడమే చాలా కష్టమైపోయింది నంబిగారూ!”

“అలాగా? మరి ఎలా వెళ్ళావు? ఒకవేళ పోనేలేదా?”

“వెళ్ళాను, వెళ్ళాను. ఒక కార్యంమీద గురిపెట్టుకొన్నతర్వాత వెనుకంజ వేస్తానా, ఏం? కోటవాకిలి కాపలాదార్లు అడ్డుపడ్డారు.గుర్రాన్ని ఒక్కసారి తట్టి వదిలానంతే! అడ్డుపడ్డవారందరూ కిందకు దొర్లిపడ్డారు. వాళ్ళు లేచి మళ్ళీ నన్ను అడ్డుకొనేలోపు నా స్నేహితుడు గందమారన్ వచ్చి నన్ను పిల్చుకొని వెళ్ళాడు..”

“అలాగే జరిగివుంటుందని నేను ఊహించాను. చాలా ధైర్యశాలివి నీవు. సరే. తర్వాత ఏం జరిగింది? ఎవరెవరు వచ్చారు?”

“ఎంతోమంది ప్రముఖులు వచ్చారు. వారి పేర్లన్నీ నాకు తెలియదు. పళువేట్టరయ్యర్ వచ్చారు. వారి నవయవ్వనరాణికూడా వచ్చారు. అబ్బబ్బ! ఆమె అందం ఏమని వర్ణించను!...”

“నీవు చూశావా, ఏం?”

“అవును, చూడకేం? నా మిత్రుడు గందమారన్ నన్ను అంతఃపురానికి తీసుకువెళ్ళాడు. అక్కడ చూశాను. అంతమంది స్త్రీలమధ్యకూడ పళువేట్టరయ్యర్ గారి యువరాణి వెలిగిపోయింది! తక్కిన నలుపురంగు ఆడవాళ్లమధ్య ఆమె ముఖం పూర్ణచంద్రునిలాగా వెలిగింది. రంభ, ఊర్వశి, తిలోత్తమ మొదలైన దేవకన్యలు ఆమె ముందు దిగదుడుపే!”

“ఓయబ్బ!చాలా సంబరంగా వర్ణిస్తున్నావే! తర్వాతేమైంది? కురవై ఆట జరిగిందా?”

“జరిగింది. చాల బాగ జరిగింది. అప్పుడు మిమ్మల్ని తలుచుకొన్నాను.”

“నాకు ఆ భాగ్యంలేదు. తర్వాత ఇంకేమేం జరిగాయి?”

“వేలన్ (సుబ్రమణ్యస్వామి) ఆట జరిగింది. దేవరాళన్, దేవరాట్టి మేడపైకి వచ్చి చాలా ఆవేశంగా ఆడారు.”

“శాంతం వచ్చిందా? ఏమైనా వాక్కు చెప్పారా?”

“ఆహా! ’అనుకొన్న పని.జరుగుతుంది; వానలొస్తాయి; పంటలు పండుతాయి’ అని చెప్పాడు...”

“అంతేనా?”

“ఇంకా ఏదో రాజకీయవిషయం చెప్పాడు. అది నేనంతగా పట్టించుకోలేదు.”

“అరెరే! ఇంతేనా? అది సరిగ్గా గమనించివుండాల్సింది, తమ్ముడూ! నీవు చిన్నవాడివి. మంచి వీరపరాక్రమాలున్నవాడిలాగ కనిపిస్తున్నావు. రాజకీయవిషయాలు ఎవరైనా ఎక్కడైనా మాట్లాడుకొంటుంటే చెవిలో వేసుకోవాలి.”

“మీరు చెప్పేది నిజమే. నాక్కూడా పొద్దున అలాగే అనిపించింది.”

“పొద్దున తోచడమేం?”

“పొద్దున నేను, గందమారన్ మాట్లాడుకొంటునే కొళ్ళిడంనది ఒడ్డువరకు వచ్చాము. రాత్రి నేను పడుకొని నిద్రపోయిన తర్వాత, కడంబూర్ భవనానికి వచ్చిన అతిథులందరూ గుమికూడి ఏదేదో రాజకీయవిషయాలు మాట్లాడుకొన్నారట...”

“ఏం మాట్లాడుకొన్నారట?”

“అది నాకు తెలియదు. గందమారన్ ఏదో కలగాపులగంగా చెప్పాడుగాని, స్పష్టంగా చెప్పలేదు. ఏదో ఒక పెద్ద కార్యం త్వరలో జరగబోతోంది. అప్పుడు చెప్తాను అన్నాడు. వాడి మాటలే మర్మభూయిష్టంగా అనిపించాయి. ఏం, స్వామీ, మీకేమైనా తెలుసా?”

“దేనిగురించి?”

“దేశమంతటా ప్రజలందరూ ఏవేవో మాట్లాడుకొంటున్నారటకదా? ఆకాశంలో తోకచుక్క కనిపిస్తోంది; రాజ్యానికి ఏదో విపత్తు రాబోతోంది; చోళసింహాసనం మార్పిడి జరగబోతోంది; అలా, ఇలా ఏమేమో మాట్లాడుకొంటున్నారట. తొండైమండలందాకా ఈ వార్త పాకివుంది. ఇంకా ఎవరెవరో పెద్దలు ఒకచోట చేరి, తర్వాతి పట్టపు రాజెవరన్నది చర్చిస్తున్నారట. మీకేమనిపిస్తుంది? రాబోయే రాజెవరు?”

“నాకదంతా తెలియదు, తమ్ముడూ! నాకూ, రాజకీయవిషయాలకు ఏమి సంబంధం? నేను వైష్ణవుడిని; ఆళ్వారుల దాసులకు దాసుడిని; నాకు తెలిసిన పాశురాలను పాడుకొంటూ ఊరూరూ తిరిగేవాడిని!”

ఇలా చెప్పి, ఆళ్వార్ కట్టియాన్ ఒక పాశురం పాడనారంభించాడు. వెంటనే వంతిదేవుడు అడ్డుపడి, “మీకు పుణ్యముంటుంది, ఆపండి!” అన్నాడు.

“అరెరే! దైవ పాశురాలను ఆపమంటున్నావే!”

“ఆళ్వార్ కట్టియాన్ నంబిగారూ! నాకు ఒక సందేహం పుడుతోంది. అడగనా?”

“తప్పక"

“బెత్తం తీసుకొని నన్ను కొట్టేందుకు రారుగద?”

“నిన్నా? నిన్ను నేను కొట్టగలనా?”

“మీ వైష్ణవత్వం, భక్తి, ఊర్ధ్వపుండ్రాలు, పాశురాలు, అన్నీ ఒట్టి వేషమని నాకనిపిస్తోంది"

“అయ్యయ్యో! ఇవేం మాటలివి! అపచారం! అపచారం!”

“అపచారమూ లేదు, ఉపచారమూ లేదు. మీ స్త్రీవ్యామోహాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఇలా వేషాలేస్తున్నారు. మీలా ఇంకా కొంతమందిని చూసివున్నాను - ఆడవాళ్లపిచ్చి పట్టి తిరిగేవాళ్ళని. అలా ఏం కనిపిస్తుందో మీకు ఆడవాళ్లలో?! నాకు ఏ స్త్రీని చూసినా విసుగనిపిస్తుంది.”

“తమ్ముడూ! ఆడవాళ్లపిచ్చి పట్టి తిరిగేవాళ్ళు కొంతమంది ఉన్నారు. కానీ వాళ్ళతో నన్ను చేర్చకు. నేను వేషధారిని కాను. నీవలా సందేహించడం చాలా పొరపాటు.”

“అలాగైతే, పల్లకిలో వచ్చిన ఆ స్త్రీకి పత్రమివ్వగలవా అని నన్నెందుకు అడిగారు? అదీ పరస్త్రీ! మీరు కడంబూర్ భవనానికి రావాలనుకొన్నది కూడా ఆమెను చూసేందుకేగద? కాదని అనకండి!”

“కాదని చెప్పను. కానీ, అందుకు నీవు చెప్పినకారణం తప్పు. వెరే తగిన కారణముంది. అది పెద్ద కథ.”

“గుర్రం ఇంకా రాలేదే! సరే, అంతవరకు ఆ కథను చెప్పండి! విందాం!”

“కథంటే, కట్టుకథకాదు; నిజంగా జరిగిన కథ. విచిత్ర వృత్తాంతం! వింటే ఆశ్చర్యపోతావు! తప్పక చెప్పే తీరాలా?”

“ఇష్టమైతే చెప్పండి!”

“సరే, చెప్తాను. నేను కాస్త తొందరగా వెళ్ళాలి. ఐనా కూడ చెప్పేసి వెళ్తాను. మళ్ళీ నిన్నేమైనా సహాయం చేయమని అడగాల్సిరావచ్చు. తప్పకుండా చేస్తావు కదూ?”

“న్యాయమైనదైతే చేస్తాను. మీకిష్టం లేకపోతే ఏమీ చెప్పకండి.”

“లేదు, లేదు. నీకు తప్పకుండా చెప్పేతీరాలి. ఆ హిరణ్యాసురుడు పళువేట్టరయ్యర్ యువరాణి ఉందే, నేను తాళపత్రం తీసుకువెళ్ళి ఇమ్మని చెప్పానే, ఆమె పేరు నందిని. ఆమె కథ వింటే నీవు ఆశ్చర్యపోతావు. లోకంలో ఇలాంటి అక్రమాలుకూడా జరుగుతాయా అని పేట్రేగిపోతావు!” ఈ ఉపోద్ఘాతంతో ఆళ్వార్ కట్టియాన్ నందిని కథ చెప్పనారంభించాడు.

-:-

ఆళ్వార్ కట్టియాన్ పాండ్యదేశంలో వైగై నదీతీరంలో ఒక గ్రామంలో పుట్టినవాడు. అతని కుటుంబీకులు పరమ వైష్ణవభక్తులు. అతని తండ్రి ఒకరోజు నదీతీరంలో ఉన్న నందనవనానికి వెళ్ళారు. అక్కడ ఒక ఆడబిడ్డ అనాధగా పడివుండడాన్ని చూశారు. బిడ్డను ఎత్తుకొని ఇంటికి తీసుకొనివచ్చారు. పాప

మంచి కళతో అందంగా ఉండడంతో ఆయన కుటుంబీకులు ఆ బిడ్డను ప్రేమతో, ఆప్యాయతతో పెంచి కాపాడారు. నందనవనంలో కనిపించినందువల్ల నందిని అని పేరుపెట్టారు.ఆళ్వార్ కట్టియాన్ ఆమెను తన చెల్లెలుగా భావించాడు.

నందినికి యుక్తవయస్సు రావడంతోటి పెరుమాళ్ళపైన భక్తికూడా పెరుగుతూవచ్చింది. ఆమె ఇంకొక 'ఆండాళ్లై' భక్తులందరినీ పాలిస్తుందని ఇరుగుపొరుగువారందరు  నమ్మారు. ఈ నమ్మకం ఆళ్వార్ కట్టియాన్ కే అధికంగా ఉండేది. తండ్రి మరణించిన తర్వాత ఆమెను పెంచే బాధ్యత తానే తీసుకొన్నాడు. ఇద్దరు ఊరూరూ తిరిగి ఆళ్వారుల పాశురాలను పాడి వైష్ణవమతాన్ని ప్రచారంచేశారు. నందిని తులసిమాల ధరించి పాశురాలను పాడితే విన్నవారు మైమరచిపోయేవారు.

ఒకసారి ఆళ్వార్ కట్టియాన్ తిరువేంగడానికి తీర్థయాత్రకు వెళ్ళాడు. తిరిగిరావడం ఆలస్యమైంది. అప్పుడు నందినికి ఒక విపత్తు సంభవించింది.

పాండ్యులకు, చోళులకు మధ్య చివరి యుద్ధం మదురైకి దగ్గర జరిగింది. పాండ్యుల సేన సర్వనాశనమైపోయింది. వీరపాండియన్ ఒళ్ళంతా గాయాలతో యుద్ధభూమిలో పడివున్నాడు. అతని అంతరంగ సేవకులు కొందరు అతన్ని వెతికి గుర్తుపట్టి అతని ప్రాణం కాపాడేందుకు ప్రయత్నించారు. రాత్రికి రాత్రి నందిని ఇంటికి తీసుకొచ్చి చేర్చారు. అతని పరిస్థితి చూసి మనసు కరిగి నందిని అతనికి శైత్యోపచారాలు చేసింది. కానీ చోళవీరులు త్వరలోనే అది కనిపెట్టేశారు. నందిని ఇంట్లో దూరి వీరపాండ్యుని చంపేశారు. అక్కడేవున్న నందినిని చూసి మోహించి పళువేట్టరయ్యర్ ఆమెను చెరపట్టి తీసుకు వెళ్ళిపోయాడు.

ఇది మూడేళ్లకు మునుపు జరిగింది. తర్వాత ఆళ్వార్ కట్టియాన్ నందినిని చూసేందుకే వీలుపడలేదు. ఆరోజునుంచి నందినిని ఒంటరిగా చూసి మాట్లాడాలని, ఆమె ఇష్టపడితే విడిపించుకొని తీసుకువెళ్లడానికి ఆళ్వార్ కట్టియాన్ ప్రయత్నపడుతూ వచ్చాడు. ఇప్పటిదాకా ఆ ప్రయత్నం సఫలంకాలేదు....

-:-

ఈ వృత్తాంతాన్ని విన్న వంతిదేవుని మనసు కరిగిపోయింది. కడంబూర్ భవనంలో పల్లకిలో ఉన్నది నందిని కాదని, యువరాజు మధురాంతకులని చెప్పేద్దామా అని ఒక క్షణం అనుకొన్నాడు. తర్వాత మనసులో ఏదో ఒక ఆలోచన అందుకడ్డం వచ్చింది. బహుశ ఇదంతా ఇతని కట్టుకథేమో అనిపించింది. కాబట్టి కడంబూర్ మాళిగలో తాను తెలుసుకొన్న రహస్యాన్ని చెప్పలేదు.

అప్పుడు కాస్త దూరంలో కడంబూర్ వీరుడు గుర్రంతో వస్తుండడం కనిపించింది.

“తమ్ముడూ, నీవు నాకొక సయాయం చేస్తావా?” అని ఆళ్వార్ కట్టియాన్ అడిగాడు.

"నేనేం సహాయం చేయగలను? పళువేట్టరయ్యర్ ఈ చోళసామ్రాజ్యాన్నే ఆడించగల అధికారం కలవారు. నేనేమో, ఎలాంటి పలుకుబడిలేని ఒంటరి వాడిని. నేనేం చేయగలను?" అని వంతిదేవుడు జాగ్రతగానే మాట్లాడాడు. తర్వాత, "నంబిగారూ! రాజకీయవిషయాల గురించి మీకేమీ తెలియదనా అంటున్నారు? సుందర చోళ చక్రవర్తికి ఏమైనా జరిగితే, ఆ తర్వాత ఎవరు సింహాసనమెక్కుతారు?" అని అడిగేసి, నంబి ముఖం చూశాడు. కించిత్తు మార్పుకూడా కనిపించలేదు.

"అదంతా నాకేం తెలుసు తమ్ముడూ! కుడంద్దై జ్యోతిష్కులను అడిగితే చెప్పవచ్చు!" అన్నాడు నంబి.

"ఓహో! కుడంద్దై జ్యోతిష్కులు నిజంగానే అంతటి సమర్థులా?"

"అసాధ్యులు! జోస్యమూ చెప్తారు; మనస్సెరిగి కూడా చెప్తారు; ప్రపంచ విషయాలను తెలుసుకొని, అందుకు తగిన జోస్యమూ చెప్తారు!"

"అలాగైతే ఆయన్ను తప్పక చూసి వెళ్ళాలి!" అని వంతిదేవుడు మనసులో తీర్మానించుకొన్నాడు.

ఆదికాలంనుంచి మనుషులకు జరగబోయే సంగతులను తెలుసుకోవాలనే ఆశ, తెలుసుకోగలమనే భ్రమ ఉన్నాయి. రాజులక్కూడా ఆ భ్రమ ఉంది; సన్యాసులకూ ఉంది, సంసారులకూ ఉంది. వివేకవంతులైన మేధావులకూ ఉంది; మూఢమతులకూ ఉంది. ఇటువంటి భ్రమ, దేశదేశాలు దాటి పలు అపాయాలకు తెగించి, రాజ్యాంగ అంతరంగ కార్యాన్ని నెరవేర్చేందుకు వెళుతున్న మన యువ వీరునికుండడంలో ఆశ్చర్యం లేదుకద?

~~~
~~~

# అధ్యాయము - 13

## చంద్రవంక

రాకుమార్తెల రధం కనుమరుగైన తర్వాత జ్యోతిష్కులు వంతిదేవుని తన ఇంటికి పిలుచుకొని వెళ్ళారు. తాము తమ ఆస్థానపీఠంపైన కూర్చొన్నారు. అటూఇటూ చూస్తున్న ఆ యువకునికూడా కూర్చోమని చెప్పారు. తర్వాత అతన్ని ఎగాదిగా చూశారు.

"తమ్ముడూ! నీవెవరవు? ఎక్కడినుంచి వచ్చావు?" అని అడిగారు. వంతిదేవుడు నవ్వాడు.

"ఏమయ్యా, నవ్వుతున్నావు!"

"మరేంలేదు, మీరు చాలా గొప్ప జ్యోతిష్కులుకదా, నన్ను ప్రశ్నలడుగుతున్నారే? నేనెవరిని, ఎందుకు మీదగ్గరికి ఇప్పుడు వచ్చానని జోస్యం చూసే చెప్పవచ్చుగద?"

"ఓహో! దానికేం? చూసుకొంటాను. కానీ నాకు నేనే జోస్యం చూసుకొంటే, దక్షిణ ఎవరిస్తారని ఆలోచిస్తున్నాను..."

వంతిదేవుడు చిరునవ్వు నవ్వేసి, "జ్యోతిష్కులుగారూ! ఇప్పుడు ఇక్కడికి వచ్చి వెళ్ళారే, వారెవరు?" అని అడిగాడు.

"ఓ! వారా! నీవెవరిని గురించి అడుగుతున్నావో నాకు తెలుసు, తమ్ముడూ, తెలుసు! నీవు నా శిష్యుని పక్కకు లాగి తోసేసి లోపలికొచ్చినప్పుడు ఇక్కడ ఉన్నవారిని గురించే కదా అడుగుతున్నావు? రధంలోకెక్కి, వెనక దుమ్ము లేపుకొంటూ వెళ్ళారే, వారిగురించేకద?" అని జ్యోతిష్కులు డొంకతిరుగుడుగా అడిగారు.

"ఔనౌను! వారిగురించే అడుగుతున్నాను..."

"దానికేం, ధారాళంగా అడుగు. అడవవద్దని ఎవరన్నారు? వారు ఇద్దరు స్త్రీమణులు!"

"అది నాకే తెలుసు, జ్యోతిష్కులుగారూ! నేను గుడ్డివాడిని కాను. స్త్రీలకు, పురుషులకు నాకు తేడా బాగానే తెలుసు. పురుషులు స్త్రీవేషంలో ఉన్నాకూడా కనిపెట్టగలను!"

"మరింకేం అడుగుతున్నావు?"

"వారెవ్వరు? వారు ఏవూరు, ఏ జాతి,..."

"ఓహో! అదా అడుగుతున్నావు? స్త్రీలలో పద్మిని, చిత్తిని, గాంధర్వి, విద్యాధరి అని నాలుగు జాతులున్నారు. నీకు సాముద్రికాలక్షణ శాస్త్రంలో కాస్త ప్రవేశంవున్నట్లుంది. ఆ నాలుగు జాతులలో వీరిద్దరు పద్మిని, గాంధర్వి జాతులకు చెందినవారు."

“దేవుడా!...”

“ఏం? ఏమయ్యింది??”

“నేను దేవుణ్ణి పిలిస్తే, మీరెందుకు 'ఏం?' అని అడుగుతున్నారు?”

“దానికేం? ఆ పరమాత్ముడు సర్వాంతర్యామి అని నీవు వినలేదా? పెద్దవాళ్ళ సహవాసం నీకంతగా లేనట్లుంది! నాలోవున్నవాడు ఆ దేవుడే, నీలో వున్నవాడూ ఆ పరమాత్ముడే. నీవు లోపలికి లాక్కొనివచ్చావే, ఆ నా శిష్యునిలో వున్నవాడూ ఆ దేవుడే!...”

“చాలు, చాలు, ఆపండి!”

“ఇంతసేపు మాట్లాడమన్నది దేవుడే, ఇప్పుడు ఆపమంటున్నదీ దేవుడే!”

“జ్యోతిష్కులుగారూ! ఇప్పటిదాకా ఇక్కడ ఉన్న ఆ ఇద్దరు స్త్రీమణులు ఎవరు, ఏవూరు, వారి పేర్లేమి, ఏకులం అని అడిగాను. తిన్నగా సమాధానమిస్తే...”

“ఇస్తే, నీవు నాకేమిస్తావయ్యా?”

“నా వందనాలర్పిస్తాను.”

“ఈ వందనాలను నీదగ్గరే పెట్టుకో. ఏదైనా స్వర్ణదానం ఇచ్చేటట్లుంటే చెప్పు!”

“స్వర్ణదానం ఇస్తే తప్పకుండా చెప్తారా?”

“అదికూడా చెప్పదగినదైతేనే  చెప్తాను!తమ్ముడూ! ఇది విను. జ్యోతిష్కుల ఇంటికి పలువురు వస్తూ వెళ్తూంటారు. ఒకరిగురించి ఇంకొకరికి చెప్పకూడదు. ఇప్పుడు వచ్చి వెళ్ళిన వారిగురించి నీకు చెప్పను. నీగురించి ఇంకెవరైనా అడిగితే ఒక్క మాటకూడా చెప్పను!”

“ఆహా! ఆళ్వార్ కట్టియాన్ మీగురించి చెప్పినదంతా పూర్తిగా నిజమే!”

“ఆళ్వార్ కట్టియాన్? అదెవరు? అలా ఒకరు...”

“మీకు తెలియదా, ఏమి? మీగురించి చాలా బాగా తెలిసినట్లు మాట్లాడారే? ఆయన గురించి మీరు వినలేదా?”

“ఒకవేళ మనిషి తెలిసివుండవచ్చు; పేరు జ్ఞాపకం ఉండదు. కాస్త గుర్తులు చెప్పు, చూద్దాం!”

“గట్టిగా, దిట్టంగా ఉంటారు. ముందు పిలక (వెనక పెట్టుకోవడానికి బదులు) ఉన్నవారు.  పంచె బాగా బిగదీసి కట్టుకొనివుంటారు. ఒళ్ళంతా చందనం రాసుకొనివుంటారు. శైవులను చూస్తే జగడానికి వెళ్తారు. అద్వైతులను చూస్తే బెత్తం ఎత్తుతారు. కాసేపటికి మునుపు అన్నారే, 'నీవు దైవమే, నేనూ దైవమే' అని? అది ఆళ్వార్ కట్టియాన్ వింటే, 'దైవాన్ని దైవం పైబడి అటకాయిస్తోంది!' అని చెప్పి బెత్తంతో

కొట్టేందుకు వస్తారు..."

"తమ్ముడూ! నీవు చెప్పేదంతా చేర్చి చూస్తే తిరుమలై గురించి చెప్తున్నట్లుంది..."

"ఆయకలా ఇంకొక పేరుకూడా ఉందా?"

"ఊరికొక పేరుమార్చుకొంటారా వీర వైష్ణవులు."

"దానికి తగిన వేషంకూడా వేస్తారు కాబోలు!"

"ఆహా! సమయానికి తగిన వేషంకూడా వేస్తారు."

"చెప్పేదాంట్లో కాస్త కల్పన, అబద్ధాలు కూడా కలిసివుంటుందేం?"

"నాలుగింట మూడు పాళ్ళు అబద్ధాలుంటాయి. ఒకపాలు నిజముంటుంది."

"చాలా దుర్మార్గుడని చెప్పండి!"

"అలాకూడా చెప్పేందుకు లేదు. మంచివాళ్లకు మంచివారు; చెడ్డవాళ్లకు చెడ్డవారు."

"ఆయన మాట నమ్మి ఏమీ చేయకూడదు."

"నమ్మడము, నమ్మకపోవడము ఆయా మాటలని బట్టి ఉంటుంది."

"ఉదాహరణకు, మీదగ్గరకు వెళ్ళి జోస్యం అడిగితే, మీరు బాగా చెప్తారని అన్నది..."

"ఆయన మాటల్లో ఒక పాలు నిజంకూడా ఉంటుందని చెప్పానే, అది ఇక్కడ అన్వయిస్తుంది."

"అలాగైతే నాకు కొంత జ్యోతిష్కం, హస్తసాముద్రికం చెప్పండి. సమయమైంది, నేను వెళ్ళాలయ్యా!"

"అంత తొందరగా ఎక్కడికి వెళ్ళాలి, తమ్ముడూ?"

"అదికూడా మీరు జోస్యంలో చూసి చెప్పకూడదా? ఎక్కడికి వెళ్ళాలి, ఎక్కడికి వెళ్ళకూడదు, వెళితే కార్యం సిద్ధమౌతుందా అని మిమ్మల్ని అడిగేందుకే నేను మీదగ్గరికి వచ్చాను."

"జోస్యం, హస్తసాముద్రికం చెప్పడానికి ఏదైనా అధారం కావాలి బాబూ! జాతకం కావాలి; అది లేకపోతే, పుట్టిన దినం, నక్షత్రమైనా కావాలి; అదికూడా తెలియకపోతే, ఊరూ, పేరైనా చెప్పాలి."

"నాపేరు వంతిదేవుడు!"

"ఆహా! వాణర్ కులస్థుడివా?"

"అవును."

"వల్లవరయ్యన్ వంతిదేవుడివా?"

"సాక్షాత్తు వాడినే!"

"అలా చెప్పు తమ్ముడూ! ముందే చెప్పివుండకూడదా? నీ జాతకంకూడా నాదగ్గర ఉందే! వెతికిచూస్తే దొరుకుతుంది."

"ఓహో! అదెలా?"

"నాలాంటి జ్యోతిష్కులకు ఇంకేం పని? పెద్ద వంశాల్లో పుట్టిన మగపిల్లల – ఆడపిల్లల జాతకాలను సేకరించి పెట్టుకొంటాము..."

"నేనలా పెద్దవంశంలో పుట్టినవాడిని కానే?..."

"భలే చెప్పావు! నీ కులం ఎటువంటి కులం! వాణర్ కులంగురించి కవీశ్వరులు ఎలాంటి గొప్ప కవితలు రచించివున్నారు! బహుశా నీవు వినివుండవేమో."

"ఒక కవితనైనా చెప్పండేం, విందాము."

జ్యోతిష్కులు వెంటనే ఈ కవితను పాడారు:

<< ఆ కవితను అనువదించవలసివుంది

దాని తాత్పర్యం: వాణర్ కుల కీర్తి ప్రఖ్యాతులను పాడని నోరుందా?

వాణర్ కులం పేరు రాయని ఎదవుందా?

వాణర్ కులం జెండా ఎగరని స్తంభముందా?

...>>

జ్యోతిష్కులు గానకోవిదులు కారన్నది ఆయన పాడుతున్నప్పుడే తెలిసిపోయింది. కాని పాటను బాణీలో అమర్చి చాలా వివరంగానూ, భావపూర్వకంగాను పాడారు.

"కవిత ఎలా ఉంది?" అని అడిగారు.

"కవిత చెవికింపుగానే ఉంది. కానీ నా జెండాను నేనే ఏ ఎద్దుకొమ్ముకో నేనే కడితేనే సరి; రావి (రాజుల) చెట్టుపైన నేనే ఎక్కి నా జెండాను ఎగరేస్తేనే సరి. అది కూడా సందేహమే. బరువు మోయలేక కొమ్మవిరిగి నన్నుకూడా కిందపడేస్తుంది!" అన్నాడు వంతిదేవుడు.

"ఈ రోజు నీపరిస్థితి ఇలావుంది; రేపెలా ఉంటుందని ఎవరు చూశారు?" అన్నారు జ్యోతిష్కులు.

"మీరు కనిపెడతారని కదా నేనిక్కడికి వచ్చాను?" అన్నాడు వల్లవరయ్యన్.

"నేనేం చూడవచ్చాను తమ్ముడూ! అందరిలా నేనూ అల్పాయుష్కుడినే కద? కానీ, గ్రహాలు, నక్షత్రాలు రాబోయే కార్యక్రమాలను చెబుతున్నాయి. అవి చెప్పేవి నేను కాస్త తెలుసుకొని అడిగేవారికి

చెబుతున్నానంతే!"

"గ్రహాలూ, నక్షత్రాలు నావిషయంలో ఏం చెబున్నాయి, జ్యోతిష్కులుగారూ?"

"నీవు రోజుకు రోజు పైకెదుగుతావు, అని చెప్తున్నాయి."

"సరిపోయింది! ఇపుడున్న ఎత్తే చాలా ఎక్కువ! మీ ఇంటిలోపలికొచ్చేటప్పుడు వంగి రావలసి వచ్చింది! ఇంకా ఎత్తు పెరిగితే ఏం చేయను? ఇలా సాధారణంగా చెప్పక, ఏదైనా నిర్ణీతంగా/నిర్దుష్టంగా చెప్పండి."

"నీవేదైనా నిర్దుష్టంగా అడిగితే నేనూ నిర్ణీతంగానే/నిర్దుష్టంగానే చెప్తాను."

"నేను తంజావూరుకు వెళ్తున్న కార్యం నెరవేరుతుందా? చెప్పండి."

"నీవు తంజావూరుకు స్వకార్యంగా వెళుతుంటే అది నెరవేరుతుంది. ఇప్పుడు నీ జయగ్రహాలు ఉచ్ఛస్థితిలో ఉన్నాయి. ఇతరుల కార్యంమీద వెళ్తుంటే, వారి జాతకం చూడాల్సివుంటుంద్!"

-:-

వంతిదేవుడు తలాడిస్తూ, ముక్కుపైన వేలేసుకొని, "జ్యోతిష్కులుగారూ, మీలాంటి సమర్థులను నేను చూసిందేలేదు!"

"ముఖస్తుతి చేయకు, తమ్ముడూ!" అన్నారు జ్యోతిష్కులు.

"ఉండనీ. అడగవలసిన విషయాన్ని తిన్నగానే అడిగేస్తాను - తంజావూరులో చక్రవర్తిని దర్శింపగోరుతున్నాను. అది సాధ్యమౌతుందా?"

"నాకన్న పెద్ద జ్యోతిష్కులిద్దరు తంజావూరులో ఉన్నారు. నీవు వాళ్ళనే అడగాలి."

"వారెవరు?"

"పెద్ద పళువేట్టరయ్యర్ ఒకరు; చిన్న పళువేట్టరయ్యర్ ఇంకొకరు."

"చక్రవర్తి ఆరోగ్యం చాలా విపరీత పరిస్థితిలో ఉందంటున్నారే? అది నిజమేనా?"

"ఎవరేమైనా అంటారు; చెప్పడానికేం? అదంతా నమ్మకు! బయట ఎవరిక్కూడా చెప్పకు!"

"చక్రవర్తికి ఏమైనా జరిగితే తర్వాత పట్టమెవరికి?"

"పట్టం నీకూ లేదు; నాకూ లేదు; మనమెందుకు అందుగురించి దిగులుపడాలి?"

"అంతమట్టుకు మనం బతికి బయటపడ్డాం!" అన్నాడు వంతిదేవుడు.

"నిజమే, తమ్ముడూ! రాజ్యభారమంటే సాధారణవిషయంకాదు; చాలా అపాయకరమైన విషయం కద!"

“జ్యోతిష్కులుగారూ! కంచిలో ఉన్నారే, యువరాజు ఆదిత్య కరికాలన్...”

“ఉన్నారు. నీవిప్పుడు ఆయన తరఫునే కదా ఇక్కడికి వచ్చి ఉన్నావు?”

“చివరికి కనిపెట్టేశారు! చాలా సంతోషం. ఆయన యోగం ఎలా ఉంది?”

“జాతకం జ్ఞాపకం లేదు, తమ్ముడూ! చూసే చెప్పాలి.”

“యువరాజు మధురాంతకుల యోగం ఎలా ఉంది?”

“ఆయనది విచిత్రమైన జాతకం. స్త్రీల జాతకాన్ని పోలినది - ఎప్పుడూ ఇతరుల అధికానికి లోబడివుండేది...”

“ఇప్పుడుకూడ చోళసామ్రాజ్యంలో స్త్రీపరిపాలన జరుగుతోందటకదా? అది నిజమేనా?”

“ఎక్కడ తమ్ముడూ అలా అంటున్నారు?”

“కొళ్ళిడం నదికి ఉత్తరపువైపున అలా అంటున్నారు.”

“పెద్ద పళువేట్టరయ్యర్ కొత్తగా పెళ్ళిచేసుకొన్న యువరాణి ఆధిక్యత గురించే అలా అంటున్నారు కాబోలు.”

“నేను విన్నది వేరు.”

“ఏం విన్నావు?”

“చక్రవర్తి ముద్దుల కుమార్తె కుందవై దేవి గురించే అలా విన్నాను - ఆమే రాజ్యాధికారం చెలాయిస్తున్నట్లు అందరూ అంటున్నారు!”

-:-

జ్యోతిష్కులు ఒక్క క్షణం వంతిదేవుని ముఖాన్ని నిశితంగా చూశారు; ఇంతకు మునుపు తన ఇంటికి వచ్చివెళ్ళింది కుందవైదేవి అని అతనికి తెలిసే ఇలా అడుగుతున్నాడా అని సందేహపడ్డాడు. కానీ, అందుకు ఆధారమేం దొరకలేదు.

“శుద్ధ తప్పు, తమ్ముడూ! సుందర చోళ చక్రవర్తి తంజావూరులో ఉన్నారు, కుందవైదేవి పళైయారైలో ఉన్నారు. అదీకాక...”

“అదీకాక, ఇంకేమి? ఎందుకు నిలిపేశారు?”

“పగటిపూట చుట్టుపక్కల చూసుకొని మాట్లాడాలి; రాత్రి అదికూడా మాట్లాడకూడదు. కానీ, నీదగ్గర చెప్పడానికి అడ్డేమీ లేదు. ఇప్పుడు చక్రవర్తికి అధికారమెక్కడిది? అన్ని అధికారాలూ పళువేట్టరయ్యర్ గార్లే కదా చెలాయిస్తున్నారు!”

ఇలా చెప్పి జ్యోతిష్కులు మళ్ళీ వంతిదేవుని ముఖాన్ని నిశితంగా చూశారు.

"జ్యోతిష్కులుగారూ! నేను పళువేట్టరయ్యర్ గారి గూఢచారిని కాను. అలా చూడకండి. కాసేపటి క్రితం రాజ్యాలు, రాజ్యాంగాలు నిలవడం, పడిపోవడం గురించి చెప్పారు. ఉదాహరణకు నేను పుట్టిన వాణర్ కులాన్నే తీసుకొని చెప్పారు. ఇప్పుడు నిజంగా, చోళ వంశం భవిష్యత్తు ఎలా ఉంటుందో కాస్త దయచేసి చెప్పండి!"

"నిజాన్ని చెప్తున్నాను. ఒకింత సందేహంకూడ లేకుండా చెప్తున్నాను. జ్యేష్ఠమాసం చివరలో కావేరి నదిలో, తన ఉపనదుల్లో కొత్త వెల్లువ వస్తుంది. అది రోజురోజుకు పెరుగుతుందని ఆ నదీతీరంలో ఉన్నవారికి బాగా తెలుసు. శ్రావణం, భాద్రపదం దాకా ఆ వెల్లువ పెరుగుతూనే ఉంటుంది.కార్తీకం, మార్గశిర మాసాలలో అది తగ్గుముఖం పడుతుంది. అది తగ్గే వెల్లువ అని కావేరి నదీతీరంలో ఉన్నవారికి తెలుస్తుంది. ఇప్పుడు చోళసామ్రాజ్యం కొత్తవెల్లువలా పెరిగే దశలో ఉంది. ఇది ఇంకా మరిన్ని వందల ఏళ్ళు పెరిగి విస్తరిస్తూనే ఉంటుంది. చోళ సామ్రాజ్యం ఇప్పుడు శుక్లపక్ష చంద్రునిలా దినదిన ప్రవర్ధమానంగా ఉంది. పౌర్ణమికి ఇంకా చాలా రోజులుంది. కాబట్టి చోళసామ్రాజ్యం ఇంకా పెరుగుతూనే పోతుంది..."

"ఇంతసేపూ మీతో మాట్లాడినందుకు ఈ ఒక్కవిషయం తేటగా చెప్పారు. చాల వందనాలు. ఇంకొక్క విషయం మాత్రం వీలైతే చెప్పండి. నాకు పడవెక్కి సముద్రప్రయాణం చేయాలని చాలా రోజులుగా ఒక తీరని కోరిక ఉంది..."

"ఆ కోరిక తప్పక నెరవేరుతుంది. నీకు సకలయోగాలు సిద్ధిస్తాయి. నీ కాలిలో చక్రం ఉన్నట్లు నీవెప్పుడూ తిరుగుతూనే ఉంటావు. కాలినడకన వెళ్తావు; గుర్రమెక్కి వెళ్తావు; ఏనుగెక్కి ప్రయాణం చేస్తావు. ఓడెక్కి సముద్రప్రయాణం కూడా చేస్తావు. త్వరలోనే నీకు సముద్రప్రయాణ యోగం కలుగబోతోంది."

"జ్యోతిష్కులుగారూ! ప్రస్తుతం దక్షిణసేనకు అధిపతిగా లంకలో యుద్ధంచేస్తున్న యువరాజు అరుళ్మొళి వర్మగారిగురించి మీరేమైనా చెప్పగలరా? గ్రహాలు, నక్షత్రాలు ఆయనగురించి ఏం చెబుతున్నాయి?"

"తమ్ముడూ! ఓడలో ప్రయాణం చేసేవారు దిక్కులు తెలుసుకోవడానికి ఒక అయస్కాంత దిక్సూచిని ఉపయోగిస్తున్నారు.. సముద్రతీరపు దీపస్తంభాలు కూడా ఉపయోగపడుతున్నాయి. కానీ, వీటన్నిటికన్న, సముద్రమధ్యంలో ఓడను నడిపే నావికులకు నమ్మకమైనది ఏదో తెలుసా? ఉత్తరదిక్కులో కనిపించే ధ్రువతారే. తక్కిన నక్షత్రాలు, గ్రహాలు ఉన్నచోట ఉండకుండ కదిలిపోతూనే ఉంటాయి. సప్తఋషి మండలం కూడా దిశమారి ప్రయాణం చేస్తుంది. కానీ, ధ్రువనక్షత్రం మాత్రం ఉన్నచోటునుంచి కదలకుండా అక్కడే ఉంటుంది. ఆ ధ్రువనక్షత్రం వంటివారు సుందర చోళ చక్రవర్తి కడగొట్టు బిడ్డడైన యువరాజు అరుళ్మొళి వర్మగారు. దేనికీ కలతజెందని స్థితమనస్కులు ఆయన. త్యాగం, మంచి నడవడికలాంటి

గుణాలలో మాత్రమేకాక, వీరపౌరుషత్వంలోకూడ గొప్పవారు. విద్యాజ్ఞానంతోబాటు లోకజ్ఞానంకూడ కలవారు. ఒక్కసారి చూస్తే ఆకలిదప్పులుకూడ తీరిపోతాయనదగ్గ  ప్రసన్నసుందరవదనం ఆయనది. అదృష్టదేవత ముద్దుబిడ్డడు. నావికులు ధ్రువనక్షత్రాన్ని గురిపెట్టుకొన్నట్లు, జీవనసముద్రంలో దిగబోతున్న నీవంటి యువకులు అరుళ్మొళివర్మను గురిగా పెట్టుకోవడం చాలా ఉపయోగంగా ఉంటుంది.''

''అబ్బబ్బ! యువరాజు అరుళ్మొళివర్మగారిని గురించి ఏమేం చెబుతున్నారు? ప్రేమికుడిని ప్రేయసి వర్ణిస్తున్నట్లు కద వర్ణిస్తున్నారు?''

''తమ్ముడూ! కావేరి తీరంవెంబడి విస్తరించిన చోళసామ్రాజ్యంలో ఎవరిని అడిగినా ఇలాగే చెప్తారు.''

''మిక్కిలి వందనాలు, జ్యోతిష్కులుగారూ! సమయంవచ్చినప్పుడు మీరు చెప్పినట్లే నడుచుకొంటాను.''

''నీ అదృష్టగ్రహంకూడ ఉచ్ఛస్థితిలో ఉందని తెలిసే చెప్పాను.''

''వెళ్ళివస్తాను, జ్యోతిష్కులుగారూ! నా మనఃపూర్వక వందనాలతోబాటు నేనివ్వగలిగినంత బంగారపు దక్షిణ కూడ సమర్పిస్తున్నాను. దయచేసి స్వీకరించాలి.''

ఇలాచెప్పి, ఐదు బంగారు నాణాలను తీసి జ్యోతిష్కులకు సమర్పించాడు.

''వాణర్ కులపు దానగుణం ఇప్పటికీ పోలేదు!'' అని చెప్పుకొంటూ జ్యోతిష్కులు ఆ దక్షిణ తీసుకొన్నారు.

~~~
~~~

# అధ్యాయము - 14

## నదిఒడ్డున మొసలి

ఆ రోజుల్లో కుడంద్లై నగరంనుంచి తంజావూరుకు వెళ్ళేవారు అరిసిలానది వెంబడి లేదా కావేరినది వెంబడి వెళ్ళి, తిరుపై నదిని చేరుతారు. అక్కడినుంచి దక్షిణంగా తిరిగివెళ్ళి తంజావూరుకు వెళ్తారు. దారిలోవున్న కుడమురుట్టి, వెట్, వెణ్, వడవు నదులను దాటేందుకు అక్కడే అనువుగా ఉండేది.

కుడంద్లైనుంచి బయలుదేరిన వల్లవరయ్యన్ (వంతిదేవుడు), మొదట అరిసిల నదివైపు సాగాడు. దారిలో అతను చూసిన దృశ్యాలు అతను చోళరాజ్యంగురించి విన్నదానికంటే ఎక్కువగానే అతన్ని భ్రమింపజేశాయి. ఏ ఇంపైన దృశ్యాన్నైనా మొదటిసారి చూసినప్పుడు దాని ఇంపుదనం ఎక్కువగానే అన్పిస్తుందిగద? పచ్చని పైర్లు, అల్లం, పసుపు పంటలు, చెరుకు, అరటి తోటలు, కొబ్బరి, వక్క తోపులు, కొలనులు, కోనేరులు, కాలువలు ఒకదానివెంట ఒకటి అగుపడుతూనే వచ్చాయి. కొలనుల్లో తామరలు, కలువలు, నీలోత్పల పుష్పాలు విరివిగా పూచి కమనీయంగా కనిపించాయి. ఎర్రకొంగలు గుంపులు గుంపులుగా ఎగురుతూ వెళ్ళాయి. ఎర్రకాళ్ళకొంగలు ఒంటికాలి జపం చేయడం చూసేందుకు విచిత్రంగా కనిపించింది. తూములగుండా సాగునీరు గుప్పుగుప్పుమని పారింది. నల్లని ఎరువు, ఆకుతొక్కి నల్లరేగడి నేలను రైతులు ఇంకాలోతుగా దున్నుతున్నారు. దున్నిన పొలాల్లో ఆడవాళ్ళు నారు నాటుతున్నారు. నాటుతూనే, ఇంపైన పంటపాటలుకూడ పాడసాగారు.

చెరుకుతోటల పక్క గానుగలున్నాయి. గతయేడు పండిన చెరుకును బాగా ముక్కలుచేసి ఆగానుగల్లో పిండి చెరుకు రసం తీస్తున్నారు. చెరుకు రసపు కమ్మని వాసన, బెల్లంకాస్తుండగా వచ్చే కమ్మని వాసన రెండూ చేరి ముక్కునదరగొట్టాయి.

కొబ్బరితోటల మధ్య, తాటాకుల గుడిశెలు, పెంకుటిళ్ళు కనిపించాయి. గ్రామాల్లో ఇంటివాకిళ్లను శుభ్రంగా ఊడ్చి, కళ్లాపిజల్లి అద్దంలాగ ఉంచుకొన్నారు. కొన్ని ఇళ్ళముందు వడ్లు ఆరబోసివున్నారు. ఆ వడ్లను కోళ్ళు వచ్చి తిని, 'కొక్కొరొక్కొ' అని కూస్తూ వెళ్ళాయి. ఆరబోసిన వడ్లను కాపలా కాస్తున్న ఆడపిల్లలు వాటిని తరిమికొట్టలేదు. "కోళ్ళు ఎంతని తినిపోతాయి?" అని నిర్లక్ష్యంతో అచ్చంద్రాళ్ళు, గవ్వలాటలు, గుజ్జనగూళ్ళు ఆడుకోసాగారు. గుడిశెల కప్పుల పైభాగంనుంచి వంటపొయ్యి పొగ పైకి పోతోంది. వంటపొయ్యి పొగతోబాటు వడ్లు ఉడికించే కమ్మని వాసన, జొన్నకంకులు కాలుస్తున్న కమ్మని వాసన, మాంసం కాల్చే కంపు కలగలిసి వచ్చాయి. ఆకాలంలో యుద్ధవీరులు చాలావరకు మాంసాహారులే. మన వంతిదేవుడుకూడా అలాగే. కాబట్టి ఆ వాసనలు అతని నోరూరజేశాయి.

అక్కడక్కడ దారివెంబడి కొలుములు ఉన్నాయి.కణకణలాడుతున్న నిప్పుల్లో ఇనుపకడ్డీలను,

పట్టీలను  కాల్చి సాగదీసేందుకు కొడుతున్న సమ్మెటపోట్లు ఢణేల్ ఢణేల్మని వినిపించసాగాయి. ఆయా గ్రామాల్లో నివసిస్తున్న రైతులకు, ఇతర ప్రజలకు కావలసిన పలుగులు, పారలు మొదలైన పనిముట్లతోబాటు, కత్తులు, కటారులు, శూలాలు, ఈటెలు మొదలైనవి కూడా కుప్పతిప్పలుగా పడివున్నాయి. వాటిని కొనుగోలు చేసుకుని వెళ్ళేందుకు ఊరిప్రజలు, యుద్ధవీరులు పోటీ పడుతున్నారు.

చిన్నచిన్నగ్రామాలలోకూడ చిన్నకోవెలలు కనిపించాయి. ఆ దేవాలయాల్లో గంటలు, నగారాలు మోగే శబ్దం, మంత్రఘోష, భక్తిగీతాలు విన్పించాయి.

పూజారులు మారమ్మ మొదలైన గ్రామదేవతల రూపాలను పసుపుతో చేసి తలపైనెత్తుకొని, కరగాట్టం ఆడుతూ, ఢమరుకం వాయిస్తూ ఇంటింటికివెళ్ళి వడ్లకానుక తీసుకొని వెళ్తున్నారు.

మెడలో గంటలు కట్టిన పశువులను కొందరు మగపిల్లలు గడ్డి మేయించేందుకు తోలుకొని వెళ్తున్నారు. వారిలో కొందరు పిల్లనగ్రోవికూడా వాయిస్తున్నారు!

పొలాల్లో పనిచేసి అలిసిపోయిన గ్రామస్థులు చెట్లకింద కూర్చొని సేదదీర్చుకోసాగారు. అప్పుడు పోట్లగొర్రెలను పురెక్కించి అవి పోట్లాడుతుంటే సరదాగా చూడసాగారు.

ఆడనెమళ్ళు ఇంటికప్పులపైన కూర్చొని కూయగా, మగనెమళ్ళు పురివిప్పి ఆడుతూ రివ్వున ఎగిరి ఆ ఆడనెమళ్ళపక్కన వాలాయి.

పావురాలు తమ అందమైన మెడల్ని అటూఇటూ తిప్పుతూ తిరుగాడాయి.

పాపం! పంజరాల్లో చిక్కుపడ్డ చిలుకలు, మైనాలు శోకగీతాలు పాడాయి.

ఇటువంటి దృశ్యాలన్నిటినీ చూసి ఆనందిస్తూ వంతిదేవుడు గుర్రాన్ని మెల్లమెల్లగా నడుపుకొంటూవెళ్ళాడు.

అతని కళ్ళకు చాలానే పనిపడింది. మనస్సు కూడ ఈ దృశ్యాలన్నిటినీ చూస్తూ ఆనందపడసాగింది. కానీ, అతని మనసు లోలోపల, పొగమంచు కప్పినట్లు, ఒక వనితామణి ముఖం కనిపిస్తూనే ఉంది. ఆహా! ఆమె తన ఎర్రని పెదవులను విప్పి తనతో నాలుగు మాటలు మాట్లాడివుండకూడదా? మాట్లాడివుంటే ఆమెకేం నష్టం కలిగేది? ఆమె ఎవరై ఉండవచ్చు? ఎవరై ఉన్నా కూడ, కాస్త మర్యాద వద్దా? నన్ను చూస్తే అంత నిర్లక్ష్యమా? ఆమె ఎవరన్నది చెప్పకనే ఆ ముదుసలి జ్యోతిష్కులు ఏమార్చేశారుగద? ఆయన గట్టివారే; చాల గట్టివారు. ఇతరుల మనసు లోతుల్ని ఎలా చూసి చెప్తున్నారు! ఎంత లోకానుభవంతో మాట్లాడుతున్నారు? ముఖ్యమైన విషయం ఆయన ఏమీ చెప్పలేదు, నిజమే! రాజకీయవిషయాల్లో చాల జాగరూకతతో ఏమీ చెప్పకుండా తప్పించుకొన్నారు! లేదా, అందరికీ తెలిసిన విషయాన్నే చాలా చాతుర్యంతో చెప్పి సరిపుచ్చేశారు. అయినా కూడా, తన అదృష్టగ్రహాలు ఉచ్ఛస్థాయిలో ఉన్నాయన్న మంచిమాట చెప్పారుగద? కుడంద్దై జ్యోతిష్కులు చల్లగా ఉండనీ...

-:-

ఇలా ఆలోచిస్తూ వంతిదేవుడు ముందుకు సాగాడు. అప్పుడు ఎదురుపడ్డ దృశ్యాలు అప్పుడప్పుడూ అతన్ని చింతనాలోకంనుంచి ఈలోకానికి లాగాయి.

చివరికి అరిసిలానదీతీరం చేరాడు. కాసేపు నదివెంబడే వెళ్ళిన తర్వాత, ఎవరోఅమ్మాయిల చేతిగాజుల గలగలలు, వారి కిలకిలలు వినిపించాయి. వారున్నచోటు తెలియనీయకుండా నదీతీరంలో చెట్లు దట్టంగా పెరిగివున్నాయి. వారి ధ్వని ఎక్కడినుంచి వస్తూందని కనిపెట్టేందుకు, నదీతీరాన్ని నిశితంగా చూశాడు. అంతలో, "అయ్యో! మొసలి! భయమేస్తోంది!" అన్న ఆర్తనాదం వినిపించింది. అది వినిపించిన దిశగా గుర్రాన్ని పరుగెత్తించాడు. ఆ అమ్మాయిలున్న చోటు రెండు చెట్లగుంపులకు మధ్య కనిపించింది. వారిలో చాలమంది ముఖాలపై భీతి గూడుకట్టుకొనివుంది. ఆశ్చర్యమాశ్చర్యం! వారిలో ఇద్దరు తను జ్యోతిష్కుల ఇంట చూసినవారే! ఇదంతా వంతిదేవుడు ఒక క్షణంలో చూసి తెలుసుకొన్నాడు. అది మాత్రంకాదు! ఒక దట్టమైన చెట్టు మొదలు దగ్గర, వేళ్లతో వేరుగా, ఒక భయంకరమైన మొసలి సగం నీట, సగం గట్టుపైన, నోటిని భయంకరంగా తెరుచుకొని కనిపించింది. ఇటీవలనే, కొళ్ళిడం నదిలో ఒక క్రూరమైన మొసలిని చూశాడు.  మొసలి ఎంత భయంకరమైన ప్రాణిఅన్నది వినివున్నాడు. కాబట్టి ఈ మొసలిని చూసిన వెంటనే, మనసు చెదరి, ఒళ్ళు జలదరించింది. ఎందుకంటే, ఆ మొసలి ఇప్పటివరకు గలగలా నవ్వుతున్న అమ్మాయిలకు చాలా దగ్గరలో ఉంది. నోటిని బార్లా తెరుచుకొని, ఘోరమైన పళ్లను చూపిస్తూ భయంకరంగా కనిపించింది. మొసలి ఇంకొక్క దూకు దూకితే, ఆ అమ్మాయిల గతి అధోగతే! ఆ అమ్మాయిలేమో, వెనక దట్టంగా పెరిగివున్న చెట్లవల్ల ఎటువైపూ తప్పించుకోలేని స్థితిలో ఉన్నారు.

-:-

వంతిదేవుని మనస్సెంత చెదరివున్నా, అతని గురిమాత్రం ఇసుమంతైనా చెదరలేదు. తాను చేయవలసిందేమన్నదాన్ని గురించికాడా ఒక క్షణంపైన ఆలోచించలేదు. చేతవున్న శూలాన్ని గురిచూసి ఒక్క ఊపుతో విసిరాడు. శూలం మొసలి వెన్నులో దిగి నిటారుగా నిలబడింది. వెంటనే మన వీరుడు ఒరనుంచి కత్తినిదూసి, మొసలిని ఒకే దెబ్బతో ముగించాలని గుర్రంపైనుంచి దూకి పరుగెత్తి వచ్చాడు.

మునుపటిలాగానే, ఆ అమ్మాయిలు గలగలమని నవ్వడం వినిపించింది. వంతిదేవుని చెవులకు అది ఇంపనిపించలేదు. ఇంతటి అపాయకరమైన స్థితిలో వారెందుకు నవ్వుతున్నారు? పరుగెత్తి వచ్చినవాడు ఒక క్షణం అవాక్కై నిలబడిపోయాడు. వారి ముఖాలను చూశాడు. భయభీతులేవీ వారి ముఖాల్లో అతనికి కనిపించలేదు. అందుకు బదులు పరిహాసపు నవ్వుల జాడ చూశాడు. కాసేపటికి మునుపు, "అయ్యో! అయ్యో!" అని కేకలు వేసినవారు వీరేనంటే నమ్మశక్యం కావడంలెదు. వారిలో ఒకతె...జ్యోతిష్కుల ఇంట తాను చూసిన స్త్రీ - గంభీరమైన, ఇంపైన స్వరంతో, "అమ్మాయిలూ! ఊర్కోండి! ఎందుకు నవ్వుతున్నారు?" అని గద్దించడం కలలో వింటున్నట్లు అతని చెవిన పడింది.

మొసలివైపు దూసిన కత్తితో లంఘించినవాడు వెనకడుగు వేసి నిలబడ్డాడు. మొసలిని గుచ్చి చూశాడు. ఆ అమ్మాయిల ముఖాలనుకూడా ఇంకొకసారి గుచ్చి చూశాడు. అతని మనస్సును కుంచింపజేసే ఒక సందేహం ఉదయించింది.

ఇంతలో ఆ స్త్రీమణి తక్కినవారినుంచి విడివడి ముందుకు వచ్చింది. మొసలి ముందు, దాన్ని కాపాడేదానిలా నిలబడింది.

"అయ్యా! మీకు చాల వందనాలు. మీరు వృథాగా శ్రమపడకండి!" అన్నది.

~~~
~~~

# అధ్యాయము - 15

## వాణతి మాయాజాలం

యువరాకుమారి కుందవైదేవి, కొడుంబాళూర్ రాకుమారి వాణతి రథమెక్కి కుడంద్తై నగరంవైపు వెళ్ళారు కద? తర్వాత పడవలో ఉండిపోయిన తక్కిన అమ్మాయిలు ఏం మాట్లాడుకొన్నారో తెలుసుకోవాలి.

“ఒసే, తారకి! ఈ కొడుంబాళూర్ దానికి పట్టిన యోగాన్ని చూశావా? దానిపైన మన యువరాకుమారికి ఏమిటే అంత ఆశ?”

“ఆశాలేదు, ఏమీలేదు, వారిణీ! నాలుగునెలలుగా ఆమె కాస్త పిచ్చి పట్టినట్లుంది. తరచూ తలతిరిగి పడిపోతోంది. తలిదండ్రుల్లేని పిల్లను మనవద్ద విడిచిపెట్టి వెళ్ళారే అని మన యువరాకుమారికి దిగులు. అందుకనే, వాణతికి ఏమైందని అడిగేందుకే జ్యోతిష్కులవద్దకు తీసుకువెళ్ళారు!ఏమైనా దెయ్యం, పిశాచుల చేష్టలై ఉండవచ్చుకద? అలావుంటే, ఏమైనా మంత్రంవేసి పారదోలాల్సి ఉంటుందికద?” అన్నది తారకి.

“దెయ్యమూలేదు, పిశాచీ లేదే!ఈమెను ఏ పిశాచి వచ్చి పట్టుకొంటుంది? ఈమే నూరు పిశాచులను తరిమికొట్టదా?” అన్నది వారిణి.

“వాణతి మైకంవచ్చి పడిపోవడంకూడా నాటకమేనే! ఇలా చేస్తే, మెల్లగా యువరాజును బుట్టలో వెసుకోవచ్చని ఆమె ఉపాయం!” అన్నది ఇంకొకతె.

“నిరవతి చెప్పేదే సరి! అది మాత్రమా? ఆ రోజు యువరాజు బయలుదేరేటప్పుడు చేతిలోవున్న హారతి పళ్ళెం కింద పడవేసిందే? అదికూడా ఆయన తనని గమనించాలని చేసిందే! రెండు చేతులతో గట్టిగా పట్టుకొన్న పళ్ళెం అంత సులభంగా పడిపోతుందా? లేక మన యువరాజేమైనా సింహమా, పులా, ఆయన్ను చూసి అలా భయపడేందుకు?” అన్నది వారిణి.

“వెంటనే మూర్ఛ వచ్చి పడిపోయినట్లు నటించిందే! అందుకు ఎంత తెలివికావాలి?” అన్నది చంద్ర.

“అబద్ధాలు, మాయాజాలాలు చేసేవారికే ఇప్పుడు మంచికాలం!” అన్నది మందాకిని అనే ఇంకొకతె.

“యుద్ధానికి బయలుదేరిన యువరాజు మళ్ళీ తిరిగి వచ్చి ఈమెను చూశారే, అంతకన్నా ఇంకేం కావాలి? ఆవిడ మాయాజాలం ఎంతవరకు ఫలించిందో చూశావా?”

“అదంతా ఏం లేదు; యువరాజు అంత మేలిమిగుణం కలవారు. ఒక అమ్మాయి మూర్ఛవచ్చి

పడిపోయిందంటే, విచారించకుండానే వెళ్ళిపోతారా? దాన్నుంచి నీవేమీ విపరీతార్థాలు కల్పించకు!" అన్నది తారకి.

"యువరాజుల గురించి నీవు చెప్పేదేమో నిజమే; ఆయన వంటి గుణవంతుడు ఏడేడు లోకాల్లో ఇంకెవరున్నారు? కథల్లో, కావ్యాల్లో కూడా లేదు. కానీ నేను చెబుతున్నది వేరు. ఇది - ఈ వాణతి - మైకంవచ్చి పడిపోతుంది కద, అది ఏం మైకం తెలుసా? దాన్నడిగేందుకు జ్యోతిష్కులెందుకు? నన్నడిగితే నేనే చెప్పేదాన్ని!" అన్నది వారిణి.

"అదెలాంటి మైకమే? మాకైనా చెప్పవే!" అన్నది చంద్ర. వారిణి చంద్ర చెవిలో ఏదో చెప్పింది.

"ఏమిటే రహస్యం? మాకు తెలియకూడదా?" అని నిరవతి అడిగింది.

"అది సాధారణ మైకం కాదట! కామపు మైకమట!" అన్నది చంద్ర.

"మన యువరాజు లంకనుంచి తిరిగివస్తే ఇది మళ్ళీ తన మాయవల వీసేందుకు ప్రయత్నిస్తుంది. అందుకు మనం చోటివ్వకూడదు!" అన్నది నిరవతి.

"యువరాజు తిరిగివచ్చే లోపల ఈ వాణతి పిచ్చిపట్టి పైత్యప్రేలాపనలు ఆరంభించక పోతే నాపేరు తారకే కాదు; పేరును తాటకి అని మార్చుకొంటాను!" అన్నది తారకి.

"అదలా ఉండనీయవే! యువరాకుమారి చెప్పివెళ్ళిన పనిని వారు రాకమునుపే చేసేయాలి!" అన్నది మందాకిని.

-:-

తర్వాత వారిలో ఇద్దరమ్మాయిలు పడవ అడుగుభాగంలో అప్పటికే కాస్త పెకలించివున్న ఒక పలకను పూర్తిగా తీసిపడేశారు. పెకలించబడ్డ తావులో పొడవుగా ఒక పట్టెలా ఉన్న పల్లంలో ఒక మొసలి ఉంది! అంటే, చనిపోయిన (లేదా, చంపబడ్డ) మొసలిని భద్రపరిచి దానిలోపల పత్తి, నార మొదలైనవి కుక్కివుంచిన బొమ్మ మొసలి! దాన్ని తీసి బయటపెట్టారు. పడవను నదిబడ్డునే కాస్తదూరం నడుపుకొనివెళ్ళి, వేర్లు బాగా పెరిగిన ఒక పెద్ద చెట్టుదగ్గర ఆపారు. ఆ చెట్టు మొదలుదగ్గర ఆ తోలుబొమ్మ మొసలిని తీసిపడేశారు. అది చెట్టు వేర్లలో సగం, నదివెల్లువలో సగంగా పడివుండి, చూసేందుకు నిజమైన మొసలిలాగానే భయంకరంగా కనిపించింది. నదివెల్లువలో కొట్టుకుపోకుండా దాని కాళ్లలో ఒకదాన్ని దారంతో చెట్టువేరుకు కట్టారు. దారం కనిపించనట్లు నీళ్ళలోనే దాన్ని అదిమిపెట్టారు.

"ఏమే, మందాకిని! ఎందుకీ బొమ్మ మొసలిని ఇలా చెట్టు కింద కట్టివుంచమని చెప్పారు యువరాకుమారిగారు?" అని తారకి అడిగింది.

"నీకు తెలియదా? వాణతి ఒట్టి భయస్థురాలుకద? ఆమె భయాన్ని పోగొట్టి ధైర్యశాలిగా చేసేందుకే!" అన్నది మందాకిని.

“అన్నిటినీ చేర్చిచూస్తే, వాణతిని యువరాజుగారికిచ్చి పెండ్లి చేసేందుకే కుందవైదేవి నిశ్చయించుకున్నట్లుంది!” అన్నది నిరవతి.

“అలా ఏమైనా మాట వస్తే, నేనీ వాణతికి విషమిచ్చి చంపేస్తాను, చూస్తూండు!” అన్నది అసూయాపరురాలైన వారిణి.

“నీవిలా మండిపడ్డానికి కారణమే లేదు. మాన్యకేతపు జంటమండలాల చక్రవర్తి, వేంగీ రాజు, కళింగదేశపు రాజు, ఇంకా చాలా దూరదేశాల రాజులుకూడా మన యువరాజుగారికి తమ కూతురినివ్వడానికి వేచి ఉన్నారట! అలాంటప్పుడు, ఈ కొడుంబాళూర్ వాణతిని ఎవరు లక్ష్యపెడతారే?” అన్నది మందాకిని.

“నీవు చెప్పినట్లే ఆ రాజులందరూ వేచి ఉండవచ్చే! కాని మన యువరాజుల ఇష్టం కదా ముఖ్యం? ఆయన 'నేనెప్పుడైనా పెండ్లి చేసుకొంటే తమిళదేశపు వనితనే చేసుకొంటాను!' అంటున్నారట! మీకందరికీ ఇది తెలియదా?” అన్నది చంద్ర.

“అలాగైతే చాలా మంచిది. మనందరం చేరుకొని మన హస్తలాఘవం చూపించాల్సిందే కద? ఈ వాణతికి చేతనైంది మనకు చేత కాదా? దాని దగ్గరవున్న మాయాజాలపు పొడి మనదగ్గర లేదా?” అన్నది తారకి.

ఇలా ఈ అమ్మాయిలు మాట్లాడుకోవడానికి ఆధారమైన సంఘటన ఏమన్నది ఇప్పుడు పాఠకులకు చెప్పగోరుతాము.

~~~
~~~

# అధ్యాయము - 16

## అరుళ్మొళివర్మ

ఇప్పటికి సుమారు 980[2] ఏళ్ళ క్రితం కో-రాజకేసరి పరాంతక సుందర చోళ చక్రవర్తి దక్షిణదేశంలో సాటిలేని చక్రవర్తిగా విరాజిల్లుతుండేవారు. మన కథ జరగడానికి పన్నెండేళ్ళకు మునుపు ఆయన సింహాసనమెక్కారు. గత నూరేళ్ళుగా చోళుల బలం రోజుకు రోజు పెరుగుతూ వచ్చింది. కానీ, సుందర చోళులు పట్టానికి వచ్చేటప్పటికి, ఉత్తరంవైపు, దక్షిణంవైపు శత్రువులు బలపడసాగారు. ఆయనకు మునుపు పాలించిన గండరాదిత్యులు శివభక్తిలో మునిగి, 'శివజ్ఞాన గండరాదిత్యులు' అని పేరొందారు. ఆయన రాజ్యవిస్తరణలో అంతగా శ్రద్ధ చూపించలేదు. గండరాదిత్యుల తర్వాత సింహాసనమెక్కిన ఆయన సహోదరులు అరింజయులు ఒకే ఒక్క సంవత్సరంపాటు మాత్రమే రాజ్యమేలారు. ఆయన తొండై మండలంలోని ఆట్రూర్ లో వీరమరణం చెందిన తర్వాత, ఆయన కుమారులు పరాంతక సుందర చోళులు తంజావూరు సింహాసనమెక్కారు.

ఒక మహారాజుకు ఉండవలసిన అన్ని గొప్ప గుణాలు, లక్షణాలు, యోగ్యతలు ఆయనకుండేవి. యుద్ధ అనుభవంకోసం సింహాసనమెక్కిన వెంటనే ఆయన దక్షిణంవైపు దండెత్తివెళ్ళారు. శేవూర్ అనే చోట, చోళ సైన్యానికి, పాండ్య సైన్యానికి మహాయుద్ధం జరిగింది. అప్పుడు మదురై రాజైన వీరపాండ్యునికి సహాయంగా సింహళ (లంక) రాజు మహీంద్రుడు ఒక పెద్ద సైన్యాన్ని పంపాడు. చోళసైన్యపు వీరులు ఆ రెండు సైన్యాలను తుడిచిపెట్టేశారు. వీరపాండ్యుడు సైన్యం కోల్పోయి, తోడు (అంటే, అంతరంగ స్నేహితులు) కోల్పోయి, ప్రాణాలు మాత్రం కాపాడుకొని పారిపోయి తప్పించుకొన్నాడు. ఒక కొండగుహలో దాక్కొని కాలం వెళ్ళబుచ్చసాగాడు.

శేవూర్ పోరులో సింహళ (లంక) సైన్యం ఇంచుమించు నిర్మూలమైపోయింది. ప్రాణభయంతో కొద్దిమంది వీరులు మాత్రం లంకకు పారిపోయారు.

-:-

ఇలా చోళులకు, పాండ్యులకు మధ్య జరిగే యుద్ధాలలో సింహళరాజులు తలదూర్చడం పరిపాటైపోయింది. ఈ అలవాటును అడుగంటా తుడిచిపెట్టేసేయాలని సుందరచోళ చక్రవర్తి ఆశించారు. కాబట్టి, ఒకపెద్దసైన్యాన్ని లంకకు పంపి సింహళరాజులకు బుద్ధి చెప్పాలనుకొన్నారు. కొడుంబాళూర్ పరాంతక చిన్న వేళార్ అనబడే ఒక దళపతి నాయకత్వంలో ఒక పెద్ద సైన్యాన్ని లంకకు పంపారు. దురదృష్టవశాత్తు చోళసైన్యం అంతా ఒకేసారి లంకకు వెళ్ళి చేరలేదు. అందుకు కావలసిన ఓడ సౌకర్యంలేదు.

2 1950 దశాబ్దంలెక్క ప్రకారం

మొదట వెళ్ళిన సేన ముందాలోచన లేక తెగించి ముందుకు వెళ్ళసాగారు. మహీంద్రుని సేనాపతి ఆధిపత్యంలో సింహళసైన్యం ఎదురుచూడని విధంగా వచ్చి చోళ సైన్యాన్ని ముట్టడించారు. ఆ భయంకర యుద్ధంలో చోళ సేనాపతి చిన్న వేళార్ తన పేరుప్రఖ్యాతులను ఈ లోకంలో విడిచి వీరమరణం చెందాడు! 'ఈళాన్ని (లంకను) చేపట్టిన పరాంతక వేళార్' అని శిలాశాసనాల్లో పేరు పొందాడు.

ఈ విషయం కొండగుహలో దాగివున్న వీరపాండ్యునికి చేరిన వెంటనే మళ్ళీ ధైర్యంచేసి బయటకు వచ్చాడు. మళ్ళీ పెద్ద సైన్యాన్ని కూడగట్టుకొని పోరాడాడు. ఈసారి పాండ్య సైన్యం పూర్తిగా తుడిచిపెట్టుకుపోవడమేగాక , వీరపాండ్యుని ప్రాణానికే ఎసరువచ్చింది. ఈ పోరులో సుందరచోళ చక్రవర్తి ప్రధమపుత్రుడు ముందు నిలబడి వీరకృత్యాలు చేశాడు. 'వీరపాండ్యుని తలను గెల్చిన కోపర కేసరి' అన్న బిరుదునుకూడా పొందాడు.

కానీ, సింహళ రాజు మహీంద్రునికి గుణపాఠం నేర్పాలనే ఆశ సుందరచోళ చక్రవర్తికి మాత్రమేకాదు - చోళసామ్రాజ్యపు దళపతులు, సామంతులు, సేనాపతులందరి మనసుల్లోకూడ గట్టిగా నాటుకొంది. దండెత్తివెళ్ళేందుకు ఒక పెద్దసైన్యంకూడా సిద్ధమైంది. ఆ మహాసైన్యానికి ఎవరు నాయకత్వం వహించాలనే ప్రశ్న తలెత్తింది. చక్రవర్తి ప్రధమపుత్రుడు - పట్టపుయువరాజైన ఆదిత్య కరికాలన్ - ఆ సమయంలో ఉత్తరదిశగా వెళ్ళివున్నారు. తిరుమునైప్పాడి, జంటమండలాల్లో బలపడివున్న జంట మండలపు సేనలను (రాష్ట్రకూటులను) ఓడించి తరిమికొట్టి పురాతనమైన కంచిని (కాంచీపురం) తమ నివాస స్థలంగా చేసుకొనివున్నారు. అదీగాక, ఉత్తర దేశాలపై దండెత్తివెళ్ళేందుకు సిద్ధమౌతున్నారు.

ఈ పరిస్థితిలో లంకపై దండెత్తబోతున్న సేనకు నాయకత్వం వహించేందుకు చోళదేశపు దళపతుల మధ్య ఒకపెద్ద పోటీ మొదలైంది. పోటీనుంచి అసూయాద్వేషాలుకూడా లేచాయి. పాత తమిళనాడులో పోరుకు పోకుండా తప్పించుకొనేవారు చాలా అరుదు. పోరుకు ఎవరు వెళ్ళడమనే విషయంలోనే పోటీ ఏర్పడుతుంది. అందునుంచి అసూయ, వైరుధ్యం ఏర్పడడంకూడా కద్దు.

సింహళదేశం (లంక) మీద దండెత్తి మహీంద్రునిపై పగదీర్చి చోళుల వీరాధిపత్యాన్ని ఎవరు నెలకొల్పడం అన్న విషయం చోళదేశపు నాయకులమధ్య ఒక పెద్ద చర్చనీయాంశమైంది. ఆ పోటీని అడుగంటా తుడిచిపెట్టి అందరినీ సమాధానపరిచేటట్లు సుందర చోళ చక్రవర్తి చిన్న కుమారుడు అరుళ్మొళివర్మ ముందుకు వచ్చారు. "నాన్నా! పళైయార్ అంతఃపురంలో అత్తలు, బామ్మల మధ్య ఇన్నిరోజులు ముద్దుల బిడ్డగా పెరిగింది చాలు. దక్షిణసేనకు మాతండనాయకునిగా నన్ను నియమించండి. లంకాయుద్ధానికి నేనే నాయకత్వం వహించి లంకకు వెళ్ళివస్తాను!" అన్నారు అరుళ్మొళివర్మ.

అయనకప్పుడు వయసు పందొమ్మిదేళ్ళే. ఆయన సుందర చోళ చక్రవర్తి కడగొట్టు ముద్దులకొడుకు,; పళైయార్ అంతఃపురంలోని రాణులందరికి ముద్దుబిడ్డడు. చోళదేశానికే ముద్దుబిడ్డడు.

సుందర చోళచక్రవర్తి మంచి చూపరి. ఆయన తండ్రిగారైన అరింజయులు, చోళ కులస్థులకు విరోధులైన వైదుంబరాయ వంశపు రాకుమారియైన కల్యాణిని, ఆమె రూపంచూసి ప్రేమించి పెళ్ళాడారు. వారిద్దరికి పుట్టిన కుమారునికి వారు పెట్టిన పేరు పరాంతకుడు. ఆయన రూపంచూసి దేశప్రజలందరూ ఆయనను "సుందర చోళులు" అని పిలవసాగారు. అదే పేరు ఆయనకు స్థిరపడిపోయింది.

అటువంటి రాజుకు పుట్టిన పిల్లలందరూ బహుసుందరమైనవారే. కానీ చివర పుట్టిన అరుళ్మొళివర్మ అందంలో అందరినీ మించిపోయారు. ఆయన ముఖసౌందర్యం మానవాతీతమై, ఒక దైవీక కళ కలిగివుండేది. ఆయన చిన్నబిడ్డగా ఉన్నప్పుడు చోళవంశపు రాణులందరు చాలా ముద్దుచేసేవారు. అందరికన్న ఆయనపైన మిక్కిలి ఆప్యాయత, అనురాగం కలిగివున్నది ఆయన అక్కగారైన కుందవైదేవి. ఆయనకన్న రెండేళ్ళే పెద్దదైనా, ఆయనను పెంచేభారమంతా తన తలపైనే ఉందని తలచిందామె. అరుళ్మొళివర్మ తన అక్కగారంటే అంతే అనురాగం, ఆప్యాయత కలిగివుండేవారు. అక్క గీచిన గీటు తమ్ముడు దాటడు. అక్క ఒక మాట చెప్తే చాలు; దానికెదురుగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు దిగివచ్చి చెప్పినా లెక్కచేయడు. అక్క వాక్కే తమ్మునికి దైవవాక్కు.

తమ్ముని ముఖాన్ని అక్క అప్పుడప్పుడు గుచ్చి చూసేది. మెలకువగా ఉన్నప్పుడు మాత్రమేకాక, నిద్రపోతున్నప్పుడుకూడా ఒక్కొక్కసారి గంటలకొద్ది చూస్తూ కూర్చొనేది. “ఈ పిల్లడికి ఏదో దైవీక (మానవాతీత) శక్తి ఉంది! దాన్ని బయటకు తెచ్చి ప్రకాశింపజేయడం నా బాధ్యత!” అనుకొనేది. తమ్ముడు నిద్రపోయేటప్పుడు వాడి అరచేతిని అప్పుడప్పుడు తనచేతిలోకి తీసుకొని చూసేది. ఆ చేతిలోవున్న రేఖలు శంఖ చక్ర రూపాలుగా ఆమెకనిపించేవి. “ఆహా! ప్రపంచాన్ని ఒక గొడుగు కింద తెచ్చి పాలించేందుకు పుట్టినవాడు కదవీడు!” అనుకొనేది. కానీ ఇతను చోళసింహాసనమెక్కుతాడని అనుకోవడానికే ఆస్కారంలేదు. ఇతనికన్న పెద్దవారు - పట్టానికి అర్హులైన వారు - ఇద్దరున్నారు. మరిక ఇతనికి ఎలా రాజ్యం వస్తుంది? వీడే సింహాసనమెక్కబోతున్నాడో ? దేవుని ఇచ్ఛ ఏమిటో, ఎవరికి తెలుసు! ఈ లోకం చాలా విశాలమైనది. ఎన్నో దేశాలు, ఎన్నో రాజ్యాలు ఈ లోకంలో ఉన్నాయి. భుజబల పరాక్రమంతో ఒక దేశంనుంచి ఇంకొక దేశం వెళ్ళి సింహాసనమెక్కిన రాజులగురించి మనం కథల్లో, కావ్యాల్లో వినలేదా? గంగానది పారే వంగదేశంనుంచి తరిమికొట్టబడ్డ యువరాజు లంకకువెళ్ళి రాజ్యమేలలేదా? వెయ్యేళ్ళుగా ఆ సింహళ రాజవంశం విరాజిల్లడంలేదా?

-:-

ఇలా కుందవైదేవి ఎప్పుడూ ఆలోచిస్తుండేది. చివరికి లంకపైకి దండెత్తబోతున్న సైన్యానికి ఎవరు దళపతి (సేనాపతి) కావాలన్న వివాదం వచ్చినప్పుడు, అందుకు తగినవాడు తమ్ముడే అన్న నిశ్చయానికి వచ్చింది.

“తమ్ముడూ, అరుళ్మొళి! నిన్ను ఒక్కక్షణం విడిచి ఉండాలన్నా ఎంతో కష్టమనిపిస్తోంది. కానీ, నేనే నిన్ను వెళ్ళమని చెప్పే సమయం వచ్చేసింది. లంకపై దండేత్తేందుకు నీవే దళపతిగా వెళ్ళాలి!” అన్నది.

యువరాజు ఇందుకు చాలా కుతూహలంతో ఒప్పుకొన్నారు. అంతఃపురజీవనంనుంచి, రాజమాతల నుంచి ఎప్పుడు విడుదల దొరుకుతుందా అని ఆయన మనసు ఎదురుచూస్తుండేది. తన ప్రియమైన అక్కే ఇప్పుడు వెళ్ళమంటోంది! ఇక అడ్డేమి?

కుందవైదేవి మనసుపడితే, చోళసామ్రాజ్యంలో జరగని కార్యమంటూ లేనేలేదు! సుందర చోళ చక్రవర్తికి తన ముద్దుల కుమార్తెపైన అంత ఆశ, అంత నమ్మకం!

-:-

రాకుమారులు అరుళ్మొళివర్మ దక్షిణపు సేనకు మాతండనాయకులైనారు. లంకకు వెళ్ళారు. అక్కడ కొంతకాలం యుద్ధం చేశారు. కానీ, పోరు అంత సులభంగా ముగిసేటట్లు కనిపించలెదు.. ఆయన యుద్ధవిధానం తక్కిన సేనాపతుల యుద్ధవిధానానికి కన్నచాల విభిన్నంగా ఉండేది. తనదేశంనుంచి ఆయన సేనకు కావలసిన ఆహారసమగ్రి, ఇతర సామగ్రులు సరిగా వచ్చి చేరలేదు. కాబట్టి ఆయన ఒకసారి తన మాతృదేశానికి తిరిగివచ్చారు. తండ్రికి చెప్పి, తన కోరికప్రకారం అన్ని ఏర్పాట్లూ చేసుకొన్నారు. మళ్ళీ లంకకు వెళ్ళేందుకు ఆయత్తమైనారు.

తన ముద్దులతమ్ముని యుద్ధరంగానికి సాగనంపేందుకు కుందవైదేవి పళైయారై ప్రధాన మాళిగలో మంగళకరమైన కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. అరుళ్మొళివర్మ బయలుదేరేటప్పుడు అంతఃపురపు ముఖద్వారం వద్ద జయజయధ్వానాలు మారుమ్రోగాయి; శంఖాలు పూరింపబడ్డాయి.

చోళవంశపు తల్లులందరూ తమ అంతఃపురపు ముద్దుబిడ్డడిని ఆశీర్వదించి, తలపై మంత్రజలం చల్లి, దిష్టి తీసి సాగనంపారు.

అంతఃపురం వాకిలి గడపదగ్గర, అరుళ్మొళి వీధిలోకి అడుగుపెట్టవలసిన చోట, కుందవైదేవి చెలికత్తెలు చేత వెలిగించిన దీపాలు పెట్టిన బంగారపు పళ్ళాలతో నిలబడ్డారు. చెలికత్తెలంటే సామాన్యమైన అమ్మాయిలా? చోళదేశపు పేరుప్రఖ్యాతులు గాంచిన రాజుల కుటుంబాలనుంచి వచ్చినవారు. పళైయారై అంతఃపురంలో శెంబియన్ మహాదేవికి పరిచర్యలు చేయడం, కుందవైదేవికి చెలికత్తెలుగా ఉండడం మహాభాగ్యమని తలచి అక్కడికి వచ్చివున్నవారు. వారిలో కొడుంబాళూర్ చిన్న వేళార్ కుమార్తె వాణతికూడా ఉంది. యువరాజు కాస్తదూరంలో రావడంచూస్తూనే హారతికి సిద్ధమయ్యారు. ఆయన దగ్గరికి వచ్చినవెంటనే హారతి పట్టారు. అప్పుడు ఉన్నట్లుండి వాణతి ఒడలంతా గడగడ వణికింది. చేతిలోవున్న పళ్ళెం జారి కిందపడింది. “అరెరే! ఇదేమి అపశకునం!” అన్న ఆలోచన అందరి మనసుల్లో కలిగింది. కానీ

పళ్ళెం కిందపడ్డతర్వాత కూడా దీపం వెలుగుతుండడం చూసి అందరి మనసులు కుదుటపడ్డాయి. ‘‘ఇది చాల మంచి శకునమే!’’ అని పెద్దలన్నారు.

ఎలాంటి కారణమూ లేక పళ్ళెం జారవిడిచిన ఆ అమ్మాయిని చూసి ఒక చిరునవ్వు నవ్వి ముందుకు సాగారు యువరాజు. ఆయన బయటకు వెళ్ళినవెంటనే, వాణతి తలతిరిగి పడిపోయింది. ’అయ్యో! ఎంతటి తప్పు చేసేశాం’ అన్న బాధే ఆమెను మూర్ఛిల్లజేసింది కాబోలు. కుందవైదేవి ఆజ్ఞ ప్రకారం ఆమె చెలికత్తెలు ఆమెను ఎత్తి తీసుకొనివెళ్ళి ఒక విశ్రాంతి గృహంలో పడుకోబెట్టారు. కుందవైదేవి తన తమ్ముడు బయలుదేరడాన్నికూడా చూడకుండా లోపలికి వెళ్ళి వాణతికి మూర్ఛ పోగొట్ట ప్రయత్నించసాగింది. అరుళ్మొళివర్మ తాను గుర్రం ఎక్కబోయే ముందు, ‘‘పడిపోయిన అమ్మాయి ఎలావుంది? మైకం పోయి తెలివి వచ్చిందా?’’ అని విచారించేందుకు ఒక మనిషిని పంపారు. ఆ భటునికి కుందవైదేవి, ‘‘యువరాజుగారిని ఒకసారిలా వచ్చి వెళ్లమని చెప్పు!’’ అని చెప్పి పంపించింది. అక్కమాటను ఎన్నడూ తోసిపుచ్చని యువరాజు అలాగే మళ్ళీ అంతఃపురంలోపలికి వచ్చారు. వాణతిని తమ అక్కగారు తమ ఎదపై వాల్చుకొని మూర్ఛనుంచి తెప్పరిల్లజెస్తున్న దృశ్యం చూసి ఆయన మనసు కరిగిపోయింది.

‘‘అక్కా, ఈమె ఎవరు? ఈమె పేరేమి" అని అడిగారు.

‘‘కొడుంబాళూర్ చిన్నవేళార్ కుమార్తె; ఈమె పేరు వాణతి. కాస్త భయస్తురాలే!’’ అన్నది కుందవైదేవి.

‘‘ఆహ్! ఈమె ఇప్పుడు మూర్ఛిల్లిన కారణం తెలిసింది. ఈమె తండ్రేకదా లంకకు యుద్ధానికి వెళ్ళి తిరిగిరాక యుద్ధంలో మరణించారు? అది తలుచుకొన్నట్లుంది!’’ అన్నారు యువరాజు.

‘‘కావచ్చు. కానీ ఈమెగురించి నీవు దిగులు పడకు! నేను చూసుకొంటాను. లంకకు వెళ్ళి త్వరలో విజయుడవై రా! అప్పుడప్పుడు నాకు సమాచారం పంపిస్తుండు!’’ అన్నది యువరాకుమారి.

‘‘తప్పక. ఇక్కడ ఏమైనా విశేషాలుంటే అది కూడా నాకు తెలియజేయండి!’’ అన్నారు యువరాజు.

-:-

అప్పుడు, యువరాజుగారి ఇంపైన గొంతు వినో ఏమో వాణతికి మైకం వదిలి తెలివి వచ్చేసింది! మొదట ఆమె కళ్ళు మెల్లగా తెరుచుకొన్నాయి. యువరాజుగారిని చూసిన వెంటనే ఆమె కళ్ళు విప్పారాయి. తర్వాత ముఖంకూడ వికసించింది. చిరునవ్వుతో ఎర్రని బుగ్గలు నొక్కులుపడ్డాయి.

స్పృహ రావడంతో సిగ్గుకూడా వచ్చింది. చట్టున లేచి కూర్చొంది. వెనక్కి తిరిగిచూసింది. తనను యువరాకుమారి కుందవైదేవి తన ఎదపై ఆన్చుకొని ఉండడం చూసి ఇంకా సిగ్గుపడింది. జరిగిందంతా ఒక క్షణంలో జ్ఞాపకం వచ్చింది.

“అక్కా! ఇలా చెసేశానే!” అంటూ కన్నీళ్ళు పెట్టుకొంది.

అందుకు కుందవైదేవి సమాధానం చెప్పేలోపు, యువరాజు, “అందుకు నీవేమీ దిగులు పడవద్దు. పొరబాటు అందరికీ సహజమే. అదీగాక, నీకలా కావడానికి ముఖ్యమైన కారణంకూడా ఉంది. దాన్నే యువరాకుమారిగారికి చెప్తున్నాను!” అన్నారు.

వాణతికి తాను చూస్తున్నది, వింటున్నది నిజమేనా అన్న సందేహం వచ్చేసింది. స్త్రీలను సాధారణంగా తలెత్తికూడా చూడక వెళ్ళిపోయే యువరాజుగారు తనతో మాట్లాడుతున్నారా? తనకు ఓదార్పు మాటలు చెప్తున్నారా? నాకింతటి భాగ్యం చేకూరిందా? - ఆహా! నా ఒడలు పులకిరిస్తోందే! మళ్ళీ మైకం వచ్చేటట్లుందే!...

యువరాజు, “అక్కా! సేనలు వేచివున్నారు. నేను వెళ్ళివస్తాను. మీరు నాకు సమాచారం చెప్పి పంపేటప్పుడు ఈ అమ్మాయి ఆరోగ్యం ఎలా ఉందో కూడా చెప్పి పంపండి. తలిదండ్రుల్లేని ఈ అమ్మాయిని బాగా చూసుకోండి!” అని చెప్పి బయలుదేరి వెళ్ళారు.

-:-

ఇదంతా కుందవైదేవి తక్కిన చెలికత్తెలు పైమేడనుంచి చూస్తూ, వింటూవున్నారు. వారి మనసుల్లో అసూయాగ్ని రగులుకోసాగింది.

ఆరోజునుంచి కుందవైదేవి వాణతిపట్ల ఒక ప్రత్యేకమైన ఆప్యాయత చూపనారంభించింది. తోడువిడవక తనతోనే ఉంచుకొనేది. తాను నేర్చుకొన్న విద్యలు, కళలన్నీ ఆమెకు నేర్పింది. ఎక్కడికి వెళ్ళినా తనతో తప్పక తీసుకొని వెళ్ళసాగింది. అంతఃపురపు నందనవనానికి తరచూ తీసుకొని వెళ్ళి అంతరంగ విషయాలు మాట్లాడేది. తన ముద్దుల తమ్ముని రాబోయే మంచికాలం, పేరుప్రఖ్యాతులను గురించి చెప్పి, తన కలలన్నిటినీ ఆమెకు కూడా చెప్పేది. అదంతా వాణతి చాలా శ్రద్ధగా వినేది.

పైన చెప్పిన సంఘటన తర్వాత వాణతి ఇంకా నాలుగైదుసార్లు తల తిరిగి పడింది. అప్పుడల్లా కుందవై దేవి ఆమెకు తగిన చికిత్సచేసింది.

మెలుకువ వచ్చినప్పుడు లేచికూర్చొని వెక్కి వెక్కి ఏడ్చేది. “ఏమే, పిచ్చీ! ఎందుకేడుస్తున్నావే!” అని కుందవైదేవి అడిగేది.

“తెలియదక్కా! మన్నించండి!” అనేది వాణతి.

కుందవైదేవి ఆమెను హత్తుకొని ఓదార్చేది.

ఇదంతా తక్కిన చెలికత్తెలకు మరింత అసూయకు కారణమైంది.

కాబట్టే, కుందవైదేవి, వాణతి రథమెక్కి జ్యోతిష్కుల ఇంటికి వెళ్ళిన తర్వాత వారలా

మాట్లాడుకొన్నది సహజమే అనిపిస్తుంది కద?

~~~
~~~

## అధ్యాయము - 17

### గుర్రం ముందుకు దూకింది!

సాటిలేని తన తమ్ముడు అరుళ్మొళివర్మకు తగిన పెళ్ళికూతురు వాణాతే అని కుందవైదేవి తీర్మానించింది. కానీ, వాణతివద్ద ఒకేఒక కొరత – అది ఆమె పిరికితనమే. వీరాధివీరుని పెళ్ళిచేసుకోబోయేది, లోకాన్నే ఒక ఛత్రంకింద తెచ్చి పరిపాలించబోయే కుమారుని కనబోయే యువతి, ఇలా పిరికిపందగా ఉండదగునా? ఆమె భయపడే స్వభావాన్ని మార్చి ధీరవనితగా చేయాలని కుందవైదేవి ఆశపడింది. అందుకోసమే ఈ బొమ్మ మొసలి ఆట ఏర్పాటుచేసింది. కానీ, ఆ పరీక్షలో కొడుంబాళూర్ రాకుమారి నెగ్గేసింది.

కుందవైదేవి, వాణతి జ్యోతిష్కుల ఇంటినుంచి తిరిగివచ్చిన వెంటనే పడవెక్కారు. పడవ కాస్త దూరంవెళ్ళింది. తర్వాత నదికి రెండువైపులా దట్టంగా చెట్లున్నచోట పడవను నిలిపి, కుందవై, ఆమె చెలికత్తెలు నీట దిగి జలకాటలాడడం అలవాటు. ఆ చోటనే ఈరోజుకూడా నీట దిగారు.

అందరూ నీట దిగిన తర్వాత, వారిలోఒకతె, “అయ్యో మొసలి!” అని అరిచింది. వారు ఏచెట్టు మొదలు దగ్గర దిగారో, ఆచెట్టుకు అవతలివైపును చూపిస్తూనే, “మొసలి, మొసలి!” అని ఇంకా పెద్దగా అరిచింది. వెంటనే అందరమ్మాయిలూ ఒక్కటిగా, “అయ్యో! మొసలి! భయమేస్తోందే!” అని అరుస్తూ పరుగెత్తారు.

కానీ, పిరికిపందైన వాణతిమాత్రం ఏమాత్రం భయపడలేదు. ఉన్నట్లుండి భయంకరంగా నోరుతెరుచుకొనివున్న మొసలిని అంతదగ్గరగా చూసికూడా భయపడలేదు. తక్కినవారందరు కుందవైదేవి చెప్పినట్లే నటించినా వాణతిమాత్రం భయపడలేదు. “అక్కా! మొసలికి నీట ఉన్నప్పుడే బలమంతా! నేలమీద పడివున్నప్పుడు అదేం చేయలేదు! వీరిని భయపడవద్దని చెప్పండి!” అన్నది కొడుంబాళూర్ కుమారి.

“ఒసే, దొంగా! ఇది నిజమైన మొసలికాదు, బొమ్మ మొసలి అని నీకు ముందే ఎవరో చెప్పివుండాలి!” అన్నారు తక్కినవారు.

“నిజమైన మొసలైనా నాకేం భయంలేదు. బల్లి, బొద్దింకలాంటి కీటకాలను చూస్తే మాత్రమే నాకు భయం!” అన్నది వాణతి.

సరిగ్గా ఆ సమయంలోనే మన వీరుడు వంతిదేవుడు ఆ అమ్మాయిలను ఆ భయంకరమైన మొసలిబారినుంచి కాపాడేందుకు అక్కడకు వచ్చాడు. గుర్రంపైనుంచి ఒక్కదూకు దూకి శూలాన్ని కూడా విసిరాడు.

-:-

మొసలి ముందుకువచ్చి నిలబడి గంభీరంగా మాట్లాడిన ఆ వనితను చూసి వంతిదేవుని ఒడలు పులకరించింది. ఆమె జ్యోతిష్కుల ఇంట తనతో మాట్లాడలేదే అన్న కొరత తీరింది. కానీ, ఆ మొసలి - భయంకరంగా నోరుతెరుచుకొనివున్న మొసలి - అతనికి మనస్సంకటం కలిగించింది. మొసలి ముందుకు వచ్చి నిలబడ్డ కారణమేమి? దానిగురించి శ్రమపడవద్దని చెప్పడంలో అర్థమేమి? ఇంతసేపూ, ఆ మొసలి ఉన్నచోటే పడివుండడానికి కారణమేమి?

ఆ యువతి ఇంకా ఇలా అన్నది:" కుడంద్దై నగరంలో మీరు తొందరపడి జ్యోతిష్కుల ఇంట చొరబడ్డందుకు క్షమాపణ, విచారం తెలిపారు. అందుకు బదులు చెప్పకనే మేము వచ్చేశాము. ఇందునించి చోళదేశపు స్త్రీలకే మర్యాద తెలియదని మీరనుకొని ఉండవచ్చు. అలా మీరనుకోకండి. నాతో వచ్చిన అమ్మాయి ఉన్నట్లుండి మైకం వచ్చి పడిపోయినందువల్ల నా మనసు కాస్త కలతబారి ఉండింది. అందుకే మీకేమీ బదులివ్వలేదు!..."

ఆహా! ఎంత ఇంపైన గొంతు! ఈమె మాటలువిని నామనసు ఎందుకిలా పొంగుతోంది? గొంతెందుకు పూడుకొని పోతోంది? వీణ, వేణువు, మద్దెల కూడ నన్నింతగా మైమరపించజేయలేదే ! నన్నిలా కుదపలేదే! ఆమె మాటలకడ్డుపడి ఏదైనా అందామంటే ఎందుకు నావల్ల కావడంలేదు? ఎందుకు నాలుక కదలడంలేదు? ఎందుకిలా గాలివీచడం పూర్తిగానిలిచిపోయింది? ఎందుకీ అరిసిలానది పారకుండా నిలిచిపోయింది? తర్వాత ఈ మొసలి... అదెందుకిలా ఊరక పడివుంది?

వంతిదేవుని మనసిలా అల్లకల్లోమౌతుండగా, స్వప్నలోకంనుంచి వినవచ్చినట్లు ఆ వనిత స్వరం ఇంకా ఇలా అన్నది: "ఇప్పుడుకూడ అబలలైన మమ్మల్ని కాపాడేందుకే ఈ కార్యం చేశారు. మొసలిపైన శూలాన్ని విసిరారు. ఇంత వేగంగా వస్తున్నప్పుడు కూడ గురితప్పకుండా శూలం విసరగల వీరులు అరుదు..."

-:-

చెట్టుకింద ఒదిగి నిలబడి ఇదంతా వింటూన్న అమ్మాయిలు మళ్ళీ ఫక్కున నవ్వారు. ఆ నవ్వులవల్ల వంతిదేవుని ప్రేమస్వప్నం చెదిరింది. ఆమె మాటల ఇంద్రజాలం చెదిరింది. మొసలిని ఇంకొకసారి నిశితంగా చూశాడు. ఎదుటవున్న ఆమెను లెక్కచేయక ఆమెను దాటుకొని మొసలిదగ్గరికి వెళ్ళాడు. దాని వెన్నులో పాతుకొనివున్న తన శూలాన్ని కదిలించి తీశాడు! శూలం గుచ్చిన చోటినుంచి ఒక్క చుక్క రక్తంకూడ బయటకు రాలేదు! మరింకేం వచ్చింది? కాస్త నార, పత్తి!

మళ్ళీ ఆ దుష్టవనితలు నవ్వారు. ఈసారి గట్టిగా వెకిలిగా నవ్వారు.

వంతిదేవుని మనస్సు, శరీరంకూడా కుంగిపోయాయి. ఇటువంటి అవమానాన్ని అతనెప్పుడూ అనుభవించలేదు. ఇంతమంది అమ్మాయిల ముందు ఇంతటి అవమానమా? - వీరు అమ్మాయిలేనా? కాదు, కాదు! వీరు రాక్షసులు! వీరి పక్కనకూడ నిలబడకూడదు! వీరి ముఖాలనుకూడా చూడకూడదు! ఛీఛీ! నా ప్రియమైన శూలాయుధమా! నీకీ గతి పట్టిందే! ఇటువంటి అవమానమా నీకూ కలగాలి! దీనికి తగిన నివృత్తి చేసి నీ అవమానాన్ని తుడిచిపెట్టేస్తాను!

ఇన్ని ఆలోచనలూ వంతిదేవుని మనసులో మెరుపువేగంతో దూసుకొనివెళ్ళాయి. అక్కడ నిలబడి నవ్విన వారు మగవారైతే ఒకపెద్ద యుద్ధమే జరిగిపోయేది! నవ్వ తెగించినవారు ఆక్షణమే ప్రాణాలు కోల్పోయివుండేవారు! కానీ వీరు స్త్రీలు! వీరిసేం చేయగలం? వీరిని వదిలి పరుగెత్తిపోవడమే చేయదగిన పని!

తన మనస్సును అల్లకల్లోలం చేసిన ఆ వనిత ముఖంకూడా తలెత్తిచూడక, గిరుక్కున వెనుదిరిగి ఒక్కదూకులో నదిగట్టున ఉన్న తన గుర్రాన్ని చేరాడు. అదికూడా ఒక్కసారి సకిలించింది. గుర్రంకూడ ఆ అమ్మాయిలతో చేరి తనను చూసి నవ్వుతున్నట్లనిపించింది వంతిదేవునికి. దానితో తన కోపాన్నంతా ఆ గుర్రంపైనే చూపాడు. దానిపైకిగిరి కూర్చొని, ముక్కుతాడుతో ఒక్కటిచ్చాడు! రోషమున్న ఆ గుర్రం వెంటనే ఆ నదిఒడ్డునే ఉన్న దారి వెంబడి ఉరికింది!

-:-

కాసేపు కుందవైదేవి గుర్రం వెళ్ళినవైపే చూస్తూ నిలబడింది. గుర్రంలేపిన దుమ్ము అణిగేవరకూ చూస్తూనే నిలబడింది.

తర్వాత తన చెలికత్తెలను చూసి, ''అమ్మాయిలూ! మీకింకా మర్యాద, గౌరవం తెలియదు. మీరలా నవ్వి ఉండకూడదు. మనం మాత్రం ఉన్నప్పుడు మీకిష్టమొచ్చినట్లు నవ్వుతూ కేరింతలు కొడుతూండవచ్చు. అన్య పురుషులు వచ్చినప్పుడు ఒద్దికగా ఉండాలికద? చోళదేశపు వనితలగురించి ఆ యువకునికి ఎలాంటి అభిప్రాయం కలుగుతుంది?'' అన్నది.

~~~
~~~

# అధ్యాయము - 18

## ఇడుంబన్‌కారి[3]

కొళ్ళిడం నదీతీరంలో ఆళ్వార్ కట్టియాన్ అనబడే తిరుమలైని వదిలివచ్చేశాం కద? ఆ వీరవైష్ణవుని మనమిప్పుడు కాస్త గమనిద్దాం.

వంతిదేవుడు గుర్రమెక్కి కుడంద్దై నగరంవైపు వెళ్ళిన తర్వాత, తిరుమలై అటువైపే చూస్తూ తనలోతాను ఇలా అనుకొన్నాడు: "ఈ యువకుడు మాచెడ్డవాడు. నిజానికితడు ఎవరి మనిషని తెలుసుకోలేకపోయాంకద! కడంబూర్ భవనంలో జరిగిన రహస్య కుట్ర సమావేశంలో ఇతను పాల్గొన్నాడా లేదా అనికూడ తెలుసుకోలేకపోయాంకద.! అదృష్టవశాత్తు, కుడంద్దై జ్యోతిష్కుల గురించి ఇతనికి చెప్పింది మంచిదైంది. మనం తెలుసుకోలేనిది ఆయనైనా తెలుసుకొంటారు..."

"ఏం, స్వామీ! రావి చెట్టుతో మాట్లాడుతున్నారా? లేక, మీతో మీరే మాట్లాడుకొంటున్నారా?" అన్న గొంతువిని తిరుమలై తిరిగి చూశాడు. కడంబూర్ నుంచి వచ్చి వంతిదేవునికి గుర్రం తెచ్చిపెట్టిన మనిషి కనిపించాడు. "బాబూ! నీవా అడిగావు? నేను నాతోను మాట్లాడుకోవడంలేదు, ఈ రావిచెట్టుతోను మట్లాడడం లేదు. ఈ చెట్టుపైన ఒక బేతాళం ఉంది; దానితో కాస్త సల్లాపమాడుతున్నాను!" అన్నాడు తిరుమలై.

"ఓహో! అలాగండి! ఆ బేతాళం శైవమా? వైష్ణవమా?" అని అడిగాడా మనిషి.

"అదే నేనూ అడుగుతున్నాను. ఇంతలో నీవడ్డం పడ్డావు. బేతాళం మరుగైపోయింది. పోతే పోనీ. నీపేరేం బాబూ?"

"ఎందుకడుగుతున్నారు స్వామీ?"

"నదిమధ్య పడవ తలకిందులు కాకుండా కాపాడావే! అటువంటి పుణ్యవంతుడైన నిన్ను నేను జ్ఞాపకం పెట్టుకోవాలికద?"

"నాపేరు ... నాపేరు ఇడుంబన్‌కారి, స్వామీ!" అని లాగుతూ అన్నాడు.

"ఓ, ఇడుంబన్‌కారినా? ఎప్పుడో, ఎక్కడో విన్నట్లుందే!"

ఇడుంబన్‌కారి అప్పుడు ఒక విచిత్రమైన పని చేశాడు. తన రెండు అరచేతులనూ ఒకదానిపై ఒకటుంచి రెండు చివర్లవున్న చిటికెన వేళ్ళను ఆడించాడు. ఆడిస్తూనే తిరుమలై ముఖాన్ని చూశాడు.

"అయ్యా! ఇదేమి సంజ్ఞ? నాకు అర్థం కాలేదే?" అన్నాడు తిరుమలై.

---

3 ఈ పేరుకర్థం: క్రూరుడు, అసురుడు, అహంకారి, గర్విష్ఠి..అందుకే అనువదించలేదు

నల్లగావున్న ఇడుంబన్కారి ముఖం ఇప్పుడింకా నల్లబడింది.

"నేనా? నేనేం సంజ్ఞ చేయలేదే!" అన్నాడు.

"చేశావు, చేశావు! నేను చూడలేదా? భరతదేశంలో పెరుమాళ్ల (విష్ణువు) దశావతారాల్లో మొదటి అవతారంలాగా చేశావే?"

"పెరుమాళ్ళ మొదటి అవతారం అంటే? అది ఏమి? నాకు తెలియలేదు, స్వామీ!"

విష్ణువు మొదటి అవతారం తెలియదా? మత్స్యావతారం!"

"చేపను చెప్తున్నారా?"

"అవునయ్యా, అవును!"

"మంచివేళ, స్వామీ! మీకళ్ళే విచిత్రమైన కళ్లలాగా ఉన్నాయే! ఒట్టి చెట్టుపైన బేతాళం కనిపిస్తుంది! నా ఒట్టి చేతుల్లో మత్స్యావతారం కనిపిస్తుంది! ఒక వేళ చేపలంటే స్వామికి కాస్త ఇష్టమెక్కువ కాబోలు!"

"ఛీఛీ! అలా చెప్పకు. నేను చేపలు తినేవాడిని కాను. అది పోతేపోనీ. మనతో పడవలో వచ్చిన వీరశైవులెటువైపు వెళ్ళారో చూశావా?"

"చూడకేం? చూశాను. నేను గుర్రం తెచ్చేందుకు వెళ్ళినవైపే వచ్చారు. మిమ్మల్ని తిడుతూనే వచ్చారు."

"నన్నేమని తిట్టారు?"

"మిమ్మల్ని మళ్ళీ చూస్తే, మీ పిలకను గొరిగేసి, బోడి చేసేసి...."

"ఓహో! ఆ పనికూడా ఆయనకు తెలుసా?"

"మీ ఒంటిపైనున్న నామాలన్నీ తుడిచేసి, విభూతి పూస్తారట!"

"అలాగైతే నేనాయనను తప్పక మళ్లీ చూడాలి. ఆయనదేవూరో తెలుసా?"

"ఆయన ఊరు పుళ్ళిరుక్కుం వేళూర్ అని ఆయనే చెప్పుకున్నాడండి!"

"ఆ వీరశైవుని నేను కలిసితీరాలి. ఒకవేళ నీవేమైనా అటువైపు వెళ్తున్నావా?"

"లేదు, లేదు! నేనెందుకటువైపు వెళ్ళాలి? కొళ్ళిడందాటి కడంబూర్ చేరకపోతే నా యజమాని నా కళ్ళు పీకించేయడా?"

"అలాగైతే వెంటనే వెనక్కు మళ్ళు. అదిగో పడవ బయలుదేరబోతోంది!"

ఇడుంబన్కారి తిరిగిచూసినప్పుడు ఆళ్వార్ కట్టియాన్ చెప్పింది నిజమని తెలిసింది. పడవ

బయల్దేరేందుకు సిద్ధంగావుంది.

"సరి స్వామీ! నేను వెళ్తాను!" అని చెప్తూనే పడవవైపు వేగంగా వెళ్ళాడు ఇడుంబన్‌కారి.

సగందారిలో వెనక్కి తిరిగిచూశాడు. ఇంతలో ఆళ్వార్ కట్టియాన్ ఒక విచిత్రమైన పని చేశాడు. గబగబా ఆ రావిచెట్టుపైకెక్కి ఆకులు కొమ్మలు దట్టంగా ఉన్న చోట వెళ్ళి కూర్చొన్నాడు. కాబట్టి అతను ఇడుంబన్‌కారి కంట పడలేదు.

ఇడుంబన్‌కారి పడవవున్న చోటుకు చేరాడు. పడవనడిపేవాడు, "ఆ ఒడ్డుకు వస్తున్నావా, అయ్యా?" అని అడిగాడు.

"లేదు. తర్వాతి పడవలో వస్తాను. నువ్వెళ్ళు!" అన్నాడు ఇడుంబన్‌కారి.

"అరె, అదేమి? నీవు వచ్చే వేగాన్ని చూసి కద బయల్దేరిన పడవను నిలిపాను?" అని అంటూనే పడవనడిపేవాడు తెడ్డు వేస్తూ పడవను నదిమధ్యకు నడిపాడు.

-:-

ఇంతలో రావిచెట్టుపైన ఎక్కి కూర్చొన్న తిరుమలై, "ఓహో! నేననుకొన్నది నిజమే! వీడు పడవలో తిరిగిపోలేదు. తిరిగి వెనక్కే రాబోతున్నాడు. వీడు చూపించిన చేప సంజ్ఞ నేను బాగానే చూశాను. దానికర్థమేమి? చేప...చేప... చేప చిహ్నం దేన్ని సూచిస్తుంది? ఆః! చేప పాండ్యుని జెండాలో పొదిగిన చిహ్నం కదా? ఒకవేళ...ఆహాహా!...అలాకూడా ఉండవచ్చా? చూద్దాం! కాస్త ఓపికపట్టి చూద్దాం. ఓపికవున్నవారు భూమినేలుతారు; అదిలేని వారు కాటినేలుతారు... కానీ భూమినేలడంకన్న కాటినేలడమే మేలనిపిస్తోందికద! కానీ... ఓపిక పట్టి చూద్దాం!..." ఇలా రావిచెట్టులో నిరాకారంగావున్న బేతాళంతో తిరుమలై మాట్లాడుతూ కూర్చొన్నాడు.

త్వరలో అతను ఎదురుచూసినట్లే జరిగింది. పడవ ఇడుంబన్‌కారిని ఎక్కించుకోకనే వెళ్ళిపోయింది. ఇడుంబన్‌కారి నదిఒడ్డునే నిలబడి రావిచెట్టునే గుచ్చిగుచ్చి చూడసాగాడు. తర్వాత నలుదిక్కులా పరకాయించి చూశాడు. ఆళ్వార్ కట్టియాన్ ఎక్కడా లేడని దృఢపరుచుకొని, మళ్ళీ ఆ రావిచెట్టుకిందికే వచ్చి చేరాడు. ఇంకొకసారి చుట్టూ బాగా పరికించి చూసి ఆ చెట్టుకింద కూర్చొన్నాడు. దేనినో, లేదా ఎవరినో, ఎదురుచూస్తున్నట్లు అతని కళ్ళు అటూఇటూ తిరుగుతున్నాయి. కాని తలపైకెత్తి మాత్రం చూడలేదు. చూసివున్నా, తిరుమలై తనను తాను బాగా మరుగుపరుచుకొన్నందువల్ల అతనికి కనిపించే ఆస్కారంలేదు.

సుమారు ఒక ఘడియ కాలం ఇలా సాగింది. తిరుమలై కాళ్లు తిమ్మిరెక్కసాగాయి. ఇంకా చాలసేపు చెట్టుపైన కూర్చోవడం సాధ్యం కాదనిపించింది. వీడేమో చెట్టుకిందనుంచి లేచేటట్లు లేడు. తప్పించుకోవడం ఎలా? ఎంత జాగ్రత్తగా చెట్టుకటుపైపునుంచి దిగినా, ఏదైనా చిన్న శబ్దమైనా ఇడుంబన్‌కారి

వెంటనే చూసి కనిపెట్టేస్తాడు! వాడు తన బొడ్లో ఒక చురకత్తి దోపుకొనివున్నాడాయె! దాన్ని తీసి తనవైపు విసరడని నమ్మకమేమి?

ఇంకేం చేయడం? వెళ్ళి పిశాచిలాగా భయంకరంగా కేకలేస్తూ ఆ ఇడుంబన్‌కారి మీదికి దూకితే? అలా దూకితే తన్ను బేతాళం అనుకొని మూర్చపోవచ్చు! లేదా భయపడి పారిపోవచ్చు! అప్పుడు తాను కూడా పారిపోవచ్చుకద!,,, ఇలా తిరుమలై ఉపాయాలాలాలోచిస్తున్నప్పుడు అతని సందిగ్ధావస్థ ఒక ముగింపుకొచ్చే సంఘటన ఒకటి జరిగింది.

ఒక మనిషి నైఋతి దిశనుంచి అంటే కుడంద్తై నగరంవైపునుంచి ఆ దారిలో వస్తున్నాడు. అతనికోసమే ఇడుంబన్‌కారి ఇంతసేపు వేచివున్నాడని తిరుమలైకి అనిపించింది.

కొత్త మనిషిని చూసినవెంటనే ఇడుంబన్‌కారి లేచి నిలబడ్డాడు.

వచ్చినవాడు ఇంతకు ముందు ఇడుంబన్‌కారి చేసిన సైగను చేశాడు. అదిచూసి ఇడుంబన్‌కారి మళ్ళీ అదే చేప సంజ్ఞ చెశాడు.

“నీ పేరేమి?” అని వచ్చిన మనిషడిగాడు.

“నా పేరు ఇడుంబన్‌కారి. మీ పేరు?”

“నా పేరు సోమన్ శాంభవన్!”

“మిమ్మల్నే ఎదురు చూస్తున్నాను.”

“నేనూ నిన్ను వెతుక్కుంటూనే వచ్చాను.”

“మనం ఎటువైపు వెళ్ళాలి?”

“దక్షిణదిశగానే!”

“ఏ చోటికి?”

“పగవాని పళ్ళిప్పడై!”

“తిరుప్పురంపయం దగ్గర...”

“గట్టిగా అనకు! ఎవరి చెవిలోనైనా పడవచ్చు!” అని చెప్పి సోమన్ శాంభవన్ నాలుగువైపులా పరికించి చూశాడు.

“ఇక్కడెవ్వరూ లేరు. ముందే నేను పరిశోధించి చూశాను.”

“పక్కన దాక్కొనివుండడానికి మరుగైన స్థలమేమీ లేదుకద?”

“లేనే లేదు!”

“అలాగైతే బయలుదేరు. నాకు దారి సరిగ్గా తెలియదు. నీవు ముందు వెళ్ళు. నేను నీ వెనకే వస్తాను. అప్పుడప్పుడు నేను నీ వెనకే వస్తున్నానా లేదా అని తిరిగిచూస్తుండు!”

“అలాగే. దారి బాగాలేదు. గుట్టలూ, చెట్లూ, రాళ్ళూ, ముళ్ళుగా ఉంటుంది. జాగ్రత్తగా చూసుకొంటూ నడిచిరావాలి!”

“సరి, సరి. నీవు బయల్దేరు. అది అడవిదారైనా, ఎవరైనా ఎదురైతే వెంటనే దాక్కోవాలి. తెలిసిందా?”

“తెలిసింది, తెలిసింది!”

ఇడుంబన్‌కారి కొళ్ళిడం నదీతీరం వెంబడి పడమటివైపుగా ముందుకుసాగాడు. అతనికి కాస్త వెనుకగా సోమన్ శాంభవన్ వెన్నంటి వెళ్ళాడు.

ఇద్దరూ కనుమరుగయ్యేంతవరకు  ఆళ్వార్ కట్టియాన్ రావిచెట్టుపైనే కూర్చొని అంతా బాగా విన్నాడు.

’ఆహా! కాలం మాచెడ్డ కాలం! ఎదురుచూడని సంఘటనలు జరుగుతున్నాయి కద! ఏదో ఒక పెద్ద మర్మమైన కార్యం గురించి తెలుసుకొనేందుకు, దేవుని దయవల్ల, ఒక మంచి అవకాశం దొరికింది. ఇక మన సామర్ధ్యాన్ని బట్టి విషయాలు సేకరించాలి. కడంబూర్ మాళిగలో జరిగిన రహస్య సమావేశం గురించి కూలంకషంగా తెలుసుకోలేకపోయాం. ఇప్పుడలా మోసపోకూడదు. తిరుప్పురంపయం పళ్ళిప్పడై అంటే, గంగమండలం రాజు పృథ్వీపతి యొక్క పళ్ళిప్పడై గురించే చెప్పివుండాలి. ఆ పళ్ళిప్పడై కట్టి నూరేళ్ళైంది. కాబట్టి పాడుపడివుంది. చుట్టూ అడవి పెరిగివుంది. ఊరేమో కాస్తదూరంలో ఉంది. వీళ్ళక్కడికెందుకు వెళ్తున్నారు? వీళ్ళిద్దరు మాత్రమే మాట్లాడుకోవాలంటే ఇక్కడే మాట్లాడుకోవచ్చు. అడవిదారినబడి ఒక కోసు దూరం వెళ్ళాల్సిన అవసరంలేదే? కాబట్టి అక్కడికి ఇంకొంతమంది రాబోతున్నారన్నది  ఖాయం. ఎందుకు? పృథ్వీపతి పళ్ళిప్పడై ని వీరిలో ఒకడు 'పగవాని పళ్ళిప్పడై' అని ఎందుకన్నాడు? పృథ్వీపతి ఎవరికి పగవాడు? ఆహా! మనమనుకొన్నది నిజమేననిపిస్తోంది! ఏదేమైనా చూసి తెలుసుకొందాం. వీళ్ళు కొళ్ళిడం నదీతీరం వెంబడి వెళ్తున్నారు. మనం మణ్ణి తీరం వెంబడి వెళదాం. గుట్టలు, అడవులు, రాళ్ళు, ముళ్ళు వున్నా, మనకేమి? అవి మనల్ని చూసి భయపడాలి!..’

ఇలా తనలో తాను చెప్పుకొంటూ తిరుమలై రావిచెట్టు దిగాడు. దిగి కాస్త దక్షిణంగా వెళ్ళాడు. మణ్ణి నది తగిలింది. ఆ నదీతీరం వెంబడి పడమటివైపుగా నడవసాగాడు.

జనసంచారం లేని దట్టమైన అడవులగుండా పయనిస్తూ, పొద్దుగుంకే సమయానికి తిరుప్పురంపయం పళ్ళిప్పడై కోవెల చేరాడు ఆళ్వార్ కట్టియాన్ అనబడే తిరుమలై.

~~~
~~~

# అధ్యాయము - 19

## రణరంగ అరణ్యం

పాతకాలపు తమిళనాడులో యుద్ధరంగంలో వీరమరణంపొందిన వీరులపేర 'వీరగల్లు' నాటి గుడి కట్టడం సంప్రదాయం/పద్ధతి. ఒట్టి వీరగల్లు మాత్రమే నాటితే 'నడుకర్ కోవెల' అని పిలిచేవారు. దానితోబాటు ఏదైనా దేవుని విగ్రహం స్థాపించి గుడికట్టితే, అప్పుడు దాన్ని 'పళ్ళిపడై' అని పిలిచేవారు.

కుడంద్రై నగరానికి అర్ధకోసు వాయవ్యదిశగా మణ్ణినది ఉత్తరతీరంలో 'తిరుప్పరంపయం' అనే ఒక కుగ్రామముండేది. దాని సమీపంలో ఒక పళ్ళిప్పడై ఉండేది. ఇది ఆ ప్రదేశంలో జరిగిన ఒక మహాసంగ్రామంలో వీరమరణంపొందిన గంగైమండలం రాజు పృథ్వీపతి జ్ఞాపకార్థం కట్టింది. ప్రపంచ చరిత్ర చదివినవారు 'పానిపట్ యుద్ధం', 'ప్లాసీ యుద్ధం' మొదలైన యుద్ధాలు చరిత్ర తీరుసే మార్పేశాయని ఎరుగుదురు. తమిళనాడుకు సంబంధించిన వరకు 'తిరుప్పరంపయం' అటువంటి ప్రాముఖ్యత కలిగినది. మన కథ జరిగినప్పటికి సుమారు నూరేళ్ళకు మునుపు ఆ యుద్ధం జరిగింది. దాని వృత్తాంతం తమిళ ప్రజలందరికీ తెలిసివుండడం చాలా ముఖ్యం.

కరికాల్ వళవన్, పెరుంకిళ్ళి, ఇళంశేట్ చెళ్ళి, తొడిత్తోట్ శెంబియన్ మొదలైన చోళవంశపు రాజులు చోళరాజ్యాన్ని రంగరంగ వైభవంగా ఏలిన కాలానికి సుమారు ఐదారువందల సంవత్సరాల తర్వాత చోళ సామ్రాజ్యానికి గ్రహణం పట్టింది. దక్షిణాన పాండ్యులు, ఉత్తరాన పల్లవులు బలం పుంజుకొని చోళులను అడకత్తెరలో పోక చెక్కలాగ నొక్కసాగారు. చివరికి పాండ్యుల పోరు తట్టుకోలేక తమ రాజధానియైన ఉరయూర్ వదిలి వెళ్లవలసి వచ్చింది. అలా వెళ్ళినవారు కుడంద్రై నగరానికి దగ్గరగావున్న పళైయార్రై నగరానికి వచ్చిచేరారు. కానీ ఉరయూర్ తమ రాజధాని అన్న భావాన్ని వదిలిపెట్టలేదు. 'కోళి వేందర్' అన్న పట్టాన్ని కూడ వదిలిపెట్టలేదు.

పళైయార్రై చోళరాజుల్లో విజయాలయ వర్మ చాలా పేరుప్రఖ్యాతులుగాంచిన వారు. ఆయన పలు యుద్ధాల్లో ముందు నిలిచి పోరాడి తన మేనిలో తొంభైతొమ్మిది గాయాలు భరించారు.

<< ఆ రాజును పొగిడే ఒక పద్యం అనువదించ వలసివుంది >>

అని పిదపకాలపు ఆస్థానకవులచేత పొగడబడ్డారు.

ఈయన కుమారుడైన ఆదిత్య చోళుడు తండ్రికి తగిన కొడుకై మహావీరుడుగా ఖ్యాతిగాంచాడు. ఇతనుకూడ పలుయుద్ధాలలో పాల్గొని గొప్ప పేరు పొందాడు.

విజయాలయ చోళ మహారాజు తన వృద్ధాప్యంలో తన కుమారునికి పట్టంకట్టి విశ్రాంతి

తీసుకోసాగారు. ఆ సమయంలో పాండ్యులకు, పల్లవులకు శతృత్వం ముదిరి తరచు పోరాడుతుండేవారు. అప్పటి పాండ్యరాజు పేరు వరగుణ వర్మ; పల్లవరాజు పేరు అపరాజిత వర్మ. ఈ ఇద్దరు రాజులమధ్య జరిగిన యుద్ధాలలో చాలా వరకు చోళరాజ్యం లోపలే జరిగాయి. ఏనుగులు ఢీకొన్నప్పుడు మధ్య చిక్కుపడ్డ కోడిపుంజుకు పట్టిన గతే చోళరాజ్యానికి పట్టింది. ప్రజలు చాలా బాధలు పడ్డారు. కానీ విజయాలయ వర్మ ఈ యుద్ధాలను తనకు లాభించేటట్లు తిప్పుకొన్నారు.

తన చిన్న సైన్యంతో ఆ ఇరుపక్షాలలో ఒకరితో చేరి యుద్ధం చేసేవారు. గెలుపు ఓటములు మారిమారి వచ్చినా, మొత్తానికి చోళదేశపు వీరుల యుద్ధసామర్థ్యం బలపడింది.

-:-

కావేరి నదినుంచి చాలా ఉపనదులు పుట్టి చోళదేశాన్ని సుభిక్షం చేసిన విషయం అందరికీ తెలిసిందే. కొళ్ళిడం నదినుంచి వేరుపడి కొళ్ళిడానికి, కావేరికి మధ్య పారే నది ఒకే ఒక్కటి. అదే మణ్ణి నది.

ఈ మణ్ణి నది ఉత్తర తీరాన పల్లవులకు, పాండ్యులకు మధ్య అతి తీవ్రమైన యుద్ధం కొనసాగింది పల్లవుల సైన్యం, పాండ్యుల సైన్యం ఇంచుమించు ఒకే సంఖ్యాబలం కలిగివున్నాయి. పల్లవులకు సహాయంగా గంగై రాజు పృథ్వీపతి వచ్చాడు. ఆదిత్య చోళుడు కూడా పల్లవుల పక్షం చేరివున్నాడు.

పాండ్య సైన్యంతోను, పల్లవుల సైన్యంతోను పోల్చితే చోళుల సైన్యం చాలా చిన్నదే. కానీ ఈ సారి ఓడితే చోళవంశం అడుగంటా తుడిచి పెట్టుకుపోతుందని ఆదిత్యునికి ఎరుకే. కాబట్టే, సముద్రంలో చేరే కావేరి నదిలా పల్లవుల సైన్యంలోకి వెళ్ళి చేరుకొన్నాడు.

రణరంగం కోసుల దూరంకొద్దీ విస్తరించింది. రథ, గజ, తురగ, పదాతి దళాలు యుద్ధంలో ముమ్మరంగా పాల్గొన్నాయి. కొండతో కొండ ఢీకొన్నట్లు ఏనుగులు ఒకదానితో ఒకటి ఢీకొన్నప్పుడు దిక్కులు దద్దరిల్లాయి. సుడిగాలితో సుడిగాలి ఢీకొన్నట్లు అశ్వాలు ఒకదానితో ఒకటి ఢీకొన్నప్పుడు ఆ అశ్వాలనధిరోహించిన వీరుల చేతుల్లోని శూలాలు మెరుపుల్లా మెరిశాయి. రథాలు ఢీకొని తునాతునకలై నలుదిక్కులా చెదిరి పడ్డాయి. పదాతివీరుల ఖడ్గాలు, శూలాలు ఒకదానితో ఒకటి రాసుకొన్నప్పుడు లేచిన ఝంకారంతో దిక్కులు దద్దరిల్లాయి.

మూడు రోజులు ఎడతెరపి లేకుండ యుద్ధం జరిగిన తర్వాత రణరంగం రక్తపు సముద్రంగా అగుపించింది. చచ్చిన ఏనుగులు, గుర్రాలు కుప్పతిప్పలుగా పడివున్నాయి. విరిగిన రథాల భాగాలు సముద్రంలో విరిగిన పడవ బల్లల్లాగ తేలాయి. ఇరువైపులా వేలాది వీరులు ప్రాణాలు కోల్పోయారు.

-:-

మూడురోజులిలా ఘోరసంగ్రామం జరిగిన తర్వాత పల్లవుల సైన్యంలో ఒకే ఒక్క చిన్న భాగం మిగిలింది. ఆ మిగిలిన సైన్యపు వీరులుకూడ చాల అలిసిపోయివున్నారు. పాండ్య వీరులేమో, అలసటే లేనట్లు పైపైకి వచ్చి ముట్టడించసాగారు. అపరాజితవర్మ యుద్ధశిబిరంలో మంత్రాలోచన జరిగింది. అపరాజితవర్మ, పృథ్వీపతి, ఆదిత్యవర్మ, ఆ ముగ్గురి రాజుల సైన్యాధిపతులు చేరి కూర్చొని సమాలోచన చేశారు. ఇక ఎదురు నిలబడి పోరాడలేమని, వెనుదిరిగి కొళ్ళిడం నది ఉత్తరతీరం చేరుకోవడమే ఉచితమని నిశ్చయించారు.

ఇటువంటి సమయంలో, ఆ యుద్ధరంగంలో ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. వయసు మళ్ళడం వల్ల, కాళ్ళకు తగిలిన విపరీతమైన గాయాల వల్ల లేచి నిలబడే శక్తి కోల్పోయిన విజయాలయవర్మ ఎలాగోలా యుద్ధరంగానికి వచ్చేశాడు. పల్లవులు కొళ్ళిడపు ఉత్తరతీరానికి వెనుదిరిగి వెళ్ళిపోతే చోళులు మళ్ళీ చాలాకాలం వరకు తలెత్తుకోలేరని గ్రహించిన ఆ వృద్ధసింహం చేసిన గర్జన జవసత్వాలుడుగిన పల్లవ వీరులకు కొత్త ప్రాణం పోసింది.

"ఒక ఏనుగు! నాకొక్క ఏనుగునివ్వండి!" అన్నాడు.

"మన గజదళం పూర్తిగా నశించిపోయింది. ఒక్క ఏనుగుకూడా మిగలలేదు." అన్నారు.

"ఒక్క గుర్రం, ఒక్క గుర్రాన్నైనా తీసుకురండి!" అన్నాడు.

"ప్రాణాలున్న గుర్రం ఒక్కటికూడా లేదు!" అన్నారు.

"చోళదేశపు శుద్ధవీరులలో ఇద్దరైనా మిగిలివున్నారా? ఉంటే ముందుకు రండి!" అని విజయాలయవర్మ గర్జించాడు.

ఇద్దరేమి, రెండువందల మంది ముందుకువచ్చారు.

"ఇద్దరు - భుజాల్లో శక్తి, గుండెల్లో తెంపరితనం ఉన్న ఇద్దరు - నన్ను భుజాల మీదికి ఎత్తుకోండి. మిగిలినవారు ఇద్దరిద్దరుగా నావెనుక రండి. నన్ను మోస్తున్నవారు ఒరిగిపోతే వెనుక వస్తున్నవారు నన్నెత్తుకోండి!" అన్నాడా వీరాధివీరుడు.

అలాగే ఇద్దరు భీమసేనులు ముందుకువచ్చి ఆయన్ను భుజాలకెత్తుకొన్నారు.

"వెళ్ళండి! యుద్ధరంగానికి నన్ను తీసుకువెళ్ళండి!" అని గర్జించాడు.

యుద్ధరంగంలో ఒకమూల ఇంకా యుద్ధం కొనసాగుతోంది. ఉత్తరదేశపు సైన్యాన్ని దక్షిణసైన్యం ముట్టడించి వెనక్కి తరిమికొడుతున్నారు. అటువంటి సమయంలో ఇద్దరు భుజాలపైన కూర్చొన్న విజయాలయ చోళుడు తన రెండుచెతుల్లో రెండు పొడవాటి కత్తులను పట్టుకొని పెరుమాళ్ (విష్ణువు) తన

చక్రాన్ని తిప్పినట్లు గిరగిరా తిప్పుతూ శతృసైన్యంలో చొరబడ్డాడు. ఆయన్ను అడ్డగించడానికి ఎవరికీ సాధ్యం కాలేదు. ఆయన దూసుకు వెళ్ళిన దారిపొడవునా శత్రువుల శరీరాలు రెండువైపులా కుప్పలుగా పడ్డాయి.

అవును; ఆ విచిత్రాన్ని చూసేందుకు వెనుదిరిగి పారిపోయిన వీరులు చాలామంది మళ్ళీ ఇప్పుడు ముందుకు వచ్చారు. విజయాలయుని అమానుష వీరత్వాన్ని చూసి ఉత్సాహం పుంజుకొని వారుకూడా మళ్ళీ యుద్ధానికి దూకారు.

అంతే! విజయలక్ష్మి కరుణాకటాక్షం ఇటువైపు తిరిగింది! పల్లవుల సేనాపతులు వెనుదిరిగి కొళ్ళిడం ఉత్తర తీరాన్ని చేరుకొనే ఆలోచనను వదిలిపెట్టారు.

ముగ్గురు సేనాపతులు తమ కీలక బలాలను కూడదీసుకొని యుద్ధరంగంలో జొరబడ్డారు. కాసేపటికల్లా పాండ్యవీరులు వెనుదిరిగారు.

గంగై రాజు పృథ్వీపతి ఆ రోజు యుద్ధరంగంలో అపూర్వ వీరకృత్యాలు చేసి ఆ యుద్ధభూమిలోనే ప్రాణాలువీడి వీరస్వర్యం పొందాడు.

అటువంటి మహావీరుని జ్ఞాపకార్థం ఆ యుద్ధభూమిలో 'వీరగల్లు' నాటారు. తర్వాత 'పళ్ళిప్పడై' కోవెల కూడా కట్టారు.

-:-

అటువంటి మహాక్రూరమైన యుద్ధం జరిగిన ఆ చోట చాలాకాలంవరకు గడ్డికూడ మొలవలేదు. జనాలు సరేసరి - అటువైపు వెళ్ళడంకూడ మానేశారు. ఆ స్థలమంతా కొంతకాలానికి అడవిగా మారింది. కోవెల చుట్టూ అడవి దట్టంగా పెరిగింది. పొదల్లో నక్కలు కాపురం చేయనారంభించాయి. కొంతకాలానికి ఆ పళ్ళిప్పడై కోవెలకు ప్రజలు పోవడమే నిలిచిపోయింది. అందువల్ల ఆ గుడి రోజురోజుకు పాడుపడిపోసాగింది. మనకథ జరిగే సమయానికి అది పూర్తిగాపాడైపోయింది.

ఇటువంటి పాడుపడ్డ ఆలయానికి చీకటిపడే సమయానికి ఆళ్వార్ కట్టియాన్ వచ్చిచేరాడు. ఆ కోవెల మంటపం పై అంచులో అమరివున్న భూతగణాలు అతన్ని భయపెట్టజూశాయి. ఆ వీరవైష్ణవ శిఖామణి దీనికంతా భయపడ్డమా? ఆ మంటపంపైకి లంఘించి ఎక్కాడు. మంటపంపైకి వంగివున్న చెట్ల గుబుర్లలో దాక్కొన్నాడు. నలుదిక్కులా నిశితంగా గమనిస్తూ కూర్చొన్నాడు. అతని కళ్ళు దట్టమైన చీకటిని చీల్చుకొని చూడగలిగిన శక్తి కలిగివున్నాయి. తన చెవులుకూడ అంతే శక్తివంతమై ఎంతటి చిన్న శబ్దాన్నైనా గ్రహించేందుకు సిద్ధంగావున్నాయి.

చీకటి పడి ఒక ఘడియ, రెండు ఘడియలు, మూడు ఘడియలుకూడ గడిచాయి. చుట్టూ కమ్ముకొన్న చీకటి అతన్ని అదిమి ఉక్కిరిబిక్కిరి చేసింది. ఆ సమయంలో ఆ అడవి చెట్లమధ్య ఏదో గలగలమని శబ్దమైంది. అదిగో ఒక అడవికుక్క చెట్టెక్కుతోంది! గుడ్లగూబ ఉరిమిచూస్తోంది! అడవి కుక్కకు

భయపడి ఒక పక్షి పైకొమ్మలకెగిరిపోయి కూర్చొంది. అదిగో, నక్కలు ఊల వేయనారంభించాయి.

తలపైన ఏదో శబ్దమైంది. తలెత్తి చూశాడు. ఉడతో, బల్లో లేక అటువంటి ఒక చిన్న ప్రాణి చెట్టుకొమ్మల్లో ఒకదానిపైనుంచి ఇంకొక కొమ్మపైకి దూకింది.

దట్టంగా పెరిగివున్న ఆ చెట్టుకొమ్మల మధ్య కాస్త తెరపివున్న చోట ఆకాశం కనిపించింది. మిణుగురు పురుగులు 'మిణుక్కు', 'మిణుక్కు' మంటూ కిందకు చూశాయి. ఆకాశంలోని చుక్కలు అతనితో స్నేహం కలుపుకొన్నట్లు కనిపించాయి. అందుకే, ఆళ్వార్ కట్టియాన్ ఆ చుక్కలతో మెల్లని స్వరంతో ఇలా మాట్లాడసాగాడు: "ఓ చుక్కల్లారా! మిమ్మల్ని ఈరోజిలా చూస్తుంటే ఈ భూలోకపు ప్రజల బుద్ధిహీనతను చూసి కళ్లు మిటకరించి నవ్వుతున్నట్లనిపిస్తోంది. నవ్వేందుకు మీకు కావలసినన్ని కారణాలున్నాయి. నూరేళ్ళకు మునుపు ఇక్కడ జరిగిన మహాయుద్ధాన్ని, ఆ తర్వాత చాలారోజులవరకు పారిన రక్తపుటేరుల్ని చూసివున్నారు. మనుషులెందుకు ఒకరినొకరు ఇలా ద్వేషించాలని ఆశ్చర్యపడ్డారు. దీనికి పేరు వీరత్వమట.

ఒక వ్యక్తి చనిపోయి నూరేళ్ళైనా అతనిపైన ఇంకా పగపూనివున్నారు! ఈ పళ్ళిప్పడై 'పగవాని' పళ్ళిప్పడై అట! 'పగవాని' పళ్ళిప్పడై దగ్గర సమావేశమై మంత్రాలోచన చేయబోతున్నారట. చనిపోయిన వారి పేర బతికివున్నవారిని హింసించేందుకు! ఓ చుక్కల్లారా! మీరెందుకు నవ్వరు? బాగా నవ్వండి!

"దేవుడా! ఇక్కడికి వచ్చింది వృథానా? ఈ రాత్రంతా ఇలాగే గడిచి పోబోతోందా? ఎదురుచూసినవారు  ఇక్కడికి రాబోవడం లేదా? నేను విన్నది తప్పా? పథకం మార్చుకొని ఇంకొకచోటికి వెళ్ళిపోయారా? ఏమి ఏమార్పు! ఈ విషయంలో నేను మోసపోతే నన్ను నేను ఎప్పటికీ క్షమించుకోలేను! ... ఆః! అదిగో కాస్త వెలుతురు కనిపిస్తోంది! అదేమి? వెలుతురు కనిపించి మరుగౌతోంది, మళ్ళీ కనిపిస్తోంది! సందేహం లేదు. దివిటీ వెలిగించి పట్టుకొని ఒకడు ఇటువైపే వస్తున్నాడు! లేదు, ఇద్దరు వస్తున్నారు. వేచివున్నది వృథా పోలేదు!..."

వచ్చినవాళ్లిద్దరూ పళ్ళిప్పడై దాటి కాస్త దూరం వెళ్ళారు. దట్టమైన అడవిమధ్య కాస్త బయలుగావున్న చోట నిలబడ్డారు. ఒకతను కింద కూర్చొన్నాడు. చేత దివిటీ పట్టుకొన్నవాడు చుట్టూ చూశాడు. ఎవరిరాకను అతను ఎదురుచూస్తున్నాడనడంలో సందేహంలేదు. కాసేపటికల్లా మరిద్దరు వచ్చిచేరారు. వారు ఇంతకు మునుపు ఈ చోటికి వచ్చినవారైవుండాలి. కాకపోతే ఈ చీకటిలో, ఈ కారడివిలో దారి తెలుసుకొని రాగలరా?

మొదట వచ్చినవారు, తర్వాత వచ్చినవారు ఏదో మాట్లాడుకొన్నారు. కానీ వారు చాలా మెల్లగా మాట్లాడుతుండడంవల్ల ఆళ్వార్ కట్టియాన్ అదేమీ వినలేకపోయాడు. 'ఇంత కష్టపడి వచ్చీ ఏమీ ప్రయోజనం లేదనిపిస్తోందే! వ్యక్తుల గుర్తుకూడా తెలియదు లాగుందే!' అనుకొన్నాడు.

తర్వాత మరిద్దరు వచ్చిచేరారు. మొదట వచ్చినవారు, చివర వచ్చినవారు ఒకరితో ఒకరు మాట్లాడుకొన్నారు. చివరగా వచ్చినవారిలో ఒకతని చేత ఒక సంచివుంది. అతనా సంచిని విప్పి దానిలో వున్నవాటిని కింద పోశాడు. దివిటీ వెలుతురులో బంగారు నాణ్యాలు ధగధగా మెరిశాయి.

ఆ నాణ్యాలను కింద పోసిన వ్యక్తి పిచ్చిపట్టినవాడిలాగ నవ్వి, "మిత్రులారా! చోళదేశపు బొక్కసం కొట్టే చోళదేశానికి ఎసరు పెట్టబోతున్నాం! ఇది పెద్ద వింత కదా?" అని చెప్పి మళ్ళీ నవ్వాడు.

"రవిదాసుగారూ! అరవకండి! మెల్లగా మాట్లాడుకొందాం!" అన్నాడొకడు.

"ఆః! ఇప్పుడిక్కడ గట్టిగా మాట్లాడితేనేం? మన మాటల్ని నక్కలు, అడవి కుక్కలు, గుడ్లగూబలు మాత్రమే కద వినబోతున్నాయి? అదృష్టంకొద్దీ అవి ఎవరికీ వెళ్ళి చెప్పలేవు!" అన్నాడు రవిదాసు.

"అయినప్పటికీ కాస్త మెల్లగా మాట్లాడుకోవడమే మంచిది కద?"

తర్వాత వారు మెల్లగా మాట్లాడుకోసాగారు. ఆళ్వార్ కట్టియాన్ వారిమాటలు వినలేక మంటపం పైన కూర్చొనివుండడం వృథా అనుకొన్నాడు. వారికి దగ్గరలో పొంచివుండి వారి మాటల్ని వినాలి. అందునుంచి రాగల అపాయాలను కూడా ఎదుర్కోవాలి - ఇలా ఆలోచించి ఆళ్వార్ కట్టియాన్ మంటపం పైనుంచి కిందికి దిగేందుకు ప్రయత్నించినప్పుడు అతని శరీరం ఒక రెమ్మకు రాసుకొని సరసరమని శబ్దమైంది.

మాట్లాడుకొంటున్న వ్యక్తుల్లో ఇద్దరు చటుక్కున లేచి నిలబడి, "ఎవరక్కడ??" అని గర్జించారు.

ఆళ్వార్ కట్టియాన్ గుండె కొట్టుకోవడం ఒక క్షణం నిలిచిపోయింది. వారిచేత చిక్కుకోకుండా తప్పించుకోవడం తప్ప వేరే దారిలేదు! పరుగెత్తినా, అడవిలో ఆకుల శబ్దం వినిపిస్తుంది కద? వారు తనను పట్టేయవచ్చుగద?

అదే సమయంలో ఒక గుడ్లగూబ తన రెక్కల్ని టపటపా కొట్టడమే గాక, 'ఊం ఊం!' అని కూసింది.

~~~
~~~

# అధ్యాయము - 20

## ప్రధమ శత్రువు!

**సరైన** సమయానికి గుడ్లగూబ చేసిన ఉపకారాన్ని ఆళ్వార్ కట్టియాన్ మనసులో మెచ్చుకొన్నాడు. ఎందుకంటే, అప్పుడక్కడ సమావేశమైవున్న కుట్రదారులు రెక్కలాడించిన గుడ్లగూబను చూసి అది చేసిన శబ్దమే అనుకొన్నారు. "అరె! ఈ గుడ్లగూబ మనల్ని భయపెట్టేసింది! నరికేయరా దాన్ని!" అన్నాడొకడు. "వద్దు! మీ కత్తుల్ని ఇంకొక ముఖ్యమైన కార్యానికి భద్రపరిచివుంచండి. మన పగవాళ్ళను కూకటివేళ్ళతో తుడిచిపెట్టేందుకు వాటిని పదునుపెట్టివుంచండి.! ఈ గుడ్లగూబలు మన శత్రువులు కావు; అవి మన స్నేహితులు! మనుషులు మామూలుగా నిద్రపోయే సమయంలో మనం మెలకువగా వున్నాము. మనతోబాటు ఈ గుడ్లగూబలు కూడా మెలకువగా వున్నాయి!" అన్నాడు రవిదాసు. అతని మాటల్ని వింటూనే మెల్లమెల్లగా అడుగులో అడుగు వేసుకొంటూ ఆళ్వార్ కట్టియాన్ ఒక పెద్ద చెట్టు కిందకు చేరాడు. నూరేళ్ళ ఆ చెట్టు వేళ్ళు, ఊడలు అన్నివైపులకూ పాకివున్నాయి. ఆ వేళ్లమధ్య, ఊడలమధ్య బాగానే తావుంది. అటువంటి ఒక చోట చెట్టుతో చెట్టుగా చెట్టునానుకొని నిలబడ్డాడు ఆళ్వార్ కట్టియాన్.

"తంజావూర్ రాజ్య బొక్కసం ఉన్నంతవరకు మన అవసరాలకు కావలసిన నగదుకు కొరతలేదు. చేపట్టిన కార్యాన్ని ముగించేందుకు కావలసిన గుండె ధైర్యం ఉండాలి. కార్యం ముగించేవరకు రహస్యాన్ని కాపాడుకొని వచ్చే చాకచక్యం కావాలి! మనలో ఒకజట్టు వెంటనే లంకకు వెళ్ళాలి. ఇంకొక జట్టు తొండై మండలానికి వెళ్ళి కార్యసిద్ధికి తగిన సమయంకోసం వేచివుండాలి. రెండు పనులూ ఇంచుమించు ఒకే సారి జరిగిపోవాలి. ఒక పగవాడిని ముగించిన తర్వాత అవకాశమిస్తే ఇంకొక పగవాడు జాగ్రత్త పడతాడు! అందుకు అవకాశమే ఇవ్వకూడదు. తెలిసిందా? మీలో లంకకు వెళ్ళేందుకు ఎవరెవరు సిద్ధంగావున్నారు? అనడిగాడు రవిదాసు.

"నేను వెళ్తాను!", "నేనే వెళ్ళాలి!" అని చాలా గొంతులు ఒకేసారి వినవచ్చాయి.

"ఎవరు వెళ్ళడమనేది మనం మళ్ళీ పాండ్యనాడులో కలిసినప్పుడు తీర్మానించవచ్చు. అప్పటివరకు ఇక్కడ చేయవలసిన ఏర్పాట్లు ఇంకా కొన్ని ఉన్నాయి.!" అన్నాడు రవిదాసు.

"లంకకు వెళ్ళేందుకు ఏదారి మంచిది?" అని అడిగాడొకడు.

"కోడిక్కరై గుండా వెళ్ళవచ్చు. సముద్రాన్ని దాటేందుకు అది మంచి దారి. కానీ ఇక్కడినుంచి కోడిక్కరై వరకు వెళ్ళడమే కష్టం. దారిపొడవునా శత్రువులే. అక్కడక్కడా గూఢచారులు. కాబట్టి, సేతువుకు

వెళ్ళి అక్కడ కడలిని దాటి మామిడితోపు దగ్గర దిగడం మంచిది. లంకకు వెళ్ళే వాళ్ళు ఓడ నడపడం, పడవ తెడ్డు వేయడం, సముద్రంలో ఈదడం తెలుసుకొనివుండాలి. ఇక్కడ ఎవరికి ఈదడం తెలుసు?"

"నాకు తెలుసు!", "నాకు తెలుసు!" అని చాలా మంది అనడం వినవచ్చింది.

"మొదట, లంకాధిపతి మహీంద్రుని కలిసి మాట్లాడాలి. తర్వాతే మన పని మొదలు పెట్టాలి. కాబట్టి లంకకు వెళ్ళే వారిలో ఒకరికైనా సింహళ భాష తెలిసివుండాలి. ఆ! మన సోమన్ శాంభవన్ ఇంకా వచ్చి చేరలేదేమి? ఎవరైనా అతన్ని ఈ రోజు చూశారా?"

"ఇదిగో వచ్చేశాను!" అని ఆళ్వార్ కట్టియాన్ దాగివున్న చోటికి అతి సమీపంనుంచి ఒక గొంతు వినిపించింది. తిరుమలై చెట్టును ఇంకా హత్తుకొని నిలబడ్డాడు. అరెరె! ఈ పాడు శరీరం ఇంత పెద్దగా పెరిగివుండడం ఎంత సంకటంగా వుందిప్పుడు?

కొత్తగా ఇద్దరు వచ్చి ఆ కూటమిలో చేరుకొన్నారు.

ఆళ్వార్ కట్టియాన్ చెట్టుచాటునుంచి కొద్దిగా ముఖాన్ని బయటకు చాచి తొంగి చూశాడు. కొత్తగా వచ్చినవారిద్దరుకూడ తాను కొళ్ళిడం నదిఒడ్డున రావిచెట్టుకింద చూసినవారేనని తెలిసింది.

-:-

కొత్తగా వచ్చినవారిని చూసిన వెంటనే రవిదాసు, "రండి! రండి! ఒకవేళ మీకేమైనా ఆపత్తు కలిగిందేమో, రానే రారేమో అనుకొన్నాను. ఎక్కడినుంచి ఏ దారిన వచ్చారు?" అన్నాడు.

"కొళ్ళిడం నదిఒడ్డునే వచ్చాము. దారిలో ఒక నక్కల గుంపు ఎదురుపడింది. వాటికి చిక్కుపడకుండ తప్పించుకొని వచ్చేందుకు కాస్త ఆలస్యమైంది!" అన్నాడు సోమన్ శాంభవన్.

"పులులకు , సింహాలకు భయపడితే అర్థంవుంది. నక్కలకు భయపడే వాళ్ళు ఏకార్యం సాధించగలరు ?" అన్నాడాకూటమిలో అప్పటికే వచ్చి చేరివున్నవారిలో ఒకడు .

"అలా అనకయ్యా! సింహాలు, పులులకన్నా నక్కలు చాలా అపాయకరమైనవి. ఎందుకంటే, సింహం, పులి ఒక్కొక్కటే మనపైకి దాడి చేసే క్రూర జంతువులు. కానీ, నక్కలు గుంపులు, గుంపులుగా వచ్చి దాడి చేస్తాయి. అందుకే వాటి బలమెక్కువ. ఈ చోళదేశపు నక్కలు పెద్దగుంపుగా వచ్చినందువల్లనే కదా మన రారాజు ప్రాణాలు కోల్పోయారు? లేకపోతే అలా జరిగివుంటుందా?"

"ఆ నక్కలను సమూలంగా నాశనం చేసేస్తాం" అని రోషంతో అరిచాడు సోమన్ శాంభవన్.

"ఇదిగో అందుకవసరమైన ఉపకరణాలు!" అని రవిదాసు బంగారు నాణాల కుప్పను చూపించాడు.

సోమన్ శాంభవన్ కొన్ని నాణ్యాలను చేతిలోకి తీసుకొని చూసి, "ఆ! ఒకవైపు పులి!

ఇంకొకవైపు గుర్రం!" అన్నాడు.

"చోళుని బంగారం; పళువేట్టరయ్యర్ ముద్ర. నేను చెప్పింది చెప్పినట్లు నెరవేర్చాను. మీ సమాచారమేమి? మన ఇడుంబన్‌కారి ఏదైనా సమాచారం తెచ్చివుండాలే? అన్నాడు రవిదాసు.

"ఔను! తెచ్చివున్నారు. ఆయనసే చెప్తారు వినండి!"

-:-

ఇడుంబన్‌కారి చెప్పనారంభించాడు.: "మీ ఆజ్ఞ ప్రకారమే శంభువరయ్యర్ భవనంలో పనివాడుగా చేరి పనిచేస్తూ వస్తున్నాను. దాని ఫలితం నిన్నరాత్రి సిద్ధించింది. నిన్నరాత్రి ఆ భవనంలో ఒక పెద్ద విందు జరిగింది. పెద్ద పళువేట్టరయ్యర్, వణంగాముడి ముణైయరయ్యర్, మళపాడి మళువరయ్యర్ మొదలైన వారందరు వచ్చారు. కురవై ఆట, వేలన్ ఆట జరిగాయి. వేలన్ ఆట ఆడిన దేవరాళన్ పూనకం వచ్చి [గురి] చెప్పాడు. అతను చెప్పింది మనకనుకూలంగానే వుంది. పళువేట్టరయ్యర్ వెంట వచ్చిన మూసిన పల్లకిలో వున్నది ఆయన రాణి అని అందరూ అనుకొన్నారు. సుందర చోళ మహారాజు ఆరోగ్యం ఏమీ బాగా లేదని, ఇక చాలా రోజులు బతకరని పళువేట్టరయ్యర్ తెలియజేశారు. అందరి తరఫున, సుందరచోళ మహారాజు తర్వాత పట్టానికి రావలసినది ఆదిత్య కరికాలన్ కాదు, మధురాంతక దేవరేనని అందరు చేరి తీర్మానించారు. కానీ, ఇందుకు మధురాంతకులు సమ్మతిస్తారా అని కొందరడిగారు. 'ఆయన నోటనే అందుకు సమాధానం చెప్పిస్తాను', అని పళువేట్టరయ్యర్ చెప్పి, మూసిన పల్లకి తెరను తొలగించారు. దానిలోనుంచి మధురాంతకులు బయటకు వచ్చారు! పట్టాభిషేకానికి తనకు సమ్మతమేనని తెలియజెప్పారు..."

"ఇలా ఆడవేషం వేసే పరాక్రమశాలికి పట్టం కట్టబోతారట! కట్టనీ, బాగా కట్టనీ; అంతా మనమెదురుచూసినట్లే జరుగుతోంది. ఇలా చోళదేశంలోనే ఒక సంక్షోభం జరగడం మన లక్ష్యం నెరవేరేందుకు చాలా ఉపకరిస్తుంది. ఏదెలా జరిగినా, మనసెవరూ సందేహించరు కద? ఇడుంబన్‌కారి! అతి ముఖ్యమైన సమాచారం తెచ్చివున్నారు. కానీ, ఇదంతా ఎలా తెలుసుకొన్నారు? ఇందుకు సందర్భమెలా దొరికింది?" అని అడిగాడు రవిదాసు.

"మధ్యరాత్రి వారు రహస్య సమావేశమైనప్పుడు, అటువైపెవరూ రాకుండా నన్ను కాపలా పెట్టారు. కాపలా కాస్తూనే నా కళ్లను, చెవులనూ బాగా ఉపయోగించాను..."

"అలా ఉపయోగించినందువల్ల ఇంకేమైనా విషయాలు తెలిశాయా?"

"తెలిసింది. ఆ నడిరేయి కూటమిలో జరిగిందంతా ఇంకొక పరాయి వ్యక్తి కోట గోడ పైనుంచి గమనిస్తూ వచ్చాడు!"

"ఆఁ! ఎవడు వాడు?"

"ముందు పిలకవున్న ఒక వైష్ణవుడు..."

"ఆహా! వాడేనా? నేనూ అలాగే అనుకొన్నాను! వాడిని మీరేం చేశారు? వాడిని పట్టి శంబువరయ్యర్ గారికి అప్పగించలేదా?"

"లేదు. ఒకవేళ అతను మనవాడేమోననుకొన్నాను. మీరే అతన్ని పంపించారేమోనని కూడా అనుకొన్నాను."

"పెద్ద పొరపాటు చేసేశారు. వాడు మనవాడు కాడు. లావుగా, పొట్టిగా ఉంటాడు. జగడాలమారి. పేరు తిరుమలై. 'ఆళ్వార్ కట్టియాన్' అని చెప్పుకొంటాడు..."

"అతనే. నేను చేసిన పొరపాటు ఈరోజు మధ్యాహ్నం నేనే గ్రహించాను. అతను మనవాడు కాడని తెలిసింది."

"అదెలా తెలుసుకొన్నారు?"

"నిన్న రాత్రి గందమారన్ బాల్యమిత్రుడొకడు కూడా కడంబూర్ మాళిగకు వచ్చాడు. అతనికీ, పళువేట్టరయ్యర్ కూటమికి ఏమీ సంబంధం లేదని తెలిసింది. అతను అక్కడే ఒకమూల పడుకొని నెమ్మదిగా నిద్రపోయాడు. పొద్దున చిన్న యజమాని (గందమారన్) తన స్నేహితుని సాగనంపేందుకు కొళ్ళిడం వరకు వచ్చారు. ఆయన రాబోతున్నారని తెలిసి ఆయన ముందు వెళ్ళి నిలబడ్డాను. ఆయన నన్నుకూడా వెంట రమ్మన్నారు. ఆయన కొళ్ళిడం ఉత్తరతీరానే వెనుదిరిగారు. నన్ను దక్షిణతీరానికి వెళ్ళి ఆ యువకునికి ఒక గుర్రాన్ని సంపాదించి పెట్టి తిరగిరమ్మన్నారు. అక్కడినుంచి కుడంద్తై నగరానికి వెళ్ళి, మా అత్తను చూసేసి తిరిగివస్తానని చెప్పాను. అందుకే ఎవరికీ సందేహం రానట్లు ఇక్కడికి రాగలిగాను."

"అదంతా సరే; ఆ వీరవైష్ణవుని గురించి ఎలా తెలుసుకొన్నారు?"

"కొళ్ళిడంలో పడవ బయల్దేరే సమయానికి అతను వచ్చి పడవెక్కాడు. అతను గందమారన్ స్నేహితునితో కాస్త కారాలు మిరియాలు నూరుతూ మాట్లాడిన కొన్ని మాటలు విని నాకు సందేహం వచ్చింది, అతనూ మనవాడేమోనని. అదీగాక, కొళ్ళిడపు దక్షిణతీరాన అతను నాకోసం వేచివున్నట్లు అన్పించింది. మన రహస్య సంకేతాన్ని చేసి చూపించాను. కానీ అతను అర్థంచేసుకోలేదు. కాబట్టి అతను మనవాడు కాడని తీర్మానించాను..."

"మీరు చేసినది చాలా పెద్ద పొరపాటు! వెనకాముందు తెలియనివారి ముందు మన సంజ్ఞ చేసి చూపించకూడదు, మిత్రులారా! ఇది వినండి. మన కార్యం కాంచీపురంలో వుంది! లంకలో కూడా వుంది. ఈరెండు చోట్లకూడా మన విరోధులున్నారు. కానీ, ఆ ఇద్దరికన్నా, మన అతిపెద్ద విరోధి, ఆళ్వార్ కట్టియాన్ అని చెప్పుకొని తిరిగే తిరుమలైయప్పనే! వాడు మనల్ని, మన గురిని సమూలంగా నాశనం చేయగలవాడు. మనందరికి సాటిలేని నాయకురాలిగా ఉన్న దేవిని వాడు తీసుకు వెళ్ళిపోవడానికి

చూస్తున్నాడు. ఇక, మీలో ఎవరైనా వాడిని ఏ పరిస్థితిలో చూసినా సరే, చేతిలోవున్న ఆయుధాన్ని ప్రయోగించి వాడిని అక్కడికక్కడే చంపేయండి! ఏ ఆయుధమూ లేకపోతే, చెతులతో గొంతు పిసికి చంపేయండి! లేక, యుక్తితో విషమిచ్చి చంపండి. లేక, నదిలో మొసలికి ఎరగా వేసి చంపండి. తేలు, పాము, మండ్రగబ్బ మొదలైన వాటిని చూస్తే ఎలా దయాదాక్షిణ్యం లేకుండా చంపేస్తారో, అలాగే చంపేయండి! దుర్గాదేవికో, కణ్ణగి అమ్మవారికో బలి ఇస్తే ఇంకా విశేషం. వాడు బతికున్నవరకు, మన లక్ష్యసాధనకు అడ్డు వస్తూనేవుంటాడు!...''

''రవిదాసుగారూ! మీరింత పెద్దగా అతన్ని గురించి చెప్పడం చూస్తే అతను చాలా పెద్ద కార్యశూరుడిలాగ అనిపిస్తున్నాడు. నిజానికతనెవరు?''

''ఎవరా? వాడు భయంకరమైన అధికారాలుగొన్న గూఢచారి!''

''ఎవరి గూఢచారి?''

''నాకే అది చాలాకాలంవరకు తెలియలేదు. సుందర చోళుని గూఢచారో, ఆదిత్య కరికాలన్ గూఢచారో అనుకొన్నాను. లేదని తెలుసుకొన్నాను. పళైయారైలో ఉందే ఒక వృద్ధ పాతకి, ఆ పెద్దరాణి గూడచారి కావచ్చని ఇప్పుడు సందేహిస్తున్నాను.!''

''ఆహా! అలాగా! శివభక్తిలో మునిగి, ఆలయ సేవలు చేస్తూ కాలం వెళ్ళబుచ్చే ఆ శెంబియన్ మాదేవికి గూఢచారెందుకు?''

''అదంతా కల్ల. ఈ ముందుపిలకవాడి వీరవైష్ణవత్వం ఎలా పైపైవేషమో, ఆ ముసలి రాణి శివభక్తికూడా అంతే. కన్న కొడుక్కే శత్రువుగా ఉన్న పిశాచి కద? అందుకే కద, ఆమె సొంత సహోదరుడైన మళవరైయన్ కూడా ఆమెతో పోట్లాడి, పళువేట్టరయ్యర్ జట్టు చేరాడు?''

''రవిదాసుగారూ! ఆ ముందుపిలకవాడిలాగా ఇంకెవరైనా ఉన్నారా?''

''కుడందైలో ఒక జ్యోతిష్కుడున్నాడు. వాడిపైన కూడా నాకు సందేహంవుంది. వచ్చిపోయేవాళ్ళకు జోస్యం చెప్పేటట్లు చెప్పి, వారి నోటితాళం విప్పించి విషయాలు తెలుసుకొంటున్నాడు. వాడిదగ్గరకు మీరెవ్వరూ పోకూడదు. పోతే తప్పక ఏమారిపోతారు.''

''అతను ఎవరి గూఢచారని మీరనుకొంటున్నారు?''

''అది నేనింకా కనిపెట్టలేకున్నాను. ఇప్పుడున్న దొంగ యువరాజు గూఢచారి కావచ్చు. కానీ, ఆ జ్యోతిష్కుని గురించి నాకంత దిగుల్లేదు. వాడివల్ల అంతపెద్ద ఆపదేం రాబోదు. వైష్ణవుని విషయంలోనే నాకు భయం! వాడిని చూసిన చోటే, తేలు, మండ్రగబ్బ, పామును కొట్టి చంపేటట్లు కనికరంలేకుండా చంపేయాలి!''

-:-

చెట్టు మరుగున నిలబడి ఇదంతా వింటున్న ఆళ్వార్ కట్టియాన్ ఒళ్ళు గడగడ వణికింది; ఒళ్ళంతా చెమర్చింది. ఆ చెట్టు కిందినుంచి ప్రాణాలతో బతికి బయటపడతానో లేనో అన్న సందేహం వచ్చేసింది.

అది చాలదన్నట్లు, అదే సమయంలో అతనికి తుమ్ము వచ్చింది. ఎంతగా అదిమిపెట్టినా సాధ్యంకాలేదు. నోట బట్ట కుక్కుకొని, 'నచ్' అని తుమ్మాడు.

అప్పుడు గాలికూడా వీచడంలేదు. చెట్ల గలగలకూడ నిలిచిపోయింది.

కాబట్టి తిరుమలై అదిమిపెట్టుకొన్నప్పటికీ, అతని తుమ్ము ఆ పక్కనే నిలబడి మట్లాడుకొంటున్న కుట్రదారులకు  కాస్త వినిపించేసింది.

“ఆ జమ్మి చెట్టు వెనకనుంచి ఏదో శబ్దం వినిపించింది. దివిటీ తీసుకుని వెళ్లి అదేమని చూడు!” అన్నాడు రవిదాసు.

దివిటీ పట్టుకొన్నవాడు చెట్టువైపు రాసాగాడు. అతను దగ్గరకు వస్తున్నకొద్దీ, వెలుతురు ఎక్కువౌతోంది. అంతే! ఇక చెట్టు మొదలుకు వచ్చేశాడు. కాస్త తిరిగితే దివిటీ వెలుతురు తనపైన పడుతుంది! తర్వాత ఏం జరుగుతుంది? బతికి బయటపడితే పునర్జన్మే!

తిరుమలై గుండె వేగంగా కొట్టుకొంది. తప్పించుకోవడానికి  ఏదైనా దారివుందా అని చుట్టూ చూశాడు. దారి కనిపించలేదు. అక్కడ చెట్టు మొదలునుంచి వేరుపడి పెరిగివున్న ఒక కొమ్మనుంచి ఒక రాక్షస గబ్బిలం తలకిందులుగా వేలాడుతూ తపస్సు చేస్తోంది! చట్టున చేతులు చాచి ఆ గబ్బిలాన్ని పట్టుకొని సిద్ధంగా నిలబడ్డాడు.

దివిటీ పట్టుకొన్నవాడు చెట్టును దాటి వచ్చినవెంటనే గబ్బిలాన్ని వాడి ముఖంపైకి విసిరాడు.

దివిటీ కింద పడింది. వెలుతురు మరుగైంది. ముఖంపైన దెబ్బతిన్నవాడు, “ఏ! ఏ! ఏమది? ఏమది?” అని కంగారుగా అరిచాడు. పలువురు పరుగెత్తి వచ్చే శబ్దం వినిపించింది. ఆళ్వార్ కట్టియాన్ కూడ పరుగెత్తనారంభించాడు. మరుక్షణం దట్టమైన అడవిలో దూరి మరుగైనాడు.

పలువురు చేరి, “ఏమైంది? ఏమైంది?” అని కేకలు వేశారు. దివిటీ పట్టుకొన్నవాడు తనపైన గబ్బిలం వచ్చి కొట్టిన విషయం వివరించసాగాడు. ఇదంతా తిరుమలైకి కాసేపటివరకు వినిపిస్తూంది.

~~~
~~~

# అధ్యాయము - 21

## తెర కదిలింది!

**ఒకేసారి** ఒకనిలోపల రెండు మనస్సులు ఇమడసాధ్యమా? సాధ్యమని ఆ రోజు వంతిదేవునికి తెలిసింది.

చోళదేశంలో సారవంతమైన ప్రదేశాలలో అతి సారవంతమైన ప్రదేశాల మీదుగా వెళ్తున్నాడు వంతిదేవుడు. నదుల్లో కొత్త వెల్లువ పారుతున్న సమయం. కాలువలు, తూముల్లో నదినీరు పొంగి పొలాల్లోకి పారుతున్న సమయం. ఎక్కడ చూసినా నీటిమయం. చోళనాడే సారవంత ప్రదేశానికి (= వళనాడు) మారు పేరై వెలుగొందిన కాలమది. ఇలా అనుకొన్న వెంటనే, చోళ రాజ్యానికి, చోళరాజుకు ముంచుకొస్తున్న అపాయాలు గుర్తుకొచ్చాయి. ఇటువంటి పరిస్థితిలో తన కర్తవ్యం ఏమి? యువరాజు కరికాలన్ ఇచ్చిన తాళపత్ర సందేశాన్ని చక్రవర్తికి అందించి తన కర్తవ్యం ముగిసిందని ఉండిపోవడమా? ఈ రాజవంశపు దాయాది తగాదాల్లో తానెందుకు తలదూర్చాలి? చోళదేశపు సింహాసనాన్ని ఎవెరెక్కితే తనకేం? చూడబోతే, తన పూర్వీక శత్రువులే కద వీరు? చోళులు, గంగై వంశస్థులు, పైదుంబరాయవంశస్థులు కూడబలుక్కొనే కద వాణర్ కులమే లేకుండ తుడిచిపెట్టేశారు? ఈరోజు ఆదిత్య కరికాలన్ తనను ఆదరంగా చూడడంవల్ల ఆ అవినీతి మరుగైపోతుందా?... ఛీఛీ! ఆ పాత సంభవాలను అవినీతి అని ఎలా చెప్పగలం? రాజులంటే, ఒకరితోఒకరు పోట్లాడడం సహజం. అలాగే, జయాపజయాలు ఇరుపక్షాలను మార్చి, మార్చి వరించడంకూడా సహజమే. గెలిచినవారిపైన ఓడినవారు కోపించి ప్రయోజనమేమి? మన తాతముత్తాతలు మంచిస్థితిలో ఉన్నప్పుడు ఇతర రాజులను ముప్పతిప్పలుపెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించారు కద? వారిని సమూలంగా నాశనం చేయజూశారు కద? ఆఁ! అదేం పాట ? ఇదిగో తలపుకొస్తోంది...

<< వాణర్ కులపు రాజుల గురించి ఒక పద్యం >>

ఇలా యుద్ధరంగంలో చాలా క్రూరమైన కార్యాలను మన పూర్వీకులుకూడా చేసివున్నారు. యుద్ధంలో ఓడిపోయినవారి గతి ఎప్పుడూ అధోగతే! రామునిలాగ, ధర్మరాజులాగ అందరు రాజులూ కరుణామూర్తులై ఉండగలరా? వారలా ఉన్నందువల్లే కద అడవికి పోయి కష్టాలు పడ్డారు! వీరులైవుండి, వీరపురుషుల తోడుండికూడ బహు కష్టాలు పడ్డారు. రాజకీయాలలో కరుణ అనేదే కూడదు. చూడబోతే, చోళవంశస్థులు కాస్త కరుణవున్నవారే అని చెప్పాలి. శత్రువులను కూడా వీలైతే మిత్రులుగా చేసుకొనేందుకు చూస్తున్నారు. అందుకోసం కులం బయట పెళ్ళికూడా చేసుకొంటున్నారు.! సుందర చోళుల తండ్రి అరింజయ చోళులు పైదుంబరాయల కుమార్తెను పెళ్ళిచేసుకోలేదా? అందానికి పేరొందిన ఆ కల్యాణి కుమారడైనందువల్లే కద సుందర చోళ చక్రవర్తి, ఆయన బిడ్డలు జగదేక సౌందర్యంతో విరాజిల్లుతున్నారు?

ఆహా! సౌందర్యవతి అన్న వెంటనే మనం ఆ కుడంద్తై జ్యోతిష్కుల ఇంట చూసిన ఆ జగదేక సుందరి తలపుకొస్తోంది కద!

-:-

వంతిదేవుని బాహ్యారంగం చోళదేశపు సహజ సౌందర్యాలను చూస్తూ, చోళదేశపు రాజకీయ సమస్యలను గురించి ఆలోచిస్తుండగా, అతని అంతరంగం (లోలోపలి మనస్సు) ఆ స్త్రీ గురించే ఆలోచించసాగింది. ఇప్పుడు అతని రెండుమనస్సులూ ఒకటై ఆమెగురించే ఆలోచించసాగాయి. తర్వాత, బయట అందమైన వస్తువో, దృశ్యమో కనిపిస్తే, దాన్ని ఆమె అంగాలకు పోల్చి చూడసాగాయి. కొలనుల్లోని కలువపూలు ఆమె కళ్లలా కనిపించాయి. తామరలు ఆమె మోముకు సాటిరాగలవా అని సందేహించాడు. నదిఒడ్డున ఉన్న చెట్లపూలపైన ఎగురుతా ఝుంకారం చేస్తున్న తుమ్మెదల నాదాన్ని ఆమె స్వరానికి పోల్చదగునా? ఇలా కవులు కల్పించి రాశారేగాని, ఇవంతా ఎక్కడ? ఆమె సౌందర్యం ఎక్కడ? ఆమె మోమును చూసినప్పుడు తన ఒడలెలా పులకరించింది! ఇప్పుడు తలుచుకొన్నా మనస్సు పలవరిస్తోంది కద! ఈ పూలనూ, తుమ్మెదలనూ చూస్తే మనస్సెలా పులకరించడం లేదే?...ఛీఛీ! పెద్దలు మనకు చేసిన ఉపదేశాలన్నీ మరిచిపోయాం! స్త్రీమోహం వంటి మాయ ఈ భూలోకంలో ఇంకేదీ లేదు. జీవితంలో గెలుపు సాధించగోరేవాడు స్త్రీమోహపు వలలో పడనే కూడదు. పడితే వాడిక లేడు! కోవలన్ కథ ఆ విషయాన్ని బాగా విశదం చేయలేదా? కోవలన్ మాత్రమేమి? వీరాధివీరుడు, చోళదేశంలోనే సాటిలేని పలుకుబడివున్న పెద్ద పళువేట్టరయ్యర్ గారి గురించి అందరూ పరిహసించి మట్లాడుకోవడానికి కారణంకూడా అదే కద? - కానీ ప్రజలకు నిజం తెలియదు. పళువేట్టరయ్యర్ మూసిన పల్లకిలో ఎవరిని పెట్టి తనతో తీసుకువస్తున్నారో వారికి తెలియక మూఢత్వంతో మాట్లాడుతున్నారు. అయినప్పటికీ, ఆ మధురాంతకులు తనను తాను అంత చులకన చేసుకోవాల్సిన అవసరం లేదు! ఛీఛీ! మూసిన పల్లకిలో కూర్చొని, పళువేట్టరయ్యర్ భార్య స్థానంలో ఊరూరూ తిరగడమా? ఇదేనా మగతనానికి అందం? ఇలాగైనా రాజ్యం సంపాదించాలా? ఇలా సంపాదించిన రాజ్యాన్ని మాత్రం ఆయన వల్ల నిలబెట్టుకోవడం సాధ్యమా? పళువేట్టరయ్యర్ మొదలైన వారిని నమ్మి, వారికి లోబడే కద రాజ్యపరిపాలన చేయవలసివుంటుంది? ఈ విషయంలో సుందర చోళ చక్రవర్తి వైఖరి కూడ అంత శ్లాఘ్యంగా లేదు! పళువేట్టరయ్యర్ వంటివారికి ఇంతటి అధికారం, పలుకుబడి ఇచ్చివుండకూడదు. అదికూడ, ఇద్దరు సాటిలేని మేటి కుమారులున్నప్పుడు? - దేశమంతా పొగిడే అతిలోక సౌందర్యమూ, అనన్య వివేకమూ కలిగిన ముద్దుల కుమార్తె ఉన్నప్పుడు....? ఆమె, ఆ జ్యోతిష్కుల ఇంట చూసిన సౌందర్యవతి, అరిసిలా నదిఒడ్డున తనతో మాట్లాడిన ముగ్ధ....ఆమె ముఖం ఎవరి ముఖాన్ని పోలివుంది? ... ఒకవేళ... నా పిచ్చిగాని, అదేమాత్రం సాధ్యంకాదు! ఎందుకు సాధ్యంకాదు? అదే నిజమైతే, తనంతటి బుద్ధిహీనుడు, దురదృష్టశాలి ఇంకెవరుండరు! లంకనుంచి వింధ్యపర్వతాలవరకు ఏ యువరాకుమారి పేరుప్రఖ్యాతులు వ్యాపించివున్నాయో, ఆమె దగ్గర తాను ఎంత మొరటుగా

నడుచుకొన్నాడు? - అలా ఉండనే ఉండదు! రేపు ఆమె దగ్గర యువరాజు సందేశంతో ఎలా ముఖం చూపించగలం!

-:-

ఇలా ఏమేమో ఆలోచిస్తూ, నింగీ నేలా ఏకం చేసే ఆలోచనలు చేస్తూ, కావేరి నది వెంబడి సాగుతూ తిరువయ్యార్ నగరానికి వచ్చిచేరాడు. ఆ ఊరి సిరిసంపదలు, అందాలు అతన్నెంతో ఆకట్టుకొన్నాయి. అది తిరువయ్యారేనా అని అడిగి తెలుసుకొన్నాడు. అతను ఆ అద్భుత క్షేత్ర మహిమ గురించి విన్న వర్ణనలన్నీ నిజానికన్న కాస్త తక్కువే అనిపించాయి. జ్ఞాన సంబందర్ తన దేవారాలలో చేసిన వర్ణనలన్నీ తద్రూపంగా కనిపించాయి. మూడు వందల ఏళ్ళలో ఏమీ మారలేదు. అదిగో, కావేరి నదిఒడ్డున అ చెట్లు ఎంత ఏపుగా పెరిగివున్నాయి! పనసచెట్లలో ఎంత పెద్ద పెద్ద కాయలు వేలాడుతున్నాయి! ఇలా తొండై మండలంలో చూడ  సాధ్యమా? ఆహ్! సారవంతమైన ప్రదేశాలకు ఎక్కడినుంచో కోతులు వచ్చిచేరుతున్నాయి కద! అవి ఒక కొమ్మనుంచి ఇంకొక కొమ్మకు దూకడం చూసేందుకెంత అందంగా ఉంది! సంబంద పెరుమాన్ ఏమన్నారు? ఇదిగో తలపుకొస్తోంది! తిరువయ్యారు వీధి చివర్లలో వున్న రంగప్రదేశాల్లో అమ్మాయిలు నాట్యం చేస్తున్నారు. ఆ ఆటకు తగినట్లు పాట, వాద్యసంగీతం వినవస్తున్నాయి. ఆ సంగీతనాదాలను విని కోతులు అది మేఘ గర్జన అని భ్రమించి చెట్ల చిటారు కొమ్మలకు చేరుకొని వాన వస్తుందా అని నిక్కి చూడసాగాయి. ఆ వాద్యసంగీతం ఎంత వీనుల విందుగా ఉంది! ఇక్కడ ఆడుతున్నవారు కడంబూర్ మాళిగలో కురవై ఆట ఆడినవారిలా లేరు. ఆహ్! ఇక్కడ వినవస్తున్నది ఎంతటి మధురగానం! భరతనాట్య కళలో మేటి శిక్షణపొందిన ఆ నాట్యమణుల కాలి గజ్జెల శబ్దంతోబాటు వారి నాట్యాచార్యులు తమ చేతబట్టిన కోలుతో వారికి  ఇస్తున్న సంబోధనలు ఎంత ఇంపుగా వినవస్తున్నాయి!

<< నాట్యం గురించి రచించిన ఒక మంచి పాటను అనువదించవలసివుంది  >>

ఆహ్! సంబంద స్వాములు మహా శివభక్తులు; అంతకన్న మహా రసికులు! ఆయన ఆనాడు వర్ణించినట్లే ఇప్పటికీ విరాజిల్లుతోంది! ఇటువంటి ఊరిలో ఒకరోజు విడిదిచేసి ఆటలు, పాటలు, విందులు వినోదాలను చూసి ఆనందించి, పేరొందిన అయ్యారప్పర్, నాయకిఅమ్మాళ్ ఇద్దరినీ దర్శించిన తర్వాతనే ఇక్కడినుంచి ముందుకు వెళ్ళాలి! ఆహ్! కావేరి నదీతీరంలో ఎందరు భక్తులు కూర్చొని అనుష్టానం చేస్తున్నారు! వారు తమ ఒంటిమీద పూసుకొన్న విభూతి రేఖలు చూడ ఎంత కళగా వున్నాయి! ఒక్కోసారి ఆటపాటల శబ్దాన్ని అదిమేస్తూ, 'ఓం నమశ్శివాయ!' అన్న మంత్రఘోష వినిపిస్తున్నది! అదెలా? అదిగో, సంబంద స్వాముల దేవారాలనే ఎవరో ఇంపైన గొంతుతో పాడుతున్నారు. లలిత కళల కోసమే భగవంతుడీ తిరువయ్యారును సృష్టించినట్లుంది! ఇవన్నీ చూడక ఈ ఊరినుంచి ముందుకు వెళ్ళకూడదు!

తంజావూరుకు తొందరగా వెళ్ళి ఏం ప్రయోజనం? కోటలోపల ప్రవేశించగలమో లేమో? అలా ప్రవేశించిన వెంటనే మహారాజుగారిని కలిసేందుకు అనుమతి దొరుకుతుందో లేదో? మహారాజుగారిసేమో ఆ ఇద్దరు పళువేట్టరయ్యర్లు కూడబలుక్కొని చెరసాలలో బంధించినట్లు పెట్టివున్నారట కద...? కావేరి ఉత్తరతీరానికి వెళ్ళాల్సిందే!

-:-

వంతిదేవుడిలా తీర్మానించుకొన్నప్పుడు ఒక సంఘటన జరిగింది. పడమటి వైపునుంచి కావేరి నది వెంబడి ఒక పల్లకి వచ్చింది. పల్లకి ముందు, వెనక కూడ కొందరు కాపలా వీరులు నడుస్తున్నారు. అతనికేదో సందేహం వచ్చింది. పల్లకి దగ్గరకు వచ్చేవరకు ఎక్కడ ఉన్నవాడు అక్కడే నిరీక్షిస్తూ నిలబడ్డాడు. అతననుకొన్నట్లే ఉంది! ఆ పల్లకి తెరపైన తాటిచెట్టు చిహ్నం ఉంది! సందేహంలేదు. ఇది కడంబూర్ నుంచి వస్తున్న పల్లకే! మనం కుడంద్రై మీదుగా రాగా, వీరింకొక దారిలో వచ్చివున్నారు! కానీ, పళువేట్టరయ్యర్ ఎక్కడా కనిపించడంలేదే! ఆయన దారిలో ఎక్కడైనా ఆగిపోయారు కాబోలు!

పల్లకి తంజావూరు ఉన్న దక్షిణదిశగా తిరిగింది. అంతే! వంతిదేవుడు తిరువయ్యారులో విడిదిచేసే ఆలోచనను గాలికి వదిలేశాడు. ఆ పల్లకి వెన్నంటి వెళ్ళేందుకు తీర్మానించుకొన్నాడు. ఏ ఉద్దేశంతో అలా తీర్మానించుకొన్నాడంటే, అది ఆ క్షణంలో అతనికే తెలియలేదు! పల్లకిలో ఆసీనులైవున్నది మధురాంతకులని మాత్రం అతనికి నిశ్చయంగా తెలిసింది. ఆయనపైన అప్పటికే కలిగివున్న అసహ్యాభావం ఇంకా పెరిగింది. కానీ, పల్లకిని కాస్త వెన్నంటిపోతే ఏదైనా మంచి సందర్భం కలగవచ్చు. పల్లకిని మోస్తున్నవారు దాన్ని కిందపెట్టవచ్చు. లేదా యువరాజు మధురాంతకులు ఏకారణంతోనైనా పల్లకి దిగి బయటకు రావచ్చు. అప్పుడు ఆయనకు తనను పరిచయం చేసుకోవచ్చు. అది తంజావూరు కోటలో ప్రవేశించేందుకు, చక్రవర్తికి దర్శించేందుకు ఉపయోగపడవచ్చు. అందుకు తగినట్లు ఏదైనా మంచిమాటలాడి మచ్చిక చేసుకొంటే సరి. ఏవైనా మంత్రతంత్రాలుపయోగించకపోతే చేపట్టిన పని సాధంచలేం కద? అదీ రాజకీయ కార్యమాయె!

కాబట్టి, పల్లకిని, పరివారాన్ని ముందు పోనిచ్చి, తాను కాస్త వెనగ్గా వారిని వెన్నంటిపోసాగాడు. కానీ అతను ఎదురుచూసిన సందర్భం దొరకలేదు. కావేరికి, తంజావూరుకు మధ్యవున్న నాలుగు నదులనుకూడ దాటడమైంది. అప్పటికీ పల్లకి దింపబడలేదు. బోయీలు గుక్క తిప్పుకోకుండా ముందుకు సాగారు. అదిగో కాస్త దూరంలో తంజావూరు కోటగోడ, కోటవాకిలి కనిపిస్తున్నాయి! పల్లకి కోటలోపల వెళ్ళిపోతే తన ఉద్దేశ్యం నెరవేరదు. అంతలోపల ధైర్యంతో తెంపుచేసి ఏదైనా చేసితీరాలి. ఏం జరిగిపోతుందేం? తల తీసేస్తారా? పోతే పోనీ! - చేపట్టిన కార్యం సాధించకుండా ప్రాణాలతో తిరిగిపోవడం వల్ల లాభమేమి? దీనికంతటికి మూలమైన ఆ మధురాంతకులపైన అప్పటికే కోపంవుంది. పల్లకిని మూసివున్న తెరను

లాగిపడేసి, పల్లకిలో వున్నది స్త్రీ కాదు, మీసం మొలిచివున్న పురుషుడని అందరికీ బట్టబయలు చేయాలని అతని చేయి నవనవలాడింది; అతని మనస్సు కుతకుతలాడింది.

-:-

ఇందుకొక ఉపాయం కోసం అతను తీవ్రంగా ఆలోచిస్తున్నప్పుడు పల్లకితో వెళ్తున్న పరివారంలో ఒకతను వంతిదేవుని నిశితంగా చూస్తూ, "నీవెవరివయ్యా? తిరువయ్యారునుంచి మావెన్నంటే ఎందుకు వస్తున్నావు?" అని అడిగాడు.

"నేను మిమ్మల్ని వెన్నంటి రావడం లేదయ్యా! తంజావూరుకు వెళ్తున్నాను! ఈ దారే కద తంజావూరుకు వెళ్తుంది!" అన్నాడు వంతిదేవుడు.

"ఈ మార్గం తంజావూరుకే వెళ్తోంది. కానీ, ముఖ్యమైనవారు మాత్రమే ఇలా వెళ్ళవచ్చు. ఇతరులకు వేరే దారివుంది!" అన్నాడా వీరుడు.

"అలాగా? అయితే నేను కూడా చాలా చాలా ముఖ్యమైన వ్యక్తినే!" అన్నాడు వంతిదేవుడు.

అది విన్న ఆ వీరుడు చిరునవ్వు నవ్వేసి, "తంజావూరుకు ఎందుకు వెళ్తున్నావు?" అని అడిగాడు.

"నా చిన్నాన్న తంజావూరులో ఉన్నారు. ఆయనకు ఒంట్లో బాగాలేదని తెలిసి ఆయనను చూసేందుకు వెళ్తున్నాను." అన్నాడు వంతిదేవుడు.

"మీ చిన్నాన్న తంజావూరులో ఏం చేస్తున్నారు? రాజభవనంలో ఉద్యోగం చేస్తున్నారా?"

"లేదు, లేదు; సత్రంలో మాన్యదారుడుగా పనిచేస్తున్నాడు!"

"ఓహో, అలాగా? అలాగైతే, మాకన్న ముందు నీవెళ్లవచ్చుగద? ఎందుకు మా వెనక వస్తున్నావు?"

"గుర్రం అలిసిపోయివుందయ్యా! అందుకే! లేకపోతే మీ వెన్నుచూస్తూ రావడంలో నాకేం తృప్తి?"

ఇలా మాట్లాడుతూనే వంతిదేవుడు పల్లకి దగ్గరకొచ్చేశాడు. అతని మెదడును అంతవరకూ తొలిచేస్తున్న ఉపాయం బయటికొచ్చింది. గుర్రాన్ని ఒక్క అదుము అదిమి, ముక్కుతాడును ఒక్క లాగు లాగి, పల్లకి వెనకటి కాడను ఎత్తుకొని మోస్తున్నవారిపైకి పురికొల్పి వదిలాడు. వారు భయంతో తిరిగిచూశారు. వెంటనే, "మహారాజా, మహారాజా! పల్లకి బోయీలు నాగుర్రాన్ని ఢీకొడుతున్నారు! అయ్యో! అయ్యో!" అని అరిచాడు. పల్లకిని మూసివున్న తెర సరసర కదిలింది.

~~~
~~~

# అధ్యాయము - 22

## వేళక్కార దండు

మొదట, పల్లకి బయటి తెర – తాటిచెట్టు చిహ్నమున్నది - తొలగింది. తర్వాత లోపలి పట్టు తెరకూడ పక్కకు తొలగసాగింది. మునుపొకసారి వల్లవరయ్యన్ (వంతిదేవుడు) చూసిన బంగారు వన్నె చేయి కూడ కనిపించింది. వంతిదేవుడిక తాను గుర్రంపైన ఉండడం తగదని ఒక్క క్షణంలో కిందకు దూకాడు. పల్లకి దగ్గరకు వచ్చి, "యువరాజా, యువరాజా! పల్లకిని మోసే బోయీలు..." అని అంటూనే తలెత్తి చూశాడు. మళ్ళీ నిశితంగా చూశాడు. కళ్ళు మూసి తెరిచి మళ్ళీ చూశాడు. తెరిచిన కళ్ళు అలాగే నిలిచిపోయాయి. నాలుక కదలలేదు; గొంతెండిపోయింది. "లేదు, లేదు! మీరు.... పళువూర్ యువరాణి! ... పళువూర్ యువరాణి! మీ మనుషుల గుర్రం నా పల్లకిని గుద్దింది!..." అని కంగారుగా ప్రేలాపించాడు.

ఇదంతా కన్ను మూసి తెరిచేంతలో జరిగిపోయింది. పల్లకి ముందు వెనక కాపలా కాస్తున్న శూలధారులైన వీరులు వేగంగా ముందుకు వచ్చి వంతిదేవుని చుట్టుముట్టారు. అలా వారు చుట్టుముట్టారని వంతిదేవునికికూడ తెలిసింది. అతని చేయికూడ తనకుతానే ఒరలోవున్న కత్తిపైన వాలింది. కానీ తన కళ్ళుమాత్రం ఆ పట్టుతెరవెనుక దాగివున్న ఆ మోహనాంగి యొక్క చంద్రబింబం వంటి సుందరవదనాన్ని వీడలేకపోయాయి.

అవును; వల్లవరయ్యన్ ఎదురుచూసినందుకు వ్యతిరేకంగా ఆపల్లకిలో ఒక అపురూప సుందరి ఉంది! వనిత అంటే ఎటువంటి వనితామణి! చూసిన వారికి పిచ్చెక్కించగల ఇటువంటి స్త్రీసౌందర్యం ఈ లోకంలో ఉండసాధ్యమని వంతిదేవుడు ఊహించనే లేదు!

అదృష్టవశాత్తు, అదే సమయంలో అతని మెదడులో ఒక మెరుపులాంటి ఆలోచన మెరిసింది. దాన్ని వెంటనే అమలుపర్చాలని తీర్మానించాడు.

పెద్ద ప్రయత్నంతో గొంతుసవరించుకొని, నాలుకకు శక్తి తెప్పించుకొని, "మన్నించాలి! తమరు పళువూర్ యువరాణే కద? తమరిని చూసేందుకే ఇంతదూరం వచ్చాను!" అన్నాడు.

పళువూర్ యువరాణి పాలుగారే ముఖంపైన ఒక చిరునవ్వు విరిసింది. ఆ విరిసిన తామర లోపల పదిలమైవున్న ముత్యాల పలువరుస మెరిసింది. ఆ మెరుపు మన యువవీరుని ఉక్కిరిబిక్కిరి చేసింది.

అతని చుట్టూ నిలబడ్డ వీరులు తమ యజమాని ఆజ్ఞకోసం వేచివున్నట్లనిపించింది. ఆ రాణి తన చేత్తో సంజ్ఞ చేసిన వెంటనే వారు కాస్త వెనక్కి తొలగి నిలబడ్డారు. ఇద్దరు వీరులు పల్లకిని గుద్దుతూ నిలబడ్డ గుర్రాన్ని వెనక్కి లాగి పట్టుకొన్నారు.

-:-

పల్లకిలోని వనితామణి వంతిదేవుని చూసింది. వంతిదేవుని గుండెలో రెండు పదునైన శూలాలు దూసుకుపెళ్ళాయి.

"అవును; నేను పళువూర్ యువరాణినే!" అన్నదా మహిళామణి. ఈమె స్వరంలో ఏమంతటి భ్రమింపజేసే శక్తివుంది? ఎందుకిలా మన తల గిరగిరా తిరుగుతోంది?

"కాసేపటికి ముందు నీవేమన్నావు? ఏదో చాడీ చెప్పావే? పల్లకి బోయీల గురించి!"

కాశి పట్టు నాజూకు, కల్లు కలిగించే మైకం, అడవితేనె తీయదనం, వర్షాకాలపు మెరుపుల కాంతి ఒక స్త్రీ స్వరంలో కలగలిసివుండ సాధ్యమా?

"పల్లకిని నీ గుర్రానికి గుద్దారనా అన్నావు?"....

పళువూర్ రాణి కెంపు పెదవులపైన తేలియాడిన చిరునవ్వు ఆమె ఆ తమాషాను చూసి ఆస్వాదించినట్లు తెలియజేసింది. అది వంతిదేవునికి కాస్త తెంపునిచ్చింది.

"అవును, మహారాణి! వీరు అలాగే చేశారు! నాగుర్రం బెదిరిపోయింది" అన్నాడు.

"నీవుకూడా అలాగేవున్నావు! దుర్గాదేవి కోవెలకు వెళ్ళి పూజారిచేత వేపాకులతో కొట్టించుకో! భయం పోతుంది!"

ఇంతలో వంతిదేవునికి భయం పూర్తిగా పోయింది. నవ్వుకూడ వచ్చేసింది.

పళువూర్ రాణి ముఖభావాలు ఉన్నట్లుండి మారిపోయాయి. చిరునవ్వు స్థానంలో కోపం చోటుచెసుకొంది.

"వేళాకోళం తర్వాత! నిజం చెప్పు! ఎందుకు నీ గుర్రాన్ని పల్లకిపైకి తీసుకొచ్చి గుద్దావు?"

ఇందుకు తగిన జవాబు ఇచ్చేతీరాలి. లేకపోతే....? అదృష్టవశాత్తు తగిన ఉత్తరం అతని దగ్గర సిద్ధంగా ఉంది. కాస్త తగ్గుస్వరంలో, ఇతరులకు వినిపించని మెల్లని స్వరంలో, "దేవి! నందిని దేవి! ఆళ్వార్ కట్టియార్... ఆయనే తిరుమలైయప్పన్ .... మిమ్మల్ని కలవాలని అన్నారు. అందుకే ఈ యుక్తి పన్నాను. మన్నించాలి!" అన్నాడు.

ఇలా చెప్తూనే వంతిదేవుడు ఆమె ముఖాన్ని నిశితంగా చూశాడు. తన జవాబు ఎటువంటి ఫలితాన్నిస్తుందో అని కుతూహలంగా చూశాడు.

పండ్ల చెట్టుపైన రాయివిసిరితే పండు పడుతుందా? రాయి పడుతుందా? లేక అనుకోని పిడుగు పడుతుందా?

పళువూర్ రాణి నల్లని కనుబొమలు కాస్త పైకివెళ్ళాయి. కళ్ళలో ఆశ్చర్యమూ, సందేహమూ కనిపించాయి. మరుక్షణం ఆ స్త్రీమణి ఒక నిశ్చయానికి వచ్చేసింది.

"సరే; దారిమధ్యలో నిలబడి మాట్లాడడం ఉచితంకాదు. రేపు మా అంతఃపురానికి రా! అన్ని విషయాలు అక్కడ వివరంగా మాట్లాడుకొందాము!" అన్నది.

వంతిదేవుని హృదయం పొంగింది. అనుకొన్న కార్యంలో గెలుపు తథ్యమనిపిస్తోంది! కానీ, ముప్పావు బావి దాటి ప్రయోజనం లేదు. మిగిలిన పావు భాగంకూడ దాటాలి.

"దేవి! కోటలోపలకు నన్ను రానివ్వరు కద! అంతఃపురంలోపలకూడ రానివ్వరు కద! ఏం చేయడం?" అన్నాడు.

పళువూర్ రాణి వెంటనే పల్లకిలో తన పక్కనేవున్న ఒక పట్టుసంచి తెరిచి ఒక దంతపు ఉంగరాన్ని తీసింది.

"దీన్ని చూపిస్తే కోటలోపలకూ రానిస్తారు; మా అంతఃపురంలోకికూడ రానిస్తారు!" అని చెప్తూనే ఆ రాజముద్రను అతనికిచ్చింది. దాన్ని వంతిదేవుడు మిక్కిలి కుతూహలంతో తీసుకొన్నాడు. ఒక క్షణం తాటిచెట్టు చిహ్నం పొదిగిన ఆ దంతపు ఉంగరాన్ని చూశాడు. మళ్ళీ తలెత్తి రాణికి ధన్యవాదం చెప్పే లోపల పల్లకి తెరలు మూసుకొన్నాయి.

ఆహా! పూర్ణచంద్రుని రాహువు మింగేటప్పుడు కొద్దికొద్దిగా మింగుతాడు. కానీ, ఈ పల్లకి తెరలు ఆ మాట్లాడే చంద్రబింబాన్ని ఒక్క క్షణంలో మూసేశాయి కద!

"ఇప్పటికైనా నన్ను వెన్నంటి రావడాన్ని మానుకో. లేకపోతే అపాయం కలుగుతుంది. ఆగి కాస్త మెల్లగా రా!" అని పల్లకిలోపలినుంచి పట్టువంటి మెత్తని స్వరం వినిపించింది.

తర్వాత పల్లకి ముందుకు కదిలింది. వీరులు మునుపటిలాగానే దానిముందు, వెనుక కాపలాకాస్తూ వెళ్ళారు.

-:-

వంతిదేవుడు గుర్రం ముక్కుతాడు పట్టుకొని, ఆ రాచబాట అంచులో ఒదిగి నిలబడ్డాడు. పళువూర్ మనుషులలో తన దగ్గరికి వచ్చిమాట్లాడిన వ్యక్తి రెండుమూడుసార్లు వెనక్కి తిరిగి తనను చూడడం అతని కళ్ళు గమనించి, అతని మనస్సుకేదో సందేశాన్ని పంపాయి.

అవును; అతని మనసు పల్లకిలోని మోహనవదనాన్ని చుట్టిచుట్టి తిరగసాగింది. ఇంతసేపూ చూసింది, విన్నది నిజమేనా? లేక ఒక మాయ మనోహర స్వప్నమా? ఇలాకూడ ఒక అందగత్తె, ఒక సౌందర్యరూపం ఈ భూలోకంలో ఉండ సాధ్యమా?

రంభ, ఊర్వశి, తిలోత్తమ మొదలైన దేవకన్యల గురించి పురాణాలు చెప్తున్నాయి. వారి సౌందర్యం అన్నీ పరిత్యజించిన ఋషిపుంగవుల తపస్సునే భంగం చేసినట్లు పురాణాలు చెప్తున్నాయి. కానీ, ఈ భూలోకంలో... పెద్ద పళువేట్టరయ్యర్ ఈ మోహిని కాళ్లవద్ద దాసుడై పడివుండడం గురించి దేశమంతా చెప్పుకోవడం నిజమే కావచ్చు. ఉంటే అందులో ఆశ్చర్యం లేదుకద! డాబు, దర్పం, యుద్ధరంగంలో అతితీవ్ర గాయాలు పడి అతి భయంకరమైన రూపం కలిగివున్న పళువేట్టరయ్యర్ ఎక్కడ? సుకుమారి, అతిసౌందర్యవతియైన ఈ యువ వనిత ఎక్కడ? ఈమె చిరునవుకోసం ఆ ముసలాయన ఏమైనా చేస్తాడు కద?

ఇలా చాలాసేపు ఆ రాజమార్గం అంచునే ఆలోచిస్తూ నిలబడ్డాడు. తర్వాత మెల్లగా గుర్రమెక్కి తంజావూరువైపు సాగాడు.

సూర్యాస్తమయ సమయానికి కోట ప్రధాన ద్వారం వద్దకు చేరాడు. కోటకు కాస్త ముందే నగరం మొదలైంది. రకరకాల తినుబండారాలు అమ్మే అంగళ్ళు, పలువిధాలైన వృత్తుల్లో నిమగ్నమైన పనివారి వీధులు కోట చుట్టూ పక్కపక్కనే ఉన్నాయి. వీధులన్నీ వచ్చేవారు, వెళ్ళేవారు, వస్తువులు కొనేవారు, అమ్మేవారు, ఎడ్లబండ్లు, గుర్రాలు పూన్చిన రధాలతో మహా సందడిగా వున్నాయి. ఆ వీధుల్లోకి వెళ్ళి, చోళదేశపు కొత్త రాజధానిలో జీవిస్తున్న ప్రజలను, వారి జీవన విధానాన్ని పరిశీలించి చూడాలని వంతిదేవుడు చాల కుతూహలపడ్డాడు. కానీ ఇప్పుడు దానికంతా అవకాశం, సమయం లేదు. వచ్చిన పని ముందు చూడాలి. సరదాలన్నీ తర్వాత.

ఈ తీర్మానంతో వంతిదేవుడు తంజావూరు కోట ప్రధాన ద్వారం దరిజేరాడు. ఆ సమయాన కోట ప్రధాన ద్వారపు వాకిళ్ళు మూసివున్నాయి. వాకిట నిలబడ్డ కాపలావీరులు ప్రజల్ని ప్రధానవీధి పక్కలకు ఒదిగి నిలబడేటట్లు చేయసాగారు. ప్రజలుకూడ పక్కకు ఒదిగి నిలబడ్డారు. అవును; వారంతా తమతమ పనులు చూసుకొని వెళ్ళేందుకు బదులు, ఏదో ఊరేగింపును ఎదురుచూస్తున్నవారిలా  నిలబడ్డారు. స్త్రీలు, పురుషులు, పిల్లలు, వయసుమళ్ళినవారు - అందరూ ఆసక్తితో నిలబడి చూస్తున్నారు.

-:-

కోట వాకిలి ముందు కాస్తదూరం ఖాళీగానే ఉంది. కాపలావీరులు మాత్రం నిలబడివున్నారు.

విషయమేమని తెలుసుకొనేందుకు వంతిదేవుడు కుతూహలపడ్డాడు. అందరూ ఒదిగి నిలబడివున్నప్పుడు తాను మాత్రం కోట వాకిలి ముందుకు వెళ్ళి నిలబడేందుకు ఇష్టపడలేదు.. అందునుంచి అనవసర తగాదాలు రావచ్చు. ఇప్పుడు తనకు తన కార్యం ముఖ్యంగాని తన వీరత్వాన్ని చూపించడం ముఖ్యంకాదు.

కాబట్టి, వంతిదేవుడు కోట వాకిలిని గమనించగల చోట వీధి పక్కగా నిలబడ్డాడు. పక్కనుంచి

పూల ఘుమఘుమలు వీశాయి. చట్టున తిరిగిచూశాడు. ముఖంపైన శైవచిహ్నాలు, రెండుచేతుల్లో రెండుపూలబుట్టలతో నిలబడివున్న ఒకతను కనిపించాడు.

"తమ్ముడూ! అందరూ ఎందుకు వీధి అంచున ఒదిగి నిలబడివున్నారు? ఏదైనా ఊరేగింపు రాబోతోందా?" అని అడిగాడు.

"మీరీవూరివారు కారా, అయ్యా?"

"కాదు. నేను తొండైనాడుకు చెందిన వాడిని!"

"అందుకే అడుగుతున్నారు. మీరుకూడ గుర్రంమీదినుంచి కిందికి దిగి నిలబడడం మంచిది."

ఆ యువకునితో మాట్లాడేందుకు సౌకర్యంగా ఉండనీ అని వంతిదేవుడు గుర్రం దిగాడు.

"తమ్ముడూ! ఎందుకు నన్ను గుర్రంమీదినుంచి దిగమన్నావు?"

"ఇప్పుడు వేళక్కార దండు రాజుగారి దర్శనం చేసుకొని కోటనుంచి బయటకు రాబోతోంది. అందుకోసమే ఈ జనాలందరూ ఇలా ఒదిగి నిలబడుతున్నారు."

"తమాషా చూసేందుకే కద?"

"అవును."

"నేను గుర్రంమీద కూర్చొని చూస్తేనేం?"

"చూడవచ్చు. కాని వేళక్కార దండు వీరులు మిమ్మల్ని చూసేస్తే చాలా అపాయం."

"ఏం ఆపత్తు? గుర్రాన్ని తీసుకెళ్ళిపోతారా?"

"గుర్రాన్నీ తీసుకెళ్ళిపోతారు; మనుషుల్నికూడ తీసుకెళ్ళిపోతారు. మాచెడ్డవాళ్ళు."

"అలా చేస్తే ఊరకే వదిలేస్తారా?"

"ఊరకుండక ఇంకేం చేయడం? ఈ నగరంలో వేళక్కార దండు వీరులు పెట్టినదే చట్టం. వారిని అడిగేవారు లేరు. ఇద్దరు పళువేట్టరయ్యర్లు కూడ వారి విషయంలో తలదూర్చరు."

ఈ సమయంలో కోటలోపలినుంచి పెద్ద ఆర్భాటమైన శబ్దాలు వినవచ్చాయి. నగారా మోగించే శబ్దం, డోలు వాయించే శబ్దం, కొమ్ము బూరాలు ఊదే శబ్దం, వీటితోబాటు వందలకొద్ది మనుషుల హాహాకారాలు కలిసి మారుమోగాయి.

-:-

వేళక్కార వీరుల దండుగురించి వంతిదేవునికి బాగా తెలుసు. పాత తమిళనాడులో, ప్రత్యేకంగా చోళదేశంలో ఈ సంప్రదాయం కొనసాగేది. ఈ వీరులు తత్సమయం రాజ్యమేలుతున్న రాజులకు అంతరంగ

కాపలావీరులు. కానీ, తక్కిన అంతరంగ కాపలావీరులకు, వీరికి ఒక తేడా ఉంది. వీరు, "మా ప్రాణాలిచ్చైనా రాజుగారి ప్రాణాలు కాపాడుతాం!" అని శపథం చేసినవారు. తమ అజాగ్రత వల్లనో, తమ అసహాయత వల్లనో రాజుకు అపాయం ఎదురైతే, దుర్గాదేవి సన్నిధిలో తమను తామే బలి ఇస్తామని శపథం చేసినవారు. అటువంటి క్రూర/కఠోర శపథం చేసినవారికి, తక్కిన వీరులకు లేని కొన్ని ప్రత్యేక హక్కులు ఉండడం సహజమే కద?

-:-

కోట వాకిళ్ళు రెండూ ధడేల్మని తెరుచుకొన్నాయి.

ముందుగా ఇద్దరు గుర్రంపైని వీరులు వచ్చారు. వారు తమ కుడిచేత ఒక ఎత్తైన జెండా పట్టుకొనివున్నారు.. ఆ జెండా చూసేందుకు చాల వింతగాను, భయోత్పాదకంగానుకూడ వుంది. ఆ ఎర్రని జెండాపైన పులి, ఆ పులికింద కిరీటం చిత్రించబడివున్నాయి. కిరీటానికి కింద ఒక బలిపీఠము, ఒక తెగిన తల, ఒక పెద్ద వేట కత్తి చిత్రించబడివున్నాయి. కాబట్టి జెండా చూసేందుకు కాస్త భీతిగొల్పేవిధంగా ఉంది.

జెండాలు పట్టుకొన్న వీరులవెనుక ఒక పెద్ద వృషభం రెండు రణభేరులను మోసుకొంటూ వచ్చింది. ఇద్దరు మనుషులు వాటిని మోగించసాగారు.

ఆ వృషభానికి వెనుక సుమారు యాభైమంది చిన్నడోళ్ళు, పెద్దడోళ్ళు, తమ్మెటలు వాయిస్తూ వచ్చారు.

వారి వెనుక ఇంకొక యాభైమంది కొమ్ముబూరాలను పూరిస్తూ వచ్చారు.

వారికన్న వెనుక వచ్చిన వీరులు సుమారు వెయ్యిమంది ఉండవచ్చు. వారిలో చాలమంది కింద పేర్కొన్న దీవెనలను ఘోషిస్తూ వచ్చారు.

"పరాంతక చోళ భూమండల చక్రవర్తి నూరేళ్ళు జీవించనీ! (vaazhga! in Tamil)"

"జీవించనీ! జీవించనీ!"

"సుందర చోళ చక్రవర్తి నూరేళ్ళు జీవించనీ!"

"జీవించనీ! జీవించనీ!"

….

"వీరపాండ్యుని గర్వమణిచిన మారాజు నూరేళ్ళు జీవించనీ!"

"మదురైని, లంకను, తొండైనాడును జయించిన కో-రాజకేసరి నూరేళ్ళు జీవించనీ!"

"జీవించనీ! జీవించనీ!"

"కరికాల్ వళవన్ వంశం నిరంతరం సాగనీ!"

…

“దుర్గాదేవి! మహాకాళి! పరాత్పరి! పరాశక్తి! జయహో!”

“జయహో! జయహో!”

“పులిజెండా అన్ని ఎల్లలూ దాటి ఎగరనీ!”

…

“వెట్రివేల్!” (వెట్రి అంటే విజయం)

“వీరవేల్!” (వేల్ అంటే సుబ్రమణ్యస్వామి చేతపట్టిన శూలం)

అలా వందలాది వీరులు ఘోషిస్తూ కోటనుంచి వెలుపలికి వచ్చినప్పుడు వారి జయజయధ్వానాలతో  ఆ నగరమే మారుమోగింది. వీధుల వెంట నిలబడిన కొందరు ప్రజలు కూడా ఆ ఘోషలో పాల్గొన్నారు.

ఈవిధంగా వేళక్కార[4] వీరులు కోటలోపలినుంచి బయటకు వచ్చి వీధులగుండా సాగి దూరంలో మరుగయ్యేంతవరకు అల్లకల్లోలంగా ఉంది.

~~~

4 సుబ్రమణ్యస్వామికి తమిళనాడులో వేళక్కారన్ (భక్తులను కాపాడుతానని శపథం పూనినవాడు) అన్న పేరు కూడాఉంది. అందునుంచే ఈ దండుకు ఆ పేరు వచ్చింది.
~~~

# అధ్యాయము - 23

## అముదన్ తల్లి

**వేళక్కార** దండు చివరగా పెద్ద అంగడి వీధిగుండా వెళ్ళిపోయారు. దండులో చివరగా వెళ్ళిన వారిలో కొందరు ఊరకే పోక కాస్త వారి హస్తలాఘువాన్ని చూపారు. ఒకడు ఒక తినుబండారాల అంగడిలో దూరి, అతిరసాలు నిండిన ఒక బుట్టను తీసుకొని బయటకువచ్చి తక్కిన వీరులకు పంచేశాడు. తర్వాత ఖాళీ బుట్టను అంగడివాలి తలపై బోర్లావేసినప్పుడు తక్కిన వీరులు, వీధిజనం పగలబడి నవ్వారు. ఇంకొకడేమో ఎదురువచ్చిన ఒక ముసలామె చేతవున్న పూలబుట్టను లాగేసుకొని ఆ పూలనన్నిటినీ చెల్లాచెదురుగా విసిరేసి, "పూలవాన కురుస్తోందర్రో!" అని పకపకా నవ్వాడు. వాడితోబాటు మళ్ళీ తక్కిన వీరులూ పగలబడినవ్వారు. ఇంకొకడు ఒక ఎడ్లబండినాపి, ఎడ్లను బండినుంచి విడిపించేసి వాటిని తరిమాడు. అవి పాపం బెదిరిపోయి, జనాల మధ్యనుంచి పరుగెత్తాయి. ఈ వీరుల ధాష్టీకానికి అంతులేనట్లుంది!

ఇదంతా చూస్తున్న వంతిదేవుడు, "ఆహా! వీళ్ళుకూడ పళువేట్టరయ్యర్ వీరులలాగ ఆటాడుతున్నారు. వీరి చెలగాటం తక్కిన వారికి ప్రాణాసంకటంగా మారుతోంది. అదృష్టవశాత్తు, వీరి చూపు మనమీద పడలేదు. లేకపోతే ఒక పెద్ద కొట్లాట జరిగివుండేది. మనం వచ్చిన పని చెడేది", అని అనుకొన్నాడు. కానీ ఒకే ఒక్క తేడా అతనికి కనిపించింది. వేళక్కార దండు చేసిన వేళాకోలపు ఆటలగురించి ఇక్కడి ప్రజలు అంతగా విసుక్కోలేదు/కోపపడలేదు. పైగా వారి వేళాకోలపు సరదాల్లో వారు కూడ చేరి నవ్వుతూ కుతూహలపడ్డారు.

దీన్నిగురించి అడుగుదామని వెనక్కు తిరిగిచూస్తే పూలబుట్టలతో నిలబడ్డ ఆ అబ్బాయి కనిపించలేదు. ఈ కోలాహలంలో అతనెక్కడో వెళ్ళిపోయాడు. ఒకవేళ తనపనిమీద వెళ్ళిపోయాడేమో.

వేళక్కార దండు సాయంత్రం కోటనుంచి వెళ్ళినతర్వాత ఎవ్వరినీ కోటలోనికి వెళ్ళనివ్వరని వంతిదేవుడు తెలుసుకొన్నాడు. రాత్రి పగలు ఎప్పుడైనా కోటలోపల ప్రవేశించే హక్కు రాజకుటుంబీకులు, మంత్రులు, సేనాపతులకు మాత్రమే. పళువేట్టరయ్యర్ గారి కుటుంబీకులకు కూడ ఆ హక్కుందని వంతిదేవుడు తెలుసుకొన్నాడు. కాబట్టి, రాత్రే కోటలోపలికి వెళ్ళాలి అన్న అతని ఉద్దేశం మార్చుకొన్నాడు. తనదగ్గరవున్న రాజముద్ర వంటి ఉంగరాన్ని పరీక్షకు పెట్టడానికి అతనిష్టపడలేదు. రాత్రి కోట బయటే ఎక్కడైనా విడిదిచేసి పొద్దున కోటలోపల ప్రవేశించడం ఉచితమని అభిప్రాయపడ్డాడు. అప్పటికీ రాత్రి కోటలోపల ప్రవేశించగలిగినా, రాజుగారిని కలిసి తాళపత్రం అందజేయడం అంత సులభసాధ్యం కాదు కదా?

-:-

కోట గోడ చుట్టూవున్న వీధులగుండా కోటను చూస్తూ మెల్లగా సాగాడు వంతిదేవుడు. వింతలూ విశేషాలు చూసుకొంటూ వెళ్ళసాగాడు. ఆరోజు చాల కోసులదూరం ప్రయాణం చేసిన అతని గుర్రం చాల అలిసిపోయివుంది. త్వరలో దానికి విశ్రాంతినివ్వాలి. లేకపోతే రేపు అక్కర వచ్చినప్పుడు అది ప్రయోజనానికి రాకుండా పోతుంది! సౌకర్యంగా విడిదిచేసేందుకు ఒక తావు తొందరగా కనిపెట్టాల్సిందే!

తంజావూరు అప్పుడే కొత్తగా కట్టబడి విస్తరిస్తోన్న నగరం. అదీగాక అప్పుడు సాయంసమయం. కాబట్టి వందలకొద్ది వెలిగించబడ్డ వీధిదీపాలు వీధులను ప్రకాశవంతం చేయసాగాయి.

వీధులన్నీ చాలా సందడిగా వున్నాయి. బయటి ఊళ్ళనుంచి వేర్వేరు పనులమీద వచ్చిన వారు అటూఇటూ వెళ్తున్నారు. వారిలో చోళదేశపు పట్టణాలనుంచి, గ్రామాలనుంచి వచ్చినవారున్నారు. కొత్తగా చోళసామ్రాజ్యంలో చేరిన దేశాలనుంచి వచ్చిన వారూ కనిపించారు.. పొరుణై నదినుంచి పాలాట్రంగరై వరకు, దక్షిణదిశలో సముద్రతీరంనుంచి పడమటి సముద్రతీరంవరకు వ్యాపించిన చోళసామ్రాజ్యపు అన్ని ప్రదేశాలనుంచికూడ ప్రజలు కొత్త రాజధానికి వచ్చివున్నారు. వింధ్యపర్వతాలకు ఉత్తరంగా ఉన్న దేశాలనుంచి, సముద్రాలకవతల ఉన్న దేశాలనుంచి కూడ వచ్చివున్న కొందరు విదేశీయులు అక్కడక్కడా కనిపించారు.

అప్పం, అతిరసాలు మొదలైన తినుబండారాలు అమ్ముతున్న అంగళ్లలో జనాలు ఈగలు ముసురుకొన్నట్లు గుమిగూడి ఆ తినుబండారాలను ఆశపడి తినసాగారు. అరటిపళ్ళు, మామిడిపళ్ళు ఇంకా రకరకాల పళ్ళు గుట్టలు గుట్టలుగా పడివున్నాయి. పూల అంగళ్ళ సంగతి చెప్పనవసరమే లేదు! మల్లెలు, సంపంగి మొదలైన పూలు కమనీయంగా అగుపించాయి. ఆ పూలచుట్టూ స్త్రీలు తుమ్మెదల్లా గుమిగూడివున్నారు.

పూల అంగళ్ళ చెంత వెళ్ళినవెంటనే వంతిదేవునికి ఆ పూల అబ్బాయి జ్ఞాపకం వచ్చాడు. ఆ అబ్బాయిని మళ్ళీ చూడగలిగితే ఎంత సౌకర్యంగా ఉంటుంది? ఈ నగరంలో రాత్రి విడిది చేసేందుకు అనువైన తావు అడిగి తెలుసుకోవచ్చు కద?... ఇలా ఆలోచిస్తుండగానే ఆ అబ్బాయి కాస్త దూరంలో వస్తూ కనిపించాడు. గుర్రందిగి అతన్ని సమీపించాడు.

“తమ్ముడూ! పూల బుట్ట కనిపించడం లేదేం! పూలన్నీ ఎక్కడ? అమ్మేశావా?” అన్నాడు.

“అమ్మేందుకు నేను పూలు తేలేదు. గుడిలో పూజకు తెచ్చాను. ఇవ్వడమైంది. ఇంటికి తిరిగివెళ్తున్నాను.”

“ఏ కోవెలకు నీవీ పుష్పకైంకర్యం చేస్తున్నావు?”

“తళికులంవారి కోవెల గురించి వినివున్నారా?”

“ఓహో! తంజావూరు తళికులంవారి దేవాలయమా? వినివున్నాను. పెద్ద కోవెలా అది?”

“కాదు. చిన్న కోవెలే. కొంతకాలంగా తంజావూరులో దుర్గాదేవి కోవెలకే మహిమ ఎక్కువగా ఉంటోంది. అక్కడే పూజలు, పొంగల్ నైవేద్యం, బలి, తిరునాళ్ళు మొదలైన ఆర్భాటలన్నీ ఎక్కువ. రాజకుటుంబీకులు, పళువేట్టరయ్యర్లు కూడ దుర్గాదేవి గుడికే ఎక్కువగా వెళ్తున్నారు. తళికులంవారి కోవెలకు అంతగా మహిమ లేదు. దర్శించేందుకు కూడ ప్రజలంతగా రావడంలేదు....”

“నీవు ఈ పుష్పకైంకర్యం చేస్తున్నావు కద? దీనికోసం పారితోషికమేమైనా ఉందా?

“మా కుటుంబానికి ఇందుకోసం మాన్యం ఉంది. మా తాతలకాలంనుంచి గండరాదిత్య చక్రవర్తి ఇచ్చిన మాట ఉంది. ప్రస్తుతానికి నేను, మా అమ్మ ఈ కైంకర్యాన్ని చేస్తున్నాము.”

“తళికులంవారి కోవెల ఎర్ర ఇటుకల కట్టడమా? నల్లరాతి కట్టడమా?” అని వంతిదేవుడు అడిగాడు. అతను వచ్చినదారిలో చాలా ఎర్రఇటుకల గుళ్ళకు నల్లరాతి పునర్నిర్మాణం జరుగుతున్నది గమనించడంవల్ల అలా అడిగాడు.

“ఇప్పుడు ఎర్ర ఇటుకల గుడే. నల్లరాళ్లతో త్వరలో పునర్నిర్మాణం జరుగుతుందని వినికిడి. ఈ కార్యం వెంటనే జరగాలని పళైయారై పెద్దరాణి కోరుతున్నారట. కానీ...” అని ఆ అబ్బాయి కాస్త జంకుతూ చెప్పడం నిలిపాడు.

“కానీ ఏమి?...”

“పుకార్లుగా విన్నదాన్ని చెప్పి ప్రయోజనమేమి? పగలు చుట్టుపక్కల చూసి మాట్లాడు, రాత్రి అదికూడ వద్దు అని పెద్దలు చెప్పగా వినివున్నాను. ఇదేమో నాలుగు వీధులకూడలి. మనచుట్టూ జనాలు...”

“ఇటువంటి సందడిలోనే ధైర్యంగా ఏ రహస్యమైనా మాట్లాడవచ్చు. మనం మాట్లాడేది ఎవరి చెవిన కూడ పడదు.”

“మాట్లాడేందుకు రహస్యమేముంది?”అన్నాడా అబ్బాయి, వంతిదేవుని కాస్త సందేహంగా చూస్తూ.

ఆహా! ఈ అబ్బాయి చాలా బుద్ధిశాలి! ఇతనితో స్నేహం చేయడంవల్ల లాభం ఉంది! చాలా విషయాలు తెలుసుకోవచ్చు! కాని ఇతని మనస్సులో అనవసరంగా సందేహం పుట్టించకూడదు - వంతిదేవుడిలా ఆలోచించి, “అవును; రహస్యమేముంది ఇందులో? ఏమీ లేదు. పోతేపోనీ తమ్ముడూ! నేను రాత్రి నెమ్మదిగా నిద్రపోవాలి. చాలా దూరం ప్రయాణంచేసి అలిసిపోయివున్నాను. ఎక్కడ విడిది చేయవచ్చు? ఒక మంచి విడిదికి దారి చూపి సహాయంచేయగలవా?” అని అడిగాడు.

"ఈ నగరంలో విడిదిచేసేందుకు స్థలాలకేం కొదవ? సత్రాలెన్నో ఉన్నాయి. బయటి దేశాలనుంచి వచ్చిన వారికి ప్రత్రేక్యమైన రాజ్యాంగపరమైన విడిది స్థలాలుకూడ ఉన్నాయి. కానీ, మీకిష్టమైతే...."

"తమ్ముడూ, నీపేరేమి?" అని వంతిదేవుడడిగాడు.

"అముదన్, సేందన్ అముదన్."

"ఆహా! ఎంతమంచి పేరు? వింటున్నప్పుడే ఎంత ఇంపుగా ఉంది! నాకిష్టమైతే మీ ఇంటికి వచ్చి విడిదిచేయవచ్చనే కద చెప్పబోయావు?"

"అవును, అది మీకెలా తెలిసింది?"

"నాకు మంత్రవిద్యలు తెలుసు! అందునుంచి తెలుసుకొన్నాను. మీఇల్లెక్కడ ఉంది?"

"నగరపుటెల్లలు దాటి కూతవేటు దూరంలో మా పూలతోట ఉంది. తోట లోపలే మా ఇల్లుకూడ ఉంది."

"ఆహా! అలాగైతే నేను మీఇంటికి వచ్చేతీరాలి. ఈ నగరపు సందడిలో నేను ఈ రాత్రి నెమ్మదిగా నిద్రపోలేను. పైగా నీవంటి మంచి కొడుకును కన్న ఉత్తమురాలిని చూడడానికి ఇష్టపడుతున్నాను.."

"నాతల్లి ఉత్తమురాలే; కానీ దౌర్భాగ్యశాలి...."

"అరెరే! ఎందుకలా అంటున్నావు? ఒకవేళ మీ తండ్రి..."

"నా తండ్రి పరమపదించడం మాత్రమే కాదు - నా తల్లి పుట్టినప్పటినుంచే దౌర్భాగ్యశాలి. చూస్తే తెలుసుకొంటారు. రండి పోదాం."

-:-

ఒక అర్ధ గడియ తర్వాత వారు ఊరి బయటవున్న పూదోటకు వచ్చి చేరారు. రాత్రి పూచే పూల సువాసన వంతిదేవునికి అపూర్వమైన అనుభూతులనిచ్చింది. నగరపు వీధులలో ఉన్న సందడి, కోలాహలం అక్కడంతగా విన్పించలేదు.

పూలతోట మధ్య ఒక పెంకుటిల్లుంది. పక్కన రెండు పూరిగుడిశెలున్నాయి. తోటపనిలో సహాయంచేసే రెండుకుటుంబాలు ఆ రెండు గుడిశెల్లో నివసిస్తున్నారు. వారిలో ఒకరిని అముదన్ పిలిచి, వంతిదేవుని గుర్రానికి దాణావేసి చెట్టుకింద కట్టివుంచమని చెప్పాడు.

తర్వాత ఇంటిలోపలికి తీసుకొనివెళ్ళాడు. అముదన్ తల్లిని చూసినవెంటనే వంతిదేవునికి ఆమె దౌర్భాగ్యమేమని అర్థమైపోయింది. ఆమె మాటలురాని మూగది. చెవులు వినిపించదనికూడ తెలిసింది. కానీ ఆ తల్లి ముఖంలో కరుణ, ఆప్యాయత, అనురాగం నిండివుండడాన్ని వంతిదేవుడు గమనించాడు. ఆమె ముఖం ఒక అతీతమైన జ్ఞానంతో ప్రకాశవంతంగా ఉండడాన్ని కూడ గమనించాడు. సాధారణంగా ఒకరికి

ఏదైనా అంగవికలం ఉంటే తక్కిన జ్ఞాన/కర్మేంద్రియాలు మామూలుకన్న ఎక్కువ శక్తి కలిగివుండడం సృష్టి విచిత్రంకద?

అముదన్ కొన్ని సైగలు చేసిన వెంటనే వచ్చినవాడు బయటిదేశంనుంచి వచ్చిన అతిథి అని ఆమె తెలుసుకొన్నది. ముఖభావాలతోనే తన సంతోషాన్ని, స్వాగతాన్ని తెలియజేసింది.

కాసేపటికల్లా ఆకువేసి భోజనం వడ్డించింది. మొదట, అప్పం, కొబ్బరి పాయసం వచ్చాయి. అటువంటి కమ్మని వంటను వంతిదేవుడు తన జీవితంలోనే అంతవరకు తినివుండలేదు. పది అప్పాలు, అర్ధశేరు కొబ్బరి పాయసం భుజించాడు. తర్వాత పులిహోర, ఇంకా రకరకాల రుచికరమైన వంటకాలను ఆతల్లి అతనికి వడ్డించింది. వాటన్నిటినీ వంతిదేవుడు శుభ్రంగా ఖాళీ చేశాడు. అప్పటికీ అతని ఆకలి తీరలేదు; చివరికి పావుశేరు అన్నం, అర్ధశేరు పెరుగు వడ్డించుకొని తిన్నాడు! తర్వాతనే అతను ఆకుముందునుంచి లేచాడు.

-:-

భోంచెసేటప్పుడే అముదన్ వద్ద కొన్ని విషయాలు అడిగి తెలుసుకొన్నాడు.. తంజావూరు కోటలోపల సుందర చోళ చక్రవర్తి, ఆయన పరివారం కాక ఇంకెవరెవరున్నారని విచారించాడు.

పెద్ద పళువేట్టరయ్యర్, చిన్న పళువేట్టరయ్యర్, వారి పరివారాలు కోటలోపల ఉన్నారట. ఖజానా, ధాన్యాగారం రెండూ కోటలోపలే ఉండడం వల్ల వాటిని పరిపాలించే అధికారులు కూడ కోటలోపలే ఉన్నారు. సుందర చోళ చక్రవర్తి అంతరంగ విశ్వాసానికి, అభిమానానికి పాత్రులైన అనిరుద్ధ బ్రహ్మారాయరనే ముఖ్యమంత్రిగారు, శ్రీమందిర పత్రనాయకులుకూడ కోటలోపలే నివసిస్తున్నారు. ఇంకా చిన్న పళువేట్టరయ్యర్ నాయకత్వంలో కోటను కాపలా కాస్తున్న వీరులు, వారి కుటుంబీకులు కూడ అక్కడే నివసిస్తున్నారు. వెండి, బంగారు వర్తకులు, రత్న వ్యాపారులు, నగలు తయారుచేసే కంసాలివారు కోటలోపల నివసింప స్థలమివ్వబడ్డారు. పెద్ద పళువేట్టరయ్యర్ కింద పన్నులు విధించే అధికారులు వందలకొద్దీ ఉండేవారు. దుర్గాదేవి ఆలయం కోటలోపలే ఒక మూల ఉంది. గుడి పూజారులు, పనివారు, గణకాచార్యులు కూడ గుడి చుట్టుపక్కల నివాసం చేస్తున్నారు.

ఇదంతా తెలుసుకొన్న తర్వాత, ‘‘మంత్రులందరూ ఇప్పుడు కోటలోపలే ఉన్నారా?’’ అని వంతిదేవుడు అడిగాడు.

‘‘అందరూ ఎలా ఉంటారు? వేర్వేరు పనులమీద బయటికి పోతూ వస్తూనే ఉంటారు. అనిరుద్ధ బ్రహ్మారాయలు కొద్దికాలంగా నగరంలోనే లేరు. ఆయన చేరనాడుకు వెళ్ళివున్నట్లు వినికిడి. పెద్ద పళువేట్టరయ్యర్ నాలుగు రోజులకు మునుపు బయటకు వెళ్ళారు. కొళ్ళిడపు ఉత్తరంగా మధ్యనాడుకు వెళ్ళినట్లుగా వినికిడి.’’

"వెళ్ళినవారు తిరిగివచ్చి ఉండవచ్చుగద? నీకు తెలిసి ఉండకపోవచ్చు."

"ఈ రోజు సాయంకాలం పళువూర్ యువరాణి పల్లకి వచ్చింది. కోట వాకిట నేనే చూశాను. కానీ పళువేట్టరయ్యర్ రాలేదు. ఒకవేళ దారిలో ఆగిపోయి రేపు రావచ్చేమో."

"తమ్ముడూ! యువరాజు మధురాంతకులు కూడ కోటలోపలే కద నివసిస్తున్నారు?"

"అవును; పళువేట్టరయ్యర్ అంతఃపురానికి పక్కనే ఆయన భవనంకూడ ఉంది. చిన్న పళువేట్టరయ్యర్ కుమార్తెను పెళ్ళాడిన అల్లుడు కద?"

"ఓహో! అలాగా! నాకీ విషయం ఇంతవరకు తెలియనే తెలియదు!"

"చాలా మందికి తెలియనే తెలియదు. చక్రవర్తి అనారోగ్యాన్ని కారణంగా ఎంచి వారి పెళ్ళిని అంత ఆర్భాటంగా జరిపించలేదు."

"మంచిది; మధురాంతకదేవులు ఇప్పుడు కోటలోపలే కద ఉన్నారు?"

"కోటలోపలే ఉండాలి. కానీ ఆయన సాధారణంగా బయటకు రావడం ఉండదు. ప్రజలు ఆయనను చూసేందుకు వీలుకూడ కావడంలేదు. శివభక్తిలో నిమగ్నమై యోగంలోను, ధ్యానంలోను, పూజలోనే చాలసమయం గడుపుతున్నారని వినికిడి."

"ఐనాకూడ ఇన్నిరోజులతర్వాత పెళ్ళిచేసుకొనివున్నారే?"

"అవును; అది కాస్త వింతైన విషయమే. పెళ్ళితర్వాత అల్లుడుగారి మనసే మారిపోయిందని అంటున్నారు. మనకెందుకు దానిగురించి? పెద్దింటి విషయాలు మాట్లాడకుండడమే మంచిది...."

-:-

అముదన్ వద్ద ఇంకా చాలా విషయాలు అడిగి తెలుసుకోవాలనుకొన్నాడు. కానీ ఎక్కువగా అడిగితే అతనికి తనపైన ఏదైనా సందేహం రావచ్చని ఊరకున్నాడు. ఇటువంటి సాధువైన అబ్బాయి పరిచయం తనకు చాలా ఉపయోగిస్తుంది. తంజావూరులో ఉండేందుకు ఇటువంటి మంచి ఇల్లు తనకు దొరకడంకూడ తన అదృష్టమే. దాన్ని చెడగొట్టుకోవడం మంచిదికాదు కద? అదీగాక, సుదూర ప్రయాణపు అలసటవల్ల నిద్రముంచుకొస్తోంది. అది గమనించి సేందన్ అముదన్ అతనికి పడక త్వరగా సిద్ధం చేశాడు.

నిద్రమైకంలో చివరిగా వంతిదేవుని మనస్సులో పళువూర్ రాణి అగుపించింది. ఆహా! ఏమందం! ఏం మెరుపు! ఆ మాయామోహిని ముఖాన్ని ఉన్నట్లుండి చూసిన వెంటనే అతను చేష్టలుడిగి కళ్ళార్పకుండ చూస్తూ నిలబడిపోవడం అతనింకా మరిచిపోలేదు. చిన్నప్పుడు ఒకసారి అడవిదారిలో వెళ్తున్నప్పుడు ఉన్నట్లుండి పడగెత్తి ఆడుతున్న ఒక పాము అతనికెదురైంది. దాని అందమే అందం! ఆకర్షణే ఆకర్షణ! వంతిదేవుడు పాముపడగ నుంచి కళ్ళు తిప్పలేకపోయాడు.. రెప్పకూడ

వేయలేకపోయాడు. అలాగే చూస్తూ నిలబడిపోయాడు. పాముకూడ ఆడుతూ నిలబడింది! పాము ఆడినప్పుడు దానికి తగినట్లు అతని ఒడలుకూడ ఆడింది - ఇది ఎలా ముగిసివుండేదో తెలియదుగానీ ఉన్నట్లుండి ఒక ముంగిస వచ్చి ఆ పాముపైన దాడిచేసింది. రెంటి మధ్య ద్వంద్వ యుద్ధం మొదలైంది. అదే సాకని వంతిదేవుడు ఒక్క పరుగుతో పారిపోయి వచ్చేశాడు!...

ఛీఛీ! ఏం ఉపమానం! ఈ భువనమోహినియైన సుందరాంగిని ఆ పడగెత్తిన పాముతోనా పోల్చడం? ఈమె పాలుగారే ముఖాన్ని ఒక్కసారి చూసినా ఆకలి తీరిపోతుంది కద?... ఆమెను రేపు మళ్ళీ చూడబోతున్నాం కద? ఆమె స్వరం ఎంత మధురం! ఆమె ఒక అపూర్వమైన సౌందర్యవతి. కానీ కుడంధై జ్యోతిష్కుల ఇంట, తర్వాత అరిసిలార్ నది ఒడ్డున చూసిన ఇంకొక వనిత?... ఆమె కూడ మెరుపులాంటి అందంకలదే! కానీ ఇద్దరి అందానికి ఎంత తేడా! ఆమె అందంలో గాంభీర్యమూ, హుందాతనమూ; ఈమె అందం మోహనమూ, ఆకర్షణీయమూను!... ఇలా అతని మనస్సు ఆ ఇద్దరు స్త్రీల ముఖాలను పోల్చి ఆలోచిస్తున్నప్పుడు, ఇంకొక వనిత అడ్డంవచ్చింది. సర్వాధికారిణియైన నిద్రాదేవి వంతిదేవుని పరిపూర్ణంగా ఆక్రమించింది.

~~~
~~~

# అధ్యాయము - 24

## కాకి - కోకిల

**రాత్రంతా** కొయ్యదిమ్మలా పడి నిద్రపోయిన వంతిదేవుడు పొద్దున సూర్యోదయం తర్వాతే నిద్ర లేచాడు. మెలకువైన తర్వాతకూడ లేచేందుకు మనసురాక అలాగే పడుకొనివున్నాడు. పైగాలి వీస్తుండగా చెట్లకొమ్మలు ఒకదానికొకటి ఒరుసుకొని, 'ఓ' అని శబ్దం చేయసాగాయి. దానికి తోడు ఆకుల గలగలలు. ఆ శబ్దానికి తగినట్లు ఒక బాలకుడు తీయని గొంతుతో సుందరమూర్తి స్వామిగారి దెవారాలను పాడడం వినవచ్చింది.

ఇది విన్న వంతిదేవుడు కళ్ళు తెరిచి చూశాడు. అతనికెదురుగా పూలతోటలో పొన్నచెట్లలో గుత్తులు గుత్తులుగా పూలు పూచి వేలాడుతుండడం కనిపించింది. సేందన్ అముదన్ ఒక చేత పూలబుట్ట, ఇంకొకచేత ఒక కొక్కి పట్టుకొని, పాటలు పాడుతూ పూలను కోస్తూండడం కనిపించింది. పొద్దునే లేచి స్నానం చేసి, తీర్థం సేవించివున్న అముదన్ శివభక్తుడైన మార్కండేయునిలాగ కనిపించాడు. ఇంతటి ఇంపైన, అందమైన స్వరాన్ని అతని తల్లి వినలేదు కద అని విచారిస్తూ వంతిదేవుడు లేచాడు. అముదన్ లాగ తానుకూడ పూలతోటలో తిరుగుతూ, శివకైంకర్యం చేసుకొంటూ ఎందుకు జీవితం వెళ్ళబుచ్చకూడదు? ఎందుకు కత్తి, శూలమూ చేతబట్టి ఊరూరూ తిరగాలి? ఏ సమయంలోనైనా ఇతరులను చంపేందుకో, ఇతరులవల్ల చంపబడేందుకో ఎందుకు ఊరూరూ తిరుగుతుండాలి? - ఇలాంటి ఆలోచనలు అతని మనస్సులో ఉదయించాయి. కానీ కాసేపట్లో మనసు మారింది. అందరూ అముదన్ లాగ శివభక్తులుగా ఉంటారా? దొంగలు, బందిపోట్లు, అమాయకులను హింసించే క్రూరులూ ఈ లోకంలో ఉండనే ఉంటారు. వీరందరినీ అదుపులోపెట్టి, న్యాయం, ధర్మం నెలకొల్పేందుకు  రాజ్యాంగం కావాలి. రాజ్యాంగాన్ని నడిపేందుకు రాజులు, మంత్రులు కావాలి. వీరికి ఆపద రాకుండ కాపాడేందుకు నమ్మకమైన వీరులు కావాలి. తనలాగ రాజులకు సందేశాన్ని చేరవేసే మనుషులూ కావాలి. అవును! ఈరోజు సుందర చోళ చక్రవర్తిని చూసే తీరాలి. పెద్ద పళువేట్టరయ్యర్ తిరిగివచ్చేలోపల చక్రవర్తిని చూస్తే సరి. ఆయన వచ్చేస్తే అది అసాధ్యమైపోతుంది.

పూలతోటకు పక్కనేవున్న తామరకొలనులో స్నానంచేసి, బట్టలు, ఆభరణాలు ధరించి తన్ను తాను బాగా అలంకరించుకొన్నాడు వల్లవరయ్యన్. చక్రవర్తిని చూసేందుకు వెళ్ళేటప్పుడు సాధారణంగా వెళ్ళవచ్చా? అందుకోసమే అలంకరించుకొన్నాడా, లేక ఆ రోజు పళువూర్ యువరాణిని మళ్ళీ చూడబోతున్నామనే  ఉద్దేశంకూడ అతని మనసులో ఉందా అని చెప్పలేం.

-:-

ప్రాతఃకాల భోజనం తర్వాత అముదన్ మధ్యాహ్న పూజకు పూలబుట్టలతో బయలుదేరగా, వంతిదేవుడు చక్రవర్తి దర్శనానికి బయలుదేరాడు. ఇద్దరూ నడిచేవెళ్ళారు.

కోటలోపల గుర్రాన్ని తీసుకొనివెళ్ళకూడదని వంతిదేవుడు ముందే నిశ్చయించుకొన్నాడు. గుర్రం బాగా సేదదీరేందుకు అవకాశమివ్వడం ముఖ్యం. త్వరలోఆ గుర్రాన్ని తాను త్వరితప్రయాణానికి ఉపయోగించవలసిరావచ్చు. ఎవరికెరుక? ఏదేమైనా అది ఇక్కడ ఉండడమే మంచిది.

కోట వాకిలి చేరేవరకు అముదన్‌తో మాటలాడుతూ ఇంకా కొన్ని విషయాలు తెలుసుకొన్నాడు.

"మీతల్లి తప్ప నీకు ఇంకెవరూ తోడబుట్టినవారు, చుట్టాలు లేరా?" అని వల్లవరయ్యన్ అడిగినందుకు అముదన్ ఇలా జవాబిచ్చాడు: "ఉన్నారు. నాతల్లి తోడబుట్టిన అక్క, తమ్ముడు ఉన్నారు. అక్క పరమపదించింది. తమ్ముడు (అంటే నా మేనమామ) కోడిక్కరై అర్చకులు. కోవెలలో పుష్పకైంకర్యం చేస్తారు. దానితోబాటు, రాత్రి రేవు దీపస్తంభంలో దీపం వెలిగించి ఓడలను రక్షించే బాధ్యతకూడ తీసుకొన్నారు.... ఆయనకు ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. కూతురు..."అని చెప్పి నిలిపాడు.

"కూతురుకు ఏమి?"

"ఏమీ లేదు. మాకుటుంబంలోనే ఒక విచిత్రం. కొందరు పుట్టుమూగవారు; ఇంకొందరు ఇంపైన స్వరంగలవారు; బాగా పాడుతారు...."

"మీమామ కూతురు మూగది కాదుకద?" అన్నాడు వంతిదేవుడు.

""కాదు, కాదు!"

"అంటే బాగా పాడగలది అని చెప్పు. నీకన్న బాగా పాడుతుందా?"

"బాగుంది, మీ ప్రశ్న! "కోకిల కాకికన్న బాగా పాడుతుందా" అన్నట్లుంది మీ ప్రశ్న. పూంగుళలి పాడితే సముద్రరాజు అలలనెగరవేసి సద్దు చేయడం నిలిపేసి ప్రశాంతంగా వింటాడు. ఆవులు, మేకలు, అడవిజంతువులుకూడ మైమరచి నిలబడతాయి..."

"మీమామ కూతురు పేరు పూంగుళలినా? అందమైన పేరు."

"పేరు మాత్రమేనా అందమైనది?"

"ఆమెకూడ అందగత్తెగానే ఉండితీరాలి. లేకపోతే నీవింత పరవశించి మాట్లాడుతావా?"

"నెమలి, జింక ఆమెదగ్గర అందం భిక్ష అడగాలి. రతి, ఇంద్రాణి ఆమెలా అందంగా పుట్టేందుకు పలు జన్మాలు తపస్సు చేయాలి."

సేందన్ అముదన్ మనస్సు పూర్తిగా శివభక్తిలోనే నిమగ్నమైవుండలేదని వంతిదేవుడు తెలుసుకొన్నాడు.

"అలాగైతే నీకు తగిన అమ్మాయి అని చెప్పు. మామకూతురు కాబట్టి నీకు కావలసిన అమ్మాయికూడాను. పెళ్ళి ఎప్పుడు?" అని వంతిదేవుడడిగాడు.

"నాకు తగిన అమ్మాయి అని ఏనాడూ చెప్పను. నేనామెకు ఏవిధంగానూ సరితూగలేను. పాతకాలంలాగ పూంగుళలికి స్వయంవరం ఏర్పాటుచేస్తే యాభైయారు దేశాల రాజులూ వచ్చి పోటీ పడుతారు! దమయంతిని పెళ్ళాడేందుకు స్వర్గలోకంనుంచి దేవతలు వచ్చినట్లు వచ్చినా రావచ్చు. కానీ ఈ కలియుగంలో అలా జరగబోదు..."

"అలాగైతే ఆమె నిన్ను పెళ్ళాడేందుకు ఇష్టపడినా నీవు తిరస్కరిస్తావని చెప్పు!"

"బాగుంది! దేవుడే దిగివచ్చి, 'నీవు సుందరమూర్తిలాగ బొందితో కైలాసానికి వస్తున్నావా? లేక భూలోకంలో పూంగుళలితో జీవిస్తావా?' అని అడిగితే, 'పూంగుళలితోనే ఉంటాను' అనే చెప్తాను. కానీ నేను చెప్పి ఏం ప్రయోజనం?"

"ఎందుకు ప్రయోజనం లేదు? నీకు సమ్మతమైతే ఇంచుమించు పెళ్ళి జరిగినట్లే కద? అందరూ పెళ్ళికూతురినడిగే పెళ్ళి చేస్తున్నారా? ఉదాహరణకు, పెద్ద పళువేట్టరయ్యర్ అరవైఐదేళ్లకు పైబడ్డతర్వాత పెళ్ళిచేసుకొనివున్నారే! ఆ రాణి సమ్మతం ప్రకారమా పెళ్ళి జరిగివుంటుంది!...."

"అన్నా! అది పెద్దింటి విషయం; మనమెందుకు దానిగురించి మాట్లాడాలి? ముఖ్యంగా మీకు హెచ్చరిక చేస్తున్నాను. మీరు కోటలోపలికి వెళ్తున్నారు. కోటలోపల పళువేట్టరయ్యర్లను గురించి ఏమీ మాట్లాడకండి. మాట్లాడితే అపాయం!...."

"ఏం తమ్ముడూ! ఒక్క పెట్టున భయపెట్టేస్తున్నావు!"

"నిజమే చెప్తున్నాను. నిజానికి, ఆ ఇద్దరు పళువేట్టరయ్యర్లే చోళసామ్రాజ్యాన్నేలుతున్నారు. వారి అధికారాన్ని మించి ఏ అధికారమూ లేదు."

"చక్రవర్తికి కూడానా వారికన్న అధికారం లేదు?"

"చక్రవర్తి జబ్బుపడి ఉన్నారు. పళువేట్టరయ్యర్లు గీచిన గీటు ఆయన దాటడంలేదు అని ప్రజలందరూ అంటున్నారు. ఆయన స్వంత కుమారుల మాటకూడ చెవికెక్కడంలేదంటున్నారు...."

"అలాగా సంగతి! పళువేట్టరయ్యర్ల పలుకుబడి అపారంగానే ఉండాలి. రెండేళ్ళకు మునుపు వారికింత పలుకుబడి లేదు కద?"

"లేదు; అందులోనూ చక్రవర్తి తంజావూరుకు వచ్చిన పిదప పళువేట్టరయ్యర్ల అధికారానికి ఎల్లల్లేకుండా పోయింది. వారి మాటకెదురు చెప్పగలవారెవరూ లేరు. అనిరుద్ధ బ్రహ్మరాయలుకూడ విసిగిపోయివున్నారు. పాండ్యనాడుకు వెళ్ళిపోయారని వినికిడి."

"పళైయారైనుంచి చక్రవర్తి ఎందుకు తంజావూరుకు వచ్చారు? నీకు తెలుసా, తమ్ముడూ?"

"నేను విన్నది చెప్తున్నాను. మూడేళ్ళకు మునుపు వీరపాండ్యుడు పోరులో చచ్చాడు. ఆసమయంలో చోళసైన్యాలు కొన్ని క్రూరకృత్యాలను చేశారని వినికిడి. యుద్ధమంటే అలానే కద? మదురై చోళ రాజ్యానికి లొంగిపోయింది. కానీ, వీరపాండ్యుని సన్నిహితులు కొందరు, ఎలాగైనా పగ తీర్చుకోవాలని శపథం పట్టివున్నారట. రాజుగారు పళైయారైలో ఉంటే వారిని కాపాడడం వీలుకాదనే పళువేట్టరయ్యర్లు ఆయనను తంజావూరుకు తీసుకువచ్చేశారు. ఇక్కడ కోటకూడ బలిష్టమైనది; కాపలాకూడ అధికం. అదీగాక, చక్రవర్తి ఆరోగ్య స్థితికి పళైయారైకన్న తంజావూరు మేలని వైద్యులు చెప్పారు."

"సుందర చోళ చక్రవర్తి ఆరోగ్యం గురించి అందరూ చెప్తున్నారు. కానీ, ఏమి రోగమని మాత్రం ఎవరికీ  తెలియదు."

"తెలియకేం? చక్రవర్తికి పక్షవాతం వచ్చి రెండు కాళ్ళూ పడిపోయాయి."

"అయ్యో! అందువల్ల ఆయనకు నడిచేందుకే వీలు కాదేమో?"

"నడవలేరు; ఏనుగు పైనగానీ, గుర్రంపైనగానీ ఎక్కలేరు. పడుకున్న పడకలోనే ఉండాలి. పల్లకిలో ఎక్కించి ఒకచోటినుంచి ఇంకొకచోటికి తీసుకెళ్తేనే వెళ్ళగలరు. అదికూడ ఆయనకు చాల వేదననిస్తుంది. కాబట్టి చక్రవర్తి అంతఃపురందాటి బయటకు రావడమే లేదు. కొంతకాలంగా చిత్తస్వాధీనంకూడ లేదని వినికిడి."

"ఆహా! ఎంతటి పరితాపమైన స్థితి!"

"పరితాపమని కూడ చెప్పకూడదు, అన్నా! అదికూడ రాజనిందన అనిచెప్పి పళువేట్టరయ్యర్లు శిక్ష విధిస్తారు."

పళువేట్టరయ్యర్! పళువేట్టరయ్యర్! - ఎక్కడ, ఎవరితో మాట్లాడినా, వారిగురించే మాట! వారెంత పరాక్రమశాలులైతేనేం? బొక్కసం, ధాన్యాగారం, తంజావూరు నగర రక్షణ, గూఢచారుల దండు - అంతటినీ చక్రవర్తి వారి కైవసం చేసివుండకూడదు. ఇలా అధికారాలన్నిటినీ  వారికి వదిలిపెట్టేసినందువల్లనే కద వారు చక్రవర్తికి విరుద్ధంగా కుట్ర పన్నుతున్నారు! వీరి కుట్ర ఎంతవరకు ఫలిస్తుందో? అది ఫలించకుండ మన చేతనైన ప్రయత్నం చేయాలి. సందర్భం దొరికితే చక్రవర్తిని హెచ్చరించాలి!...

ఇంతలో కోటవాకిలి వచ్చేసింది. సేందన్ అముదన్ తన కొత్త స్నేహితుని విడిచి తాను సేవచేసే గుడికి వెళ్ళాడు. వంతిదేవుడేమో మనస్సులో కట్టుకొన్న ఎన్నెన్నో కోటలతో ఆ కోట వాకిలిని సమీపించాడు.

~~~
~~~

# అధ్యాయము - 25

## కోట లోపల...

తాళవృక్ష చిహ్నం పొదిగిన ఆ ఉంగరం మనం కథల్లో చదివే మాయ ఉంగరంలా చాల మంత్రశక్తి కలిగివున్నట్లుంది.

పొద్దున పాలు, పెరుగు అమ్మేవారు, కూరగాయలు అమ్మేవారు, పలు వృత్తులవారు, ఉద్యోగస్తులు, కరణం పనిచేసేవారు అందరూ ఒక్క గుంపుగా కోటలోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్నారు. కోటవాకిలి చిన్న తలుపును తెరిచి వారందరినీ ఒక్కొక్కరిగా లోపలికి వదలడంలో కోట కాపలా భటులు తమ ఆర్భాటపు అధికారాన్ని చూపించసాగారు.

కానీ, మన యువవీరుడు ఆ ఉంగరాన్ని చూపడమే ఆలస్యం, కాపలా భటులు చాల మర్యాదతో కోట తలుపుల్లో ఒక దాన్ని అతనికోసం తెరిచారు. వంతిదేవుడుకూడ కోటలోపల ప్రవేశించాడు.

ఆహా! తంజైపురి (తంజావూరు) కోటలోపల అతను కాలు పెట్టిన వేళ ఎటువంటిదో తెలియదు! చోళ సామ్రాజ్య చరిత్రలోనే అది ఒక ముఖ్యమైన సంభవంగా కద ఏర్పడింది!

కోటలోపల ప్రవేశించిన కాసేపటివరకు వంతిదేవుడు ఆ కోట వైభవం కలిగించిన సంభ్రమంలో మునిగిపోయాడు.

కంచి పాత పల్లవసామ్రాజ్యపు రాజధాని. చాల సార్లు శత్రువుల దాడికి గురైనది. అక్కడి మాళిగలు, భవనాలు ఇతర కట్టడాలు చాలావరకు పాడుపడిపోయి శిథిలావస్థలో ఉన్నాయి. అందమైన శిల్పకళాకృతులు అమర్చిన కట్టడాలే; కానీ, చాల భాగాలు విరిగిపడిపోయివున్నాయి. ఆదిత్య కరికాలన్ వచ్చిన తర్వాత పునర్నిర్మాణం చేయించిన కొన్ని కట్టడాలు మాత్రం, ఎండిపోయిన చెట్టుకొమ్మల్లో ఎక్కడో కొన్నిచోట్ల మాత్రం విరిసిన పూలలాగ కనిపిస్తూ, పాడుపడ్డ ఆ నగరానికి కాస్త జీవకాంతినివ్వసాగాయి.

-:-

ఈ తంజావూరేమో అందుకు పూర్తి వ్యతిరేకంగా ఉంది. అన్నీ కొత్త మాళిగలు; కొత్త మంటపాలు. తెల్లని సౌధాలమధ్య ఎర్రటి ఇటుకల కట్టడాలు వజ్రాలకు, ముత్యాలకు మధ్య పొదిగిన రత్నాలలాగ ప్రకాశిస్తున్నాయి. అక్కడక్కడ అంతఃపురపు పూలతోటల్లోని చెట్లు ఏపుగా పెరిగివున్నాయి. పొన్న, అశోక, రావి, మర్రి, పనస, వేప మొదలైన చెట్లపై దట్టంగా పెరిగివున్న ఆకులు మరకతాల పలు రంగులలాగ కంటికింపుగా కనిపించాయి. అపూర్వ శక్తులున్న మయుడు నిర్మించిన నగరమిది. ఈ కొత్త నగరంలో ప్రవేశించేటప్పుడే ఒక కొత్త ఉత్సాహం పుట్టుకొచ్చింది; మనస్సు ఉప్పొంగింది; కారణం తెలియని గర్వం

పుట్టుకొచ్చింది.

కోటలోపలికి ప్రవేశించడానికి ఉన్న కట్టుబాట్లు, నిర్బంధాలు చూసిన వంతిదేవుడు లోపల అంతగా జనసంచారం ఉండదనుకొన్నాడు. కానీ అందుకు వ్యతిరేకంగా వీధులన్నీ చాలా సందడిగా ఉన్నాయి. గుర్రాలు, గుర్రాలు పూన్చిన రథాలు భూమి అదిరేలా ముందుకు దూకుతూ వెళ్తున్నాయి. నల్లటి గుండ్రాళ్ళు మెల్లగా దొర్లుకొంటూ వచ్చినట్లు గంభీరంగాను, నిదానంగాను నడిచి వస్తున్న ఏనుగుల గంటల శబ్దం నలుపైపులా వినిపించాయి! పూలు, కూరగాయలు, పాలు, పెరుగు మొదలైనవాటిని అమ్ముతున్నవారి కేకలతో చెవులు దిబ్బెళ్ళేశాయి. అప్పుడప్పుడు సమయాన్ని సూచించే గంటల శబ్దంతోబాటు నగారాల మోతకూడ కలిసి వినబడింది. సంగీత వాద్యాల శబ్దంతోబాటు స్త్రీలు పాడుతున్న మధురకీర్తనలు విన్పించాయి. అన్నీ కలగలిసి తిరునాళ్ళలాగ ఒకటే కోలాహలంగా ఉంది.

నగరమంటే ఇది కద నగరం! దినదిన ప్రవర్ధమానమౌతున్న ఒక సామ్రాజ్యపు రాజధాని ఇలాగే ఉంటుంది కాబోలు!

ఇటువంటి నగరానికి తాను పూర్తిగా కొత్తవాడని ఇతరులు తెలుసుకొనేందుకు అవకాశమివ్వడానికి  వంతిదేవుడిష్టపడలేదు.. అంతఃపురానికి ఎలా వెళ్ళాలని ఎవరినైనా అడిగితే, వారు తనను ఎగాదిగా చూసి, ‘‘నీవీ నగరానికి కొత్తవాడివా?’’ అని నిర్లక్ష్యంగా అడగవచ్చు. ఒట్టి పల్లెటూరి బైతు అనుకోనూవచ్చు. కాబట్టి, ఎవరినీ దారి అడగకుండా చక్రవర్తి అంతఃపురం చేరుకోవాలి … అది అంత అసాధ్యమైన కార్యమేం కాబోదు.

ఎటువైపు చూసినా మిద్దెలు, మేడలపైన మకరతోరణాలు, తీగెలు కనిపించాయి. వేగంగా వీస్తున్న గాలితో అవి ద్వంద్వ యుద్ధంచేస్తున్నట్లు  గలగలా శబ్దంచేస్తున్నాయి. పులిజెండాలు, తాటిచెట్టు చిహ్నంగల జెండాలే ఎక్కువగా కనిపించాయి. తక్కిన జెండాలకన్న చాలా పొడవుగా, మేఘాలను తాకేటట్లు ఒక పులిజెండా ఎగురుతూ కనిపించింది. అదే చక్రవర్తి అంతఃపురమైవుండాలని వంతిదేవుడు ఎంచి, ఆ దిశగా నడుస్తూ, తాను ముందు చేయవలసిన కార్యాలగురించి ఆలోచించసాగాడు.

చక్రవర్తిని ప్రత్యక్షంగా కలిసి తాళపత్రసందేశాన్నందివ్వడం  మొదటి పని. దానితోబాటు ఆదిత్య కరికాలన్ వాఙ్మూలంగా తెలియజెప్పమని చెప్పిన విషయాన్నికూడ చెప్పాలి. చిన్న పళువేట్టరయ్యర్ అనుమతిలేకుండ చక్రవర్తిని కలవలేము. ఆయన అనుమతినెలా పొందడం? కోటలోపల ప్రవేశించడానికి దైవమే దారిచూపాడు. కానీ అన్నిటికీ దేవుడే దారిచూపుతాడని ఊరకే ఉండగలమా? చక్రవర్తిని చూసేందుకు మనమే ఏదైన యుక్తి పన్నాలి! అదేం యుక్తి! వాణర్‌కులంలో తరతరాలుగా వస్తున్న ఓ బుద్ధీ! కాస్త పనిచెయ్! కాస్త నీ కల్పనాశక్తిని, ఊహాశక్తిని తట్టిలేపు! కావ్యాలు, కవితలు రాసేవారికి మాత్రమే కల్పనాశక్తి కావలసివుందనేం లేదు. నీలాగ రాజకీయకార్యాలలో నిమగ్నమైవున్న వారికికూడ కల్పనాశక్తి కావాలి.

ఏదీ! నీ కల్పనాశక్తిని చూపించు, చూద్దాం!

-:-

పెద్ద పళువేట్టరయ్యర్ ఇంకా కోటకు తిరిగిరాలేదని వంతిదేవుడు ధృఢపరుచుకొన్నాడు.

కోటలోపల కాలుపెట్టిన వెంటనే, అక్కడవున్న ఒక కాపలాదారుని, "అయ్యా! పళువేట్టరయ్యర్ తిరిగివచ్చేశారా?" అని అడిగాడు.

"ఎవరిగురించి అడుగుతున్నావు,, తమ్ముడూ! చిన్నాయన అంతఃపురంలోనే కద ఉన్నారు."

"అది నాకు తెలియదా! మధ్యనాడుకు వెళ్ళివున్న పెద్దాయన గురించే అడిగాను."

"ఓ! పెద్దాయన మధ్యనాడుకా వెళ్ళివున్నారు? అదినాకు తెలియదు. నిన్న సాయంకాలం యువరాణి పల్లకి తిరిగివచ్చింది. పెద్దరాజుగారు ఇంకా తిరిగిరాలేదు. ఈరాత్రి తిరిగిరావచ్చని సమాచారం అందింది." అన్నాడా కాపలావాడు.

ఇది మంచి సంగతే. పెద్ద పళువేట్టరయ్యర్ తిరిగిరాక మునుపే చక్రవర్తిని కలిసి, తాళపత్రాన్ని అందించాలి. అందుకు దారేది?... వంతిదేవుని బుర్రలో ఒక ఉపాయం తట్టింది! ఆక్షణమే అతని ముఖం కలతవీడింది; ఒక చిలిపి నవ్వు విరిసింది.

చక్రవర్తి అంతఃపురాన్ని సమీపించేందుకు అతను అంతగా కష్టపడాల్సి రాలేదు. పెద్ద పులిజెండానే చూసుకొంటూ వెళ్ళాడు. త్వరలోనే అంతఃపురం ముఖద్వారాన్ని చేరాడు. ఆహా! ఇది ఎంతటి అంతఃపురం! దేవలోకంలోని ఇంద్రుని అంతఃపురంలాగాను, ఉజ్జయినిలోని విక్రమాదిత్యుని అంతఃపురంలాగాను కద ఉంది! ఆ ముఖద్వారపు మంటప స్తంభాలపైని శిల్పకళాఖండాలు ఎంత అద్భుతంగా ఉన్నాయి! ఒక్కొక్క స్తంభంపైన చెక్కివున్న గుర్రం తన ముంగాళ్లను పైకెత్తి ముందుకు దూకేందుకు సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోందికద!

-:-

అంతఃపురాన్ని చేరేందుకు చాల దారులు పలు దిశలనుంచి వస్తున్నాయి. ఒక్కొక్క దారి చివర, ఇద్దరు అశ్వరూఢులైన వీరులు, కొందరు పదాతివీరులూ ఉన్నారు. వీధుల్లో తిరుగాడుతున్న జనాల్లో చాలామంది వారిని సమీపించకనే తిరిగివెళ్ళిపోతున్నారు. కొందరు మాత్రం కాస్త దగ్గరికి వచ్చి, అంతఃపురపు ముందుభాగాన్ని ఒకసారి చూసుకొని, పులిజెండాను తలెత్తి చూసేసి వెనక్కి వెళ్ళిపోతున్నారు. చాలాసేపు అక్కడ గుమిగూడినట్లైతే వారిని ఆ వీరులు చేతి సైగలతోనే వెనక్కి వెళ్ళిపోయేటట్లు చేస్తున్నారు. గుమిగూడి నిలబడ్డవారుకూడ పెద్దగా మాట్లాడక, మెల్లగా మాట్లాడుకోసాగారు.

వంతిదేవుడు తక్కిన వారిలాగ జంకుతూ నిలబడలేదు. వేగంగాను, ధైర్యంగాను నడిచివెళ్ళి ఆ

కాపలావీరులను సమీపించాడు. వెంటనే, రెండుగుర్రాలు మూతులు రాసుకొన్నట్లు దారికడ్డంగా నిలబడ్డాయి. గుర్రాలపైన వున్నవీరులు, కిందనిలబడ్డవారు అందరూకూడ తమ శూలాల మొనలను ఒక్కటి చేసి, దారికడ్డంవేశారు.

వంతిదేవుడు తన మాయ ఉంగరాన్ని ముందుకు చాచాడు. అంతే! అదిచూసిన వెంటనే ఆ వీరుల దర్పమూ, పెత్తనమూ అణిగిపోయాయి. ఒకరి తర్వాత ఒకరుగా ముగ్గురు ఆ ఉంగరాన్ని పరిశీలించి చూశారు. "సరే; దారి వదలండి!" అన్నాడొకడు. రెండు శూలాలు వెంటనే పక్కకు తొలగి దారి వదిలాయి. వంతిదేవుడు దర్పంగా ముందుకు వెళ్ళాడు.

కానీ ఏం? ఇలాంటి కాపలావీరులింకెంతమందిని దాటాలో? చిన్న పళువేట్టరయ్యర్ ఎక్కడున్నారో? ఎలా విచారించడం? ఎవరినడగడం? ఆయన అనుమతిలేనిదే చక్రవర్తిని కలవలేము; ఈ విశాలమైన అంతఃపురంలో చక్రవర్తి ఎక్కడున్నారో ఎలా తెలుసుకోవడం?....

-:-

తన వెనకే కొంతమంది గుంపుగా రావడాన్ని వంతిదేవుడు గమనించాడు. నిజమే; పది పదిహేను మంది గుంపుగా వచ్చి కాపలావీరుల దగ్గరగా నిలబడ్డారు. వారు పెద్దపెద్ద పట్టుపీతాంబరాలు, చెవిలో కుండలాలు ధరించివున్నారు. కొంతమంది నుదుట శ్రీచూర్ణము, ఇంకొంతమంది చందనం, కుంకుమ జవ్వాది బొట్టు పెట్టుకొనివున్నారు! ఆహా! వీరిని చూస్తే కవిపుంగవుల్లాగ వున్నారు కద! అవును, కవిగోష్టి అని మరుక్షణమే తెలిసిపోయింది.

కాపలాదారుల్లో ఒకడు - వారి నాయకుడైవుండాలి, "కవిపుంగవులు వస్తున్నారు! దారి వదలండి!" అని అనడంతోబాటు ఒక వీరుని చూసి, "చిన్న పళువేట్టరయ్యర్ ఆస్థాన మంటపంలో ఉన్నారు. వీరిని ఆయన దగ్గరకు తీసుకుపో!" అన్నాడు.

పైగా, "కవిపుంగవుల్లారా! ఏదైనా బహుమానం దొరికితే తెరిగివెళ్ళేటప్పుడు ఇదే దారిన వెళ్ళండి! లేకపోతే వేరే దారిన వెళ్ళండి!" అన్నది విని తక్కినవారు నవ్వారు!

కాస్త నిలబడి ఈ సంభాషణను వింటున్న వంతిదేవుడు, "పండు జారి పాలలో పడింది!" అని అనుకొన్నాడు. వీరితో వెళ్తే చిన్న పళువేట్టరయ్యర్ ఉన్న చోటికి పోయి చేరవచ్చు. ఎవరినీ దారి అడగనవసరంలేదు. ఆపైన తన సామర్థ్యం ఉండనే ఉంది! అదృష్టంకూడ ఉంది! ఇలా ఆలోచిస్తూ ఆ కవుల గుంపుతోబాటు వెళ్ళాడు.

~~~
~~~

# అధ్యాయము - 26

## "అపాయం! అపాయం!"

**ఆస్థాన** మంటపంలోకి కవిపండితులకన్న ముందే వంతిదేవుడు ప్రవేశించాడు. అక్కడ ఒక ఎత్తైన సింహాసనంపైన ఆసీనులైవున్నవారే చిన్న పళువేట్టరయ్యరై ఉండాలని వంతిదేవుడు ఊహించాడు. ఆయన చుట్టూ చాల మంది చేతులు కట్టుకొని నిలబడివున్నారు. ఆ రోజు వచ్చిన చాల తాళపత్ర సందేశాలను చేత పట్టుకొని ఒకాయన నిలబడ్డాడు. గణకాచార్యులు లెక్కలు చెప్పేందుకు వేచివున్నారు. కాపలా దండు నాయకులు ఆ రోజుటి ఆజ్ఞలను ఎదురుచూస్తూ నిలబడ్డారు. తక్కిన పనులు చేసేందుకు పనివారు ఎదురుచూస్తూ నిలబడ్డారు. సింహాసనానికి వెనక నిలబడి కొందరు సేవకులు వింజామరలు వీయసాగారు. చేత తమలపాకుల పెట్టెతో ఇంకొకడు సిద్ధంగా నిలబడ్డాడు.

డాబు, దర్పంలో ఎవరికీ తీసిపోని వంతిదేవుడుకూడ కాస్త వినయంగా చిన్న పళువేట్టరయ్యర్‌ని సమీపించాడు.

పెద్దాయన కన్న చిన్నాయన గంభీరంలో ఒకెత్తు పైచేయిగానే కన్పించారు.

మన వీరుని చూసిన వెంటనే విప్పారిన ముఖంతో, "ఎవరు తమ్ముడూ, నీవు? ఎక్కడినుంచి వస్తున్నావు?" అని అడిగారు.

యువ వీరులను చూస్తే మామూలుగా గంటు పెట్టుకొనివుండే ఆయన ముఖం విప్పారుతుంది. దేశమంతటా వున్న యువ వీరులందరినీ తన కాపలా సైన్యంలో చేర్చుకోవడమంటే ఆయనకు చాల ఆసక్తి!

"దళపతీ! నేను కాంచీపురంనుంచి వస్తున్నాను! యువరాజు తాళపత్రం ఇచ్చి పంపారు!" అని వినయంగా బదులిచ్చాడు.

కాంచీపురం అన్నవెంటనే చిన్న పళువేట్టరయ్యరై ముఖం నల్లబారింది.

"ఏమి? ఏమన్నావు?" అని మళ్ళీ అడిగారు.

"కాంచీపురంనుంచి యువరాజిచ్చిన తాళపత్రంతో వచ్చివున్నాను!" అన్నాడు వంతిదేవుడు.

"ఏదీ ఇలా ఇవ్వు!" అని కాస్త నిర్లక్ష్యంగా అడిగినప్పుడుకూడ ఆయన గొంతులో ఆదుర్దా, ఆసక్తి ధ్వనించాయి.

వల్లవరయ్యన్ తాళపత్రాన్ని బయటికి తీస్తూనే, "దళపతీ! ఇది చక్రవర్తికి!" అన్నాడు.

దాన్ని లెక్కచేయక చిన్న పళువేట్టరయ్యర్ తాళపత్రాన్ని తీసుకొని పక్కన నిలబడివున్నవాని

చేత ఇచ్చి చదవమన్నారు. అది వినేసి, "కొత్త సంగతేం లేదు!" అని తమకుతామే చెప్పుకొన్నారు.

"దళపతీ! నేను తెచ్చిన తాళపత్రం...." అన్నాడు వంతిదేవుడు.

"నీకెందుకు? నేనిస్తాను దాన్ని చక్రవర్తికి!"

"లేదు; నన్నే చక్రవర్తిని ప్రత్యక్షంగా కలిసి ఆయన చేతికివ్వమని...."

"ఓహో! నాపైన నమ్మకంలేదా? యువరాజు ఆదిత్యులు నీదగ్గర అలా చెప్పి పంపించారా?" అని అన్నప్పుడు, తంజావూరు కోట దళాధిపతి ముఖాన ఆవాలు నువ్వులూ పేలాయి.

"యువరాజు అలా చెప్పలేదు; మీ అన్నగారే అలా ఆజ్ఞాపించారు!"

"ఏమి! ఏమేమి! పెద్దాయనను నీవెక్కడ చూశావు?!"

"దారిలో కడంబూర్ శంబువరయ్యర్‌గారి ఇంట ఒక రాత్రి విడిదిచేశాను. అక్కడే ఆయన్ను చూశాను. ఈ ఉంగరాన్ని కూడ ఆయనే నాకిచ్చారు..."

"ఆహా! ఇది నీవు ముందే ఎందుకు చెప్పలేదు? కడంబూర్‌లో నీవు ఒకరాత్రి ఉన్నావా? ఇంకా ఎవరెవరు వచ్చారక్కడికి?"

"మళనాడు, నడునాడు, తిరుమునైప్పాడి మొదలైన దేశాలనుంచి చాల మంది ప్రముఖులు వచ్చారు..."

"ఆగాగు! తర్వాత నిదానంగా వింటాను. ముందు నీవే ఈ తాళపత్రాన్ని చక్రవర్తికి ఇచ్చేసి రా! తర్వాత తమిళ కవిపుంగవులు వచ్చేస్తారు. మనం మాట్లాడుకోలేం....ఈ అబ్బాయిని చక్రవర్తి వద్దకు తీసుకుపో!" అని దగ్గరే ఉన్న ఒక వీరుణ్ణి చిన్నపళువేట్టరయ్యర్ ఆదేశించారు.

ఆ వీరునివెంట వంతిదేవుడు చక్రవర్తి ఉన్న అంతఃపురంవైపు సాగాడు.

-:-

మూడు దిక్కులా మూడు సముద్రతీరాలవరకు విస్తరించిన చోళసామ్రాజ్యపు సింహాసనం కొంతకాలంగా జబ్బుమంచంలా మారివుంది. ఆ సింహాసనంలో పరాంతక సుందరచోళ చక్రవర్తి వెనకి ఆనుకొని పడుకొనివున్నారు. రాజ్యాధికారాలన్నిటినీ ఇతరులకు ఒప్పజెప్పేసి, చికిత్స పొందుతున్నా, కొన్ని ముఖ్యమైన విషయాల్లో ముఖ్యమైన వ్యక్తులకు ఆయన దర్శనమిచ్చే తీరవలసివుంది. మంత్రులు, దళపతులు, వేళక్కార వీరులు ఆయనను ప్రతిరోజు దర్శించి వెళ్లడం రాజ్యక్షేమానికి అవశ్యం.

ఎన్నో యుద్ధాల్లో వీరకృత్యాలు చేసి, అసహాయశూరుడని పేరు పొందిన వారు, దేశప్రజలందరిచేత 'సుందర చోళ చక్రవర్తి' అని వేనోళ్ళ పిలువబడ్డవారు, అందంలో మన్మధునికి సాటి అని పేరుపొందిన వారైన చక్రవర్తి కుంగిపోయిన ఆకారాన్ని చూసినవెంటనే వంతిదేవుడు మాటలుడిగి

నిలబడిపోయాడు.. అతని కళ్ళనీరు నిండాయి. దగ్గరికి వెళ్ళి వినయంగా నమస్కరించి భయభక్తులతో తాళపత్రాన్ని అందించాడు.

చక్రవర్తి దాన్ని తీసుకొంటూనే, "ఎక్కడినుంచి వచ్చావు? ఎవరి సందేశం?" అని అడిగారు.

"ప్రభూ! కాంచీపురంనుంచి వస్తున్నాను. యువరాజు ఆదిత్య కరికాలన్ ఇచ్చిన తాళపత్రం!" అని గద్గద స్వరంతో అన్నాడు.

చక్రవర్తి ముఖం వెంటనే ప్రకాశవంతమైంది. ఆయన సమీపంలో తిరుక్కోవలూర్ మలైయమాన్ కుమారియైన చక్రవర్తిని వాణమహాదేవి ఆసీనులైవున్నారు. ఆమెను చూసి, "దేవీ! నీ కుమారుని వద్దనుంచి తాళపత్రం వచ్చింది!" అని చెప్పి దాన్ని చదివారు.

"ఆహా! యువరాజు కంచిలో బంగారు మాళిగ కట్టివున్నారట. నీవూ, నేనూ అక్కడికి వెళ్ళి కొన్నిరోజులు విడిదిచేయాలట!" అని చెప్పినప్పుడే, చక్రవర్తి ముఖం మునుపటికన్న చిన్నబోయింది.

"దేవీ! నీ కొడుకు చేసిన పని చూశావా? నా తాత పరాంతక చక్రవర్తి, అంతఃపురంలో కూడబెట్టబడివున్న బంగారంతో తిల్లై మందిరానికి బంగారపు చూరు చేయించారు. మనకులంలో ఉదయించిన పెద్దలెవ్వరూ అంతఃపురాన్ని బంగారుతో కట్టలేదు. దానికన్న దేవాలయాలు కట్టించడమే ముఖ్యమని ఎంచారు. కానీ, ఆదిత్య కరికాలన్ ఇలా చేశాడే! అయ్యో!! ఈ దైవనిందకు ప్రాయశ్చిత్తమేమి?" అని వాపోయారు.

కుమారుని వద్దనుంచి తాళపత్రం వచ్చిందని ఆనందపడ్డ చక్రవర్తిని ముఖం మునుపటికన్న వాడిపోయింది. ఏమీ ఉత్తరమివ్వలేకపోయింది.

-:-

ఆ సమయంలో వంతిదేవుడు ధైర్యమూ, తెంపరితనమూ తెప్పించుకొని, "ప్రభూ! యువరాజు చేసిన కార్యంలో తప్పేమీ లేదే? ఉచితమైన కార్యాన్నే కద చేశారు? కుమారునికి తల్లి, తండ్రే కద మొదటి దైవాలు? కాబట్టే మీరు, దేవి నివసించేందుకు యువరాజు స్వర్ణభవనం కట్టడం ఉచితమేకద?" అన్నాడు.

సుందర చోళ చక్రవర్తి చిరునవ్వు నవ్వి, "తమ్ముడూ! నీవెవరో తెలియదు. చాల బుద్ధివంతుడివిగా ఉన్నావు. వాక్చాతుర్యంకూడ కలవాడివిగా ఉన్నావు. కానీ, కొడుక్కి తల్లి, తండ్రి దైవసమానులైనా, తక్కిన వారికి కాదు కద? అందరూ పూజించే దైవానికే కద బంగారపు గుడి కట్టడం ఉచితంగా ఉంటుంది?" అన్నారు.

"ప్రభూ! కుమారునికి తండ్రి దైవం; ప్రజలకు రాజే దైవం. రాజులు దైవాంశసంభూతులని వేదాలు, పురాణాలు చెబుతున్నాయి. ఆ విధంగా చూసినాకూడ తమరికి స్వర్ణభవనం కట్టించడం సమంజసమే

కద?'' అన్నాడు మన వీరుడు.

సుందర చోళ చక్రవర్తి మళ్ళీ మలైయమాన్ కుమార్తె వైపు చూసి, ''దేవీ! ఈ అబ్బాయి ఎంతటి బుద్ధిశాలో చూశావా? మన ఆదిత్యునికి ఇలాంటి అబ్బాయిల సహకారముంటే మనం దిగులు పడనవసరమే లేదు. వాని అజాగ్రత స్వభావంగురించి కూడ విచారించనవసరం లేదు!'' అన్నారు.

తర్వాత వంతిదేవుని చూసి, ''తమ్ముడూ! స్వర్ణభవనం కట్టడం ఉచితమైనా కాకపోయినా, నేను కంచికి రావడం సాధ్యంకాదు. నీవే చూస్తున్నావు కద! ఎప్పుడూ పడకలోనే ఉన్నాను. సుదూర ప్రయాణం సులభసాధ్యంకాదు. ఆదిత్యుడే నన్నిక్కడికి చూసేందుకు రావాలి. వాడిని చూసేందుకు మాక్కూడ చాల ఆశగానే ఉంది. రేపు మళ్ళీ రా. ఇందుకు బదులు పత్రం రాసిపెట్టించి ఉంటాను!'' అన్నారు.

ఈ సమయంలో గుంపుగా చాల మంది దర్శన మంటపంవైపు రావడాన్ని వంతిదేవుడు గమనించాడు. ఆహా! ఆ కవిపండితుల గుంపు కాబోలు! వారితోబాటు చిన్న పళువేట్టరయ్యర్ కూడ వస్తుండవచ్చు. తర్వాత తాను చెప్పవలసింది చెప్పలేకనే పోవచ్చు! నాలుగు మాటల్లో క్లుప్తంగా ఇప్పుడే చెప్పేయాలి! - ఇలా యోచించి, ఒక్క క్షణంలో ఒక నిర్ణయానికి వచ్చి, ''చక్రవర్తీ! దయచేసి నా విన్నపాన్ని కరుణతో వినండి! తమరు అవశ్యం ఈ తంజావూరు విడిచి బయల్దేరాలి! ఇక్కడ మిమ్మల్ని అపాయం చుట్టుముడుతోంది! అపాయం! అపాయం!...'' అన్నాడు.

అతనిలా అంటున్నప్పుడే చిన్న పళువేట్టరయ్యర్ దర్శన మంటపంలో ప్రవేశించారు. ఆయన వెంబడి కవులుకూడ వచ్చారు.

వంతిదేవుడు చివరగా అన్న మాటలు కోట దళపతి చెవిన పడ్డాయి. ఆయన ముఖంలో కోపజ్వాలలు లేచాయి!

~~~
~~~

# అధ్యాయము - 27

## ఆస్థాన కవులు

**పరాక్**! బహుపరాక్! ఇదిగో వస్తున్నారు! కవిపండితులు! కవిశిఖామణులు! తమిళభాషాసముద్ర తీరాలను తాకినవారు! అగత్యనార్ ఒరవడిలో వచ్చినవారు! తొల్ కాప్పియం మొదలైన సంగమ వంశంనాటి గ్రంధాలను జీర్ణించుకొన్నవారు ! సిలప్పధికారం వంటి గ్రంధాలను వెనకనుంచి ముందుకు ఒప్పజెప్పగలవారు! దైవతమిళ వేదమైన తిరుక్కురళ్ గ్రంధాన్నికూడ తిరగవేసినవారు! వ్యాకరణానికి గురి చెప్పగలవారు! గురి తెలిస్తే దానికి వ్యాకరణం కట్టగలవారు! తామే స్వయంగా కవితలను పాడగవారు! వారు ఒక్కొక్కరు రాసిన తాళపత్రగ్రంధాలు కోటాను కోటి చెదలు తరతరాలకు తింటూ తమ వంశాన్ని పెంచుకొంటూ పోవచ్చంటే చూసుకోండి! [వ్యంగ్యం]

ఆ కవులు అంతమందీ ఒక్క గుంపుగా సుందర చోళచక్రవర్తి సన్నిధికి వచ్చిచేరారు.

“జయహో! జయహో! ఏడులోకాలను ఒక్క ఛత్రంకింద ఏలే సుందర చోళ చక్రవర్తికి జయహో! పాండ్యుని గర్వమణచిన మహారాజుకు జయహో! కవిపండితులను ఆదరించే మహారాజుకు జయహో! పండిత వత్సలుడైన పరాంతక చక్రవర్తి మనుమడు నూరేళ్ళు జీవించనీ!” అని దీవించారు.

ఈ ఘోషలు, కేకలు ఆయనకంతగా ఇష్టంలేదు. కానీ అది బయటకు చూపించుకోక, తమ అనారోగ్యాన్ని కూడ మరచి, వచ్చినవారిని స్వాగతించేందుకు లేవ ప్రయత్నించారు.

వెంటనే చిన్న పళువేట్టరయ్యర్ ముందుకు వచ్చి, “ప్రభూ! కవిపుంగవులు తమను దర్శించి వందనాలు చెప్పేందుకు వచ్చారేగాని, మిమ్మల్ని శ్రమపెట్టేందుకు కాదు. కాబట్టి మీరు దయచేసి శ్రమ తీసుకోకండి!” అన్నారు.

“ఔను రాజాధిరాజా! తమకు కించిత్తు శ్రమ ఇవ్వడంకూడ మాకిష్టంలేదు!” అన్నారు కవిపండితుల నాయకుడైన నల్లన్ శాత్తనార్.

“మిమ్మల్నందరినీ చాల రోజుల తర్వాత చూస్తుండడం నాకు చాల సంతోషం. అందరూ ఆసీనులు కండి. కొన్ని పాటలను, పద్యాలను పాడి వెళ్ళాలి!” అన్నారు తమిళభాషాప్రియులైన చక్రవర్తి.

నేలపైన పరిచివున్న రత్న కంబళ్ళిపైన అందరూ కూర్చొన్నారు. ఇదేసాకని మనవీరుడు వల్లవరయ్యన్ కూడ వారితో కూర్చొన్నాడు. తాను చెప్పవలసింది చక్రవర్తికి పూర్తిగా చెప్పకుండ తిరిగి వెళ్ళడానికి అతనిష్టపడలేదు. తగిన సందర్భం రావచ్చని ఆ కవులతో కూర్చొన్నాడు.

ఇది చిన్న పళువేట్టరయ్యర్ గమనించారు. ఆయన మీసం చిమచిమలాడింది. మొదట అతన్ని

బయటకు పంపించేద్దాం అనుకొన్నారు. తర్వాత, అతను తన కళ్ళముందు ఉండడమే మేలని తీర్మానించుకొన్నారు. కాబట్టే అతన్ని చూసి చూడనట్లు ఉన్నారు. ఈ కవిపుంగవులు వెళ్ళిన తర్వాత ఆతన్ని బయటకు తీసుకువెళ్ళి అతగాడు చక్రవర్తికి ఏం చెప్పాడన్నది స్పష్టంగా అడిగి తెలుసుకోవాలని నిశ్చయించుకొన్నారు. “అపాయం! అపాయం!” అని అతను చక్రవర్తిని హెచ్చరించడం ఆయన చెవుల్లో ఇంకా మారుమోగుతోంది.

-:-

“కవిపుంగవులారా! తమిళ పాటలు, పద్యాలు విని చాల కాలమైంది. నా చెవులు ఆ పాటలను వినేందుకు పేచివున్నాయి. మీలో ఎవరైనా కొత్త పాటలు రాసి తీసుకొనివచ్చారా?” అని చక్రవర్తి అడిగారు.

వెంటనే ఒక కవి లేచి నిలబడి, “ప్రభూ! ఉలగపురంలో మీ దివ్యనామం పేర విలసించిన సుందరచోళ మహావిద్యాపీఠంనుంచి వస్తున్నాను. శివభక్తులైన మీరు బౌద్ధమఠాలకు కూడ దానాలు చేసి సహాయంచేయడం గురించి ఈ చోళ సామ్రాజ్యమంతటా వేనోళ్ళ పొగడుతున్నారు. మీరు జబ్బుపడ్డ విషయం విన ఆ బౌద్ధభిక్షువులందరూ చాల విచారపడ్డారు. వారందరూ మీరు త్వరలో కోలుకోవాలని ప్రార్థిస్తున్నారు. ఆ ప్రార్థనాగీతాన్ని తమరు దయవుంచి అనుమతిస్తే ఇప్పుడు పాడుతాను!” అన్నారు.

“అలాగే చేయండి. వినేందుకు పేచివున్నాను" అన్నారు చక్రవర్తి.

ఆ కవీశ్వరుడు కింది పద్యాన్ని రాగబద్ధంగా పాడారు.

<< పద్యాన్ని అనువదించవలసివుంది >>

పాటను విన్నవెంటనే కవులందరూ, “భేష్! భేష్!” అని చెప్పి మెచ్చుకొన్నారు.

“బౌద్ధులు ఇంత కృతజ్ఞులై ఉండడం ఆశ్చర్యం! ఆశ్చర్యం!” అన్నారొక వీరశైవ కవిశిఖామణి.

“ఔను. అది చాల ఆశ్చర్యమైన విషమమే. నేను ఉలగపురం బౌద్ధమఠానికి చేసిన సేవ చాల చిన్నది. దాన్ని ఇంతపెద్దగా చెప్పుకోవాలా?” అన్నారు రాజుగారు.

“చక్రవర్తి ఉదారగుణానికి పాత్రులైనవారు  దాన్ని వేనోళ్ళ పొగడక ఉండగలరా? ఇంద్రుడు, చంద్రుడు, మహాశివుడుకూడ మీ దానగుణంవల్ల మేలుపొందివున్నారు!” అన్నారింకొక కవి.

చక్రవర్తి చిరునవ్వుతో, “అదేమి?  ఇంద్రుడు, చంద్రుడు, మహాశివుడుకూడానా? వారు నాకెందుకు కృతజ్ఞత చెప్పుకోవాలట?” అని అడిగారు.

“ఒక పాట చెప్పేందుకు అనుమతి ఇవ్వాలి!” అన్నారా కవి.

“అలాగే జరగనీ!” అన్నారు చక్రవర్తి.

ఆ కవి చేత తీసుకువచ్చిన ఒక తాళపత్ర గ్రంథాన్ని విప్పి, ఇలా చదివారు:

<< పద్యం >>

కవి ఆ పద్యాన్ని పాడి ముగించిన వెంటనే సభలోని తక్కిన కవులందరూ తలలూపుతూ, "ఆహా!", "ఓహో!" అని మెచ్చుకొన్నారు.

సుందరచోళ చక్రవర్తి విప్పారిన ముఖంతో, "ఈ పద్యం అర్థం ఏమని ఎవరైనా విడమర్చి చెప్పగలరా?" అన్నారు.

ఒక్కసారిగా చాల మంది కవులు లేచి నిలబడ్డారు. తర్వాత నల్లన్ శాత్తనార్ తప్ప మిగిలినవారందరు కూర్చొన్నారు. ఆయన ఆ పద్యానికర్థం ఇలా చెప్పారు:

"ఒకసారి దేవేంద్రునికి, వృత్త్రాసురునికి యుద్ధం జరిగింది. అందులో ఇంద్రుని ఐరావతం చనిపోయింది. అందుకు దీటైన ఏనుగు ఎక్కడ దొరుకుతుందో అని ఇంద్రుడు వెతకసాగాడు. చివరికి పళైయార్రై నగరానికి వచ్చి, సుందరచోళ చక్రవర్తిని, 'ఐరావతానికి సాటియైన ఏనుగు కావాలి' అని యాచించాడు. 'ఐరావతానికి సమానమైన ఏనుగు నావద్ద లేదు. దానికన్న మేలైన ఏనుగులే నా వద్ద ఉన్నాయి!" అని చెప్పి, ఇంద్రుని తమ గజశాలకు తీసుకువెళ్ళారు. అక్కడ నల్లని గుండ్రాళ్ళలాగ నిలబడ్డ వేలకొద్ది ఏనుగులను చూసి, "వీటిలో దేన్ని అడగడం??" అని విస్తుపోయి నిలబడ్డాడు ఇంద్రుడు. అది గమనించి సుందర చోళ చక్రవర్తి తామే ఒక ఏనుగును ఎంచి ఇచ్చారు. 'ఆ ఏనుగును ఎలా అదుపులో పెట్టాలి? తన వజ్రాయుధంకూడ సరిపోదే' అని భీతిల్లిన ఇంద్రుని గమనించి, ఆ వజ్రాయుధంకన్న బలమైన ఒక అంకుశాన్ని కూడ ఇచ్చారు.

"తర్వాత ఇంకొకసారి, ప్రపంచానికంతా వెలుగునిచ్చే సూర్యుభగవానుడుకి, రాహువు అనే ఒక రాక్షసునికి మధ్య ఒక పెద్దపోరు జరిగింది. రాహువు దినకరుని మింగజూశాడు. సాధ్యంకాలేదు! దినకరుని తేజస్సు రాహువునలా దహించేసింది! కాని సూర్యుని రథానికి పూన్చిన ఏడు గుర్రాలూ రాహువు కాలకూట విషానికి బలైపోయాయి. తాను తన ప్రయాణాన్ని ఎలా సాగించాలని దిక్కుతోచక సూర్యుడు నిలబడివుండగా, సుందర చోళ చక్రవర్తి ఏడు కొత్త గుర్రాలతో సూర్యభగవానుని సమీపించి, "భగవాన్! ఈ ఏడు కొత్త గుర్రాలను తమ రథానికి పూన్చి లోకానికి వెలుగునివ్వండి!" అని వేడుకొన్నారు. తన వంశంలో పుట్టిన ఒక చోళరాజు సమయానికి చేసిన సహాయాన్ని సూర్యభగవానుడు మెచ్చుకొన్నాడు.

"తర్వాత. శివపార్వతుల వివాహం కైలాసగిరిపైన జరిగింది. పెళ్ళికూతురింటివారు చీరెసారెలతో వచ్చివున్నారు. కానీ పల్లకి తీసుకువచ్చేందుకు మరిచిపోయారు. ఊరేగింపుకు ఎడ్లబండి తప్ప ఇంకే వాహనమూ లేదే అని విచారిస్తున్నప్పుడు, అది తెలుసుకొన్న సుందర చోళ చక్రవర్తి వెంటనే పళైయార్రై అంతఃపురంనుంచి తమ ముత్యాల పల్లకిని తెమ్మన్నారు. భయభక్తులతో శివుడు ఆ ముత్యాల పల్లకిని తమ పెళ్ళికానుకగా ఇచ్చాడు. అటువంటి సుందరచోళ చక్రవర్తికి ఈ ఏడేడు లోకాలలో సాటి

ఎవరున్నారు?....''

ఇదంతా విన్న చక్రవర్తి గలగలా నవ్వారు. అనారోగ్యపు బాధవల్ల చాలా రోజులుగా నవ్వడమెరుగని చక్రవర్తి నవ్వు ఆయనసెన్నడూ వీడని పత్నియైన మలైయమాన్ పుత్రి వాణమహాదేవికి, దాదులకు అంతఃపురవైద్యులకు కూడ ఉత్సాహాన్నిచ్చింది.

-:-

ఇంతసేపూ నిలబడేవున్న కోట దళపతి చిన్న పళువేట్టరయ్యర్ ఇప్పుడు చటుక్కున చక్రవర్తి ముందుకు వెళ్ళి ఆయనకు చేతులెత్తి నమస్కరించి, ''ప్రభూ! నేను పెద్ద తప్పు చేశాను. దయచేసి మన్నించాలి!'' అన్నారు.

''ఆఁ! దళపతా మాట్లాడుతున్నది? మీరేం తప్పు చేశారు? ఎందుకు మన్నించాలి? ఒకవేళ నేను ఇంద్రునికిచ్చిన శ్వేతగజాన్ని, సూర్యునికిచ్చిన అశ్వాలను తిరిగి తీసుకువచ్చేశారా ఏం? శివుని వద్దనుంచి ముత్యాలపల్లకి తీసుకువచ్చేశారా? చేయగలవారే మీరు!'' అని చక్రవర్తి చెప్పేసి మళ్ళీ నవ్వగా, ఆయనతో కలిసి కవిపండితులుకూడ నవ్వారు. అందరికన్నా పెద్దగా వంతిదేవుడు నవ్వాడు. అది గమనించి చిన్న పళువేట్టరయ్యర్ అతనివైపు ఒక్కసారి కఠినమైన చూపు చూశారు. వెంటనే చక్రవర్తివైపు తిరిగి ఇలా అన్నారు:

''రాజాధిరాజా! నేను చేసిన తప్పు ఇదే. ఇంతకాలం నేనిటువంటి కవిశిఖామణులను మీవద్దకు రాకుండా అడ్డగించాను. అంతఃపురవైద్యులు చెప్పినట్లు చేస్తూ వచ్చాను. కానీ అది పొరబాటని ఇప్పుడు గ్రహించాను. ఈ కవిపుంగవుల రాకవల్ల మీ ముఖం విప్పారింది. వీరి మాటలు విని మీరు నోరార నవ్వారు. ఆ కుతూహలంకూడిన నవ్వు విని పట్టపురాణి ముఖమూ, దాదుల ముఖాలు విప్పారాయి. నేనూ సంతోషించాను. ఇంతటి కుతూహలాన్ని మీకివ్వగలిగిన కవిపండితులను మీ సన్నిధికి రాకుండ అడ్డగించడం తప్పేకద?...'' అన్నారు.

''బాగా చెప్పారు, దళపతీ! ఇప్పుడైనా మీరిది గ్రహించారు కద? 'వైద్యుల మాట వినకండి; కవుల రాకను అడ్డగించకండి' అని నేను మీకు తరచూ  చెప్పిన మాటకు కారణం ఇప్పుడర్థమైంది కద?'' అన్నారు చక్రవర్తి.

అంతఃపుర వైద్యులు లేచి నిలబడి నోరు తెరిచి ఏదో చెప్పబోయారు. అది చక్రవర్తి లెక్కచేయక, కవులవైపు తిరిగి, ''ఈ ఇంపైన పాటను పాడిన కవి ఎవరని మీలో ఎవరికైన తెలుసా? తెలిస్తే చెప్పాలి!'' అన్నారు.

నల్లన్ శాత్తనార్, ''రాజాధిరాజా! అదే తెలియలేదు! మేముకూడ అది కనిపెట్టి తెలుసుకోవాలని ప్రయత్నిస్తున్నాము.  తెలుసుకొని, ఆ మహాకవికి 'కవి చక్రవర్తి' అన్న బిరుదునిచ్చి ఆయనను పల్లకిలో

మోసుకొని వెళ్ళేందుకు సిద్ధంగా ఉన్నాము. ఇంతవరకు మా ప్రయత్నం ఫలించలేదు" అన్నారు.

"అందులో ఆశ్చర్యమేం లేదు. నాలుగు పంక్తులున్న ఈ పద్యంలో అన్ని మహా అబద్ధాలను ఇమడ్చగల మహాకవి తన పేరును బట్టబయలు చేసుకొని ముందుకు వచ్చేందుకిష్టపడరు కద?" అని మహారాజు అన్నవెంటనే, ఆ కవిపుంగవుల ముఖాలను చూడాల్సింది! కత్తివేటుకు నెత్తురు చుక్క లేనట్లు పాలిపోయాయి! ఏం బదులు చెప్పాలని వారికి దిక్కు తోచలేదు.

-:-

ఈ సమయంలో మన వంతిదేవుడు ధైర్యంగా లేచి నిలబడి, "ప్రభూ! అలా ఒక్క మాటతో అదంతా అబద్ధమని తోసిపుచ్చకండి! లేని విషయాన్ని పామరులు చెప్తే అది అబద్ధం; రాజ్యాంగ నిర్వాకంలో ఉన్నవారు అలా చెబితే అది రాజతంత్ర చాణక్యం; కవులు అలా చెప్తే అది కల్పన, ఉత్ప్రేక్ష..." అన్నాడు.

కవులందరూ అతనివైపు తిరిగిచూసి, "భేష్! భేష్!" అని మెచ్చుకొన్నారు.

చక్రవర్తికూడ అతన్ని గుచ్చి చూసి, "ఓ! నీవు కంచినుంచి తాళపత్రం తెచ్చిన వాడివి కద? బుద్ధిమంతుడివైన అబ్బాయి! నన్ను చాలా తెలివిగా దెబ్బతీశావు!" అన్నారు. తర్వాత సభవైపు తిరిగిచూసి, "కవీశ్వరులారా! పాట చాల ఇంపుగా ఉన్నా, ఆ కవితను రాసిన కవిపుంగవుని కనిపెట్టవలసిన అవసరమూ, కవి చక్రవర్తి అన్న బిరుదును కట్టబెట్టాల్సిన అవసరమూ లేదు. ఈ కవితను పాడిన కవి నాకు తెలుసు. ఇప్పటికే ఆయన తలపైన మోయలేని చోళసామ్రాజ్యపు మణిమకుటం కూర్చొనివుంది. 'భూచక్రవర్తి', 'త్రిభువన చక్రవర్తి', 'ఏడు లోకాల చక్రవర్తి' అనే బిరుదులను కూడ ఆ కవిరాజు మోయలేక మోస్తున్నారు!" అన్నారు సుందరచోళ చక్రవర్తి.

ఇది విన్న కవులందరూ ఆశ్చర్యసముద్రంలో మునిగి తబ్బిబ్బైపోయారు అని చెబితే, పాఠకులు అది అబద్ధమని తోసిపుచ్చకూడదు! రచయిత కల్పనాశక్తి అని ఒప్పుకోవాలి!

~~~
~~~

# అధ్యాయము - 28

## ఉక్కు పట్టు

**ఉన్నట్లుండి** పొంగిన కొత్త వరదనీరులాగ వారిని ముంచెత్తిన ఆశ్చర్యం కాస్త తగ్గిన తర్వాత, ఆ కవిపుంగవుల నాయకుడైన నల్లన్ శాత్తనార్, "ప్రభూ! అంటే, ఈ పద్యాన్ని రచించిన కవి...." అని జంకుతూ అడిగారు.

"మీ ముందు, కాళ్ళలో సత్వముడిగి, లేవలేక పడుకొనివున్న ఈ భువి చక్రవర్తే!" అన్నారు సుందర చోళ చక్రవర్తి.

కవుల కూటమిలో పలురకాలైన ఆశ్చర్యధ్వనులు, హాహాకారాలు లేచాయి. కొందరు తమ మనోస్థితిని ఎలా వెలిబుచ్చాలో తెలియక తలలాడిస్తూ కూర్చొన్నారు. ఇంకొంతమంది తమ మనోస్థితి తమకే అర్థంకాక స్థబ్దులై కూర్చొన్నారు.

అప్పుడు చక్రవర్తి ఇలా అన్నారు: - "కవిపుంగవులారా! ఒకసారి నేను పళైయారైలో ఉన్నప్పుడు కొందరు కవులు, పండితులు నన్ను చూడవచ్చారు. ఆ కూటమిలో మీలో కొంతమందికూడ ఉండిఉండవచ్చు. ఒక్కొక్కరు చోళవంశపు కీర్తిప్రతిష్టల గురించి ఒక్కొక్క పాట/పద్యం చెప్పారు. నాగురించికూడ పాడారు. నేను 'వారికిదిచ్చాను', 'వీరికికదిచ్చాను' అని ఎంతెంతో పొగిడారు. అప్పుడు రాకుమారి కుందవైకూడ నా చెంతవుంది. కవిపండితులు కానుకలు, బహుమతులు తీసుకొని వెళ్ళిన తర్వాత, రాకుమారి వారు పాడిన పద్యాలను పొగిడి మెచ్చుకొంది. అప్పుడు నేను కుందవైతో, 'ఆ కవులందరికన్న నేను బాగా పద్యం చెప్పగలను' అని శపథం చేశాను. తర్వాత, తమాషాగా ఈ పద్యాన్ని పాడాను. 'నాకు బహుమానమివ్వు!' అని అడిగాను. బిడ్డ నా వీపుపైన ఎక్కి కూర్చొని, 'ఇదిగో మీ బహుమానం!' అని రెండు చెంపదెబ్బలిచ్చింది.అది నిన్న జరిగినట్లు నాకు జ్ఞాపకముంది. కాని అది జరిగి ఎనిమిదేళ్ళకు పైబడింది!..." అన్నారు.

"వింత! వింత!", "అద్భుతం! అపూర్వం!" అని ఘోషించి సంతసించారా కవిపుంగవులు.

కుందవై అన్న పేరు విన్నవెంటనే వంతిదేవుని ఒడలు పులకరించింది. చోళవంశంలో పుట్టిన ఆ వనితామణి విద్య, బుద్ధి, జ్ఞానం, సౌందర్యం గురించి అతనెంతో వినివున్నాడు. అటువంటి అపూర్వమైన రాకుమారిని కన్న తండ్రి ఈ చక్రవర్తి, ఆమెను కన్న తల్లి పట్టపురాణి అదిగో ఆయన పక్క ఆసీనులై ఉన్నారు. తమ ముద్దుల కూతురిని గురించి మాట్లాడేటప్పుడు ఎంతటి అభిమానంతో మాట్లాడుతున్నారు?

వంతిదేవుని కుడిచేయి అతని నడుము చుట్టూ ఉన్న పట్టువస్త్రాన్ని తడిమింది. ఎందుకంటే

కుందవైదేవికి అతను తీసుకువచ్చిన సందేశం ఆ బట్టలో చుట్టబడివుంది. తడిమిచూసిన చేయి ఆశ్చర్యంతో చేష్టలుడిగి నిలిచిపోయింది. అతని మనస్సు దిగ్భ్రమించింది. "అయ్యో! ఇదేమి? తాళపత్రం కనిపించడం లేదే? ఎక్కడైనా పడిపోయిందా? చక్రవర్తికి తాళపత్రం ఇచ్చేందుకు తీసినప్పుడు అదేమైనా కింద పడిపోయిందా? ఎక్కడ పడివుండవచ్చు? ఒకవేళ ఆస్థాన మంటపంలో పడివుండవచ్చా? అలాగైతే చిన్న పళువేట్టరయ్యర్ చేతికి తప్పకుండ చిక్కివుంటుందికద? అందునించి ఏదైనా అపాయం మూడవచ్చా? అరెరే! ఎంతటి చిక్కు! ఎంత పెద్ద పొరబాటు! ఇందునించి ఎలా బయటపడ్డం?....'

కుందవైదేవికి తీసుకువచ్చిన తాళపత్రం జారిపోయిందని తెలిసిన తర్వాత వంతిదేవుడు అక్కడ ఉండలేకపోయాడు. పై సంభాషణలు కూడ అతను సరిగ్గా వినపించుకోలేదు.; విన్నా మనస్సులో పదిలంకాలేదు.

-:-

సుందర చోళ చక్రవర్తి ఆశ్చర్యసముద్రంలో ఇంకా మునిగివున్న కవిపండితులను చూసి ఇంకా ఇలా అన్నారు:-

"నేను సరదాగా కట్టిన పద్యాన్ని కుందపై ఎవరిదగ్గరైనా చెప్పివుండాలి. ఒకవేళ పళైయారై తిరుమేట్రళి ఆలయపు ఈశాన్య భట్టాచారులకు చెప్పివుండవచ్చు. ఆయన ఆ పద్యాన్ని దేశమంతటా పాకేటట్లుజేసి, లోకమంతా నన్ను పరిహాసం చేసేందుకు అవకాశం కల్పించారు!"

"ప్రభూ! మీరు పాడిందయితేనేమి? పాట అద్భుతంగా వుంది! సందేహమేలేదు. తమరు 'భువి చక్రవర్తి' కావడమేగాక, 'కవి చక్రవర్తి' కూడ కాగలరు!" అన్నారు నల్లన్ శాత్తనార్.

"ఐనా, ఇప్పుడు అదే పద్యాన్ని నేను పాడివుంటే ఇంకొక ఉత్ప్రేక్షకూడ చేర్చివుండేవాడిని. ఇంద్రునికి ఏనుగు, సూర్యునికి గుర్రాలు, శివునికి పల్లకి ఇవ్వడంతో ఆగేవాడినిగాను. మార్కండేయునికోసం శివపరమాత్మ అమృతభాండాన్ని తన్నేశారుకద? ఆ తన్ను యముడేమో తప్పించుకొన్నాడు గాని అతని ఎనుబోతు తట్టుకోలేక చచ్చిపడింది కద? అప్పుడు వాహనంలేక యముడు అవస్థపడుతున్నప్పుడు ఆ విషయం తెలుసుకొని సుందర చోళ చక్రవర్తి పళైయారైనుంచి ఒక మంచి ఎనుబోతును పంపించారు!... ఇలాకూడ ఒక కల్పనను ఆ పద్యానికి చేర్చివుండేవాడిని. ఇప్పుడు యమధర్మరాజు ఆ ఎనుబోతునెక్కి నన్ను వెతుక్కొంటూ వస్తున్నాడు. మన తంజావూరు కోట దళపతి చిన్న పళువేట్టరయ్యర్ కూడ ఆ యమధర్మరాజును, అతని వాహనాన్ని ఆపలేరు కద?"

అక్కడే కూర్చొని అది వింటున్న పట్టపురాణి కన్నీళ్ళు పెట్టుకొంది. కొందరు కవిపండితులు కూడ సన్నగా ఏడవడం వినిపించింది.

చిన్న పళువేట్టరయ్యర్ ఒక్కరు మాత్రమే దిటవైన మనసుతో వున్నారు.

“ప్రభూ! తమసేవలో యముడితో పోరాడేందుకుకూడ నేను సిద్ధమే!” అన్నారు.

“అందులో విజయం అసాధ్యం దళపతి! యముడితో పోరాడి గెలవగలిగే శక్తి మనుష్యులకెవ్వరికీ లేదు. యముడిని చూసి భయపడకుండా ఉండేందుకే మనమందరం భగవంతుని ప్రార్థించాలి. కవులారా! 'యముడికి భయపడం!' అని ఒక తమిళకవి పాడారు కద?” అన్నారు చక్రవర్తి.

ఒక కవి లేచినిలబడి ఆ కవితను శ్రావ్యంగా పాడారు:

<< ఆ పద్యఖండాన్ని అనువదించవలసివుంది >>

చక్రవర్తి ఈ చోట కవికి అడ్డుపడి, “ఆహ్! భవవంతుని ప్రత్యక్షంగా చూసినవారు తప్ప ఇంకెవరు ఇంత ధైర్యంగా పాడగలరు? అప్పర్‌స్వామివారికి చాల బాధాకరమైన మూలవ్యాధి ఉండేది. దేవుని దయవల్ల నయమైంది. అందుకనే అలా పాడగలిగారు. కవులారా! ఇకమీదట నాగురించి, నేను చేసిన ఘనకార్యాలగురించి పాడడం మానేసి, ఇటువంటి దైవవాక్కులను పాడండి! అప్పర్, సంబందర్, సుందరమూర్తి వంటి మహానుభావులు ఇటువంటి పద్యాలు వేలకొద్దీ రచించివున్నారు. వాటన్నిటిని సంకలనం చేస్తే ఎంత బాగుంటుంది! పాడి, విని పరవశమొందేందుకు ఒక జీవితకాలం చాలదు కద?” అన్నారు.

“రాజాధిరాజా! తమరనుమతిస్తే ఆ దైవకార్యాన్ని ఇప్పుడే ప్రారంభిస్తాము!”

“లేదు; నా జీవితకాలంలో జరగగల దైవకార్యం కాదది. నా తర్వాత...” అని చెప్పి నిలిపేసి దీర్ఘాలోచనలో మునిగిపోయారు చక్రవర్తి.

అంతఃపురంవైద్యులు చిన్న పళువేట్టరయ్యర్ దగరకు వచ్చి ఆయన చెవిలో ఏదో చెప్పారు.

అది గమనించిన చక్రవర్తి ఒక్కసారిగా దిగ్భ్రమించి సభను తేరిపారజూశారు. అప్పుడాయన యమలోకద్వారం వరకు వెళ్ళి తిరివచ్చినవాడిలాగ అగుపించారు.

“ప్రభూ! సంగమ వంశంనాటి పాట ఒకటి వినాలని మీరు కోరారు కద! అది ఒక్కటి మాత్రం పాడేసి వీరు వెళ్ళవచ్చుకద?” అని అడిగారు చిన్న పళువేట్టరయ్యర్.

“అవునవును; మరిచేపోయాను. నా శరీరం మాత్రమేకాదు; నా మనసు కూడ స్వాధీనం తప్పుతోంది. ఏదీ! ఆ పాటను పాడనీ!” అన్నారు చక్రవర్తి.

-:-

చిన్న పళువేట్టరయ్యర్ నల్లన్ శాత్తనార్‌వైపు చూసి సైగ చేశారు. ఆయన వెంటనే లేచి నిలబడి ఇలా అన్నారు :-

“ప్రభూ! మీ పూర్వీకులలో చాల ప్రబలమైనవారు కరికాల్ పెరువళత్తార్. హిమాలయాలపై పులిజెండాను నాటిన మహావీరుడు. ఆయన పరిపాలనా కాలంలో పూంపుహార్ (కావేరిపట్నం) చోళ సామ్రాజ్యపు రాజధానిగా ఉండేది. దేశవిదేశాల నుంచి రకరకాల సరుకులు ఓడల్లో వచ్చి దిగేవి. సంగమ కాలపు ఒక కవి పూంపుహార్ సిరిసంపదలతో ఎలా తులతూగేదో, ఏఏ వస్తువులు ఎక్కడెక్కడినుంచి వచ్చిచేరేవో ఒక పద్యంలో విశదంగా తెలియజేస్తూ ఆ నగరవైభవాన్ని ఇలా పొగిడారు:

<< ఆ పద్యఖండాన్ని అనువదించవలసివుంది >>

పాటలో ఈ పాదానికి వచ్చినప్పుడు (లంకకు సంబంధించిన పాదం) చక్రవర్తి చేత్తో సంజ్ఞ చేశారు. కవి పాటను ఆపారు.

“దళపతీ! కరికాల్ వళవర్ కాలంలో లంకనుంచి తమిళనాడుకు ఆహారపదార్థాలు వచ్చేవని ఈ పద్యం చెబుతోంది. అది నేను తెలుసుకోవాలనే కద ఈ కవిపండితులను ఇక్కడికి రప్పించారు?”

“ఔను, మహారాజా!” అని కోట దళపతి అన్నది కాస్త హీనస్వరంలో వినిపించింది.

“తెలుసుకొన్నాను. ఇక ఈ కవిపండితులకు బహుమతులిచ్చి పంపించేయవచ్చు!” అన్నారు చక్రవర్తి.

“కవిపుంగవులారా! మీరిక సెలవుతీసుకోవచ్చు!” అన్నారు కోట దళపతి.

వారందరు రాజును దీవించి బయలుదేరారు.

కుందవైదేవికి తీసుకువచ్చిన తాళపత్రం కనబడక మనసు కలతబారివున్న వల్లవరయ్యన్, ఆ కవులతోనే జారుకుందామని ఉద్దేశించి లేచినిలబడి ఆ గుంపు మధ్యలో దూరాడు.

కానీ, అతని ఉద్దేశ్యం నెరవేరలేదు. వాకిలి దగ్గరకు చేరుతుండగా, ఉన్నట్లుండి ఒక ఉక్కువంటి చేయి అతని చేతి మణికట్టును గట్టిగా పట్టుకొంది. వంతిదేవుడు మంచి బలశాలే! కానీ, ఆ వజ్రముష్టినుంచి తన చేతిని విడిపించుకోలేకపోయాడు!

అలా పట్టిన ఉక్కుచేయి చిన్న పళువేట్టరయ్యర్‌గారిదే అని తలెత్తి చూడగా తెలిసింది!

కవిపండితులు దర్శన మంటపంనుంచి బయటకు సాగారు.

~~~
~~~

# అధ్యాయము - 29

## "మన అతిథి"

**కవిపండితులు** వెళ్ళిన తర్వాత అంతఃపుర వైద్యులు చక్రవర్తికి ఔషధి తీసుకువచ్చారు. మలైయమాన్ కుమార్తెయైన పట్టపురాణి అది తీసుకొని స్వయంగా తనచేతులతో తన భర్తకిచ్చింది.

అంతవరకు ఓపికగా ఉన్న చిన్న పళువేట్టరయ్యర్ వంతిదేవుని పట్టిన పట్టు విడవకుండ లాక్కొనివెళ్ళి చక్రవర్తి ముందు నిలబెట్టారు.

"ప్రభూ! కొత్త మందువల్ల ఏదైనా ఫలితం కనిపించిందా?" అని అడిగారు.

"ఫలితం కనిపిస్తున్నట్లు వైద్యులు చెప్తున్నారు; దేవికూడ చెప్తున్నారు. కానీ నాకేమో నమ్మకం కలగడంలేదు. దళపతీ! నిజం చెప్పాలంటే ఇదంతా వృథా ప్రయత్నమనే అనిపిస్తోంది. నా విధి నన్ను పిలుస్తోంది. యముడు నన్ను వెతుక్కొంటూ పళైయారై వెళ్ళివున్నాడనే అనుకొంటున్నాను. అక్కడ నేను లేనని తెలిసిన వెంటనే ఇక్కడికి వచ్చేస్తాడు!..."

"ప్రభూ! మీరిలా మనసువిరిగి మాట్లాడకూడదు. మాకందరికీ ఇలా మనసు కలతబారేటట్లు మాట్లాడకండి. మీ కుల పూర్వీకులు...."

"ఆఁ! నా పూర్వీకులు యముడిని చూసి బెదరలేదని చెప్తున్నారు! నాక్కూడా నా పూర్వీకులు చాలమందిలాగ యుద్ధరంగంలో పోరాడుతూ వీరస్వర్గమొందే అదృష్టం కలిగేటట్లైతే, అటువంటి వీరమరణానికి కించిత్తుకూడ భయపడను. ఉత్సాహంతో స్వాగతించేందుకు సిద్ధం. నా పెదనాన్న రాజాదిత్యులు తక్కోలంలో జరిగిన మహాయుద్ధంలో ఏనుగుపైనుండి యుద్ధం చేస్తూనే మరణించారు. చోళవంశపు కీర్తి ఆ యుద్ధంలో ఎప్పటికీ విరాజిల్లేలాగ నెలకొల్పారు. 'ఏనుగుపైన మరణించిన దేవరు' అన్న కీర్తిగడించారు. నేనేం కీర్తి గడిస్తాను? నా ఇంకొక పెదనాన్న, గండరాదిత్య దేవులు, శివభక్తిలో నిమగ్నమై మరణభయాన్నే జయించారు. తీర్థయాత్రలకు పశ్చిమ సముద్రతీరపు దేశాలకు వెళ్ళారు. అక్కడే పరమపదించారు. అలా ఆయనకూడ కీర్తిగడించారు. ఆయనవంటి శివభక్తులు లేరు నిజమే; తీర్థయాత్రలకు వెళ్ళేందుకు కూడ పనికిరానివాడనైపోయాను. ఇలాగే ఇంకెన్నిరోజులు పడివుంటాను? నావాళ్ళందరికీ భారంగా?... కానీ నా మనసు చెబుతోంది - నేనీ భూలోకంలో చాల కాలం ఉండనని..."

"చక్రవర్తీ! అంతఃపురవైద్యులు మీకే అపాయమూ లేదంటున్నారు. జ్యోతిష్కులుకూడ అపాయమేమీ లేదనే చెబుతున్నారు. కానీ ఈ చిన్న అబ్బాయి మీదగ్గర మీకేమో అపాయముందని చెప్పాడు...."

"ఓ! ఈ అబ్బాయి కంచినుంచి వచ్చినబ్బాయే కద? అవును, ఏదో అపాయమని చెప్పాడు. దేన్ని గురించి చెప్పావు తమ్ముడూ? నా పరిస్థితి గురించా?"

వంతిదేవుని మెదడు మెరుపువేగంతో పనిచేసింది. 'అపాయం' గురించి తాను హెచ్చరించినట్లు ఒప్పుకొంటే తనకే ప్రమాదం నిశ్చయం. ఆ ఇక్కట్టునుంచి తప్పుకోవాలి; సరే; ఒక ఉపాయం పన్నిచూద్దాం. భాషను తోడుగా తీసుకొని తిమ్మిని బమ్మిని చేద్దాం!

"చక్రవర్తీ! అపాయాన్ని గురించి చెప్పేందుకు నేనెవరిని? మన వీర దళపతి చిన్న పళువేట్టరయ్యర్, అంతఃపురవైద్యులు, సావిత్రి అమ్మవారివంటి మహారాణిగారూ ఉన్నప్పుడు ఏం అపాయం ముంచుకొస్తుంది? 'అభయం', 'అభయం' అని మిమ్మల్ని అభయం వేడుకొన్నాను. పాత వాణర్ కులానికి నేనొక అజ్ఞాత వారసుడినే. మీ మనస్సును అలరించేటట్లు ఉడతాభక్తిగా చోళసామ్రాజ్యానికి సేవ చేస్తున్నాను. మా పూర్వీకుల రాజ్యంలో ఒక చిన్న భాగాన్నైనా ఈ సేవకుడికి దానంచేసి కరుణించాలి. రాజాధిరాజా! అభయం! అభయం! ఈ ఊరూపేరూ లేని అనాధ మీ అభయం కోరుతున్నాడు!" అని వల్లవరయ్యన్ ఊపిరి తిరగకుండ మాట్లాడేసి నిలిపాడు.

ఇది విన్న చిన్న పళువేట్టరయ్యర్ ముఖం చిన్నబోయింది. చక్రవర్తి ముఖం ఇంకా విప్పారింది. మహారాణి ముఖం కరుణామయమై అగుపించింది.

"ఈ అబ్బాయి పుట్టుకతోనే సరస్వతీదేవి ముద్దుబిడ్డడు కాబోలు! ఇతని వాక్చాతుర్యం అద్భుతంగా ఉంది!" అన్నది దేవి.

ఇదే మంచిసమయమని వంతిదేవుడు, "తల్లీ! మీరు నన్ను వెనకేసుకొని ఒక మాట చెప్పాలి. నేను తలిదండ్రులులేని అనాధను. ఆదరించేవారింకెవ్వరూ లేనివాడిని. నా వేడుకోలు నేనే చెప్పుకోవాలి. పార్వతీదేవి శివుని వద్ద, లక్ష్మీదేవి మహావిష్ణువు వద్ద భక్తుని వెనకేసుకొచ్చినట్లు మీరు నాకోసం మాట్లాడాలి. నా పూర్వీకుల రాజ్యంలో ఓ పది గ్రామాలను తిరిగి ఇచ్చినా చాలు. నేను చాల తృప్తి పడతాను!" అన్నాడు.

ఇదంతా వింటూంటే సుందర చోళ చక్రవర్తికి ఆశ్చర్యమూ, సంతోషమూ కలగసాగింది. ఆయన చిన్న పళువేట్టరయ్యర్ వైపు చూసి, "దళపతీ! ఈ అబ్బాయి నాకు చాల నచ్చాడు. దేవి ముఖంచూస్తే ఈ అబ్బాయిని మూడవ కొడుకుగా దత్తత తీసేసుకొందామా అని ఆలోచిస్తునట్లు అనిపిస్తోంది! ఇతని కోరికను నెరవేర్చవచ్చు కద? అందులో ఏమీ కష్టం లేదు కద? మీ అభిప్రాయమేమి?" అన్నారు.

"ఇందులో మీ సేవకుని అభిప్రాయానికి తావెక్కడిది? యువరాజు ఆదిత్య కరికాలన్ అభిప్రాయాన్ని కద అడగాలి?" అన్నారు తంజావూరు కోట దళపతి.

"చక్రవర్తీ! యువరాజుగారిని అడిగితే పళువూర్ దేవరిని అడగాలంటారు. పళువూర్ దేవరిని

అడిగితే యువరాజుగారిని అడగాలంటారు. ఇద్దరి మధ్య నా కోరిక....''

''బిడ్డా! నీవు దిగులుపడకు! ఇద్దరినీ ఒకచోట చెర్చే అడుగుదాం!'' అన్నారు చక్రవర్తి.

తర్వాత చిన్న పళువేట్టరయ్యర్ వైపు చూసి, ''దళపతీ! ఈ అబ్బాయి యువరాజు వద్దనుంచి తాళపత్రం తీసుకొనివచ్చాడు. మునుపటిలాగానే రాసివున్నాడు - నేను కంచికి రావాలట. కొత్తగా కట్టిన బంగారు మాళిగలో కొన్నిరోజులు నివాసం చేయాలట!'' అన్నారు.

''తమరి చిత్తం ఎలాగో అలాగే చేయండి" అన్నారు కోట దళపతి.

''ఆహా! నాచిత్తమెలగో మీరలా నడుచుకొంటారు. కానీ నాకాళ్ళు మొరాయిస్తున్నాయి. కంచికి ప్రయాణం చేయడం సులభసాధ్యంకాదు. అంతఃపురస్త్రీలలాగ పల్లకిలో తెరవెనుక కూర్చొని వెళ్ళడమంటే నాకు అసహ్యమనిపిస్తుంది. ఆదిత్య కరికాలనే ఇక్కడికి రావాలని జవాబు రాసి పంపించండి...''

''యువరాజు ఈ సమయంలో కంచిని విడిచి ఇక్కడికి రావడం ఉచితమా? ఉత్తరదిశలో మన శత్రువులు ఇంకా బలంగా ఉన్నారు కద!''

''పార్థిబేంద్రుడు, మలైయమాన్ అక్కడ ఉండి చూసుకోగలరు. యువరాజు ఈ సమయంలో నా పక్కన ఉండాలని నా మనస్సులో అనిపిస్తోంది. అంతే కాదు; లంకకు వెళ్ళివున్న ఇలంగో (చిన్న యువరాజు) కూడ వెంటనే ఇక్కడికి వచ్చి చేరాలని సందేశం పంపించాలి. ఇద్దరినీ పక్కన పెట్టుకొని ఒక ముఖ్యమైన విషయం తీర్మానించాలనుకొంటున్నాను. అరుళ్మొళి ఇక్కడ వచ్చినప్పుడు లంకకు ఆహారధాన్యాలు పంపించడం గురించి మీ ఆక్షేపణ కూడ అతని దగ్గర తెలియజేయవచ్చు....''

''చక్రవర్తీ! లంకకు ఆహారధాన్యాలు పంపించడంలో నాకు ఆక్షేపణ ఏమీ లేదు. ధనధాన్యాధికారికూడ ఆక్షేపించలేదు. చోళదేశపు ప్రజలే ఆక్షేపిస్తున్నారు. గత పంటకాలంలో చోళదేశంలో పంటదిగుబడి చాల తగ్గిపోయింది. మన ప్రజలకే చాలకుంది. లంకకు ఓడలకొద్దీ బియ్యాన్ని పంపించడం గురించి ప్రజలే ఆక్షేపిస్తున్నారు! ప్రస్తుతానికి పెద్దగా చెప్పడంలేదు. కొన్నిరోజులు పోతే, ప్రజల అభ్యంతరం బలమౌతుంది. మీ ఆరోగ్యాన్ని బాధించేటట్లు వారి కేకలు ఈ అంతఃపురంలోకే వినిపించనారంభిస్తాయి....''

''మన ప్రజలు ఆక్షేపించే కార్యం అరుళ్మొళి ఎన్నడూ చేయడు. అన్నీ వివరంగా మాట్లాడేందుకు ఒకసారి ఇక్కడికి వచ్చి వెళ్ళనీ. పెద్ద పళువేట్టరయ్యర్ వచ్చిన వెంటనే లంకకు మనిషిని పంపడం గురించి మాట్లాడి తీర్మానిద్దాం. ఆయన ఎప్పుడు తిరిగి వస్తున్నారు?''

''ఈ రాత్రి తప్పకుండా తిరిగి వచ్చేస్తారు!''

''కంచికికూడ రేపు తాళపత్రం రాసి పంపిద్దాం. ఈ అబ్బాయి చేతనే ఆ ఉత్తరాన్ని ఇచ్చి పంపించవచ్చు కద?''

“ఈ అబ్బాయి కంచినుంచి ఏకబిగిన వచ్చివున్నాడు. కొన్నిరోజులు ఇక్కడ ఉండి సేదదీరనీ. ఇంకొక మనిషి ద్వారా కంచికి ఉత్తరం పంపిద్దాం.”

“అలాగే కానివ్వండి. యువరాజు వచ్చేవరకుకూడ ఇతనిక్కడే ఉండవచ్చు!”

అప్పుడు మహారాణి లేచి నిలబడగా, చిన్న పళువేట్టరయ్యర్, “ఈ రోజు మిమ్మల్ని ఎక్కువసేపు మాట్లాడేలా చేశాను. మన్నించండి. దేవి హెచ్చరించేవరకు సాగింది!” అన్నారు.

“దళపతీ! ఈ అబ్బాయి మన అతిథి. ఇతనికి కావలసిన వసతులన్నీ చేసి పెట్టండి. చక్రవర్తికి గనక ఆరోగ్యం బాగుంటే, ఇతన్ని మా అంతఃపురంలోనే ఉండమని చెప్పివుండవచ్చు!” అన్నారు మలైయమాన్ కుమారి.

“నేను చూసుకొంటాను, తల్లీ! మీకా దిగులక్కరలేదు. బాగా చూసుకొంటాను! అన్నారు చిన్న పళువేట్టరయ్యర్. అప్పుడు ఆయనకు తెలియకనే ఆయన చేయి మీసాన్ని సవరించింది.

~~~
~~~

# అధ్యాయము - 30

## చిత్ర మంటపం

**చిన్న** పళువేట్టరయ్యర్ వంతిదేవుని తమ ఆస్థాన మంటపానికి తీసుకువెళ్ళారు. చక్రవర్తి దగ్గర అతను చెప్పిందేమన్నది గురించి అతను చెప్పిన సమాధానం ఆయనకు అంతగా తృప్తినివ్వలేదు. చక్రవర్తిని ఏకాంతంగా కలవడానికి అనుమతి ఇచ్చిందే తప్పేమో అనిపించిందాయనకు. ఆదిత్య కరికాలన్ పంపినవాడు కాబట్టి, అతన్ని సందేహించవలసివుంది. కానీ, అన్నగారు తమ రాజముద్రను అతనికిచ్చి పంపించినందువల్ల సందేహానికి తావులేదు. ఆహా! ఇలాంటి విషయాల్లో పెద్దాయనకు ఎవరైనా ముందు జాగ్రతల గురించి చెప్పాలా, ఏమి? కానీ, తాను ఉన్నట్లుండి దర్శన మంటపంలోకి ప్రవేశించినప్పుడు ఆ యువకుడు తనను చూసి భయపడ్డట్లు చూసిన వైనం ఆయన కళ్ళముందు అగుపించింది. "అపాయం! అపాయం!" అని అతను అరిచినది తన చెవిన బాగా పడ్డట్లు జ్ఞాపకముంది. "అభయం" అని చెప్పివుంటే అది తనకు 'అపాయం' అని వినపించివుండ సాధ్యమా? అన్నిటికీ, ఇతన్ని వెంటనే తిరిగి పంపించకుండడం మంచిది. అన్నగారు వచ్చిన తర్వాత ఇతన్ని గురించి బాగా అడిగి తెలుసుకొన్న తర్వాత ఉచితమైన కార్యం చేయడం మంచిది. ఇటువంటి ధీరుడైన యువకుడిని తమ అంతరంగ కాపలా దండులో చేర్చుకోవడానికి ప్రయత్నించాలి. సమయానికి ఉపయోగపడగలడు. ఇతనికి ఇతని పూర్వీకుల రాజ్యంలో ఒక భాగం తీసి ఇవ్వవచ్చు. ఇటువంటి యువకులకు ఒకసారి సహాయంచేస్తే తర్వాత జీవితాంతం మనకు భక్తివిశ్వాసాలతో సేవచేస్తుంటారు. ఒకవేళ ఇతను మనకు విరోధి అని రూఢిగా తెలిస్తే, దానికి తగిన ఏర్పాట్లు చేయాలి. దేనికీ అన్నగారు రావాలి.

ఆస్థానమంటపం చేరిన వెంటనే వంతిదేవుడు అన్నివైపులా ఆసక్తిగా చూడసాగాడు. దళపతికి తాను తాళపత్రం తీసిచ్చిన స్థలాన్ని మళ్ళీ మళ్ళీ జాగ్రతగా పరికించి చూశాడు. పొరబాటున ఆ ఇంకొక పత్రం - ఆ ముఖ్యమైన తాళపత్రం - కింద పడిపోయిందేమోనని. దాన్ని కనిపెట్టలేకపోతే తనవంటి మూర్ఖుడు ఇంకొకడుండడు! లోకమంతా పొగిడే చోళదేశపు రాజకుమారిని తాను చూడనే సాధ్యంకాకుండా పోతుంది.ఆదిత్య కరికాలన్ తనకు ఒప్పజెప్పిన పనిలో సగానికి సగం నెరవేర్చలేము.

చిన్న పళువేట్టరయ్యర్ అక్కడున్న సేవకులలో ఒకడిని చూసి, "ఈ అబ్బాయిని మన అంతఃపురానికి తీసుకువెళ్ళి అతిథి గృహంలో అతనికి అన్ని వసతులూ చేసి పెట్టు! నేను వచ్చేవరకు అక్కడే ఉండు!" అన్నారు.

వారిద్దరూ బయటకు వెళ్ళినవెంటనే, ఇంకొక సేవకుడు భయభక్తులతో కోట దళపతిని సమీపించి ఒక తాళపత్రాన్ని ఇచ్చాడు. "ఇక్కడినుంచి దర్శన మంటపానికి వెళ్ళేదారిలో ఇది దొరికింది. ఇప్పుడు

వెళ్ళిన అబ్బాయి నడుము బట్టనుంచి జారి పడివుండవచ్చు!" అన్నాడు.

దళపతి దాన్ని చాల ఆసక్తితో తీసుకొని విప్పిచూశారు. ఆయన కనుబొమలు పైకి వెళ్ళాయి. ఆయన ముఖం కఠినంగా మారింది.

"ఆహ్! యువరాకుమారికి ఆదిత్య కరికాలర్ రాసిన సందేశం...'అంతరంగ కార్యాలకు నమ్మకమైన ఒక వీరుడు, అనుకొన్న పనిని సాధించగల ఒక ధీరుడు, - కావాలని అడిగావు కదా? అందుకని ఇతన్ని పంపిస్తున్నాను. ఇతన్ని పూర్తిగా నమ్మి ఏ కార్యమైనా ఒప్పజెప్పవచ్చు' అని యువరాజు స్వయంగా తన చేతిరాతలో రాసివున్నారు! ఆః! ఇందులో ఏదో మర్మముంది. ఈ తాళపత్రం గురించి పెద్దాయనకు తెలుసో, లేదో! ఇతని విషయంలో అతిజాగ్రతగా ఉండాలి!" అని కోట దళపతి అనుకొన్నారు. ఆ పత్రాన్ని భద్రంగా తీసుకొనివచ్చిన భటుని చెవిలో రహస్యంగా కొన్ని విషయాలు చెప్పారు. వాడు కూడ వెంటనే బయలుదేరి వెళ్ళాడు.

-:-

చిన్న పళువేట్టరయ్యర్ మాళిగలో వంతిదేవునికి సకల ఉపచారాలు బ్రహ్మాండంగా జరిగాయి. అతనికి స్నానం చేయించి కట్టుకోవడానికి కొత్తబట్టలిచ్చారు. మంచి బట్టలు కట్టుకోవడమంటే ఇష్టపడే వంతిదేవుడు వాటిని కుతూహలంతో తీసుకొని కట్టుకొన్నాడు. కనిపించకుండా పోయిన తాళపత్రంగురించికూడ మరిచిపోయాడు. కొత్తబట్టలు కట్టుకొన్న తర్వాత రుచికరమైన తినుబండారాలిచ్చారు. బాగా ఆకలితోవున్న వంతిదేవుడు వాటిని స్వాహాచేశాడు. తర్వాత అతన్ని చిన్న పళువేట్టరయ్యర్ గారి చిత్రమంటపానికి తీసుకొనివెళ్ళారు. "దళపతి వచ్చేవరకు ఈ చిత్రమంటపంలో అపూర్వ చిత్రాలను చూస్తూండవచ్చు!" అన్నారు. ఇలా చెప్పి, భటులలో ముగ్గురు ఆ చిత్రమంటపం బయట కూర్చొని కబుర్లు చెప్పుకోసాగారు.

-:-

చోళవంశపు నవీన రాజధానియైన తంజైపురి (తంజావూరు) శిల్ప చిత్రకళలకు పేరుగాంచినది. తిరువైయ్యారులో గాన, సంగీత నాట్య కళలు వర్ధిల్లినట్లు తంజావూరులో శిల్ప, చిత్రకళలు పెంపొందాయి.

ముఖ్యంగా చిన్న పళువేట్టరయ్యర్‌గారి మాళిగలోని చిత్రమంటపం అప్పట్లో చాల పేరుప్రఖ్యాతులు కలిగివుండేది. వంతిదేవుడు ఇప్పుడా చిత్రమంటపంలో ప్రవేశించాడు. పలువర్ణాలతో ఆకర్షణీయంగా గీయబడిన కుడ్యచిత్రాలను మైమరచి చూడసాగాడు. తాను వచ్చిన ముఖ్యమైన కార్యాన్నికూడ మరచాడు.

చోళవంశ పూర్వీకరాజులను, వారి జీవితకాలపు సంభవాలను చిత్రరూపంలో కళ్లకుకట్టినట్లు చిత్రించి ఉండడం అతన్ని పరవశింపజేసింది. ముఖ్యంగా, గత నూరు సంవత్సరాల చోళకులస్థుల చరిత్ర ఆ

చిత్రమంటపపు ముఖ్యమైన భాగాన్ని ఆక్రమించివున్నాయి. వంతిదేవుని అధికంగా ఆకట్టుకొన్నవికూడ అవే.

-:-

ఈ కట్టడంలో, గత నూరేళ్ళుగా తంజావూరు నుంచి, పళైయారై నుంచి రాజ్యమేలిన చోళవంశపు రాజులగురించి క్లుప్తంగా పాఠకులకు వివరించడానికి ఇష్టపడుతున్నాము. ఇక ఈ కథలో ముున్ముందు జరగబోయే సంఘటనలను అర్థంచేసుకోవడానికి ఇది చాల ఉపయోగపడగలదు.

తొంబైయారు యుద్ధగాయాలను ఆభరణాలలాగ తన మేనిపై ధరించిన విజయాలయ చోళుని గురించి ఇప్పటికే వివరించివున్నాము.

చోళరాజులు పరకేసరి, రాజకేసరి వంటి బిరుదులను ఒకరి తర్వాత ఒకరు పొందడం సంప్రదాయం. పరకేసరి విజయాలయుని తర్వాత అతని కుమారుడు రాజకేసరి ఆదిత్య చోళుడు సింహాసనమెక్కాడు. అతను తండ్రికి తగ్గ కుమారుడై విలసిల్లాడు. మొదట పల్లవుల పక్షం నిలబడి పాండ్యులను ఓడించి చోళరాజ్యాన్ని గట్టిపరుచుకొన్నాడు. తర్వాత పల్లవరాజు అపరాజితవర్మతో కయ్యానికి దిగాడు. ఏనుగుపైనెక్కి యుద్ధంచేస్తున్న అపరాజితవర్మపైకి దూకి అతన్ని సంహరించి తొండైమండలాన్ని వశపరుచుకొన్నాడు. తర్వాత కొంగు మండలంకూడ ఇతని కైవసమైంది. ఆదిత్యుడు మహాశివభక్తుడు. కావేరినది పుట్టే స్థలంనుంచి ఆ నది సముద్రాన్ని కలిసేవరకు ఆ నదీతీరం వెంబడి అనేక శివాలయాలను కట్టించాడు.

రాజకేసరి ఆదిత్య చోళుని తర్వాత పరకేసరి పరాంతక చోళుడు సింహాసనమెక్కాడు. నలభైయారు సంవత్సరాలు రాజ్యమేలాడు. హిమాలయాలపై పులిజెండాను నాటిన కరికాల్ పెరువళత్తాన్ తర్వాత చోళవంశంలో అంతటి పేరుగాంచినది పరాంతకుడే. వీరనారాయణుడు, పండిత వత్సలుడు, వీరమల్లు, శూరశిఖామణి మొదలైన బిరుదులు పొందాడు. ఈ మొదటి పరాంతకుని కాలంలోనే చోళసామ్రాజ్యం కన్యాకుమారినుంచి కృష్ణానది వరకు విస్తరించింది. లంకలో కూడ కొంతకాలం పులిజెండా ఎగిరింది. తిల్లై చిట్రంపలం దేవాలయానికి బంగారపు కప్పు చేయించినది కూడ ఇతనే. ఇతని పాలన చివరి రోజుల్లో చోళసామ్రాజ్యానికి కొన్ని పెద్ద అపాయాలు మూడాయి. ఉత్తరాన రాష్ట్రకూటులు బలం పుంజుకొని చోళసామ్రాజ్యంపైన దండెత్తి రాసాగారు. కొంతవరకు గెలుపుకూడ సాధించారు.

-:-

పరాంతక చక్రవర్తికి ముగ్గురు కొడుకులు. వీరిలో వీరాధివీరుడిగా పేరుపొందినవాడు ప్రధమపుత్రుడైన రాజాదిత్యుడు. ఉత్తరదేశపు సైన్యాలు దండెత్తిరావడాన్ని ముందుగానే ఊహించి రాజాదిత్యుడు తిరుమునైప్పాడిలో ఒక పెద్దసైన్యంతో చాల కాలం శిబిరంవేసుకొనివున్నాడు. తన తండ్రి పేరు

నాలుగు కాలాలపాటు విరాజిల్లేలాగ వీరనారాయణపురం చెరువు తవ్వించాడు.

అరక్కోణానికి దగ్గర తక్కోలం అనే చోట చోళులకు, రాష్ట్రకూటులకు మధ్య భయంకరమైన పోరు జరిగింది. ఈ యుద్ధంలో శత్రుసైన్యాలను తుడిచిపెట్టి తన వీరత్వాన్ని నెలకొల్పిన తర్వాత రాజాదిత్యుడు ఆ యుద్ధరంగంలోనే వీరస్వర్గం పొందాడు. ఇతడుకూడ పల్లవరాజు అపరాజితవర్మలాగ ఏనుగునెక్కి యుద్ధం చెస్తూ ఆ ఏనుగుపైనే ప్రాణాలొదిలినందువల్ల, ''ఏనుగుపైన మరణించిన దేవరు" అని శిలాశాసనంపైన చెక్కారు.

రాజాదిత్యుడు మరణించివుండకపోతే అతనే పరాంతకుని తర్వాత సింహాసనమెక్కివుండేవాడు. ఇతని సంతతే వారసత్వ హక్కు ప్రకారం ఇతని తర్వాత పట్టాభిషిక్తులైవుండవలసింది.

కానీ యువరాజు రాజాదిత్యుడు సింహాసనమెక్కకనే, సంతతి లేకనే మరణించినందువల్ల ఇతని చిన్న సహోదరుడు గండరాదిత్య దేవరు తండ్రి కోరిక మేరకు 'రాజకేసరి' పట్టంతోబాటు సింహాసనమెక్కారు.

ఈయన తమ తండ్రి లాగ, తాతగారిలాగనే శివభక్తులు. అదీగాక తమిళ భాషాప్రేమికులు. నిజానికి ఈయనకు రాజ్యమేలడంలో అంత శ్రద్ధ ఉండేదికాదు. ఆలయ సేవ, భాషాసేవలోనే అధికంగా నిమగ్నమైఉండేవారు. మహాత్ములైన నాయన్మార్ల మార్గంలో నడిచి శివభక్తి నిండిన పద్యాలు, పాటలు పాడారు. 'తిరువిశైప్పా' అనే ఈ గీతమాలికలో చివరిదైన ఈ క్రింది పాటలో తన గురించే పాడుకొన్నారు:

<< ఆ గీతాన్ని అనువదించవలసివుంది >>

విజయాలయుని తర్వాత రాజ్యమేలిన చోళరాజులు పళైయార్రై, తంజావూరు నగరాలను మార్చి మార్చి రాజధానిగా చేసుకొని రాజ్యమేలినా పురాతన చోళ రాజధాని ఉరయూర్ బాధ్యత మరిచిపోలేదు. ఉరయూరుకు 'కోళి' అనే ఇంకొక పేరు. కాబట్టి చోళ రాజులు తమను 'కోళివేందర్' అని కూడ పిలుచుకొనేవారు.

-:-

గండరాదిత్య దేవరు నామమాత్రంగా రాజ్యమేలినా ఆయన తమ్ముడైన అరింజయుడే రాజ్య వ్యవహారాలన్నీ చూసుకొనేవాడు. రాజాదిత్యునికి తోడుగా అరింజయుడు తిరునావలూర్ మొదలైన స్థలాలలో సైన్యాలతో ఉండి సహాయంచేసేవాడు. రాష్ట్రకూటులతో మహాయుద్ధం జరిపాడు. తక్కోలంలో చోళసైన్యానికి కలిగిన పరాజయాన్ని త్వరలోనే విజయంగా మార్చాడు. రాష్ట్రకూటుల దండయాత్రను దక్షిణపెన్నకు అటువైపే నిలిపేశాడు.

కాబట్టే, రాజకేసరి గండరాదిత్య చోళమహారాజు తన తమ్ముడు అరింజయునికి యువరాజు పట్టం కట్టి, అతనే తన తర్వాత సింహాసనమెక్కడానికి అర్హుడని దేశప్రజలందరికీ తెలిసేటట్లు చెప్పేశారు.

ఇలా గండరాదిత్యలు తీర్మానించేందుకు ఇంకొక ముఖ్యకారణంకూడ ఉంది. ఈయన మొదటిభార్య ఆయన పట్టానికి రాకమునుపే కాలం చెందారు. తర్వాత చాల కాలం ఆయన వివాహం చేసుకోనేలేదు.

కానీ ఈయన తమ్ముడైన అరింజయునికేమో అందమూ, శౌర్యమూ మూర్తీభవించిన ఒక కుమారుడు కలిగాడు. తాతగారి 'పరాంతకుడు' అనే పేరు, ప్రజలిచ్చిన 'సుందర చోళుడు' అనే పేరు రెండూ ధరించాడు.

కాబట్టే, తమ తర్వాత తమ సహోదరుడు అరింజయుడు, అతని తర్వాత అతని కుమారుడు సుందరచోళుడు పట్టానికి రావాలని గండరాదిత్యులు చట్టంపేశారు. ఈ ఏర్పాటుకు సామంతులు, దండనాయకులు, ప్రజాప్రతినిధులు అందరి సమ్మతమూ తీసుకొని బహిరంగంగా లోకమెరిగేటట్లు తెలియజేసేశారు.

ఈ ఏర్పాట్లన్నీ జరిగిన తర్వాత గండరాదిత్యుల జీవనంలో ఒక విచిత్రమైన సంభవం జరిగింది. మళవరైయ్యన్ అనే ఒక చిన్న రాజు కుమార్తెను కలిసే సంఘటన జరిగింది. ఆ వనితామణి సౌందర్యము, వినయ విధేయతలు, శీలము, శివభక్తి ఆయనను ఆకట్టుకొన్నాయి. ముదుసలిప్రాయంలో ఆమెను పెళ్ళాడారు. ఆ వివాహంవల్ల త్వరలోనే ఒక మగబిడ్డ కలిగాడు. ఆ బిడ్డకు 'మధురాంతకుడు' అని పేరుపట్టి ముద్దుగా పెంచారు. కానీ రాజు, రాణి ఇద్దరూ రాజ్యంగురించి మునుపు చేసిన ఏర్పాటును మార్చ ఇష్టపడలేదు. దంపతులిద్దరు శివభక్తి మార్గంలో, వైరాగ్యమార్గంలో నిమగ్నమైఉండడంవల్ల తమ ప్రియపుత్రుని కూడ అదే మార్గంలో పెంచేందుకు ఇష్టపడ్డారు. తృణప్రాయమైన ఈ భూలోక సామ్రాజ్యంకన్న ఆ శివలోక సామ్రాజ్యమే మేలైనదని నమ్మినవారు కావడంవల్ల, ఆ శివలోక సామ్రాజ్యానికి అర్హుడయ్యేలాగ తమ తనయుని పెంచాలని ఆశించారు. కాబట్టి తమ తర్వాత తమ సహోదరుడు అరింజయుడు, అతని తర్వాత అతని కుమారుడు సుందరచోళుడు పట్టానికి రావాలని గండరాదిత్యులు బహిరంగంగా చట్టంపేశారు.

కాబట్టే, రాజాదిత్యుడు, గండరాదిత్యుడు ఇద్దరినీ దాటి అరింజయుని వంశానికి చోళ సింహాసనమెక్కే హక్కు దక్కింది.

గండరాదిత్యులతర్వాత అరింజయుడు చాల కాలం జీవించివుండలేదు. ఒకే ఏడు అన్నగారి వెనక తమ్ముడుకూడ కైలాస పదవికి వెళ్ళిపోయాడు.

తర్వాత , సుందరచోళునికి ప్రజలు , చిన్నరాజులు , అధికారులు చేరి పట్టాభిషేకం చేసి సంతసించారు . రాజకేసరి సుందర చోళులుకూడ తమకు అదృష్టవశాత్తు లభించిన మహత్తరమైన పదవిని బాధ్యతాయుతంగా కొనసాగించారు . తమ పరిపాలన ప్రారంభించిన

మొదట్లోనే పలు పోరాటాలు సాగించి పాండ్యదేశాన్ని , తొండైమండలాన్ని తిరిగి జయించారు . రాష్ట్రకూటుల సైన్యాలను దక్షిణపెన్న తీరంనుంచి తరిమికొట్టారు .

సుందరచోళ చక్రవర్తి కుమారులైన ఆదిత్య కరికాలన్, అరుళ్మొళివర్మ తండ్రిని మించగల సాటిలేని వీరులని పేరుపొందారు. వారిద్దరు తండ్రికి పరిపూర్ణసహాయం చేశారు. వారు చాల చిన్నవయసులోనే యుద్ధాలకు వెళ్ళి ఆ యుద్ధాలలో ముందు నిలిచి పోరాడారు; వారు పాల్గొన్న యుద్ధాలన్నిటిలో విజయలక్ష్మి వారినే వరించింది.

-:-

ఇదంతా చిత్రలేఖనరూపంలో ప్రత్యక్షంగా చూసిన వల్లవరయ్యన్ చెప్పలేనంత ఆశ్చర్యంలో మునిగిపోయాడు . అన్నదమ్ములైన పళువేట్టరయ్యర్లు ఈ రోజు చోళసామ్రాజ్యమంతటా అధికారం చెలాయించేందుకు కారణం లేకపోలేదు .సుందర చోళ చక్రవర్తి అన్ని విషయాల్లోను వారిని సంప్రదించడంలో ఆశ్చర్యంలేదు .

కానీ, తానిప్పుడు ఒక పెద్ద సంకటంలో చిక్కుకొనివున్నాననడంలో సందేహంలేదు. చిన్న పళువేట్టరయ్యర్‌కి తన గురించి ఏదో సందేహం పట్టుకొంది. పెద్దాయన వచ్చేస్తే ఆ సందేహం నిజమైపోతుంది. రాజముద్ర గుట్టు రట్టైపోతుంది. తర్వాత తన గతి అధోగతే! చిన్న పళువేట్టరయ్యర్ పర్యవేక్షణలోవున్న పాతాళ కారాగృహం గురించి వంతిదేవుడు వినివున్నాడు. అందులో ఒకవేళ తన్ను వేసేయవచ్చు. ఆ పాతాళ కారాగృహంనుంచి బయటపడ్డం ఇంచుమించు అసాధ్యమే. ఒకవేళ బయటపడ్డాకూడ ఎముకల గూడుగా మారి, మతి కోల్పోయి, పిచ్చివాడిగా బయటపడవచ్చు, అంతే!

ఆహా! ఇటువంటి మహాపాయంనుంచి తప్పుకొని బయటపడ్డం ఎలా? ఏదైన యుక్తి పన్ని పెద్దాయన వచ్చేలోపల కోటబయటకు చేరిపోవాలి. పళువూర్ రాణిని చూడాలన్న ఆశకూడ మనవీరునికి ఇగిరిపోయింది. పాతాళ చెరసాల తప్పి బయటపడితే చాలు! తాళపత్రంలేకపోయినా కుందవైదేవిని ప్రత్యక్ష్యంగా చూసి సందేశాన్ని చెప్పేయవచ్చు. నమ్మితే నమ్మనీ, లేకపోతే పోనీ; కానీ తంజావూరు కోటనుంచి బయటపడేందుకు ఏది దారి?

~~~
~~~

# అధ్యాయము - 31

## "దొంగలు! దొంగలు!"

విజయాలయ చోళుని మొదలు, రెండవ పరాంతకుడైన సుందరచోళుని వరకు అందరు చోళరాజుల జీవ చిత్రాలను చూసి వంతిదేవుడు సంతసించాడు. ఆహా! వీరిలో ఒక్కొక్కరు ఎంతెంత పేరుపొందినవారు! ప్రాణాలను తృణప్రాయంగా ఎంచి ఎంతెంత పెద్దకార్యాలను సాధించారు! కథల్లో, కావ్యాల్లోకూడ ఇలా వినివుండలేదుకద? ఇటువంటి రాజులను పొందిన చోళరాజ్యం భాగ్యవంతమైనది.!

పైన చెప్పిన చోళరాజుల చరిత్రలో వంతిదేవుడు ఇంకొక ముఖ్యమైన అంశాన్ని గమనించాడు. ప్రతి చోళరాజుకూ పళువూర్ చిన్నరాజులు శ్లాఘనీయమైన సహాయం చేసినవారే;

ముత్తరయ్యర్ అధీనంలో ఉన్న తంజావూరు కోటను మొట్టమొదట జయించి ఆ నగరంలో ప్రవేశించింది ఒక పళువేట్టరయ్యర్. రెండు కాళ్ళూ కోల్పోయిన విజయాలయవర్మ తిరుప్పురంపయం యుద్ధరంగంలో దూరి మానవాతీత పరాక్రమకృత్యాలను ప్రదర్శించినప్పుడు అతన్ని రెండుభుజాలపైన ఎత్తుకొని యుద్ధరంగంలోకి దూకినవాడు ఒక పళువేట్టరయ్యర్. ఆదిత్యుని శిరస్సుపై కిరీటంపెట్టి పట్టాభిషేకం చేసింది ఇంకొక పళువేట్టరయ్యర్. ఆదిత్య చోళుడు ఏనుగుపైన దూకి అపరాజిత పల్లవుని సంహరించేందుకు అనువుగా తన భుజమూ, వెన్నూ అందించినది ఒక పళువేట్టరయ్యర్. పరాంతక చక్రవర్తి సాగించిన యుద్ధాలన్నిటిలోను పులిజెండాను పట్టుకొని ముందు నడిచినవారు పళువేట్టరయ్యర్లే. రాజాదిత్యుడు పోరులో గాయపడి కిందపడ్డప్పుడు ఒక పళువేట్టరయ్యర్ అతన్ని తన ఒడిలో వేసుకొని, "రాష్ట్రకూటులు ఓడిపోయి పారిపోతున్నారు!" అన్న వార్తను చెప్పారు. అలాగే అరింజయునికి, సుందరచోళునికి కూడ వీరసహాయాలు చేసినది పళువేట్టరయ్యర్లే.

-:-

ఇదంతా చిత్రలేఖనరూపంలో ప్రత్యక్షంగా చూసిన వల్లవరయ్యన్ చెప్పలేనంత ఆశ్చర్యంలో మునిగిపోయాడు. అన్నదమ్ములైన పళువేట్టరయ్యర్లు చోళనాడులో ఇంతటి అధికారం చెలాయించగలగడానికి కారణం లేకపోలేదు. సుందరచోళ చక్రవర్తి వారిని అన్నివిషయాల్లోను సంప్రదించడంలో ఆశ్చర్యమూ లేదు.

కానీ తానిప్పుడు ఒక పెద్ద ప్రమాదంలో చిక్కుకొనివున్నాననడంలో సందేహంలేదు. చిన్న పళువేట్టరయ్యర్‌కి తనగురించి ఏదో సందేహం పుట్టుకొచ్చేసింది. పెద్దాయన వచ్చేస్తే ఆ సందేహం రూఢి కావడం నిజం. రాజముద్ర ఉంగరపు గుట్టు రట్టు కావడం ఖాయం. తర్వాత తన గతి అధోగతే! చిన్న పళువేట్టరయ్యర్ అధీనంలో ఉన్న తంజావూరు పాతాళ కారాగృహం గురించి అతను వినివున్నాడు. ఒకసారి

అందులో బంధించబడితే, బయటపడ్డం ఇంచుమించు అసాధ్యం. ఒకవేళ బయటపడ్డాకూడ, ఎముకలగూడై, మతిపోగొట్టుకొని, పిచ్చివాడిగా మాత్రమే బయటపడగలం!

ఆహా! ఇటువంటి మహాపాయంనుంచి తప్పుకోవడం ఎలా? ఏదైనా యుక్తి పన్ని పెద్ద పళువేట్టరయ్యర్ వచ్చేలోపల కోటనుంచి బయటపడాలి. పళువూర్ యువరాణిని చూడాలన్న ఆశకూడ ఇగిరిపోయింది. ప్రాణాలతో బయటపడి, పాతాళ చెరసాల గండం తప్పించుకొంటే చాలు! యువరాజిచ్చిన తాళపత్రసందేశం లేకపోయినా కుందవైదేవిని ప్రత్యక్షంగా చూసి సమాచారాన్ని చెప్పేయవచ్చు. నమ్మితే నమ్మనీ; లేకపోతే పోనీ. కానీ, తంజావూరు కోట నుంచి బయటపడ్డానికి ఏది దారి?

ఉన్నట్లుండి తన పాతబట్టలేమైనాయనే సందేహం వచ్చింది వంతిదేవునికి. తన బట్టలను పరిశీలించి చూసేందుకే తనకు కొత్తబట్టలిచ్చి ఇంత ఉపచారాలు చేశారు! కుందవైదేవికి ఉద్దేశించిన తాళపత్రం చిన్న పళువేట్టరయ్యర్కి చిక్కివుండాలి! సందేహంలేదు. తాను కవులతోబాటు వెళ్ళిపోకుండ ఆయన తనను ఉక్కు పట్టుతో పట్టుకొన్నందుకు కారణం ఇప్పుడు తెలుస్తోంది! ఒక మనిషికి బదులు ముగ్గురిని తనవెంట పంపించిన కారణంకూడ తెలిసిందిప్పుడు. వెంటనే ఏదైన యుక్తి పన్నాలి! - ఆఁ! తట్టిందొక మంచి ఉపాయం! పన్నాల్సిందే ఆ ఉపాయాన్ని!

వంతిదేవుడు చిత్రమంటపపు గవాక్షం నుంచి బయటకు తొంగిచూశాడు. చిన్న పళువేట్టరయ్యర్ తన పరివారంతో గుర్రంపైన వస్తున్నారు. ఆహా! ఇదే మంచి సమయం! ఇక ఒక్క క్షణంకూడ ఆలస్యం చేయకూడదు.

చిన్న పళువేట్టరయ్యర్ రావడం గమనించి వాకిలి పక్కన కూర్చొని ఆటలాడుతున్న ముగ్గురు కాపలావాళ్ళు లేచి నిలబడ్డారు.

వంతిదేవుడు వారి దగ్గరికి వెళ్ళి, “అన్నలారా! నా పాత బట్టలేవి?” అని అడిగాడు.

“ఆ మురికి బట్టలు ఇప్పుడెందుకు? యజమాని ఉత్తర్వు ప్రకారం కొత్త పట్టుపీతాంబరాలిచ్చాం కద?” అన్నాడొకడు.

“నాకు కొత్త బట్టలవసరం లేదు. పాతబట్టలే చాలు. వాటిని వెంటనే తెండి!”

“అవి చలువకు వెళ్ళాయి. వచ్చిన వెంటనే తిరిగి ఇచ్చేస్తాం!”

“అదంతా జరగదు! మీరు దొంగలు. నా పాత బట్టల్లో నగదు ఉంచాను. అది దొంగిలించడానికే మీరు నాబట్టల్ని తీసేసుకొన్నారు.. వాటిని వెంటనే తీసుకొచ్చివ్వండి. లేకపోతే....!”

“లేకపోతే ఏం చేస్తావు తమ్ముడూ? మా తలల్ని కొట్టి తంజావూరుకు పంపిస్తావా? కానీ ఇదే తంజావూరు! గుర్తు పెట్టుకో!”

"అరే! నా బట్టల్ని వెంటనే తెచ్చి ఇస్తారా? లేదా?"

"ఉంటేనే కద తమ్ముడూ తెచ్చివ్వడానికి? ఆ మురికి బట్టలన్నిటినీ మొసళ్ళకు వేసేశాం! మొసలి కడుపు లోపల పోయింది తిరిగివస్తుందా?"

"దొంగ పెధవల్లారా? నాతో పరాచికాలాడుతున్నారా? ఇదిగో మీ యజమానికి వెళ్ళి చెప్తాను, చూస్తూండండి!" అని వంతిదేవుడు వాకిలి దాటనారంభించాడు. ఆ ముగ్గురిలో ఒకడు అతన్ని అడ్డగించ ప్రయత్నించాడు. వంతిదేవుడు అతని ముక్కుకు గురిచూసి ఒక్క గుద్దు గుద్దాడు. అంతే! ఆ కాపలావాడు వెల్లికిలా పడిపోయాడు. అతని ముక్కునుంచి రక్తం కారసాగింది.

ఇంకొకడు వంతిదేవునితో మల్లయుద్ధం చేయబోయేవాడిలాగ రెండుచేతులూ ముందుకు చాచి రాసాగాడు. చాచిన చేతులను గట్టిగా పట్టూకొని ఆ మనిషి రెండుకాళ్ళమధ్య కాలు దూర్చి మెలిదిప్పాడు. అంతే! ఆ మనిషి 'అమ్మో!' అని అరిచి కింద పడ్డాడు. ఇంతలో మూడోవాడు కూడ వంతిదేవుని సమీపించసాగాడు. వంతిదేవుడు తన కాలితో సరిగ్గా ఆ మనిషి మోకాలికి ఒక్క తన్నిచాడు. ఆ కాపలావాడు కూడ కిందపడ్డాడు.

ఆ ముగ్గురూ మళ్ళీ చటుక్కున లేచి వంతిదేవుని ముట్టడించ రాసాగారు. ఈసారి చాలా జాగ్రతగానే వచ్చారు.

ఇంతలో మాళిగ ముందు గుర్రం వచ్చి ఆగిన శబ్దం వినిపించింది.

వంతిదేవుడు తన గొంతులో తనకున్న శక్తినంతా నింపుకొని, "దొంగలు! దొంగలు!" అని అరుస్తూనే వారిమీదకు లంఘించాడు. ముగ్గురూ అతన్ని పట్టి ఆపేందుకు ప్రయత్నించారు. మళ్ళీ, "దొంగలు! దొంగలు!" అని పెద్దగొంతుతో అరిచాడు.

అప్పుడు చిన్న పళువేట్టరయ్యర్, "ఇక్కడేమి రగడ?" అని అడుగుతూ లోపలికొచ్చారు.

~~~
~~~

# అధ్యాయము - 32

## పరిశోధన

చిన్న పళువేట్టరయ్యర్ని చూసిన వెంటనే వంతిదేవుడు జగడం ఆపేసి ఆయన వైపు నడిచాడు. కాపలావాళ్ళు లేచి పరుగెత్తివచ్చి అతన్ని పట్టుకొన్నారు. వారిని కించిత్తుకూడ లక్ష్యపెట్టక, నాలుగడుగులు ముందుకువేసి, “దళపతీ! మంచిసమయానికి మీరు వచ్చేశారు. ఈ పచ్చిదొంగలు నా బట్టల్ని దొంగిలించడమేగాక, నన్ను చంపేందుకు చూస్తున్నారు! అతిథిని ఇలాగేనా గౌరవించడం? ఇదేనా తంజావూరు సంప్రదాయం? నేను మీకుమాత్రం అతిథిని కాను, చక్రవర్తికి కూడ అతిథిని; మహారాణిగారు చెప్పింది మీరుకూడ విన్నారుకద? పట్టపు యువరాజువద్దనుంచి సందేశం తీసుకువచ్చిన దూతను నేను. అటువంటి నన్ను ఇలా కష్టపెట్టేవారు తక్కిన వారిని ఎలా చూస్తారు! ఇటువంటి దొంగలను పనిమనుషులుగా మీరు పెట్టుకోవడం నాకాశ్చర్యంగా ఉంది. ఇటువంటి దొంగలను మా తొండైమండలంలో ఇప్పటికి త్రిశూలానికి ఎరవేసేసేవారం!” అని అతి గంభీరంగా అన్నాడు.

ముగ్గురు వీరులను ఏకకాలంలో ఎదిరించి కిందపడవేసి ఓడించిన ఆ యువకుని వీరత్వాన్ని గురించిన ఆశ్చర్యం ఇంకా ఆయన మనసు వీడలేదు. ఇటువంటి వీరుని తమ కాపలా దండులో చేర్చుకోవాలనే ఆశ ఆయనకు ఇంకా అధికమైంది. కాబట్టి ఆయన శాంత స్వరంతో, “ఓపిక, తమ్ముడూ! ఓపికపట్టు! అలాగేం వీరు చేసివుండరు అని అనిపిస్తోంది! వీరిని విచారించి చూస్తాను!” అన్నారు.

“నేను కోరేదీ అదే! వీరిని విచారించండి; విచారించి న్యాయం ఇవ్వండి! నా బట్టలు, వస్తువులు నాకు తిరిగివచ్చేలాగ చేయండి! అన్నాడు వంతిదేవుడు.

“అరె! ఆ అబ్బాయిని వదిలేసి ఇలా రండి! నేను చెప్తున్నదేమి? మీరు చేస్తున్నదేమి? ఇతనిమీద ఎందుకు చేయి వేస్తున్నారు?” అని కోపంగా అడిగారు కోట దళపతి!

“యజమానీ! మీరు చెప్పింది చెప్పినట్లే చేశాము. ఇతనికి అభ్యంగన స్నానం చేయించి, కొత్తబట్టలు కట్టి, కొత్త ఆభరణాలు అలంకరించి మంచి రుచికరమైన భోజనం వండి పెట్టాం. తర్వాత చిత్రమంటపానికి తీసుకువెళ్ళాము. అక్కడ కాసేపు చిత్రాలను చూశాడు. ఉన్నట్లుండి తన పాత బట్టలను గుర్తుతెచ్చుకొని అడిగాడు. వెంటనే మాతో దెబ్బలాడనారంభించాడు!” అన్నాడు ఆ వీరులలో ఒకడు.

“ఒక చిన్న అబ్బాయి చేతిలోనా ముగ్గురు లావాటి శాల్తీలు దెబ్బతిని పడ్డారు?” అని కోపజ్వాలలు రగిలే కళ్లతో చూస్తూ అడిగారు.

“యజమానీ! అతిథి కదా అని ఊరకున్నాము. మీరు అనుమతిస్తే ఇతన్ని ఒక చేయి చూసేస్తాము!” అన్నారు ఆ కాపలా వీరులు.

“చాలు మీ వీర ప్రలాపాలు! ఆపండి! తమ్ముడూ! నీవేమంటావు?”

“వీరికి అనుమతివ్వండి అనే నేనూ చెప్తున్నాను! నాకూ అనుమతివ్వండి. చోళ వంశ శత్రువులతో పోరాడి చాలా రోజులైంది. చేతులు దురద పెడుతున్నాయి. అంతఃపుర అతిథులతో ఎలా నడుచుకోవలని ఒక పాఠం నేర్పిస్తాను వీరికి!” అన్నాడు మన వీరుడు.

చిన్న పళువేట్టరయ్యర్ నవ్వేసి, “తమ్ముడూ! నీ చేతుల తీట తీర్చుకోవడాన్ని చోళ వంశ శత్రువులతోనే సరిపెట్టుకో! చక్రవర్తి జబ్బుతో ఉన్నప్పుడు కోటలో ఇటువంటి జగడాలు జరగకూడదని ఆజ్ఞ!” అన్నారు.

“అలాగైతే నా బట్టలు, ఆభరణాలను, వస్తువులను వెంటనే తీసుకు వచ్చి ఇవ్వమనండి!”

“ఎక్కడరా అవి?”

“యజమానీ! మీ ఆజ్ఞ ప్రకారం భద్రపరిచి ఉంచాము.”

“దళపతీ! వీరెలా మాట్లాడుతున్నారో చూడండి! కాసేపటికి మునుపు నా బట్టలను చాకలికి వేశామన్నారు. ఇప్పుడు తమరు 'భద్రపరిచి' ఉంచమన్నట్లు చెప్తున్నారు ఇంకాసేపటికి మీకే తస్కరపట్టాన్ని కట్టబెట్టేస్తారు!” అన్నాడు వంతిదేవుడు.

-:-

దళపతి కాపలావాళ్లను చూసి, “దద్దమ్మలారా! ఈ అబ్బాయికి కొత్తబట్టలు ఇవ్వమని మాత్రమే కద చెప్పాను? పాత బట్టలగురించి నేనేమీ చెప్పలేదే? ఈ మూఢులేమో వదరుతున్నారు, తమ్ముడూ! పోతే పోనీ. పాత బట్టల గురించి ఎందుకంత దిగులు పడతావు? వాటిలో ఏమైనా విలువైన వస్తువులను ఉంచావా?” అని అడిగారు దళపతి.

“అవును. దారి ఖర్చులకోసం కొన్ని నాణాలుంచుకొన్నాను...” అని వంతిదేవుడు చెప్పేలోపల, “అందుగురించి నీవు దిగులుపడకు. నీకు దారిఖర్చులకు ఎంత బంగారం కావాలో చెప్పు. అంత నేనిస్తాను!” అన్నారు చిన్న పళువేట్టరయ్యర్.

“దళపతీ! నేను యువరాజు కరికాలన్‌గారి దూతను. ఇంకొకరి ముందు చేయి చాచి డబ్బు తీసుకొనే అలవాటు నాకు లేదు...”

“అలాగైతే, నీ బట్టలను, వాటిలో దాచిపెట్టివున్న నాణ్యాలను నీకు ఒప్పజెప్పిస్తాను. దిగులుపడకు! నీ బట్టల్లో ఇంకేమైనా వస్తువులున్నాయా?”

వల్లవరయ్యన్ ఒక క్షణం ఆలోచించాడు. ఆ తాత్సారాన్ని చిన్న పళువేట్టరయ్యర్ కూడ గమనించారు.

"ఇంకొక ముఖ్యమైన వస్తువుకూడ నా నడుము బట్టలో ఉండాలి. దాన్ని మీ మనుషులు తాకివుండరని భావిస్తాను. తాకివుంటే వారి కథ ముగిసినట్లే...."

"ఆః! నీకెంత కోపం వస్తుంది! ఎక్కడ, ఎవరితో మాట్లాడుతున్నావన్నదే మరిచిపోయావా? చిన్నవాడివని మన్నించేస్తున్నాను. అటువంటి వస్తువేమిటది?"

"దళపతీ! అది చెప్పలేను. అది అంతరంగ విషయం!"

"తంజావూరు కోటలో నాకు తెలియని ఎటువంటి అంతరంగ విషయమూ ఉండడానికి వీల్లేదు!"

"యువరాజు ఆదిత్య కరికాలన్ నాకు ఒప్పజెప్పిన అంతరంగ విషయం."

"యువరాజు ఉత్తరదిశలో మాతండనాయకుడు. ఆయన అధికారం పాలాట్రుకు ఉత్తరంగా మాత్రమే చెల్లుతుంది. ఇక్కడ చక్రవర్తి అధికారమే చెల్లుతుంది."

"దళపతీ! పులిజెండా ఎగిరే చోటల్లా చక్రవర్తి అధికారం చెల్లుతుంది. అందులో సందేహమేమి?"

"అందుకనే, ఈ కోటలో నాకు తెలియకుండా ఏ అంతరంగ విషయమూ ఉండడానికి వీలులేదు అని అంటున్నాను. చక్రవర్తి క్షేమాన్ని ఉద్దేశించే!..."

"దళపతీ! చక్రవర్తిని కంటికి రెప్పలా కాపాడుతున్నందుకు మీకూ, పెద్ద పళువేట్టరయ్యర్‌గారికీ చోళ సామ్రాజ్యం ఎంతో ఋణపడివుంది ఈ రోజు చక్రవర్తి మిమ్మల్ని మెచ్చుకొన్నదికూడ నాచెవిన పడింది. మీకు భయపడే యమధర్మరాజు తంజావూరు కోటలోపల అడుగుపెట్టడానికి జంకుతున్నాడని చక్రవర్తికి అన్నారు కదా? అది ఎంత అర్థపూరితమైన మాట?"

"అవును, తమ్ముడూ! మేము చక్రవర్తిని పళైయారైనుంచి ఇక్కడికి తీసుకువచ్చి గట్టికాపలా అమర్చివుండకపోతే ఎటువంటి విపరీతాలు జరిగివుండేవో తెలియదు. పాండ్యదేశపు కుట్రదారుల లక్ష్యం నెరవేరి ఉండినా ఉండవచ్చు."

"ఆః! మీరుకూడ అలాగే అంటున్నారే! అలాగైతే నేను విన్నది నిజమే అయివుండాలి."

"ఏం విన్నావు?"

"చక్రవర్తికి విరుద్ధంగా ఒక కుట్ర, ఆయన కుమారులకు విరుద్ధంగా ఇంకొక కుట్ర జరుగుతున్నాయని విన్నాను."

-:-

చిన్న పళువేట్టరయ్యర్ తన వజ్ర దంతాలతో పెదవులను కరుచుకొన్నారు. ఈ చిన్నవాడితో మాటలాడ్డంలో ఇంతవరకు తనకే ఓటమి కలిగిందని గ్రహించారు. ఇంచుమించు అతని నిందలన్నిటికీ సంజాయిషీ ఇచ్చే పరిస్థితి వచ్చేసింది! కాబట్టి ఇక మాటలు పెంచక ఇక్కడికే తుంచేయాలని

నిశ్చయించారు.

"నీకెందుకు అందుగురించి దిగులు? అన్ని కుట్రలనూ వమ్ముచేసి చోళవంశాన్ని కాపాడేందుకు మేమున్నాము కద? నీ కోరిక చెప్పు. నీ పాతబట్టలు నీకు కావాలి; అంతేకద?" అన్నారు.

"నా పాతబట్టలూ కావాలి. వాటిలోవున్న వస్తువులూ కావాలి."

"ఏం వస్తువులని నీవింకా చెప్పలేదే?"

"చెప్పేతీరాలంటే ఇదిగో చెప్తున్నాను. దాని బాధ్యత మీది. యువరాజు చక్రవర్తికి ఇవ్వమని ఇచ్చిన తాళపత్రం కాక ఇంకొక పత్రమూ ఇచ్చారు..."

"ఇంకొక పత్రమా? ఎవరికి? నీవు చెప్పనేలేదే!"

"అంతరంగవిషయం కాబట్టి చెప్పలేదు; మీరిప్పుడు అడగడం వల్ల చెప్తున్నాను. పళైయారైలో ఉన్న కుందవైదేవికి యువరాజు ఒక పత్రం ఇచ్చారు!..."

"ఓహో! అలాగైతే రేపు చక్రవర్తి ఇచ్చే ఉత్తరంతీసుకొని నీవు వెంటనే కంచి వెళ్ళలేవన్నమాట. యువరాకుమారికి పత్రం రాయవలసినంత పరిస్థితి ఏం వచ్చిందో?"

"దళపతీ! నేను ఇతరుల పత్రాలను విప్పి చదివేవాడిని కాను. చక్రవర్తికి పంపించిన సందేశాన్ని చదివినట్లు దీన్నికూడ మీరు చదవడంలో నాకభ్యంతరంలేదు. ఆ బాధ్యత మీది. నాబట్టలతోబాటు వున్న బంగారమూ, తాళపత్రమూ నాకు తిరిగివస్తే చాలు."

"అందుగురించి భయపడవద్దు. నేనే చూసి తీసుకువస్తాను." అని చిన్న పళువేట్టరయ్యర్ ముందుకు నడిచారు. ఆయన వెంట వంతిదేవుడూ వెళ్ళాడు. అది గమనించిన కోట దళపతి కళ్ళతో సైగ చేసిన వెంటనే శూలాలు పట్టుకొన్న ఐదారు వీరులు ముందుకువచ్చి వాకిలికడ్డంగా నిలబడ్డారు. వారితో పోట్లాడి ప్రయోజనంలేదని గ్రహించి వంతిదేవుడు అక్కడే నిలబడిపోయాడు.

కాసేపటికల్లా చిన్న పళువేట్టరయ్యర్ తిరిగివచ్చారు. ఆయన వెనక ఒక భటుడు ఒక పళ్ళెంలో చీరె-సారెలు తీసుకువచ్చేటట్లు వంతిదేవుని పాతబట్టలను తీసుకువచ్చాడు.

"ఇదిగో తమ్ముడూ, నీ పాతబట్టలు. భద్రంగావున్నాయి. బాగా పరిశోధించి చూసుకో!" అన్నారు కోట దళపతి.

ఆవిధంగానే వంతిదేవుడు వాటిని పరిశోధించి చూసుకొన్నాడు. తాను తన నడుము బట్టలో ఉంచిన వస్తువులకన్న ఎక్కువే వున్నాయి. కుందవైదేవికి ఇవ్వవలసిన తాళపత్రమూ ఉంది. ఎక్కువ నాణాలెలా వచ్చాయి? మునుపు తాను వెతికి చూసినప్పుడు లేని పత్రం ఇప్పుడెలా వచ్చింది? చిన్న పళువేట్టరయ్యర్‌గారికి అది దొరికివుండాలి. దాన్ని చూసేసి తృప్తిపడేఇప్పుడాయన దాన్ని మళ్ళీ తనకు

తిరిగి ఇచ్చేస్తున్నారు కాబోలు! ఎందుకిలా చేశారు? నాణాలెందుకు ఎక్కువ చేర్చిపెట్టారు? మాచెడ్డవారీయన! తనను శోధింపబోతారో, ఏమో! ఈయన దగ్గర తాను చాల జాగ్రతగా మసులుకోవాలి. ఏమారకూడదు!

"అన్నీ సరిగ్గా ఉన్నాయా, తమ్ముడూ? నీవు తెచ్చుకొన్న బంగారు నాణాలు, వస్తువులన్నీ?" అని అడిగారు.

"ఇదిగో చూసి చెప్తాను" అని చెప్పి వంతిదేవుడు బంగారు నాణాలను ఎంచి చూశాడు. ఎక్కువగా వున్నవాటిని తీసి పళువేట్టరయ్యర్ ముందు పెట్టి, "దళపతీ! వాణర్ కులంలో పుట్టినవాడిని నేను. ఆదిత్య కరికాలన్‌గారి దూతను. ఇంకొకరి డబ్బుకు ఆశపడేవాడిని కాను!" అన్నాడు.

"నీ ఋజు ప్రవర్తనను మెచ్చుకొంటున్నాను. ఐనప్పటికీ నీ దారిఖర్చులకు ఈ నాణాలను పెట్టుకోవచ్చు! ఎప్పుడు బయల్దేరాలని కోరుకొంటున్నావు? ఈ రోజే బయల్దేరుతున్నావా? లేక ఈ రోజు విశ్రాంతి తీసుకొని రేపు పెద్దాయనను కూడ చూసి మాట్లాడేసి వెళ్తావా?" అని అడిగారు కోట దళపతి.

"తప్పక ఈరోజు ఇక్కడే విడిదిచేసి రేపు పెద్ద పళువేట్టరయ్యర్‌గారిని చూసేసే వెళ్ళాలని అనుకొంటున్నాను. కానీ మీ మనుషులకు కాస్త చెప్పివుంచండి, నా వస్తువులపైన చేయి వేయవద్దని!" - అని ఇలా చెప్తూనే ఎక్కువగా వున్న నాణాలనుకూడ తీసుకొని తన నడుం బట్టలో చుట్టిపెట్టుకొన్నాడు.

"చాల సంతోషం. ఇక్కడ ఇక నీకెటువంటి ఇబ్బందులుకూడ కలగవు. నీకేమి కావాలో ధారాళంగా అడిగి తీసుకోవచ్చు!"

"దళపతీ! ఈ తంజావూరు నగరాన్ని చూడాలని ఉంది. చూడవచ్చుకద?"

"ధారాళంగా చూడవచ్చు. ఇదిగో వీరిద్దరు నీవెంటవచ్చి కోటలోపల అన్నిప్రదేశాలనూ చూపిస్తారు. కోట బయట మాత్రం వెళ్ళవద్దు. సాయంకాలం కోట వాకిళ్ళు మూసేస్తారు! బయటకు వెళితే మళ్ళీ లోపల రాలేవు కోట లోపల నీ ఇష్టం వచ్చినట్లు తిరిగి చూడవచ్చు!" - ఇలా చెప్పి చిన్న పళువేట్టరయ్యర్ ఇద్దరు కొత్తవాళ్ళను తనదగ్గరకు రమ్మని వారికేదో చెప్పారు. వారు చెప్పింది ఏమైవుండవచ్చని వంతిదేవుడు ఊహించుకోగలిగాడు.

~~~
~~~

# అధ్యాయము - 33

## చెట్టుపైన ఒక వనిత!

**కోట దళపతి** పంపిన మనుషులిద్దరు తన రెండువైపుల తనవెంట రాగా వంతిదేవుడు తంజావూరు కోటను చూడ బయలుదేరాడు . తాను తప్పించుకొని పారిపోకుండ చూసుకొనేందుకే వారిద్దరు తనవెంట వస్తున్నారన్నది అతనికి నిస్సందేహంగా తెలిసిపోయింది . కోటవాకిలి గుండా ఎవరినీ బయటకు పంపించకుండ చూసుకోవాలని ఆజ్ఞాపించివున్నారన్న విషయంకూడ సందేహదూరం . కానీ అతడు చీకటిపడేలోపు కోటనుంచి తప్పించుకొనే తీరాలి . పెద్ద పళువేట్టరయ్యర్ వచ్చేస్తే తర్వాత తప్పించుకోవడం అసాధ్యం ; బతికి బయటపడ్డమే అసాధ్యం కావచ్చు !

అందుకే, వంతిదేవుడు కోటలో అటూఇటూ తిరుగాడుతూ వింతలూ, విశేషాలూ చూస్తున్నప్పుడు అతని మనసు మాత్రం తప్పించుకొనే దారి వెతకసాగింది. మొదట ఈ యమకింకరులనుంచి తప్పుకోవాలి. తర్వాత కోటనుంచి బయటపడాలి. కానీ అదే ఎలా అని తెలియడంలేదు!

ఈ ఇద్దరినుంచి తప్పించుకోవడం అంత కష్టమేమీ కాదు. ఇద్దరినీ రెండుదెబ్బలతో పడగొట్టి పారిపోవచ్చు. కానీ ఎక్కడికి పారిపోవడం? ఈ తంజావూరు కోటను పళువేట్టరయ్యర్లు ఎంత బలిష్టంగా కట్టివున్నారనేది దేశమంతా తెలిసిన విషయమే. వారి అనుమతిలేక కోటలోపలికి గాలికూడ చొరబడదని ప్రజలంటారు. యముడు కూడ కోటలోపలికి రాలేడని ఈరోజు పొద్దున చక్రవర్తి చెప్పారు! అటువంటి కోటనుంచి ఎలా తప్పించుకోవడం? వీరిద్దరినీ తాకడం ఆలస్యం; వెంటనే వారు కేకలేయడం మొదలుపెడతారు. మరుక్షణం తాను పాతాళచెరసాలకు వెళ్ళితీరుతాడు. లేక ప్రాణాలులొదలవలసి వస్తుంది. వీరిపైబడి కొట్టడంలో ప్రయోజనంలేదు. యుక్తితోనే తప్పించుకోవాలి. అలా తప్పించుకొన్న వెంటనే కోటనుంచి బయటపడే దారి చూసుకోవాలి. ఈ కోట ఎంత బలమైనదైనా ఒక రహస్య సొరంగ మార్గం ఉండకపోదు. దాన్ని ఎలా కనిపెట్టడం? అది ఎవరికి తెలిసివుంటుంది? తెలిసినవారెవరైనా ఉన్నా కూడ, తనకు చెప్తారా?

ఇలా చాల విధాలుగా ఆలోచిస్తూ నడుస్తూ వెళ్తున్నప్పుడు, ఉన్నట్లుండి పళువూర్ యువరాణి గుర్తుకు వచ్చింది. ఆహా! ఈ కోటలో తనకు సహాయంచేసేవారెవరైనా ఉంటే అది ఆ రాణి ఒక్కతే. అది కూడ సందేహమే. కానీ, ఆళ్వార్ కట్టియాన్ పేరుచెప్పి ఏదైనా యుక్తి పన్ని ప్రయత్నించవచ్చు. అంతకు ముందు, పెద్ద పళువేట్టరయ్యర్ అంతఃపురాన్ని కనిపెట్టాలి. కనిపెట్టి తానా అంతఃపురంలో రాణిని చూసేందుకు వెళ్తున్నానని ఈ వెధవలకు తెలియకూడదు. తెలిస్తే వెళ్ళి చిన్న పళువేట్టరయ్యర్‌కి చెప్పేస్తారు. అందునుంచి ఏమేం విపరీతాలు జరుగుతాయో, ఎవరికి తెలుసు? ఒకవేళ తాను అంతఃపురంలో ఉన్నప్పుడు ఆయనే

వచ్చేస్తే ఏం చేయాలి??? సింహపు గుహలో తమకు తామే వెళ్ళి తలదూర్చినట్లవుతుంది కద?

-:-

వంతిదేవుని బుద్ధి పాదరసంలా పరుగెడుతున్నప్పుడు  అతని నోరూ, కళ్ళూ ఊరుకోలేదు. వెంట వస్తున్న ఆ భటులను, “అదేమి?”, “ఇదేమి?”, “అదెవ్వరి భవనం?”, “ఇదెవ్వరి మాళిగ?” “ఇదేం కట్టడం?”, “అదేం గోపురం?” అని అతని నోరడుగుతూనే ఉంది. చెవులు, “ఇది పెద్ద పళువేట్టరయ్యర్ భవనం", లేదా "ఇది పళువూర్ రాణి అంతఃపురం" అని జవాబు వస్తుందా అని రిక్కించి వినసాగాయి. అతని కళ్ళో, అన్ని వైపులా శ్రద్ధగా గమనించసాగాయి. అలా చూస్తూ వెళ్తున్నప్పుడు, అతని కళ్ళగుండా ఒక విషయం అతని మదిలో పదిలమైంది. కోట ప్రధాన వీధులు విశాలంగాను, జనాలతో సందడిగాను ఉన్నా, పక్కన సందుగొందులు చాలానే ఉన్నాయి. చెట్లు బాగా పెరిగిన తోటలు చాలా ఉన్నాయి. ఆ సందుగొందుల గుండా పారిపోయి ఆ చెట్లలో దాక్కుంటే ఎవరికీ కనిపించం. ఒకటి రెండు రోజులు మరుగ్గా ఉండడంకూడ సాధ్యమే. కానీ, ఎవరూ చూడనప్పుడు వెళ్ళి దాక్కోవాలి; ఎవరూ వెతకకుండా ఉండాలి. చిన్న పళువేట్టరయ్యర్ తన అపారమైన దండును తనను వెతికేందుకు పురిగొల్పి వదిలితే, దాగివుండడం అసాధ్యమైపోతుంది. లేదా, ఎవరింటిలోపలైనా దూరి, ఆశ్రయం కోరాలి. తంజావూరు కోటలో తనకు అలా తెలిసినవారు ఎవరున్నారు? పళువూర్ రాణి అలా ఆశ్రయమిస్తే ఇచ్చినట్లు. లేకుంటే లేదు. తన కల్పనాశక్తినంతా ఉపయోగించి, కట్టుకథలు చెప్పి ఆమెను నమ్మించాలి. అంతకు ముందు వీళ్ళనుంచి తప్పించుకొని జారుకోవాలి....

ఆహా! ఇదేమి ఘోష? ఇదేమి ఆర్భాటం? - ఓ! గుంపులు గుంపులుగా ఇంతమంది వెళ్తున్నారే, వీరంతా ఎవరు? భవవంతుడు నా వైపున్నాడనడంలో సందేహంలేదు! ఈ సందడిని చూస్తుంటే ఒక మంచి ఉపాయం  తడుతోంది.

ఒక పక్కవీధి మలుపుకు రాగానే ప్రధానవీధిలో ఒక పెద్ద గుంపు వాద్యఘోష, జయఘోషలతో వెళ్తుండడాన్ని చూసి వంతిదేవునికి పైన చెప్పిన అలోచనలు వచ్చాయి. ఆ గుంపులో వెళ్తున్నవారు వేళక్కార దండు అని తెలుసుకొన్నాడు. అలవాటు ప్రకారం మహారాజును దర్శించుకొని తిరిగివెళ్తున్నారు కాబోలు! ఆ గుంపులో తానూ చేరుకొంటే?.... తప్పించుకోవడానికి  దీనికన్న మంచి ఉపాయం ఏది?

వెంటవస్తున్న కాపలావాళ్ళు తనను అంత సులభంగా వదిలిపెట్టేయరు. తాను గుంపులో దూరితే, వాళ్లుకూడ వెన్నంటి వస్తారు. కోట వాకిలి గుండా బయటపడ్డంకూడ అంత తేలికకాదు! కోట వాకిలి కాపలావాళ్ళను అంత సులభంగా ఏమార్చలేం కద? తనను పట్టుకొని ఆపేయరా? కానీ ఒకసారి ప్రయత్నించి చూడాల్సిందే. వేరే దారిలేదు. దేవుడే కల్పించిన ఈ సదవకాశాన్ని ఉపయోగించుకోకపోతే తన వంటి దద్దమ్మ ఇంకొకరుండరు!

అలవాటు ప్రకారం తన వెంట వస్తున్న కాపలావాళ్లను, “ఇదేం గుంపు?” అని అడిగాడు వంతిదేవుడు. “వేళక్కార దండు" అని వారు చెప్పిన వెంటనే, ఆ దండు గురించిన వివరాలడగసాగాడు. అటువంటి వీరులదండులో చేరడానికి తాను ఇష్టపడుతున్నట్లు, అందుకోసం దగ్గరికి వెళ్ళి చూడాలని ఉందని చెప్పాడు. ఇలా మాట్లాడుతూనే ఆ దండును సమీపించసాగాడు. కాసేపటి తర్వాత, “ముందు తప్పెట, డోలు వాయిస్తున్నవారిని చూడాలి" అని చెప్తూనే ఆ దండులో దూరాడు.

గుంపు ముందుకు పోగా పోగా, ఇతనూ ఒకే చోట నిలబడక ముందుకూ, వెనక్కూ, అటూ, ఇటూ నడవసాగాడు. వేళక్కార వీరులకన్న అధికంగా ఘోషించసాగాడు. వారిలో కొందరు అతన్ని గుచ్చి గుచ్చి చూడసాగారు. “ఎవడీ పిచ్చివాడు?” అన్న భావంతో కొందరు చూశారు. “మితిమీరి మధుపానం చేసినట్లున్నాడు!” అన్న భావంతో ఇంకొందరు చూశారు. కానీ వారెవరూ అతన్ని అడ్డగించడానికి గాని, గుంపునుంచి బయటికి పంపించడానికి గాని ప్రయత్నించలేదు.

అతనితో వచ్చిన చిన్న పళువేట్టరయ్యర్ మనుషులు వేళక్కార దండులో దూరేందుకు ధైర్యంచేయలేదు. “ఎలాగూ వాడు బయటకు వచ్చే తీరాలి. అప్పుడు మళ్ళీ పట్టుకొందాం" అన్న నమ్మకంతో వేళక్కార దండుకు కాస్త పక్కగా తొలగి నడవసాగారు.

అప్పుడు వీధిలో ఎదుటివైపునుంచి  వస్తున్న ఒక పెరుగమ్మి వేళక్కార దండుకు దారినిచ్చి పక్కసందులో ఒదిగి నిలబడింది. ఆ వీరులలో ఒకడు, “అమ్మా! దాహమేస్తోంది. కాస్త పెరుగిస్తావా?” అని అడిగాడు. ఆ అమ్మి దుడుకుగా, “పెరుగు లేదు; కావాలంటే రెండు చెంపదెబ్బలిస్తాను!” అంది.

అది విన్న ఒక వీరుడు, “ఓహో! అదే ఇచ్చేసి పో!” అని ఆమెను సమీపించసాగాడు. పెరుగమ్మి భయపడి పరుగెత్తింది. వీరుడు ఆమెను వెన్నంటి పరుగెత్తాడు. అతన్ని పట్టుకురావడానికి  మరిద్దరు వీరులు పరుగెత్తారు. పరుగెత్తినవారు తలకొకరకంగా కేకలు వేస్తూ పరుగెత్తడంతో విషయమేమని ఎవరికీ తెలియలేదు. ఏదో తమాషా అని మాత్రం అందరూ అనుకొన్నారు.

ఇదంతా చూస్తూ నిలబడ్డాడు వంతిదేవుడు. ఆ ఒక్క క్షణంలో ఒక తీర్మానానికి వచ్చాడు. తీర్మానం తీసుకోవడం, దాన్ని కార్యరూపంలో అమలుచేయడమూ వంతిదేవునికి ఒకటే అని మనం చాల సార్లు ఇప్పటికే గమనించివున్నాము. తీర్మానించిన తర్వాత ఆలస్యం చేయడం అతని ప్రకృతికే విరుద్ధం. కాబట్టి, “పరుగెత్తు! పరుగెత్తు!”, “పట్టుకో! పట్టుకో!” అని కేకలేస్తూనే పెరుగమ్మిని తరుముకొంటూ వెళ్ళినవారి వెంట తానూ పరుగెత్తాడు. ఆమె కాస్తదూరం పరుగెత్తిన తర్వాత ఒక సన్నటి ఇరుకైన సందులోకి తిరిగింది. వెన్నంటి పరుగెత్తివచ్చినవారు ఆ సందులోకి వెళ్ళిచూసినప్పుడు ఆమె కనిపించలేదు. మాయమై మరుగైపోయింది! తరుముకొంటూ వచ్చిన వీరులుకూడ ఆమె గురించి తర్వాత పట్టించుకోలేదు. తిరిగివెళ్ళిపోయారు. వంతిదేవుడేమో ఆమె వెళ్ళిన అదే సందులో దూరి ఇంకొంచెం

ముందుకు పరుగెత్తాడు. ఇంకా రెండుమూడు సందులు దాటిన తర్వాతే పరుగును ఆపి మెల్లగా నడకసాగించాడు.

. -:-

వేళక్కార దండు సాధారణంగా కోటనుంచి బయటకు రావడం సూర్యాస్తమయ సమయం కద? వంతిదేవుడు దూరిన సందుల్లో అప్పటికే చీకటి కమ్ముకొంది. కొన్నిచోట్ల రెండువైపుల ఎత్తైన ప్రాకారపు గోడలుకూడ ఉన్నాయి. కొన్ని చోట్ల దట్టంగా పెరిగిన చెట్లు, పొదలే కంచెలా వున్నాయి. వంతిదేవుడు ఎక్కడా ఆగక వెళ్తూనే ఉన్నాడు. వెళ్ళే దిక్కుగురించి అతను దిగులు పడలేదు. ఈ సందుగొందులగుండా వెళ్తే చివరికి కోటగోడను చేరే తీరుతాము. తర్వాత ఏం చేయాలన్నది అప్పుడాలోచించుకోవచ్చు. ఆలోచించి ఉపాయం కనిపెట్టడానికి రాత్రంతా ఉందికద?

కాసేపటికల్లా బాగా చీకటిపడింది. అతను వెళ్ళిన బాట చివరికి ఒక ప్రాకారపుగోడలో ముగిసింది. చిమ్మచీకటిలో వచ్చిన వంతిదేవుడు ఆగోడకు మెత్తగా గుద్దుకొన్నాడు. గోడ అని మాత్రం తెలిసింది. అది ఏం గోడ, ఎంత ఎత్తువుంది అన్నదేమీ తెలియలేదు. బహుశా అది కోట గోడే కావచ్చు. అదే నిజమైతే ఇక్కడే కూర్చోవడమే సరి. కాసేపటికల్లా చంద్రుడు ఉదయిస్తాడు. అప్పుడు చూసి తెలుసుకోవచ్చు. అప్పటిదాక దాక్కొనివుండడానికి ఇంతకన్న మంచి తావు దొరకదు. ఇప్పటికి చిన్న పళువేట్టరయ్యర్‌గారి మనుషులు తిరిగి వెళ్ళిపోయివుంటారు. కోట దళపతి తన మనుషులను నాలుగు దిక్కులకు తనను వెతికేందుకు పంపించి ఉంటారు. ఒకవేళ తాను వేళక్కార దండుతో కోట బయటకు వెళ్ళిపోయివుంటానని కూడ సందేహించవచ్చు. అలాగైతే  కోట లోపలమాత్రమే కాక, బయటకూడ తనను వెతుకుతుంటారు. వెతకనీ, వెతకనీ; బాగా వెతకనీ. వారందరినీ ఏమార్చేసి ఈ కోటనుంచి తాను తప్పించుకోక పోతే తాను వాణర్ కులంవాడినే కాను! నా పేరు వంతిదేవుడే కాదు!

కానీ వెన్నెల కాయడం మొదలుపెడితే పళువేట్టరయ్యర్ మనుషులకు కూడ తనను వెతకడం చాల సులభమైపోతుంది. ఇక్కడికే వచ్చేయవచ్చుకూడ. వస్తే రానీ; ధారాళంగా రానీ. ఈ దట్టమైన తోపులో తనను వెతికిపట్టడం వారికి సాధ్యమౌతుందా?

ఇలా ఆలోచిస్తూనే వంతిదేవుడు ఆ గోడకానుకొని కూర్చొన్నాడు. వయసులో ఉన్నవాడైనా, రోజంతా తిరిగి అలిసిపోయి ఉండడంవల్ల నిద్రముంచుకొచ్చింది. గాలికి చెట్ల కొమ్మలు రాసుకొని చేస్తున్న శబ్దం జోలపాటలాగ అతన్ని జోకొట్టసాగింది. అలాగే నిద్రలోకి జారిపోయాడు.

అతను మెలకువ వచ్చి లేచి చూసేటప్పటికి  చంద్రుడు కాస్తపైకి వచ్చేశాడు. దట్టమైన చెట్ల కొమ్మల మధ్యనుంచి నేలపైన పడుతున్న వెన్నెలలో తన చుట్టుపక్కల పరిసరాలను ఇప్పుడు  కాస్త చూడగలిగాడు. తన పరిస్థితేమని వంతిదేవుడు జ్ఞాపకం చేసుకొన్నాడు. గోడకానుకొని తాను నిద్రలోకి

జారిపోవడం అతనికాశ్చర్యం కలిగించింది. దానికన్నా ఆశ్చర్యం తనకు నిద్ర పోయి మెలకువ రావడం. అందుకు కారణమేమి? ఏదో ఒక గొంతు విన్పిస్తోందే? అది మానవ స్వరమేనా? లేక మృగానిదా? లేక రాత్రి మెలకువగా ఉండే పక్షిదా? - అసలు ఏదో ఒక గొంతు విన్పించింది నిజమేనా?

-:-

వంతిదేవుడు తలెత్తి చూశాడు. మసక వెన్నెలలో నిటారైన గోడ కనిపించింది. ఆఁ! ఇది కోట గోడ కావడానికి వీల్లేదు. కోట గోడ ఇంకా ఎత్తుగా ఉంటుంది. ఒకవేళ కోట బయటి గోడ లోపల ఇంకొక చిన్న గోడ ఉందా? లేక ప్రధానవీధిలో వున్న ఒక భవనం లేదా అంతఃపురపు గోడ కావచ్చా?

అలా తలెత్తి పైకి చూస్తూనే వంతిదేవుడు లేచి నిలబడ్డాడు. ఒక్క క్షణం అతని గుండె కొట్టుకోవడం నిలిచిపోయింది. పేగులు గొంతుకొచ్చినట్లైంది. అతను చూసిన దృశ్యం అంత భీతిగొలిపిందతనికి. ఆ గోడపైన వంగివున్న చెట్టుకొమ్మపైనున్నదేమి? దెయ్యమా? పిశాచా? చెట్లలో వసించే దెయ్యాలు, పిశాచాల గురించి అతను విన్నదంతా ఒక్కసారిగా గుర్తుకు వచ్చింది.

కానీ బేతాళం మాట్లాడుతుందా? మనుష్యస్వరంతో మాట్లాడుతుందా? అదీ ఆడగొంతు? ఈ బేతాళం అలా మాట్లాడుతుందేమి? ఏమంటుందో విందాం!

“ఏమయ్యా! గోడకానుకొని నిద్రలోకి జారిపోయావే? ఎన్ని సార్లు పిలవడం?”

ఆఁ! ఇది బేతాళం కాదు. మనుష్యవంశపు స్త్రీనే మాట్లాడుతోంది. చెట్టుకొమ్మపైనున్నది ఒక స్త్రీనే! ఇదేమి కలా? నిజమా?

“బాగుంది! ఇంకా నిద్రవీడలేదు కాబోలు. ఇదిగో నిచ్చెన వేశాను. జాగ్రతగా ఎక్కి రా! కింద పడిపోవద్దు!”

ఇలా చెప్తూనే ఆమె ఒక నిచ్చెనను తీసి కిందికి జార్చి, గోడ వారగా పెట్టింది.

వంతిదేవునికి ఏమీ అర్థంకాలేదు! కానీ ఇంత మంచి అవకాశాన్ని, తనను వెతుక్కుంటూ వచ్చిన సదవకాశాన్ని అతను వదిలేస్తాడా?

వచ్చేది రానీ; తర్వాత జరిగేది జరగనీ. ఇప్పుడు నిచ్చెనెక్కుదాం. గోడపైభాగం చేరిన తర్వాత మిగిలిన వివరాలు అడిగి తెలుసుకొందాం.

నిచ్చెన ముప్పావు భాగం ఎక్కిన తర్వాత, ఆ స్త్రీ మళ్ళీ, “చాల సోమరి నీవు! అక్కడ యువరాణి అమ్మగారు కాచుకొనివున్నారు.. ఇక్కడ నీవేమో గోడకానుకొని నిద్రపోతున్నావు!” అన్నది. అప్పుడు కలిగిన గగుర్పాటుకు/ఉలికిపాటుకు వంతిదేవుడు నిచ్చెన మీదినుంచి ఇంచుమించు జారి పడిపోయాడు. మంచివేళగా, అక్కడే గోడనుంచి పొడుచుకొచ్చిన ఒక రాయిని పట్టుకొని

నిలదొక్కుకొన్నాడు.

యువరాణి అంటే, పళువూర్ యువరాణే అయివుండాలి! తాను ఇక్కడ వచ్చి కూర్చొన్నది ఆమెకెలా తెలిసింది? ఆమెకేదో మంత్రశక్తి ఉండాలి! తనను చూడడంలో ఆమెకు ఇంత శ్రద్ధ ఎందుకో? ఒక వేళ, - ఒక వేళ – ఎవనికోసమో పెట్టిన నిచ్చెన తానెక్కేశాడా? ఏదేమైనా కానీ, ముందుకు వేసిన అడుగు వెనక్కు తీయడం అసాధ్యం! అంతా ఇంకాసేపట్లో తెలిసిపోతుంది.

గోడ పైభాగం దగ్గరకు చేరిన వెంటనే ఆ స్త్రీ వంతిదేవుని చేయిపట్టి పైకి లాగింది. అప్పుడు వెన్నెల ఆమె ముఖంపైన పడింది. ఇంతసేపటికి ఆశ్చర్యపడే శక్తినే కోల్పోయాడు వంతిదేవుడు. అందుకే ఆ స్త్రీ వేళక్కార వీరులు తరుముకొని వచ్చిన పెరుగమ్మిలాగ  కనిపించినా గోడపైనుంచి జారి పడిపోలేదు. ఈ రాత్రి ఇంతకన్న పెద్ద పెద్ద వింతలు జరిగినా దిగ్భ్రమ పడేందుకు తావేలేదు!

“ఊఁ! ఇంకా ఎందుకు కళ్ళప్పగించి చూస్తూ నిలబడ్డావు? నిచ్చెనను తీసి లోపల పడేసి దూకు వేగంగా!” అని చెప్తూనే ఆమె బిరబిరా చెట్టుపైనుంచి దిగింది.

వంతిదేవుడు ఆమె చెప్పినట్లే చేశాడు. అతను దిగిన చోటు ఒక విశాలమైన తోట అని తెలిసింది. కాస్త దూరంలో ఒక అంత:పురం గోపురాలు, వాటి శిఖరాలు మసక వెన్నెలలో స్వప్నలోకపు దృశ్యాలలాగ కన్పించాయి.

అది ఎవరి అంతఃపురమని అడిగేందుకు వంతిదేవుడు గొంతు సవరించుకొన్నాడు. వెంటనే ఆ వనిత, “ష్!” అంటూ పెదవులపైన వేలుంచి హెచ్చరిస్తూ ముందుకు నడిచింది. వంతిదేవుడు ఆమె వెనకే వెళ్ళాడు.

~~~
~~~

# అధ్యాయము - 34

## లతా మంటపం

**దట్టమైన** మామిడితోపు పక్కగా వెళ్తున్న ఒక సన్నటి కాలిబాట వెంబడి ఆ స్త్రీ వడివడిగా నడిచివెళ్ళగా వంతిదేవుడు కూడ ఆమె వెన్నంటే వేగంగా వెళ్లాడు. ఆ చీకటిలో చెట్లకు గుద్దుకోకుండా చూసుకొంటూ వెళ్ళడం అతనికి కష్టంగానే ఉంది. ఒకసారి ఒక చెట్టుకు గుద్దుకోకుండా తప్పుకొని కాస్త జంకుతూ నిలబడ్డప్పుడు, "ఏం, దారి మరిచిపోయావా? నీకు చీకటిలో కూడ కళ్ళు కనిపించే మనిషివి కద?" అన్నది. అందుకు బదులుగా వంతిదేవుడు పెదవులపై వేలుంచి, ఆమె ఇంతకు మునుపు అన్నట్లే, "ష్!" అన్నాడు. అదే సమయంలో గోడకవతల ఏదో శబ్దం వినిపించింది. మనుష్య సంచారంలాగ ధ్వనించింది. తర్వాత మళ్ళీ ఇద్దరూ ముందుకు సాగారు. వల్లవరయ్యన్ మెల్లగా నవ్వాడు. ఆ స్త్రీ తిరిగిచూసి, "దేన్ని చూసి నవ్వావు?" అన్నది.

"చూసి నవ్వలేదు. విని నవ్వాను!" అన్నాడు వంతిదేవుడు.

"అంటే..."

"నన్ను వెతుక్కొంటూ వచ్చిన వారి కాలి చప్పుడు కాసేపటి క్రితం నీవు వినలేదా? వారు ఏమారిపోయిన విషయాన్ని తలుచుకొని నవ్వాను!"

ఆమె కాస్త భయపడి, "నిన్ను ఎవరైనా వెతుక్కొంటూ వస్తున్నారా, ఏమి? ఎందుకని?" అన్నది.

"లేకపోతే ఈ చిమ్మచీకటిలో వచ్చి ఎందుకు ఈ ప్రాకారపుగోడకు గుద్దుకొని కూర్చోవాల్సి వచ్చేది?"

అదే సమయంలో గాలికి కొన్ని చెట్టుకొమ్మలు ఆడడంతో వెన్నెల అతని ముఖంపైన పడింది.

"ఏమలా చూస్తున్నావు?" అని అడిగాడు.

"నీవు నీవేనా అని చూశాను!"

"నేను, నేనే; లేకపోతే ఇంకెవరై ఉండేవాడిని?"

"పోయిన సారి వచ్చినప్పుడు నీకు పెద్ద మీసం ఉండేది కదా!"

"భలే ప్రశ్న అడిగావు! నాలాగ గోడదూకి వచ్చేవాడు తరచూ వేషం మార్చకపోతే ఎలా?"

"ఇంతకు మునుపటికన్న ఇప్పుడు ఇంకా యవ్వనంగా కనిపిస్తున్నావే?"

“ఉత్సాహం ఉన్నప్పుడు యవ్వనంగానే కద ఉంటాము?”

“అలా నీకేమి ఉత్సాహమిచ్చింది?”

“మీ మహారాణి దయ ఉన్నప్పుడు ఉత్సాహానికేమి కొరత!”

“పరిహాసం చేయవద్దు. ఈరోజు మా యజమాని యువరాణే. కానీ ఒకరోజు తప్పక మహారాణి కాకపోదు!”

“అదే నేనూ చెప్తున్నాను.”

“ఇదేనా చెప్తావు? నీ మంత్రశక్తినుంచే మహారాణి అయ్యింది అని కూడ చెప్తావు! అర్ధరాజ్యాన్ని ఇమ్మని కూడ అడగగలవు!”

వంతిదేవుడు, తెలుసుకోగోరిన విషయాన్ని ఒకసారి తెలుసుకొన్నాడు. తర్వాత అతనేమీ మాట్లాడలేదు. తీవ్రంగా ఆలోచిస్తూ ముందుకు సాగాడు.

తాను కలవబోయేది ఎవరిని? పళువూర్ యువరాణి కావచ్చు. లేదా మధురాంతక దేవరిని పెళ్ళాడిన చిన్న పళువేట్టరయ్యర్‌గారి కుమార్తె కావచ్చు. తనను మంత్రవాది[5] అని భావించి ఆ స్త్రీ పిలుచుకువెళుతోంది. ఆ 'యువరాణి' ఎవరైవున్నా, ఆమెతో ఎలా నడుచుకోవాలి? - మనసా! ధైర్యాన్ని కోల్పోకు! ధైర్యం ఉన్నంతవరకు విజయం మనవైపే ఉంటుంది! సమయానికి ఏదైనా యుక్తి తట్టకపోదు! ఇదివరకు ఏ ఇక్కట్టైన పరిస్థితిలోకూడ ఓడిపోలేదు. ఇప్పుడొక ఆడపిల్ల చేతిలోనా ఓడిపోతాము?

-:-

వారొక పెద్ద మాళిగను సమీపించారు. కానీ ఆ మాళిగ ముఖద్వారం వైపు వెళ్ళలేదు. వెనక ఉన్న వాకిలివైపుకూడ వెళ్ళలేదు. అంతఃపురానికి ఒక పక్కగా తోటలోపలవున్న ఒక శృంగార లతా మంటపంవైపు నడిచారు. ఇంకా దగ్గరికి వెళ్ళగా, ఆ లతామంటపం రెండు పెద్ద బ్రహ్మాండమైన మాళిగలను కలిపే ఒక బాటలాగ కనిపించింది. అలా ఒక్కటిగా చేర్చబడ్డ మాళిగలు ఒక విషయంలో భిన్నంగా కనిపించాయి. కుడివైపు ఉన్న మాళిగలోపల వెలిగించి ఉన్న అనేక దీపాలకాంతివల్ల అది దేదీప్యమానంగా వెలుగుతోంది. లోపలినుంచి గలగలమని శబ్దాలు కూడ వినవచ్చాయి. ఎడమవైపున్న మాళిగేమో ఒక్క దీపమూ లేక చీకటి గుయ్యారంలా అగుపించింది. వెన్నెల కాంతిలో దాని బయటి గోడలు పాతబడి వికారంగా కనిపించాయి. లోపల చీకటి, నిశ్శబ్దమూ గూడు కట్టుకొన్నాయి.

వంతిదేవుని పిలుచుకొని వచ్చిన స్త్రీ, వారు లతామంటపాన్ని సమీపించిన వెంటనే అతన్ని అక్కడే ఉండమని సైగతో చెప్పింది. అతనూ అలాగే చేశాడు. అలా నిలబడ్డప్పుడే అతను అక్కడ చుట్టూ

5 మంత్రవాది = మాంత్రికుడు

ఉన్న పూల సువాసనను గ్రహించగలిగాడు. ఆహా! ఏమీ సువాసన! తల తిరిగేటట్లు చేస్తోంది కద!

ఆ స్త్రీ లతామంటమం లోపలికి వెళ్ళిన వెంటనే ఆమె గొంతూ, ఇంకొక ఇంపైన ఆడగొంతూ వినిపించాయి. "వెంటనే రమ్మని చెప్పు! అడగడమెందుకు? నేనింతసేపూ వేచివున్నానని తెలుసుకద!" అన్న మాటలు అతనికి మైకాన్ని కలుగజేశాయి. ఆ గొంతు పళువూర్ యువరాణి గొంతే! సందేహంలేదు! ఇంకొక్క క్షణంలో ఆమె ముందు వెళ్ళి నిలబడబోతున్నాం.. అప్పుడు జరగబోయే సంఘటనలను సంభాళించగలమా? ఎదురుచూసిన మంత్రవాదికి/మాంత్రికునికి బదులు తన పల్లకిమీద గుర్రాన్ని గుద్దిన మనిషి వచ్చి నిలబడితే ఆమె ఎలా ప్రతి స్పందిస్తుంది? ఆశ్చర్యపడుతుందా? కోపోద్రిక్తురాలౌతుందా? లేక, సంతసిస్తుందా? అదేమీ లేక ఏ భావాలనూ బయటికి చూపించక తనతో సాధారణంగా ప్రవర్తిస్తుందా?

అతణ్ణి పిలుచుకొని వచ్చిన స్త్రీ లతామంటపపు వాకిలిలో నిలబడి రమ్మని సైగ చేసింది.

వంతిదేవుడు అదే విధంగా ఆమె నిలబడివున్న చోటికి చేరి మంటపం లోపలి భాగాన్ని పరికించి చూశాడు. ఒక్కక్షణంలో అతను చూసిన దృశ్యం మనసులో పదిలమైంది. బంగారు దీపస్తంభంపైన పడిన దీపపు వెలుతురు బంగారపు కాంతిని చుట్టూ విస్తరింపజేసింది. ఏదో ఒక అపూర్వమైన సువాసన తైలాన్ని ఆ దీపంలో పోసివుండాలి - ఆ దీపపు పొగ ఘుమఘుమలాడే ఒక కమ్మని వాసనను వీస్తోంది. సువాసనలు వెదజల్లే రంగురంగుల పూలతో అలంకరించబడిన ఒక పట్టెమంచంపైన ఒక స్త్రీ వయ్యారంగా వాలుకొని కూర్చొని ఉంది. ఆమె పళువూర్ యువరాణే. పగలు పల్లకిలో చూసినప్పుడు అందగత్తెగా కన్పించింది. రాత్రి బంగారపు స్తంభదీపం వెలుతురులో సౌందర్యదేవతే మానవరూపంలో వచ్చినట్లు కన్పించింది. పూల సువాసన, దీపపు పొగ సుగంధము, యువరాణి మోహనరూపమూ ఒకటై వంతిదేవునికి పిచ్చెక్కించాయి.

వంతిదేవా! జాగ్రత్త! ఒకే ఒక్కసారి నీవు మధుపానం చేశావు! నీ మతి చలించడాన్ని గ్రహించావు! మళ్ళీ మధువు ముట్టనని శపథం చేశావు! ఇప్పుడు అది జ్ఞాపకం చేసుకో! మధుపానపు మైకంకన్న శక్తివంతమైన ఈ మైకానికి నీ బుద్ధిని బలివ్వకు!

-:-

వంతిదేవుని చూసిన పళువూర్ యువరాణి నందిని, తన పగడాల పెదవులు కాస్త విడివడి ముత్యాల పలువరుస మెరవగా ఆశ్చర్యంతో చూడసాగింది. ఆమె అలా మాట్లాడలేని పరిస్థితికి లోనుగావడం వంతిదేవునికి చాల అనుకూలమైంది.

ఒక చిన్న నవ్వు నవ్వేసి, "అమ్మా! మీ దాదమ్మకు ఉన్నట్లుండి సందేహం వచ్చేసింది - నేను మంత్రవాదినా కానా అని! దాన్ని ఎలా అడిగిందనుకొన్నారు ? 'నీవేనా?' అని అడిగింది!" అని చెప్పి మళ్ళీ నవ్వాడు.

నందిని చిరునవ్వు నవ్వింది. వంతిదేవుని కళ్ళముందు ఒక మెరుపు మెరిసింది! అది తేనెలొలికింది.

"ఈమెకు అప్పుడప్పుడు ఇలాగే సందేహాలొస్తుంటాయి. వాసుకీ! ఇంకా చెట్టులాగ నిలబడివున్నావేం? నీ చోటికి వెళ్ళు! ఎవరైనా వచ్చే శబ్దం వినిపిస్తే తలుపును దఢేల్మని మూసెయ్యి!" అన్నది నందిని.

"అలాగేనమ్మా!" అని చెప్పేసి, వాసుకి లతామంటపపు లోపలి దారిగుండా ప్రాకార మాళిగకు వెళ్ళేదారి వెంబడి నడిచివెళ్ళి కాస్తదూరంలో మసక మసగ్గా కన్పిస్తున్న వాకిలి గడప దగ్గర కూర్చొంది.

నందిని కాస్త గొంతు తగ్గించి, "నిన్ను మంత్రవాది కాదనా ఈ పిల్ల సందేహిస్తోంది? దద్దమ్మ! మంత్రవాదులని చెప్పుకొనేవారిలో నాలుగింట ముగ్గురు ఒట్టి అబద్ధాలకోర్లు. నీవే నిజమైన మంత్రవాదివి! ఏం మాయమంత్రం చేసి ఇప్పుడిక్కడ ప్రత్యక్షమయ్యావు!?" అని అడిగింది.

"అమ్మా! నేను మాయమంత్రాలు చేసి ఇక్కడికి రాలేదు. గోడకు ఆనించివున్న నిచ్చెనెక్కి ఇక్కడికి వచ్చాను!" అన్నాడు వంతిదేవుడు.

"అది తెలుస్తూనే ఉందికద! ఈ పిల్లను ఏ మాయమంత్రం వేసి ఏమార్చవనే నేనిప్పుడు అడుగుతున్నాను!"

"వెన్నెలలో ఒక చిరునవ్వు విసిరానంతే! అది పనిచేయకపోతే మీరిచ్చిన రాజముద్ర పొదిగిన ఉంగరాన్ని చూపిద్దామనుకొన్నాను."

"దాన్ని జాగ్రతగా ఉంచుకొన్నావు కద? అది ఉన్నప్పుడు పట్టపగలే బహిరంగంగా ఇక్కడికి వచ్చివుండవచ్చు కద? ఎందుకిలా అడ్డదారిలో దొంగలాగ వచ్చావు?"

"అమ్మా! మీ బావమరిదిగారున్నారే, చిన్న పళువేట్టరయ్యర్, ఆయన మనుషులు శుద్ధ దొంగ వెధవలు. మొదట నా బట్టలను, ఆభరణాలను దొంగిలించజూశారు. తర్వాత ఒక్కక్షణం కూడ నన్ను విడిచివుండక నా వెన్నంటే రాసాగారు. వారిని తప్పించుకొని రావడానికి నేను పడ్డ పాట్లు ఇంతింతగాదు. తప్పించుకొన్న తర్వాత సందుగొందుల్లో దూరి, చివరికి మీ మాళిగ బయటి గోడ చుట్టూ తిరిగి వస్తున్నప్పుడు గోడకానించివున్న నిచ్చెన చూడగానే మీరే ఈ అభాగ్యుడిని రక్షించేందుకు ఈ ఏర్పాటు చేశారనుకొన్నాను. అది తప్పని తర్వాత తెలుసుకొన్నాను. మన్నించాలి!"

"మన్నించాల్సిన అవరసమేం లేదే!"

"అదెలా, అమ్మా!"

"నీవనుకొన్నదందా పూర్తిగా తప్పుకాదు. నేను మంత్రవాదిని ఎందుకు ఇక్కడికి

రప్పించాలనుకొన్నానో తెలుసా?"

"తెలియదు, తల్లీ! నాకు మంత్రాలూ రావు; జోస్యమూ రాదు!"

"నిన్ను నిన్న పొద్దున చూసినప్పటినుంచి నీ జ్ఞాపకమే వస్తూంది. నీవెందుకింకా నన్ను చూడ రాలేదో తెలుసుకోవాలనుకొన్నాను. అందుకే నేను మంత్రవాదిని పిలుచురమ్మని చెప్పి పంపించాను."

"చాల ఆశ్చర్యంగా ఉంది"

"ఏది?"

"మీరిప్పుడు చెప్పిందే. నేను నిన్న మిమ్మల్ని చూసినప్పటినుంచి మీ జ్ఞాపకంగానే ఉంది!"

"పూర్వజన్మ జ్ఞాపకాలలో నీకు నమ్మకముందా?"

"అలాగంటే?"

"పూర్వజన్మలో ఇద్దరికి స్నేహమో, సంబంధమో ఉంటే, ఈ జన్మలోకూడ అటువంటి సంబంధముంటుందని అంటారు కద, దాన్నిగురించే చెప్తున్నాను."

"నిన్నటివరకు నాకా నమ్మకంలేదు. నిన్నే అందులో నమ్మకం పుట్టింది."

వంతిదేవుడు ఇలా చెప్పినప్పుడు, పైకి అబద్ధం చెప్పినా, లోలోపల తాను కుడంద్రై జ్యోతిష్కుల ఇంట చూసిన వనితను తలుచుకొనే అలా అన్నాడు. కానీ, అందుగురించి ఏ వివరమూ తెలియలేదు కద? తనగురించి చెప్తున్నట్లే అనుకొన్నాడు.

"కానీ నీవందుకోసం నన్ను చూడ రాలేదే? ఎవరో ఆళ్వార్ కట్టియార్ నంబి అనే ఆయన సందేశం పంపించినట్లు...."

"అవునమ్మా! ఆయన చెప్పి పంపిన సందేశాన్ని మీకు అందజేసేందుకే మొదట మిమ్మల్ని చూడగోరాను. మిమ్మల్ని ఒక్కసారి చూసిన తర్వాత ఆ పాత కారణాలన్నీ మరిచిపోయాను!"

"ఆళ్వార్ కట్టియాన్ని నీవెక్కడ కలిశావు? ఏం సందేశం పంపించారు?"

"వీరనారాయణపురం దగ్గర ఆయన్ను కలిశాను. ఆయన తన చేతికర్రను ఝళిపిస్తూ మహావిష్ణువే గొప్పదైవమని దెబ్బలాడనారంభించాడు. అప్పుడు పెద్ద పళువేట్టరయ్యర్‌గారి పరివారాలు అటువైపు వచ్చాయి. ఆయన వెంట మీపల్లకికూడ వచ్చింది. అక్కడ ఏం రగడ జరుగుతోందని చూసేందుకో ఏమో, మీ స్వర్ణకరమొకటి పల్లకి తెరను కాస్త తొలగించింది. అప్పుడు పల్లకిలో ఉన్నది మీరని గ్రహించి ఆళ్వార్ కట్టియార్ మీకొక సందేశం పంప నిశ్చయించారు. నేనుకూడ ఆ రాత్రి కడంబూర్ శంబువరయ్యర్ మాళిగలో విడిది చేయడంవల్ల నాకు సందేశాన్ని చెప్పి పంపించారు. కానీ నేను కడంబూర్లో మిమ్మల్ని చూడలేకపోయాను. తంజావూరు దగ్గరి రాజబాటకు వచ్చిన తర్వాతనే మిమ్మల్ని కలవగలిగాను. అదికూడ

మీ పల్లకి నా గుర్రాన్ని గుద్దినందువల్ల!"

వంతిదేవుడు ఇలా చెప్తున్నప్పుడు నందిని తల పైకెత్తి చూస్తూంది. కాబట్టి అతని ముఖ భావాలను చూడలేకపోయింది. చివరగా వంతిదేవుడు చెప్పిన వాక్యం విన్నవెంటనే, అతనివైపు తిరిగి చూసి, ఒక సమ్మోహనపు చిరునవ్వు నవ్వింది. "అవును; నేను ఎక్కివెళ్ళే పల్లకి మాచెడ్డ పల్లకే!" అన్నది.

~~~
~~~

# అధ్యాయము - 35

## మంత్రవాది

**దూరంలో** భేరీలు, నగారాలు వాయించే శబ్దం వినిపించింది. జయఘోషలు వినిపించాయి. కోట వాకిళ్ళు తెరవబడి మళ్ళీ మూయబడ్డ శబ్దము, ఏనుగులు, గుర్రాల కాలి చప్పుళ్ళూ లేచాయి.

ఆ శబ్దాలు నందినిని ఆకర్షించాయని వంతిదేవుడు గ్రహించాడు. కాపలా కాస్తున్న దాదమ్మ (వంతిదేవుని మాళిగలోపలికి తీసుకు వచ్చిన స్త్రీ) ఉన్నట్లుండి లేచి గబగబా నందిని దగ్గరకు వచ్చి, "అమ్మా! యజమానిగారు వచ్చేసినట్లుంది!" అన్నది.

నందిని, "నాకు తెలుసు; నీవు నీ చోటికి పో!" అన్నది.

తర్వాత వంతిదేవుని చూసి, "ధనాధికారి కోటలోపలికి ప్రవేశిస్తున్నారు. చక్రవర్తి క్షేమసమాచారాలు విచారించి, కోట దళపతిని చూసి మాట్లాడిన తర్వాత ఇక్కడికి వస్తారు. అంతలోపల నీవు వెళ్ళిపోవాలి. ఆళ్వార్ కట్టియార్ చెప్పిన సంగతేమిటో శీఘ్రంగా చెప్పు!" అన్నది.

"అమ్మా! ఆ వీర వైష్ణవ శిఖామణి మిమ్మల్ని తమ సహోదరి అని చెప్పుకొన్నాడు; అది నిజమేనా?" అని వంతిదేవుడు అడిగాడు.

"అందుగురించి నీవెందుకు సందేహిస్తున్నావు?"

"రామచిలుక, కోతి ఒకే తల్లి బిడ్డలని చెబితే నమ్మడం సులభమా?"

నందిని నవ్వేసి, "ఒక విధంగా ఆయన చెప్పినది నిజమే. మేము ఒకే ఇంట, ఒకే కుటుంబంలో పెరిగాము. తోడబుట్టిన చెల్లెలుగానే నన్ను భావించి ఆప్యాయంగా చూసుకొన్నారు. పాపం! ఆయనకు పెద్ద నిరాశ కలిగించాను!"

"అలాగైతే సరే! ఆళ్వార్ కట్టియార్ మీకు చెప్పి పంపించిన సందేశమిదే - శ్రీకృష్ణ భగవాన్ మీకోసం వేచివున్నాడు. తమరు కన్నయ్యను పెళ్ళాడే శుభ ముహూర్తంకోసం భక్తకోటి వేచివున్నారు!"

నందిని పెద్దగా నిట్టూర్చింది. "ఆహా! ఆయనింకా ఆ గొంతెమ్మ కోరిక విడిచిపెట్టనట్లుంది. నీవాయనను మళ్ళీ కలిస్తే ఇది చెప్పు - నన్ను పూర్తిగా మరిచిపొమ్మను! ఆండాళ్ళులాంటి పరమభక్తురాలిని కావడానికి ఏమాత్రం అర్హురాలిని కానని చెప్పు!"

"నేనది ఒప్పుకోనమ్మా!"

"దేన్ని ఒప్పుకోవు?"

"తమరు ఆండాళ్ళు కాలేరన్న విషయాన్నే. ఆండాళ్ళు భక్తితో పాటలు పాడి, ఏడ్చి కన్నీళ్ళు కార్చి, పూమాలలు కట్టి, – ఇలాగల్లా చేసి కన్నయ్యను పెళ్ళి చేసుకోవాల్సి వచ్చింది. కానీ మీకలాంటి కష్టమే అవసరంలేదు. కృష్ణభగవాన్ మిమ్మల్ని ఒక్కసారి చూస్తే చాలు - రుక్మిణి, సత్యభామ, రాధ, సకల గోపికాస్త్రీలను వదిలేసి, తాను అధివసించిన సింహాసనంపైన మిమ్మల్ని కూర్చోబెట్టుకొంటారు!"

"అయ్యో! మీరు ముఖస్తుతి చేయడంలో సమర్థులుగా ఉన్నారు! కానీ నాకది ఇష్టంలేదు."

"అమ్మా! ముఖస్తుతి అంటే ఏమిటో...?"

"ఒకరిని ముఖంమీదే పొగడడమే."

"అలాగైతే మీరు నాకు వెన్నుచూపి కూర్చోండి..."

"ఎందుకని?"

"ముఖాన్ని చూడకుండా వెన్నుచూస్తూ పొగిడేందుకే. అందులో తప్పేం లేదుకద?"

"మీరు భలే మాటకారులు!"

"ఇప్పుడు మీరు కద ముఖస్తుతి చేస్తున్నారు?"

"మీరూ ముఖం చాటుచేసి వెన్నుచూపిస్తే సరి!"

"మహారాణీ! యుద్ధరంగంలో గాని, స్త్రీల వద్దగాని నేను వెన్ను చూపను. మీరు ధారాళంగా నన్ను ముఖస్తుతి చేయవచ్చు!"

ఇది విన్న నందిని గొల్లుమని నవ్వింది!

"మీరు మంత్రవాదే; సందేహంలేదు. నేనిలా నోరారా నవ్వి చాల కాలమైంది!" అన్నది.

"కానీ, అమ్మా, మిమ్మల్ని నవ్వించడం చాలా అపాయకరం! తటాకంలో తామర నవ్వి ఆనందిస్తోంది; అది చూసి భ్రమరం మైమరచి పడిపోతోంది!" అన్నాడు వంతిదేవుడు.

"మీరు మంత్రవాది మాత్రమే కాదు, మంచి కవికూడ అనిపిస్తోంది!"

"నేను ముఖస్తుతికీ జంకను; తిట్లకూ కుంగిపోను"

"మిమ్మల్నిప్పుడు ఎవరు తిట్టారు?"

"కాసేపటికి మునుపు మీరు నన్ను 'కవి' అన్నారు కద?"

"అలాగంటే?"

"నా చిన్నతనంలో కొందరు నన్ను 'కోతి మూతి' అనేవారు. చాల కాలం తర్వాత మీ నోటినుంచి అది మళ్ళీ విన్నాను."

"మిమ్మల్ని కోతి మూతి అన్న బృహస్పతులెవ్వరు?"

"వారిలో ఇప్పుడెవరూ బతికిలేరు."

"నేను మిమ్మల్నలా అనలేదు. మంచి కవిత్వం చెప్పగలవారిలా ఉన్నారన్నాను."

"కాస్త కవిత్వంకూడ పాడగలను. కానీ పగవారి ముందు మాత్రమే. విల్లుబాణాలతో చావని వారు వాగ్బాణాలతో చావనీ అని!"

"అయ్యా! కవిరాజ శిఖామణీ! మీపేరేమని ఇంకా చెప్పలేదే!"

"నా సొంత పేరు వంతిదేవుడు; పట్టపు పేరు వల్లవరయ్యన్."

"అంటే...రాజ కులపు వారన్నమాట?"

"ఒకప్పుడు పేరుగాంచిన వాణాది రాజ వంశానికి చెందిన వాడిని!"

"ఇప్పుడు మీ రాజ్యం?"

"పైన ఆకాశం! కింద భూమి; నేనిప్పుడు సకల భూమండలానికి చక్రవర్తిని!"

-:-

నందిని వంతిదేవుని కాసేపు ఎగాదిగా చూస్తూ కూర్చొంది.

"అలా జరగలేని కార్యమంటూ ఏదీ లేదు. మీ పూర్వీక రాజ్యాన్ని మీరు మళ్ళీ పొందవచ్చు."

"అదెలా సాధ్యం? పులి కడుపు లోపలికి వెళ్ళింది మళ్ళీ వస్తుందా? చోళ సామ్రాజ్యంలో విలీనమైన రాజ్యం మళ్ళీ దొరుకుతుందా?"

"దొరికేలా నేను చేయగలను."

"అమ్మా! వద్దు! రాజ్యమేలే ఆశ నాకెప్పుడూ లేదు. ఉన్న కాస్త ఆశ కూడ ఈరోజు సుందర చోళ చక్రవర్తిని చూసిన తర్వాత ఇగిరిపోయింది. అలా ఇంకొకరి చేతినెదురు చూస్తూ చక్రవర్తిగా ఉండడంకన్న వచ్చేపూట భోజనం ఎక్కడ దొరుకుతుందో తెలియని స్వతంత్ర వ్యక్తిగా జీవించడమే మేలు."

"నా ఉద్దేశ్యమూ అదే!" అన్నది నందిని. తర్వాత ఏదో మరిచిపోయిన విషయాన్ని జ్ఞాపకంచేసుకొంటున్నట్లు, "చిన్న పళువేట్టరయ్యర్‌గారి మనుషులు మిమ్మల్ని ఎందుకు వెతుకుతున్నారు?" అని అడిగింది.

"తమ దాదమ్మ లాగ వారికి కూడ నామీద సందేహం పుట్టుకొచ్చేసింది."

"ఏం సందేహం?"

"తాటిచెట్టు చిహ్నం ఉన్న రాజముద్ర నాదగ్గరికెలా వచ్చిందని."

నందిని భీతిగొన్నట్లు ఆమె ముఖంపై చూచాయగా అగుపించింది.

“ఆ ఉంగరం ఎక్కడ?” అని ఉన్నట్లుండి అడిగింది.

“ఇదిగో, అమ్మా! దాన్ని అంత సులభంగా పోగొట్టుకొంటానా?” అంటూనే నందిని ఇచ్చిన ఉంగరాన్ని తీసి చూపించాడు వంతిదేవుడు.

“ఇది మీదగ్గర ఉందని ఆయనకెలా తెలిసింది?” అని నందిని అడిగింది.

“సుందర చోళ చక్రవర్తిని చూడాలనే ఆశ నాకు చాలా రోజులుగా ఉంది. అందుకు ఈ ముద్ర ఉన్న ఉంగరాన్ని ఉపయోగించుకొన్నాను. చక్రవర్తిని చూసిన తర్వాత ఈ ఉంగరం నాదగ్గరికెలా వచ్చిందని కోట దళపతి అడిగారు...”

“మీరేం ఉత్తరమిచ్చారు?” అని నందిని ఆదుర్దాగా అడిగింది.

“మీపేరెత్తలేదమ్మా! పెద్ద పళువేట్టరయ్యర్ ఇచ్చారు అని చెప్పాను.... కడంబూర్ మాళిగలో ఇచ్చారని కూడ చెప్పాను...”

-:-

నందిని పెద్దగా నిట్టూర్చింది. ఆమె ముఖంలోను, గొంతులోను ఇంతకు మునుపు కనిపించిన దిగులు మాయమైంది.

“మీరు చెప్పింది ఆయన నమ్మారా?” అని అడిగింది.

“పూర్తిగా నమ్మినట్లు కనిపించలేదు. అందుకే నా వెన్నంటి తన మనుషులను పంపించి ఉండాలి! అన్నగారు వచ్చిన వెంటనే ఆయన ముందు తనను నిలబెట్టి నిజం తెలుసుకోవాలని ఉండవచ్చు!” అన్నాడు వంతిదేవుడు.

నందిని చిరునవ్వు నవ్వి, “పెద్ద పళువేట్టరయ్యర్ దగ్గర మీరు భయపడనవసరం లేదు. ఆయన మిమ్మల్ని కరిచి తినేయకుండా నేను చూసుకొంటాను!” అంది.

“అమ్మా! ధనాధికారి వద్ద మీకున్న పలుకుబడి జగద్విదితమే. కానీ నాకు కోట బయట ఒక ముఖ్యమైన పనివుంది. అందుకే ఇక్కడినుంచి తప్పించుకోవడానికి మీ సహాయం కోరుతున్నాను.”

“అలా ఏమంత ముఖ్యమైన పని?”

“ఎన్నో ఉన్నాయి. ఉదాహరణకు ఆళ్వార్ కట్టియాన్ని చూసి ఆయనకు మీ ఉత్తరం అందజేయాలి. ఆయనకేం చెప్పను?”

“ఆయనకు 'నందిని అనే ఒక సోదరి ఉండేది' అన్న విషయాన్నే పూర్తిగా మరిచిపొమ్మని

చెప్పండి!"

"చెప్పేయవచ్చు. కానీ అది జరగని పని."

"ఏది?"

"మిమ్మల్ని మరిచిపోవడమే. రెండుసార్లు కాకతాళీయంగా చూసిన నేనే మిమ్మల్ని మరువలేననిపిస్తుందే! జీవితమంతా మీతో ఉండిన ఆయనకు మిమ్మల్ని మరువ సాధ్యమా?"

నందిని ముఖంలో గెలుపొందిన చాయలు కొట్టవచ్చినట్లు కనిపించాయి.

"చక్రవర్తిని చూడాలని మీరెందుకంత ఆసక్తిగొన్నారు?" అని అడిగింది.

"జగత్ప్రసిద్ధుడైన ఆ సుందర పురుషుని నేను చూడాలనుకోవడంలో ఆశ్చర్యమేమి? లోకంలో మహావీరులైన రాజులు తమ వీరత్వమూ, పౌరుషమూ పెరగాలని, తమ రాజ్యమూ, కీర్తి విస్తరించాలని కోరుకొంటారు. అలాగే ప్రజలను ప్రార్థించమని కూడ చెబుతారు. కానీ మన చక్రవర్తి గురించి బౌద్ధభిక్షువుల మఠాలలో ఏం ప్రార్థన చేస్తున్నారు?

".... సుందర చోళ చక్రవర్తి ఉదారగుణమూ, దయాగుణమూ వర్ధిల్లనీ..."

అని ప్రార్థన చేస్తున్నారు. ఇటువంటి కలియుగ మన్మధుడైన చక్రవర్తిని చూడాలని చాలా రోజులుగా గట్టికోరిక ఉండేది..."

"అవును; చక్రవర్తికి తమ అందాన్ని గురించి చాల గర్వమే. ఆయన ముద్దుల కుమార్తెకు అంతకన్న గర్వం..."

"కుమార్తెనా? ఎవరిగురించి చెబుతున్నారు?"

"పళైయారైలో ఉందే, ఒక అహంభావి - ఆ రాజకుమారిని గురించే చెబుతున్నాను."

వంతిదేవా! నీవు అదృష్టశాలివి. నీవు వెతుకుతున్న ఉపాయం ఇదిగో నీ ముందు తనకు తానే వచ్చి నిలబడివుంది! దాన్ని బాగా ఉపయోగించుకో!

ఇలా వల్లవరయ్యన్ తనకు తానే చెప్పుకొన్నాడు.

-:-

ఇంతసేపూ పట్టెమంచంపైన ఒయ్యారంగా ఆనుకొని కూర్చొని ఉన్న నందిని ఉన్నట్లుండి లేచి నిటారుగా కూర్చొంది.

"అయ్యా! నేనొకటి చెబుతాను. ఒప్పుకొంటారా?"

"చెప్పండమ్మా!"

"మీరూ నేనూ ఒక ఒడంబడిక చేసుకొందాము. నేను మీకు సహాయం చేయడం; మీరు నాకు సహాయం చేయడం; ఏమంటారు?"

"అమ్మా! మీరు చోళ సామ్రాజ్యంలో సర్వ శక్తిమంతుడైన ధనాధికారికి రాణి. అనుకొన్నది అనుకొన్నట్లు సాధించగల శక్తిగలవారు. నేనేమో ఎటువంటి పలుకుబడీ లేనివాడిని. మీకు నేనేవిధంగా సహాయం చేయగలను?" అన్నాడు.

అతను తన మనసులో ఉన్న మాట అంటున్నాడా, లేక పైపైమాటేనా అని తెలుసుకోగోరి నందిని అతని వైపు తీక్షణంగా వీక్షించింది.

కానీ వంతిదేవుడు ఒకింతకూడ చలించలేదు.

"నాకు అంతరంగమైన వ్యక్తి ఒకరు కావలసి ఉంది. నేను మీకీ అంతఃపురంలో పని ఇప్పిస్తే చేస్తారా?" అని అడిగింది.

"ఇదే విధంగా అంతరంగమైన వ్యక్తిగా పని చేస్తానని ఇంకొక రాచవనితకు ఇంతకు మునుపే మాటిచ్చేశాను!. ఆమె వద్దంటే మీదగ్గరకు వస్తాను."

"ఎవరది? నాతో పోటీకి వస్తున్నది?"

"కాసేపటికి మునుపు వెటకారంగా మాట్లాడారే, ఆ పళైయారై రాకుమారి కుందవై దేవే."

"అబద్ధం! అబద్ధం! అలా ఎన్నటికీ జరగదు! నన్ను ఆట పట్టిస్తునారంతే...!"

"మహారాణీ! ఈ తాళపత్రాన్ని ఎందరో దొంగతనంగా చదివేసి ఉన్నారు. మీరు చదివినందువల్ల పెద్ద హాని ఏమీ జరగదు!" అంటూనే ఆదిత్య కరికాలన్ కుందవై దేవికి రాసిన తాళపత్రాన్ని తీసి ముందుకు చాచాడు.

-:-

నందిని ఆ తాళపత్రాన్ని దీపపు వెలుతురులో పట్టుకొని చదివింది. చదివి ముగించినప్పుడు ఆమె కళ్ళనుంచి లేచిన మెరుపు జ్వాలలు నాగుపాము నోటినుంచి బయటికి వచ్చి మళ్ళీ మెరుపువేగంతో లోపలికి పోయే నాలుకను వంతిదేవునికి తలపుకు తెచ్చింది. అతనికి తెలియకుండానే అతని ఒళ్ళు వణికింది.

నందిని గంభీరంగా వంతిదేవుని చూసి, "అయ్యా! మీరు ఈ కోటనుంచి ప్రాణాలతో బయటపడగోరుతున్నారు కదా?" అని అడిగింది.

"అవునమ్మా!ఆందుకోసమే మీ సహాయంకోరి వచ్చాను."

"అయితే ఒక నిబంధనకు ఒప్పుకొంటే మాత్రమే తప్పించుకొని పారిపోవడానికి సహాయం

చేస్తాను."

"ఏమా నిబంధన?"

"ఈ తాళపత్రానికి కుందపై ఏం బదులు రాసి ఇస్తుందో దాన్ని నాకు తెచ్చి చూపించాలి, సమ్మతమా?"

"చాల అపాయకరమైన నిబంధన విధిస్తున్నారు!"

"అపాయాలకు జంకనని కాసేపటికి మునుపే కద గొప్పలు చెప్పుకొన్నారు?"

"అపాయానికి తెగించడమంటే దానికి తగిన బహుమానం లభించాలి కద?"

"బహుమానమా? మీరు కలలోకూడ ఊహించలేని బహుమానం లభిస్తుంది. చోళ సామ్రాజ్యంలో సర్వశక్తివంతులై విరాజిల్లుతున్న పెద్ద పళువేట్టరయ్యర్ ఏ బహుమానంకోసం ఇన్నేళ్ళుగా తపస్సు చేస్తున్నారో దానికన్న పెద్ద బహుమానం లభిస్తుంది!" అని చెప్తూనే నందిని వంతిదేవునిపై మళ్లీ మోహనాస్త్రాన్ని విసిరింది.

పాపం! వల్లవర్రయ్యన్ తల తిరిగిపోయింది. ఓ మనసా! ధైర్యాన్ని జారనివ్వకు! వివేకాన్ని కోల్పోకు! అని తనకు తానే చెప్పుకొన్నాడు.

అప్పుడు అతనికి సహాయం చేయవచ్చినట్లు పక్కనే ఉన్న తోటనుంచి ఒక గుడ్లగూబ కూత వినిపించింది.

ఒకసారి, రెండుసార్లు, మూడుసార్లు వినిపించింది.

వంతిదేవుని ఒళ్ళు జలదరించింది.

నందిని తోటలో గుడ్లగూబ కూత వినిపించిన దిశగా చూసి, ''నిజమైన మంత్రవాది వచ్చేశాడు !'' అన్నది .

తర్వాత వంతిదేవుని చూసి, "అతను నాకింక అవసరంలేదు. కానీ రెండుమాటలు చెప్పి పంపించేస్తాను. ఒకవేళ, మీరు తప్పించుకొని పారిపోయేందుకు అతను ఉపయోగపడవచ్చు. మీరు కాసేపు ఆ చీకటిలోకి వెళ్ళి మరుగ్గా నిలబడండి!" అని ఇంతకు ముందు ఆ దాదమ్మ వెళ్ళిన దిక్కుకు ఎదురు దిక్కును చూపించింది.

~~~
~~~

# అధ్యాయము - 36

## "జ్ఞాపకముందా?"

లతామంటపం తోట ద్వారం దగ్గరకువచ్చి నిలబడి మూడుసార్లు చప్పట్లు తట్టింది నందిని.

అప్పుడామె ముఖంపైన కనిపించినవి భయాందోళనా ఛాయలా లేక చెట్ల క్రీనీడలా నిర్ధారంగా చెప్పలేము.

తోటలో కాస్తదూరం వరకు పెద్ద పెద్ద చెట్లు, వాటికి అల్లుకొన్న తీగలు మాత్రమే కనిపించాయి. వాటి తర్వాత చిమ్మ చీకటి కమ్ముకొనివుంది.

చీకటిని చీల్చుకొని, తీగలను తొలగించుకొని ఒక చెట్టు వెనకనుంచి మంత్రవాది బయటికొచ్చాడు.

నందిని వెళ్ళి తన పూలపాన్పుపైన కూర్చొంది.

మంత్రవాది లతామంటపం లోపలికొచ్చాడు. స్వర్ణదీపపు కాంతి అతని ముఖంపైన పడింది.

ఎక్కడో చూసిన ముఖం లాగుందే! ఎవడీతడు? ఆఁ! తిరుప్పురంపయం పళ్ళిప్పడై దగ్గర మధ్యరాత్రి గుమిగూడిన మనుషుల్లో ఒకడీతడు. సంచినుంచి బంగారు నాణాలను తీసి పోసినవాడు. “ఆళ్వార్ కట్టియాన్ కనిపించిన చోటే చంపేయండి!” అని తక్కినవారికి చెప్పిన రవిదాసే ఇతడు.

-:-

వచ్చేటప్పుడే అతని ముఖంలో కోపం తాండవమాడూతూంది.పూలపాన్పుపైన ఆనుకొని కూర్చొనివున్న నందినిని చూడగానే అతని పిల్లికళ్ళనుంచి ఆవేశజ్వాలలు వీచాయి.

నందిని మంచానికెదురుగా ఉన్న పీటపైన కూర్చొని నందినిని గుచ్చి గుచ్చి చూస్తూ, “హూం! హ్రీం హ్రాం భగవతి! శక్తీ! చండీదేవీ!...” అని కొన్ని మంత్రాలు పఠించాడు.

“చాలు! నిలుపు! దాదమ్మ వాకిట కూర్చొన్న పళంగా నిద్రలోకి జారిపోయినట్లుంది. నీవు చెప్పాల్సింది త్వరగా చెప్పు! ఆయన కోటలోపలికొచ్చేశారు!” అన్నది నందిని.

“ఒసే పాతకి!” అని రవిదాసు అన్నది నాగుపాము బుసకొట్టినట్లు ధ్వనించింది.

“ఎవరినన్నావు?” అని నందిని శాంతంగానే అడిగింది.

“ఇంకెవరిని? కృతఙ్ఞతలేని నందినినే! పళువూర్ యువరాణినే! నిన్నే!” అని రవిదాసు తన చూపుడువేలితో ఆమెనే చూపిస్తూ.

నందిని ఏమీ మాట్లాడక మౌనంగా కూర్చొంది.

"అమ్మాయీ! జ్ఞాపకముంచుకోవలసిన  కొన్ని విషయాలను నీవు మరిచిపోయావులాగుంది. వాటిని నీకు మళ్ళీ జ్ఞాపకంచేస్తాను" అన్నాడు రవిదాసు.

"పాత కథలిప్పుడెందుకు?" అన్నది నందిని.

"ఇప్పుడెందుకనా అడుగుతావు? చెప్తాను; ముందు జ్ఞాపకంచేసి, తర్వాత చెప్తాను" అన్నాడు రవిదాసు.

-:-

అతన్నడ్డగించి ప్రయోజనంలేదని తెలిసిన నందిని ఒక పెద్ద నిట్టూర్పు విడిచి, అటువేపు తిరిగి కూర్చొంది.

"రాణీ! విను! మూడేళ్లకు మునుపు ఒకరోజు మధ్యరాత్రి వైగై నది ఒడ్డున ఉన్న శ్మశానంలో ఒక చితి కాలుతూంది. శాస్త్రప్రకారం పురోహితులు చేయవలసిన అంతిమ క్రియలు అక్కడేమీ జరగలేదు. అడవిలోని ఎండుకొమ్మలను, రెమ్మలను తీసుకొచ్చి ఆ చితిని పేర్చారు. చెట్టువెనక మరుగ్గా ఉంచిన ఒక దేహాన్ని తీసుకొచ్చి ఆ చితిపైన పెట్టారు. తర్వాత చితికి నిప్పంటించారు. అడవి చెట్టుకొమ్మలు నిప్పంటుకొని బాగా కాలసాగాయి. అప్పుడు అడవి నీడలనుంచి కొందరు నిన్ను లాక్కొని వచ్చారు. నీ కాళ్ళు, చేతులు కట్టబడివున్నాయి. నీ నోట బట్ట కుక్కబడివుంది. ఇప్పుడు అందంగా జడవేసుకొని పూలు చుట్టుకొనివున్నావే, ఆ వెంట్రుకలు అప్పుడు నేలపైన జీరాడుతున్నాయి. నిన్ను ఆ మనుషులు మండుతున్న ఆ చితిపైన సజీవంగా కాల్చేయాలనుకొన్నారు. 'చితి ఇంకా బాగా కాలనీ' అని వారిలో ఒకడన్నాడు. నిన్నక్కడే పడేసి ఆ మనుషులు ఒక భయంకరమైన శపథం చేశారు. అది నీవు వింటూవున్నావు. నీ నోటిని నొక్కారే తప్ప, కళ్లకు గంతలు కట్టలేదు; చెవులుకూడ మూయలేదు. ఆ భయంకరమైన శపథం చేసుకొన్నతర్వాత నిన్ను సమీపించారు. అంతవరకు ఊరకుండిన నీవు కట్టివేయబడ్డ చేతులతో ఏదో సైగచేయ ప్రయత్నించావు. నీ కళ్లను తిప్పుతూ కనుబొమలు పైకెత్తి ఏదో చెప్పడానికి కష్టపడ్డావు. 'ఇదేదో చెప్పాలనుకుంటోంది, చూడండి!' అన్నాడొకడు. 'పాతకథే అయివుంటుంది. ఎత్తి మంటలో వెయ్!' అన్నాడింకొకడు. 'కాదురా! మంటలో వేసి కాల్చేయకముందు ఏం చెబుతుందో విందాం! నోటిలోని బట్ట తీయ్!' అన్నాడింకొకడు. అతనే వారికి నాయకుడు. కాబట్టి నీ నోట కుక్కిన బట్ట తీశారు. నీవప్పుడేమన్నావో జ్ఞాపకం ఉందా, అమ్మాయీ?" అని అడిగేసి రవిదాసు మాట్లాడడం నిలిపాడు.

-:-

నందిని ఉత్తరమివ్వనూ లేదు; అతన్ని తిరిగికూడ చూడలేదు. మనసులో గూడు కట్టుకొన్న అసహ్యాన్ని, భీతిని, అదేసమయంలో తాను తీసుకొన్న భయంకరమైన సంకల్పాన్ని ఆమె ముఖమండలం

ప్రతిబింబించింది. ఆమె నల్లటి కళ్ళలో రెండు కన్నీటి బిందువులు నిండాయి.

"అమ్మాయి! మాట్లాడనంటున్నావు! సరే వద్దులే. అదికూడ నేనే చెప్పేస్తాను. ఆ మనుషులలాగానే నీవు కూడ పగ తీర్చుకొనే వ్రతం పూనబోతావని చెప్పావు. పగ తీర్చుకోవడానికి వారికన్న నీకే ఎక్కువ కారణాలున్నాయని ప్రమాణం చేశావు. నీ అందాన్ని బుద్ధిని అందుకే ఉపయోగిస్తానని చెప్పావు. వారికి నీవల్ల అయినంతవరకు సహాయం చేస్తానని కూడ చెప్పావు. శపథం నెరవేరిన వెంటనే నీ ప్రాణాలను నీవే విడిచేస్తావని చెప్పావు. నిన్ను తక్కిన వారు నమ్మలేదు. కానీ నేను నమ్మాను. నమ్మి, నిన్ను నిప్పులో వేయకుండ కాపాడాను. నీ ప్రాణాలు కాపాడాను. ఇదంతా నీకు జ్ఞాపకముందా?" అని చెప్పి రవిదాసు ఆపాడు.

-:-

నందిని కాస్త తిరిగి అతన్ని చూసి, "జ్ఞాపకముందా అని అడుగుతున్నావే? నా మనస్సులో అదంతా నిప్పుతో రాసినట్లు పదిలమై ఉంది!" అన్నది.

"తర్వాత ఒకరోజు మనమందరం అఖండ కావేరి నదీతీరం వెంబడి అడవిదారిలో పడి వెళ్తున్నప్పుడు, ఉన్నట్లుండి మన వెనుక గుర్రమెక్కి కొందరు వీరులు వస్తున్న శబ్దం వినిపించింది. వారు మనని దాటి వెళ్ళే వరకు ఒక్కొక్కరమూ అడవిలో వేర్వేరుగా దాక్కోవాలని తీర్మానించుకొన్నాము. కానీ, నీవు మాత్రం ఆ తీర్మానాన్ని మీరి, దారిలోనే నిలబడ్డావు. ఆ వీరులు నిన్ను పట్టుకొన్నారు. వారి నాయకుడైన పళువేట్టరయ్యన్ నీ అందాన్ని చూసి నీ మోహపువలలో పడ్డాడు. వాడిని నీవు పెళ్ళాడావు. నావాళ్లందరూ నేను మోసపోయానని నన్ను ఎద్దేవా చేశారు. కానీ నేను వదలలేదు. ఎలాగో ఒకరోజు నిన్ను ఒంటరిగా పట్టుకొన్నాను. ద్రోహివైన నిన్ను కత్తితో పొడిచి చంపేయాలనుకొన్నాను. మళ్ళీ నీవు ప్రాణభిక్ష అడిగావు. మన శపథాన్ని నెరవేర్చేందుకే ఇక్కడికి వచ్చివున్నట్లు చెప్పావు. ఈ అంతఃపురంలో ఉంటూనే మాకు కావలసిన సహాయం చేస్తానని ప్రమాణం చేశావు. ఇదంతా నిజమా, కాదా?" అని అడిగాడు రవిదాసు.

"అదంతా నిజమే; ఎవరు కాదన్నారు? ఎందుకు అదే మళ్ళీ మళ్ళీ చెప్తున్నావు? నీవొచ్చిన పని ఏమిటో చెప్పు!" అన్నది నందిని.

"కాదమ్మాయ్! నీకు జ్ఞాపకంలేదు; నీవంతా మరిచిపోయావు! పళువూర్ అంతఃపురంలో సుఖభోగాల్లో మునిగిపోయి నీ శపథాన్ని మర్చిపోయావు! షడ్రసోపేతమైన వంటకాలను భుజించి, మంచి బట్టలు కట్టుకొని, ఆభరణాలు వేసుకొని పట్టెమంచంపైన పడుకొని, దంతపు పల్లకిలో ప్రయాణాలు చేసే రాణివి నీవు! నీకు పాత విషయాలెలా జ్ఞాపకం ఉంటాయి?"

"ఛీఛీ! ఈ పట్టెమంచం, మెత్త, బట్టలూ, ఆభరణాలు ఎవరికి కావాలి? ఈ అల్ప భోగాలకోసమా

నేను బతికి ఉన్నాను? కానే కాదు!"

"లేక దారిన పోయే యువకుని అందాల ముఖం చూసి మైమరిచిపోయావేమో! కొత్త మోజులో పాత పగ మరుగైపోయి ఉండవచ్చుకద!"

నందిని కాస్త వణికింది. కానీ వెంటనే సర్దుకొని, "అబద్ధం! అంతా అబద్ధం!" అన్నది.

"అది అబద్ధమైతే, నేను ఈరోజు వస్తానని ముందే చెప్పి పంపించినా, నీ దాది మామూలు చోటికి ఎందుకు రాలేదు?"

"పంపించే ఉన్నాను. కానీ, నీకోసం పెట్టిన నిచ్చెన మీదుగా ఇంకొకడు ఎక్కి వచ్చేశాడు. ఆ దద్దమ్మ దాది అది నీవే అనుకొంది. అది నా తప్పా?"

"ఎవరి తప్పైతేనేమి? ఇంకొక్క క్షణంలో నా ప్రాణాలు పోయేవి. ఆ యువకుని పట్టుకోవడానికి వచ్చిన కోట కాపలాదార్లు నన్ను పట్టుకోనున్నారనగా, ఈ అంతఃపురం పక్కన ఉన్న కోనేటిలో మునిగి, వారు వెళ్ళిపోయేవరకు ఊపిరి బిగబట్టుకొని కూర్చొని, వారలా వెళ్ళిన తర్వాత తప్పించుకొని వచ్చాను. పూర్తిగా తడిసిపోయి వచ్చాను..."

"అది నీకు కావల్సిందే. నన్ను సందేహించిన పాపాన్ని ఆ మునకతో కడిగేసుకొన్నావు!"

"అమ్మాయీ! నిజం చెప్పు! ఆ యువకుని అందాన్ని చూసి నీకు మతి భ్రమించలేదా?"

"ఛీఛీ! మగవాళ్ళ అందాన్ని గురించి ఎవరైనా మాట్లాడుతారా? ఈ సిగ్గులేని చోళ రాజ్యంలో మాత్రమే 'రాజు అందగాడు' అని మురిసిపోతున్నారు. మగవాళ్ళకు అందం ఒంటిపైనున్న యుద్ధపు గాయాలు కద?"

"బాగా చెప్పావు. ఇది నీవు నిజంగా చెప్తున్న పక్షంలో, ఆ దారినపోయే యువకుడు ఇక్కడికెందుకు వచ్చాడు?"

"ముందే చెప్పానుగా, నీవే అనుకొని వాసుకి అతన్ని లోపలికి తీసుకొచ్చిందని!"

"నాకుకూడ ఇవ్వని నీ రాజలాంఛనపు ఉంగరాన్ని వాడికెందుకిచ్చావు?"

"అతన్ని ఇక్కడికి పిలిపించి మాట్లాడేందుకే ఇచ్చాను. ఇప్పుడా ఉంగరాన్ని అతని దగ్గరనుంచి తీసేసుకోబోతున్నాను...."

"ఎందుకు వాడినిక్కడికి రప్పించావు? ఇంతసేపు వాడితో ఏం సరస సల్లాపాలు సాగించావు?"

"ఒక ముఖ్యమైన ప్రయోజనన్నానుద్దేశించే అతనితో ఇంతసేపు సరదాగా గడిపాను. మన ఉద్దేశాన్ని నెరవేర్చుకోవడంలో అతనివల్ల మనకు పెద్ద ఉపయోగముంది."

"ఒసే పాతకి! చివరికి నీ ఆడబుద్ధి చూపించేశావు కద? ఎవడో ముందువెనక తెలియని కుర్రాడిదగ్గర మన రహస్యాన్ని..."

"ఊరక ఎందుకు వదరడం? నేనతనివద్ద ఏం చెప్పేయలేదు. అతనివద్దనుంచే రహస్యాన్ని లాక్కొన్నాను."

"ఏమారహస్యం?"

"ఇతను కంచినుంచి పళైయారైకి తాళపత్రం తీసుకువెళ్తున్నాడు - అక్కడ ఉన్న ఆడ పులికి. దాన్ని నాకు చూపించాడు. ఆమె ఇచ్చే ఉత్తరాన్ని నాకు తీసుకొచ్చి చూపించాలని చెప్తుండగా, నీవొచ్చేశావు!"

"ఈ రాతలు, కోతల వల్ల మనకేమి ప్రయోజనం?"

"నీ తెలివి అంతమాత్రమే. పులి వంశాన్ని సమూలంగా నాశనం చేయాలని మనం శపథం చేసి ఉన్నాము. కానీ మీరు మగపులుల్ని మాత్రమే లెక్కకు తీసుకుని ఉన్నారు. ఆడపులి వల్ల కూడ వంశం పెంపొందుతుందనే విషయాన్ని మీరు మరిచేపోయారు. అది మాత్రమే కాదు. ప్రస్తుతం ఈ చోళ సామ్రాజ్యాన్ని ఎవరేలుతున్నారనుకొన్నావు? జవసత్వాలుడిగి జబ్బుపడివున్న ముసలివాడా? కాంచీపురంలో, లంకలో ఉన్న యువరాజులా?...."

"కాదు. నిన్ను రాణిగా పొందిన భాగ్యశాలి పెద్ద పళువేట్టరయ్యరే. ఇది జగద్విదితమే కద!"

"అదీ తప్పే! లోకం అలా అనుకొంటోంది; ఈ ముసలాయనా అలాగనుకొనే ఏమారిపోతున్నాడు. నీవూ అలాగే ఏమారిపోయావు. నిజానికి పళైయారైలో ఉన్న ఆడపులిపిల్లే ఈ రాజ్యాన్ని ఏలుతోంది. అంతఃపురంలో ఉంటూనే ఆ గర్విష్టి అందరినీ ఆటలాడించాలని చూస్తోంది! దాని ఆటల్ని నేను కట్టించగలను. అందుకోసమే ఈ యువకుడిని ఉపయోగించుకోబోతున్నాను."

-:-

రవిదాసుని ముఖంలో ఆశ్చర్యమూ, గౌరవమూ తొంగిచూశాయి.

"నీవు చాల తెలివిగలదానివే; సందేహంలేదు! కానీ ఇదంతా నిజమని ఏమి నిశ్చయం? నిన్ను ఎలా నమ్మడం?"

"ఆ యువకుడిని నీకే ఒప్పజెప్పేస్తాను. నీవే అతడిని సొరంగమార్గం గుండా కోట బయటికి తీసుకుపో. కళ్ళకు గంతలు కట్టి తీసుకుపో! పళైయారై సమీపంలో వేచివుండు! కుందవై ఇచ్చే ఉత్తరం సమేతంగా అతణ్ణి మళ్ళీ ఇక్కడికి తీసుకురా! అతను దారిలో తప్పించుకోవడానికో, లేక నిన్ను ఏమార్చడానికో ప్రయత్నిస్తే చంపేయ్!" అన్నది నందిని.

"వద్దు! వద్దు! నీవూ, వాడూ ఎలాగైనా పొండి! వాడికోసం చిన్న పళువేట్టరయ్యన్ మనుషులు ఇప్పుడు కోట లోపల వెతుకుతున్నారు; కాసేపట్లో బయటకూడ వెతకనారంభిస్తారు. వాడివెంట వెళ్తే నాకూ అపాయమే. నేను వచ్చిన కార్యం గురించి చెప్పు!"

"వచ్చిన కార్యమేనని నీవింకా చెప్పనేలేదే..."

"కంచికి, లంకకు మనుషులు వెళ్ళేందుకు ఏర్పాట్లు జరిగిపోయాయి. లంకకు వెళ్ళేవాళ్ళు చాల కష్టాలు పడాలి. అక్కడ చాల సమర్థవంతంగా నడుచుకోవాలి...."

"అందుకు నేనేం చేయాలని చెబుతున్నావు? ఇంకా బంగారం కావాలా? మీ బంగారపుటాశకు అంతే లేదా?"

"బంగారం మా స్వప్రయోజనం కోసంకాదు; చేబట్టిన కార్యం ముగించేందుకే. మరి నిన్నిక్కడెందుకు ఉంచాము? లంకకు వెళ్ళేవారికి చోళదేశపు నాణాలు పనికిరావు. లంకదేశపు నాణాలుంటే మంచిది..."

"ఇది చెప్పేందుకు ఎందుకింత జాప్యం? నీవడిగేందుకు ముందే నేను తీసిపెట్టి ఉంచాను" అని చెప్పి, తాను కూర్చొన్న మంచం కిందినుంచి ఒక సంచి తీసి రవిదాసుకిచ్చింది నందిని. "దీని నిండా లంక నాణాలున్నాయి. తీసుకుపో! ఆయన వచ్చే సమయమైంది!" అన్నది.

రవిదాసు సంచి తీసుకొని బయలుదేరుతుండగా, "కాస్త ఆగు! ఆ యువకుడిని కనీసం కోట బయటికి తీసుకువెళ్ళి విడిచిపెట్టు! తర్వాత అతను ఇంకో దారిన వెళ్లనీ! సొరంగమార్గాన్ని అతనికి చూపించడం నాకిష్టం లేదు!" అని చెప్పి లేచి నిలబడి, చీకటి మాళిగవైపు చూసింది.

అక్కడ ఏమీ కనిపించలేదు. వేళ్లతో సైగ చేసింది. మెత్తగా చప్పట్లు తట్టింది; ఏమీ ఫలించలేదు.

ఆమె, రవిదాసు ఇద్దరు కలిసి లతామంటపపు దారిగుండా కాస్తదూరం వెళ్ళారు. ఆ బ్రహ్మాండమైన చీకటి మాళిగ వాకిలిని సమీపించారు.

కానీ వంతిదేవుడు కనిపించలేదు! చుట్టుపక్కల ఎక్కడా అతని ఆనవాళ్ళు లేవు.

~~~
~~~

# అధ్యాయము - 37

## సింహాలు ఢీకొన్నాయి!

తంజావూరు  ప్రజలకు పళువూర్ సహోదరులంటే ప్రత్యేక అభిమానం. ఆ పాత నగరానికి కొత్త వెలుగు, పలుకుబడి, వైభవమూ తెచ్చినవారు పళువూర్ సహోదరులే కద?

ఏనుగులు, గుర్రాలతో ఊరేగింపంటే జనాలకు గుమిగూడి చూసేందుకు సంబరమే కద? అందులోనూ ధనాధికారి పెద్ద పళువేట్టరయ్యర్ తంజావూరు నుంచి బయటికి వెళ్ళినా, తిరిగివచ్చినా పబ్బమే - వీధుల్లో రెండువైపులా నిలబడి వేడుక చూస్తూంటారు; కొందరు జయజయధ్వానాలు చేస్తారు; ఇంకొందరు దీవిస్తారు; మరింకొందరు వారిపైన పూలవర్షం కురిపించి మురిసిపోతారు.

సాధారణంగా పెద్దాయన బయటికి వెళ్ళి తిరిగివస్తే తమ్ముడు కోట ద్వారం వద్ద నిలబడి స్వాగతం పలకడం అలవాటు.

అన్నదమ్ములు ఒకరినొకరు హత్తుకోవడం నీలగిరి, 'పొదిగై' పర్వతం ఆలింగనం చేసుకొన్నట్లు అగుపించేది.

ఇద్దరూ రెండు ఏనుగులపైనో, గుర్రాలపైనో ఎదురెదురుగా వచ్చి పక్క పక్క నిలబడితే ఆ దృశ్యాన్ని చూసేందుకు వేయి కళ్ళు చాలవు!

పళువూర్ సహోదరులను కొందరు హిరణ్యాక్ష, హిరణ్యకశ్యపులకు పోల్చి చెబుతారు. ఇంకొందరు వారిని 'సుందోపసుందులు'గా వర్ణిస్తారు. శ్రీరామ భరతులని, భీమార్జునులని కూడ కొందరు వర్ణించడం కద్దు.

కానీ ఈరోజు పెద్ద పళువేట్టరయ్యర్ తంజావూరు కోటలో ప్రవేశించేటప్పుడు ప్రజలు పెద్దగా గుమిగూడనూ లేదు, అంతగా కుతూహలం చూపించనూ లేదు. చిన్న పళువేట్టరయ్యర్ అన్నగారిని స్వాగతించేందుకు కోటద్వారం దగ్గర వేచివుండనూ లేదు.

కానీ ధనాధికారి ఇదంతా అంతగా పట్టించుకోక తిన్నగా తమ్ముని మాళిగవైపు సాగారు. ఏదో ఒక ముఖ్యమైన కార్యంలో తమ్ముడు నిమగ్నమైవుండాలని ఆయన అనుకొన్నారు. ఒకవేళ చక్రవర్తి ఆరోగ్యం చాల ఆందోళనాకరంగా వుందో, లెక, లేక .... ఆ పెద్ద సంభవం జరిగిపోయిందో అన్న సందేహం పుట్టింది ఆయనకు. కాబట్టి మామూలుకన్న వేగంగా ఆయన పరివారం కోట దళపతి మాళిగ చేరింది.

-:-

మాళిగ వాకిలికి అన్నగారిని స్వాగతించేందుకు వచ్చిన కోట దళపతి ముఖంలో ఆదుర్దా, దిగులు కనిపించాయి. అన్నగారికి నమస్కరించి తర్వాత ఆయన్ను కట్టుకొన్నారు. ఇద్దరూ మాళిగలోపలికి ప్రవేశించిన వెంటనే తిన్నగా అంతరంగ మంత్రాలోచన మంటపానికి వెళ్ళారు.

అన్నగారు, "తమ్ముడూ! కాలాంతకా! ఏమి అదోలా ఉన్నావు? ఏదైనా విషయం నిన్ను బాధిస్తోందా?" అని అడిగారు.

చిన్న పళువేట్టరయ్యరైన కాలాంతక గండర్, "చక్రవర్తి ఎప్పటిలాగే ఉన్నారు. ఆయన ఆరోగ్యం మెరుగుపడనూ లేదు; తరగనూ లేదు. ఏ అపాయమూ లేదు!" అన్నారు.

"మరెందుకు నీ ముఖమిలా వాడిపోయివుంది? ఎందుకు కోట వాకిలికి రాలెదు? ఊరుకూడ అంతగా సందడి లెకుండ ఉందే!" అని పెద్దాయన అడిగారు.

"అన్నా! ఒక చిన్న సంభవం జరిగింది. అపాయమేమీ లేదు. దాన్నిగురించి తర్వాత చెప్తాను. మీరు వెళ్ళిన కార్యాలన్నీ ఎలా జరిగాయి?" అని కాలాంతక గండర్ అడిగారు.

"నేను వెళ్ళిన కార్యం సంపూర్ణ జయం. ఆహ్వానించినవారందరూ కడంబూరుకు వచ్చారు. అందరూ ఏకకంఠంగా నీ అల్లుడు మధురాంతకుడే చక్రవర్తి తర్వాత పట్టానికి అర్హుడని ఒప్పుకొన్నారు. న్యాయానికి కట్టుబడకుంటే కత్తిపట్టి పోరుకు కూడ సిద్ధమని అందరూ ప్రమాణం చేశారు. కొల్లి మళవర్, వణంగాముడి ముణైయ్యర్ కూడ ఒప్పుకొన్నారంటే మన గురి (ఉద్దేశ్యం) నెరవేరేందుకు ఇక అడ్డేమి? శంబువరయ్యర్ తమ కోట, సొత్తు, సైన్యం అన్నిటినీ ఒడ్డేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆయన కొడుకు గందమారన్ చాల చురుగ్గా ఉన్నాడు. తిరుముణైప్పాడి గురించి దిగులే లేదు. చోళదేశం ఎప్పుడూ మనచేతుల్లోనే ఉంది! ఇంకేం ఆలోచన? తిరుక్కోవలూర్ మలైయమాన్, పార్థిబేంద్ర పల్లవుడు, కొడుంబాళూర్ వేళార్ - ఈ ముగ్గురు మాత్రమే ఒకవేళ ఎదురుతిరగవచ్చు. వారిలో కొడుంబాళూర్ వేళార్ ఇక్కడ లేడు; లంకలో ఉన్నాడు. తక్కిన ఇద్దరు ఏం సాధించేయగలరు? వీలైనంత త్వరలో చక్రవర్తికి చెప్పి తీర్మానించేయడమే!" అన్నారు పెద్ద పళువేట్టరయ్యర్.

"నాయకులగురించి మీరు చెప్పేదంతా సరే; ప్రజలు? ప్రజలు ఆక్షేపిస్తే?" అని అడిగారు కాలాంతక గండర్.

"హుం! ప్రజల్నెవరడగబోతున్నారు? ప్రజలనడిగా మనం రాజకార్యాలు నడిపిస్తున్నాము ? ఆక్షేపిస్తే, మళ్ళీ వాళ్ళు ఇటువంటి విషయాల్లో తలదూర్చకుండా చేసేయాలి. అలా జరుగుతుందని నేనకుకోవడం లేదు. చక్రవర్తి కోరిక ఇదేలంటే ఊరకుండిపోతారు. పైగా, అరుళ్మొళి వర్మ అదృష్టవశాత్తు

లంకలో ఉన్నాడు. అతడుంటే, ఒకవేళ జనాలు తమ గుడ్డి అభిమానాన్ని చూపేవారేమో. ఆదిత్య కరికాలన్ పైన ప్రజలంతగా అభిమానం, ప్రీతి కలిగివుండలేదు. ప్రజల అభిమానాన్ని మధురాంతకుని వైపు తిప్పడం సులభం. 'శివభక్తుడు', 'ఉత్తమ గుణశీలుడు', అని ఇప్పటికే పేరుపొందివున్నాడు. సుందర చోళ చక్రవర్తి కుమారులిరువురి కన్న నీ అల్లుడి ముఖం మరింత కళగా ఉంటుందని నీకు తెలిసిందే కద? 'అంతర సౌందర్యం ముఖంలో కనిపిస్తుంద'ని నమ్మే మూర్ఖ ప్రజలు 'మధురాంతక చక్రవర్తికి జయహో!'అని ఘోషించకపోతేనే ఆశ్చర్యపడాలి. ఏదేమైనా, నేనున్నప్పుడు నీకేమి దిగులు....?"

"కానీ, వేళక్కార దండుంది కద! వాళ్లను ఎలా ఒప్పించడం?"

"వేళక్కార దండు సుందర చోళ చక్రవర్తికి ప్రాణబలి శపథం చేసినవారు గాని, ఆయన కుమారులకు కాదుకద? అలా ఒకవేళ వాళ్ళు అడ్డంపడ్డా, నీ కోట కాపలా సైన్యం ఉంది కద? ఒక్క ఘడియలో వాళ్లందరినీ పట్టి పాతాళ చెరలో వేసేస్తే సరి!"

"అన్నా! ముఖ్యమైన అభ్యంతరం పళైయారైనుంచే వస్తుంది. ఆ ముసలిది, రాకుమారి ఒకట్టై ఏం కుట్ర పన్నుతారో తెలియదు. దాన్నే ముఖ్యంగా గమనించాలి..."

"తమ్ముడూ! కేవలం ఇద్దరు ఆడవాళ్ళకా నన్ను బెదరమంటావు? వాళ్ల మంత్ర తంత్రాలకన్నిటినీ వమ్ముచేసేందుకు నాదగ్గర తగిన ఉపాయం ఉంది. దిగులుపడకు!"

"ఇద్దరు కొడుకులనూ తంజావూరుకు రమ్మని సందేశం పంపించాలని చక్రవర్తి ఆజ్ఞాపించివున్నారు..."

"ఆదిత్య కరికాలన్ రాడు. వస్తే అరుళ్మొళి తండ్రి ఆజ్ఞపాటించి రావచ్చు. ఒకవేళ వస్తే అతడిని అడ్డగించాల్సిందే! మధురాంతకునికి యువరాజు పట్టంకట్టి సకల అధికారాలు కట్టబెట్టిన తర్వాతే వాళ్ళిద్దరూ రావచ్చు. అంతకు ముందు రాకూడదు. అది నాకు వదిలిపెట్టు. మరి, అదేమో చిన్న విశేషం జరిగిందన్నావే, అదేమి?"

"కంచినుంచి ఒక యువకుడు వచ్చాడు. చక్రవర్తికి ఒక తాళపత్రమూ, కుందవైకి ఇంకొక తాళపత్రమూ తెచ్చాడు..."

"వాడినేం చేశావు? తాళపత్రాలు లాగేసుకొని వాడిని బంధించి చెరశాలలో పెట్టావు కద?"

"లేదన్నా! కడంబూరులో మిమ్మల్ని కలిశాడనీ, చక్రవర్తికి స్వయంగా ఇమ్మని మీరు చెప్పారనీ అన్నాడు. అది నిజమేనా?"

"లేదు! అంతా అబద్ధం! కడంబూరులో, ఆహ్వానించబడని ఒక యువకుడు గందమారన్ తన స్నేహితుడని చెప్పుకొని వచ్చాడు. కానీ తాళపత్రాలు తీసుకొచ్చినట్లు నాకు చెప్పనే లేదే! వాడి ముఖాన్ని

చూసినప్పుడే సందేహపడ్డాను. వాడి చేతిలో నీవు మోసపోయావా, ఏమి?"

"అవునన్నా! మోసపోయాను. మీపేరు చెప్పినందువల్ల మోసపోయాను!"

"ఒరే దద్దమ్మా! మోసపోయి ఏం చేశావు? పత్రాన్ని చక్రవర్తికి ఇచ్చేశావా? పోనీ, దాన్ని చూశావా, లేదా?"

"చూశాను. అందులో ఏమీలేదు. కంచి బంగారపుమాళిగకు రమ్మని రాసివుంది. తాళపత్రాన్ని ఇచ్చి, ఆ యువకుడు ఏదో 'అపాయం' అని చెప్పాడు చక్రవర్తికి...."

"తర్వాతైనా సందేహించి చెరబట్టలేదా?"

"సందేహించాను; కానీ చెరబట్టలేదు!"

"మరి, ఏం చేశావు?"

"ఊరు చూడాలన్నాడు. చూసి రానీ అని వెంట ఇద్దరు మనుషులను వెంట పంపాను. వారిని ఏమార్చేసి పారిపోయాడు. వాడిని వెతికేందుకే ఏర్పాట్లు చేస్తూ ఉన్నాను. అందుకే కోట వాకిలికి కూడ రాలేదు; నగర ప్రజలను హెచ్చరించి వున్నాను..."

"ఛీ! నీవూ ఒక వీర పురుషుడువేనా? మీసం మొలవని ఒక చిన్న కుర్రాడిచేతిలోనా మోసపోయావు? నీకు కాలాంతక గండన్ అని పేరు పెట్టానే, అది నా బుద్ధితక్కువ తనం. నిన్ను కోట దళపతిగా చేసినందుకు నాకు తగిన గుణపాఠం నేర్పావు! నాపేరు చెప్పి ఒక వీధినపోయే కుర్రాడు నిన్ను ఏమార్చేశాడని చెప్పుకోవడానికి నీకు సిగ్గులేదు?"

"ఊరక మీపేరు చెప్పలేదు. మీ ముద్రవున్న ఉంగరాన్నికూడ చూపించాడు. దాన్ని అతడికి మీరిచ్చారా?"

"లేనేలేదు! అలాగ మోసపోవడానికి నేనేమంత వెర్రివెంగళప్పనా?"

"అతడిదగ్గర ఆ ఉంగరం ఉందనేది నిజం. నాదగ్గర కూడ చూపాడు. కోటద్వారపు కాపలావాళ్ళ దగ్గరకూడ చూపించే లోపలికి వచ్చాడు. మీరివ్వలేదంటే, ఇక ఒకేఒక చోటినుంచి మాత్రమే ఆతడా ఉంగరాన్ని పొందగల అవకాశం ఉంది."

"ఎవరిగురించి మాట్లాడుతున్నావు?"

"మీరూహించలేదా? యువరాణిగురించే చెప్తున్నాను..."

"ఛీఛీ! జాగ్రత్త! నాలుక నరికేస్తాను!"

"నా నాలుక కోసినా కోయండి; తల నరికేసినా నరకండి. చాలా రోజులుగా చెప్పాలనుకుంటున్న

విషయాన్ని ఇప్పుడు చెప్పేస్తున్నాను. విషనాగు అందంగా ఉందని ఇంట్లోపెట్టుకొని మురిసిపోతున్నారు. అది ఒకరోజు కాటు వేయనే వేస్తుంది. మనందరినీ నాశనం చేయబోతుంది! వద్దు! ఆమెను తరిమేసి తర్వాతి కార్యం చూడండి!"

"కాలాంతక గండా! చాలా రోజులుగా నీకు చెప్పాలనుకొంటున్న ఒక విషయాన్ని నేనిప్పుడు చెబుతాను. నీవు ఏవిషయంగురించైనా నీ అభిప్రాయాన్ని ధారాళంగా వెలిబుచ్చవచ్చు. నేను చేసే పని ఏదైనా నీకిష్టంలేకపోతే ధైర్యంగా నన్ను ఖండించవచ్చు. కానీ, నేను చేబట్టి పెళ్ళిచేసుకొన్న స్త్రీని గురించి లోకువగా ఒక్క మాట మాట్లాడావో, నిన్ను పెంచిన ఇదే చేతులతో నిన్ను చంపేస్తాను! కత్తిపట్టేందుకు నేర్పించిన నేనే నిన్ను నీకత్తితోనే చంపేస్తాను! జాగ్రత్త!"

-:-

ఆ ఇద్దరు సహోదరుల వాగ్యుద్ధం చూస్తే రెండు సింహాలు ఢీకొంటున్నట్లు అగుపించింది. వారి గొంతుకూడ సింహగర్జనలాగే మారుమోగింది. వారు మాట్లాడుతోంది అంతరంగ మంత్రాలోచన మంటపంలోనే అయినా, వారి మాటలు బయట వేచివున్నవారికి, మాటలు స్పష్టంగా వినిపించకపోయినా, ఉరుముల్లాగ వినవచ్చింది. అందరూ, 'ఏం విపరీతమో!' అని గడగడ వణకసాగారు.

~~~
~~~

# అధ్యాయము - 38

## నందిని అలక

పెద్ద పళువేట్టరయ్యర్ చివరికి తమ మాళిగకు బయలుదేరేటప్పటికి మధ్యరాత్రి దాటి మూడోజాము ప్రారంభమైంది. వీధిలో గాలి లేపిన దుమారంకన్న ఆయన మనసులో రేగిన దుమారం ఇంకా పెద్దగావుంది. తన ముద్దుల తమ్ముడిని అంతగా తిట్టినందుకు కాస్త పశ్చాత్తాపపడ్డారు. తమ్ముడికి ఆయనపైన ఉన్న మమకారం, అభిమానం అపారమైనవి. ఆ అభిమానంవల్లనే ఏదో చెప్పేశాడు. అయినాకూడ వాడిది సందేహబుద్ధి. నందినిపైన ఎందుకు చాడీ చెప్పాలి? మనుష్యస్వభావమిలాగే ఉంటుంది కాబోలు - తాను చేసిన తప్పుకు ఇంకొకరిపైన నింద మోపి తప్పించుకోవడం.. చేతికి చిక్కిన ఆ జిత్తులమారి కుర్రాడిని వదిలేసి, తన అసమర్ధతను కప్పిపుచ్చుకొనేందుకు ఒక స్త్రీపైన, అదికూడ తన స్వంత వదినపైన నిందమోపజూడడం వీడి వీరత్వానికి, పురుషత్వానికి తగునా? పోతే పోనీ! అందుకు తనను మన్నింపు కోరాడు కద? ఇక అందుగురించి మనమెందుకు చింతించడం?

అయినప్పటికీ, తమ్ముడు చెప్పిన మాటలో అణువంతైనా నిజం ఉండవచ్చా? ఒకవేళ ఈ ముదుసలి ప్రాయంలో మనకు ఆడదాని పిచ్చి పట్టుకొందా? ఎక్కడో అడవిలో నుంచి పట్టుకొచ్చిన ఒక ఆడదానికోసం, తోడబుట్టిన తమ్ముని, నూరు యుద్ధాలలో పక్క నిలబడి యుద్ధంచేసిన తమ్ముని, ఎన్నోసార్లు తన ప్రాణాలనుకూడ లెక్కచేయక తమను ఆపదనుంచి కాపాడిన తమ్ముని ఇలా తిట్టి దండించాం కద? ఇంతకీ ఆమె ఎందులో గొప్ప? ఆమె పూర్వాపరాలు మనకు తెలియవు. ఆమె నడవడిక, మాటలు ఒక్కొక్కసారి సందేహాస్పదంగా ఉన్నాయి. ఛీఛీ! తమ్ముని మాటలు ఏమిటిలా మన మనస్సులో గందరగోళం పుట్టించాయి? ఏమీ వైపరీత్యం? ఆమె మనపైన ఎంత ప్రేమ, మమకారం కలిగివుంది! ఎంత మర్యాదగా నడుచుకొంటుంది! మన కార్యాలన్నిటిలో ఎంత ఉత్సాహం చూపుతోంది! ఒక్కొక్కప్పుడు మనకు తగిన మంత్రాలోచనలుకూడ చెప్పి సహాయం చేస్తోంది కద? ఈ అరవైఏళ్ళు పైబడ్డ ముదుసలిని ధైర్యంగా పెళ్ళాడింది కద! అదికూడ చూడాలి కద? అప్సరసలు చూసి అసూయపడేటంతటి ఆ సౌందర్యవతికి స్వయంవరం ఏర్పాటుచేస్తే, దేవలోకంలోని ఆ ఇంద్రుడుకూడ పరుగెత్తి రాడూ? కానీ, వయసుమీరిన మగవాళ్ళు వయసులో ఉన్న అమ్మాయిని పెళ్ళాడితే అనవసరమైన సందేహాలతోతమ జీవితాలను నాశనం చేసుకొంటారని వినివున్నాం కద? ప్రపంచంలో అటువంటి ఉదాహరణలు చూసి ఉన్నాం కూడ. అలా నవ్వులపాలయ్యేందుకు మనకు మనమే అవకాశం కల్పించడం ఎంతవరకు ఉచితం?

అయినాకూడ, కొన్నికొన్ని చిన్న విషయాలు ఆమెనే అడిగి తెలుసుకోవడం అత్యవసరం. తరచు తన ముద్రవున్న ఉంగరం కావాలని అడిగి తీసుకొంటోందే, అదెందుకు? తరచూ లతామంటపంలో

ఒంటరిగా  కూర్చొంటోందే, ఎందుకని? ఎవరో ఒక మంత్రవాది ఆమెను చూసేందుకు వస్తున్నాడని వినడమే కాక, ఆమెకూడ ఒప్పుకొంది కద, ఏమా రహస్యం? మంత్రవాదిని ఈమె ఏమడిగి తెలుసుకోగోరుతోంది? మంత్రంవేసి ఈమె ఎవరిని వశపరుచుకోవాలి? అన్నిటికీ మించి, 'పెళ్ళైనా బ్రహ్మచారి' అన్న స్థితిలో తన్ను ఇంకా ఎన్నాళ్ళుంచబోతోంది? ఏదో వ్రతం, నోము అని చెప్తూందే తప్ప, ఏం వ్రతం, నోము, ఎందుకు చేస్తోందని  చెప్పడం లేదుకద? ఇదంతా కట్టుకథలాగుంది. ఏదేమైనా, ఈ రాత్రి ఈ విషయం లోగుట్టు తెలుసుకొనే తీరాలి!

-:-

పెద్ద పళువేట్టరయ్యర్ తన మాళిగకు వచ్చి చేరినప్పుడు, అంతఃపుర స్త్రీలు, దాదులు, సేవకులు అందరూ వాకిలిదగ్గర ఆయనకు స్వాగతంచెప్పారు. కానీ, ఆయన చూడగోరిన యువరాణి మాత్రం ఆయన కళ్ళకగుపించలెదు. విచారించగా, ఇంకా లతామంటపంలో ఉందని తెలిసింది. ఆయన మనస్సులో, 'నడిరాత్రి దాటిన తర్వాత కూడ అక్కడేం పని?' అన్న ప్రశ్నతోబాటు, తనను నిర్లక్ష్యం చేస్తోందా అన్న సందేహం, కోపంకూడ లేచాయి. కాస్త కోపంగానే లతామంటపంవైపు నడిచారు.

ఈయన లతామంటపం వాకిలి సమీపించేటప్పటికి, నందిని తన చెలికత్తెలతో ఎదురురావడం కనిపించింది. అలా వచ్చినావిడ ఈయనను చూసిన వెంటనే నిలబడి, ఆయనను చూడక, తోటలో చీకటి కమ్ముకొన్న స్థలంవైపు చూడసాగింది. ఆమె వెంట వచ్చిన దాది కాస్త దూరంగా నిలబడిపోయింది.

పళువేట్టరయ్యర్ నందిని చెంతకు వచ్చిన తర్వాత కూడ ఆమె ఆయనను తిరిగి చూడలేదు. నందినిని దండించాలని కోపంతో వచ్చినాయనకు, దానికి బదులు ఆమె కోపాన్ని శాంతింపజేయవలసిన పరిస్థితి వచ్చింది, పాపం!

"నందినీ! నా ముద్దుల రాణీ! ఎందుకీ కోపం? ఎందుకీ విముఖత?" అని అడుగుతూ, తన ఇనుపచేతిని ఆమె భుజంపైన మెత్తగా వుంచారు.

నందినేమో పూవుకన్న మృదువైన తన చేతితో ఆయన వజ్రాయుధంవంటి చేతిని పక్కకు తోసింది. అబ్బబ్బ! ఇంతటి మృదువైన చేతికి అంతటి బలం ఎక్కడిది?

"నా ప్రాణమా! నీ పట్టు చేతితో తాకి నా చేతిని తోశావే, అదే నా భాగ్యం! త్రికోణ పర్వతం నుంచి వింధ్యపర్వతాలవరకు  వీరాధివీరులెవ్వరూ చేయలేని కార్యాన్ని నీవు చేశావు! అది నా అదృష్టం! అయినా, కోపమెందుకో చెప్పాలి కద? నీ తేనెలొలికే గొంతు వినేందుకు నా చెవులు పరితపిస్తున్నాయి!" అని బ్రతిమాలారు నూరు యుద్ధాల్లో విజయం సాధించిన ఆ మహావీరుడు.

"మీరు నన్ను విడిచి వెళ్ళి ఎన్నాళ్ళైంది? పూర్తి నాలుగు రోజులు!" అన్న నందిని గొంతులో దుఃఖం ధ్వనించింది. అది ఎన్నో శూలాలను, కత్తులను ధైర్యంగా ఎదుర్కొని నిలిచిన ఆయన మనసును

నిప్పులో వేసిన మైనంలాగ కరిగించేసింది.

"అందుకేనా ఇంత కోపం? నాలుగు రోజుల విరహాన్ని నీవు తట్టుకోలేకపోయావా? యుద్ధరంగానికి వెళ్ళవలసివస్తే ఏం చేస్తావు? నెలల తరబడి నన్ను విడిచి ఉండాల్సి వస్తుంది కద?" అన్నారు.

"అటువంటి పరిస్థితి వస్తే, నేను మిమ్మల్ని విడిచివుంటాననుకోకండి! నేను మీ నీడలా మిమ్మల్నే వెన్నంటి వస్తాను..."

"బాగుంది! నిన్ను యుద్ధరంగానికి పిలుచు వెళితే, నేను యుద్ధం చేసినట్లే! ముద్దూ! ఈ ఎద, భుజాలు ఎన్నో కత్తులను, శూలాలను ఎదుర్కొని తట్టుకొన్నాయి. అలా పొందిన గాయాలు అరవైనాలుగని లోకవిదితం! కానీ, నీ పూవంటి మృదువైన మేనిలో ఒక ముల్లు గుచ్చితే, నా ఎదలో గాయమైనట్లే! అటువంటప్పుడు నిన్ను యుద్ధరంగానికి ఎలా తీసుకువెళ్ళను? నీవింతసేపు ఈ గట్టి రాతిసేలపైన నిలబడివుండడమే నాకెంతో వేదనను కలిగిస్తోంది. ఇలారా; వచ్చి నీ పూలమంచంపైన ఆసీనురాలివి కా! నీ సుందరవదనాన్ని చూస్తాను. నాలుగురోజుల వేర్పాటు నీకు మాత్రమే విరహవేదనను కలిగించిందనుకొన్నావా? నిన్ను చూడని ఒక్కొక్క క్షణమూ, నాకు ఒక యుగంగా గడిచింది. ఇప్పుడైనా, నా తాపం తీరేటట్లు నీ సుందరవదనాన్ని చూస్తాను!" అని చెప్పి, నందిని చేయి పట్టుకొని తీసుకొనివెళ్ళి పూలమంచంపైన కూర్చోబెట్టారు.

-:-

నందిని తన కళ్లను తుడుచుకొని తలెత్తి ఆయనను చూసింది. బంగారుదీపం కాంతిలో ఆమె ముఖంలో విరిసిన చిరునవ్వును చూసి, "ఆహా! ఈ చిరునవ్వుకోసం ముల్లోకాలను కూడ పణంగా పెట్టవచ్చుకద! మూడులోకాలు మన వశంలో లేనందువల్ల, మన ఒడలు, ప్రాణం, ఆస్తి మూడింటిని ఈమెకు ధారాదత్తం చేద్దాం! కానీ, ఈమె మననేమీ అడగదాయె!' - అని అనుకొన్నారు ఆ వీరాధివీరుడు. ఆమెను, ప్రశ్నించాలి, శిక్షించాలనే ఆలోచనే గాలికెగిరిపోయింది! నందిని కాలితో చెప్పిన పనిని తలతో చేసే స్థితికి వచ్చేశారు! ఏ దాస్యమైనా ఫరవాలేదుగాని, స్త్రీదాస్యంలాగ మతి చెడగొట్టగలదింకేమీ లేదు!

"నాలుగురోజుల తర్వాత తిరిగివచ్చారు కద? తిన్నగా నన్ను చూసేందుకు ఇక్కడికెందుకు రాలేదు? మీకు నాకన్న మీ తమ్ముడే ఎక్కువైపోయాడు!" అన్నది నందిని. అనేసి, ఉత్తుత్తి కోపంతో కనుకొనలనుంచి ఆయనవైపు చూసింది.

"అలా కాదు, నా ముద్దులరాణీ! విల్లువిడిచిన బాణంలాగ నిన్ను చూసేందుకే వస్తున్నాను. కానీ, ఈ వెర్రి వెంగళప్ప మధురాంతకుడున్నాడు చూడు - వాడు రహస్య సొరంగమార్గంగుండా క్షేమంగా వచ్చిచేరుతాడా లేడా అన్న దిగులు వల్ల తమ్ముని మాళిగకు వెళ్ళి విచారించ వలసివచ్చింది!" అన్నారు

ధనాధికారి.

"అయ్యా! మీరు చేపట్టిన కార్యాలన్నిటిలో నాకు శ్రద్ధ, ఆసక్తి ఉన్నాయి. మీ ప్రయత్నాలన్నీ సఫలం కావాలనే నేనూ ప్రార్థిస్తున్నాను. కానీ, నేను ఎక్కవలసిన తెరపల్లకిలో ఒక మగపిల్లాడిని మీరు ఎక్కించుకొని వెళ్ళడం నా మనసుకు కష్టం కలిగిస్తోంది. దేశప్రజలంతా మీరు నన్నే అలా పల్లకిలో ఎక్కించుకొని తీసుకువెళ్తున్నారని అపోహ పడుతున్నారు..."

"అది నాకు సంతోషకరమని అనుకొంటున్నావా? కానే కాదు! కానీ, చేపట్టిన కార్యం చాల పెద్దది. దాన్ని నెరవేర్చేందుకే ఇదంతా సహిస్తున్నాను. పైగా, ఈ ఆలోచన నాకిచ్చిందే నీవేనని మరిచిపోయావా? కోటనుంచి బయటకు వెళ్ళేటప్పుడు, తిరిగివచ్చేటప్పుడు సొరంగమార్గంగుండా వెళ్ళి, వచ్చే యుక్తికూడ నీవేకద చెప్పావు?..."

"నా కర్తవ్యాన్నే నేను నెరవేర్చాను. భర్త చేపట్టిన కార్యంలో సహాయం చేయడం భార్య ధర్మం కద? ఏదో నాకు తోచిన ఉపాయాన్ని మీకు చెప్పాను. దానివల్ల మీకు ...."

"అది మాత్రమేనా నీవు చేసిన పని? ఈ మధురాంతకుడు ఒళ్ళంతా విభూతి పూసుకొని, రుద్రాక్షమాలలు వేసుకొని శివజపం చేస్తూ గుళ్ళూ, గోపురాలు పట్టుకొని తిరుగుతుండేవాడు! వాడి మనసులో రాజ్యమేలే ఆశను మేమెవరూ పుట్టించలేకపోయాము. కానీ, నీవొక్కసారి వాడితో మాట్లాడావు. అంతే! పూర్తిగా మారిపోయాడు! ఇప్పుడు వాడికున్న రాజ్యకాంక్ష ఎంతని చెప్పలేము! అంతగా మారిపోయాడు. ప్రస్తుతం వాడి మనోరాజ్యం లంకనుంచి హిమాలయాలవరకు విస్తరించివుంది! మనకన్న వాడికి తొందర ఎక్కువైపోయిందిప్పుడు. చోళసింహాసనంపైన ఎక్కి కూర్చోవడానికి తహతహలాడుతున్నాడు. నందిని! నీవు వాడిపైన ఏం మాయమంత్రాలు ప్రయోగించావో తెలియదు!... అవునూ, నీవే ఇంత మంచి మంత్రవాదిపై ఉన్నప్పుడు ఇంకెవడో మంత్రవాదినెందుకు పిలిపించుకొంటున్నావు? అందుగురించి జనాలు అనవసరంగా...."

"రాజా! అలా ఎవరైనా అధిక ప్రసంగం చేస్తే వాళ్ళ నాలుక తెగగోసి బుద్ధి చెప్పడం మీ బాధ్యత. మంత్రవాదిని నేనెందుకు పిలిపించుకొంటున్నానో మీకిప్పటికే చెప్పానుగా? మీరు మర్చిపోయారంటే మళ్ళీ చెప్తాను. పళైయార్రైలో ఉన్న ఆ ఆడపాము విషం దించేందుకే. మీరు మగతనం ఉన్న పురుషులు. యుద్ధరంగంలో మగవారికెదురుగా నిలబడి పోరాడుతారు. 'కేవలం ఆడ పిల్లలు' అని వారిని నిర్లక్ష్యం చేస్తారు. ఆడవాళ్ళతో పోరాడడం మీకవమానం. కానీ, నూరు మంది మగవాళ్ళకన్న ఒక్క ఆడది ఎక్కువ కీడు చేయగలదు. పాము బుద్ధి పాముకు తెలుసు. ఆ కుందవై వంచనబుద్ధి మీకు తెలియదు. నాకు తెలుసు. మిమ్మల్ని, నన్ను చేర్చి అది అవమానించిన విషయం మీరు మర్చిపోయినా, నేను మరువలేను. నూరు ఆడవాళ్ళ మధ్య, 'ఆ ముసలాడికి చావబోయే సమయంలో ఆడదాని మోజు పట్టుకొందంటే, నీ బుద్ధి

ఏమైంది?' అని అడిగిందే, అది నేనెలా మరువగలను? 'దేవలోక మోహినిలాగ మెరుస్తున్నావే, ఏ రాకుమారుడైనా నిన్ను వరించి పట్టమహిషిగా చేసుకొనేవాడు కద? గతిలేనట్లు ఆ ముసలి ఎనుబోతును పెళ్ళి చేసుకొన్నావే!' అని అది నన్ను ఎద్దేవా చేసింది కద, అది నేనెలా మర్చిపోను?" అని నందిని వెక్కి వెక్కి ఏడవసాగింది. ఆమె కళ్ళనుంచి పొంగిన కన్నీరు ధారలుగా పారి ఆమె ఎదను తడివిపేయసాగింది.

~~~
~~~

# అధ్యాయము - 39

## ప్రపంచం గిరగిర తిరిగింది!

ముదుసలి ప్రాయంలో తాను వివాహం చేసుకొన్నది గురించి పలువురు పలురకాలుగా మాట్లాడుకొంటున్న విషయం పళువేట్టరయ్యర్ ఎరుగుదురు. అలా నిందరోపణగా మాట్లాడినవారిలో కుందవైదేవికూడ ఉందన్న సంగతి ఆయన చెవికి చేరివుంది. కానీ కుందవై ఏమందని ఆయనదగ్గర ఇంతవరకు ఎవరూ ఉన్నదున్నట్లు చెప్పలేదు. అదిప్పుడు నందిని నోట విన్న తర్వాత ఆయన హృదయం కొలిమిలా మండింది. ఆయన ఊపిరినుంచి సెగలు వెలువడసాగాయి. నందిని కన్నీరు అగ్నికి ఆజ్యంపోసినట్లైంది.

“నా ప్రాణమా! ఆ ఛండాలి, పాతకి అలాగా అన్నది! నన్ను ముసలి ఎనుబోతనా అన్నది? ఉండనీ; దాన్ని...దాన్ని... ఏం చేస్తానో చూడు! ఎనుబోతు మల్లెతీగను కాలికింద వేసి నలిపేసినట్లు నలిపేస్తాను! ఇంకా...” అని పళువేట్టరయ్యర్ కోపావేశాలు పొంగుకురాగా ముందుకు మాట్లాడలేక ఉక్కిరిబిక్కిరయ్యారు. ఆయన ముఖం ఎంత ఘోరంగా మారిందో వర్ణించలేము.

-:-

నందిని ఆయనను శాంతపరిచేందుకు ప్రయత్నించసాగింది. ఉక్కులాంటి ఆయన చేతిని తన పూవంటి చేతిలోకి తీసుకొని నిమరసాగింది.

“నాధా! నాకు జరిగిన అవమానాన్ని మీరు సహించలేరని నాకు తెలుసు. కానీ, ఒక మత్తగజపు కుంభాన్ని పగలగొట్టి రక్తం తాగగల సింహం కేవలం ఒక పిల్లిపైన తన ప్రతాపాన్ని చూపలేదు. కుందవై ఒక ఆడపిల్లి; కానీ పెద్ద మంత్రగత్తె. మాయమంత్రాలతోనే అందరినీ తన కట్టుబాట్లో ఉంచుకొంది! ఈ చోళరాజ్యాన్నే ఒక ఆట ఆడిస్తోంది! దాని మంత్రాన్ని మంత్రంతోనే జయించాలి. తమకిష్టం లేకపోతే చెప్పండి. ఈరోజే ఈ మాళిగ విడిచి వెళ్ళిపోతాను....” అని చెప్పి మళ్ళీ వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

-:-

పళువేట్టరయ్యర్ కోపోద్వేగం అణగిపోయింది. మోహోద్వేగం పెరిగింది.

“వద్దు, వద్దు! కావాలంటే వేయి మంది మంత్రవాదులను పిలిపించుకో! కానీ, నీవిక్కడినుంచి ఎక్కడికీ వెళ్ళకు! నా ప్రాణానికి ప్రాణం నీవు! నా ప్రాణమే నీవు! ప్రాణం పోయిన తర్వాత ఈ దేహమేం చేయగలదు? ఇప్పటికే నీవు నన్ను పక్కకు తోసివుంచడం నా ప్రాణాలను తోడేస్తోంది! ఇన్ని మాయమంత్రాలు తెలుసుకొని ఉన్నావు కద, నాకూ ఒక మంత్రం నేర్పు!” అన్నారు.

"నాధా! చేతిలో శూలమూ, కత్తీ ఉన్న మీకెందుకవన్నీ? నాకు వదిలిపెట్టండి!" అన్నది నందిని.

"నా ప్రాణమా! ముద్దూ! నీవు నీ అందమైన నోరు తెరిచి నన్ను నాధా అని పిలిచేటప్పుడే నా ఒడలు పులకరిస్తోంది. నీ ముఖారవిందాన్ని చూసి నా మతి భ్రమిస్తోంది! నా చేతిలో శూలమూ, కత్తీ ఉన్నమాట నిజమే. అదంతా యుద్ధరంగంలో శత్రువులను ఎదుర్కొనేందుకు ఉపయోగిస్తాను. కానీ, ఈ పూమందిరంలో వాటికేం పని? మన్మధుని బాణాలకు నాదగ్గర ఎదురు బాణమే లేదే! నీ దగ్గరే కద ఉంది? నాకు మంత్రమెందుకని అడిగావు కద? నా మనస్సును, దేహాన్ని అహోరాత్రాలు దహిస్తోందే, ఆ అనలాన్ని ఆర్పేందుకే! అందుకు ఏదైనా మంత్రం నీకు తెలిసుంటే నాకు నేర్పు. లేదా నీ పూమేనిని తాకి సుఖపడే భాగ్యాన్ని కలిగించు! ఎలాగైనా నా ప్రాణాన్ని కాపాడు! నా ముద్దులరాణీ! లోకమెరిగేటట్లు మనమిద్దరం పెళ్ళిచేసుకొని రెండున్నర సంవత్సరాలు కావస్తోంది! కానీ, మనం లోక సంప్రదాయం ప్రకారం ఇంకా సంసారం ప్రారంభించలేదు. వ్రతమనీ, నోమనీ చెప్పి నన్ను దగ్గరకు రానీకున్నావు. చేయిపట్టి పెళ్ళాడిన మగడిని ఎందుకు పెనంలో వేసి వేయించినట్లు వేయిస్తున్నావు! లేకపోతే నీ చేత్తోనే ఇంత విషం ఇచ్చి నన్ను చంపేయి!..."

నందిని తన చెవులను మూసుకొని, "అయ్యయ్యో! ఇటువంటి కఠోరమైన మాటలు మాట్లాడకండి! ఇంకొకసారి అలా అంటే, నేనలాగే చేసేస్తాను! విషం మింగి చచ్చిపోతాను. తర్వాత మీరు ఏదిగులు లేకుండ నెమ్మదిగా ఉండవచ్చు!" అన్నది.

"లేదు, లేదు! ఇక అలా మాట్లాడను. నన్ను మన్నించు! నీవు విషం తాగి చనిపోతే నేనెలా నెమ్మదిగా ఉండగలను? ఇప్పుడు సగం పిచ్చివాడిగా ఉన్నాను. తర్వాత పూర్తిగా పిచ్చివాడినైపోతాను!..."

"నాధా! మీరెందుకు పిచ్చివారు కావాలి? ఏరోజు మనమిద్దరం చేయిపట్టి పెళ్ళిచేసుకొన్నామో, ఆ రోజే మనమిద్దరి మనసు, శరీరాలు ఒకటయ్యాయి. మీ ఎదకు నాఎద ప్రతిధ్వని. మీ మనస్సులో ఉదయించే ప్రతి ఆలోచన, నా ఎదలో ప్రతిబింబిస్తోంది. ఇలా మనమిద్దరం ప్రాణానికి ప్రాణంగా ఒకరిలో ఒకరుగా లీనమైపోయి ఉన్నప్పుడు, ఈ శరీరం గురించెందుకు చింత? మట్టినుంచి పుట్టిన శరీరమిది. కాలి బూడిదై మట్టిలో కలిసిపోబోయే శరీరమిది..."

"ఆపు! ఆపు! నీ కఠోరమైన మాటలను విని నా చెవులు మండిపోతున్నాయి!" అని పళువేట్టరయ్యర్ గగ్గోలు పెట్టారు. ఆమె మళ్ళీ మాట్లాడేందుకు ఆస్కారమివ్వక, "మట్టినుంచి పుట్టిన శరీరమనా అన్నావు? అబద్ధం! తేనెలొలికే నీ నోరార అటువంటి అబద్ధం ఎలా చెప్పగలిగావు? నీ ఒళ్ళు మట్టితో చేసింది కానే కాదు! లోకంలో ఎందరో స్త్రీలున్నారు. వారందరినీ బ్రహ్మదేవుడు మట్టితోనైనా చేసివుండవచ్చు, రాతితోనైనా చేసివుండవచ్చు. కానీ, నీ బంగారపు శరీరాన్ని బ్రహ్మ ఎలా చేశాడో తెలుసా? దేవలోకంలోని మందార పూలను సేకరించాడు. తమిళనాడుకు వచ్చి తామరపూలను సేకరించాడు. ఆ

పూలను దేవామృత కలశంలో పేశాడు. దానిలో చంద్రకిరణాలను నింపాడు. మన తమిళదేశపు సంగీత వాద్యకారులను పిలిపించి ఇంపైన సంగీతం పుట్టించి, దాన్నికూడ కలిపాడు. అలా ఏర్పడిన అద్భుతమైన పదార్థంనుంచి నీ శరీరాన్ని చేశాడా బ్రహ్మదేవుడు..."

"నాథా! ఏదో బ్రహ్మదేవుని పక్కన నిల్చొని చూసినవారిలాగ మాట్లాడుతున్నారే! ఈ వర్ణనలకన్నిటికీ నేనేనా దొరికాను? తమ అంతఃపురంలో ఎందరో రాణులున్నారు, రాజవంశంలో పుట్టినవారు. ఎంతోకాలంగా వారితో సంసారం చేస్తున్నారు.. మీరు నన్ను చూసి రెండున్నర సంవత్సరాలేగా ఐంది!..." అని నందిని చెప్పేలోపల పళువేట్టరయ్యర్ అడ్డుపడ్డారు. ఆయన మనస్సులో పొంగుతున్న భావాల వెల్లువను మాటల ద్వారా వెలిబుచ్చాలనుకున్నారు కాబోలు. తనను దహించేస్తున్న తాపాగ్నిని తన మాటల వర్షంతో ఆర్పాలనుకొన్నారు కాబోలు.

"నందినీ! నా అంతఃపురస్త్రీల గురించి చెప్పావు. పురాతనమైన పళువూర్ రాజవంశం చాల కాలం వర్ధిల్లాలనే నేను వారిని పెళ్ళాడాను. వారిలో కొందరు గొడ్రాళ్ళుగానే మిగిలిపోయారు. ఇంకొందరు ఆడపిల్లలనే కన్నారు. 'దేవుని దయ అంతే' అని మనసు దిటవు పరుచుకొన్నాను. స్త్రీలగురించిన ఆలోచనే చాల కాలం వదిలిపెట్టేశాను. రాజకార్యాలలో పూర్తిగా నిమగ్నమైపోయాను. చోళరాజ్యపు మేలు గురించిన ఆలోచన తప్ప నా మనస్సులో ఇంకే విషయానికి తావివ్వలేదు. ఇలా ఉన్నప్పుడే పాండ్యరాజులతో చివరగా మహాయుద్ధం జరిగింది. యుక్తవయసులో ఉన్న దళపతులెంతోమందివున్నా, వెనకబడిఉండడానికి నేనిష్టపడలేదు. నేను వెళ్ళి ఉండకుంటే అంతపెద్ద విజయం దొరికేది కాదు. పాండ్యసైన్యాన్ని సమూలంగా నాశనంచేసిన తర్వాత కొంగునాడుకు వెళ్ళాను. అక్కడినుంచి అఖండ కావేరి నదీతీరం వెంబడి వస్తున్నాను. దారిలో దట్టమైన అడవి మధ్య నిన్ను చూశాను. మొదట నీవక్కడ నిలబడివున్నావన్నదే నమ్మలేకపోయాను. కళ్ళు నులుముకొని మళ్ళీ చూశాను. అప్పుడుకూడ నీవక్కడే ఉన్నావు. 'నీవు వనదేవతవై ఉండాలి. సమీపిస్తే మాయమై పోతావు' అనుకొని నిన్ను సమీపించాను. అప్పటికీ నీవు మాయమైపోలేదు. 'పురాణాల్లో చెప్పినట్లు, స్వర్గంలో శాపంపొంది ఈ భువికి దిగివచ్చిన దేవకన్యవై ఉండాలి; మనుష్యభాష నీకు తెలిసివుండదు!' అని భావించి, 'ఓ వనితా! ఎవరు నీవు?' అని అడిగాను. నీవు శుద్ధ తమిళభాషలో ఉత్తరమిచ్చావు. 'నేనొక అనాధ పిల్లను. మీ ఆశ్రయం కోరుతున్నాను. నన్ను కాపాడండి' అన్నావు. నిన్ను పల్లకిలో ఎక్కించుకొని తీసుకొని వచ్చినప్పుడు నా మనసులో ఎన్నెన్నో ఆలోచనలు లేచాయి నిన్ను ఎక్కడో, ఎప్పుడో చూసినట్లనిపించింది. కానీ, ఎంత ఆలోచించి చూసినా జ్ఞాపకం రాలేదు. చటుక్కున నామనసును మూసివున్న మాయతెర తొలగింది - నేను నిన్ను ఈ జన్మలో చూసివుండలేదు. కానీ, మునుపటి జన్మలో చూశానని తెలిసింది. ఆ పూర్వజన్మ జ్ఞాపకాలన్నీ వెల్లువలా వచ్చాయి. నీవు అహల్యగా పుట్టివున్నావు. అప్పుడు నేను దేవేంద్రుడనై పుట్టివున్నాను. స్వర్గలోక పాలనను విడిచి, ఋషిశాపానికి కూడ జంకక, నిన్ను వెతుక్కొంటూ వచ్చాను. తర్వాత నేను శంతన మహారాజుగా పుట్టాను.

గంగానదీతీరం వెంబడి వేటకు వెళ్తున్నప్పుడు నిన్ను చూశాను. భూలోకస్త్రీరూపంలో ఉన్న నిన్ను ప్రేమించాను. ఇంకొక కాలంలో (పూంపుహార్) కావేరిపట్నంలో కోవలన్ అన్న పేరుతో పుట్టాను. నీవు కన్నగిపై అవతరించావు. నా వివేకాన్ని కప్పివుంచిన మాయవల్ల నిన్ను కొంతకాలం మరిచిపోయాను. తర్వాత మాయతెర తొలగింది. నీ విలువ తెలిసింది. మదురై నగరానికి తీసుకొని వెళ్ళాను. దారిలో ఒక అగ్రహారంలో నిన్ను వదిలిపెట్టి కాలి కడియం అమ్మడానికి వెళ్ళాను. వంచకులచేత ప్రాణాలు కోల్పోయాను. అందుకు ప్రతీకారంగా ఈ జన్మలో మదురై పాండ్యవంశాన్ని నాశనం చేసి తిరిగివస్తున్నప్పుడు నిన్ను చూశాను. చాల వందల సంవత్సరాలకు మునుపు విడిపోయిన కన్నగి నీవే అని గ్రహించాను!..."

-:-

ఇలా పళువేట్టరయ్యర్ పూర్వజన్మ కథలను చెప్పుకొచ్చినప్పుడు నందిని ఆయన ముఖంచూడక ఇంకోవైపు చూస్తూంది. కాబట్టి ఆమె ముఖంలో కనిపించిన భావాలను ఆయన చూడలేదు. గమనించివుంటే ఆయన తన మాటలను ముందుకు పొడిగించివుండేవారనేది సందేహమే.

ఇంతసేపు గుక్క తిప్పుకోకుండ మాట్లాడుతున్న ఆయన, కాస్త ఊపిరి పీల్చుకొనేందుకు తన మాటలను ఆపినప్పుడు, నందిని ఆయనవైపు తిరిగి, "నాథా! మీరు చెప్పిన ఉదాహరణలు అంత పొంతనగా లేవు. అన్నీ అపశకునాలుగానే ఉన్నాయి. కావాలంటే మిమ్మల్ని మన్మథుడనీ, నన్ను రతి అని చెప్పండి!" అని మునుపటిలాగ విప్పారిన ముఖంతో అన్నది.

పళువేట్టరయ్యర్ ముఖంకూడ అప్పుడు సంతోషంవల్ల, గర్వంతోను విప్పారింది. ఎంతటి అవలక్షణమైన రూపంగల మనిషికూడ, తాను వలచిన వగలాడి తన్ను 'మన్మథుడ'ని అంటే పొంగిపోరా? అయినప్పటికీ ఆ గొప్పతనాన్ని ఇష్టపడని వారిలాగ మాట్లాడారు.

"బంగారూ! నిన్ను రతితో పోల్చడం సబబే. కానీ, నన్ను మన్మథుడని చెప్పడం తగునా? నీకు నాపైనున్న ప్రేమతో అలా అన్నావు!" అన్నారు.

"నాథా! నాకళ్లకు మీరే మన్మథుడు. మగవాళ్లకు అందం వీరత్వం. మీవంటి వీరాధివీరులు ఈ దక్షిణనాడులో ఇంకెవరూ లేరనేది లోకవిదితం. తర్వాత, మగవారికి వన్నె తెచ్చేది అబలలపై కనికరం. అది మీదగ్గరరుందనడానికి నేనే నిదర్శనం. ఊరూ పేరూ తెలియని అనాథనైన నన్ను దరిజేర్చి ఆశ్రయమిచ్చారు. అపారమైన ప్రేమాదరాలను నాపై కురిపించారు. అటువంటి మిమ్మల్ని ఇంకా చాలకాలం వేచివుండేటట్లు చేయను. నా వ్రతమూ, నోమూ ముగిసేకాలం దగ్గర పడింది..." అన్నది.

"ముద్దూ! ఏం వ్రతం, ఏం నోము అనేది విశదంగా చెప్పేయి! ఎంత త్వరగా ముగించగలమో అంత త్వరగా ముగించి పెడతాను" అన్నారు పళువూర్ ఏలిక.

"తనను మించిన మన్మథుడు లేడని గర్వపడే ఆ సుందర చోళుని కొడుకులెవరూ

సింహాసనమెక్కకూడదు. గర్విష్టైన ఆ కుందపై గర్వాన్ని అణచాలి..."

"నందినీ! ఆ రెండు కార్యాలు నెరవేరాయనే నీవు తీసుకోవచ్చు. ఆదిత్యునికీ, అరుళ్మొళివర్మకూ పట్టానికి అర్హతలేదు; మధురాంతకునికే పట్టంకట్టాలని ఈ రాజ్యపు నాయకులందరూ సమ్మతించడమైంది..."

"అందరూ సమ్మతించేశారా? నిజంగానా?" అని నందిని నొక్కి అడిగింది.

"ఇద్దరు ముగ్గురు తప్ప మిగిలినవారందరూ ఒప్పుకొన్నారు. కొడుంబాళూర్ నాయకుడు, మలైయమాన్, పార్థిబేంద్రుడు ఎప్పటికీ మన పక్షానికి రారు. వారిగురించి దిగులు లేదు..."

"కానీ, చేపట్టిన కార్యం ముగిసేవరకు జాగ్రతగా ఉండాలి కద?"

"అందుగురించి సందేహం లేదు. నేనన్ని జాగ్రతలూ తీసుకొన్నాను. తక్కినవారి మూర్ఖత్వంవల్ల ఏదైనా ఆటంకం వస్తే రావచ్చంతే. ఈరోజు కూడ అటువంటి ఇబ్బందికరమైన పరిస్థితి ఒకటేర్పడివుంది. కంచి నుంచి వచ్చిన ఒక యువకుడు కాలాంతకుని ఏమార్చేసి, చక్రవర్తిని కలిసి, తాళపత్రం ఇచ్చాడు..."

"ఆహా! మీతమ్ముని మీరు ఎడతెరపిలేకుండ పొగుడుతూంటారు. ఆయనకు సామర్థ్యం చాలదని నేను చెప్పలేదా?"

"ఈ విషయంలో వాడు కాస్త తెలివితక్కువగానే నడుచుకొన్నాడు . మన అంతఃపుర రాజ ముద్రను చూపినట్లు చెబుతున్నాడు !"

"మోసపోయినవారు ఇలాగే మాట్లాడుతారు! ఆ యువకుని పట్టుకోవడానికి ఏమీ ప్రయత్నాలు చేయలేదా?"

"చేయకేమి? కోట లోపల, బయటకూడ వేట ఆరంభమైపోయింది! ఎలాగూ పట్టేస్తారు. దీనివల్లేమీ మనకార్యానికి భంగం కలగబోదు. చక్రవర్తి దివంగతులైన తర్వాత మధురాంతకుడు సింహాసనమెక్కడం ఖాయం..."

"నాథా! నా వ్రతమేమని మీకు తెలియజెప్పే సమయం దగ్గరకు వచ్చేసింది..."

"బంగారూ! అదేమనే నేనూ అడుగుతున్నాను..."

"మధురాంతకుడు - ఆ వెధవ కుర్రాడు - ఆడపిల్లను చూసి పళ్ళికిలించేవాడు - వాడు పట్టాభిషిక్తుడు కావడం వల్ల నా వ్రతం నెరవేరదు..."

"ఇంకెందువల్ల నెరవేరుతుంది? నీ కోరిక చెప్పు! నెరవేర్చేందుకే నేనున్నాను!"

"ఏలికా! నా చిరుప్రాయంలో ఒక మహాజ్యోతిష్కుడు నా జాతకాన్ని చూశాడు.

పద్దెనిమిదేళ్లవరకు నేను అనేక కష్టాలు పడతానని చెప్పాడు..."

"ఇంకా ఏం చెప్పాడు?"

"పద్దెనిమిదేళ్ల ప్రాయం తర్వాత నా దశ తిరుగుతుందన్నాడు. సాటిలేని మేటి పదవిని పొందుతానని చెప్పాడు..."

"ఆయన చెప్పింది నిజమే! ఆ జ్యోతిష్కుడెవరని చెప్పు! ఆయనకు కనకాభిషేకం చేస్తాను!"

"నాథా"

"ముద్దూ!"

"ఇంకా ఆ జ్యోతిష్కుడు చెప్పిన మాట ఒకటుంది. అది చెప్పనా?"

"తప్పక చెప్పు! చెప్పే తీరాలి!"

"నా చేయి పట్టి పెళ్ళాడే భర్త, మణిమకుటం ధరించి ఒక మహా సామ్రాజ్యపు సింహాసనమెక్కి, యాభైయారు దేశాల రాజులూ తన చేతికింద ఉండేటటువంటి చక్రవర్తిగా వెలుగొందుతాడని ఆ జ్యోతిష్కుడు చెప్పాడు. అది నెరవేరుస్తారా?"

పళువేట్టరయ్యర్ చెవిన ఈ మాటలు పడ్డ వెంటనే ఆయన తల గిర్రున తిరగసాగింది. నందిని ఆమె కూర్చొన్న పూలమంచం, తర్వాత లతామంటపం, ఆ మంటపపు స్తంభాలు గిర గిరా తిరిగాయి. ఆ తర్వాత తోట, తోటలోని చెట్లు గిరగిరా తిరిగాయి. ఆకాశంలోని చుక్కలు గిరగిరా తిరిగాయి. రెండువైపుల వున్న మాళిగలు తిరిగాయి. లోకమే గిరగిరా తిరిగింది!

~~~
~~~

# అధ్యాయము - 40

## అంధకార మందిరం

కనిపించక మాయమైపోయిన వంతిదేవుడు ఏమయ్యాడని మనమిప్పుడు కాస్త గమనిద్దాం. చీకటి కమ్ముకున్న ఆ రెండవ మాళిగ దగ్గరకు వెళ్ళి దాక్కున్నాడని చూశాం కదా? మంత్రవాది, నందిని కూడబలుక్కొని ఏం మాట్లాడుకొంటున్నారన్నది మొదట చెవులు రిక్కించి వినజూశాడు. కానీ వారి మాటలేమీ అతని చెవిన పడలేదు. అతనికది విని తెలుసుకోవాలన్న శ్రద్ధకూడ అంతగా అనిపించలేదు. తాను నందినితో మాట్లాడుతున్నప్పుడు తన వివేకాన్ని కోల్పోయి ఒక విధమైన మాయమైకం ప్రభావానికి లోనయ్యాడని ఇప్పుడు గ్రహించాడు. మళ్ళీ ఆమెను కలవక, తప్పించుకొని వెళ్ళిపోవడం ఉత్తమం. పళువేట్టరయ్యర్ల చేత చిక్కుకోవడం కన్న ఈ నందిని చేత చిక్కుకోవడం చాల అపాయకరం. వాళ్ళముందు తన బుద్ధి బాగానే పనిచేస్తోంది; చేయి ఎప్పుడూ తన కత్తిపిడిపైన ఉంటోంది. యుక్తితో వారిని గెలవవచ్చు; కత్తితోను చూడవచ్చు. కానీ ఈ మాయమోహిని ముందు బుద్ధి పనిచేయక, మైకం కమ్ముతోంది; చేయికూడ కత్తిని పట్టే శక్తిని కోల్పోతోంది. మళ్ళీ ఆమె ముందుకు వెళితే ఏం జరుగుతుందో ఏమో? చాలనందుకు ఒక మంత్రవాది సహాయ సహకారాలు పొంది వుందీమె. ఇద్దరూ చేరి ఏం మాయ మంత్రాలు చేస్తారో తెలియదు కదా? కుందవైదేవి పైన ఈమెకెంత ద్వేషం? ఆ ద్వేషం ఆమె కళ్ళనుంచి నిప్పురవ్వలుగా లేస్తోంది కదా! ఒకవేళ మనసు మార్చుకొని తనను పళువేట్టరయ్యర్‌కు పట్టి ఇచ్చేసినా ఆశ్చర్యం లేదు! ఆడవాళ్ళ చపల చిత్తం, చంచల బుద్ధి జగద్విదితమే కదా? కాబట్టి ఆమెను మళ్ళీ కలవక పారిపోవడమే మంచిది. కానీ ఎలా? తోటలోపలికి దూరితే దారి వెతుక్కొంటూ వెళ్ళాలి! ప్రాకారమెక్కి దూకాలి! గోడకవతల తనను పట్టుకోవడానికి వచ్చినవారు కాచుకొని ఉంటే?... ఇంకేమీ ఉపాయం లేదా? వంతిదేవా? ఇన్నిరోజులూ నీకు సహాయం చేస్తూ వచ్చిన అదృష్టం ఏమైంది? ఆలోచించు! చురుగ్గా ఆలోచించు! కళ్ళను కూడ కాస్త ఉపయోగించు! నాలుగుపక్కలా పరికించి చూడు! ఇదిగో ఈ చీకటి మందిరం ఉందే, ఇది ఎందుకు చీకటి కమ్ముకొని ఉంది? లోపల ఏం ఉండవచ్చు? దీనిలోపల దూరితే అవతలి వాకిలి ఎక్కడికి చేరుస్తుంది? లోపల దూరి చూద్దామా? ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడైన ఉపయోగపడవచ్చు. ఎవరికి తెలుసు?

కానీ, లోపల ఎలా ప్రవేశించడం? ఎంత పెద్ద బ్రహ్మాండమైన వాకిలి? దానికెంత పెద్ద తాళం? అబ్బబ్బ! ఎంత గట్టిగా వుంది! ఆఁ! ఇదేమి? తలుపులోపల ఇంకొక చిన్న తలుపుందే? చేత్తో తాకిన వెంటనే ఈ చిన్న తలుపు తెరుచుకుంటోందే! అదృష్టమంటే ఇది! లోపల దూరి చూడాల్సిందే!

-:-

పెద్ద తలుపు లోపల కనిపించనట్లు పొదిగివున్న చిన్నతలుపును తెరుచుకొని ఆ చీకటిగుయ్యారంలో అడుగుపెట్టాడు వంతిదేవుడు. అడుగుపెట్టిన వెంటనే అతనికి తోచిన ఆలోచన, తాను ఆ చీకటి మాళిగలో ప్రవేశించిన విషయం నందినికి కూడ తెలియకూడదనే. కాబట్టి చిన్న తలుపును వెంటనే మూసేశాడు. మూసిన వెంటనే లోపలి చీకటి ఇంకా పదిరెట్లు ఎక్కువైనట్లనిపించింది. తలుపు తెరిచివున్న ఒక్క క్షణంలో పెద్ద పెద్ద స్తంభాలు చాల వున్న విషయం తెలిసింది. ఇప్పుడు అవికూడ అగుపించలేదు. చీకటంటే ఇంతగా ఉంటుందని కూడ ఊహించలేదు కద! ఛీఛీ! ఇదేమి? వెలుతురునుంచి ఒక్కసారిగా చీకటిలో ప్రవేశించినప్పుడు ఇలాగే వుంటుందని మరిచిపోతున్నాం. కాసేపైన తర్వాత కళ్ళు ఈ చీకటికి అలవాటుపడి వస్తువులన్నీ మసక మసగ్గా కనిపించనారంభిస్తాయి. అనుభవమున్నా, చీకటిని చూస్తే భయమెందుకు? ఊరక నిలబడివుండడం కన్న, కాస్త ముందుకు నడిచి చూద్దాం. చేత్తో తడుముకొంటూ ముందుకు వెళ్ళవచ్చు. ఇంతవరకున్న స్తంభాలు ఇప్పుడు లేకుండ ఎక్కడికి పోతాయి? అలా అనుకొని వంతిదేవుడు మెల్లగా ముందుకు తడుముకొంటూ నడిచాడు. అతననుకొన్నట్లే చేతికి ఒక స్తంభం తగిలింది! ఆహా! ఎంత పెద్ద స్తంభం! దీన్ని చుట్టు తిరిగి ముందుకు వెళ్ళి చూద్దాం. అలా మళ్ళీ ముందుకు వెళ్ళగా చేతికి ఇంకొక స్తంభం తగిలింది. కానీ, కంటికింకా ఏమీ కనిపించడం లేదే? ఒకవేళ, ఉన్నట్లుండి మనం కంటిచూపే కోల్పోయామా? ఛ, ఇదేమి పిచ్చి ఆలోచన! చీకటివల్ల కంటిచూపెలా పోతుంది? ఇంకాస్త దూరం వెళ్ళిచూద్దాం. ముందు స్తంభాలేవీ తగలడం లేదే! ఏదో పల్లంలో దిగుతున్నట్లనిపిస్తోంది. అవును! ఇదిగో ఒక మెట్టు! మంచివేళ, కింద పడకుండా తప్పించుకొన్నాం! ఇలాగే ఈ చీకటిలో ఏమీ కనిపించక ఎంత దూరం, ఎంతసేపు వెళ్ళడం?... ఎందుకో వంతిదేవుని మనసులో ఒకవిధమైన భీతి కలిగింది. ముందుకు వెళ్ళేందుకు ధైర్యం చాలలేదు. వచ్చినదారి వెంబడి తిరిగిపోవాలంతే! తలుపుతీసుకొని లతామంటపానికి తిరిగిపోవాలంతే! ఈ భయంకరమైన గాఢాంధకారంలో చిక్కుకోవడం కన్న, నందినిని కలిసి, ఆమె ఆలోచన ప్రకారం నడుచుకోవడమే ఉత్తమం. ఏ మాటివ్వమని అడిగినా, ప్రస్తుతానికి ఇచ్చేసి, తర్వాత చూసుకొందాం! ఇలా అనుకొని వంతిదేవుడు వెనుదిరిగాడు. కానీ, తిరిగివెళ్ళేదారి వచ్చినదారేనా? ఎలా చెప్పగలం!... నడవగా నడవగా చేతికి ఏమీ తగలడం లేదే! తలుపును మళ్ళీ కనిపెట్టనేలేమా? రాత్రంతా ఈ చీకటిలో తిరుగుతుండాల్సి వస్తుందా? దేవుడా! ఇదేం విపత్తు!...

ఆహా! ఇదేమి శబ్దం? టపటపమని శబ్దం! ఎక్కడినుంచి వస్తోంది? గబ్బిలాలు రెక్కలు కొట్టుకొనే శబ్దమై ఉండాలి. ఇంత చీకటిలో గబ్బిలాలు కాపురం చేస్తుండడం సహజమే కద? కాదు! ఇది గబ్బిలాల రెక్కల శబ్దం కాదు! ఎవరో నడిచి వస్తున్న శబ్దం!... ఎవరది? మనుషులేనా? లేక.... వంతిదేవుని గొంతెండిపోయింది. ఉన్నట్లుండి ఎవరో అతని ముఖంపైన గుద్దుకొన్నట్లనిపించింది. వంతిదేవుడు తన

శక్తినంతా ఉపయోగించి ఒక్క గుద్దు గుద్దాడు! గుద్దిన చేయి తెగిపోయినట్లు నెప్పిపెట్టింది. రెండవచేతితో తడిమి చూశాడు. చీకట్లో నల్లరాతి స్తంభానికి గుద్దుకోవడమేగాక, దానికి ఒక గుద్దిచ్చాడని తెలుసుకొన్నాడు! చేయి అంత నెప్పెట్టకపోతే తనను చూసి తానే నవ్వుకొనేవాడే. కానీ, దానివల్ల అతని భయం కాస్త తగ్గింది. పూర్తిగా పోలేదు. చెవులు రిక్కించి విన్నప్పుడు ఆ కాలిచప్పుడు మళ్ళీ వినిపించింది. ఒకసారి దూరంగా వెళ్తున్నట్లుంది. ఇంకొకసారి దగ్గరపడుతున్నట్లుంది.! వంతిదేవుడు ఉన్నచోటే నిలబడి శ్రద్ధగా విన్నాడు. అదే సమయంలో కాలిచప్పుడు వస్తున్నవైపు అతని కళ్ళు నిశితంగా చూశాయి.

ఆఁ! వెలుతురు! కొద్దికొద్దిగా పెరుగుతూ దగ్గరౌతోంది! వెలుతురుతోబాటు పొగ! ఎవరో దివిటీతో వస్తున్నారు. నందినే తనను వెతుక్కొంటూ వస్తోందా? అలాగైతే మంచిది. అన్నిటికీ కాసేపు ఇక్కడే దాక్కొని వేచిచూద్దాం! దివిటీ వెలుతురులో అది ఒక విశాలమైన మంటపమని తెలిసింది. అందులో పెద్దపెద్ద స్తంభాలు కనిపించాయి. వాటిపైన భయంకరమైన రాక్షసాకారాలు చెక్కబడివున్నాయి. కిందనుంచి ఒక మెట్లవరుస పైకివచ్చి ఒకమెలిక తిరిగి మళ్ళీ పైకివెళ్ళింది. ఆ మెట్ల అడుగుభాగంవైపునుంచే  ఆ దివిటీ వెలుతురు వస్తూందని కూడ గ్రహించాడు. కాబట్టి వస్తున్నది నందిని కావడానికి వీల్లేదు. 'పాతాళ చెరసాల' అని తాను విన్నది ఈ మాళిగ కిందే ఉందా? ఒకవేళ అక్కడినుంచే ఎవరైనా వస్తున్నారా? పాతాళ చెర గురించిన భయంకరమైన కథలను వంతిదేవుడు వినివున్నందువల్ల అతనికి ఒళ్లంతా జలదరించి, ముచ్చెమటలు పోశాయి. తక్షణమే ఒక పెద్ద స్తంభం వెనుక వెళ్ళి దాక్కొన్నాడు. మహా ధైర్యశాలియైన వంతిదేవునికి అప్పుడు కాళ్ళుచేతులు గడగడ వణకసాగాయి!

-:-

మెట్లమీదుగా మూడు ఆకారాలు పైకి వచ్చాయి. ముగ్గురూ మనుషులే. ఒకతని చేతిలో దివిటీ ఉంది. ఇంకొకతని చేతిలో శూలం ఉంది. మధ్యవున్న వాడి చేత ఏమీ లేదు. దివిటీ వెలుతరులో వారి ముఖాలు కనిపించిన తర్వాత వంతిదేవుని భీతి పూర్తిగా పోయింది. భీతికన్న పదిరెట్లు ఆశ్చర్యం కలిగింది. వారిలో ముందు వస్తున్నవాడు ఇంకెవరో కాదు; వంతిదేవుని ప్రియస్నేహితుడు గందమారనే! మధ్య వస్తున్న వ్యక్తిని చూసి వంతిదేవుడు ఒక విచిత్రమైన భ్రమకు లోనయ్యాడు. పళువూర్ యువరాణి నందినే అనిపించింది. మరుక్షణమే ఆ భ్రమ తొలగింది. వస్తున్నది మగవాడని తెలిసింది. కడంబూర్ మాళిగలో తాను అస్పష్టంగా చూసిన యువరాజు మధురాంతకుడని తెలుసుకొన్నాడు. వెనక దివిటీతో వస్తున్న వ్యక్తిని వంతిదేవుడు ఇంతకు మునుపు చూసివుండలేదు. అతడు వాకిలి కాపలావాడో, సేవకుడో అయివుండాలి.

వంతిదేవుని బుర్ర అతిచురుగ్గా, అతివేగంగా పనిచేయనారంభించింది. వారు ఆ పాతాళ సొరంగమార్గంగుండా లోపలికి రావడం వెనుకవున్న మర్మం అతనికి అతిత్వరలో తెలిసిపోయింది. నందిని

పల్లకెక్కి మునుపటిరోజే వచ్చేసింది. పెద్ద పళువేట్టరయ్యర్ ఈరోజు రాత్రే కోటకు తిరిగివచ్చేశారు. ఇద్దరూ కోట వాకిలిగుండా, బహిరంగంగా వచ్చారు. కానీ, మధురాంతక దేవులు బయటికి వెళ్ళింది తెలియకూడదు; వచ్చింది తెలియకూడదు. అందుకనే ఈ రహస్య సొరంగమార్గాన్ని ఉపయోగించుకొన్నారు. ఈ చీకటి మాళిగ రహస్యమే ఇదే కాబోలు! గందమారన్ కొళ్ళిడం నదీతీరాన తన్ను విడిచి వేరుపడ్డ తర్వాత, ఇంకెక్కడో పెద్ద పళువేట్టరయ్యర్‌ను కలుసుకొన్నాడు. ఈ రహస్య కార్యానికి, అంటే మధురాంతక దేవులను సొరంగమార్గంగుండా తోడుండి తీసకువెళ్ళేందుకు, ఆయన గందమారన్ని ఉపయోగించుకొనివున్నారు. ఆహా! ఇప్పుడు ఆలోచిస్తే గుర్తుకు వస్తోంది. “నాకూ తంజావూరులో పనివుంది. నేనూ అక్కడికి వస్తే రావచ్చు!” అని గందమారన్ చెప్పాడు కద?... ఇప్పుడు ఉన్నట్లుండి వాడి ముందు వెళ్ళి నిలబడితే ఏం చేస్తాడు?... ఈ ఆలోచన ఎంత వేగంగా వచ్చిందో అంతే వేగంగా వదిలేసుకొన్నాడు. ఈ సమయంలో తాను అతనికి ఎదురుపడితే, వాడు చేసివున్న శపథం ప్రకారం తన్ను చంపాల్సి రావచ్చు; లేదా తాను వాడిని చంపాల్సి రావచ్చు. అటువంటి ధర్మసంకటాన్ని ఎందుకు అనవసరంగా కల్పించడం...?

-:-

ఇంతలోపల ఆ ముగ్గురూ మెట్లెక్కి పైకి వెళ్ళిపోయారు. వెలుతురుకూడ రానురాను తగ్గిపోసాగింది. వారిని వెన్నంటి వెళదామని ఒక క్షణం అనుకొన్న వంతిదేవుడు ఆ ఆలోచనను కూడ వెంటనే మార్చుకొన్నాడు. వారు కోట దళపతి చిన్న పళువేట్టరయ్యర్ అంతఃపురానికి వెళుతున్నారన్నది నిశ్చయం. అక్కడికి తాను తిరిగివెళ్ళడం వల్ల ప్రయోజనమేమి? సింహపు గుహనుంచి తప్పించుకొని, మళ్ళీ ఆ గుహలోకే వెళ్ళి సింహం నోట తలదూర్చినట్లే! ఇక వెనుదిరిగి నందిని ఉన్న లతామంటపానికి వెళ్ళడం కూడ నిష్ప్రయోజనమే. ఇంతలోపల పెద్ద పళువేట్టరయ్యర్ అక్కడికి వచ్చివుండవచ్చు - అదికూడ అపాయమే. ఇంకేం చేద్దాం? ... సరే, ఈ మెట్లగుండా కిందికి దిగివెళ్ళి చూస్తే ఏం? ఇలా ఉద్దేశించి మన యువవీరుడు ఆ సొరంగపు మెట్లు దిగాడు.

~~~
~~~

# అధ్యాయము - 41

## భూగర్భ మంటపం

అంధకార బంధురమైన ఆసొరంగమార్గంలో వంతిదేవుడు మెల్లగా గట్టిగా కాలూని, పడిపోకుండ నడవనారంభించాడు. మెట్లు కాస్తదూరం సాగాయి. తర్వాత సమతలప్రదేశం. మళ్ళీ మెట్లు. మళ్ళీ సమతలం. రెండుచేతులనూ పక్కలకు చాచి చూశాడు. గోడలేమీ తగలలేదు. అంటే ఆ సొరంగమార్గం చాల విశాలంగా ఉండితీరాలి. మళ్ళీ కాస్తదూరం వెళ్ళిన తర్వాత మెట్లు పైకి సాగనారంభించాయి. మెలిదిరిగి వెళ్తున్నట్లు కూడ అనిపించింది. అబ్బబ్బ! ఈ చిమ్మచీకటిలో ఇంకెంతదూరం ఇలా తడబడుతూ వెళ్ళాలో!

ఆహా! ఇదేమి? చీకటి కాస్త తొలగి వెలుతురు మెల్లమెల్లగా పెరుగుతోందే! ఈ మసక వెలుతురు ఎక్కడినుంచి, ఎలా వస్తోంది? పైని చూరులో ఎక్కడినుంచైనా వస్తున్న వెన్నెలా? లేక, గోడల్లోవున్న గవాక్షాలనుంచి వస్తోందా? మరుగ్గా ఉంచిన దీపంనుంచి పరుచుకొంటున్న వెలుతురా?...

కాదు, కాదు! మన కళ్ళముందు కనిపిస్తున్న దృశ్యం నిజమా? లేక మన మతి చెడినందువల్ల కలిగిన భ్రమా?

అది ఒక విశాలమైన మంటపం. రాతిని తొలిచి చేసిన భూగర్భ మంటపం. అందుకే తలకు తగిలేటంత కిందుగా పైదూలం అమర్చబడివుంది. అక్కడి మసక వెలుతురు వెన్నెల కాంతి కాదు; చూరునుంచో, గవాక్షాలనుంచో వస్తున్న వెలుతురూ కాదు. ఆహా! అది అక్కడ కుప్పలు కుప్పలుగా పోసివున్న వస్తువులనుంచి కదా వస్తోంది! మణిమకుటాలు ఒక మూల; మణులు, వజ్రాలు, నవరత్న మాలలు ఇంకొక మూల! ఆహా! ఆ గంగాళంలో ఏమవి? మల్లె మొగ్గలవంటి తెల్లని ముత్యాలు! గుండుగుండుగా గట్టిగా ఉన్నాయి! అదిగో ఆ బానలో పసుపు కాంతులీనుతున్న బంగారపు నాణాలు! ఇదిగో ఇక్కడ కుప్పలుగా బంగారపు రాళ్ళు! తంజావూరు నేలమాళిగ బొక్కసం ఇదే కాబోలు! ధనాధికారి పళువేట్టరయ్యర్ మాళిగకు పక్కనే ఈ చీకటి మాళిగ, అందులో ఈ బొక్కసపు నేలమాళిగ ఉండడంలో ఆశ్చర్యం లేదుకద? అమ్మమ్మ! ఏం మన భాగ్యం! అదృష్టలక్ష్మి, భాగ్యలక్ష్మి ఒక్కటై కద మననిక్కడికి చేర్చివున్నారు! ఎటువంటి అపూర్వమైన, అద్భుతమైన రహస్యాన్ని మన ప్రయత్నమేమీ లేకనే తెలుసుకొన్నాం కద! దీన్నెలా ఉపయోగించుకోవడం? ఉపయోగించుకోవడం తర్వాత; ఇక్కడినుంచి వెళ్ళడానికే మనసు రావడం లేదుకద! ఇక్కడే ఉండిపోదామనిపిస్తోంది కద! ఇక్కడే ఉంటే ఆకలి దప్పులు తెలియవు! నిద్ర దగ్గరకుకూడ రాదు! నూరేళ్ళుగా చోళరాజులు సాధించిన విజయాల ఫలాలన్నీ ఇక్కడే ఉన్నట్లున్నాయి. నవనిధులు అంటారు కద, అవన్నీ ఇక్కడే ఉన్నాయి! కుబేరుని బొక్కసం దీనిముందు దిగదుడుపే! ధనలక్ష్మి ఇక్కడ నివసిస్తోంది! దీన్ని వదిలి ఎందుకు వెళ్ళాలి?

-:-

వంతిదేవుడు  ఆ నేలమాళిగలోపల చుట్టి చుట్టి వచ్చాడు. ఒక మూల కుప్పపోసివున్న ముత్యాలను తాకి చూశాడు. ఇంకొక వైపు కుప్పపోసివున్న రత్నహారాలను చేతిలోకి తీసుకొని చూశాడు. వాటిని పడేసి, ఇంకొకవైపు రాగిపాత్రలలో నింపివున్న ముత్యాలలో చేతులు దోపి ఆడించాడు. ఇంకొక పాత్రలో చేయిదోపి బంగారు నాణాలను దోసిలినిండా తీసి పోశాడు. తర్వాత ఇంకొక మూలలో ఏదో తళతళా మెరుస్తుండడం చూసి అక్కడికి వెళ్ళి నిశితంగా చూశాడు. అయ్యో! భవగాన్! అది ఒక ఎముకలగూడు! ఒకప్పుడు రక్తమాంసాలతో సజీవంగా ఉండిన ఒక మనిషి ఎముకల గూడు!

ఆ:! ఈ ఎముకలగూడు కదులుతోందే! ప్రాణమొచ్చి లేస్తోందే! బంగారు నాణాలలాగానే శబ్దం చేస్తోందే! మనకేమో సంగతి చెప్పేందుకు లేచి వస్తున్నట్లు అనిపిస్తోంది!... వంతిదేవుని ఒంటిపైనున్న వెంట్రుకలన్నీ నిక్కబొడుచుకొన్నాయి. తనకు పిచ్చి పట్టేసుకొందనుకొన్నాడు. ఛీఛీ! ఎముకలగూడు లేవడం లేదు! దానిలోపలనుంచి ఒక పందికొక్కు పరుగెత్తుకొస్తోంది! మన కాళ్ళపైనుంచి పరుగెత్తి వెళ్ళిపోయింది!... మ్! ఇప్పుడు మళ్ళీ చూస్తే ఆ ఎముకలగూడు అక్కడే పడివుంది! కానీ అది మనకు ఒక సందేశం చెబుతోందన్నది మాత్రం నిజం. “పారిపో! ఇక్కడ తాత్సారం చేయకు! నేనూ నీలాగ శరీరమున్న మనిషిగానే ఉండేవాడిని. ఇక్కడికి వచ్చి చిక్కుపడ్డాను. ఇక్కడే చచ్చిపోయాను! ఇప్పుడు ఎముకలగూడుగా పడివున్నాను. పారిపో!” అని అది మనని హెచ్చరిస్తోంది. ఇక్కడినుంచి వెంటనే తప్పించుకొని పారిపోతే బతికిపోయాం. లేకపోతే అధోగతే; ఆ మనిషికి పట్టిన గతే!

వంతిదేవుడు ఆ నేలమాళిగనుంచి బయటపడజూశాడు. కానీ బయటపడే దారే కనిపించడం లేదు. వచ్చినదారిని కనిపెట్టలేకపోయాడు. నేలమాళిగలో ఏవైపు వెళ్ళినా దెయ్యంలాంటి చీకటి. కింద చూస్తే అధోపాతాళంలాగ కనిపిస్తోంది. పైకెక్కి వచ్చిన మెట్లు ఎక్కడో ఉండేతీరాలి. దాన్ని కనిపెట్టడానికి వంతిదేవుడు మళ్ళీ ప్రయత్నించ మొదలుపెట్టాడు. వెతికి వెతికి చూశాడు. అలా వెతుకుతున్నప్పుడు ఒక గోడవారగా ఒక బంగారపునాణాల కుప్పను చూశాడు. దాన్ని పరీక్షగా చూసినప్పుడు దానిపైన సాలెపురుగు గూడు కట్టినట్లు కనిపించింది. అది అతనిలో కొన్ని ఆలోచనలను రేకెత్తించింది.

పెద్దలు రాజ్యకాంక్షను, స్త్రీవాంఛను, ధన/కనకవాంఛను సాలెగూడుతో పోల్చారు. సాలెపురుగు తన వలను పన్ని ఎదురుచూస్తోంది. ఎక్కడినుంచో ఒక ఈగ ఎగురుకొంటూ వచ్చి అందులో పడి చిక్కుకొంటోంది. తర్వాత సాలెపురుగు దాన్ని కొద్దికొద్దిగా లోపలికి లాక్కొని తింటోంది. ఈ మూడు విధాలైన ఆశలు కూడ అటువంటివే. మనిషి దారితప్పి ఆ ఆశల వలలో పడి చిక్కుకొంటున్నాడు; తర్వాత విడుదలే లేదు. తనకీ ఒక్కరోజులోనే ఆ మూడు ఆశలూ అనుభవానికొచ్చాయి కద! నందిని అనే పళువూర్ రాణి తన వలలో తన్ను చిక్కించుకోజూసింది. పాత వాణర్ కులపు రాజ్యాన్ని తిరిగ పొందాలనే రాజ్యకాంక్షనూ

చూపించాడు. చివరగా, ఇక్కడ ఈ భయంకరమైన ధనకాంక్ష తనను సమూలంగా మింగజూస్తోంది. మొదటి రెండు ఆశలనుంచి తప్పించుకొన్నాం. ఈ మూడవ విపత్తునుంచికూడ తప్పించుకోవాలి. మనకెందుకు ఈ తంటా? రాజ్యమెందుకు? ధనమెందుకు? ఆడవాళ్ళ సహవాసమెందుకసలు? ఆకాశమే కప్పుగావున్న ఈ అఖండభూమండలమే మన అంతఃపురం! "ఊరులేని వాడికి అన్నీ సొంతఊర్లే, అందరూ బంధువులే!" అని పెద్దలన్నారు కద! అన్ని ఊళ్ళూ మనవే. అందరూ మన చుట్టాలే. ఊరూరూ తిరగడం; కొత్తవెల్లువతో పొంగి పారే నదులను, చిగురించే చెట్లను, జింకలు, నెమళ్ళు, కొండలు, కోనలు మబ్బులూ అన్నిటినీ చూసి ఆనందించడం. ఆకలివేసినప్పుడు ఎక్కడ భోజనం దొరికితే అక్కడ భోంచేయడం; నిద్రవచ్చినచోట నిద్రపోవడం! సులభంగా లభించే ఈ ఆనందమయ జీవనాన్ని వదిలేసి, కష్టాలు, అపాయాలు, ఆశలు నిండిన జీవనాన్ని ఎందుకు కోరుకోవాలి? ఎలాగైనా ఈ నేలమాళిగనుంచి బయటపడితే చాలు; తర్వాత ఈ ఈ అంధకార మందిరం, తంజావూరు కోట వదిలి దూరంగా వెళ్ళిపోవాలి. తర్వాత ఇటువంటి ఇక్కట్లలో చిక్కుకోనే కూడదు...

-:-

ఆఁ! తలుపు తెరుచుకొని మూసుకొంటున్న శబ్దం! మళ్ళీ కాలి చప్పుడు! ఈ రాత్రి జరగబోయే ఆశ్చర్యాలకు అంతులేదు కాబోలు! అబ్బురాలకు అంతులేదు; భయోత్పాత సంభవాలకూ లెక్కలేదు! ఈసారి ఆ కాలిచప్పుళ్ళు చాల దూరంనుంచి వినవస్తున్నాయి. రెండువైపులనుంచీ వస్తున్నట్లనిపిస్తోంది. వంతిదేవుడు చెవులు రిక్కించి జాగ్రత్తగా విన్నాడు. బొక్కసపు నేలమాళిగలో నలువైపులా కమ్ముకొన్న చీకటిని తన నిశిత ద్రుక్కులతో చీల్చుకొని చూడసాగాడు. కాసేపటికంతా అతనూహించిన విధంగానే ఒక అపూర్వమైన దృశ్యాన్ని అతను చూశాడు.

కురవై ఆట మేడకు చాల దూరంలో కూర్చొన్నవాడికి మేడపైని దృశ్యాలు ఎలా కనిపిస్తాయో అలా ఉంది ఇప్పుడు వంతిదేవుడు చూసిన దృశ్యం. అతనప్పుడు ఉన్నచోటికన్న ఎత్తైన ప్రదేశంలో, చాల దూరంలో అది జరిగింది.

మేడకు ఒక పక్కనుంచి దివిటీ వచ్చింది. రెండవవైపునుంచి పరదా తొలగించుకొని ఇంకొక దివిటీ వచ్చింది. రెండు దివిటీలు ఒకదానికొకటి దగ్గరకు వచ్చాయి. ఒక దివిటీ వెలుతురులో రెండు నల్లటి ఆకారాలు కనిపించాయి. రెండవ దివిటీ వెలుతురులో ఇంకొక రెండు ఆకారాలు కనిపించాయి. వాటిలో ఒకటి చాల ఎత్తైన గంభీరమైన ఆకారం; ఇంకొకటి కాస్త కురుచని సన్నటి ఆకారం. రెండు నల్లటి ఆకారాలు ఒకదాన్నొకటి సమీపించసాగాయి. వంతిదేవుడు మళ్ళీ కళ్ళు విప్పార్చి చూసి ఆ ఆకారాలు ఎవరైనది కొంతమటుకు తెలుసుకొన్నాడు. ఎడమవైపునుంచి వచ్చిన ఇద్దరు మధురాంతకుని తీసుకువెళ్ళిన గందమారన్ మరియు ఆ కాపలాభటుడు; కుడివైపునుంచి వచ్చింది పెద్ద పళువేట్టరయ్యర్ మరియు

ఆయన యువరాణి నందిని!

ఈ ఇరుపక్షాలూ కలిసినప్పుడు ఏమౌతుంది? ఏదైనా విపరీతం జరుగుతుందా? లేక ఒకరికింకొకరు దారివిడిచి సావధానంగా వెళ్లిపోతారా?... వంతిదేవుడు ఆ ఉద్విగ్నతలో ఊపిరి పీల్చడంకూడ మరిచిపోయి శ్రద్ధగా గమనించసాగాడు.

రెండుపక్షాలవారు కలుసుకొన్నారు. వారు చటుక్కున కాస్త జంకి నిలబడ్డం చూసి, వారు అనుకోకుండా కలుసుకొన్నట్లు తెలిసింది. కానీ విపరీతమేమీ జరగలేదు. పళువేట్టరయ్యర్ గందమారన్ని చూసి ఏదో అడిగారు. అందుకు గందమారన్ ఎదో సమాధానం చెప్పాడు. కానీ వారి ప్రశ్న, సమాధానం ఏదీ వంతిదేవునికి వినిపించలేదు. తర్వాత పళువేట్టరయ్యర్ చేతితో ఏదో సైగ చేసి సొరంగమార్గాన్ని వేలెత్తి చూపించారు. గందమారన్ వినయంతో ఆయనకు నమస్కరించాడు. ఆ తర్వాత సొరంగమార్గంలోకి దిగాడు. పళువేట్టరయ్యర్ అతని వెనక చేత దివిటీ పట్టుకొని నిలబడ్డ భటుణ్ణి చూసి ఏదో సైగ చేశారు. వాడుకూడ, నోటిపైన చేయివుంచుకొని తలవొగ్గాడు.. తర్వాత గందమారన్ వెంట సొరంగమార్గం మెట్లు దిగాడు. పళువేట్టరయ్యర్ తన రాణితో ఎడమవైపుగా వెళ్ళారు.

బొమ్మలాట, క్రీనీడల దోబూచులాట వంటి ఆ సంఘటనలు కొద్ది క్షణాల్లో జరిగిపోయాయి. ఇదంతా సొరంగమార్గంలోకి దిగే మెట్ల దగ్గర జరిగిందన్న విషయాన్ని వంతిదేవుడు గమనించాడు. ఆహా! మనం దారిలో ఎక్కడా ఆగక ఈ నేలమాళిగలోపలికి వచ్చి ఇక్కడ అటూఇటూ తిరుగుతుండడం ఎంత మంచిదైంది!మనం వారి మధ్య చిక్కుకొనివుంటే మన గతి ఏమయ్యేది!? ఏదో ఇంత మటుకు బతికాం. తప్పించుకోవడానికి దారేది? గందమారన్ మధురాంతకుని పిలుచుకొని వచ్చిన సొరంగమార్గం గుండా తిరిగి వెళ్తున్నాడనడంలో సందేహం లేదు. ఆ దారినుంచి మనం కాస్త తప్పి ఈ ధనాగారానికి వచ్చి చేరినట్లుంది. ఇప్పుడు వాడి వెనకే కాస్త దూరంలో వెన్నంటి పోతే, ఎలాగూ బయటికి చేరే వాకిలి దగ్గరికి వెళ్ళి చేరుతాం. తర్వాత ఏదైనా ఉపాయంతో తప్పించుకోవచ్చు. అవసరమైతే గందమారన్నే సహాయం కోరవచ్చు. లేకపోతే వాడిని, ఆ కాపలావాడిని మట్టి కరిపించేసి పారిపోవడమే! కాబట్టి ఇప్పుడు గందమారన్ వెన్నంటి వెళదాం.

-:-

మొదట దివిటీ వెలుతురు నేలమాళిగ దగ్గరికి వస్తూందనిపించింది. వంతిదేవుడు ఊపిరి బిగబట్టి నిలబడ్డాడు. తర్వాత ఆ వెలుతురు అవతలికి వెళుతున్నట్లనిపించింది. అంతలోపల వంతిదేవుడు చుట్టుపక్కల పరికించి చూసుకొని, తాను ఆ నేలమాళిగలోపలికి వచ్చిన మెట్లేవన్నది గమనించుకొన్నాడు. ఆ మెట్లగుండా కిందకు దిగి మళ్ళీ పైకెక్కాడు. దివిటీ వెలుతురును వదులుకోక, చాల దగ్గరగాను వెన్నంటక, కాలి చప్పుడు వినిపించనట్లు మెత్తగా నడుస్తూ వెళ్ళాడు. వంపులు తిరుగుతూ, కిందికి దిగి మళ్ళీ పైకెక్కి, చుట్టు తిరిగి ముందుకు సాగిన ఆ సొరంగమార్గంలో తానే దారి తెలుసుకొని బయటపడ్డం

అసాధ్యం. గందమారన్ నూరేళ్ళు బాగుండాలి! వాడు తనకు తెలియకనే మనకు చేస్తున్న సహాయానికి బదులు సహాయం ఎప్పుడు, ఎలా చేయబోతున్నాం!...

అందుకు అంత త్వరలోనే ఒక సందర్భం వస్తుందని వంతిదేవుడు ఊహించలేదు!...

సొరంగమార్గం ముగిసి పోవచ్చేసింది. ఎదురుగా ఒక పెద్ద గోడ కనిపించింది. అందులో ఒక వాకిలో, తలుపో ఉంటుందని ఎవరూ ఊహించలేరు. కానీ ఉండే తీరాలి! సొరంగమార్గానికి ఒక ద్వారం ఉండే తీరాలి కద?

కాపలావాడు కుడిచేత ఉన్న దివిటీని ఎడమచేతికి మార్చుకొన్నాడు. కుడిచేత్తో గోడవారగా తడిమిచూసి ఏదో చేశాడు. గానుగను తిప్పినట్లు తిప్పాడు. గోడలో సన్నగా ఒక చీలిక ఏర్పడింది. ఆ చీలిక రానురాను పెద్దది కాసాగింది. ఒక మనిషి దూరేటంత వెడల్పైంది. కాపలవాడు దాన్ని వేలితో చూపిస్తున్నాడు. గందమారన్ వాడికేదో చెప్పి, ఆ గోడ చీలికలో ఒక కాలు పెడుతున్నాడు. ఒక కాలు ఇంకా సొరంగమార్గంలోనే ఉంది. అతని వెన్ను పూర్తిగా ఇటువైపు తిరిగివుంది!

ఆః! అదేమి? ఆ కాపలావాడు ఏం చేస్తున్నాడు? ఒరలో ఉన్న చురకత్తిని తీస్తున్నాడే? దేవుడా! గందమారన్ వెన్నులో పొడిచేస్తున్నాడే! పాపి! వెన్నుపోటు పొడిచే ఛండాలుడు! నీచుడు!...

అది చూస్తూ నిలబడలేక వంతిదేవుడు తాను దాగివున్న చోటునుంచి ఒక్క ఉదుటున ముందుకు దూకాడు! ఆ శబ్దానికి కాపలావాడు తిరిగిచూశాడు! దివిటీ వెలుతురు వంతిదేవుని కోపావేశపూరితమైన ముఖంపైన పడింది!

~~~
~~~

# అధ్యాయము - 42

## స్నేహానికిది వన్నెతెస్తుందా?

వంతిదేవుని మొట్టమొదటి ఆలోచన, గందమారన్ని ఎలాగైన కాపాడాలనే. కానీ వాడిని కాపాడేందుకు ప్రయత్నిస్తే మనకూ వాడి గతే పడుతుంది. కాబట్టి, ముందు ఈ క్రూరమైన కాపలావాడికి గుణపాఠం నేర్పాలి. అలా అనుకొని ముందుకు దూకిన వంతిదేవుడు ఒకచేత్తో ఆ కాపలావాడి మెడను ఒడిసిపట్టుకొన్నాడు. ఇంకొక చేత్తో వాడు పట్టుకొన్న దివిటీని కిందపడగొట్టాడు. అది కిందపడి వెలుతురు తగ్గిపోయింది. అదే ఊపులో కాపలావాడిని తన బలాన్నంతా ప్రయోగించి కింద పడదోశాడు. వాడి తల గోడకు కొట్టుకొని వాడు కిందపడ్డాడు. వంతిదేవుడు దివిటీని చేత తీసుకొని కాపలావాడి దగ్గరకు వెళ్ళి వాడిని పరీక్షగా చూశాడు. వాడు చచ్చినవాడిలా పడివున్నాడు. కానీ, ముందుజాగ్రతగా, వాడి అంగవస్త్రాన్నే తీసుకొని వాడి చేతులను కట్టేశాడు. ఇదంతా కొన్ని క్షణాల్లో చేసేసి, గందమారన్ దగ్గరకు పరుగెత్తాడు. అతడి వెన్నులో పొడవబడిన చురకత్తి సమేతంగా అతడి ఒడలు అర్ధం సొరంగలో, అర్ధం బయటా పడివుండడాన్ని గమనించాడు. అతని శూలంకూడ అతని పక్కనే పడివుంది. వంతిదేవుడు బయటపడి గందమారన్ని బయటకు లాగాడు. శూలాన్నికూడ తీసుకొన్నాడు. వెంటనే తలుపు తనకు తానే మూసుకొంది. గోడ ఆ రహస్యాన్ని తనలో దాచుకొని రూపెత్తిన చీకటిగా గంభీరంగా నిలబడింది.

బలంగా వీస్తున్న గాలినుంచి తాను కోటనుంచి బయటపడ్డట్లు వంతిదేవుడు గ్రహించాడు. దట్టమైన చెట్లు, కోట గోడ ప్రహరి చంద్రుని మరుగు పరుస్తుండడంతో వెన్నెల చాల మసక మసగ్గా అనిపించింది. వంతిదేవుడు గందమారన్ని తీసి భుజంపైన వేసుకొన్నాడు. ఒకచేత్తో అతని శూలాన్నికూడ తీసుకొన్నాడు. సర సరమని మన్ను జారి నిట్టనిలువుగా పడుతున్నట్లు అనిపించింది. చటుక్కున శూలాన్ని ఊని, అతికష్టంమీద నిలదొక్కుకొన్నాడు. కింద చూశాడు. నీటి ప్రవాహం కనిపించింది. అతివేగంగా, సుడులు తిరుగుతూ ప్రవహిస్తోందది. అమ్మయ్య! దేవుని దయవల్ల బతికిపోయాం! ఆ అతిక్రూరుడైన కాపలావాడు - కానీ వాడినేం ప్రయోజనం? యజమాని ఆజ్ఞనే వాడి నెరవేర్చివుండాలి! - వెన్నుపోటు పొడిచి, అలాగే ఈ ప్రవాహంలో తోసేందుకు ఉద్దేశించివుండాలి. మనకాలు కాస్త జారివుంటే ఇద్దరమూ ఈ వెల్లువలో పడివుండేవారం కద. మనమెలాగో బతికి బయటపడ్డా, గందమారన్ గతి అధోగతే! తంజావూరు కోటకు పక్కగా సమీపంలోనే వడవాట్రు నది ప్రవహిస్తోందని వంతిదేవుడెరుగు. ఇది ఆ నదే అయివుండాలి. వడవాట్రు నదిలో ఇప్పుడు వెల్లువ అంత ఎక్కువలేకపోయినా, కోటపక్క చాల లోతుగా ఉండే అవకాశముంది శూలాన్ని నీటిలో పొడిచి నీటి లోతు చూశాడు. శూలం నీట పూర్తిగా మునిగినా నేల తగలలేదు! ఆహా! ఎంత క్రూరమైన ఛండాలురు వీరు!... దాన్ని గురించి ఆలోచించేందుకిది సమయం కాదు. తానూ తప్పించుకొని, తనతో పాటు తన మిత్రుని తప్పించే ఉపాయం చూడాలి. వెల్లువ ప్రవాహం

వెంబడే మెల్లగా, కాలు జారకుండ గట్టిగా కాలూని ముందుకు సాగాడు వంతిదేవుడు. గందమారన్ రెండుమూడుసార్లు ముక్కి మూలిగి, తన స్నేహితునికి ధైర్యాన్ని, భరోసాను ఇచ్చాడు. కాస్త దూరం వెళ్ళాక కోట గోడ పక్కకు వెళ్ళింది; నది వంపు తిరిగి ముందుకు సాగగా, దాని తీరం వెంబడి దట్టమైన అడవి పెరిగి వుంది. నేలపైన ముళ్ళు చాల ఉండడంతో కాలెత్తి అడుగులేయడం చాల కష్టంగా ఉంది. అరె! ఇదేమి? ఒక చెట్టు నదిలో పడివుందే! చాల పెద్ద చెట్టులాగుంది. వరద దాన్ని కూకటివేళ్ళతో పెకలించివేసినట్లుంది! ప్రవాహం మధ్యవరకు పడివుంది. వంతిదేవుడు దానిపైకెక్కి తడబడే అడుగులతో నడిచాడు. ప్రవాహం వేగానికి ఆ చెట్టు కొమ్మలు విపరీతంగా ఊగుతున్నాయి. అతికష్టంమీద నిలదొక్కుకొని ముందుకు నడిచాడు. చెట్టు చివరకు రాగానే శూలాన్ని దించి లోతు చూశాడు. మంచివేళ! ఇక్కడ అంతగా లోతులేదు. వంతిదేవుడు చెట్టుపైనుంచి నదిలో దిగి ముందుకు నడిచాడు. దారి మిట్టపల్లాలుగా వున్నా, సంభాళించుకొని ముందుకు సాగాడు. వరదను, గాలి తీవ్రతను తన మనోధైర్యంతో ఎదుర్కొన్నాడు. ఒక్కోసారి అతని ఒడలు గడగడ వణికింది. భుజంపైనున్న గందమారన్ అప్పుడప్పుడు జారి పడిపోజూశాడు. ఈ అపాయాలన్నీ తప్పుకొని వంతిదేవుడు అవతలి తీరాన్ని చేరాడు.

కాస్త దూరం, నడుం వరకు తడిసిన బట్టలతో, ఆజానుబాహువైన గందమారన్ని అలాగే తడబడుతూ మోసుకొని వెళ్ళి ఒక చెట్టు కింద కాస్త వెన్నెల పడుతున్న చోట అతన్ని కింద పడుకోబెట్టాడు. ముందు కాస్త సేదదీర్చుకోవాలనుకొన్నాడు. దానితోబాటు గందమారన్ శరీరంలో ఇంకా ప్రాణం ఉందోలేదో పరీక్షించి తెలుసుకోవాలనుకొన్నాడు. నిర్జీవశరీరాన్ని మోసుకొని వెళ్ళి ఏం ప్రయోజనం? దానికి బదులు ఆ కాపలావాడు ఉద్దేశించినట్లు ఈ వెల్లువలోనే వదిలేది పోవచ్చు. లేదు, లేదు! ఇంకా ప్రాణం ఉంది! ఎద ఎగసి పడుతోంది. నాడి వేగంగా కొట్టుకొంటోంది. వెన్నులో ఉన్న కత్తిని లాగేద్దామా? వద్దు, వద్దు! అందువల్ల ప్రాణం పోయినా పోవచ్చు. గాయానికి వెంటనే చికిత్స చేసి కట్టు కట్టాలి. తానొక్కడే చేయలేని పని ఇది! ఇంకెవ్వరిని వెతకడం సహాయానికి?.... సేందన్ అముదన్ గుర్తుకు వచ్చాడు. అతని ఇల్లూ, తోటా ఈ వడవాఱు తీరంలోనే ఉన్నాయి. ఇక్కడే సమీపంలోనే ఉండవచ్చు. ఎలాగైనా గందమారన్ని మోసుకొని సేందన్ అముదన్ ఇంటికి తీసుకువెళితే వాడు బతికే అవకాశం ఉంది. ప్రయత్నించి చూద్దాం.

-:-

గందమారన్ని మళ్ళీ ఎత్తబోయినప్పుడు అతని కళ్ళు తెరుచుకోవడం చూసి వంతిదేవునికి ఆశ్చర్యమూ, సంతోషమూ కలిగాయి.

“గందమారా! నేనెవరో తెలుస్తోందా?” అని అడిగాడు.

“తెలుస్తోంది, బాగా తెలుస్తోంది. నీవు వల్లవరయ్యన్. నీవంటి మంచి స్నేహితుని గుర్తుపట్టలేక పోతానా? మరిచిపోనైనా వీలవుతుందా? వెన్నుపోటు పొడిచే ఆప్తమిత్రుడివి కదా నీవు!” అన్నాడు

గందమారన్.

అతని చివరిమాటలు వంతిదేవునికి కొరడాతో కొట్టినట్లనిపించాయి.

"అయ్యో! నేనా నిన్ను వెన్నుపోటు పొడిచిందనుకొంటున్నావు....?" అని ప్రారంభించినవాడు ఏదో గుర్తుకువచ్చి చటుక్కున ఆపేశాడు.

"నీవు పొడవలేదు... నీ కత్తి మెత్తగా నా వెన్నును తడిమింది... ఒరే పాపి! నీకోసమే కద ఈ సొరంగమార్గం గుండా వేగంగా బయల్దేరాను. పళువేట్టరయ్యర్ మనుషులు నిన్ను పట్టుకొనేముందు నేను నిన్ను పట్టుకోవడానికి త్వరితపడ్డాను. నిన్ను ఎవ్వరూ ఎలాంటి ఇబ్బందులు పెట్టక అడ్డుపడాలని పరుగెత్తి వచ్చాను. నిన్ను వెతికి పట్టుకొని వచ్చి చిన్న పళువేట్టరయ్యర్ కాపలా దండులో చేర్పిస్తానని శపథం కూడా చేసి వచ్చాను. ఇలా నీకు మేలు చేయాలనుకొన్న నాకు ఎలాంటి ద్రోహం చేశావు! స్నేహానికిదేనా అందం? మనమిద్దరం ఒకరికొకరు సహాయం చేసుకోవాలని ఎన్నిసార్లు చేతిలో చెయ్యేసి ప్రమాణం చేసుకొన్నాము? అదంతా గాలికి వదిలేశావా? ఈ చోళ సామ్రాజ్యపు రాజ్యాంగంలో జరగబోయే ఒక పెద్ద మార్పును గురించికూడ నిన్ను హెచ్చరించానే! అయ్యో! ఈ లోకంలో ఇంకెవరిని నమ్మడం?" అని ఒక్కగుక్కలో చెప్పేసి గందమారన్ కళ్ళుమూసుకొన్నాడు. ఇన్నిమాటలు ఆవేశంతో మాట్లాడడంతో అతను ఊపిరి సలపక అలిసిపోయినట్లున్నాడు.

"నమ్మేందుకు మనుషులా లేరు? పళువేట్టరయ్యర్లను నమ్ము!" అని తనలో తాను గొణుక్కొన్నాడు వంతిదేవుడు. కానీ అతని కళ్ళలో కన్నీళ్ళు ఉబికాయి. తాను చెప్పదలుచుకొన్నది చెప్పక ఊరుకొన్నాడు. మళ్ళీ గందమారన్ శరీరాన్ని భుజాన వేసుకొని మళ్ళీ ముందుకు నడిచాడు.

-:-

రాత్రి పూసే పూల సువాసన గుప్పుమని వచ్చింది. సేందన్ అముదన్ ఇల్లు దగ్గరే ఉండాలన్న తన అంచనా తప్పుకాలేదు. త్వరలోనే తోట చేరాడు. కానీ ఆ తోట! హనుమాన్ నాశనం చేసిన అశోకవనం, వానరాలు నాశనం చేసిన మధువనం కన్న అధోగతిలో ఉందిప్పుడు. తాను మునుపు చూసినందుకు, ఇప్పటికీ ఎంత వ్యత్యాసం? ఆఁ! తన్ను వెతుక్కొని చిన్న పళువేట్టరయ్యర్ మనుషులు ఇక్కడికి వచ్చివుండాలి వచ్చిన వాళ్ళు ఊరకే పోక, ఇటువంటి అక్రమ కార్యాలను చేసినట్లున్నారు.. అయ్యో! సేందన్ అముదన్, అతని తల్లి ఈ నందన వనాన్ని ఎంత ప్రేమతో పెంచారు? ఇప్పుడదంతా పూర్తిగా నాశనమైపోయింది కద!

నందనవనం నాశనమైందన్న బాధ చటుక్కున పక్కకు తొలగింది. తానున్న అపాయకరమైన పరిస్థితి గుర్తుకువచ్చింది. గూఢచారులు, కాపలాభటులు, తనకోసం ఇక్కడే ఎక్కడైన పొంచివుంటే ఏం చేయడం?... వారికి తన చేతి రుచి చూపించవలసిందే. మంచివేళ, అదిగో మన గుర్రం, కట్టివుంచిన చెట్టు

దగ్గరే ఇంకా ఉంది!... ఒకవేళ, మనల్ని పట్టుకోవడానకే దాన్ని విడిచి పెట్టారా? ఏదేమైనా ఏం చేయగలం? వీడిని ఈ గుడిసెలో వున్న మంచి మనుషులకు ఒప్పజెప్పేసి, తాను తన గుర్రం ఎక్కి ఉరకాల్సిందే. ఇక్కడ బయల్దేరిన గుర్రం పళైయారైలో ఆగాలి.

మెల్లమెల్లగా అడుగులో అడుగు వేసుకొంటూ గుడిసె వాకిలి చేరాడు. వాకిలి దిన్నెపైన పడుకొనివున్న సేందన్ అముదన్ని తట్టి లేపాడు. అదిరిపడి లేచిన అముదన్ నోరు నొక్కాడు. తర్వాత మెల్లని గొంతుతో అన్నాడు:- “తమ్ముడూ! నీవే నాకు సహాయం చేయాలి. పెద్ద సంకటంలో చిక్కుకొన్నాను. వీడు నా ప్రియస్నేహితుడు. కడంబూర్ శంబువరయ్యర్ కొడుకు గందమారన్. నేను వచ్చేదారిలో ఎవరో వీడిని వెన్నుపోటు పొడిచి పడేనివున్నారు. ఎత్తుకొని వచ్చాను" అన్నాడు.

“పాపులు వెన్నుపోటు పొడిచారు కద! ఎలాంటి శుద్ధ వీరులో కద!” అన్నాడు సేందన్ అముదన్.

తర్వాత, “ఇతన్ని నావల్ల వీలైనంత వరకు చూసుకొంటాను. ఈ రోజు సాయంత్రం నుంచి గుంపులు గుంపులుగా చాల మంది వీరులు నిన్ను వెతుక్కొంటూ వచ్చి వెళ్ళారు. వారివల్ల నందన వనమే నాశనమైపోయింది. పోతే పోనీ. నీవు తప్పించుకొని బతికితే చాలు. మంచివేళగా నీ గుర్రాన్ని వాళ్ళు తీసుకుని వెళ్ళక ఇక్కడే విడిచిపెట్టిపోయారు. గుర్రమెక్కి వెంటనే బయల్దేరు!”

“అదే నా ఉద్దేశంకూడ. కానీ వీడి ప్రాణాన్ని కాపాడేందుకు ఏదైనా వ్యవస్థ చేయాలి!”

“అందుగురించి నీవు దిగులుపడకు. మా అమ్మ ఇటువంటి విషయాల్లో ఆరితేరినది. గాయాలకు చికిత్స చేయడం ఆమెకు బాగా తెలుసు" అని చెప్పి, అముదన్ గుడిసె తలుపును మెల్లగా రెండుసార్లు తట్టాడు. వెంటనే తలుపు తెరుచుకొంది. అతని తల్లి వాకిలిలో నిలిచింది.

గందమారన్ని ఇద్దరూ ఎత్తి తీసుకొనివెళ్ళి మంచంపైన పడుకోబెట్టారు. చేతిదీపం వెలుతురులో సేందన్ అముదన్ తన తల్లితో సైగలతో మాట్లాడాడు. దాన్ని ఆమె బాగా అర్థం చేసుకొన్నట్లు కనిపించింది. గందమారన్ని పరీక్షగా చూసింది. వెన్నులో గుచ్చివున్న కత్తిని చూసింది. తర్వాత లోపలికి వెళ్ళి కొన్ని ఆకులు, ఒక పాత బట్ట తీసుకొని వచ్చింది. ఇద్దరినీ తలెత్తి చూసింది.

గందమారన్ని అముదన్ గట్టిగా బిగించి పట్టుకొన్నాడు. వెన్నులోని కత్తిని వంతిదేవుడు శక్తినంతా ఉపయోగించి బయటికి లాగాడు.

రక్తం ఎగజిమ్మింది.

స్పృహలేని స్థితిలో గందమారన్ 'ఓ' అని కేక పెట్టాడు.

వంతిదేవుడు అతని నోరు మూశాడు.

గాయాన్ని సేందన్ అముదన్ గట్టిగా అదిమిపెట్టాడు.

అముదన్ తల్లి ఆకులను గట్టిగా పిండి గాయంలో పెట్టి కట్టు కట్టింది.

గందమారన్ మళ్ళీ మూలిగాడు.

దూరంలో మనుషులు పరుగెత్తుకొని వస్తున్న శబ్దం వినిపించింది.

"పో! పో! త్వరగా పారిపో" అన్నాడు అముదన్.

రక్తసిక్తమైన చురకత్తిని, శూలాన్ని తీసుకొని బయల్దేరిన వంతిదేవుడు కాస్త ఆగి నిలబడ్డాడు.

"తమ్ముడూ! నీవు నన్ను నమ్ముతున్నావా?" అని అడిగాడు.

"నేను దేవుణ్ణి నమ్ముతాను. నీపైన ప్రీతిగొన్నాను. ఎందుకా ప్రశ్న అడిగావు?"

"నాకొక సహాయం చేయాలి. నాకు ఈ చుట్టుపక్కల ప్రదేశాలు అంతగా పరిచయం లేవు. కానీ నేను త్వరగా పళైయారై వెళ్ళాలి. రాకుమారి కుందవైదేవికి ఒక అతిముఖ్యమైన సందేశం అందజేయాలి. కాస్తదూరం నాతోవచ్చి దారి చూపగలవా?" అని అడిగాడు వంతిదేవుడు. వెంటనే సేందన్ అముదన్ తన తల్లితో సైగ భాషలో సంభాషించాడు. ఇదంతా ఆమెకు అంతగా ఆశ్చర్యం కలిగించినట్లు కనిపించలేదు. వెళ్ళిరమ్మని సైగ చేసి చెప్పింది. గాయపడ్డవాడిని తాను చూసుకొంటానని కూడ సైగ చేసి చెప్పింది.

సేందన్, వంతిదేవుడు బయల్దేరారు. గుర్రంపైన సేందన్ ముందు, అతని వెనుక వంతిదేవుడు ఎక్కి కూర్చొన్నారు.

గుర్రపు శబ్దం వినిపించనట్లు మెల్లగా నడిపించుకొని వెళ్ళాడు వంతిదేవుడు. కాస్తదూరం వెళ్ళాక గుర్రాన్ని తట్టి వదిలాడు. అది వేగంగా ముందుకు సాగింది.

-:-

గుర్రం బయల్దేరిన అదే సమయానికి ఐదారు వీరులు గుడిసెకు వచ్చి శోధించారు. తలుపును దబదబా బాదారు. ఆ శబ్దానికి అముదన్ తల్లి వచ్చి తలుపు తెరిచింది.

"ఇక్కడేవో కేకలు వినిపించాయే? ఏమది?" అని గద్దించి అడిగాడు ఒకడు.

మూగదైన అముదన్ తల్లి ఏవో శబ్దాలు చేసింది.

"ఈ మూగదానితో మాట్లాడి ఏం ప్రయోజనం? లోపలికి వెళ్ళి చూద్దాం!" అన్నాడింకొకడు.

"ఈమె దారికడ్డంగా నిలబడివుందే!" అన్నాడింకొకడు.

"ఆ పూల అబ్బాయి ఎక్కడ?"

"మూగదాన్ని పక్కకు తోసి లోపలికి దూరండర్రా!"

అముదన్ తల్లి మళ్ళీ మూగభాషలో ఏదో అరిచింది.

తనను తోసేయజూసిన వీరుని వెనక్కుతోసి తలుపు గడియవేయజూసింది. నలుగురైదుగురు తలుపును తోసిపట్టుకొని, మూసేందుకు వీలుకాకుండా చేశారు.

అముదన్ తల్లి ఇంకా తీవ్రమైన స్వరంతో అరుస్తూ ఉన్నట్లుండి తలుపును వదిలేసింది. ఆ అధాటుకు ఇద్దరు ముగ్గురు కిందకు దొర్లి పడ్డారు.

మిగిలినవారు వాళ్ళను పట్టుకొని లేపి లోపలికి దూరారు.

"మనిషి ఇక్కడ ఉన్నాడు!" అన్నాడొకడు.

"దొరికిపోయాడా?" అన్నాడింకొకడు.

"పారిపోజూస్తాడేమో, కట్టిపడేయండి!" అన్నాడొకడు.

మూగతల్లి మళ్ళీ పలవరించింది.

"అంతా రక్తసిక్తంగా ఉందే!" అని ఒకడు అరిచాడు.

అముదన్ తల్లి చేతి దీపాన్ని ఎత్తి పట్టుకొని, కింద పడుకొనివున్న వాడిని చూపించి, "ఏ ఏ ఏ!" అన్నది.

"ఒరే! వీడింకెవరో లాగున్నది!"

"ఏ! ఏ!"

"నిన్న ఇక్కడికి వచ్చిన వాడేనా వీడు?"

"ఏ! ఏ!"

"నీ కొడుకెక్కడ?"

"ఏ! ఏ!"

"మూగీ! కాస్త ఊరుకో! ఒరేయ్! వీడిని బాగా చూడండి! ఎవరికైనా ఆనవాళ్ళు తెలుసా?"

"వాడు కాదు!"

"వాడే!"

"కానే కాదు!"

"ఏ! ఏ!"

"ఎలావున్నా వీడు అన్యుడు! ఎత్తండి వీడిని! తీసుకుపోదాం!"

"ఫే! ఫే!  ఫే! ఫే!"

"ఒసే శనీశ్వరీ! ఊర్కో!"

నలుగురు చేరి గందమారన్ని ఎత్తారు.

"ఫే! ఫే!  ఫే! ఫే!" అని అముదన్ తల్లి ఎడతెరపిలేకుండ అరుస్తూనే వుంది.

"అరే! గుర్రం శబ్దం వినిపిస్తోందిరా!"

"సగం మంది వీడిని ఎత్తండి! ఇంక సగం మంది పరుగెత్తి వెళ్ళి చూడండి!"

"అందరూ పరుగెత్తండి! వీడెక్కడికీ పోలేడు."

ఎత్తిన గందమారన్ని కింద పడేసి అందరూ పరుగెత్తారు. "ఫే ఫే! ఫే ఫే!" అన్న అముదన్ తల్లి ఆక్రందన వారిని వెన్నాడింది.

~~~
~~~

# అధ్యాయము - 43

## పళైయారై

**వంతిదేవుడు** దారిలో పలు కష్టాలకు లోనై, చాల అపాయాలనుంచి తప్పుకొని పళైయారై నగరానికి వచ్చి చేరేందుకు ముందు, ఆ నగరానికి మాతో విజయం చేయమని పాఠకులను ఆహ్వానిస్తున్నాము.

అరిసిలారు (నది) దక్షిణతీరంపై నిలబడి ఆ నగరాన్ని చూద్దాం. ఆహా! నగరమా ఇది? తమిళమాత శిరస్సులో అలంకరించబడిన ఆభరణం లాగ కద ఉంది? పచ్చని మరకతాలు, ఎర్రని రత్నాలు, నీల వజ్రాలు పొదిగిన కిరీటంలాగ ఉంది కద!

నదులు, కొలనులు, తటాకాలు కొత్త నీరు నిండి తొణుకుతున్నాయి. వాటిలో పలువర్ణాల పుష్పాలు వికసించి వీక్షకులను అలరిస్తున్నాయి. కొబ్బరి చెట్లు, పొన్న చెట్లు చల్లని వాతావరణాన్ని సృష్టించాయి. వీటన్నిటి మధ్య ఆకాశాన్నంటే మాళిగల బంగారు కలశాలు, కోవెల గోపురాలు, చివర వున్న బంగారపు స్తూపాలు సూర్యకాంతులీనుతున్నాయి.

అబ్బబ్బ! పళైయారై అనే ఈ మహనగరంలోపల ఎన్ని చిన్న ఊళ్ళు? నందిపుర విణ్ణగరం, తిరుశక్తి ముట్రం, పట్టీర్చ్చరం, హరిశ్చంద్రపురం మొదలైన ఊళ్ళు, వాటి ఆలయాలు పళైయారై అనబడే ఈ చోళ రాజధానిలో ఇమిడివున్నాయి. పళైయారై నాలుగు దిక్కుల్లోను వడతళి (ఉత్తరం), కీళ్ళళి (తూర్పు), మేర్తళి (పశ్చిమం), తెణ్తళి (దక్షిణం) అనే నాలుగు శివాలయాలున్నాయి. యుద్ధవీరులు నివసించే ఆర్యసైన నివాసం, నవసైన్య నివాసం, భూసైన్య నివాసం, పంపాసైన్య నివాసం అనే నాలుగు వీరపురాలు కూడ కనిపిస్తున్నాయి. ఇన్నిటికీ మధ్య చోళుల మాళిగ (palace) ఒక్కటే ఉందా? విజయాలయ వర్మకు ముందు ఇది ఒక్కటే మాళిగ ఉండేది. తర్వాత ఒక్కొక్క రాజు ఒక్కొక్క యువరాణికీ పాత మాళిగకు పక్కనే కొత్త కొత్త మాళిగలు కట్టించారు. వాటి వైభవాన్ని చూసేందుకు వేయి కళ్ళు చాలవు. వర్ణించేందుకు పదహారు వేల కవుల కల్పనాశక్తి చాలదు.

రెండువందల సంవత్సరాలకు మునుపు ఇక్కడికి వచ్చిన శేక్కియర్ పెరుమాన్ ఈ నగరాన్ని వేనోళ్ల వర్ణించారు. సుందర చోళ చక్రవర్తి కాలానికి అది మిక్కిలి కోలాహలంతో అతి వైభవోపేతంగా విరాజిల్లుతోంది.

-:-

కానీ, మనం మొట్టమొదట ఆ పురాతనమైన మహానగరాన్ని ప్రవేశించేటప్పుడు దాని సంపూర్ణవైభవాన్ని చూసి ఆనందించేందుకు వీలు కాలేదు.

సుందర చోళ చక్రవర్తి ఈ రాజ భవనంలో వసిస్తూ రాజ్యాన్ని పాలించేటప్పుడు వచ్చి ఈ నగరాన్ని చూసే భాగ్యం మనకు కలగలేదు.

చక్రవర్తి జబ్బుపడి తంజావూరు నగరానికి వెళ్ళిపోయిన తర్వాత ఈ నగరానికి విదేశ రాజులు, చోళసామ్రాజ్యపు సామంత రాజులు, మంత్రులు, సేనాపతులు రావడం ఆగిపోయింది. వారితో సంప్రదాయంగా వచ్చే పరివారాలుకూడ తగ్గిపోయాయి.

నాలుగు సేనల శిబిరాలలో వసిస్తుండే సేనల్లో సగానికి సగం ఇప్పుడు లంకారాజ్యంలో తమిళుల వీరత్వాన్ని నెలకొల్పేందుకు దండెత్తి వెళ్ళారు. మిగిలినవారిలో ఒకభాగం ఉత్తరపుటెల్లల్లోను,, ఇంకొక భాగం మదురైలోను ఉన్నారు.

కాబట్టి సేనల ఇళ్ళున్నపేటల్లో ఇప్పుడు అధికశాతం వయసుమళ్ళినవాళ్ళు, స్త్రీలు చిన్నపిల్లలు మాత్రమే కనిపిస్తున్నారు.

మళవర్పాడిలో వసిస్తుండే వేళక్కార దండు తమతమ కుటుంబ సమేతంగా తంజావూరుకు వెళ్ళిపోవడం వల్ల, అక్కడి ఇళ్ళన్నీ తాళం వేయబడి వెలతెలాబోతున్నాయి.

రాజకీయ కార్యాలను నిర్వహించే మంత్రులు, సామంతులు, అధికారులందరు కూడ తమతమ కుటుంబాలతో తంజావూరుకు వెళ్ళిపోయారు.

ఇటువంటి పరిస్థితిలో కూడ పళైయారై వీధుల్లో కోలాహలానికి, సందడికి కొదువలేదు. ఇప్పుడా వీధుల్లో అధికశాతం పండితులు, పురోహితులు, శిల్పకళాకారులు, దేవారాలు చదివే భక్తులు, శివభక్తులు, అంతఃపుర సేవకులు, గుళ్లలో పనిచేసేవారు, గుళ్లకు దైవదర్శనానికి వెళ్ళేవారు, పైవూళ్లనుంచి వచ్చేప్రజలు మొదలైనవారు సంచరిస్తున్నారు.

-:-

ఈరోజు ఏదో తిరునాళ్ళలాగ కనిపిస్తోంది. వీధుల్లో అందమైన బట్టలు, ఆభరణాలు ధరించి స్త్రీపురుషులు, చిన్నపిల్లలు తిరుగాడుతున్నారు. వీధి చివర్లలో జనాలు గుమిగూడి నిల్చొనివున్నారు. ఆ గుంపుల మధ్య కొందరు వేషధారులు ఏదో ఆడిపాడుతున్నారే! కాస్త దగ్గరికి వెళ్ళి గమనిద్దాం. అవును; వారు కృష్ణునిలాగ, గోపాలురలాగను వేషాలు ధరించివున్నారు. ఈ గుంపు మధ్య ఒక కృష్ణుడు ఒక కొండను ఎత్తిపట్టుకొనివున్నాడే? ఆయనకు దేవేంద్రుడు నమస్కరిస్తున్నాడు కద! ఇంకొక గుంపుమధ్య కృష్ణుని చతుర్ముఖ బ్రహ్మ సేవిస్తున్నాడు కద? ఆహా! ఇప్పుడర్థమైంది. ఈ రోజు శ్రీకృష్ణజయంతి; కన్నయ్య పుట్టినరోజు. ఆ పండుగనే ప్రజలింత కుతూహలంగా జరుపుకొంటున్నారు. అక్కడక్కడ రకరకాల వేడుకలు జరుగుతున్నాయి. పసుపునీళ్ళు చల్లుతున్నారు.

నందిపురపు విణ్ణకర్ కోవెల (విష్ణుదేవాలయం) చుట్టూ ఈ తిరునాళ్ళు జరుగుతున్నాయి.

అదేమి? ఎవరో విష్ణువుపైన ఇంపైన కవిత పాడుతున్నారు కద! ఎవరది? ఇంకెవరో కాదు, మన పాత స్నేహితుడు ఆళ్వార్ కట్టియానే ఇక్కడ ప్రత్యక్షంగా నిలబడి పాడుతున్నాడు! అతని చుట్టూ చాలమంది గుమిగూడివున్నారు. కొందరు భక్తిశ్రద్ధలతో వింటున్నారు. కొందరు ఎగతాళి చేస్తున్నారు. ఆళ్వార్ కట్టియాన్ చేతి దండంతో ఎవరి తలకు మూడుతుందో తెలియదు!

విణ్ణకర్ కోవెల వాకిలి దగ్గర ఉన్నట్లుండి సందడి. వీధిలో నిలిపివున్న రథాలు, పల్లకీలు కోవెల వాకిలివైపు వస్తున్నాయి. కోవెల లోపలినుంచి కొందరు కుల స్త్రీలు వస్తున్నారు.. వారు పెద్ద రాజవంశపు స్త్రీలే అయివుండాలి.

ఔను! పళైయారై అంతఃపురంలో నివసించే మహారాణులు, యువరాణులే వీరు!

అందరికంటే ముందు 'పెద్ద రాణి' అని దేశమంతా పిలువబడే శెంబియన్ మహాదేవి వస్తున్నారు. ఆమె మళవరైయ్యర్ కులపు రాకుమారి; శివజ్ఞానియైన గండరాదిత్యుల పట్టమహిషి. వయసుమళ్ళిన విధవ అయివుండికూడ ఆమె ముఖంలో ఎంతటి తేజస్సు! ఆమె వెనుక అరింజయ చోళుల పత్ని, వైదుంబరాయర్ కులపు రాకుమారియైన రాణి కల్యాణి వస్తున్నారు. ఆహా! ఆమె అందాన్ని ఏమని వర్ణించడం! ఈ ముదుసలి ప్రాయంలోను ఆమె ముఖారవిందం ఎంతగా ప్రకాశిస్తోంది! ఈమె కుమారుడైన సుందర చోళ చక్రవర్తి మన్మధుడని ప్రసిద్ధిగాంచి ఉండడంలో ఆశ్చర్యమేమి?

వీరి వెనుకనే సుందర చోళ చక్రవర్తి ఇంకొక పత్ని చేరమహారాజు కుమార్తెయైన పరాంతకదేవి వస్తున్నారు.

ఇంకా వెనుక, దేవలోకంనుంచి తిన్నగా భూలోకానికి దిగివచ్చిన దేవకన్యకలాగ వెలిగిపోతున్న కుందవైదేవి, వాణతి, ఇంకా మనం అరిసిలార్ నదీతీరంలో చూసిన రాజకులపు వనితలు వస్తున్నారు.

-:-

విజయాలయుని కాలంనుంచే చోళ వంశస్థులు శివుని, దుర్గను కులదైవాలుగా పూజిస్తూ వస్తున్నారు. కానీ, వైష్ణవ మతమంటేను, జైనమతమంటేను వీరికి ద్వేషమేమీ లేదు. ఈరోజు కన్నయ్య పుట్టినరోజని పెరుమాళ్ళు (విష్ణువు) కోవెలకు వచ్చారు కాబోలు.

పెద్దరాణి/రాజమాత శెంబియన్ మహాదేవి పల్లకిలో ఎక్కేటప్పుడు ఆళ్వార్ కట్టియాన్ పాట ఆమె చెవిలో పడింది. అందుకోసమనే కట్టియాన్ ఎలుగెత్తి పాడుతున్నాడు కాబోలు. శెంబియన్ మాదేవి అతన్ని తన దగ్గరకు రప్పించుకొంది.

ఆళ్వార్ కట్టియాన్ వినయ విధేయతలతో వచ్చి నిల్చొన్నాడు.

"తిరుమలై! కొన్ని రోజులుగా నీవు కనిపించలేదే? స్థలయాత్రలకు వెళ్ళావా?" అని అడిగారు.

"అవును, తల్లీ! స్థలయాత్రలకు వెళ్ళాను. తిరుపతి, కంచి, వీరనారాయణపురం మొదలైన పలు క్షేత్రాలను దర్శించాను. వెళ్ళిన చోటల్లా పలు వింతలను, విశేషాలను కన్నాను, విన్నాను!"

"రేపు అంతఃపురానికి వచ్చి యాత్రావిశేషాలను వివరించి చెప్పు!"

"లేదు, తల్లీ! ఈ రాత్రె నేను మళ్ళీ బయలుదేరాలి!"

"అలాగైతే ఈరోజు సాయంత్రమే వచ్చివెళ్ళు!"

"వస్తానమ్మా! తమ చిత్తం, నా భాగ్యం!"

పల్లకీలు, రథాలు బయల్దేరి వేగంగా అంతఃపురంవైపు సాగాయి.

కుందవై రాకుమారి ఆళ్వార్ కట్టియాన్ని చూపించి ఏదో చెప్పగా, తక్కిన రాకుమార్తెలందరు గొల్లున నవ్వారు.

నవ్వులకు కారణమేమని తెలుసుకోగోరి ఆళ్వార్ కట్టియాన్ అటువైపు చూశాడు.

కుందవైదేవి కళ్ళు ఆళ్వార్ కట్టియాన్‌తో సంజ్ఞాభాషలో ఏదో మాట్లాడాయి.

ఆళ్వార్ కట్టియాన్ ఆ సందేశాన్ని తెలుసుకొన్నందుకు  గుర్తుగా తల వంచాడు.

-:-

చోళ రాజ కులపు అంతఃపురాలలో శెంబియన్ మహాదేవి వసిస్తుండే మాళిగ (అంతఃపురం) తక్కినవాటికన్న వైభవంగా ఉండేది. అందలి సభామంటపంలో బంగారంతో చేయబడి నవరత్నాలు పొదగబడిన సింహాసనంలో ఆ మహారాణి ఇప్పుడు అమరివుంది. కారైక్కాల్ అమ్మ, తిలకవతి మొదలైన పరమ శివ భక్తురాళ్ళ మార్గంలో వచ్చిన ఆ స్త్రీమణి తెల్లని పట్టువస్త్రాలు కట్టుకొని, విభూతి, రుద్రాక్షమాల ధరించి, ఇంకే ఆభరణాలు ధరించక, అష్టైశ్వర్యాలమధ్య సర్వసంగ పరిత్యాగిగా జీవనం కొనసాగించవచ్చునని నిరూపిస్తూంది. శిరస్సుపైన మణిమకుటం లేకపోయినా, ఆమె ప్రకాశవంతమైన గంభీర వర్చస్సు రాజకులంలో పుట్టి, రాజకులంలో మెట్టిన రారాణి అని ఎత్తి చూపిస్తోంది. చోళ రాజకుటుంబానికి చెందినవారందరు ఆమెను దైవంగా భావించి, ఆమె ఇష్టానికి ఎదురుగా ఏ కార్యమూ చేయక నడుచుకొనేవారు.

కానీ, అటువంటి భయభక్తి మర్యాదలకు ఇప్పుడొక కళంకమేర్పడింది. ఆ మహారాణి కుమారుడు మధురాంతక దేవర్ ఆమె మాటకెదురు తిరిగి, ఆమె ఆజ్ఞను మీరి పళువేట్టరయ్యర్ కులంలో పెళ్ళిచేసుకొన్నాడు. అదిమాత్రమేగాక, చోళ సామ్రాజ్య సింహాసనానికి ఆశపడుతున్నాడని కూడ ఆమె చెవిన పడి దిగులు కలిగిస్తోంది.

శెంబియన్ మహాదేవి అంతఃపుర ప్రాంగణంలోను, సభామంటపంలోను శిల్పాచార్యులు,

దేవారాలు పాడేవారి గోష్టితో ఎప్పుడూ సందడిగా ఉండేది. దూరదేశాలనుంచి శివభక్తులు, తమిళ దవిపండితులు వచ్చి కానుకలు, బహుమతులు తీసుకొని వెళ్ళడం పరిపాటి. శివపూజ ప్రసాదం తీసుకొనివచ్చే అర్చకుల కూటమికూడ అధికంగానే ఉండేది.

ఆరోజు తిరుముదుకుండ్రం (విరుదాచలం), తెన్కురంగాడుదుర్రై, తిరుమళప్పాడి మొదలైన ఊళ్లనుంచి శిల్పాచార్యులు, శివభక్తులు వచ్చి తమతమ ఊళ్లలోని గుళ్ళలో నల్లరాతి విగ్రహాలను ప్రతిష్టించేందుకు ఆ మహారాణి సహాయం కోరారు. దేవాలయాలను ఏఏ ఊళ్లలో ఎలా కట్టాలని ఉద్దేశించారో చూపేందుకు చిత్రపటాలు, నమూనా విగ్రహాలు, దేవాలయాలను తీసుకొనివచ్చారు.

మొదటి రెండు దేవాలయాలకు సహాయం చేస్తానని చెప్పిన  తర్వాత, "మళప్పాడా? ఏ మళప్పాడి?" అని అడిగారు.

"సుందరమూర్తి స్వామిని గొంతెత్తి పిలిచి పాటను పొందారే, ఆ మళప్పాడే!" అని ఆ ఊరివారు చెప్పారు.

"ఏమా సంభవం?" అని మళవర్రై ముద్దుల రాకుమారి (సెంబియన్ మాహాదేవి) అడగగా, మళప్పాడి పురస్థులు ఇలా వివరించారు :-

"సుందరమూరి స్వామివారు చోళ సామ్రాజ్యపు పుణ్య స్థలయాత్ర చేస్తున్నప్పుడు ఒక నదిని దాటవలసి వచ్చింది. నదిని దాటి అవతలకు వెళ్ళనారంభించారు. అప్పుడు, 'సుందరం! నన్ను మరిచిపోయావేమి!' అన్న పిలుపు వినిపించింది.

సుందరమూర్తి అదిరిపడ్డారు. అలా పిలిచింది తనలోని దైవమే అని గ్రహించారు.

పక్కనున్న శిష్యులను చూసి, "ఇక్కడ దగ్గరలో ఏదైన శివాలయం ఉందా?" అని అడిగారు.

"అవును, స్వామీ! ఆ పొన్నచెట్ల చాటున మళపాడి గ్రామపు శివాలయం ఉంది!" అని శిష్యులన్నారు.

వెంటనే సుందరమూర్తి అక్కడికి వెళ్ళారు. పూచిన పూలతో తులతూగుతున్న పొన్నచెట్ల చాటున ఒక చిన్న కోవెల కనిపించింది. సుందరమూర్తి అక్కడికి వెళ్ళి స్వామి దర్శనం చేసుకొని ఆర్ద్రమనస్కులై పాడారు. ఒకప్పుడు తనను కాపాడినట్లు ఈ రోజు తనను పిలిచి కరుణచూపిన స్వామివారిని తలుచుకొని పరవశించారు. 'స్వామీ! నిన్ను నేను మరిచిపోతానా? ఎంత మాట? నిన్నుగాక ఇంకెవరిని నేను తలుస్తాను?' అని ఈ కింది పాటను పాడారు :-

<< ఆ భక్తిపూరిత పద్యాన్ని అనువదించ వలసివుంది >>

తల్లీ! ఆ కోవెల ఇంకా చిన్న కోవెలగానే, పొన్నచెట్ల చాటున ఉంది. అందుకే త్వరలో

ఆలయకైంకర్యం చేయాలని కోరుతున్నాము."

"అలాగే జరగనీ!" అన్నారు శెంబియన్ మహాదేవి.

ఆళ్వార్ కట్టియాన్, ఆయనతో బాటు ఇంకొకరు కాస్త ముందుకువచ్చి జరిగినదంతా శ్రద్ధగా విన్నారు.

~~~
~~~

# అధ్యాయము - 44

## "అంతా ఆమె చేసిందే!"

**మామల్లపురపు** (మహాబలిపురం) మహాశిల్పుల పరంపరలో వచ్చిన శిల్పాచార్యులొకరు ఇప్పుడు ముందుకు వచ్చారు. నవీన పద్ధతిలో నల్లరాతిలో చెక్కేందుకు ఆయన ఊహాశక్తి ప్రకారం నిర్మించిన ఒక చిన్న నమూనా కోవెలను మహారాణికి చూపించారు.

ఆ కోవెల నమూనాను చూసి మహారాణి చాల ఆశ్చర్యపోయారు. ఆళ్వార్ కట్టియాన్ దగ్గర నిలబడివున్న ఒకరిని చూసి, "భట్టాచార్యా! ఈ ఆలయ నిర్మాణాన్ని చూశారా? ఎంత విశిష్టంగా ఉంది? తమిళదేశంలో ఉన్న శైవక్షేత్రాలన్నిటిలో ఇలాంటి ఆలయాలు కట్టించాలని నా మనస్సు కోరుతోంది!" అన్నారు.

"తల్లీ! తమ కోరిక నెరవేరడానికి అడ్డంకి ఏముంది? అలాగే చేద్దాం. అన్ని శైవక్షేత్రాలలోను ఇటువంటి ఆలయాలను నిర్మిద్దాం. ప్రతిక్షేత్రంలోను ప్రజలు ఆ ఆలయాన్ని చూసిన వెంటనే, 'సుందరమూర్తి గీతాన్ని ప్రసాదంగా పొందిన స్థలం' అని గ్రహిస్తారు!" అన్నారు ఈశాన్య శివభట్టు.

"అవునవును! అప్పర్ పెరుమాళ్ళు, జ్ఞాన సంబందర్, సుందరమూర్తి పాడిన పాటలన్నీ సేకరించాలి. వారి పాదాలు తాకి పునీతమైన స్థలాలన్నిటిలో ఇటువంటి విశిష్టమైన విమానగోపురాలు, ప్రాకారాలతో గుళ్లను కట్టించాలి. ఈ రెండు మాత్రమే నా మనోరథాలు. ఇవి నెరవేరతాయా అని తరచూ సందేహం కలుగుతోంది. నా పతిదేవుడు పశ్చిమదిశగా ప్రయాణమై వెళ్ళి అకాలంలో పరమపదించి ఉండకపోతే, నా మనోరథాలన్నీ నెరవేరివుండేవి...."

"ఇప్పుడు మాత్రం ఏం కొరత తల్లీ! తమరనుకొన్నది అనుకొన్నట్లు నెరవేర్చాలని చక్రవర్తి ఆజ్ఞాపించివున్నారు కదమ్మా! ఆయన కుమారులిరువురూ తమరు మనస్సులో అనుకొనేముందే ఊహించి తెలుసుకొని, దాన్ని నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నారు. అలా ఉన్నప్పుడు..."

"ఉన్నప్పటికీ, ఇప్పుడు నా మనస్సులో ఉత్సాహమంతగా లేదు. ఏవేవో గాలి మాటలు వినవస్తున్నాయి.. నేను చేసే ఆలయ కైంకర్యాలవల్ల బొక్కసం ఖాళీ అయిపోతుందని కొందరు నిందలు మోపుతున్నారట. 'శివునికి ఇన్ని ఆలయాలెందుకు?' అని అడుగుతున్నారట. ఇతరుల మాటలవల్ల నాకంతగా దిగులులేదు. కంచిలో ఉన్న యువరాజు కూడ...."

ఇలా పెద్దరాణి అన్నప్పుడు, ఆళ్వార్ కట్టియాన్ ఒకడుగు ముందుకు వచ్చి, "తల్లీ! అలా అడుగుతున్నవారిలో ఈ దాసుడుకూడ ఒకడు!' అన్నాడు.

మహారాణి అతన్ని కాస్త ఆశ్చర్యంగా చూసింది. తక్కినవారు, 'ఇదేం విపరీతం?' అన్న భావంతో అతన్ని నిశితంగా చూశారు.

ఆళ్వార్ కట్టియాన్ ఇంకాస్త గొంతు పెంచి, ఆక్రోషంతో, "అమ్మగారూ! నా కడుపు మండిపోతోంది! ఇలాంటి అన్యాయం ఉంటుందా? ధర్మదేవత అవతారంగ విలసిల్లిన మీరు ఈ అవినీతికి తావివ్వదగునా?" అన్నాడు.

తిరుమలై (ఆళ్వార్ కట్టియాన్) పక్కనున్న ఈశాన్య శివభట్టు, "తల్లీ! నా తమ్ముడు ఇలాగే ఏదో వదరుతుంటాడు. ఉన్నట్లుండి వాడికిలా పిచ్చిపడుతుంది. దయచేసి మన్నించాలి!" అన్నారు.

-:-

ఆ కాలంలో శైవులు వైష్ణవులు వేర్వేరు జాతులుగా విడివడివుండలేదు. ఒకే కుటుంబంలో కొందరు శైవమతాన్ని, ఇంకొందరు వైష్ణవమతాన్ని పాటించే అవకాశముండేది. ఒకే పురోహితులు శివాలయంలోను, వైష్ణవాలయంలోను పూజలు, అర్చనలూ చేసేవారు. ఈశాన్య శివభట్టు అలాంటి విశాలభావాలు కలిగినవారు. తిరుమలైయప్పన్ ఆయనకు వేలువిడిచిన సహోదరుడు. పరస్పర ప్రేమాదరాలు కలిగినవారు. కాబట్టి ఈశాన్య శివభట్టు తన తమ్ముని ప్రేలాపనకు మహారాణివద్ద మన్నింపు కోరారు.

దేవి (మహారాణి) మందహాసంతో, "తిరుమలై! కాస్త నెమ్మదిగా మాట్లాడు! ఇప్పుడేం అన్యాయం జరిగిపోయింది?" అని అడిగారు.

"అమ్మా! పిశాచాల నాయకుడు, చేత కపాలం పట్టుకొని బిచ్చమెత్తి బతికే శివునికి ఎన్ని గుళ్ళు? ప్రపంచాన్నంతా కాపాడి రక్షించే విష్ణుమూర్తికి ఒక పుణ్యదేవాలయంకూడ లేదా? ఒక పాత కోవెలనైనా పునర్నిర్మించకూడదా?" అని తిరుమలై వాపోయాడు.

"అమ్మా! అఖిల భువనాలను ఏలే పెరుమాళ్ళకు (శివునికి) రంగ మంటపాలు, గుళ్ళు, గోపురాలు, ప్రాకారాలు, మాళిగలు కావాలి. పొద్దస్తమానం నిద్రపోయే విష్ణుమూర్తికి ఒక చిన్న చోటు చాలదా? దీపంలేని చీకటికమ్ముకున్న చోటేకద ఆయనకు కావాలి? పెద్ద పెద్ద కోవెలలు, మంటపాలు ఎందుకు కావాలి?" అని అడిగారు ఈశాన్య శివ భట్టు.

"అన్నా! పొద్దస్తమానం నిద్రపోయే పెరుమాళ్ళే మూడులోకాలను తన కాలితో కొలిచిన పెరుమాళ్ళు! మహాబలిని పాతాళానికి తొక్కిన పెరుమాళ్ళు!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"అటువంటి లోకాలను కొలిచిన మీ పెరుమాళ్ళు మా శివపెరుమాళ్ళ పాదారవిందాలను దర్శించేందుకు తవ్వుతూ తవ్వుతూ పాతాళానికి చేరినా మా పెరుమాళ్ళ పాదారవిందాలను కనిపెట్టలేకపోయాడు!" అన్నారు ఈశాన్య శివ భట్టు.

"మీ శివుడు అంతపెద్దవాడైతే కోవెలెందుకని అడుగుతున్నాను! కోవెల లోపల ప్రవేశించేటప్పుడు ఆయన తల తగిలి గుడి పడిపోతుందే!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

-:-

మహారాణి ఇదంతా విని నవ్వుతూనే, "మీ వాగ్వివాదాన్ని కాస్త ఆపండి. తిరుమలై, నీవేమంటున్నావు? పెరుమాళ్ళకు (విష్ణువు) కోవెల కట్టకూడదని ఎవరన్నారు? ఏవూరు విణ్ణగరాన్ని (విష్ణుదేవాలయం) పునర్నిర్మించాలంటున్నావు? దాన్ని మంచిగా చెప్పవచ్చుకదా?" అన్నారు.

"అమ్మా! తమ మామగారు, ముల్లోకాలలో కీర్తిగాంచిన పరాంతక చక్రవర్తిగారి పట్టపు పేరుతో విలసిల్లే వీరనారాయణపురానికి వెళ్ళాను. అక్కడ వీరనారాయణపెరుమాళ్ రాత్రింబగళ్ళు నిద్రించక, వీరనారాయణ చెరువును కాపాడుతున్నాడు. అటువంటి పెరుమాళ్ళ గుడి చుట్టూవున్న ఇటుకగోడలు విరిగిపడిపోతున్నాయి. గుడిగోడ విరిగిపడితే చెరువు కట్టతెగి వందలకొద్ది గ్రామాలు మునిగిపోతాయి. వీరనారాయణపెరుమాళ్ళ కోవెలను పునర్నిర్మించేందుకు తమ కైంకర్యం అవశ్యం కావాలి!" అన్నాడు.

"అలాగే చేద్దాం! అందుగురించి నాకు వివరాలు చెప్పు! తక్కినవారందరు ఇప్పుడు వెళ్ళవచ్చు!" అని చోళకులపు మహారాణి అన్నారు.

ఆ సూచనను గ్రహించి, ఈశాన్య భట్టుతో సహా తక్కినవారందరు బయటికి వెళ్ళారు.

-:-

వెంటనే, సెంబియన్ మహాదేవి, గొంతు తగ్గించి, "తిరుమలై! యాత్రలో ఏఏ స్థలాలకు వెళ్ళావు? ఏమేం చూశావు? ఏమేం సంగతులు విన్నావు? వివరంగా చెప్పు! ఏదో ముఖ్యమైన సమాచారం తీసుకొని వచ్చావు; అందుకే అలా డొంకతిరుగుడుగా మాట్లాడావు కదా?" అని అన్నారు.

"అవును, తల్లీ! ముఖ్యమైన వార్తలు చాలానే తీసుకొని వచ్చివున్నాను. కానీ మీ మనోభావం ప్రకారం నడుచుకొంటాను. కంచిలోవున్న యువరాజు గురించి ఏదో చెప్పొచ్చారు కదా? అందుకే అడ్డుపడ్డాను. ఇంతవరకు ఇక్కడవున్నవారిలో నిజమైనవారెవరు, గూఢచారులెవరని ఎవరికి తెలుసు? దేశంలో ఎన్నో విపరీతాలకు పన్నాగాలు జరుగుతున్నాయి. ఎప్పుడు ఎవరివల్ల ఏం ద్రోహం జరుగుతుందో చెప్పలేము!" అన్నాడు తిరుమలై.

మహారాణి పెద్దగా నిట్టూర్చారు. "ఒక కుటుంబానికి చెందినవారు, రక్తసంబంధం ఉన్నవారు - ఒకరినొకరు సందేహించే పరిస్థితి వచ్చిందిప్పుడు. ఆదిత్య కరికాలన్ ఒకప్పుడు నాలో ఎంత విశ్వాసం కలిగివుండేవాడు? తన సొంత తల్లికన్న నాపైన నూరురెట్లు మమత, అనురాగం కలిగివుండేవాడు కదా? వాడుకూడ నన్ను సందేహిస్తున్నాడే! తిరుమలై! నా పతిదేవునితోబాటు నేనుకూడ ఈ భూలోకాన్ని వదిలపోయివుంటే ఎంత బాగుండేది? నేనాయనతో రాకూడదని అడ్డుపడ్డారు కదా? ఇక్కడ నేను

చేయవలసిని పనులను కూడ ఒప్పజెప్పేసి కద వెళ్ళిపోయారు? ఎంత దౌర్భాగ్యశాలిని నేను!" అన్నారు.

"అమ్మా! తమ పతి త్రికాలజ్ఞాని. కలియుగంలో జనకమహారాజులాగ చోళసింహాసనంపైన విరాజిల్లారు. ఆయన మిమ్మల్ని ఈభూలోకంలో జీవనం కొనసాగించమని చెప్పింది చోళసామ్రాజ్యం చేసిన భాగ్యం. నూరేళ్ళుగా పెరుగుతూ వస్తున్న ఈ చోళ సామ్రాజ్యం అన్నదమ్ముల కొట్లాటవల్ల నశించిపోకుండ చూసే బాధ్యత మీపైన ఉంది. మీవల్లనే అది సాధ్యం!"

"నాకేమీ తోచడంలేదు. నాసొంత కొడుకే నామాట విననప్పుడు ఇతరులను నామాటకు కట్టుబడేలా  ఎలా చేయగలను? అదలా ఉండనీ. గూఢచారులను గురించి చెప్పావే, ఇక్కడికి ఎవరు గూఢచారులను పంపించి ఉండగలరు? యువరాజు ఆదిత్య కరికాలన్ పంపించి ఉంటాడనుకొంటావా? నాపైన వాడికి అంత అపనమ్మకం వచ్చేసిందంటావా?" అన్నారు శివభక్తశిరోమణియైన మహారాణి.

"నా రెండు చెవులారా విన్నాను తల్లీ! లేకుంటే నేను నమ్మేవాడినే కాను...."

"ఏం విన్నావు తిరుమలై? నీ చెవులారా ఏం విన్నావు?"

"మామల్లపురం (మహాబలిపురం) దగ్గరి ఒక రాతిగుడి దగ్గర కూర్చొని వారు మాట్లాడుకొన్నది విన్నాను..."

"వారంటే ఎవరు?"

"యువరాజు ఆదిత్య కరికాలన్ ఒకరు, తిరుక్కోవలూర్ మలైయమాన్ ఇంకొకరు, పల్లవ పార్థిబేంద్రుడు మూడవవారు. చీకటిగుయ్యారమైన ఆ రాతిగుడిలో దాక్కొని విన్నాను. మలైయమాన్, పార్థిబేంద్రుడు చాల ఉద్రేకంగా మాట్లాడారు. ఇద్దరు పళువేట్టరయ్యర్లు తమ కుమారుడైన మధురాంతకునితో కుమ్మకై చక్రవర్తిని చెరపట్టివుంచారట. దానిలో మీకూ భాగం ఉండే తీరాలని మలైయమాన్ అన్నారు. అది నిజమే అయివుండాలని తక్కిన ఇద్దరూ ఒప్పుకొన్నారు. తంజావూరుపైన దండెత్తి వెళ్ళి చక్రవర్తిని విడిపించుకొని రావాలని పార్థిబేంద్రుడన్నాడు. దాన్నికూడ తక్కిన ఇద్దరూ ఆమోదించారు. కానీ, చక్రవర్తిని యుద్ధం లేకుండ కాంచీపురానికి తీసుకురావడానికి ఇంకొక్కసారి ప్రయత్నించాలని యువరాజన్నారు. అందుగురించి ఒక తాళపత్రసందేశాన్ని రాసి ఒక దూత ద్వారా పంపించాలనికూడ తీర్మానించారు. ఆ దూత ఎవరన్నదికూడ నేను తెలుసుకొన్నాను. అతను సాధారణమైన దూతకాడు. మహా సమర్థవంతుడు; వీరపరాక్రమశాలి. దూతకార్యంతోబాటు గూఢచారి పనికూడ చేయగల సమర్థుడు. అతన్ని నేను మాట్లాడింపజూశాను. కానీ అతను మహా జిత్తులమారి. నాదగ్గరినుంచే సమాచారం లాగజూశాడు. కుడంద్తై జ్యోతిష్కులు తమ హస్తలాఘవం చూపజూశారు. అదికూడ ఫలించలేదు. తర్వాత అతను తంజావూరుకు వెళ్ళి తాళపత్రాన్ని చక్రవర్తికి ఇచ్చేశాడని విన్నాను..."

"తర్వాత ఏం జరిగింది? అందుకు చక్రవర్తి ఏం ఉత్తరమిచ్చారట?"

"ఎల్లుండి జవాబు రాసిస్తానని చెప్పారట. అంతలోపల ఇద్దరు పళువేట్టరయ్యర్లకు అతనిపైన ఏదో సందేహం ఏర్పడిందట. వారి కాపలా కట్టుదిట్లనన్నిటినీ మీరి తప్పించుకొని పారిపోయాడట!"

"అలాగైతే అతడు అతి సమర్థవంతుడే; సందేహంలేదు. తర్వాత నీవేం చేశావు? కంచినుంచి బయల్దేరిన తర్వాత?"

"తిన్నగా ఇక్కడికి వచ్చేందుకే బయల్దేరాను. దారిలో వీరనారాయణపురం పెరుమాళ్ళను దర్శించేందుకు ఆగాను. అక్కడ పెరుమాళ్ళ దయవల్ల ఒక పెద్ద రహస్యం తెలుసుకొన్నాను..."

"అదేమి? ఇంకా ఒక రహస్యమా?"

"అవును, తల్లీ! కడంబూర్ శంబువరయ్యర్ మాళిగలో ఆ రోజు రాత్రి ఒక పెద్ద విందు జరగబోతోందని విన్నాను. ఆ విందుకు పెద్ద పళువేట్టరయ్యర్ వచ్చారు. ఆయనతో యువరాణి పల్లకికూడ వచ్చింది!"

"తిరుమలై! అంతా ఆమె చలవే! ఈ చోళసామ్రాజ్యానికి ఇప్పుడు ముంచుకొస్తున్న ఆపద ఆమె కారణంగా ఏర్పడ్డదే! ఆమెను నీవు కలిసి మాట్లాడగలిగావా?"

"కాలేదు, తల్లీ! మీ ఆజ్ఞప్రకారం ఆ స్త్రీసర్పాన్ని నా సహోదరిగా భావించి ఎన్నేళ్ళు సాకాను! ఎక్కడెక్కడో తిరిగి ప్రబంధపాశురాలన్నిటినీ నేర్చుకొనివచ్చి దానికి నేర్పించాను! అదంతా తలుచుకొంటే నా మనసు భగ్గుమంటోంది! పెద్ద పళువేట్టరయ్యర్ రాణిగా చలామణి అవుతున్న అది నన్ను చూసేందుకు కూడ నిరాకరిస్తోంది...!"

"అందుగురించి దిగులుపడి ఏం ప్రయోజనం? మనుషులింతే. అనుకొన్నదొకటి, జరిగేదింకొకటి... తర్వాత కడంబూర్లో ఏం జరిగింది?"

"పల్లకిలో వచ్చింది నందినే అనుకొని, ఎలాగైనా ఆమెను కలవడమో లేదా తాళపత్రం రాసిచ్చి హెచ్చరించడమో చేయాలని ఉద్దేశించి కడంబూరుకు వెళ్ళాను. పెద్ద అపాయానికి తెగించి మాళిగ బయటి ప్రాకారాన్ని ఎక్కి లోపలికి దూకినప్పుడు ఆ విచిత్ర రహస్యం నాకు తెలిసొచ్చింది..."

"తిరుమలై! నీ అలవాటే ఇది. ఊరిస్తావే తప్ప విషయాన్ని చెప్పవు. అదేమంత విచిత్రమైన రహస్యం?"

"మన్నించాలి, తల్లీ! అది చెప్పేందుకే జంకుగా ఉంది. మూసిన పల్లకిలో ఉన్నది పళువూర్ యువరాణి కాదు. పళువేట్టరయ్యర్ తాను వెళ్ళినచోటల్లా తమ యువరాణిని తీసుకువెళుతున్నారని మనమంతా అనుకొన్నామే, అది పెద్ద పొరబాటు..."

"పళువేట్టరయ్యర్ మరి ఇంకెవరిని పల్లకిలో తీసుకు వెళ్తున్నారు? ఆ ముసలాయన

స్త్రీచాపల్యానికి మితే లేదా?"

"ఆ మూసిన పల్లకిలో ఉన్నది స్త్రీ కానే కాదు, తల్లీ!"

"స్త్రీ కాదంటే? ఏ మగవాడు మూసిన పల్లకిలో దాక్కొని వస్తాడు?"

"మన్నించాలి, తల్లీ! అలా మూసిన పల్లకిలో దాక్కొని వెళ్ళింది తమ కుమారుడు మధురాంతక దేవరే!"

శెంబియన్ మహాదేవి కాసేపు అవాక్కై నిలబడిపోయారు.

"భగవాన్! నేను చేసిన నేరానికి ఇంతపెద్ద శిక్షా?" అని తనలోతానే చెప్పుకొన్నారు.

-:-

తర్వాత ఆళ్వార్ కట్టియాన్ శంబువరయ్యర్ మాళిగలో అర్ధరాత్రి జరిగిన కుట్ర సమావేశం గురించి చెప్పాడు.

అదివిని ఆ మహారాణి పడ్డ మనోవేదన చెప్పలేము. "అయ్యో! బిడ్డా! నిన్ను శివజ్ఞానిగా పెంచ ప్రయత్నించానే? దాని ఫలితమిదేనా? చోళ మహావంశానికి నీవల్ల ఇటువంటి అపకీర్తా కలగాలి? చోళ మహారాజ్యానికి నీవల్ల ఇటువంటి చేటు కలగాలా?" అని వగచారు.

తర్వాత, "తిరుమలై! మళ్ళీ నన్ను చూసి వెళ్ళు! కుందవైతో మాట్లాడి ఈ విపరీతాన్ని ఎలా ఆపాలో ఆలోచించి చెప్తాను!" అన్నారు.

"తల్లీ! రాకుమారి వద్ద మీరు ఈ విషయాన్ని గురించి ప్రస్తావించకుండడం మంచిది."

"ఎందుకు? ఆమెను కూడ సందేహిస్తున్నవా ఏమి?"

"అది సహజమే కద తల్లీ! ఆమె ఆదిత్య కరికాలన్ ముద్దుల చెల్లెలే కద?"

"అయితే ఏం...? తిరుమలై! సూర్యుడు పడమర పుట్టి తూర్పునగుంకాడని నీవంటే నమ్ముతాను. శివపరమాత్మ కన్న విష్ణువు గొప్పదైవమని నీవంటే వింటాను. కానీ కుందవై పైన నింద మోపితే నేను నమ్మను. ఆమె పుట్టిన రోజు అంతఃపుర వైద్యురాలు ఆ పాపను తీసుకొనివచ్చి నా చేతుల్లో పెట్టింది. అప్పటినుంచి ఆ చిన్నారిని నేనే పెంచాను. నా కడుపున పుట్టిన కొడుకుకన్న ఆప్యాయంగా పెంచాను. ఆమెకూడ నన్నే కన్నతల్లిగా ఎంచి అత్యంత ఆప్యాయతానురాగాలతోను గౌరవ మర్యాదలతోను నన్ను పరిగణిస్తోంది."

"అమ్మా! ఒకటడుగుతాను. కుందవైదేవి కుడంద్తై జ్యోతిష్కుల వద్దకు వెళ్ళివచ్చిన విషయం మీకు చెప్పారా?"

"లేదు; అందువల్ల ఏమి?"

"జ్యోతిష్కుల ఇంట వాణర్ కులపు యువకుని చూసిన విషయం, తర్వాత అదే యువకుని అరిసిలానది ఒడ్డున కలిసిన విషయం మీకు చెప్పారా?"

"లేదు. ఇవన్నీ ఏం ప్రశ్నలు? ఇలా అడగడంలో నీ ఉద్దేశమేమి?"

"మీవద్ద చెప్పకూడని రహస్యమొకటి రాకుమారి దాచిపెట్టుకున్నారనే. నేను చెప్పిన వాణర్ వంశ యువకుడే ఆదిత్య కరికాలన్‌గారి దూత; గూఢచారి అని చెప్పినా తప్పులేదు."

"తిరుమలై! అదంతా ఎలాగైనా ఉండనీ. కుందవై నావద్ద ఏదైనా చెప్పలేదంటే అందుకు తగిన కారణం ఉండే తీరుతుంది. ఆమెను సందేహించడం కన్న నేను నాప్రాణాలే విడిచేస్తాను!" అన్నారు శివజ్ఞాన గండరాదిత్యుల పత్ని.

"అయ్యయ్యో! అలాంటి ప్రమాదం వద్దు. కుందవైదేవిపైన మీకున్న నమ్మకమే నిజం కానివ్వండి. రాకుమారి నన్ను ఏదో విషయం గురించి అడిగేందుకు రమ్మని చెప్పారు. మీరామెను చూడగోరుతున్నారని నేనే వారికి తెలియజేస్తాను" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

~~~
~~~

# అధ్యాయము - 45

## "నేరం చేసిన గూఢచారి"

**రెండువేల** సంవత్సరాలకుమునుపు కరికాల్ పెరువళత్తాన్ అనే చోళరాజు కావేరినది రెండువైపులా కట్ట కట్టించాడు. చాలాకాలం వరకు ఆ కట్టలు గట్టిగా ఉంటూ కావేరి నదిని అదుపులో వుంచుతూ వచ్చాయి. తర్వాత చోళవంశపు బలం తగ్గిపోయింది. పాండ్యులు, పల్లవులు, కళప్పారులు, వాణర్ కులస్థులు తలెత్తారు. ఈ కాలంలో కాపలా లేని కావేరి అప్పుడప్పుడు కట్టలు తెంచుకొని పొంగిపొర్లేది. అలా పెద్దఎత్తున కట్టలు తెగి వరదలు పారిన సందర్భాలలో నది తీరే తలకిందులైపోయేది. పాతకావేరి కొత్తకావేరిగా మారేది; పూర్తిగా నది గతి మారిపోయినప్పుడు, ఒక్కొక్కసారి నది ఉరకలు పరుగులెత్తేది; ఒక్కొక్కచోట నీరు నిలిచిపోయి పెద్ద పెద్ద కొలనులుగా మారిపోయేది.

పళైయారై నగరంలో చోళ మాళిగల పక్కనే అటువంటి ఒక పెద్ద కొలనుండేది.

కావేరి గతి మారినందువల్ల ఏర్పడ్డ ఆ కొలనును చోళరాజులు కావాలనే తమకు కావలసినట్లు లోతుగాను వెడల్పుగాను ఎప్పుడూ నీరు నిండివుండేటట్లు మలుచుకొన్నారు. మాళిగలకు, ముఖ్యంగా అంతఃపురాలకు ఈ నీటికొలను రక్షగా నిలిచింది. ఆదారిలో ఎవరూ అంతసులభంగా రాలేరు. రాజవంశస్థులకు సన్నిహితులైనవారు మాత్రమే పడవెక్కి ఇటువైపు రాగలరు.

అంతఃపురాల అందమైన ఉద్యానవనాలు ఈ కొలనుకు పక్కనే ఉండేవి. అంతఃపురస్త్రీలు ఆ ఉద్యానవనాలలో ఏసమయంలోనైనా నిర్భయంగా తిరిగేవారు; నెమళ్లై ఆడేవారు; కోయిలలై పాడేవారు. కొన్నిసార్లు కొలనులో దిగి జలకాడేవారు. కొలనులో పడవను కూడ నడిపి ఆనందించేవారు.

చోళవంశంలో ఒక రాజు దివంగతులైన తర్వాత ఇంకొకరు పట్టానికి వచ్చినప్పుడు కొత్త మాళిగ, అంతఃపురం కట్టుకొనే సంప్రదాయం ఉండేది. పాత మాళిగలో దివంగతులైన రాజుగారి రాణులు, వారి పిల్లలు వసించేవారు.

పళైయారై మాళిగలలో శెంబియన్ మహాదేవి మాళిగ తర్వాత కుందవైదేవి మాళిగ అందంలోను గాంభీర్యంలోను మేటిగా విరాజిల్లేది. అది సుందర చోళ చక్రవర్తి నివసించిన మాళిగ కదా? ఆయన తంజావూరుకు తరలి వెళ్ళిన తర్వాత కుందవైదేవి ఆ మాళిగ యజమానిగా విలసిల్లింది.

ఆ మాళిగ వెనుకవైపున చాల అందమైన ఉద్యానవనముండేది. అందులో ఆకాశాన్నంటే మర్రిచెట్లూ ఉండేవి; చిన్నారి పూల మొక్కలూ ఉండేవి. చెట్లను అల్లుకొన్న పూలతీగెలు /పుష్పలతలు, అవి అల్లుకొన్న పొదరిళ్ళూ చూడ ముచ్చటగా ఉండేవి.

కుందవైదేవి తన చెలికత్తెలతో ప్రతి సాయంకాలం ఆ ఉద్యానవనంలో విహారంచేస్తూ పొద్దుపుచ్చడం అలవాటు. కొన్నిసార్లు అందరూ ఒక చోట కూర్చొని కథలు చెప్పుకొనేవారు. ఇంకొన్నిసార్లు ఇద్దరిద్దరుగా, ముగ్గురు ముగ్గురుగా విడివడి అంతరంగ విషయాలు మాట్లాడుకొనేవారు.

కొన్నిరోజులుగా కుందవైదేవి, వాణతి విడిగా మాట్లాడుకోవడం జరుగుతోంది.

ఆరోజు వారిద్దరు ఒక పెద్ద మర్రిచెట్టుకు కట్టివున్న ఒక బల్ల ఊయలపైన కూర్చొని ఆడుతూ మాట్లాడూకొంటున్నారు.

పక్షుల కిలకిలారావాలతోబాటు చెలికత్తెల నవ్వుల గలగలలూ వినిపిస్తోంది.

కానీ కుందవైదేవి, వాణతి మాత్రం నవ్వడం లెదు. తక్కినవారి నవ్వులుకూడ వారికంతగా రుచించలేదు. ఎక్కువగా మాట్లాడుతున్నారంటే అదీ లేదు.

ఒక పొదరింట ఒక చెలికత్తె గీతం పాడుతోంది. అది కృష్ణుడు పుట్టినరోజు కద? ఆమె పాడుతోంది కూడ కన్నయ్య గురించే.

వెన్నెలలో వేణుగానం తేలివస్తోంది. అది కన్నయ్యపైన ప్రీతిగొన్న ఒక యువతిని బాధిస్తోంది. ఆమె తన వేదనను నోరువిప్పి చెప్పుకుంటోంది. చెట్టుకొమ్మ పైనున్న ఒక చిలుక అది విని ఆమెకు ఊరట చెబుతోంది.

<< ఆ అందమైన సంభాషణను అనువదించ వలసివుంది >>

పాట చివరిభాగాన్ని శ్రద్ధగా వింటూవచ్చిన కుందవైదేవి, పాట ముగిసిన వెంటనే, “ఆ కన్నయ్య మన ఈ తమిళదేశానికి దైవంగా వచ్చినట్లే! వెన్న తింటూ, పిల్లనగ్రోవి ఊదుతూ, గోపికలతో ఆడుతూ ఉంటే తక్కిన కార్యాలన్నీ ఏం కావాలి?” అన్నది.

బదులు చెప్పక మౌనంగా ఉన్న వాణతిని చూసి, “ఏమే మాట్లాడకున్నావు? నీవుకూడ ఆ వేణుగానం విని మైమరచిపోయావా, ఏమి?” అని అడిగింది.

“అక్కా! ఏమడిగారు?” అన్నది వాణతి.

“ఏమడిగానా? నీ ధ్యానం ఎక్కడుందని!” అన్నది కుందవైదేవి.

“ఎక్కడికీ వెళ్లలేదే! మీపైనే ఉంది.”

“ఒసే దొంగా! ఎందుకే అబద్ధం చెబుతున్నావు? నిజానికి నీ మనసిక్కడ లేనే లేదు! ఎక్కడుందని నేను చెప్పనా?”

"తెలిస్తే చెప్పండి మరి!"

"బాగా తెలుసు, లంకకు దండెత్తి వెళ్ళింది. అక్కడ నా తమ్ముడు, ఒక కల్లాకపటం తెలియని పిల్లాడు, ఉన్నాడే - వాడిని ఇంకా ఏ మాయాభస్మం వేసి వశపరుచుకోవాలా అని నీ మనసు ఆలోచిస్తోంది!"

"మీరన్నదాంట్లో కాస్త నిజం ఉంది అక్కా! నా మనసు అప్పుడప్పుడు లంకకు వెళ్ళిపోతున్నది నిజమే. కానీ, ఆయనను ఏ మాయాభస్మం వేసి వశపరుచుకోవాలనీ ఆలోచించడం లేదు. ఆయన యుద్ధరంగంలో ఎన్నెన్ని కష్టాలు పడుతున్నారో, ఎన్నెన్ని గాయాలు ఆయన శరీరానికి తగిలాయో, ఏం తింటున్నారో - అనే కలవరిస్తోంది. ఆయనలాగ అక్కడ కష్టపడుతుండగా, నేనిక్కడ బాగా తిని, పట్టు మంచంపైన సుఖంగా నిద్రిస్తున్నాను కద. అది తలుచుకొంటేనే నాకు చాల దిగులుగా వుంది. నాకే రెక్కలుంటే ఈ క్షణమే లంకకు ఎగిరి వెళ్ళిపోయేదాన్ని...!"

"ఎగిరివెళ్ళి ఏం చేస్తావు? వాడికింకా ఇబ్బందే కద కలిగిస్తావు?"

"ఎప్పటికీ కాదు. అర్జునికి సుభద్ర, కృష్ణునికి సత్యభామ రధసారధ్యం వహించినట్లు నేను చేస్తాను. ఆయనపైకి గురిచూసి విడిచిన అమ్ములను నా ఎద అడ్డుపెట్టి కాచుకొంటాను.."

"నీవు కాచుకొంటే వాడు చూస్తూ ఊరుకొంటాడా?"

"అది ఆయనకిష్టం లేకపోతే యుద్ధశిబిరంలో ఆయనకోసం వేచివుంటాను. యుద్ధంనుంచి తిరిగి వచ్చిన తర్వాత ఆయన గాయాలకు మందువేసి చికిత్స చేస్తాను. పూలమంచం సిద్ధం చేసి ఉంచుతాను. రుచికరమైన వంటలు వండి వడ్డిస్తాను. ఒళ్ళునొప్పులు మరిచిపోవడానికి వీణ వాయిస్తూ పాటపాడి నిద్రపుచ్చుతాను..."

"ఇవన్నీ జరిగేవి కావు, వాణతీ! చోళవంశపు వీరులు యుద్ధరంగానికి స్త్రీలను తీసుకుపోరు..."

"ఎందుకక్కా?"

"వారికి గాయాలంటే భయం లేదు గాని స్త్రీలంటే మహాభయం!"

"అదేం? స్త్రీలు వారినేం చేసేస్తారట?"

"వారేం చేసేయరు. కానీ నీవంటి అమ్మాయిలు యుద్ధరంగానికి వెళితే శత్రువీరులు వారి అందాన్ని చూసి మైమరచిపోయి శరణాగతులైపోతే ఏం చేయడం? మన చోళవీరులు తమ వీరత్వాన్ని చూపలేరుగద?స్త్రీలను తీసుకువెళ్ళి విజయం సాధించారనే (అప)కీర్తి చోళవంశస్థులు ఇష్టపడరు."

"అలాకూడ ఉంటుందా? శత్రువీరులు అంత మూర్ఖులుగా ఉంటారా, అమ్మాయిల అందం చూసి వారి వలలో పడిపోయేందుకు?"

"ఎందుకుండరు? ఒసే వాణతీ! జ్యోతిష్కుల ఇంట, అరిసిలానది ఒడ్డున ఒక యువవీరుని చూశాం, గుర్తుందా?"

"ఉంది. అందుకేమిప్పుడు?"

"మనల్ని చూసిన వెంటనే అతను ఎలా మత్తెక్కినవాడిలా నిలబడ్డాడో గుర్తుందా?"

"అదికూడ జ్ఞాపకం ఉంది. కానీ మనల్ని చూసి అని మీరు చెప్పడం పొరబాటు. అతను మిమ్మల్ని చూసే అలా మైమరచి నిలబడిపోయాడు. పక్కన నిలబడ్డవారిని కన్నెత్తికూడ చూడలేదక్కా!"

"వాణతీ! భలే అబద్ధం చెబుతున్నావు! పరిహాసం చేస్తున్నావా, ఏమి?"

"లేదక్కా! నేనొకటి అడుగుతాను. అందుకు నిజమైన జవాబిస్తారా?"

"అడుగు, చూస్తాను."

"ఆ యువక వీరుని జ్ఞాపకం ఇప్పుడు మీకెందుకొచ్చింది?"

"మంచి మాటకారివైపోయావే నీవు! అతని జ్ఞాపకం రావడంలో తప్పేమిటి?"

"ఎవరు చెప్పారు తప్పని? నేను చెప్పలేదే? అది చాల సహజమే! నాక్కూడా ఆ యువకుని గతేమైందని దిగులే."

"నీకెందుకు అతని గతి గురించి దిగులు కలగాలి?"

"ఎందుకు కలగకూడదు? ఒకరిని మనం చూసివుంటే, వారిగురించి అప్పుడప్పుడు జ్ఞాపకం వస్తే, వారేమైనారని తెలుసుకోగోరడం సహజమే కద?"

"బాగుంది, బాగుంది నీ సహజత్వం! అలాగల్లా మనం మనసు చెదిరిపోయేందుకు తావివ్వకూడదు. మనస్సును కట్టుబాటులో పెట్టుకోవాలి... అదిగో విను, వాణతీ! అది ఏ వాద్యం? ఆ గొంతు ఏమంటోంది? కాస్త గమనించి విందాం!"

అవును; దూరంగా ఎక్కడో తప్పెట శబ్దం, మధ్య మధ్య ఒక మనిషి గొంతు వినిపిస్తోంది. చెవులు రిక్కించి విన్నప్పుడు, ఆ మనిషి చెబుతున్నదేమిటో తెలిసింది:

"శత్రుదేశం నుంచి వచ్చిన ఒక గూఢచారి నకిలీ రాజముద్ర చూపించి తంజావూరు కోటలోపల దూరి మన గుట్టు తెలుసుకొని బయటకు పారిపోయాడు. ఇద్దరిని ఇంచుమించు చనిపోయేటంత తీవ్రంగా గాయపరిచి తప్పించుకొన్నాడు. యుక్తవయస్కుడు. దిట్టమైన దేహంగలవాడు. ఇంద్రజిత్తువంటి మంత్రతంత్రాలు తెలిసినవాడు. పేరు వల్లవరయ్యన్ వంతిదేవుడు. అతనికి ఆశ్రయమిచ్చినవారికి మరణదండన విధించబడుతుంది. అతన్ని పట్టి ఇచ్చినవారికి వేయి బంగారు వరహాలు బహుమానం! తంజావూరు కోట దళపతి కాలాంతక గండరు విధించిన ఆజ్ఞ!"

ఇలా ఆ మనిషి చెప్పిముగించిన వెంటనే, తప్పెట ఢమఢమ మోగింది. కుందవైదేవి శరీరమెందుకో వణికింది.

అప్పుడు ఒక దాది అక్కడికి వచ్చి, "అమ్మా! ఆళ్వార్ కట్టియాన్ అనే ఒక వీర వైష్ణవులు మిమ్మల్ని చూడవచ్చారు. ఏదో అత్యవసరమైన కార్యమట!" అన్నది.

"ఇదిగో, వస్తున్నా!" అని చెప్పి కుందవైదేవి ఊయల దిగి వెళ్ళింది.

~~~
~~~

# అధ్యాయము - 46

## ప్రజల గుసగుసలు

**చోళవంశపు** మహారాణి అంతఃపురంనుంచి ఆళ్వార్ కట్టియాన్ కుందవైదేవి అంతఃపురానికి బయలుదేరాడు. దారిలో చూసిన దృశ్యాలు అతనికి చాల ఉత్సాహాన్నిచ్చాయి. కన్నయ్య పుట్టిన పుణ్యదినాన్ని ఈ ప్రజలెంత ఉత్సాహంతో జరుపుకొంటున్నారు? వైష్ణవమతం ఈ చోళదేశంలో గట్టిగా నెలకొని విస్తరిస్తుందనడంలో సందేహంలేదు. శైవమతానికి ఇక్కడ బాగా పలుకుబడి పెరగడానికి పలు కారణాలున్నాయి. నూరేళ్ళుగా చోళరాజులు దేశమంతటా కొత్త శైవాలయాలను కట్టిస్తూ వస్తున్నారు. మూవర్ పాడిన పాశురాలు ఈ ఆలయాల మూలకంగా ప్రచారం చేయబడుతున్నాయి. శివాలయాలలో రథోత్సవాలు బ్రహ్మాండంగా జరుపబడుతున్నాయి. అయినప్పటికీ, పెరుమాళ్ళకు (విష్ణువు) ఏ కొరతా లేదు. విష్ణుమూర్తి తొమ్మిదవ పరిపూర్ణ అవతారమైన శ్రీకృష్ణుడు ప్రజల హృదయాలను ఆకట్టుకొన్నాడు. నందగోకులంలోను, బృందావనంలోను, మధురానగరిలోను కన్నయ్య ఆడిన లీలలు ఈ ప్రజల హృదయాలలో నెలకొనివున్నాయి. ఆహా! ఎన్నెన్ని భాగవత గోష్టులు! ఎన్నెన్ని వీధి నాటకాలు! ఎన్నెన్ని రకాల వేషాలు! - అవును; ముందు మనం చూసినందుకన్న అధికంగానే ఉన్నాయి. గోష్టి వినే ప్రజలగుంపుకూడ అధికంగానే ఉంది. పళైయారై చుట్టుపక్కల గ్రామాలనుంచి కొత్తకొత్త నాటక గోష్టులు వస్తున్నారు.

ఒక నాటక గోష్టిలో దేవకి, వసుదేవుడు, కృష్ణుడు, బలరాముడు మొదలైన పాత్రల వేషాలను ధరించినవారు నాటకానికి సిద్ధమౌతున్నారు. ఆట, పాట, వేషధారుల సంభాషణ ఈ గోష్టిలో కాస్త ఎక్కువగా ఉన్నందున ఆళ్వార్ కట్టియాన్ అక్కడ నిలబడి శ్రద్ధగా గమనించసాగాడు. అప్పుడు కృష్ణునికి, కంసునికి మధ్య వివాదం/సంభాషణ జరుగుతోంది. కృష్ణవేషధారి చిన్నపిల్లవాడు. వాడు తన చిన్నారి పలుకులతో కంసుడు చేసిన తప్పులను ఎత్తి చూపి, "రా, నాతో యుద్ధానికి!" అని పిలిచాడు. అందుకు కంసుడు పెద్ద గొంతుతో, "ఒరే, కృష్ణా! నీ మాయాజాలం నాదగ్గర ఫలించదు! ఇదిగో, ఇప్పుడే నిన్ను చంపబోతున్నాను. నీ అన్న బలరాముడిని కూడ చంపుతాను. మీ నాన్న వసుదేవుని కూడ చంపుతాను. అదిగో నిలబడ్డాడే, ఒళ్లంతా గంధంపూసుకొన్న ఆ వీరవైష్ణవుడు, వాడిని కూడ చంపుతాను!" అనగానే, అందరూ ఆళ్వార్ కట్టియాన్ వైపు తిరిగి చూసి నవ్వసాగారు. కృష్ణ, బలరామ వేషధారులుకూడ అతని వైపు తిరిగి చూశారు. గుంపులో పలువురు అతని చుట్టూచేరి 'కెక్కెక్కె' అని ఇకిలిస్తూ గేలిచేయనారంభించారు.

తిరుమలై నంబికి కోపం విపరీతంగా ముంచకొచ్చింది. చేత ఉన్న కర్రను గిరగిరా తిప్పి ఆ

గుంపును మట్టి కరిపిద్దామా అనుకొన్నాడు. ముఖ్యంగా ఆ కంసుని తలపైన ఒక దెబ్బ వేయాలనుకొన్నాడు. కానీ కంసుని తలపైన కొట్టి లాభంలేదు. ఎందుకంటే ఆ కంసవేషధారి చెక్కతో చేయబడి, ఘోరమైన ముఖమూ, కోరలవంటి పళ్ళూ కలిగిన ఒక నకిలీ తలను ధరించివున్నాడు. మొత్తానికి అంత పెద్ద గుంపులో తన కర్రను ప్రయోగించడం మంచిదికాదని తీర్మానించి, అక్కడినుంచి మెల్లగా జారుకొన్నాడు. ఆ కంసుని గొంతు, కావాలని పెద్దది చేసి వాడు అరుస్తున్నప్పటికీ - ఎక్కడో విన్నట్లుంది. అది ఎక్కడ విన్న గొంతు అని యోచిస్తూనే ఆళ్వార్ కట్టియాన్ వీదివెంబడి నడిచాడు.

జనాల కుతూహలంలో ఉన్నట్లుండి ఒక మార్పు ఏర్పడింది. పోనుపోను జనాల ఉత్సాహం తగ్గసాగింది. ఇదేమి? ఉన్నట్లుండి ఎందుకీ మార్పు? జనాలెందుకు ఇంత వేగంగా చెదిరిపోతున్నారు? వాద్యఘోష, ఆటపాటలు కూడ నిలిచిపోయాయి...! అందుకు బదులు జనాలు వీధివారగా ఒదిగి నిలబడి ఏదో రహస్యం మాట్లాడుతున్నారు! మాట్లాడేసి, ఎందుకు వేగంగా నడిచివెళ్లిపోతున్నారు? ఇళ్ల తలుపులు ఎందుకు ధడాల్మని మూసుకొంటున్నాయి?

ఇదిగో కారణం తెలుస్తోంది. కుందవైదేవికి కూడ వణుకుపుట్టించిన ఆ తప్పెటగాడు గూఢచారిని పట్టివ్వడం గురించిన దండోరా వేసుకొంటూ వస్తుండడమే అందుకు కారణం!

ఈ దండోరా ఇంత పెద్ద తిరునాళ్ల గుంపు ఉత్సాహాన్ని పాడు చేసేసింది. ఒంటరిగా వెళుతున్నవారిని తక్కినవారు పరీక్షగా చూస్తున్నారు! తెలియని కొత్తముఖాలను సందేహంగా చూస్తున్నారు. ఆళ్వార్ కట్టియాన్నికూడ కొందరు సందేహంతో చూసి, తొందర తొందరగా ముందుకు వెళ్ళారు.

దీనికి కారణాన్ని తిరుమలై ఊహించి తెలుసుకొన్నాడు. అదిమాత్రం కాదు; జనాలు చిన్నచిన్న గుంపులుగా వీధివార నిలబడి ఏం మాట్లాడుకొంటున్నారన్నదికూడ ఊహించుకోగలిగాడు. చెవిలో పడ్డ కొన్ని వార్తలవల్ల అది రూఢి అయ్యింది.

పళువేట్టరయ్యర్ల క్రూర పాలనగురించే వారు మాట్లాడుకొంటున్నారన్నది అతనికి తెలుసు. పళైయారై నగరప్రజలకు, చుట్టుపక్కల గ్రామవాసులకు వారిపైన కోపం ఉండడం సహజమే.

కవిపుంగవులచేత పళైయారై నగరానందకరుడని వేనోళ్ల కీర్తించబడిన సుందరచోళ చక్రవర్తిని వారు తంజావూరుకు తీసుకువెళ్ళిపోయారు కద? అప్పటినుంచి పళైయారై పేరుప్రఖ్యాతులు తగ్గిపోతూ వస్తోంది కద? ఈ కృష్ణజయంతి రోజు చక్రవర్తిగనక ఇక్కడుంటే ఇంకెంత సంబరంగా ఉండేది? కన్నయ్య వేషం వేసుకొని ఆడే నాటక గోష్ఠులంతా నగరమంతా చుట్టివచ్చి చక్రవర్తి భవంతి ముందు వచ్చి చేరుతారు కద? నటులకు, ఆడిపాడినవారికి, కవులకు చక్రవర్తి బహుమతులిస్తారు కద? చోళనాడే పళైయారైకి తరలి వచ్చిందా అన్నట్లు కద జనకూటమి ఉండేది! అంగళ్ళలో ఇంతకన్న నూరు రెట్లు అధికంగా వ్యాపారం

జరిగివుండేది కద? రాత్రి నందిపురపు విణ్ణకర్ దేవాలయంనుంచి వేణుగోపాలస్వామి ఊరేగింపు వీధుల వెంబడి వస్తుంటే మేళతాళాలు, ఆటపాటలు, 'శిలంబు' ఆటలు, కత్తి యుద్ధాలతో నగరమంతా మారుమోగేది కద?

అదంతా ఈ పళువేట్టరయ్యర్ల వల్ల మటుమాయమైపోయింది.

ఇదిగాక, ఇంకొక పెద్ద కొరత పళైయారై ప్రజల మనస్సుల్లో గూడుకట్టుకొంది. వారి ముద్దుల రాకుమారుడు అరుళ్మొళివర్మ కడలిదాటి లంకలో పోరాటం సాగిస్తున్నాడు. నాల్గు దండుల ఇళ్ళనుంచి పదహారువేల వీరులు ఆయన నాయకత్వంలో లంకాదేశానికి వెళ్ళివున్నారు. అడవులు, కొండలతో నిండిన ఆ లంకలో తమిళదేశపు కీర్తిప్రతిష్ఠలు నెలకొల్పేందుకు పోరాడుతున్నారు. కొడుంబాళూర్ ఇలంగో ఆ సైన్యానికి నాయకత్వం వహించి, పోరులో ముందు నిలిచి, తన ప్రాణాలర్పించారు కద? అక్కడి అంతమంది చోళవీరులుకూడ చివరివరకు పోరాడి, ప్రాణాలర్పించలేదా?

అలా మరణించిన వారి ఆత్మశాంతికోసం మళ్ళీ పులిజెండాను ఆ లంకలో స్థాపించేందుకే యువరాజు అరుళ్మొళిదేవర్ దండెత్తివెళ్ళారు. ఆయన నాయకత్వంలో పోరాడుతున్న మన వీరులకు అవసరమైన ధాన్యాలు, బట్టలు, ఆయుధాలు పంపించేందుకు ఈ పళువేట్టరయ్యర్లు నిరాకరిస్తున్నారట కద? ఇదేమి అన్యాయం? తంజావూరు కోటలో ఉన్న ధాన్యాగారాలలో ధాన్యాలు పుష్కలంగా నింపివున్నారు కద? అదంతా ఎందుకు? ఎవరికోసం? నూరేళ్ళుగా బొక్కసంలో కూడబెట్టివున్న ధనమెందుకని? ఈ సమయంలో మన వీరులకు ఉపయోగించని ధనమూ, ధాన్యాలు ఎందుకు? అదంతా ఈ పళువేట్టరయ్యర్లు ఏం చేయబోతారు? చచ్చేటప్పుడు తమతో యమలోకానికి తీసుకుపోబోతున్నారా...?

ఇలా చోళదేశపు ప్రజలు గొణుగుతుండడం తిరుమలైకి తెలిసిన విషయమే. అందులోను, పళైయారై ప్రజలకు ఈ విషయంలో కోపమెక్కువగా ఉండడమూ సహజమే. లంకకు యుద్ధానికి వెళ్ళివున్న పదహారువేల వీరుల స్త్రీలు, బంధువులు ఇంకా ఇక్కడే నివసిస్తున్నారు కద?

కాబట్టి, పళువేట్టరయ్యర్ల ఆజ్ఞను అనుసరించి, తప్పుచేసిన గూఢచారిగురించి ఆ దండోరావాడు తప్పెట వాయిస్తూ దండోరా వేసుకురావడం వారికిష్టం కాలేదు. పళువేట్టరయ్యర్లపైన తమకున్న నిరసనను వెలిబుచ్చడానికి ఇది ఇంకొక అవకాశంగా ఏర్పడింది. గూఢచారట గూఢచారి! ఏదేశంనుంచి గూఢచారి ఇక్కడికి రాబోతాడు? కన్యాకుమారినుంచి ఉత్తర పెన్నవరకు పులిజెండా ఎగురుతోంది కద? గూఢచారిని పంపగలంత బలం ఏ విదేశరాజుకుంది? ఈ పళువేట్టరయ్యర్లకు నచ్చని వాడెవడైనా ఉంటే వాడిపైన గూఢచారనే నిందమోపి పని ముగించేస్తారంతే! లేదా పాతాళ చెరసాలలో తోసేస్తారంతే... అయినా మనకెందుకీ తంటా? అధికారం వారి చేతిలోవుంది! న్యాయం అన్యాయం ఏది కావాలన్నా చేయవచ్చు! గూఢచారి అన్న పట్టం కట్టేస్తే ఊరిపంచాయతులను కూడ సంప్రదించనవసరం లేదుకద...?

ఇలా పళైయారై ప్రజలు మనసులో అనుకొన్నది, గుసగుసలుగా మాట్లాడుకొన్నది ఆళ్వార్ కట్టియాన్ విని, ఊహించి తెలుసుకొన్నాడు.

ఇలా ప్రజల మనస్సుల్లో చెలరేగుతున్న అసంతృప్తి ఎక్కడికి దారితీస్తుందో అని ఆలోచిస్తూ కుందవైదేవి అంతఃపురంవైపు సాగాడు ఆళ్వార్ కట్టియాన్.

-:-

ఆళ్వార్ కట్టియాన్‌తో లోకంతీరు గురించి మాట్లాడడం కుందవైదేవికి ఎప్పుడూ చాల ఇష్టం. దేశం నలుమూలలా తిరిగి, అక్కడక్కడ జరుగుతున్న విషయాలగురించి చెబుతాడు. అదంతా అడిగి తెలుసుకోవడం రాకుమారికి చాల ఇష్టం, ఉత్సాహకరం కూడాను. అతను ఎక్కడెక్కడో వెతికి నేర్చుకొని వచ్చి పాడే ఆళ్వార్ పాశురాలంటేను ఆమెకిష్టమే. కాబట్టి తిరుమలై నంబి ఎప్పుడొచ్చినా కుతూహలంతో ఆహ్వానిస్తుంది, విప్పారిన ముఖంతో క్షేమసమాచారలు విచారిస్తుంది.

కానీ ఈ రోజు రాకుమారి ముఖంలోను, మాటలోను కాస్త మార్పు గమనించాడు ఆళ్వార్ కట్టియాన్. మనసెక్కడో వేరొక విషయంపైన ఉన్నట్లు ముఖం చెబుతోంది; మాటలోను ఒకింత మార్పు, ఆదుర్దా!

"తిరుమలై! ఏమి విశేషం? ఎక్కడినుంచి వచ్చావు?" అని అడిగింది.

"ఎశేషమేమీ లేదు, తల్లీ! అలవాటు ప్రకారం లోకంలో జరుగుతున్న విషయాలగురించి విచారించేందుకు మీరు నన్ను రమ్మన్నారనుకొన్నాను. మన్నించండి. నేను వస్తాను."

"లేదు, లేదు! కాసేపుండి పో! నేనే నిన్ను రమ్మని చెప్పాను..."

"తల్లీ! చెప్ప మరిచాను! కాసేపటికి మునుపు పెద్దరాణిని దర్శించేందుకు వెళ్ళాను. వారు మీకు ఏదో ముఖ్యమైన విషయం చెప్పాలట. మిమ్మల్ని రమ్మని చెప్పారు..."

"అలాగే; నేనూ వెళ్ళాలనే అనుకొంటున్నాను. నీవీ ప్రయాణంలో ఎక్కడెక్కడ వెళ్ళావు? అది చెప్పు!"

"తెన్‌కుమరి (త్రింకోమలై) నుంచి ఉత్తర వేంగి వరకు వెళ్ళివచ్చాను."

"వెళ్ళిన చోట్ల జనాలు ఏం మాట్లాడుకొంటున్నారు?"

"చోళవంశపు గొప్పతనం గురించి మాట్లాడుకొంటున్నారు; త్వరలోనే గంగానది వరకు విస్తరిస్తుందని అనుకొంటున్నారు; ఇంకా హిమవన్నగాల వరకు కూడ వ్యాపిస్తుందని ఊహిస్తున్నారు..."

"తర్వాత?"

"పళువేట్టరయ్యర్ల వీరప్రతాపాల గురించి పొగుడుతున్నారు. చోళ సామ్రాజ్యం ఇంత ఉన్నత

స్థితిలో ఉండడానికి కారణమే పళువూర్ చిన్నరాజులని...”

“చాలు, చాలు! ఇంకా ఏం మాట్లాడుకొంటున్నారు?”

“తమ సహోదరులిరువురి మీదకూడ ప్రజలు చాల ఆశలుంచుకొన్నారు. ముఖ్యంగా చిన్న యువరాజు అరుళ్మొళివర్మ పైన మన ప్రజలకున్న ఆప్యాయత, ఆదరం చెప్పనలవికానిది.”

“అందులో ఆశ్చర్యమేమీ లేదు కద? ఇంకేమైనా మాటలు నీ చెవిన పడ్డాయా?”

“చోళ మహా చక్రవర్తి కుమారికి ఇంకా ఎందుకు వివాహం కాలేదని ప్రజలు మాట్లాడుకొంటున్నారు. నన్నుకూడ పలువురు అడిగారు...”

“నేవేం ఉత్తరమిచ్చావు?”

“మా రాకుమారిని వివాహమాడేందుకు తగిన రాకుమారుడు ఇంకా ఈభూమిపైన పుట్టలేదన్నాను...”

“బాగుంది! ఇకపైన అటువంటి వాడు పుట్టాలేం! వాడు పుట్టి పెళ్ళికి ఎదిగేటప్పటికి నేను ముదుసలినైపోతాను! నాసంగతలా ఉండనీ తిరుమలై! ఇంకేమైనా విశేషాలున్నాయా?”

“ఎందుకు లేవు? శివజ్ఞానిగా మారిపోతానన్న మధురాంతకదేవులు ఉన్నట్లుండి పెళ్ళిచేసుకొన్న విషయమై ప్రజలు చాల ఆశ్చర్యపడుతున్నారు....”

“నీ ముద్దుల సహోదరి... ఆండాళ్ళవంటి భక్తశిరోమణి ఔతుందని చెప్పుకొనేది కద... ఆమె ఇప్పుడెలా ఉంది?”

“ఆమెకేం కొరత తల్లీ! పెద్ద పళువేట్టరయ్యర్ అంతఃపురానికి సర్వాధికారిణిగా అధికారం చెలాయిస్తోంది....”

“పళువేట్టరయ్యర్ అంతఃపురం మాత్రమేనా? ఈ చోళదేశానికే ఆమే సర్వాధికారిణి అని కద విన్నాను?”

“అలా కూడ కొంతమంది చెప్పుకొంటున్నారు తల్లీ! కానీ దాన్ని పక్కకు తోసిపెట్టండి. ఈ మంచిరోజు దాని మాటెందుకు? మీరు ’ఆండాళ్’ పేరు ప్రస్తావించినందువల్ల నాకొకటి జ్ఞాపకం వస్తోంది. శ్రీవిల్లిపురానికి వెళ్ళి, అక్కడ విష్ణుచిత్త భట్టు రచించిన పాటలను తెలుసుకొని వాటిని నేర్చుకొన్నాను. ఇది వినండమ్మా! కన్నయ్య పుట్టిన సుదినం గురించిన పాట -

<< ఆ మధురమైన పాటను అనువదించవలసి ఉంది >>

నేడు మన పళైయారై నగరం కూడ ఆయర్పాడిలాగే భలే కుతూహలంగా ఉంది తల్లీ!”

"కుతూహలంగా ఉంది సరే; కానీ కాసేపటికి మునుపు ఇంకొకవిధమైన దండోరా వినిపించిందే, అదేమి తిరుమలై?"

ఈ ప్రశ్నకోసమే ఆళ్వార్ కట్టియాన్ వేచివున్నాడు.

"ఎవరో గూఢచారట! తప్పించుకొన్నాడట! వాడిని పట్టిచ్చినవారికి బహుమతిస్తారట! అదంతా నాకేం తెలుసు తల్లీ!"

"నీకేమీ తెలియదా? ఎవరై ఉండవచ్చని సందేహం కూడ లేదా?"

"మనసులో ఒక సందేహం ఉంది. కానీ అందుగురించి మాట్లాడడం అపాయం. వీధుల్లో నడిచి వస్తున్నప్పుడు నన్నుకూడ కొందరు ఉరిమిచూస్తూ వెళ్ళారు. నన్నెవరైనా పట్టుకొని తీసుకువెళ్ళి పాతాళచెరసాలలో పడేస్తే...?"

"నిన్ను పట్టేందుకు తలపైన కొమ్ములు మొలిచినవారికే సాధ్యం! నీ మనసులో తట్టింది నాతో చెప్పేందుకు ఇష్టపడితే చెప్పు! నేను పట్టిస్తాననే భయం లేదు కద?"

"కృష్ణా! కృష్ణా! అలా ఏం లేదు తల్లీ! వీరనారాయణపురంలో ఒక వీరయువకుని చూశాను. అతను తంజావూరుకు వెళ్తున్నానని చెప్పాడు. ఎందుకని మాత్రం చెప్పలేదు. కానీ నన్ను చాలా ప్రశ్నలడిగాడు...."

కుందవైదేవి గాభరాగా "అతనెలా ఉంటాడు?" అని అడిగింది.

"పెద్దకులస్తుడిలాగ కనిపించాడు. ముఖం మంచి కళగావుంది. దృఢసంకల్పమూ, శక్తి ఉన్న వాడిలాగ కనిపించాడు...."

"నీతో ఏం చెప్పాడు?"

"చక్రవర్తి ఆరోగ్యం గురించి అడిగాడు. పట్టానికి తదనంతరం రాబోయేవారి గురించి అడిగాడు. లంకకు దండెత్తి వెళ్ళివున్న చిన్నయువరాజు గురించి అడిగాడు. తర్వాత, కుడందై జ్యోతిష్కులను కూడ అదే ప్రశ్నలడిగాడని విన్నాను..."

"ఆహా! కుడందై జ్యోతిష్కుల ఇంటికి అతను వచ్చాడా?"

"ఇప్పుడు జ్ఞాపకం వస్తోంది. మీరు జ్యోతిష్కుల ఇంట ఉన్నప్పుడే అతను దుడుగ్గా లోపలికొచ్చేశాడని విన్నాను. మంచివేళ, మిమ్మల్నతడు పోల్చుకోలేకపోయాడట....!"

"నేననుకొన్నది నిజమైపోయింది..."

"ఏమనుకొన్నారమ్మా?"

"ఆ మొరటు యువకునికి త్వరలో ఏదైనా ఆపద రావచ్చని..."

"మీరనుకొన్నది సరిగ్గానే ఉంది. అతనే ఆ గూఢచారని సందేహిస్తున్నాను. వాడిని పట్టేందుకే పళువేట్టరయ్యర్లు బహుమతి ఇస్తారని దండోరా వేయిస్తున్నట్లు అనిపిస్తోంది...."

"తిరుమలై! నాకొక సహాయం చేస్తావా?"

"ఆజ్ఞాపించండి తల్లీ!"

"ఆ యువకుని నీవెలాగైనా చూడగలిగితే...."

"పట్టిచ్చేసి బహుమతి తీసుకోనా?"

"వద్దు, వద్దు! నాదగ్గరికి పిలుచురా! అతని వద్ద నాకొక ముఖ్యమైన కార్యముంది!"

ఆళ్వార్ కట్టియాన్ ఆశ్చర్యపడ్డవానిలాగ కాసేపు కుందవైదేవిని చూస్తూ నిలబడ్డాడు. తర్వాత, "ఆ అవశ్యకత ఏర్పడదు తల్లీ! అతనే మిమ్మల్ని వెతుక్కొంటూ వచ్చి చేరుతాడు!" అన్నాడు.

~~~
~~~

# అధ్యాయము - 47

## "ఈశాన్య శివభట్టుగారు"

**ఆళ్వార్ కట్టియాన్** రాకుమారిని దర్శించిన తర్వాత తన అన్నగారు ఈశాన్య శివభట్టుగారింటికి వెళ్ళాడు. ఆయన ఇల్లు శివాలయానికి చాల దగ్గరగా ఉండేది. అంతఃపురంనుంచి అరకోసు దూరం ఉంటుంది. చోళమాళిగ నుంచి వాయవ్య శివాలయానికి వెళితే, పళైయార్రై నగరపు విస్తీర్ణాన్ని, అందలి తక్కిన విశేషాలను ఒకసారి చూడవచ్చు.

శ్రీకృష్ణజయంతి వేడుకలన్నీ ఇంచుమించు ముగిసాయని ఆళ్వార్ కట్టియాన్ గమనించాడు. ఇళ్ళున్న వాడలగుండా నడిచివస్తున్నప్పుడు చాల మంది స్త్రీలు ఇళ్ళవారగా నిలబడి కోపంగా మాట్లాడుకోవడాన్ని గమనించాడు. ఆ స్త్రీలంతా తమ కొడుకులను, మగళ్ళను వీరపూమాలలు వేసి ఉత్సాహంగా లంకకు యుద్ధానికి పంపినవారు. చోళ సామ్రాజ్యంకోసం జరిపిన వీరయుద్ధాలలో కనీసం ఒక వీరుడు వీరస్వర్గం పొందని ఇల్లు లేదా వాడలో. అటువంటి స్త్రీలు అసంతృప్తితో మాట్లాడుకొంటుండడాన్ని గమనించాడు తిరుమలైయప్పన్.. ఇదంతా ఏ విపరీత పరిణామానికి దారితీస్తుందో అని దిగులుపడుతూ ముందుకు సాగాడు.

అతను వాయవ్య శివాలయాన్ని చేరేటప్పటికి బాగా చీకటిపడింది. అప్పర్ పెరుమాళ్ పాడింది ఈ గుడి గురించే. ఆ మహానుభావుని కాలంలో ఈ గుడిచుట్టూ జైనులు కృత్రిమ కొండలను కట్టి, వాటిలో గుహలను తొలిచారు. అలా తొలిచిన గుహల్లో జైనమునులు కూర్చొని తపస్సు చేసేవారు. దాన్ని మనకు జ్ఞాపకం చేసేందుకు ఇప్పటికీ 'ముళైయూర్' (గుహల ఊరు) అనే ఊరొకటి అక్కడ ఉంది

అప్పర్ పెరుమాళ్ పళైయార్రై స్థలమహిమ గురించి విని అక్కడికి వచ్చి చేరేటప్పటికి ఆ శివాలయం జైనగుహలతో పూర్తిగా మరుగుపరచబడివుంది. దీన్ని ఆత్మజ్ఞానం ద్వారా తెలుసుకొన్న ఆయన మనసు చాల విచారించింది. అప్పుడు పల్లవుల ప్రతినిధిగా చోళదేశాన్ని పాలిస్తున్న సామంతరాజు దగ్గరకు వెళ్ళి మొరపెట్టుకొన్నారు. ఆ సామంతరాజు ఆ కృత్రిమ గుహలను ఒకవైపు పడగొట్టించాడు. వెంటనే లోపల ఉన్న చిన్న శివాలయం బయటపడింది; అప్పర్ పరవశించి పాడారు.

తర్వాత ఆ దేవాలయం చోళరాజులచేత నల్లరాళ్లతో పునర్నిర్మించబడి విరాజిల్లుతోంది. కానీ ఇప్పటికీ గుడిచుట్టూ కొండగుహలు ప్రాకారంలాగ కమ్ముకొనివున్నాయి. గుడిలోపల ప్రవేశించేందుకు గోపురం వాకిలి తప్ప ఇంకే ద్వారంకూడ లేదు.

గోపురద్వారం గుండా గుడి ప్రాకారం లోపలికి వెళితే ఈశాన్య భట్టుగారి ఇల్లు సులభంగానే

దొరుకుతుంది. లేకపోతే చుట్టుతిరిగి వెళ్ళాల్సి ఉంటుంది.

ఇలా తన అన్నగారి ఇంటికి అడ్డదారిగుండా వెళ్ళేందుకు తిరుమలై గోపురద్వారం గుండా లోపలికి వెళ్ళాడు. లోపల స్వామి సన్నిధిలో కొందరు భక్తులు ఉండడం కనిపించింది. వారు కృష్ణుని వేషం వేసుకొని వచ్చిన గోష్టికి చెందినవారిలా కనిపించారు. "ఆహా! వీరిక్కడికెలా వచ్చి చేరారు!" అని అప్పుడే గోపురద్వారం గుండా లోపలికొస్తున్న తిరుమలై అనుకొంటున్నంతలో, గర్భగుడి నుంచి ఈశాన్య భట్టు గబగబా బయటికొచ్చి అతని చేయిపట్టుకొని బరబరా గుడి బయటికి లాక్కొని వెళ్ళారు.

"అన్నా! ఇదేమి?" అని ఆళ్వార్ కట్టియాన్ అడిగాడు.

"చెప్తాను తిరుమలై! ఇకపైన మన సంబంధమంతా గుడి బయటే ఉండనీ. నీవు పతితుడివి; శివనింద చేసే జైన భ్రష్టుడివి; ఈ శివాలయం లోపల అడుగు పెట్టావో, చూడు! తెలిసిందా? నేనూ ఎంతో ఓర్చుకొన్నాను. నీవీరోజు పెద్ద రాణి ముందు ఆడిన మాటలను నేను సహించలేకపోయాను. కావాలంటే ఇంటికి వచ్చి నీ బానకడుపు నింపుకు పో! కానీ, గుడిలోపల మాత్రం అడుగు పెట్టకు! అడుగు పెడితే నేను చండేశ్వర నాయనార్ రూపం ఎత్తుతాను!"

ఇలా అనేసి, ఈశాన్య భట్టు ఆళ్వార్ కట్టియాన్ మెడ పట్టి బయట గెంటేసి గుడి తలుపు ధడేల్మని మూసేశారు. "అన్నా! అన్నా!.." అని తిరుమలై ఏదో చెప్పబోయాడు గాని, అదేమీ చెవికి వేసుకోక, గుడి తలుపు లోపల గొళ్ళెం వేసుకొని వెళ్ళిపోయారు అన్నగారు.

"ఓహో! అదా సంగతి?" అని తనలోతానే గొణుక్కొన్నాడు తిరుమలై. కాసేపక్కడే నిలబడ్డాడు. తర్వాత, ఆ శివాలయాన్ని, జైనగుహలతో సహా, రెండు మూడుసార్లు చుట్టివచ్చాడు. కుడివైపుగా వెళితే ప్రదక్షిణమైపోతుందని, కావాలనే ఎడమవైపుగా చుట్టివచ్చాడు. గుండ్రంగా అమర్చివున్న ఆ జైనగుహల ప్రవేశాలన్నీ బాగా మూసి ఉండడాన్ని గమనించాడు. తర్వాత అన్నగారి ఇంటికి వెళ్ళాడు. వింత వింతగా మాట్లాడే తిరుమలై అంటే భట్టుగారి భార్యకు చాల ప్రీతి. ఆ అమ్మతో మామూలుకన్న ఇంకా ఎక్కువ సరదాగా వింతలు విశేషాలు మాట్లాడి, కడుపునిండా శివ ప్రసాదం తిని ఇంటి బయటి దిన్నెపైన పడుకొన్నాడు.

మునుపటిరోజు కుడమురుట్టి నదీతీరం వెంట వస్తున్నప్పుడు జరిగిన ఒక సంఘటన జ్ఞాపకం వచ్చింది.

అతనికి ఎదురుదిశనుంచి కొందరు గుర్రాలపైన వస్తున్న శబ్దం విని, పక్కనే ఉన్న వెదురుపొదల వెనుక వెళ్ళి మరుగ్గా నిలబడ్డాడు.

ముందు వచ్చిన గుర్రం అదుపుతప్పినట్లు పరుగెత్తి వస్తూంది. అది పూర్తిగా తడిసివుంది. అది చెమటా లేక నదిలో మునిగి వచ్చినందువల్లా తెలియలేదు. దానిపైన ఒక కుర్రాడు కూర్చొనివున్నాడు.

అతను గుర్రానికి కట్టబడివున్నాడు. అతని ముఖంలో భయమూ, దానికితోడు ఒక గట్టి నిశ్చయమూ గోచరించాయి. కాస్త వెనుక నాలుగైదు గుర్రాలు వచ్చాయి. వాటిపైన శూలాలు పట్టుకొన్న వీరులున్నారు. త్వరలోనే పట్టేస్తారనిపించింది. వారిలో ఒకడు తన శూలాన్ని తలపై ఎత్తి పట్టుకొని ముందు వచ్చిన గుర్రంపైన  విసిరేందుకు గురిచూశాడు. ఇంకొకడు దాన్ని అడ్డగించాడు.

అప్పుడా అబ్బాయి దట్టమైన వెదురుపొదల కిందనుంచి వెళ్ళవలసి వచ్చింది. కాస్త కిందికి వంగివున్న ఒక వెదురు కొమ్మ అతని వెంట్రుకల్లో చిక్కుకొంది. గుర్రం ముందుకు ఉరికితే వాడి గతి ఏమౌతుందో అన్న పరిస్థితిలో వెనుక వస్తున్న గుర్రపురౌతులు ఆ గుర్రాన్ని పట్టుకొన్నారు.

గుర్రంపైన కట్టబడివున్న కుర్రాడిని చూసి, వారికి ఆశ్చరమూ, కోపమూ కలిగింది. అతన్నేదో అడిగారు. అతను తడబడుతూ బదులు చెప్పాడు. ఆళ్వార్ కట్టియాన్‌కు స్పష్టంగా వినిపించలేదు. “వాడెక్కడ?” “వాడెక్కడ?” అన్న ప్రశ్న చాలా సార్లు వినిపించింది. ఆ కుర్రాడు, “ఏట్లో కొట్టుకుపోయాడు!” “వరదలో పడి కొట్టుకుపోయాడు!” అని వెక్కి వెక్కి ఏడుస్తూ చెప్పడమూ చెవిన పడింది. తర్వాత ఆ వీరులు ఆ అబ్బాయిని గుర్రంతోబాటు నదీతీరంవెంబడి తీసుకొని వెళ్ళిపోయారు.

ఈ సంఘటన అర్థమేమన్నది తిరుమలైకి అప్పుడు విశదంకాలేదు. ఇప్పుడు కాస్త అర్థమౌతున్నట్లనిపించింది.

దీనిమధ్య, ఆ వీధినాటక గోష్టి గురించిన జ్ఞాపకంకూడ వచ్చింది. ముఖ్యంగా కంసవేషధారి హావభావాలు, మాటతీరు గుర్తుకు వచ్చాయి. ఎక్కడో విన్నట్లనిపించిన ఆ గొంతు ఎవరిదై ఉండవచ్చనేదికూడ కాస్త తెలియసాగింది.

రాత్రి అర్ధజాము పూజ ముగించుకొని ఈశాన్య శివభట్టు ఇంటికి వచ్చారు. వాకిలి దిన్నెపైన ఆళ్వార్ కట్టియాన్ పడుకొనివుండడం గమనించారు.

“తిరుమలై! తిరుమలై!” అని కోపంగా పిలిచారు.

తిరుమలై గాఢంగా నిద్రపోతున్నట్లు నటించాడు.

ఇంటితలుపును ధడేల్మని తెరుచుకొని భట్టుగారి లోపలికి వెళ్ళారు. తమ ఇల్లాలితో జగడమాడుతున్నట్లు అస్పష్టంగా తిరుమలై చెవిన పడింది.

పొద్దున లేచిన వెంటనే ఈశాన్య శివభట్టుగారు, “మళ్ళీ ఎప్పుడు దేశాలు తిరిగేందుకు వెళ్తావు?” అని అడిగారు.

“మీ కోపం తగ్గిన తర్వాత వెళతానన్నా!” అన్నాడు తిరుమలై.

“ఇకమీద నన్ను ’అన్నా’ అని పిలవకు. ఇకమీదట నేను నీ అన్ననూ కాదు, నీవు నా

తమ్ముడివీ కాదు. నీవు నీచుడివి, ఛండాలుడివి..."

ఆయన భార్య తిరుమలై కోసం మాట్లాడుతూ, అతన్ని వెనకేసుకొస్తూ, "వాడినెందుకిలా శపిస్తున్నారు? ఇన్నిరోజులు చెప్పనిది ఇప్పుడేం కొత్తగా అనేశాడు! మీకే శివభక్తి ముదిరిపోయింది!" అన్నది.

"నీకేం తెలియదు! వాడు నిన్న పెద్ద రాణి ముందు ఏమేం మాటలన్నాడో తెలుసా? 'వల్లకాట్లో బూడిద పూసుకొని తిరిగే శివునికి గుడి ఎందుకు?' అని అడిగాడు. నా చెవిన సీసం కరిగించి పోసినట్లనిపించింది. మహా రాణి రాత్రంతా నిద్రపోలేదట!"

"ఇకపైన అలాగ మాట్లాడడు. నేను బుద్ధిచెప్పి దిద్దాను. వాడికి మంచిగా చెబితే వింటాడు!" అన్నది.

"మంచిగాను చెప్పాను; కోపంగాను చెప్పడమైంది. వీడు వెంటనే రామేశ్వరానికి వెళ్ళిపోనీ. రాముడు, పూజచేసి పాపాలు పోగొట్టుకొన్న శివలింగాన్ని, వీడుకూడ పూజచేసి రానీ. అదే వీడికి ప్రాయశ్చిత్తం. అలా చేసేంతవరకు నేను వీడి ముఖంకూడ చూడను!" అన్నారు భట్టు.

తిరుమలై పెదవులు వణికాయి. వడ్డీతో చేర్చి తిరిగి ఇచ్చేయాలనుకొన్నాడు. కానీ, మాట్లాడితే కార్యం చెడిపోతుందని ఊరుకొన్నాడు.

అప్పుడు భట్టుగారి భార్య మళ్ళీ కలిగించుకొని, "దానికేం? రామేశ్వరానికి వెళ్ళమంటే వెళ్తాడు. వాడితో మనమూ వెళదాం. ఇన్నిరోజులైనా మనకు పిల్లలు పుట్టలేదు. పూర్వజన్మలో ఏం పాపం చేశామో, ఏమో...? తిరుమలై! అందరూ రామేశ్వరానికి వెళదామా?" అని అడిగింది.

వారిద్దరినీ భట్టుగారు ఉరిమిచూసేసి వెళ్ళిపోయారు.

కాసేపటికల్లా ఈశాన్య శివభట్టుగారు తిరిగి వచ్చి తిరుమలైతో శాంతంగా మాట్లాడారు.

"తమ్ముడూ! 'కోపం పాపం ఛండాలం' అని పెద్దలన్నారు. నేను కోపానికి తావిచ్చేశాను. నీవేం బాధపడలేదు కద?" అన్నారు.

"లేనే లేదు!" అనేశాడు ఆళ్వార్ కట్టియాన్.

"అలాగైతే నీవిక్కడే ఉండు! మధ్యాహ్న పూజ ముగించుకొని వచ్చేస్తాను. నీ దగ్గర కొన్ని ముఖ్యమైన విషయాలగురించి చెప్పి నీ అభిప్రాయాన్నడగాలి. ఇక్కడే ఉంటావు కద? ఎక్కడికీ వెళ్ళిపోవు కద?" అన్నారు.

"ఎక్కడికీ వెళ్లనన్నా! మిమ్మల్ని విడిచి ఎక్కడికీ వెళ్ళే ఉద్దేశంలేదు!" అన్నాడు తిరుమలై.

భట్టుగారు వెళ్ళిపోయారు. తిరుమలై తనలోతానే, "అలాగా సంగతి!" అని కొన్నిసార్లు

అనుకొన్నాడు. తర్వాత వదినకు కూడ చెప్పకుండ బయల్దేరాడు. కృత్రిమగుహలతో చుట్టబడిన ఆ వాయవ్యశివాలయాన్ని రెండుమూడుసార్లు మళ్ళీ చుట్టివచ్చాడు. ఏదైనా శబ్దమైతే మరుగ్గా దాక్కొంటున్నాడు.

అతనెదురు చూసింది వృథాపోలేదు. జైనగుహల్లో ఒకదాని ద్వారం మెల్లగా తెరుచుకొంది. ముందు ఈశాన్య శివభట్టుగారు మూడుపక్కలా పరికించి చూసి బయటికి వచ్చారు. వెనుక ఇంకొకతను బయటికి వచ్చాడు. ఆహా! ఇతనెవడు? ముఖం కనిపించడం లేదే? శరీరాకృతి చూస్తే కంసుని వేషం వేసినవాడిలాగుంది! ఎవరై ఉండవచ్చు? దీన్ని కనిపెట్టక వదలకూడదు. ఓహో! ఇందుకేనా ఇంత కోపతాపాలు, దాగుడుమూతలూను?

గుహనుంచి వెలువడ్డ ఇద్దరూను ముందుకు సాగారు. ఆళ్వార్ కట్టియాన్ ఒదిగి ఒదిగి మరుగ్గా వారిని వెన్నంటాడు.

కాసేపటికి కొలను ఒడ్డుచేరారు. చోళమాళిగ వెనుక సముద్రంలాగ విస్తరించివున్న కొలనదే. కానీ మాళిగకు పడమరగా చాలదూరంలో ఉందది.

కొలను ఒడ్డున దట్టమైన చెట్లు చాల ఉన్నాయి. వాటిలో ఒక చెట్టు వెనుక చేరి చూడసాగాడు ఆళ్వార్ కట్టియాన్.

పడవ ఒకటి అలలపైన తేలియాడుతూంది. అంతఃపురపు పడవలాగుంది. పడవ నడిపేవాడు ఒడ్డుపైన నిలబడివున్నాడు.

భట్టుగారిని, ఆయనతో వచ్చిన ఆగంతకుని చూసి అతను పడవను ఒడ్డుకు లాగాడు.

ఇద్దరూ పడవెక్కారు. నావికుడు పడవను నడపనారంభించిన వెంటనే భట్టుగారి వెంట వచ్చినతను ఒడ్డువైపు తిరిగి చూశాడు.

ఇప్పుడతని ముఖం కొట్టవచ్చినట్లు స్పష్టంగా కనిపించింది.

ఆళ్వార్ కట్టియాన్ ఆశ్చర్యపోలేదు. అతనెదురుచూసిన మనిషే అతను!

వీరనారాయణపురంలోను, కొళ్ళిడం నది పడవలోను కలిసిన వీరయువకుడే అతడు!

కంసవేషధారికూడ అతనే కావడంలో సందేహంలేదు.

వారు పడవెక్కి ఎక్కడికి వెళ్తున్నారు? - అదికూడ కనిపెట్టేయాలి! తన ఊహ సరియైనదేనా కాదా అని తెలుసుకోవాలి.

-:-

ఆకాశాన్నంటే చోళమాళిగలు ఉన్న వీదిలో చివరి మాళిగ ఒకటి తాళంవేయబడివుంది. అది

సుందర చోళ చక్రవర్తి మంత్రియైన అనిరుద్ధ బ్రహ్మారాయలవారిది. ముఖ్యమంత్రియైన అనిరుద్ధులు పాండ్యనాడు రాజకీయ నిర్వాహాన్ని సరిదిద్దేందుకు ఇప్పుడు మదురైకి వెళ్ళివున్నారు. ఆయన కుటుంబీకులు తంజావూరులో ఉన్నారు. కాబట్టి పళైయారైలోని ఆయన మాళిగ తాళం వేయబడివుంది.

~

ఆళ్వార్ కట్టియాన్ ఈ మాళిగకు వచ్చిచేరాడు. అతన్ని చూసిన వెంటనే మాళిగ కాపలాదారులు భయభక్తులతో వచ్చి నిలబడ్డారు. వారిని మాళిగా వాకిలి తెరవమని ఆజ్ఞాపించాడు. వారలాగే చేశారు. తర్వాత అతని ఆజ్ఞప్రకారం వాకిలి మూసేసి బయటినుంచి తాళం వేశారు. మాళిగ మూడు ప్రాకారాలను దాటి, వెనుకవున్న తోటలో అడుగుపెట్టాడు. ఆ తోటలోని దట్టమైన చెట్లమధ్యనుంచి ఒక సన్నటిదారి వెళుతోంది. ఆళ్వార్ కట్టియాన్ ఆదారిగుండా కుందవైదేవి మాళిగ చేరాడు. ఒక పొదరింట దాక్కొని చుట్టూ పరికించి చూడసాగాడు. అతని శ్రమ వృధాపోలేదు.

కాళిదాసు వంటి మహాకవులు వర్ణించవలసిన  ఒక సుందరమైన, నాటకీయమైన సంఘటన జరిగిందక్కడ.

కొలను ఒడ్డుకు వచ్చి నిలిచింది పడవ. అందునుంచి ఈశాన్య భట్టుగారు, వంతిదేవుడు దిగారు. తర్వాత  కొలను మెట్లెక్కి పైకి వచ్చారు.

మెట్లకు కాస్తదూరంగా తోటలోవున్న పాలరాతి మంటపంలో కుందవైదేవి ఆసీనురాలైవుంది.

పడవలో వచ్చినవారు మెట్లెక్కి పైకి వచ్చిన వెంటనే రాకుమారి కుందవైదేవి లేచి నిలబడింది.

వంతిదేవుడు అప్పుడే ఆ స్త్రీమణి ముఖాన్ని స్పష్టంగా చూశాడు.

చూసినవాడు చూసినట్లే నిలబడిపోయాడు.

అతనికి, కుందవైదేవికి మధ్య ఒక పూలతీగ అడ్డం నిలిచింది.

ఆ పూలతీగపైన ఒక అందమైన సీతాకోకచిలుక – పలు వర్ణాల రెక్కలున్న సీతాకోకచిలుక – వచ్చి వాలింది.

కుందవైదేవి తన ముఖారవిందాన్ని కాస్త ముందుకు వంచి ఆ  సీతాకోకచిలుకను చూస్తూంది.

వంతిదేవుడేమో ఆమె ముఖకమలాన్ని రెప్పలార్చకుండ చూస్తూ నిలబడ్డాడు.

కొలనులో అలలు నిలిచిపోయాయి.

పక్షులు తమ కిలకిలారావాలను ఆపేశాయి.

అలా పలు యుగాలు గడిచాయి.

~~~
~~~

# అధ్యాయము - 48

## నీట సుడి, కళ్ళలో సుడి

**ఆదిమానవుడు** కొండల్లోను కొండల సమీపంలోను నివసించేవాడు. కొండగుహలు అతన్ని ఎండలు, వానలనుంచి కాపాడేవి. వనవృక్షాలు అతనికి కావలసిన ఫలాలను ఇచ్చాయి. అడవి జంతువులు అతన్ని చూసి వణికేవి. ఆకాశంలో ఎగిరే పక్షుల్లాగ అతను స్వేచ్ఛగా ఒక కొరతా లేకుండ జీవిస్తూ వచ్చాడు. కానీ, అతని మనసులో ఏదో ఒక కొరత – ఇదీ అని చెప్పలేని ఒక తాపం - ఎడతెరపిలేకుండ గూడుకట్టుకొంది. ఏదో ఒక అయస్కాంత శక్తి అతన్ని లాగసాగింది. ఏదో ఒక తెలియని వస్తువును - ఇప్పటివరకు చూడనిది, అనుభవించనిది - అతని మనసు వెతకసాగింది. పగటిపూట దాన్ని గురించి ఊహాలల్లాడు; రాత్రి దాన్ని గురించి కలలు కన్నాడు. “నాకోసమే సృష్టించబడిన ఆ అద్భుత వస్తువును - ఊహాఫలాన్ని - నన్ను ఆకట్టుకొని లాగే అయస్కాంత శక్తిని, ఎక్కడ చూస్తాను? ఎప్పుడు చూస్తాను?” అని అతని హృదయం తపించింది. ఆదిమానవుని సృష్టించినప్పుడే దేవుడు ఆదిస్త్రీని కూడ సృష్టించాడు. కొండకు అటువైపు ఆమె నివసిస్తుండేది. ఆకలికి ఆహారము, దాహానికి సెలయేటినీరు, తలదాచుకోవడానికి కొండగుహ ఆమెకుండేవి. పైకి ఏ కొరతాలేదు. కానీ లోలోపల ఏదో ఒక తాపం ఆమెను దహించసాగింది. ఏదో ఒక శక్తి ఆమెను లాగసాగింది. ఆ శక్తి ఎక్కడినుంచి లాగుతోంది, ఏదిశవైపు లాగుతోందో ఏమీ తెలియలేదు.

ఆదిమానవుడు ఆదిస్త్రీ ఒకరినొకరు కలవలేనట్లు ఒక పెద్ద కొండ మధ్య అడ్డం నిలబడింది.

ఎండాకాలంలో ఒకరోజు అడవిలో ప్రకృతి సహజకారణంగా నిప్పంటుకొని నాలుగువైపులా విస్తరించసాగింది. కొండను మంట అతివేగంగా చుట్టుముట్టింది. మానవుడు, స్త్రీ అడవిలోపలికి వెళితే అపాయమని గ్రహించి కొండెక్కారు. శిఖరాగ్రంపైన ఒకరినొకరు చూశారు. చూసినవారు చూసినట్లే కనురెప్పలార్పకుండ చూస్తూ నిలబడ్డారు. అడవిమంటను మరిచారు. ఎందుకు కొండపైకెక్కారన్నదికూడ మరిచారు. ఆకలిదప్పులను పూర్తిగా మరిచారు. ఇంతకాలం తాము జీవించివున్నది ఈ కలయికకోసమేనని గ్రహించారు. తమకు తెలియకనే తమను లాగుతూ వచ్చిన అయస్కాంత శక్తికూడ ఇదేనని గ్రహించారు. తమలో ఒకరికున్న కొరతను ఇంకొకరు తీర్చగలరన్నదికూడ గ్రహించారు. ఇలా ఒక్కరైన వారిని వేర్పరచగల శక్తి ఈ లోకంలో లేదనికూడ నిర్దుష్టంగా గ్రహించారు.

ఈ అద్భుత దృశ్యాన్ని తిలకిస్తున్న ఆ బ్రహ్మదేవుడు తాను మొదలు పెట్టిన కార్యం మంచివిధంగా కొనసాగుతోందని సంపూర్ణతృప్తి పొందాడు!

-:-

పైన వివరించిన ఆదిమానవుడు, ఆదిస్త్రీని పోలివున్నారు ఆ సమయంలో మన వల్లవరయ్యన్, కుందవైదేవి. ఈ భూమిపైన పుట్టిపెరిగింది ఈ క్షణంకోసమే, - ఈ కలయిక కోసమే - అన్నది వారు గ్రహించారు. కానీ, ఆదిమానవుడు, ఆదిస్త్రీలాగ కాక, వీరు నాగరికులు కద? కాబట్టి తమ పరస్పర అంతస్తుల తేడాను మరువలేకపోయారు. తమ భావాలకు పూర్తిగా వశమై వివేకాన్ని కోల్పోలేకపోయారు. ఒక క్షణం ఒకరినొకరు చూసి, కనులు కనులతో కలవడం, మరుక్షణం తమ కళ్లను తిప్పి అటూ ఇటూ పూలను, పక్షులను, చెట్లను చూడడం.

ఈశాన్య భట్టుగారు తమ గొంతు సవరించిన తర్వాతనే తామిద్దరు ఒక ముఖ్యమైన కార్యం గురించి ఇక్కడికి వచ్చివున్నామన్నది జ్ఞాపకంచేసుకొన్నారు.

“మీరు నన్ను ఏకాంతంగా చూడాలని ఈశాన్య భట్టుగారికి చెప్పి పంపినది నిజమేనా?” అని గొంతును కాస్త కఠినంచేసుకొని అడిగింది రాకుమారి.

ఆ స్వరంలోని కఠినత్వము, అధికారధోరణి వంతిదేవుని అప్రమత్తుని చేసి నిలబెట్టాయి.

“మీరెవరన్నది తెలిస్తేనే కద మీ ప్రశ్నకు సమాధానం ఇవ్వగలను? ఈశాన్య భట్టుగారు నన్ను తప్పైన చోటికి తీసుకువచ్చారేమోనని సందేహిస్తున్నాను!” అన్నాడా వీరయువకుడు.

“నాకూ అలాంటి సందేహం కలుగుతోంది. మీరెవ్వరిని చూడాలనుకొంటున్నారు?”

“చోళవంశపు మణిదీపికను, సుందర చోళ చక్రవర్తి ముద్దుల కుమారిని, ఆదిత్య కరికాలన్ తర్వాత పుట్టిన సహోదరిని, అరుళ్మొళివర్మ ప్రియమైన అక్కగారిని, యువ రాకుమారి కుందవైదేవిని చూడగోరుతున్నానని ఈశాన్య భట్టుగారికి చెప్పాను...”

కుందవైదేవి మందహాసంతో, “ఆ మోయలేని గొప్పతనాలన్నిటినీ మోస్తున్నది నేనే!” అన్నది.

“అలాగైతే, కుడందై జ్యోతిష్కుల ఇంట, ఆ తర్వాత అరిసిలానదీ తీరంలోను నేను చూసిన నారీమణి మీరు కాదుకద?” అన్నాడు వల్లవరయ్యన్.

“ఔను, ఔను! ఆ రెండు సన్నివేశాల్లోను అమర్యాదగా నడుచుకొన్నది కూడ నేనే. ఆ అనాగరిక స్త్రీని మళ్ళీ ఇంత త్వరలో కలుస్తారని ఎదురుచూసి ఉండరు!”

“మళ్ళీ కలవడం అని చెప్పడం అంత సమంజసం కాదు, దేవీ!”

“ఎందుకు?”

“వేరుపడివుంటేనే కద మళ్ళీ కలవడం అని అంటారు? మీరు నా మనస్సును ఒక్క క్షణంకూడ విడిచిపోలేదు...”

"తొండైమండలంవారు ఇంత చమత్కారంగా మాట్లాడుతారని నేను ఎదురు చూడలేదు."

"అన్ని గొప్పతనాలు చోళదేశానికే సొంతమని భావిస్తున్నట్లుంది. ఇతర దేశాలకు ఒక్క గొప్పతనంకూడ ఆపాదించరు కాబోలు."

"ఔను; నాపై ఆ నింద ఉండడం నిజమే. మీకు మా చోళదేశం నచ్చినట్లులెదు!"

"నచ్చకేం? బాగానే నచ్చింది. కానీ, ఈ చోళదేశంలో రెండు పెద్ద అపాయాలున్నాయి. వాటిని తలుచుకొంటేనే నాకు భయమేస్తోంది....!"

"చోళదేశపు వీరుల శూలాలు, ఖడ్గాలు మిక్కిలి భయంకరమైనవే! పైదేశాలనుంచి ఇక్కడికి వచ్చేవారు చాల జాగ్రత్తగా ఉండవలసిందే. ముఖ్యంగా, గూఢచారులు."

"రాకుమారీ! ఆ రెండు అపాయాలగురించి నేను చెప్పడంలేదు. శూలము, కత్తీ నాదగ్గరకూడ ఉన్నాయి. వాటిని ఉపయోగించడంలో నేను ఆరితేరినవాడిని..."

"మీరు శూలవిద్యాప్రావీణ్యతను అరిసిలానదీతీరంలో చూశాం కద? చచ్చిన మొసలిని మీ శూలం ఎంత తీవ్రంగా కొట్టింది? ఒక్కదెబ్బతో లోపల కుక్కిన దూదంతా బయటికొచ్చేసింది కద?"

"దేవీ! చోళదేశపు కులస్త్రీలు చచ్చిన మొసలిని చూసి భయపడి చచ్చే నారీమణులని నేనెరగను. చోళదేశపు వీరులు చచ్చిన మొసలిని కొట్టే వీరులని కూడ నాకు తెలియదు. బతికివున్న మొసలి అని ఎంచి శూలాన్ని విసిరాను. అది నా తప్పూ కాదు; నా శూలం తప్పూ కాదు...!"

"ఆ వెధవ మొసలిదే తప్పు! వాణర్‌కులవీరుడు వంతిదేవుడు శూలంతో వచ్చేవరకు బతికుండాలని దానికి తెలియలేదు! దానికి కావలసిందే ఈ అవమానం...! అది సరే, ఇంకే రెండు అపాయాలగురించి చెప్పారు?"

"ఈ చోళదేశపు నదుల్లో వచ్చే కొత్తవెల్లువలు పుట్టించే సుడిగుండాలు మహాప్రమాదకరమైనవి. నన్ను ఉక్కిరిబిక్కిరి చేసేశాయి!"

"వరద సుడిగుండంలో మీరెలా చిక్కుకొన్నారు? నీట కాలేపెట్టనివారిలాగ కద కనిపిస్తున్నారు మీరు?"

"చోళదేశానికి వచ్చినందువల్ల, నదివెల్లువలో మునిగి, సుడిగుండంలో చిక్కుపడాల్సికూడ వచ్చింది! నాతో వచ్చిన ఒక వెధవకుర్రాడివల్ల అలా జరిగింది! వినండి, దేవీ! ఆ కుర్రాడు ఒక్క చిన్న అబద్ధం చెప్పలేనన్నాడు. అందువల్ల వచ్చిన విపరీతమిది..."

"మీరు చెప్తున్నది ఒక పొడుపుకథలాగుంది. ఇంకాస్త విశదంగా చెబితే బాగుంటుంది."

"చెప్తాను. తమ ప్రియతమ సహోదరుని తాళపత్రంతో దూతగా వచ్చిన నన్ను తంజావూరు కోట

దళపతి చిన్న పళువేట్టరయ్యర్ 'గూఢచారి' అని నిందమోపి, పట్టితేవడడానికి మనుషులను పంపించారు. వచ్చిన కార్యం ముగిసేముందు చెరలో పడడం నాకిష్టంలేదు. కాబట్టి నేను తంజావూరులో విడిదిచేసిన ఇంటి అబ్బాయిని తోడుతీసుకొని బయల్దేరాను..."

"తంజై (తంజావూరు) నగరిలో ఎవరింట దిగారు?"

"కోటబయట పూలతోటలో వున్న ఒకావిడ ఇంట దిగాను. ఆమె మూగది..."

"ఓహో! ఆమె పేరు....?"

"ఆ అమ్మగారి పేరు తెలియదు. కానీ, ఆమె కొడుకు పేరు మాత్రం తెలుసు - సేందన్ అముదన్..."

"నేననుకొన్నది సరిపోయింది. ఇంకా ముందుకు చెప్పండి!"

"ఆ కుర్రాడినికూడ నా గుర్రంపైన ఎక్కించుకొని ఈ పళైయారై నగరంవైపు వస్తున్నాను. అంతలో పళువేట్టరయ్యర్ మనుషులు మాకు అతి దగ్గరగా వచ్చేశారు. నేను వచ్చిన కార్యం ముగిసేలోపల వారికి పట్టుబడడానికి ఇష్టపడలేదు. కుడమురుట్టి నదికి దగ్గరౌతుండగా, ఆ అబ్బాయితో, "నేనిక్కడే దిగేస్తాను. నీవు గుర్రాన్ని తోలుకొంటూ వెళ్ళు. వారు నిన్నే నేననుకొని నీవెంటబడి వస్తారు. దగ్గరగా వచ్చిన తర్వాత నేను కాదని తెలుసుకొంటారు. నేనెక్కడని అడిగితే, 'ఏట్లో పడి కొట్టుకుపోయాడు' అని చెప్పు" అన్నాను. ఆ కుర్రాడేమో హరిశ్చంద్రుని వంశంలో పుట్టినవాడిలాగున్నాడు. 'మీరు మునిగిపోనప్పుడు మునిగిపోయారని ఎలా అబద్ధం చెప్పను?' అన్నాడు. ఆ కుర్రాడు అబద్ధం చెప్పవలసిన అవశ్యకత రాకుండ ఉండనీ అని అతన్ని గుర్రానికే కట్టేసి, నేను నదిలో దూకి మునిగిపోయాను. అబ్బబ్బ! ఈ చోళదేశపు నదుల్లో, అదికూడ ఒడ్డుదగ్గర, ఎలాంటి సుడిగుండాలు! వాటిలో చిక్కుపడి నేను అష్టకష్టాలు పడ్డాను. చివరికి, ఒడ్డువారగా ఉన్న ఒక చెట్టు వేరుపట్టుకొని బతికి బయటపడివచ్చాను. దేవీ! నీటిసుడిగుండంలో చిక్కుపడి ఊపిరాడక అవస్థపడుతున్నప్పుడు  దేన్ని గురించి తలుచుకొన్నానో తెలుసా?"

"నాకెలా తెలుసు? ఒకవేళ గజేంద్రమోక్షాన్ని తలుచుకొన్నారేమో..."

"లేదు, లేదు; నాలాగే ఆ సుడిగుండంలో చిక్కుపడి అవస్థపడుతున్న చిన్న చేపలను తలుచుకొన్నాన్. ఆ చేపలు ఈ చోళదేశపు వనితల నేత్రాలను గుర్తుచేశాయి. నది సుడిగుండంలో చిక్కుపడ్డవాడు ఎలాగో బయటపడగలడు. కానీ ఈ చోళదేశపు అమ్మాయిల కళ్ల సుడిగుండాల్లో చిక్కుకొన్నవాడు ఎప్పటికీ బతికి బయటపడలేడు అని అనుకొన్నాను....!"

"ఇలా అమ్మాయిలపైన నిందమోపడంలో కొందరికి గొప్ప. తాము చేసే తప్పిదానికి అమ్మాయిలపైన నిందమోపడం మగవాళ్ళ అలవాటు..."

"దాన్నే నేనూ పాటిస్తున్నాను. అందులో తప్పేమి?" అన్నాడు వంతిదేవుడు.

-:-

అదే సమయంలో అంతఃపురంనుంచి ఇంపైన వేణుగానం వినిపించింది. దానికితోడు మద్దెల, కంజీర మొదలైన వాద్యాలు కూడ వినిపించాయి. తర్వాత అమ్మాయిల శ్రావ్యమైన స్వరాలు జత చేరాయి. వారు శిలప్పధికారమనే మహాకావ్యం నుంచి ఒక పాట పాడారు:

<< ఆ మధురగానాన్ని అనువదించవలసి  ఉంది >>

పాట ముగిసేవరకు కుందవైదేవి, వంతిదేవుడు ఆ పాటను విని పరవశించారు. మళ్లీ వాద్యఘోషతోబాటు నాట్యం మొదలైందనడానికి సూచనగా కాలిగజ్జెల చప్పుడు వినవచ్చింది.

“ఔను; నా చెలికత్తెలు కురవై ఆట ఆడుతున్నారు. త్వరలో నన్ను వెతుక్కొంటూ వచ్చేస్తారు. మీరు వచ్చిన కార్యమేమి?” అని రాకుమారి కుందవైదేవి అడిగింది.

“ఇదిగో నేను వచ్చిన కార్యం; తమ అన్నగారి తాళపత్రం; ఎన్నెన్నో అపాయాలను తప్పించుకొని, నీటి సుడిగుండాలు, కళ్ళ సుడిగుండాలనుంచి కాపాడి, దీన్ని తీసుకువచ్చాను!” అని చెప్పి వల్లవరయ్యన్ ఆ తాళపత్రాన్ని తీసి ముందుకు చాచాడు.

~~~
~~~

## అధ్యాయము - 49

## వింతల్లో వింత!

**కుందవైదేవి** వంతిదేవుడు ఇచ్చిన తాళపత్రాన్ని తీసుకొని చదివింది. అప్పటిదాక గంభీరంగా ముడివేసిన భృకుటుతో ఉన్న ఆమె ముఖం ఇప్పుడు విప్పారింది.

వంతిదేవుని తలెత్తి చూసి, “సందేశాన్ని చేరవేశారు. తదుపరి కార్యమేమి?” అని అడిగింది.

“మీకు తాళపత్రం ఇవ్వడంతో నా పని ముగిసింది. ఇక ఊరుకు తిరిగివెళ్ళడమే.”

“మీ కార్యమింకా పూర్తికాలేదు; ఇప్పుడే ప్రారంభమౌతోంది!”

“మీరు చెప్తున్నది నాకేమీ అర్థంకావడం లేదు, దేవీ!”

“మీచేత అంతరంగమైన కార్యమేదైనా చెప్పి చేయించుకోవచ్చి యువరాజు రాసివున్నారు కదా? దాని ప్రకారం మీరు నడుచుకోవాలి కదా?”

“యువరాజు వద్ద అలా ఒప్పుకొనే వచ్చాను. కానీ, నన్ను నమ్మి ముఖ్యమైన కార్యమేమీ ఒప్పజెప్పకండి. మిమ్మల్ని చాల వేడుకొంటున్నాను.”

“మీ కోరిక నాకర్థం కాలేదు. ఒకపని ఒప్పుకొన్న తర్వాత వెనుకంజ వేయడం వాణర్‌కుల సంప్రదాయమా?”

“'మా తాతలు నేతులు తాగారు, మా మూతులు వాసన చూడండి' అని పాత గొప్పలు చెప్పుకోవడం వాణర్‌కుల సంప్రదాయం కాదు; ఒప్పుకొన్న తర్వాత వెనుకంజ వేయడమూ మా కుల సంప్రదాయం కాదు.”

“మరెందుకు జంకు? స్త్రీకులమంటే ఏవగింపా? లేక నేనంటే విముఖతా?” అని చిరునవ్వు నవ్వింది రాకుమారి కుందవైదేవి.

ఆహా! ఇదేం ప్రశ్న? సముద్రానికి చంద్రుడిష్టం ఉండదా? ఇష్టంలేకపోతే వేయి తరంగహస్తాలతో చంద్రుని ఎందుకు అక్కున చేర్చుకోవాలని ప్రయత్నిస్తుంది? నీలాకాశానికి భూదేవి ఇష్టంలేదని ఎవరన్నారు? ఇష్టంలేకపోతే రాత్రంతా వేవేల నక్షత్రనయనాలతో ఎందుకు భూమిని గుచ్చి గుచ్చి చూస్తూంటుంది? మెఘానికి మెరుపంటే ఏవగింపా? అయితే మరెందుకు తనను చీల్చుకొని దూకే మెరుపుతీగెను ఎదకు హత్తుకొని గుండెల్లో దాచుకొంటుంది? భ్రమరానికి పుష్పమంటే అయిష్టమనేది ఉందా? అదే నిజమైతే మరెందుకు ఎప్పుడూ పూవు చుట్టూ తిరుగుతూ మతిపోగొట్టుకొంటూంది? దేవీ!

మంచి ప్రశ్నే అడిగారు! మీరు నాకిష్టంలేకపోతే మీ కడగంటిచూపు నన్నెందుకు ఇలా విస్మయపూరితుణ్ణి చేస్తోంది? మీ పెదవుల చివర నాట్యమాడే చిరునవ్వు నన్నెందుకు పిచ్చివాడిని చేస్తోంది? - ఇన్ని భావాలూ అతని మనసులో సుళ్ళు తిరిగాయిగాని ఒక్కటికూడ నోటివెంట బయటకు రాలేదు.

“అయ్యా! నా ప్రశ్నకు ఉత్తరమివ్వనే లేదే? వాణర్‌కులవీరుడు కేవలం ఒక అమ్మాయి ప్రశ్నకు బదులివ్వడమేమని చులకనా? యువరాజు ఈ తాళపత్రంలో ఏమని రాశారో చెప్పలేదా?” అని రాకుమారి మళ్ళీ అడిగింది.

“దేవీ! యువరాజు మనోరథాన్ని బాగా తెలుసుకొనే అక్కడినుంచి బయలుదేరాను. కానీ, నేను బయలుదేరిన సమయం అంత బాగాలేదేమో. దారిపొడుగునా శత్రువులను సంపాదించుకొంటూ వస్తున్నాను. ప్రాణస్నేహితుణ్ణికూడ శత్రువును చేసుకొన్నాను. నాలుగువైపులా పగవారు నన్ను వెతుకుతున్నారు. ఇటువంటి పరిస్థితిలో మీరు విధించే కార్యాన్ని నెరవేర్చగలనని రూఢిగా ఎలా చెప్పగలను? అందుకే జంకాను. నావల్ల మీకార్యం చెడిపోకూడదు కద?” అన్నాడు వల్లవరయ్యన్.

“ఎవరా పగవారు? నాకు తెలియజెప్పవచ్చా?” అని కుందవైదేవి గద్గదస్వరంతో ప్రశ్నించింది.

“పళువేట్టరయ్యర్లు నన్ను వేటాడి పట్టేందుకు నాలుగువైపులా మనుషులను పురిగొల్పివున్నారు. నాప్రాణమిత్రుడైన గందమారన్ నేనే వాడిని వెన్నుపోటు పొడిచి చంపజూశానని సందేహిస్తున్నాడు. ఆళ్వార్ కట్టియాన్ అనే ఒక వీరవైష్ణవ వేషధారి నన్ను వెన్నంటి వస్తున్నాడు. పళువూర్ యువరాణి నందిని నాపైన ఒక మంత్రవాదిని ఉసిగొల్పివుంది. ఏనిమిషంలో ఎవరి చేత చిక్కుబడతానో, తెలియదు.”

-:-

వరదనుంచి ఒడ్డెక్కి తప్పించుకొన్న ఆ రాత్రి మంత్రవాదితో జరిగిన సంఘటన వంతిదేవునికి గుర్తొచ్చింది. పగటి ప్రయాణంలోని అపాయాలను గుర్తించి, వెదురు అడవుల్లోను, అరటితోటల్లోను పొద్దుపుచ్చాడు. చాల దూరం నడిచి అలసిపోగా, రాత్రి మూడోజామున ఒక పాడుపడ్డ పాత మంటపాన్ని చేరాడు. బయట వెన్నెల పట్టపగలు లాగ ప్రకాశిస్తోంది. మంటపంలోపలికి కూడ ఆ వెన్నెల వెలుతురు కాస్తదూరం వరకు విస్తరించింది. వెలుతురుగా వున్న భాగాన్ని వదిలి చీకటిగా వున్న చోటవెళ్ళి పడుకొన్నాడు వంతిదేవుడు. బాగా నిద్రముంచుకు వచ్చేటప్పుడు దగ్గరలో ఘోరమైన గుడ్లగూబ కూత వినిపించింది. పళువూర్ యువరాణి లతామంటపంలో ఆమెతో మాట్లాడుతున్నప్పుడు అటువంటి కూతే విన్నది జ్ఞాపకం వచ్చి, దిగ్గున లేచాడు. లోపల చీకటికమ్ముకున్న ఒక భాగంనుంచి రెండు చిన్న కాంతిపుంజాలు  అతన్ని గుచ్చి చూశాయి. బయటకు వెళ్ళిపోదామని రెండడుగులు వేశాడు. అంతలో బయటినుంచి ఎవరో లోపలికొస్తున్న అడుగుల చప్పుడు విన్పించింది. విరిగి పడివున్న ఒక స్తంభాన్ని

పట్టుకొని దాని వెనుక చప్పున దాక్కొన్నాడు. బయటినుంచి వచ్చినవాడి ముఖం వెన్నెల వెలుతురులో కాస్త స్పష్టంగానే కనిపించింది. పళువూర్ రాణిని చూడవచ్చిన మంత్రవాదే అతడని గ్రహించాడు. మంత్రవాది ఆ స్తంభంవైపే రాసాగాడు. తానా స్తంభం వెనుక దాక్కొని వున్న విషయం అతనికి తెలియదని, తనను గమనించక అలాగే లోపలికి వెళ్ళిపోతాడనీ అనుకొన్నాడు వంతిదేవుడు. కానీ, స్తంభం దగ్గరికి వచ్చేవరకు మెల్లగా పిల్లి నడకతో వచ్చిన మంత్రవాది ఉన్నట్లుండి ఘోరమైన గొంతుతో కేకవేస్తూ ముందుకు దూకి వంతిదేవుని గొంతు పట్టుకొని నొక్కసాగాడు. "ఇవ్వు! ఆ తాటిచెట్టు ముద్రవున్న ఉంగరాన్ని ఇవ్వు! లేకపోతే నీ పీకనొక్కి చంపేస్తాను!" అని అరిచాడు.

వంతిదేవునికి మెడ విరిగిపోతుందనిపించింది. గుడ్లు వెళ్ళుకు రాసాగాయి; ఊపిరాడడం లేదు. కానీ మనసు దృఢపరుచుకొన్నాడు. ఆ పాత స్తంభాన్ని ఒకచేత్తో పట్టుకొని, ఒక కాలెత్తి పూర్తిబలంతో ఒక్క తన్ను తన్నాడు. మంత్రవాది అరుస్తూ కిందపడ్డాడు. అదే సమయంలో ఆ పాత స్తంభం పూర్తిగా విరిగి కింద పడింది. పైకప్పునుంచి రాళ్ళు దడదడా కిందపడసాగాయి. గబ్బిలమొకటి టపటపా రెక్కలు కొట్టుకొంటూ బయటకు ఎగిరిపోయింది. దాని వెంట వంతిదేవుడూ బయటకు పరుగెత్తాడు. పరుగు లంకించినవాడు కాస్తదూరం వరకు తిరిగిచూడలేదు. తననెవరూ వెన్నంటి రావడం లేదని రూఢిగా తెలిసిన తర్వాతనే పరుగు ఆపాడు. ఆ రాత్రి అనుభవాన్ని తలుచుకోగానే వంతిదేవుని ఒడలు ఇప్పుడుకూడ గడగడ వణికింది.

-:-

ఆ భయంకర జ్ఞాపకాల మధ్య, "అయ్యా! మీరు కంచి నుంచి బయలుదేరి ఎన్నాళ్ళైంది?" అని కుందవైదేవి అడగడం అతని చెవిన పడి అతన్ని ప్రస్తుతానికి తెచ్చింది.

"ఒక వారం, ఒక రోజయ్యింది, దేవీ!" అన్నాడు.

"ఇంత తక్కువ సమయంలో మీరింత మంది పగవారిని సంపాదించుకోవడం వింతల్లో వింత! ఇటువంటి అతీత కార్యాన్నెలా సాధించారు?"

"అది పెద్ద కథ, దేవీ!"

"ఫరవాలేదు. చెప్పవచ్చు. ఆ వివరాలు తెలుసుకొన్న తర్వాతే నేను మీకు ఒప్పజెప్పదలుచుకొన్న కార్యాన్ని చెప్పగలను."

రాకుమారి ఇలా చెప్పి, ఈశాన్య శివభట్టుగారివైపు తిరిగి, "పడవ నడిపేవాడు ఎలాంటి వాడు?" అని అడిగింది.

"పూర్తి చెవిటి; పిడుగుపడ్డా వినిపించదు, తల్లీ!"

"అయితే చాల మంచిది. పడవెక్కి కాస్తదూరం కొలనులో తిరిగివద్దాం. రండి! ఈయన కథను నేను పూర్తిగా వినాలి!" అన్నది.

వంతిదేవుడు మనసు పులకరించింది. చోళవంశపు ముద్దుల రాకుమారితో ఒకే పడవలో వెళ్ళే భాగ్యం అంత సులభంగా లభిస్తుందా? అది పొందేందుకు తాను ఏడేడు జన్మల్లో తపస్సు చేసివుండాలి కద? పడవెక్కిన తర్వాత తన కథను ఎంతమటుకు పొడిగించనౌతుందో అంతమటుకు పొడిగించాలి! క్లుప్తంగా ముగించేయకూడదు! తొందరేమి? అరుదుగా దొరికిన భాగ్యాన్ని తేలికగా చేజార్చుకోవచ్చా?

వంతిదేవుని తొందరేం లేదు. కానీ అతను కడంబూర్ మాళిగలో జరిగినది చెప్ప మొదలు పెట్టినప్పటినుంచి, కుందవైదేవికి నిమిష నిమిషానికి ఉత్సుకత పెరగసాగింది. "ఆపైన?", "తర్వాతేం జరిగంది?" అని అడుగుతూ వంతిదేవుని త్వరితపరుస్తూ వచ్చింది. వంతిదేవుడు తన తీర్మానం ప్రకారం కథను వీలైనంత పొడిగించాడు. ఎంత పొడవైన కథైనా ముగింపుకు వచ్చే తీరుతుంది కద? కథ ముగిసేటప్పటికి పడవకూడ కొలను మెట్లను చేరింది.

-:-

వారు పడవ దిగి పూలతోటలోపలికొచ్చినప్పుడు అంతఃపురంనుంచి, కురవై ఆట ఇంకా సాగుతోందనడానికి సూచనగా, వాద్యఘోష వినిపించింది. శిలప్పధికారంలోని ఈ పాటకూడ వినిపించింది :-

<< ఆ మధురమైన పాటను అనువదించవలసి ఉంది >>

ఇది విన్న వంతిదేవుడు, "కంచనార్ (కంసుడు) మహా వంచనార్ (వంచకుడు) కావచ్చు! కానీ, నిన్న నాకు మహోపకారం చేశారు!" అన్నాడు.

"అదేమి? కంసుడు మీకెలా ఉపకారం చేయ సాధ్యం?" అని రాకుమారి అడిగింది.

"నేనీ నగరంలోపల ప్రవేశించేందుకు కంసుడే సహాయం చేశాడు!" అన్నాడు వంతిదేవుడు. తర్వాత ఆ వృత్తాంతాన్నికూడ వివరించాడు.

పళైయారైకు తాను వచ్చి చేరేలోపలే పళువేట్టరయ్యర్ మనుషులు వచ్చి చేరివుంటారని వంతిదేవుడు ఊహించాడు. నగర ముఖ్యద్వారం దగ్గర తనకోసం వేచివుంటారు. సందేహం వస్తే పట్టుకొని వెళ్ళిపోతారు. వారి చేతికి చిక్కకుండ పళైయారై నగరంలో ప్రవేశించడమెలాగ? - ఈ దిగులుతో ఆ మహానగరపు ప్రధాన ద్వారానికి కాస్త దూరంలో అరిసిలానదీతీరంలో వంతిదేవుడు నిలబడి ఆలోచిస్తున్నప్పుడు నాటకగోష్టి ఒకటి వచ్చింది. కృష్ణుడు, బలరాముడు, కంసుడు మొదలైన వేషధారులు వచ్చారు. వారిలో కంసుడు మాత్రం చెక్కతో చేయబడిన కృత్రిమ ముఖాన్ని ధరించివున్నాడు. వంతిదేవునికి ఒక ఆలోచన వచ్చింది. నాటకగోష్టివారిని మాటల్లోకి దించాడు. కంసవేషధారికి ప్రావీణ్యత చాలదన్నాడు. ఆ కంసవేషధారి వంతిదేవునితో కొట్లాటకు వచ్చాడు. వచ్చిన అవకాశాన్ని వల్లవరయ్యన్

అంత తేలికగా వదులుకొంటాడా? "నీకన్న నేను బాగా ఆడుతాను. కావాలంటే చూడు!" అని చెప్పి కృత్రిమముఖాన్ని బలవంతంగా లాక్కొని తన ముఖానికి వేసుకొని ఆడాడు. అప్పుడతని ఆటను చూసిన వారతన్ని మెచ్చుకొన్నారు. అతని ఆటే హెచ్చు సమ్మతంగా ఉందనికూడ అన్నారు. కంసవేషధారి కోపించుకొని వెళ్ళిపోయాడు. "వాడు పోతే పోనీ; నేనే మీ నగరానికి వచ్చి ఆడుతాను" అని వంతిదేవుడు ఒప్పుకొన్నాడు. నాటకగోష్టివారు అతన్ని సంతోషంగా అతన్ని తమతో చేర్చుకొని వెళ్ళారు.

పళైయారై నరగవీధుల్లో ఆటపాట ముగిసిన తర్వాత వంతిదేవుడు యువరాజు ఆదిత్య కరికాలన్ చెప్పి పంపిన ప్రకారం వాయవ్య శివాలయానికి వెళ్ళి ఈశాన్య శివభట్టుగారిని కలిశాడు. ఆయన అతన్ని ఆలయం చుట్టూ ఉన్న జైనగుహల్లో ఒకదాంట్లో ఉంచారు. రాకుమారి కుందవైదేవికి ముందుగా చెప్పి అనుమతి తీసుకొని, తర్వాత వంతిదేవుని పడవలో కొలనుమీదుగా తీసుకొచ్చారు.

ఈ వివరాలను విన్న రాకుమారి కుందవైదేవి ఆశ్చర్యంతో విప్పారిన కళ్ళతో చూస్తూ, "విజయలక్ష్మి కటాక్షం ఈ చోళవంశంపైన పరిపూర్ణంగా ఉంది. అందుకే ఈ క్లిష్టపరిస్థితిలో తమను నాకు సహాయంగా దేవి పంపించింది!" అన్నది.

"రాకుమారీ! మీరింకా నాకే కార్యమూ ఒప్పజెప్పలేదు కద? నా పూర్ణ శక్తియుక్తులను చూపే అవకాశం ఇంకా రాలేదు కద?" అన్నాడు వల్లవరయ్యన్.

"అందుగురించి దిగులుపడనవసరం లేదు. మీరింతవరకు ఎదుర్కొన్న అపాయాలన్నీ లెక్కకు కూడ రానంత పెద్ద అపాయకరమైన ఒక పని మీకివ్వబోతున్నాను!" అన్నది.

వంతిదేవుని మనసు పొంగి ఒడలు జలదరించింది. ఆ వనితామణి విధించే కార్యాన్ని నెరవేర్చేందుకు ఏడు సముద్రాలను దాటేందుకు, వేయి సింహాలతో నిరాయుధుడిగా పోరాడేందుకు, మేరుపర్వతాన్నధిరోహించి నక్షత్రాలను పట్టి తెచ్చివ్వడానికి కూడ సిద్ధమయ్యాడు.

-:-

అంతఃపురపు నందనవనంలో పాలరాతి మంటపం ఒకటి ఉంది. కుందవైదేవి ఆ మంటపంవైపు నడిచింది. భట్టుగారు, వంతిదేవుడు కూడ ఆమె వెంట వెళ్ళారు.

మంటపంలోని ఒక మణులు పొదిగిన గూటినుంచి కుందవైదేవి ఒక చిన్న తాళపత్రాన్ని, బంగారుపిడివున్న ఒక ఘంటాన్ని తీసుకొంది. తాళపత్రంలో ఇలా రాసింది :-

"పొన్నినది ముద్దుల బిడ్డా! (పొన్నియిన్ సెల్వా!) ఈ తాళపత్రాన్ని చూసిన వెంటనే బయలుదేరి రా. వివరాలు ఈ పత్రాన్ని తీసుకొని వస్తున్నవారు చెప్పగలరు. వీరిని పూర్తిగా నమ్మవచ్చు."

ఇలా రాసి, చివర అత్తి ఆకువంటి ఒక చిత్రాన్నిగీసింది. తాళపత్రాన్ని వంతిదేవునికిస్తూ, "ఏ

మాత్రం ఆలస్యం చేయక ఈ తాళపత్రాన్ని తీసుకొని లంకాదేశానికి వెళ్ళాలి. యువరాజు అరుళ్మొళివర్మకు ఇది ఇచ్చి, వెంటనే అతన్ని మీతోబాటు తీసుకొని రావాలి!" అన్నది.

వంతిదేవుడు ఆనంద సముద్రంలో మునిగి తేలాడు. చాల రోజులుగా ఉన్న అతని మనోరథాల్లో ఒకటి నెరవేరంది. చోళవంశపు మణిదీపమైన యువరాణి కుందవైదేవిని దర్శించడమైంది. ఆమె మూలకంగానే రెండవ మనోరథంకూడ నెరవేరబోతోంది - యువరాజు అరుళ్మొళివర్మను కలిసే భాగ్యం కలగబోతోంది.

"దేవీ! నామనసులో నేననుకొన్న కార్యాన్నే మీరు నాకిస్తున్నారు. తాళపత్రాన్ని తీసుకొని ఇప్పుడే బయల్దేరుతాను!" అని చెప్పి వంతిదేవుడు తాళపత్రాన్ని తీసుకోవడానికి కుడిచేతిని ముందుకు చాచాడు.

కుందవైదేవి అతనికి తాళపత్రాన్ని ఇచ్చినప్పుడు తామరరేకులవంటి ఆమె చేతివేళ్ళు వంతిదేవుని చేతిని తాకాయి. అతని ఒళ్ళు జలదరించింది. హృదయం పేలిపోతుందేమోననిపించింది. వేవేల సీతాకోకచిలుకలు అతని కళ్లముందు రెక్కలారుస్తూ ఎగిరాయి. ఆకాశంనుంచి పూలవర్షం అతనిపైన కురిసింది. కోయిలలు మధురగానం పాడాయి.

ఆ ఊహాలోకంలో అతని మనసు అలా ఉండగా తలెత్తి కుందవైదేవిని చూశాడు. ఏమేమో చెప్పాలని అతని మనసు తహతహలాడింది. కానీ, దాన్ని చెప్పే శక్తి నిర్జీవమైన మాటలకెక్కడిది?

చెప్పవలసినదంతా అతని కళ్ళే చెప్పాయి. అప్పుడతని కళ్ళు చెప్పిన కవితలకు సాటిగా కాళిదాసే కాదు, పురాతన తమిళ కవులెవ్వరూ చెప్పగలిగి ఉండేవారుకారంటే అతిశయోక్తి కాదు.

వసంత మంటపానికి కాస్తదూరంగా కొన్ని ఎండుటాకులు గలగల శబ్దం చేశాయి. ఈశాన్య భట్టుగారు తమ గొంతు సవరించుకొన్నారు.

వంతిదేవుడు ఈ లోకానికి వచ్చాడు!

~~~
~~~

# అధ్యాయము - 50

## పరాంతకుల వైద్యశాల

మరుసటిరోజు ఉదయం సూర్యుని అరుణకిరణాలు పళైయారై అంతఃపురపు స్వర్ణగోపురాలను తాకి అవి ధగధగా మెరుస్తున్నాయి. కుందవైదేవి మాళిగముందు అంబారీతో అలంకరించబడిన ఒక ఏనుగు వచ్చి నిలిచింది. కుందవైదేవి, వాణతి అంతఃపురంనుంచి బయటికి వచ్చి, మేడ మెట్లెక్కి ఏనుగుపైన అంబారీలో కూర్చొన్నారు. సైన్యాల ఇళ్ళున్న వాడ మధ్యలో ఉన్న పరాంతక చోళ చక్రవర్తి కట్టించిన వైద్యశాలవైపు ఆ ఏనుగు భూమి అదిరేలా నడుస్తూ వెళ్ళింది. ఏనుగు మావటి దాని పక్కనే నడుస్తూ, దాన్ని మెల్లగా నడిపించుకొంటూ వెళ్ళాడు. ఏనుగు గంటల శబ్దం విని పురప్రజలు తమ ఇళ్ళనుంచి వేగంగా బయటకు వచ్చి చూశారు. రాకుమార్తెలనిద్దరినీ చూసిన వెంటనే వారి ముఖాలు విప్పారాయి. చేతులెత్తి వందనం చేశారు.

ఏనుగు తక్కిన వీధులన్నీ దాటి, దండు (సైన్యం) ఉన్న వాడను చేరింది. ఆ వాడలోని వీధుల తీరే వేరుగా ఉంది. పందెపు కోడిపుంజులు ఒకదాన్నొకటి తరుముకొంటూ వెళ్ళాయి. వంపులు తిరిగిన కొమ్ములున్న పొట్టేళ్ళు, "పోట్లాటకు వచ్చేవారెవరైనా ఉన్నారా?" అన్నట్లు అటు ఇటూ చూస్తూ నిలబడివున్నాయి. పౌరుషమున్న వేటకుక్కలను తోలుతో చేసిన పగ్గాలతో ఇళ్ళముందరి స్తంభాలకు కట్టివున్నారు. చిన్న పిల్లలు చేత వెదురు బెత్తాలు పట్టుకొని ఒకరితో ఒకరు (శిలంబం ఆట) ఆట్లాడుతున్నారు.

ఇళ్ళ దిన్నెల గోడలపైన ఎర్రమట్టితో రకరకాల చిత్రాలు గీయబడివున్నాయి. చాల వరకు సుబ్రమణ్యస్వామి (మురుగన్) లీలలు, చోళ రాజుల జీవిత వృత్తాంతాలను వివరించే చిత్రాలే. వాటిలో సంగ్రామ దృశ్యాలే అధికంగా వున్నాయి. సుబ్రమణ్యస్వామి శూరపద్మాసురుని తల మళ్ళీ మళ్ళీ మొలవగా, దాన్ని మళ్ళీ మళ్ళీ నరికేసిన దృశ్యము, దుర్గాపరమేశ్వరి మహిషాసురుని వధించిన దృశ్యమూ అతి భయంకరంగా చిత్రించబడివున్నాయి. తెళ్ళారు, తంజావూరు, కుడమూక్కు (మూక్కు = ముక్కు), అరిసిలారు, తిరుప్పురంపయం, వెళ్ళూరు, తక్కోలం, శేవూరు మొదలైన యుద్ధాలలో చోళదేశపు వీరులు ప్రదర్శించిన అద్భుత వీరపరాక్రమ కృత్యాలు ఆ ఇళ్ళగోడలపైన తద్రూపంగా కనిపించాయి.

-:-

ఈ దండు (సైన్యం) ఇళ్ళున్న వీధుల్లో రాకుమార్తెలధిరోహించిన ఏనుగు ప్రవేశించగానే చాల అల్లకల్లోలం లేచింది. కోడిపుంజులు రెక్కలు టపటపా కొడుతూ ఎగిరి, ఇళ్ళ కప్పులపైకి వెళ్ళి కూర్చొని కూయసాగాయి. పిల్లలు ఒకరినొకరు కేకలేసి పిలుచుకొంటూ పరుగెత్తారు. తమతమ ఇళ్ళ తలుపులను

తట్టి లోపల ఉన్నవారికి వార్త చెప్పారు.

ఆ వీధుల గుండా రాకుమారి ఏనుగు వెళుతుండగా ఇళ్ళ వాకిళ్ళలో స్త్రీలు, పిల్లలు, ముసలివారు నిలబడి, "యువ రాకుమారి కుందవైదేవి నూరేళ్ళుండనీ! (vaazhga!)", "చోళుల ముద్దుల రాకుమారి నూరేళ్ళుండనీ!" అని దీవించి ఆనందించారు. వారిలో కొందరు ఏనుగు వెంబడి నడవసాగారు. రాను రాను ఈ గుంపు అధికం కాసాగింది. పలువిధాల దీవనలతో తమ సంతసాన్ని వెలిబుచ్చుతూ వెంట వచ్చారు.

ఆ సైన్యపు ఇళ్ళలో లంకకు యుద్ధానికి వెళ్ళిన వీరుల స్త్రీలు, తలిదండ్రులు నివసిస్తున్నట్లు ఇప్పటికే సూచించడమైనది. వారి యోగక్షేమాల కోసం ఒక వైద్యశాలను కుందవైదేవి తన సొంత మాన్యాల రాబడిని ఖర్చుచేసి స్థాపించింది. చోళ కులస్థులలో తమ పూర్వీకుల గౌరవార్థం పెద్దపెద్ద కార్యక్రమాలను చేపట్టడం సంప్రదాయం. కుందవైదేవి పూర్వీకులలో ఆమె తాతకు తండ్రియైన పరాంతక చోళ చక్రవర్తి చాల ప్రసిద్ధిచెందినవాడు. ఆయన పేరు విలసిల్లాలనే ఉద్దేశంతో ఆమె 'పరాంతక వైద్యశాల'ను స్థాపించి, నడిపిస్తోంది. ఆ వైద్యశాలను వెళ్ళి చూసే సాకుతో అక్కడి యుద్ధవీరుల కుటుంబాల యోగక్షేమాలను ఆమె విచారించడం అలవాటు.

-:-

వైద్యశాలను చేరిన వెంటనే ఏనుగు నిలిచింది. ముంగాళ్లను మెల్లగా మడిచి, తర్వాత వెనుక కాళ్ళను మడిచి మెల్లగా పడుకొంది. రాకుమార్తెలిద్దరూ ఏనుగుపైనుంచి దిగారు.

ఏనుగు కాస్త పక్కకు వెళ్ళగానే, అక్కడి స్త్రీలు, పిల్లలు రాకుమార్తెల చుట్టూ గుమికూడారు.

"వైద్యశాల మీకందరికీ ఉపయోగపడుతోంది కద? వైద్యులు రోజూ వచ్చి కావలసినవారికి మందులిస్తున్నారు కద?" అని అడిగింది కుందవైదేవి.

"అవును, తల్లీ, అవును!" అని చాల మంది బదులు చెప్పారు.

"మూడు నెలలుగా దగ్గుతో బాధపడుతుండేదాన్ని. వైద్యులిచ్చిన మందు తీసుకొన్న తర్వాత ఒక వారంలో నయమైంది!" అన్నది ఒకామె.

"అమ్మా! నా కొడుకు చెట్టుమీద నుంచి పడి కాలు విరగ్గొట్టుకొన్నాడు. వైద్యులు కట్టుకట్టి మందిచ్చిన పదిహేను రోజులకంతా పూర్తిగా నయమైపోయింది. ఇప్పుడు పరుగెడుతూ ఆడుతున్నాడు. మళ్ళీ చెట్టెక్కగలుగుతున్నాడు!" అన్నది ఇంకొకావిడ.

"మా అమ్మకు కొంతకాలంగా కంటిచూపు మసకబారిపోయింది. వైద్యశాలకు వచ్చి కంటికి మందువేసుకొంది. ఇప్పుడామెకు కళ్ళు బాగా కనిపిస్తున్నాయి!!" అన్నదొక యువతి.

"చూశావా, వాణతీ! మన తమిళదేశపు పూర్వీకులెంత గొప్పవారో? ఏ జబ్బుకు ఏ మూలిక పనిచేస్తుందో వారెలా కనిపెట్టారో కద!" అన్నది కుందవైదేవి.

"వారు ఎన్నో అద్భుతమైన మందులు కనిపెట్టింది నిజమే. కానీ, నీ మనోవ్యాధికి వారే మందూ కనిపెట్టలేదు కద? ఏం చేయడం?"

"అక్కా! నాకే మనోవ్యాధీ లేదు. దయచేసి తరచూ ఇలా అనకండి! నా చెలికత్తెలు నన్నెప్పుడూ పరిహాసం చేసి ప్రాణాలు తోడుతున్నారు!" అన్నది వాణతి.

"నీకలాగే జరగాలి! ఎలాంటి దిగులూ లేకుండ హాయిగా ఉన్న నా తమ్ముని మనస్సును కలతబారజేసేశావు కద? ప్రతిసారి లంకనుంచి మనుషులు వచ్చినప్పుడల్లా వారిచేత నీ ఆరోగ్యం ఎలా ఉందని విచారించి తెలుసుకొంటున్నాడు కద!" అన్నది కుందవైదేవి.

-:-

ఇంతలో, "వైద్యులకు దారి వదలండి! వైద్యులకు దారి వదలండి!" అన్న ఘోష వినిపించింది. కాపలావారు అక్కడ గుమికూడిన ప్రజలను పక్కకు తొలగమన్నారు. ముఖ్యవైద్యులు ముందుకు వచ్చి రాకుమార్తెలను స్వాగతించారు.

"వైద్యా! కోడిక్కరై పక్కన ఉన్న అడవిలో  అమూల్యమైన మూలికలున్నాయన్నారు కద? అక్కడికి వెళ్ళి రమ్మని ఒక యువ వీరుని పంపించాను కద? అతను తిరిగి వచ్చాడా?" అని కుందవైదేవి అడిగింది.

"అవును, తల్లీ! ఆ చురుకైన కుర్రాడు తిరిగి వచ్చాడు. ఈశాన్య శివభట్టుగారు పిలుచుకొని వచ్చారు. నాకొడుకు కోడిక్కరైనుంచి తిరిగి వచ్చేశాడు. ఆ యువకునితోబాటు నా కొడుకును పంపిస్తాను. ఆ వీరయువకుడు లంకకు వెళ్ళి వస్తానని చెప్తున్నాడు..."

"లంకనుంచి కూడానా మూలికలు తేవాలి?" అని అమాయకంగా అడిగింది వాణతి.

"అవును, తల్లీ! లక్ష్మణుని కాపాడేందుకు హనుమంతుడు సంజీవని పర్వతాన్ని తెచ్చేందుకు కోడిక్కరై మీదుగానే సముద్రాన్ని దాటాడట. అప్పుడు ఆ సంజీవని పర్వతంనుంచి కొన్ని మూలికలు కోడిక్కరై అడవిలో పడ్డాయట. అందుకనే అక్కడ చాల అమూల్యమైన మూలికలు దొరుకుతున్నాయి. లంకలో సంజీవని పర్వతమే ఉండడం వల్ల ఇంకా అపూర్వమైన మూలికలు దొరుకుతాయి కద? నేనెదురు చూస్తున్న మూలికలే దొరికితే నేనే చక్రవర్తి జబ్బును నయం చేసేస్తాను."

"దేవుని దయవల్ల అలాగే జరగనీ! ఇప్పుడు ఆ ఇద్దరు యువకులూ ఎక్కడ?"

"లోపల ఉన్నారమ్మా! ప్రయాణానికి సిద్ధమై, మీ దగ్గర సెలవు తీసుకొని బయలుదేరేందుకు

పేచివున్నారు!"

-:-

ముఖ్యవైద్యులు పిలుచుకొని వెళ్ళగా, రాకుమార్తెలిద్దరూ వైద్యశాల లోపల ప్రవేశించారు. అక్కడ ఆవరణలో మందులు తీసుకొని వచ్చిన వారిని, మందులకోసం పేచివున్నవారిని చూస్తూ ముందుకు నడిచారు. వారందరూ కుందవైదేవిని చూసిన వెంటనే విప్పారిన ముఖాలతో, తమకింత మంచి వైద్యశాలను కట్టించినందుకు ఆమెను మనసారా దీవించారు.

ముఖ్యవైద్యుల గదిలో ఇద్దరు పేచివున్నారు. వారిలో మన వంతిదేవుడు కొత్తవిధంగా బట్టలు ధరించి ఉండడాన్ని చూసి కుందవైదేవి చిరునవ్వు నవ్వింది. వాణతి కూడ అతన్ని పోల్చుకోగలిగింది. కుందవైదేవి చెవిలో మెల్లగా, "కుడంధై జ్యోతిష్కుల ఇంట చూసిన యువకుని లాగ ఉన్నాడే!" అన్నది.

"నాకూ అలాగే అనిపిస్తోంది. జ్యోతిష్కులను చూసిన తర్వాత వైద్యుల వద్దకు వచ్చివున్నారు. నీలాగే ఈయనకు కూడ ఏదో మనోవ్యాధి ఉన్నట్లుంది!" అని చెప్పేసి, వంతిదేవుని చూసి, "ఏమయ్యా! చక్రవర్తి జబ్బు నయం చేసేందుకు లంకకు వెళ్ళి మూలికను తీసుకు వచ్చేందుకు ఒప్పుకొన్నది మీరేనా?" అని అడిగింది.

వంతిదేవుని కళ్ళు, కనురెప్పలు ఇంకేదో రహస్యభాషలో మాట్లాడాయి. అతను నోటితో, "అవును, రాకుమారీ! నేనే లంకకు వెళ్తున్నాను. ఒకవేళ అక్కడ రాకుమారులను చూసినా చూడవచ్చు. ఆయనకు ఏదైనా సందేశమివ్వాలా?" అని అడిగాడు.

"ఆయనను చూస్తే ఈ వార్తను తప్పక తెలపండి: కొడుంబాళూర్ రాకుమారి వాణతికి ఒంట్లో బాగానే లేదు. తరచూ స్పృహ తప్పి పడిపోతోంది. రాకుమారిని స్థిత ప్రజ్ఞలో చూడాలంటే వెంటనే బయలుదేరి రావాలని చెప్పండి" అన్నది కుందవైదేవి.

"అలాగే తెలియజెబుతాను దేవీ!" అని చెప్పి వంతిదేవుడు వాణతివైపు చూశాడు.

-:-

కుందవైదేవి అన్న మాటలతో, వాణతి అందమైన ముఖం సిగ్గుతో ఎర్రబారి మరింత అందంగా కనిపించింది. పొంగుకొస్తున్న సిగ్గును అదుపులో పెట్టుకొని, తడబడుతున్న గొంతుతో, "అయ్యా! మీరలాగేం చెప్పకండి. మిమ్మల్ని చాల వేడుకొంటున్నాను. కొడుంబాళూర్ వాణతి, యువ రాకుమారి కుందవైదేవి పోషణలో ముప్పూటలా బాగ భోంచేస్తూ సుఖంగా ఉంటోందని చెప్పండి!" అన్నది.

"అలాగే తెలియజేస్తానమ్మగారు!" అన్నాడు వంతిదేవుడు.

"బాగుంది! నేను చెప్పినదానికీ, 'అలాగే చెబుతాను' అన్నారు. ఈమె చెప్పినదానికీ 'అలాగే

చెబుతాను’ అని ఒప్పుకొంటున్నారు. రెంటిలో ఒకటే కద నిజం కావడానికి సాధ్యం?”

“అయితేనేమి, అమ్మగారు! వాది చెప్పింది, ప్రతివాది చెప్పింది నేనలాగే ఒప్పజెప్పేస్తాను. ఏది నిజం, ఏది కాదు అన్నది యువరాజే న్యాయపతిగా నిలబడి తీర్మానించుకోనీ!” అన్నాడు వంతిదేవుడు.

“కానీ ఒకరు చెప్పినదాన్ని ఇంకొకరు చెప్పినట్లు మాత్రం మార్చి చెప్పకండి! మీకు పుణ్యముంటుంది!” అన్నది కుందవైదేవి.

కుందవైదేవి ఈ సంభాషణను అక్కడితో నిలుపగోరి, “వైద్యులుగారు! అంతఃపురపు అధికారినుంచి వీరికి లంకకు తీసుకువెళ్ళవలసిన తాళపత్రం దొరికిందా?” అని అడిగింది.

“దొరికింది తల్లీ! 'చక్రవర్తికి వైద్యం చేసేందుకు వీరు మూలికలు తీసుకొని రాబోవడం వల్ల, వీరికి అవసరమైన సహాయం చేయాలి’ అని దారిలో ఉండే రాజ్యాంగ అధికారులందరికీ ఒక సామూహిక ఆజ్ఞాపత్రమూ, కోడిక్కరై సముద్రతీర దీపగృహపు కాపలావారికి వేరొక ఆజ్ఞాపత్రమూ ఇచ్చారు. వాటిని వీరికి అప్పగించేశాను!” అన్నారు ముఖ్య వైద్యులు.

“మరింకేమాలస్యం? బయలుదేరాల్సిందే కద?” అన్నది కుందవైదేవి.

“అవును; బయలుదేరాల్సిందే!” అన్నారు వైద్యులు.

కానీ, వెంటనే బయలుదేరడం అంత సులభమని అనిపించలేదు.

-:-

వైద్యశాలనుంచి వారు బయటకు వచ్చారు. రాకుమార్తెలను ఎక్కించుకొని తీసుకువెళ్ళేందుకు ఏనుగు సిద్ధంగా ఉంది. వంతిదేవుని, అతనికి తోడు వైద్యుని కొడుకును వాయువేగ మనోవేగాలతో తీసుకువెళ్ళేందుకు రాజాశ్వాలు రెండు ఉత్సాహంతో వేచివున్నాయి.

కానీ వంతిదేవునికి ఉన్నట్లుండి ఏవేవో సందేహాలొస్తున్నాయి. కుందవైదేవికి కూడ ఏవేవో విషయాల గురించి హెచ్చరించాలనిపిస్తూంది. దారిలో వంతిదేవునికి రాగల అపాయాల గురించి అతన్ని హెచ్చరించింది.

రాకుమార్తెలిద్దరు ఏనుగెక్కి అంతఃపురానికి తిరిగి వెళ్ళారు.

తర్వాత వంతిదేవుడు తన సహచరునితో బాటు గుర్రమెక్కి ప్రయాణానికి సిద్ధమయ్యాడు.

-:-

అంతఃపురపు ఏనుగు కదిలేటట్లనిపించలేదు. దూరప్రయాణం చేయబోయేవారు ముందు బయల్దేరాలని కుందవైదేవి సూచించడమే అందుకు కారణం.

వంతిదేవుడు వెళ్ళేందుకు మనసురాక, ఇక తప్పదన్నట్లు గుర్రాన్ని తిప్పాడు. మళ్ళీ ఇంకొకసారి ఆశాపూరిత నయనాలతో కుందవైదేవిని చూశాడు. తర్వాత గుర్రంపైన కోపగించినవాడిలా దాన్ని కొట్టాడు. పౌరుషంగల ఆ గుర్రం ఒక్క ఉదుటున నాలుక్కాళ్ళమీద ముందుకు దూసుకువెళ్ళింది. అతని వెంబడి వెళ్ళేందుకు వైద్యకుమారుడు చాల కష్టపడవలసి వచ్చింది.

ఏనుగు బయల్దేరిన తర్వాత కుందవైదేవి దీర్ఘాలోచనలో మునిగిపోయింది. ఈ మనస్సెంత విచిత్రమైంది? రాజాధిరాజులను, వీరాధివీరులను నిరాకరించిన ఈ మనసు దారిన పోయే ఈ యువకునిపైన ఎందుకింత శ్రద్ధ చూపుతోంది? ఇతడు చేబట్టిన కార్యం నెరవేరాలని, క్షేమంగా తిరిగిరావాలని ఈ మనసెందుకు ఇంత పరితపిస్తోంది?

“అక్కా? ఏమాలోచిస్తున్నారు?” అన్న వాణతి గొంతు కుందవైదేవిని ఈ లోకానికి తీసుకువచ్చింది.

“ఏమీ లేదు, వాణతి! ఆ యువకుని అహంభావ స్వభావం గురించి ఆలోచిస్తున్నాను. అతనితో నాతమ్మునికి సందేశాన్ని ఎందుకు పంపిస్తున్నానని ఇప్పుడనిపిస్తోంది....”

“అవునక్కా! అతను చాల చెడ్డవాడే! పెద్ద దోపిడీదొంగ అనికూడ చెప్పాల్సివుంది...”

“అదేమి? దోపిడీదొంగ అని చెప్తున్నావు?”

“సాధారణ దోపిడీదొంగ బంగారు, వెండి మొదలైన వస్తువులను దొంగిలిస్తాడు. కానీ ఈ యువకుడు చోళవంశ మణిదీపాన్నే దొంగిలించుకొని పోతాడని నాకు భయమేస్తోంది. మీరు దానికి తావివ్వరు కద?” అన్నది వాణతి.

“ఒసే దొంగా! నన్నూ నీలాగే అనుకొన్నావా? అలా ఎప్పటికీ జరగదు!” అన్నది కుందవై.

-:-

ఏనుగు వెనుదిరిగి కాస్తదూరం వెళ్ళినప్పుడు వీధిలో ఒకచోట చాలమంది స్త్రీలు గుమిగూడి ఉండడాన్ని రాకుమార్తెలు గమనించారు. ఏనుగును నిలిపి, “ఎందుకు గుమిగూడి ఉన్నారు? ఏమైనా చెప్పాలా?” అని రాకుమారి కుందవైదేవి అడిగింది.

వారిలో ఒకతె ముందుకు వచ్చి, “లంకలో ఉన్న మా పురుషుల గురించి ఒక్క సంగతీ తెలియరాలేదు! వాళ్ళకు ఇక్కడినుంచి బియ్యం పంపకూడదని తంజావూరువాళ్ళు అడ్డగించారట! కడుపుకు అన్నంలేకుండా ఎలాగమ్మా వాళ్ళు యుద్ధం చేస్తారు?” అని అడిగింది.

“అందుగురించి మీరేం దిగులు పడకండి. మామల్లపురం (మహాబలిపురం) సముద్రమార్గం గుండా వారికి ఆహారధాన్యాలు వెళుతున్నాయి. తంజావూరువాళ్ళు ఏం చేసినా, మీ యువరాజు ఊరికే

వదిలేస్తారా? చోళదేశపు మహావీరులు పస్తులు పడివుంటే చూస్తూ ఊరుకుంటారా?" అన్నది కుందవైదేవి.

ఇంకొక సందర్భంలోనైతే కుందవైదేవి కిందకు దిగి వారికింకా ఓదార్పు చెప్పేదే. కానీ ఇప్పుడామె మనసు ఇంకొక చోట చంచలిస్తుండడంతో ఏకాంతం కోరుకొంది. ఏనుగు అంతఃపురంవైపు సాగింది.

~~~
~~~

# అధ్యాయము - 51

## మామల్లపురం (మహాబలిపురం )

పాఠకులు ఇప్పటికే బాగా ఎరిగివున్న మామల్లపురానికి వారినిప్పుడు పిలుచుకొని వెళ్ళగోరుతున్నాము.

మహేంద్ర పల్లవుడు, నరసింహ పల్లవుడు ఈ సముద్రతీర పట్టణాన్ని అద్భుత శిల్ప సృష్టితో ఒక స్వప్నపురిగా మలిచిన తర్వాత సుమారు మూడు వందల ఏళ్ళు గడిచిపోయాయి.

నగరపు రూపురేఖలు కాస్త కాంతిహీనమైవున్నాయి. మార్పులు మన మనస్సుకు సంతోషాన్ని కలిగించేలాగ లేవు.

చాల మేడమాళిగలు విరిగిపడి పాడుపడివున్నాయి. వీదుల్లోను, సముద్రతీరం వెంబడి జనసంచారం అంతగా లేదు. వాణిజ్య, వర్తకాలు కూడ అంత ముమ్మరంగా జరగడం లేదు. పెద్ద పెద్ద భాండారాలు లేవు. వీధుల్లో ఎగుమతి, దిగుమతి చేయబడుతున్న సరుకులు కుప్పలు కుప్పలుగా లేవు.

కడలి భూమిలోకి చొచ్చుకొని రావడంవల్ల కొన్ని చోట్ల సహజంగా ఏర్పడిన ఓడరేవుల నీటి కాలువలలో ఇప్పుడు ఇసుక మేటవేసుకుపోయివుంది. కాబట్టి చిన్న చిన్న పడవలు మాత్రమే లోపలికి రాగలుగుతున్నాయి. పెద్ద పెద్ద నావలు, ఓడలు రేవులోనికి రాలేక, తీరానికి దూరంగానే నిలబడాలి. చిన్న చిన్న పడవల్లో సరుకులను తీసుకువెళ్ళి ఆ ఓడల్లో ఎక్కించాలి.

పైన సూచించిన కాలావధిలో (మూడువందల ఏళ్ళలో) మామల్లపురం గడించిన కొన్ని కీర్తి ప్రతిష్ఠలను గురించి వివరించాలి. ముఖ్యంగా సముద్రతీరం వెంబడి విలసిల్లిన రాతి గుళ్ళు మనను ఆకర్షిస్తున్నాయి. అవి మహేంద్రుడు, మహామల్లు కాలంలో గుండ్రాళ్లను తొలిచి కట్టిన గుళ్ళలాగ లేవు. కొండలనుంచి గుండ్రాళ్ళను పెకలించి తీసుకువచ్చి, వాటిని తొలిచి కట్టబడిన ఈ దేవాలయాలు సముద్రునికి మణిమకుటాలలాగ విలసిల్లతున్నాయి. ఆ ఆలయాల శోభను, నిర్మాణాన్ని ఏమని వర్ణించడం?

ఇవిగాక నగరం మధ్య, ముల్లోకాలను మూడడుగులతో కొలిచిన పెరుమాళ్ళు (మహావిష్ణువు) శయనిస్తున్న విణ్ణకర్ దేవాలయం కమనీయంగా కనిపిస్తోంది. శైవమతాన్ని, వైష్ణవమతాన్ని రెండు కళ్ళుగా ఆదరించిన పరమేశ్వర పల్లవుని కైంకర్యంతో కట్టించిన విష్ణు దేవాలయం అది. తిరుమంగైయాళ్వార్ ఈ కోవెలకు వచ్చి శేషశయనునిగాంచి భక్తిపారవశ్యంతో అనేక భక్తిపూరిత గీతాలు పాడారు. వారి కాలంలోకూడ పల్లవ సామ్రాజ్యం వర్ధిల్లి విస్తరించిందని, మామల్లపురం సముద్రమార్గ వ్యాపారాలవల్ల సిరిసంపదలతో తులతూగిందని ఈ పాశురం మూలంగా మనం తెలుసుకోవచ్చు:

<< ఆ పాశురాన్ని అనువదించవలసి ఉంది >>

తిరుమంగైయాళ్వార్ కాలం తర్వాత నూరేళ్లలో పల్లవ సామ్రాజ్యం అస్తమించిపోయింది. 'విద్యలో సాటిలేని కంచి' మహానగరపు పేరుప్రతిష్టలు తగ్గిపోయాయి. సముద్రమార్గ వర్తక వాణిజ్యాలు కూడ తగ్గిపోయాయి.

కానీ తమిళనాడుకే ఎనలేని, మాసిపోని కీర్తి తెచ్చిన ఆ అద్భుత శిల్పకళాఖండాలకు ఎలాంటి కీడు, కొరత రాలేదు. రాతిగోడలపైన చెక్కబడిన అద్భుత దృశ్యాలు, కొండలను తొలిచి తీసుకువచ్చి అమర్చిన విమాన రథాలు మూడువందల ఏళ్లకు మునుపు ఎలా అమర్చారో అలాగే చెక్కు చెదరకుండ ఉన్నాయి. సరుకులను ఎగుమతి చేసేందుకు వచ్చిన వర్తక సమూహాల కన్న శిల్పసంపదను చూసి ఆనందించేందుకు వచ్చిన ప్రజాసమూహాలే అధికంగా ఉన్నాయి.

-:-

మామల్లపురపు వీధులగుండా జంటగుర్రాలు అమర్చిన ఒక అందమైన విమాన రథం వెళుతోంది. గుర్రాల అలంకారము, రథపు నగిషీపనులు, సాయంసూర్యుని అరుణకిరణాలు సోకి మరో సూర్యునిలాగ వెలిగిపోతున్న బంగారు రేకులు తొడిగిన రథపు గోపురము చూస్తూంటే ఆ రథంలో వెళుతున్నవారు రాజవంశస్థులై ఉండాలని తెలుస్తోంది.

అవును; ఆ స్వర్ణరథపు విశాలమైన అంతర్భాగంలో రాజవంశస్థులు ముగ్గురు ఆసీనులై ఉన్నారు. అందులో ఒకడు వీరాధివీరుడు, సుందరచోళ చక్రవర్తి ప్రథమపుత్రుడైన ఆదిత్య కరికాలన్. చాల చిన్న వయసులోనే యుద్ధరంగంలో దూకి పలు వీరకృత్యాలు చేశాడు. మదురై పాండ్యుని చివరి పోరాటంలో చంపి, "పాండ్యుని తలను గెలిచిన కోప్పర కేసరి" అన్న బిరుదును పొందాడు. వీర పాండ్యుడు వీరస్వర్గం చేరిన వెంటనే సుందర చోళ చక్రవర్తి జబ్బుపడ్డారు. తన తర్వాత ఆదిత్య కరికాలనే సింహాసనమెక్కడానికి అర్హుడనే విషయాన్ని దృఢంగా నాటాలన్న ఉద్దేశ్యంతో అతనికి యువరాజ పట్టాభిషేకం కూడ చేసేశారు. ఆ తర్వాత శిలాశాసనాలు తన పేరుతో చెక్కించగల అర్హతను కూడ పొందాడు ఆదిత్య కరికాలన్.

తర్వాత, తొండైమండలాన్ని ఇరట్టై (రెట్టై = రెండు) మండలపు కణ్ణర దేవుని అధీనం నుంచి పూర్తిగా తిరిగి కైవసం చేసుకోవడానికి ఆదిత్యుడు ఉత్తరదేశానికి ప్రయాణమై వెళ్ళాడు. అక్కడకూడ పలు యుద్ధాలలో పోరాడి వీరకృత్యాలు చేశాడు. రెట్టైమండలపు సైన్యాలను ఉత్తర పెన్నానది ఉత్తర తీరానికి తరిమికొట్టాడు. ఇంకా ఉత్తరంగా దండెత్తివెళ్ళడానికి మరింత సైన్యాన్ని కూడదీసుకోవలసి వచ్చింది. అందుకోసం కంచికి వచ్చి అక్కడ సైన్యాలను, ఆయుధసామగ్రిని సేకరించనారంభించాడు. ఇలాంటి పరిస్థితిలో పళువేట్టరయ్యర్లు అతని ప్రయత్నాలను వమ్ముచేయనారంభించారు. లంకలో పోరు ముగిసేంత వరకు ఉత్తరంగా దండెత్తి వెళ్ళకూడదని చెప్పారు. ఇంకా పలురకాలైన వదంతులు గాలిలో తేలిరాసాగాయి. అదీగాక, లంకకు దండెత్తి వెళ్ళిన సైన్యాలకు కావలసిన ఆహారపదార్థాలు వెళ్ళడం లేదని తెలిసింది.

ఆదిత్యుని వీరహృదయం ఇదంతా చూసి, విని కుతకుతలాడసాగింది.

-:-

మన కథ జరిగే సమయానికి ముందు ఇంచుమించు మూడువందల ఏళ్ళ కాలావధిలో తమిళమాత కడుపున మనం ఇతిహాసాల్లో చదివే వీరులను పోలిన వీరకుమారులనేకమంది కానవచ్చారు. భీముని, అర్జునుని, భీష్ముని, ఘటోత్కచుని, సుయోధనుని, అభిమన్యుని పోలిన మహావీరులు అవతరించారు. లోకమచ్చెరువందేటట్లు అనేక ధీర, వీరకృత్యాలు చేశారు. యుద్ధాల్లో పొందిన ప్రతి విజయమూ వీరి భుజాలకు మరింత బలాన్నిచ్చేది. వయసు మళ్ళిన వీరులుకూడ కొండలను పెకలించగల బలం కలిగివుండేవారు. ఇంకా వయసుకు రాని బాలురుకూడ ఆకాశానికెగిరి చుక్కలను కోసి తేగల ధైర్యము, తెగింపూ కలిగివుండేవారు.

అటువంటి వీరులిద్దరు ఆ సమయాన ఆదిత్య కరికాలన్ ఎక్కి వెళుతున్న రథంలో అతనితో సమంగా ఆసీనులైవున్నారు.

వీరిలో ఒకరు తిరుక్కోవలూర్ మలైయమాన్. ఆయన ఏలిన మలైయ మహానాడు వాడుకలో పేరు కురుచై 'మలాడు' అనీ, 'మిలాడు' అనీ పిలువబడేది. కాబట్టి ఆయనకు 'మిలాడుదురై' అనబడే పట్టంకూడ ఉండేది.

సుందర చోళ చక్రవర్తి ద్వితీయ పత్నియైన వాణమహాదేవి ఈయన కుమార్తే. కాబట్టి ఆదిత్య కరికాలన్ తాతగారీయన. ముదుసలి ప్రాయంలోను, వివేకంలోను ఈయన కౌరవుల తాతగారైన భీష్మాచార్యుల వంటివారు. ఆదిత్యునికి ఆయనంటే చాల భక్తిభావమున్నా, ఒక్కొక్కసారి ఆయన చెప్పే నీతిపాఠాలు ఆదిత్యుని ఓర్పును పరీక్షిస్తున్నాయి.

రథంలో ఉన్న ఇంకొక వీరుడు పార్థిబేంద్రుడు. ఇతడు పాత పల్లవ వంశపు ఒక శాఖలో పుట్టినవాడు. వయసులో ఆదిత్య కరికాలన్ కన్న కాస్త పెద్దవాడు. రాజ్యార్హత లేనందువల్ల యుద్ధరంగంలో తన శౌర్యాన్ని చూపి కీర్తిప్రతిష్టలు సంపాదించాలని ఆశపడుతున్నాడు. ఆదిత్యుని పంచన చేరాడు. వీరపాండ్యునితో జరిగిన పోరాటంలో ఆదిత్యునికి కుడిచేయిగా నిలబడి సహాయం చేశాడు. అందువల్ల ఆదిత్యుని అంతరంగ స్నేహానికి పాత్రుడయ్యాడు. వీరపాండ్యుడు నేలకొరిగిన నాటినుంచి ఇద్దరు గాఢస్నేహితులయ్యారు.

ఈ ముగ్గురు రథంలో వెళుతున్నప్పుడు తంజావూరునుంచి వస్తున్న వార్తల గురించే చర్చిస్తున్నారు.

"ఈ పళువేట్టరయ్యర్ల అహంభావాన్ని నేనింక ఒక్కక్షణంకూడ సహించలేను. నానాటికీ వారు మితిమీరి పోతున్నారు. నేను పంపిన దూతపైన 'గూఢచారి' అనే నిందమోపేందుకు వీరికెంత ధైర్యం?

అతన్ని పట్టి ఇచ్చిన వారికి వేయి బంగారు నాణాలు బహుమతి ఇస్తామని దండోరా వేయించారట కద? ఇదంతా నేనెలా సహించను? నా ఒరలో ఉన్న కత్తి అవమానంతో కుంగిపోతోంది. మీరేమో 'ఓరిమి' ఉపదేశం చేస్తున్నారు!" అన్నాడు ఆదిత్య కరికాలన్.

"'ఓరిమి' ఉపదేశం నేను చేయడంలేదు. కానీ ఇటువంటి ముఖ్యమైన కార్యానికి వంతిదేవుని పంపించవద్దని మాత్రమే అన్నాను. ఆ వదరుబోతు కార్యాన్ని చెడగొడతాడని నాకు తెలుసు! కత్తిని తిప్పడానికి, శూలాన్ని విసరడానికి మాత్రం తెలిస్తే చాలా? రాజకార్యంమీద వెళ్ళేవాడికి బుద్ధిచాతుర్యం కావాలి..." అన్నాడు పార్థిబేంద్రుడు.

యువరాజు కరికాలన్ వంతిదేవుని పట్ల చూపే అభిమానం పార్థిబేంద్రునికి నచ్చలేదు. ఎప్పుడూ అతని గురించి ఏదో ఒక కొరత/లోపం చెబుతుంటాడు. అతను చేసే ప్రతి పనిలోను కొరత/లోపం కనిపెట్టజూస్తాడు. కాబట్టి ఈ సందర్భంలోను అలా లోకువగా మాట్లాడాడు.

"మొదలు పెట్టావా నీ కథ? వంతిదేవుని పైన ఏదో ఒక చాడీ చెప్పకపోతే నీకు పొద్దుపోదు. వాడికి బుద్ధి చురుకుతనం లేకపోతే మరింకెవరికి ఉందట? ఎలాగోలా చక్రవర్తికి స్వయంగా నేనిచ్చిన తాళపత్రం అందజేయాలన్న నా ఆజ్ఞను నెరవేర్చేశాడు. అందువల్ల పళువేట్టరయ్యర్లు కోపగించివున్నారు. ఇందులో వంతిదేవుని తప్పేమి?" అని అడిగాడు ఆదిత్య కరికాలన్.

"మీరు చెప్పి పంపిన పనితో నిలిపి ఉండడు. వేరే అనవసరమైన విషయాల్లో తలదూర్చి ఉంటాడు!" అన్నాడు పార్థిబేంద్రుడు.

"నీవు కాసేపు ఊరుకో! తాతా! ఎందుకిలా మౌనంగా ఉన్నారు? మీ మాట ఏమి? ఒక పెద్ద సైన్యాన్ని తరలించుకొని తంజావూరుకు వెళ్ళి చక్రవర్తిని గెలుచుకొని కంచికి తీసుకొని వచ్చేస్తే ఎలా ఉంటుంది? ఎన్న రోజులు చక్రవర్తిని పళువేట్టరయ్యర్లు చెరసాలలో పెట్టినట్లు పెట్టి ఉండడాన్ని చూస్తూ సహించడం? ఎన్న రోజులు పరులకు భయపడి ఉండడం?" అని ఉద్రేకంతో అన్నాడు ఆదిత్య కరికాలన్.

తన జీవితకాలంలో అరవైనాలుగు యుద్ధాల్లో పాల్గొని అనుభవం పొందివున్న తిరుక్కోవలూర్ మలైయమాన్ - మిలాడుదురై - ఉత్తరమిచ్చేందుకు గొంతు సవరించుకొన్నారు. ఇంతలో కడలి అలలు ఎదురుగా కనిపించగానే, "ముందు ఈ రథం నుంచి దిగుదాం. ఆబ్బాయ్! మన మామూలు స్థలానికి వెళ్ళి కూర్చొని మాట్లాడుదాం. నాకు వయసైపోయింది కద? పరుగెత్తే రథంలో మాట్లాడడం అంత సులభం కాదు" అన్నారు.

~~~
~~~

# అధ్యాయము - 52

## ముసలాడి పెళ్ళి

మామల్లపురపు సముద్రతీరంలో చిన్న చిన్న రాతిబండలు చాల ఉన్నాయి. ఒక్కొక్కసారి సముద్రం పొంగి అలలు వచ్చి వాటిని గుద్దుకొనేవి. కొన్నిసార్లు సముద్రం వెనక్కి వెళ్ళినప్పుడు ఆ బండలు అగుపడేవి. వాటిలో ఒక్కదాన్నికూడ మామల్లపురపు మహాశిల్పులు ఊరకే వదిలిపెట్టలేదు. ఆయా రాతికి తగినట్లు పెద్దవి, చిన్నవి అనేక మనోహర దృశ్యాలను వాటిపై చెక్కి అవి చిరస్థాయిగా నిలిచేటట్లు చేశారు.

అటువంటి చిన్న బండలు రెండు ఒకదానికొకటి ఎదురెదురుగా అమరివున్న చోటును ఆదిత్య కరికాలన్, అతనితో వచ్చిన ఇద్దరు సమీపించారు. రథంనుంచి దిగివెళ్ళి, ఆ రెండు బండలను రెండు సింహాసనాలుగా ఎంచి ఆదిత్యుడు, మలైయమాన్ వాటిపైన ఆసీనులైనారు. పార్థిబేంద్రుడు వారిద్దరికి కాస్తదూరంగా నిలబడ్డాడు. అప్పుడప్పుడు అలలు వచ్చి వారి మోకాళ్ళవరకు తడుపుతున్నాయి. అలలు లేచి ఆ బండలను గుద్దినప్పుడు లేచిన నీటిజల్లు ముత్యాల వానలాగ వారిపైన కురిసేది. కాస్తదూరంగా, ఓడలు బారులుతీరి రకరకాల సరుకులను మోసుకొంటూ సముద్రాన్ని చీల్చుకొని ముందుకు సాగాయి.

“రెట్టైమండలంపైన దండెత్తేందుకు సేకరించి ఉంచిన సరుకులన్నీ లంకకు వెళుతుండడాన్ని చూస్తుంటే నా మనసు ఉడికిపోతోంది!” అన్నాడు పార్థిబేంద్రుడు.

“మరేం చేయడం? చోళదేశంనుంచి ఏరి సేకరించిన వీరుల దండు లంకలో ఉన్నారు. వారు యుద్ధంలో గెలుపు మీద గెలుపు సాధిస్తున్నారు. వెయ్యేళ్ళుగా లంకాధీశ్వరులు పాలిస్తున్న అనురాధపురాన్ని కైవసం చేసుకొన్నారు. అటువంటి వీరులను పస్తుండి చచ్చిపోయేటట్లు విడిచిపెట్టగలమా?” అన్నాడు ఆదిత్య కరికాలన్.

“అలా వదిలిపెట్టేయాలని ఎవరన్నారు? ఆహారసామగ్రి పంపించవలసిందే. కానీ, చోళదేశంనుంచి నాగపట్నం రేవు ద్వారా వెళ్ళాలి. లేదా పాండ్యదేశంనుంచి సేతువు తీరం నుంచి పంపించాలి. ఈ బీడుపడ్డ తొండైమండలం నుంచి పంపించవలసిన అవసరమేమి? అదికూడ మనం ఉత్తరదేశం వైపు దండెత్తి వెళ్ళేందుకు ఆటంకమేర్పడుంది కద అని ఆలోచించి ఆ విధంగా అన్నాను!” అన్నాడు పార్థిబేంద్రుడు.

“అది తలుచుకొంటే నాకూ మనసు కుతకుతలాడిపోతోంది. ఆ పాపి పళువేట్టరయ్యర్ల ఉద్దేశ్యమేమని తెలియడంలేదు. ఎన్నాళ్ళు ఇదంతా సహిస్తూ ఉండడం? తాతా! ఎందుకింకా మౌనంగా ఉన్నారు? నోరువిప్పి ఏదైనా చెప్పండి!” అన్నాడు ఆదిత్య కరికాలన్.

“బిడ్డా! ఈ కడలి అలలు తెరపిలేకుండ 'ఓ' అని శబ్దం చేస్తున్నాయి. నీ స్నేహితుడు పార్థిబేంద్రుడు కూడ గట్టిగా మాట్లాడుతున్నాడు. వీటిమధ్య నేనెలా మాట్లాడను? నాకేమో వయస్సైపోయి

నీరసం వచ్చేసింది....!" అన్నారు మలైయమాన్ మిలాడుదురై.

"పార్థిబేంద్రా! నీవు కాసేపు మాట్లాడక ఊరుకో. తాత ఆయన మాట చెప్పనీ!" అన్నాడు ఆదిత్యుడు.

"ఇదిగో నోరు మూసేసుకొంటున్నా. పాపం! తాతగారు ఈ వయసు మళ్ళిన ప్రాయంలోను మలైకోట్టై (కొండపైని కోట) నుంచి కిందకు దిగి ఇంతదూరం శ్రమతీసుకొని వచ్చి ఉన్నప్పుడు నేను నోరు తెరవచ్చా? ఈ సముద్రానికి కించిత్తుకూడ బుద్ధిలేదు! ఎడతెరపిలేకుండ హోరుమంటోంది! దీని నోరు మూసేవారెవరూ లేరు. ఈ కడలికి మలైయమాన్ అంటే ఏమాత్రం భయం లేదు!" అన్నాడు పార్థిబేంద్రుడు.

"తమ్ముడూ, పార్థిబేంద్రా! అలానూ ఒక కాలం ఉండేది. తిరుక్కోవలూర్ మలైయమాన్ అన్న పేరు వింటేనే ఈ చుట్టుపక్కల ఉన్న రాజులందరూ గడగడ వణికేవారు. రెట్టైమండలపు పాళెగాండ్రు, వల్లపు వాణ కోవలయ్యర్లు, పైదుంబరాయర్లు, గంగైయర్లు, కొంగర్లు మలైయమాన్ పేరు విన్న వెంటనే పిడుగు పడ్డ శబ్దం విన్న సర్పాలలాగ తమ తమ గూళ్లలో దూరి దాక్కొనేవారు. సముద్రరాజు కూడ కాస్త ఒద్దికగానే ఉండేవాడు. ఈ ఒళ్ళు కాస్త సడలగానే అందరూ తోకాడిస్తున్నారు. వెయ్యేళ్ళ చరిత్ర ఉన్న వంశంనుంచి వచ్చిన నన్ను పడమటినుంచి వచ్చిన ఈ పళువేట్టరయ్యర్లు తుడిచిపెట్టజూస్తున్నారా! అదేనాడూ జరగదు!

"కరికాలా! పళువేట్టరయ్యర్ల ఉద్దేశ్యం ఏమని తెలియడం లెదని కాసేపటికి మునుపన్నావు కద? వారి ఉద్దేశమేమని నేను చెబుతాను, విను! నిన్ను, నీ సహోదరుని వేరు పరిచి బలహీన పరచాలన్నదే వారి ఉద్దేశం. లంకలో నీ తమ్ముడు అరుళ్మొళి ఓటమి పొందాలి. అందువల్ల అతనికి అవమానం కలగాలి. మీరిద్దరూ దెబ్బలాడుకోవాలి. అది చూసి ఈ ముసలివాడు వేదన పడాలి! ఇదే వారి అంతరంగ ఉద్దేశం..." అని మలైయమాన్ ఆదిత్యునికి చెప్పి ముగించేలోపు కరికాలన్ ఆయన మాటలకడ్డుపడ్డాడు.

"అందులో వారెన్నటికీ గెలవలేరు, తాతా! నన్ను, నా తమ్ముని ఎవరూ విడదీయలేరు! అరుళ్మొళి కోసం నేను ప్రాణమైనా ఇస్తాను. నాకు ఒక్కోసారి అనిపిస్తోంది:- పడవెక్కి లంకకు వెళదామా అని. అక్కడ వాడు ఎలాంటి కష్టాలు పడుతున్నాడో ఏమో! నేనిక్కడ ఊరకే తిని కూర్చొని అంతఃపురంలో పడి నిద్రపోతున్నాను. నా కత్తి, శూలమూ తుప్పుపట్టి పాడైపోతున్నాయి. ఒక్కొక్క క్షణం ఒక్కొక్క యుగంలాగ గడుస్తోంది నాకు. ఇక్కడ ఉండేందుకే నచ్చడంలేదు. తాతా! చెప్పండి! ఈ సరుకులు తీసుకొని వెళ్తున్న ఓడల్లో ఒకదాంట్లో ఎక్కి నేనూ లంకకు వెళ్ళనా?" అని అడిగాడు కరికాలన్.

"రాజా! మామంచి ఆలోచన! చాల రోజులుగా నేననుకొంటున్నదాన్ని మీరే చెప్పేశారు. బయలుదేరుదాం, రండి! ఇందుకు తాతను మంత్రాలోచన అడగి ప్రయోజనం లేదు. వీరిని అడిగితే, 'వద్దు, ఉండు!' అనే బుద్ధి చెబుతారు. రేపే మనం బయల్దేరుదాం. తొండైమండలపు సైన్యంలో సగాన్ని తీసుకొని

వెళదాం. లంకలో యుద్ధాన్ని ఒక కొలికి తెచ్చి ముగించేసి, నాగపట్నంలో వచ్చి దిగుదాం. దిగి తంజావూరుకు వెళ్ళి ఆ పళువేట్టరయ్యర్లను ఒక చేయి చూసేద్దాం....!" అని ఆవేశంగా గర్జించాడు పార్థిబేంద్రుడు.

"కరికాలా! చూశావా? నేను మొదట్లోనే నీకేం చెప్పాను? వీడు నోరు మూసుకొని ఉంటేనే నేను మాట్లాడుతానని చెప్పలేదా?"

"ఇదిగో నోరు మూసేసుకొంటున్నా, తాతా! మీరు చెప్పేదంతా చెప్పి ముగించండి!" అని పార్థిబేంద్రుడు తన నోటిని చేత్తో మూసుకొన్నాడు.

"కరికాలా! నీవు వీరాధివీరుడివి. నీవంటి పరాక్రమశాలి ఈ వీరతమిళనాట కూడ చాల మంది పుట్టివుండలేదు. నా ఎనభై ఏళ్లలో ఎన్నో పెద్ద యుద్ధాలు చూసివున్నాను. కానీ శత్రుసమూహంలో ఒంటరిగా దూరి నీలాగ యుద్ధం చేసిన ఇంకొక వీరునింతవరకు చూడలేదు. శేవూర్ మహాయుద్ధం జరిగినప్పుడు నీకు నిండా పదహారేళ్ళుకూడ లేదు. ఆ వయసులో నీవు పగవారి సైన్యంలోకి దూసుకొని వెళ్ళిన వేగాన్ని, కుడివైపు, ఎడమవైపుగా నీ కత్తి గిరగిరా తిరిగిన వేగాన్ని, శత్రువుల తలలు తెగి పడ్డ వేగాన్ని ఇంతకు మునుపెన్నడూ నేను చూడలేదు. నాకళ్ళముందు ఆ దృశ్యం ఇంకా అలాగే నిలిచివుంది. నీలాగే నీ స్నేహితుడు పార్థిబేంద్రుడు కూడ వీరాధివీరుడే. కానీ మీరిద్దరూ వదరుబోతులు; ముక్కుమీద కోపం ఎక్కువ. అందువల్ల మీకు ఆలోచించే శక్తి తగ్గిపోతోంది. ఏది చేయాలో అందుకు తారుమారైన కార్యాన్ని చేయబూనుతారు...."

"తాతా! ఇలాంటి ఉపదేశంఇంతకు మునుపెన్నోసార్లు చేశారు..."

"నిజమే; కానీ ఏమీ ప్రయోజనం లేదంటావా? మాట్లాడక నన్ను ఊరుకు తిరిగివెళ్ళిపొమ్మంటున్నావా?"

"లేదు, లేదు! ఇప్పుడు చేయవలసిన కార్యమేమిటో చెప్పండి."

"నీ సహోదరుడు అరుళ్మొళిని ఇక్కడికి రప్పించుకోవాలి. నీవు, నీ తమ్ముడూ విడిపోయి ఉండనే కూడదు..."

"తాతా! ఇదేం ఆలోచన? అరుళ్మొళి ఇక్కడికి వచ్చేస్తే లంక యుద్ధం ఏం కాను?"

"లంకలో యుద్ధం ఒక ఘట్టానికి వచ్చింది. అనురాధపురాన్ని కైవసం చేసుకోవడమైంది. ఇక అక్కడ వానాకాలం. ఇక నాలుగు నెలలు అక్కడ ఏమీ చేసేందుకు సాధ్యంకాదు. పట్టుబడ్డ స్థలాన్ని వదులుకోకుండా కాపాడుకొంటే చాలు. దీన్నితక్కిన దళపతులు చూసుకొంటారు. అరుళ్మొళి ఈ సమయంలో ఇక్కడ ఉండడం అత్యవశ్యం. కరికాలా! నిజాన్ని మూసి ఉంచడంలో ప్రయోజనమేమి? విజయాలయ చోళుని వంశానికి, ఆయన స్థాపించిన చోళ సామ్రాజ్యానికి పెద్ద ఆపద కలగబోతోంది. నీవు,

నీదగ్గరివారు ఒక్కచోట చేరి బహుజాగ్రతతో ఉండాలి. మన బలగాలన్నిటిని కూడ సేకరించి ఉంచాలి. ఎప్పుడు ఎలాంటి అపాయం వస్తుందో చెప్పలేము..."

"తాతా! ఇదేమి ఇలా నన్ను భయపెడుతున్నారు? నాచేత కత్తి ఉన్నవరకు నాకేమి భయం? ఎలాంటి అపాయం వస్తేనేమి? ఒంటరిగా నిలబడి ఎదుర్కొంటాను. ఎలాంటి అపాయానికీ నేను భయపడే వాడిని కాను..."

"బిడ్డా! నీవెలాంటి ధైర్యశాలివని నాకు చెప్పాలా? కానీ తిరువళ్ళువర్ పెరుమాన్ చెప్పినదాన్ని ఒక్కొక్కసారి ఎంచి చూడాలి:

<< ఎప్పుడు ధైర్యం అవసరం, ఎప్పుడు భయం అవసరం అన్న విషయం గురించిన ఒక మహత్తరమైన సూక్తి >>

అని ఆ మహానుభావుడన్నాడు. యుద్ధరంగంలో పగవారికి ఎదురు నిలబడి పోరాడేటప్పుడు భయం కూడదు. అలా భయపడే వాడు పిరికివాడు. అటువంటి పిల్లవాడు నా వంశంలో పుడితే వాడిని నేనే నాచేత్తో నరికేస్తాను. కానీ, కంటికి కనిపించక మరుగ్గా నడిచే కుట్రలకు తప్పక భయపడాలి. భయపడి, ఆయా పరిస్థితులకు తగిన ముందు జాగ్రతలు తీసుకోవాలి. రాజవంశంలో పుట్టి, సింహాసనానికి అర్హులైనవారు ఈ విషయంలో అజాగ్రతగా ఉండకూడదు. ఉంటే దేశానికే ముప్పు కలుగుతుంది."

"తాతా! అలా ఏం రహస్య అపాయాలను మీరెదురు చూస్తున్నారు? కాస్త విశదంగా చెబితేనే మేము జాగ్రతగా ఉండేందుకు సాధ్యమౌతుంది.."

"అదే చెప్పబోతున్నాను. కొన్నిరోజులకు మునుపు కడంబూర్ శంబువరయ్యర్ మాళిగలో అర్ధరాత్రి ఒక సమావేశం జరిగింది. దానికి పెద్ద పళువేట్టరయ్యర్ వచ్చారు. ఇంకా అనేకమంది ప్రముఖులు (దక్షిణపు మళవరాయర్, కుండ్రత్తూర్ కిళార్, వణంగాముడి ముణైయరయ్యర్, ....) వచ్చి చేరారు. నాచెవికి చేరినవి ఈ పేర్లు మాత్రమే. వేరే పలువురు వచ్చివుండవచ్చు..."

"వచ్చి ఉండనీ; అందువల్ల ఏమిప్పుడు? అందరూ అర్ధరాత్రిదాకా ఆటలు, పాటలు చూసి, కడుపునిండా తిని, దానిపైన బాగా కల్లుతాగి నిద్రపోయివుంటారు. అందుగురించి మనకేమి? మీరు చెప్పిన తలనెరిసిన ముసలివాళ్లంతా చేరి ఏం పెద్ద సాధించివుంటారు?"

"ముసలివాళ్ళ గురించి నీకింత మంచి అభిప్రాయం ఉన్నప్పుడు నేనేం చెప్పి ఏం ప్రయోజనం? నేనూ ముసలివాణ్ణే కద? వారందరి కన్న పండు ముసలిని...!"

"తాతా! కోపం వద్దు. ఆ చేతగాని ముసలివాళ్ళతో మిమ్మల్ని నేను చేరుస్తానా? సరే, తర్వాతేం జరిగింది, చెప్పండి!"

"చేతగాని ముసలివాళ్ళని మళ్లీ చెబుతున్నావు! వారి నాయకుడైన ముసలివాడు కొన్నిరోజులకు మునుపే పెళ్ళిచేసుకొన్నాడన్న విషయం మరిచిపోకు! లేతవయసులో వున్న అమ్మాయిని పెళ్ళాడిన ముసలివాడి కన్న లోకంలో అపాయకరమైన యువకుడు ఇంకెవరూ లేరని తెలుసుకో!"

-:-

ముసలాడి పెళ్ళి గురించిన ప్రస్తావన వచ్చిన వెంటనే ఆదిత్యుని ముఖంలో ఒక విచిత్రమైన మార్పు వచ్చింది. అతని కళ్ళు ఎర్రబారి రక్తం బలిగోరే క్షాత్రదేవత కళ్ళలాగ కన్పించాయి. పెదవులు వణికాయి. పళ్ళు కరకరమని కొరికాయి.

ఇదంతా మలైయమాన్ గమనించలేదు; కానీ పార్థిబేంద్రుడు గమనించాడు.

"ఆ పెళ్ళి సంగతి ఇప్పుడెందుకయ్యా! శంబువరయ్యర్ అంతఃపురంలో తర్వాత ఏం జరిగిందో చెప్పండి!" అన్నాడా పల్లవ వీరుడు.

"దాన్నే చెప్పొచ్చాను. కానీ వయసైపోయింది కద? బుద్ధి తడబడి ఎక్కడికో వెళ్ళిపోతున్నాను. విను, కరికాలా! పార్థిబేంద్రా, నీవూ వినుకో! ఆ నడిరేయి కూటమి ముసలాళ్ళ కూటమి మాత్రమే కాదు. కొందరు యువకులు కూడ అందులో ఉన్నారు. అందులో ఒకడు శంబువరయ్యర్ కొడుకు గందమారన్. ఇంకొకడు..." అని చెప్పి ఆపడం చూసి, "ఎవరు తాతా? ఇంకొకడెవడు?" అని కరికాలన్ గుచ్చి అడిగాడు.

"నీ పెదతాత గండరాదిత్యుని ముద్దుల కొడుకు, - నీ చిన్నాన్న – మధురాంతకుడే!"

ఇది వినగానే ఆదిత్య కరికాలన్, పార్థిబేంద్రుడు గలగలా నవ్వారు.

"ఇదేం నవ్వులు? ఈ నవ్వుకు అర్థమేమి? మళ్ళీ నన్ను పరిహాసిస్తున్నారా?" అని అడిగారు మిలాడుదురై.

"లేదు, తాతా! లేదు! మధురాంతకుని మీరు 'యువకుడు' అన్నారు కద? అందుకే నవ్వాం. వాడు ముసలాళ్లలో పండు ముసలి కద? పండిన శివజ్ఞాన ముసలి కద?" అన్నాడు ఆదిత్య కరికాలన్.

"ముసలికి ఒక్కో సమయం యవ్వనం తిరిగొస్తుందని నీవు వినివున్నావు కద? అలాగే మధురాంతకునికి యవ్వనం మళ్ళీ వచ్చింది. కొన్నిరోజుల మునుపటివరకు ,'సన్యాసినైపోబోతున్నాను; శివకైంకర్యం చేయబోతున్నాను' అని చెబుతున్నవాడు, ఒకటి, రెండు, మూడు పెళ్ళిళ్ళు చేసుకొంటున్నాడు కద...."

"చేసుకోనీ; ఇంకా పెళ్ళిళ్ళు చేసుకోనీ; దానివల్లనేమి?"

"తమ్ముడూ! మధురాంతకుని పెళ్ళిళ్ళు సాధారణ పెళ్ళిళ్ళు కావు. రాజకీయ పెళ్ళిళ్ళు.

పళువేట్టరయ్యర్ల అంతరంగ ఉద్దేశానికి సంబంధించిన పెళ్ళిళ్ళు....!"

"తాతా! ఇంకా ఎందుకు మర్మంగా మాట్లాడుతున్నారు? విడమరిచి చెప్పండి! పళువేట్టరయ్యర్లు ఏం కోరుతున్నారు? ఊరూరూ వెళ్ళి వాళ్ళు రహస్య సమావేశాలు జరపడంలో వారి ఉద్దేశమేమి? మధురాంతకుని ముందుంచుకొని ఏం చేయజూస్తున్నారు?" అని అడిగాడు ఆదిత్యుడు.

"ఇంకేమీ లేదు; నీకూ, నీ తమ్ముడికీ రాజ్యార్హత లేకుండా చేసి, మధురాంతకుని చోళ సామ్రాజ్య సింహాసనంపైన ఎక్కించేందుకు ప్రయత్నిస్తున్నారు. అందుకు మీ తండ్రి సమ్మతాన్ని పొందడానికే వారిని తంజావూరు కోటలో చెరలో పెట్టినట్లు ఉంచారు!" అన్నారు మిలాడుదురై.

~~~
~~~

# అధ్యాయము - 53

## మలైయమాన్ ఆవేశం

వివేకంలాగనే బలమూ, బలంలాగనే అనుభవమూ పొంది ముదుసలి ప్రాయం చేరుకొన్న తిరుక్కోవలూర్ మలైయమాన్ చివరిగా చెప్పిన మాటను విని ఆదిత్యుడు మూర్ఛవచ్చి పడిపోలేదంతే! అయినా కాసేపు చేష్టలుడిగి స్తంభించి నిలిచిపోయాడు. పార్థిబేంద్రుడుకూడ అవాక్కై మౌనంగా నిలబడ్డాడు. కడలి సద్దుకూడ అణిగిపోయినట్లనిపించింది. దూరంగా ఓడలనుంచి సరుకులను దింపి కొయ్యపడవల్లో ఎక్కించే కళాసీల 'ఏలేలో' అన్న పాటలు కూడ అప్పుడు నిలిచిపోయినట్లనిపించింది.

ఆశ్చర్యానికి తావిచ్చినందుకు సిగ్గుపడ్డ ఆదిత్య కరికాలన్, చటుక్కున తాతగారి ముఖాన్ని చూసి, "ఇలా నగరాలలో, ఊళ్ళలో జనాలు చెప్పుకొంటున్నారని నాచెవినకూడ పడింది. అది ఒట్టి వదంతని ఇన్నాళ్ళు అనుకొన్నాను. మీరు ఇంత నిశ్చయంగా చెబుతున్నారే? తెలిసే చెబుతున్నారా? ఇలాగూ జరగవచ్చా?" అన్నాడు.

"ఎందుకు జరగ సాధ్యంకాదు? నీ తాతగారికి మునుపు నీ పెదతాత గండరాదిత్యులే కద చోళ సామ్రాజ్యాన్ని ఏలారు? వారి కుమారునికి ఈ రాజ్యంలో మీకన్న ఎక్కువ హక్కు ఉంది కద?" అన్నారు మలైయమాన్ మిలాడుదురై.

"లేనే లేదు! ఆ ఒట్టి వెధవ, నాలుగు మాటలు మాట్లాడ తెలియనివాడు, చేత కత్తి పట్టి ఎరగనివాడు, ఆడపిల్లగా పుట్టక, పొరబాటున మగవాడుగా పుట్టినవాడు - వాడికి ఈ రాజ్యంలో హక్కా? పన్నెండేళ్ళ ప్రాయంలోనే యుద్ధంలో పాల్గొన్నవాడు, వీరపాండ్యుని తలసాధించిన వాడు, ఓటమి అన్నదే తలియని వీరాధివీరుడు ఆదిత్య కరికాలునికి హక్కా? అయ్యా! మిలాడుదురై! వయసు మళ్ళినందువల్ల మీకు బుద్ధికూడ మందగించిపోయిందా?" అని ఎగతాళి చేశాడు పార్థిబేంద్రుడు.

అతన్ని కరికాలన్ గద్దించి నోరుమూయించి, "తాతా! నాకు ఈ రాజ్యమేం అంత ముఖ్యంకాదు. నాచేత కత్తి ఉన్నంత వరకు దీనికన్న పదిరెట్లు పెద్ద సామ్రాజ్యాన్ని సంపాదించుకోగలను. కానీ ఇందులో న్యాయం ఎలా? ముందే మధురాంతకునికే రాజ్యమని చెప్పి తీర్మానించివుంటే నేనడ్డుపడేవాడిని కాను. కానీ, లోకవిదితంగా నాకు యువరాజ పట్టాభిషేకం చేసి, తదుపరి రాజ్యార్హత నాదేనని చాటి చెప్పిన తర్వాత, ఇప్పుడు ఎలా మార్చవచ్చు? ఇది మీకు సమ్మతమేనా?" అని అడిగాడు.

"నాకది సమ్మతం కాదు; ఏనాడూ నేనందుకు సమ్మతించబోను. నీకు సమ్మతమని చెప్పి ఈ రాజ్యాన్ని మధురాంతకునికి అప్పజెబుతానంటే, ముందు నిన్ను ఈ కత్తితో ఖండఖండాలుగా నరికేస్తాను. తర్వాత నిన్ను పదినెలలు మోసి కన్న మీ అమ్మను నరికేస్తాను. తర్వాత మీ అమ్మను కన్నవాడినైన

నన్ను నేనే ఈ కత్తితోనే చంపేసుకొంటాను. నా బొందిలో ప్రాణం ఉన్నంతవరకు ఈ చోళసామ్రాజ్యం నిన్ను వదిలి పోనివ్వను!" అని ఆ వయోవృద్ధుడు గర్జించినప్పుడు, ఆయన మసకబారిన కళ్లలో మెరుపులు మెరిశాయి. ఆవేశంతో ఆయన ఒళ్ళు వణికింది.

పార్థిబేంద్రుడు, "అలా చెప్పండి, తాతా!" అని అంటూనే పరుగెత్తి వచ్చి ఆ వృద్ధవీరుని హత్తుకొన్నాడు. అప్పుడతని కళ్ళలో కన్నీరు పొంగింది.

-:-

కరికాలన్ కూడ కాసేపు సముద్రాన్ని చూస్తూండిపోయాడు. తర్వాత తాతగారిని చూసి, "తాతా! మీ ఉద్దేశం అదే అయితే, ఇక ఆలస్యమెందుకు? వెంటనే సైన్యాన్ని తీసుకొని తంజావూరుకు వెళాదాం. పళువేట్టరయ్యర్లను, ఇంకా వారితో చేరిన మళవరయ్యర్, శంబువరయ్యర్, ముత్తరయ్యర్, మున్నైయరయ్యర్ - అందరినీ ఒకేసారిగా తుడిచిపెట్టేసి, తంజావూరు కోటను కైవసం చేసుకొందాం. మధురాంతకుని చెరలో వేద్దాం. చక్రవర్తిని విడుదల చేద్దాం. మీ ఆశీర్వాదం మాకుంటే చాలు. నేను, పార్థిబేంద్రుడు ఒకటైతే మమ్మల్ని గెలవగలిగిన వారు ఈ భూమిపైన ఎవరున్నారు?" అని గర్వంగా అన్నాడు.

"మిమ్మల్ని పోరులో గెలవలేరు, నిజమే. కానీ కుతంత్రంతో, కుట్రతో ఎదిరిస్తే మీరేం చేస్తారు? దండుతో నీవు తంజావూరు సమీపిస్తుండగానే, 'తండ్రితో పోరాటానికి వస్తున్నాడు' అన్న వదంతి పుట్టిస్తారు! ఆ అవమానాన్ని తట్టుకోలేక చక్రవర్తి ప్రాణాలొదిలేస్తారని కూడ చెబుతారు. అది నమ్మే ప్రజలుకూడ ఉండవచ్చు కదా? ఆ పరిస్థితిలో నీవు మాత్రం ఏం చేస్తావు, బిడ్డా? నీ మనస్సుకూడ కలతబారిపోతుంది! కన్నతండ్రితో యుద్ధానికి వచ్చాడన్న నిందను నీవు  తట్టుకోగలవా?"

కరికాలన్ తన చెవులను మూసుకొని, "శివ శివా! వినలేను!" అన్నాడు.

"అందుకే నేను ముందే చెప్పాను, మనకు పెద్ద అపాయం రాబోతోందని!"

"ఉపాయమేమి,  తాతా! ఉపాయమేమి?"

"మొదట లంకకు ఒక నమ్మకస్తుడైన మనిషిని పంపాలి. పంపి, అరుళ్మొళిని ఇక్కడికి రప్పించుకోవాలి. వాడు యుద్ధరంగాన్ని, తన కిందవున్న వీరులను విడిచి అంత సులభంగా రాడు. అతని మనసు మార్చి పిలుచుకొని రాగల శక్తివున్నవాడొకడిని పంపాలి..."

పార్థిబేంద్రుడు ముందుకు వచ్చి, "అయ్యా! మీరు అనుమతిస్తే నేనే వెళ్ళి తీసుకువస్తాను!" అన్నాడు.

"అది కరికాలన్ ఇష్టం, నీ ఇష్టం. కానీ, వెళ్ళేవాడు వంతిదేవునిలాగ సంబంధంలేని విషయాల్లో తలదూర్చకూడదు..."

"చూశారా? నేను చెప్పానుగా?" అన్నాడు పార్థిబేంద్రుడు.

"వంతిదేవుని గురించి మీకేమైనా సమాచారమందిందా, తాతా?" అని అడిగాడు ఆదిత్య కరికాలన్.

"వాడి గురించి నాకు మొదట కాస్త సందేహం ఉండేది - వాడుకూడ మన పగవారి పక్షం చేరిపోయాడా అని. తర్వాత ఆ సందేహం తీరిపోయింది."

"చూశావా, పార్థిబేంద్రా!" అన్నాడు కరికాలన్.

"ఆయన పూర్తిగా చెప్పనీ. అంతలో తొందరపడుతున్నారే! అయ్యా! వంతిదేవుని గురించి మీకేం సందేహం ఏర్పడింది?"

"శంబువరయ్యర్ మాళిగలో సమావేశం జరిగినప్పుడు వాడుకూడ అక్కడే వున్నాడని తెలుసుకొన్నాను. కానీ, కుట్రలో వాడికి సంబంధంలేదని తర్వాత తెలుసుకొన్నాను."

"తాతా! ఇదంతా మీకెలా తెలిసింది?"

"కడంబూర్ విందుకు నాకు ఆహ్వానం రాలేదు. అప్పుడే నాకు సందేహం వచ్చింది. తర్వా త, అక్కడికి వచ్చేసి తిరిగి ఊరికి వెళుతున్న కుండ్రత్తూర్ కిళారును దారిలో అటకాయించి చెరపట్టి నా కొండపైని కోటకు తీసుకువెళ్ళాను. ఆయన నుంచి ఆరోజు అక్కడ జరిగినవన్నీ తెలుసుకొన్నాను. వంతిదేవుడు శంబువరయ్యర్ కొడుకు గందమారన్ స్నేహితుడట...."

"అవును; మన సైన్యంలో వారిద్దరూ ఉన్నవారే కద? ఉత్తర పెన్న తీరంలో ఇద్దరూ కాపలా కాసారు. అప్పటినుంచి వారిద్దరు స్నేహితులైన విషయం నాకు తెలుసు...."

"ఎలాగో, వంతిదేవుడు ఆరోజు ఆ మాళిగలో ఉన్నాడు. వాడు కుట్రలో పాల్గొన్నాడా లేదా అని తెలుసుకోలేకపోయాను. తర్వాత దానికి ఒక దారి దొరికింది. తంజావూరు కోటలో గందమారన్ని వెన్నుపోటు పొడిచి తప్పించుకొని పారిపోయాడని తెలిసిన తర్వాత...."

"తాతా! అది నేనెన్నడూ నమ్మను. వంతిదేవుడు ఇంకేమి చేసినా చేయకపోయినా, వెన్నుపోటు పొడిచేటంతటి నీచుడు కాడు. అదీ స్నేహితుని వెన్నుపోటు పొడిచే ఛండాలుడు కాడు..."

"ఆ స్నేహితుడు తన యజమానుడికి వ్యతిరేకంగా కుట్రపన్నుతున్నాడని తెలియవస్తే? వీడినీ ఆ స్నేహతుడు ఆ కుట్రలోకి లాగేందుకు ప్రయత్నించి ఉంటే?..."

"ఎలావున్నా ముఖాముఖి నిలబడి పోరాడేవాడే కానీ వెన్నుపోటు పొడవడు!"

"నీకు నీస్నేహితుని పైన ఉన్న నమ్మకం చూసి ఆశ్చర్యపడుతున్నాను, తమ్ముడూ! నిజమేదైనా ఉండనీ. గందమారన్ని వెన్నుపోటు పొడిచాడన్న నిందను వాడిపైన మోపి వాడిని

పేటాడుతున్నారు. ఇంతే నాకు తెలిసింది. కాబట్టి వంతిదేవునికి గందమారన్‌కి మధ్య జగడమైందని, వంతిదేవుడు ఆ కుట్రలో పాల్గొనలేదని తెలియవస్తోంది కద?"

"అందుకు ఇంతదూరం సాక్ష్యం వెతకనవసరంలేదు. వంతిదేవుడు మన శత్రువులతో చేరితే ఈ భూమి తలకిందులైపోతుంది. సముద్రం ఎండిపోతుంది. ఆకాశం విరిగి పడుతుంది. సూర్యుడు రాత్రి ఉదయిస్తాడు. చోళ వంశం సర్వ నాశనమైపోతుంది...." అని ఆదిత్య కరికాలన్ ఉద్వేగంతో అన్నాడు.

"యువరాజు చెప్పేది నేనూ ఒప్పుకొంటాను. వంతిదేవుడు ఏనాడూ మనకు ద్రోహంచేసి మన శత్రువుల పక్షం చేరడు. వాడిగురించి నేను చెప్పే నింద ఒకే ఒక్కటే - అందమైన అమ్మాయి కనిపిస్తే ఆ అమ్మాయి మైకంలో పడిపోతాడు!"

ఇది విన్న ఆదిత్య కరికాలన్ చిరునవ్వు నవ్వి, "అది తెలిసే కద చక్రవర్తికి తాళపత్రం ఇచ్చేసి, యువ రాకుమారిని వెళ్ళి చూడమని చెప్పాను. రాకుమారిని ఒకసారి చూసిన తర్వాత ఇంకేముంది? ఆమెకు బానిసై ఉండాల్సిందే కద?" అన్నాడు.

వెంటనే మలైయమాన్ మిలాడుదుర్రై, "ఓహో! అదా సంగతి? వంతిదేవునికి నీవలా చెప్పి పంపించావని నాకు తెలియనే లేదు! వంతిదేవుడు తంజావూరు వదిలి బయలుదేరిన తర్వాత ఏదైనా సమాచారమందిందా? రాకుమారి నుంచి ఏదైనా సమాచారం అందిందా?" అని అడిగారు.

"ప్రతినిమిషమూ ఎదురుచూస్తున్నాను. ఇంతవరకు ఏమీ అందలేదు..."

"అరుళ్మొళి ఇక్కడికి వచ్చిన తర్వాత నీ సహోదరిని కూడ ఇక్కడికి రప్పించుకోవాల్సిందే. తర్వాత మనకే దిగులూ ఉండదు. రాకుమారికి మంత్రాలోచన అంతా అప్పజెప్పేసి ఆమె ఎలా చెబితే అలా నడుచుకొంటే చాలు..."

"తాతా! ఈ విషయంలో మీరు నాకన్న అధ్వానంగా ఉన్నారే!"

"అవును, కరికాలా! నీ చెల్లెలు రెండేళ్ల ప్రాయంనుంచి చేత బడిత పుచ్చుకొని నన్ను, నీ నానమ్మను, తన తలిదండ్రులను తన ఇష్టం వచ్చినట్లు ఆట పట్టించ మొదలెట్టింది. ఇప్పుడు నా విషయంలో అంతే. ఆమె వేసిందే నాకు శాసనం. కరికాలా! నీకు నీ సహోదరిగురించి చెబితే దాన్ని కొరతగా తీసుకోకు. అది నీకు గర్వకారణమేగాని ఇంకేమీ కాదు. రాకుమారి కుందవై వంటి వివేకవంతులు, బుద్ధిశాలురు స్త్రీలలో గాని, పురుషులలో గాని ఇదివరకు పుట్టలేదు. మన ముఖ్యమంత్రి అనిరుద్ధ బ్రహ్మరాయలు ఎటువంటి వారో నీకు తెలుసు కద? ఆయనే రాకుమారిని సలహా అడుగుతారంటే ఇంకేం కావాలి?" అని మలైయమాన్ మహాపరవశంతో మాట్లాడారు.

వంతిదేవునిపైన అసూయగొన్న పార్థిబేంద్రుడు, "అదంతా సరే; ఎవరు కాదన్నారు? కానీ, ఒకవేళ వంతిదేవుడు రాకుమారిని చూసేందుకు ముందు ఇంకొక అందమైన అమ్మాయిని చూసి మతి

పోగుట్టుకొని ఉంటే? ఉదాహరణకు, పళువూర్ యువరాణి అనబడే ఆ మోహినిని చూసి ఉంటే?...." అన్నాడు. చివరి మాటలను అతను కాస్త మెల్లగా చెప్పడంతో పెద్దాయన చెవిలో అవి పడలేదు. కానీ, ఆదిత్య కరికాలన్ చెవిన పడ్డాయి. చటుక్కున తిరిగి, నిప్పులుగక్కే కళ్ళతో పార్థిబేంద్రుని చూశాడు. ఆ చూపులు ఆ పల్లవ వీరుని దహించాయి.

మలైయమాన్ బండపైనుంచి లేచి నిలబడి, "పార్థిబేంద్రా! నీవు రేపే లంకకు బయలుదేరుతున్నావు కద? యువకులైన మీకు మాట్లాడేందుకు ఎన్నో ఉంటాయి. నేను ముసలివాడిని. మెల్లగా వెళ్ళి అంతఃపురం చేరుతాను. మీరు మాట్లాడవలసిందంతా మాట్లాడేసి నిదానంగా తిరిగి వచ్చి చేరండి!" అన్నారు.

ఆయన కాస్తదూరం వెళ్ళిన తర్వాత పార్థిబేంద్రుడు ఆదిత్యుని చూసి, "రాజా! మీ మనసు ఏదో సంకట స్థితిలో చిక్కుకొన్నట్లుంది. ఏదో ఒక వేదన మీ మనస్సును దహించేస్తోంది. అది పళువూర్ యువరాణికి సంబంధించినదని నేనెరుగుదును. పెద్ద పళువేట్టరయ్యర్ పెళ్ళి గురించిన ప్రస్తావన వచ్చినప్పుడల్లా మీ ముఖ కవళికలే మారిపోతున్నాయి. మీ కళ్ళు ఎర్రబారి నిప్పులు కక్కుతున్నాయి. ఎంతకాలం ఈ వేదనను మనసులో పెట్టుకొని వేగిపోబోతున్నారు? నన్ను మీరు తమ ప్రాణస్నేహితులని ఎన్నోసార్లు చెప్పారు. అటువంటి స్నేహితుని దగ్గర మనసు విప్పి మాట్లాడకూడదా? మీ వేదన ఇదీ అని చెప్పకూడదా? పరిహారం ఏదైనా కనిపెట్టి చెప్పేందుకు నాకొక అవకాశం ఇవ్వకూడదా? మీరిలా వేదనతో కుంగి వేగిపోవడాన్ని నేనెన్నిరోజులు చూస్తూ ఊరకుండగలను?" అని ఆపుకోలేని ఉద్వేగంతో అన్నాడు.

ఆదిత్య కరికాలన్ పెద్దగా నిట్టూర్చి, "మిత్రమా! నా మనోవేదన ఎన్నటికీ తీరనిది. నా ఊపిరితోనే పోవాలది. అందుకు పరిహారమే లేదు. కానీ నీకు చెప్పకూడనిది కాదు. ఈ రాత్రి చెబుతాను. ఇప్పుడు తాతగారితో అంతఃపురానికి వెళదాము. ఆయనను ఒంటరిగా వెళ్ళనివ్వడం ఉచితం కాదు!" అని చెప్పి బండపైనుంచి లేచాడు.

~~~
~~~

# అధ్యాయము - 54

## విషంకన్న చెడ్డది

**మామల్లపురపు** పాత పల్లవ చక్రవర్తుల అంతఃపురాలలో ఒకదానిలో ఆ ముగ్గురు వీరశిఖామణులు ఆ రాత్రి విడిది చేశారు. రాత్రి భోజనం చేసిన తర్వాత, పంచరధాలున్నచోట ఇరవాన్ కథ జరుగుతోందని విన్న మలైయమాన్ అక్కడికి వెళ్ళారు. ఆదిత్యుడు, పార్థిబేంద్రుడు మాళిగ మేడ డాబా పైకి వెళ్ళి కూర్చొన్నారు.

మేడమైనుంచి ఆదిత్య కరికాలన్ మామల్లపురపు రాత్రి రూపాన్ని కాసేపలా చూస్తూండిపోయాడు. అక్కడక్కడా మిణుకు మిణుకుమని దీపాలు మసగ్గా వెలుగుతున్నాయి. వీధులన్నీ ఇంచుమించు నిశ్శబ్దంగా ఉన్నాయి. గుళ్ళలో అర్ధజాము పూజ ముగించి ముఖద్వారాలను మూస్తున్నారు. సముద్రఘోష 'ఓ'అని వినవస్తోంది. పంచరధాల పక్కన విల్లుపాట విద్వాన్ తన గోష్టితో ఇరవాన్ కథ చెప్పగా, వారి చుట్టూ గుమిగూడిన ప్రజలు దివిటీల వెలుతురులో క్రీనీడల్లాగ కనిపిస్తున్నారు.

"ఈ పండిన వయసులో కూడ తాతగారు కథ వినేందుకు వెళ్ళారు, చూడు! ఏమైనా ఆ కాలపు మనుషులే మనుషులు! వారి దేహశక్తి, మనోధైర్యమూ ఈ కాలంలో ఎవరికుంది?" అన్నాడు ఆదిత్య కరికాలన్.

"రాజా! మీరు కూడ పాతకాలపు మనుషుల గొప్పలు పొగడనారంభించేశారా? ఆ కాలపు మనుషులు సాధించిన ఏ కార్యాన్ని ఇప్పుడు మనం సాధించలేదు? మీలాగ యుద్ధరంగంలో అతిచిన్నవయసులోనే అద్భుత వీరకృత్యాలు చేసినవారు కథలు కావ్యాల్లో తప్ప నిజజీవితంలో కనిపించరే?" అన్నాడు పార్థిబేంద్రుడు.

"పార్థిబా! నీవు నిజమైన మనస్సుగలవాడివి. మనసులో ఒకటుంచుకొని బయటికి ఇంకొకటి చెప్పే స్వభావం కాదు నీదని నేనెరుగుదును. లేదంటే నీవు నా స్నేహితుడివేకాదు- బద్ధశత్రువనే భావిస్తాను. ఇంతగా నన్ను ముఖస్తుతి చేస్తున్నావు. ముఖస్తుతివంటి పాతాళానికి తొక్కేయగలది ఇంకొకటి లేదు!" అన్నాడు ఆదిత్య కరికాలన్.

"అయ్యా! స్వార్థంకోసం ఒకరిని గురించి లేని గొప్పలు కల్పించి చెబితే అది ముఖస్తుతి. తంజావూరులో పళువేట్టరయ్యర్లకు బానిసగా ఉన్నాడే, ఆ మధురాంతకుడు, వాడి దగ్గరకు వెళ్ళి, 'నీవు వీరాధివీరుడివి' అని నేను పొగిడితే అది ముఖస్తుతి అవుతుంది. అలా నేనెప్పుడైనా చేసినట్లు మీకు తెలిసివస్తే, మీచేత ఉన్న కత్తితో చంపేయండి. మీగురించి నేను చెప్పినదాంట్లో అతిశయమేమీ లేదే? పాతకాలంలో ఎవరు ఇంత చిన్న వయసులో ఇంతింత పెద్ద కార్యాలు సాధించివున్నారు? మీ పెద్ద

తాతగారైన రాజాదిత్యులను కావాలంటే మీకు సాటి అని చెప్పవచ్చు. మీకన్న గొప్పవారని ఆయనను కూడ చెప్పలేము..."

"ఆపు, పార్థిబా! ఆపు! రాజాదిత్యులెక్కడ? నేనెక్కడ? మహాసముద్రంలాగ పొంగివచ్చిన రాష్ట్రకూట సైన్యాన్ని ఒక చిన్న దండుతో ఎదిరించి పోరాడి నిర్మూలం చేసి, వీరస్వర్గం చేరిన ఆ మహావీరుని గురించి మాట్లాడేందుకు కూడ మనం అనర్హులం. ఆయనతో మనల్ని పోల్చుకోవడమా? చోళవంశం ఉండనీ; నీవు పుట్టిన పల్లవ వంశంలో ఎటువంటి మహాపురుషులు పుట్టారు? మహేంద్ర వర్మ, మహామల్లు వంటి వీరులను ఈ తమిళనాడులో మళ్ళీ చూడటోతామా? దక్షిణాన తుంగభద్రనుంచి ఉత్తరాన నర్మద వరకు ఏకఛత్రంకింద ఏలిన పులకేశిని జయించి, వాతాపిని భూమట్టం చేసిన నరసింహవర్మ ఎక్కడ? నీవూ, నేనూ ఎక్కడ? ఈ మామల్లపురం వంటి స్వప్నపురిని మనకాలంలోగాని, మన తర్వాతి కాలంలోగాని ఎవరైనా సృష్టించగలరా? ఆహా! ఒక్కసారి నలువైపులా బాగా చూడు పార్థిబా! అదిగో, ఆ విల్లుపాట (హరికథలాంటిది) జరుగుతున్నవైపు చూడు! రాళ్లను తొలిచి అటువంటి అద్భుత రథాలను మలిచిన ఆ శిల్పులు సాధారణ మనుషులా? మూడువందల యాభై ఏళ్లకు మునుపు ఈ మామల్లపురం ఎంత కోలాహలంగా, సందడిగా ఉండేదో తలుచుకొంటేనే నా ఒళ్ళు పులకరిస్తోంది! నీకటువంటి అనుభూతి కలగడం లేదా? నీ పూర్వీకులను గురించి తలుచుకొన్నప్పుడు నీ ఎద పొంగడంలేదా?..."

"రాజా! కాసేపటికి మునుపు నేను మిమ్మల్ని ముఖస్తుతి చేస్తున్నట్లు చెప్పారే? కొన్నిసార్లు మీలోని లోపాలను కూడ ఎత్తి చూపిస్తాననే విషయాన్ని మరిచారు. శిల్పం - చిత్రం - కళ – వీటి పిచ్చి మిమ్మల్నికూడ పట్టుకొన్నట్లుంది. ఈ పిచ్చి పట్టినందువల్లే మా పూర్వీకులు సాధించిన విజయాలను వృధాగా పోగుట్టుకొన్నారు. మామల్లు వాతాపిని జయించి విజయపతాకం నాటి తిరిగి వచ్చారు కద? వచ్చి ఏం చేశారు? రాళ్లను చెక్కుతూ, బండలను తొలుస్తూ కూర్చొన్నారు. దాని ఫలితమేమి? కొంత కాలానికల్లా చాళుక్యులు తలెత్తసాగారు. మరింత పెద్ద సైన్యంతో పగ తీర్చుకోవడానికి దండెత్తివచ్చారు. కంచిని, ఉరైయూరును తుడిచిపెట్టేశారు. మదురైవరకు వెళ్ళారు. అప్రమత్తుడైన పాండ్యరాజు నెయ్వేలిలో చాళుక్యుల సైన్యాన్ని అడ్డగించి ఓడించివుండకపోతే ఈనాడు ఈ దక్షిణదేశమంతా చాళుక్యుల పాలనకింద ఉండేది కద?"

"లేదు, పార్థిబా, లేదు! చరిత్రలో ఏ రాజవంశమూ చిరస్థాయిగా ఏలినట్లు మనం వినలేదు. రాముడు పుట్టిన ఇక్ష్వాకువంశం కూడ చివరికి అంతరించింది. చాళుక్యులను పడగొట్టేందుకు రెట్టిమండలపు రాజులు కానవచ్చారు. రాజ్యాలు కొంతకాలం ఉన్నత స్థితిలో ఉండి ఆ తర్వాత అధోస్థితికి జారిపోవడం సహజం. కొన్నిరాజ్యాలు కొంతకాలం మహోన్నత స్థితిలో వెలుగొంది ఉన్నట్లుండి ఉన్నచోటు తెలియనట్లు మటుమాయమైపోతున్నాయి. నా పూర్వీకులను చూడు! కరికాల్ వళవన్, కిల్లివలవన్ మొదలైన చోళ రాజులు ఎంత గొప్పగా వెలుగొందారు? వారి గురించి మనకిప్పుడేం తెలుసు? కవులు వారిని పొగిడి

పాడినందువల్ల వారి పేరైనా మనమిప్పుడు తెలుసుకొనివున్నాము. కవులు నిజాన్నే పాడారో, లేక బాగా మధుపానం చేసి నోటికొచ్చినట్లు పాడారో ఎవరికి తెలుసు? కానీ మహేంద్ర పల్లవుడు, మామల్లు ఈ అద్భుత  శిల్పాలను సృష్టించారే, ఇవి వేవేల సంవత్సరాలు ప్రపంచానికి వారి కీర్తిప్రతిష్ఠలను గొప్పతనాన్ని ఎలుగెత్తి చాటుతుంటాయి. వారు చేసిన కార్యాలకు సాటిగా నీవు, నేనూ ఏమి సాధించాము? రక్తపుటేర్లు పారేటట్లు చేశాం. లోకంలో మన పేరు నిలిచేందుకు ఇంకేం చేశాం?"

ఇది విన్న పార్థిబేంద్రుడు ఇలా మాట్లాడుతున్నది అదిత్య కరికాలనేనా అని ఆశ్చర్యంతో మాటలుడిగి కాసేపలా నిలుచుండిపోయాడు. తర్వాత పెద్దగా నిట్టూర్చి, "రాజా! పోరుగురించి, వీరత్వం గురించి మీరే ఇలా మాట్లాడుతున్నారంటే నేనేం చెప్పగలను? ఈ రోజు మీ మనసు బాగా లేదు. అందుకే ఇలా మాట్లాడుతున్నారు! అయ్యా! తమ మనసులో ఉన్న వేదనను ఈ రోజైనా నాకు విప్పి చెప్పకూడదా?" అని ఆసక్తితో అన్నాడు.

"పార్థిబా! నా గుండె చీల్చి తెరిస్తే, అందులో ఎవరుంటారని భావిస్తున్నావు?"

"అదే తెలుసుకోగోరుతున్నాను, స్వామీ!"

"నన్ను కన్న తలిదండ్రులు ఉండరు. నా ప్రాణానికి మించిన చెల్లెలు, తమ్ముడు ఉండరు. నా ప్రాణానికి ప్రాణమైన స్నేహితులైన నీవు, వంతిదేవుడు ఉండరు. వంచనే రూపమెత్తిన ఒక స్త్రీ ఉంటుంది. పాపానికి మారుపేరైన పళువూర్ యువరాణి అందులో ఉంటుంది. విషంకన్న క్రూరమైన నందిని నా హృదయంలో చేరి వేధిస్తుండగా నేను పడుతున్న పాట్లను ఇంతవరకు ఎవరికీ నోరు విప్పి చెప్పుకోలేదు. నీ దగ్గరే ఇప్పుడు చెబుతున్నాను!" అని ఆదిత్య కరికాలన్ అన్న మాటల్లో అగ్నిజ్వాలలు వీచాయి.

"రాజా! అది ఒకింతవరకు నేనూహించాను. పళువూర్ యువరాణి ప్రస్తావన వచ్చినపుడల్లా మీ ముఖం నల్లబారి, కళ్ళు ఎర్రబారి, నోటితో చెప్పలేని మనోవేదనను వెలిబుచ్చగా నేనది గ్రహించాను. కానీ ఈ తగని మోహం మీ మనసులో ఎలా చోటుచేసుకొంది? అన్యస్త్రీలను మాతృసమానులుగా ఎంచే సంప్రదాయం నుంచి వచ్చినవారు కద మీరు? పళువేట్టరయ్యర్ మీ కులానికి చిరకాల బంధువు; వయసు మళ్ళినవారు. ఇప్పుడు ఆయన మీకు పగవారైనా, ఇంతకు ముందు అలా కాదుకద? మీ తండ్రి, తాతగారు ఆయనను ఎంత గౌరవ మర్యాదలతో చూసేవారు? అటువంటాయన అగ్ని సాక్షిగా పెళ్ళాడిన స్త్రీని ... ఆమె ఎంత చెడ్డదైనా ... మీరు ఊహామాత్రంగానైనా అటువంటి భావంతో ఎంచవచ్చా?"

"కూడదు, పార్థిబా, కూడదు! అది నాకు తెలియదనా అనుకొంటున్నావు? తెలిసినందువల్లనే ఈ మనోవేదన. ఆమె పళువేట్టరయ్యర్ని పెళ్ళాడిన తర్వాత నా మనసులో చోటుచేసుకోలేదు. అందుకు చాల కాలం మునుపే నా హృదయంలో ఆమె మోహవిషం ఎక్కేసింది. దాన్ని పెకలించి పారేసేందుకు ఎంతగానో ప్రయత్నించి విఫలుడనయ్యాను. తప్పంతా ఆమెదేనన్నట్లు మాట్లాడుతున్నాను. తప్పెవరిదో

దేవుడికెరుక. చూడబోతే, నిందంతా మమ్మల్ని సృష్టించిన ఆ దేవుడిపైనే పడుతుంది. లేదా మేము ఒకరినొకరు కలిసేటట్లు  చేసి తర్వాత విడదీసిన విధిపైన పడుతుంది!"

"రాజా! నందిని పళువూర్ యువరాణి కాక మునుపు మీరామెను కలిశారా? ఎక్కడ, ఎలా, ఎప్పుడు కలిశారు?"

"అది చాల పెద్ద కథ. దాన్ని ఈ రోజు వినగోరుతున్నావా?"

"తప్పక వినగోరుతున్నాను. అది తెలుసుకోకపోతే నాకు నెమ్మది ఉండదు. రేపు లంకకు నన్ను వెళ్ళమంటున్నారు కద? పరిస్థితి ఇదీ అని తెలుసుకొని, మిమ్మల్ని ఓదార్చి వెళ్ళకపోతే నా మనసుకు నెమ్మది ఉండదు, నేను వెళ్ళే కార్యాన్ని సరిగ్గా నెరవేర్చలేను!"

"మిత్రమా! నన్ను ఓదార్చబోతున్నావా? ఈ జన్మలో నాకు ఓదార్పనేది లేదు. వచ్చే జన్మలో ఉంటుందనేది కూడ సందేహమే. నేను నీకు చెప్పక ఏదో దాచిపెడుతున్నానన్న భావంతో నీవు లంకకు వెళ్ళనవసరం లేదు!"

ఇలా చెప్పి ఆదిత్య కరికాలన్ కాస్త నిదానించాడు. తర్వాత పెద్దగా నిట్టూర్చి, ఆ కథను చెప్పనారంభించాడు.

~~~
~~~

# అధ్యాయము - 55

## నందిని ప్రేమికుడు

“**నేను** నందినిని మొట్టమొదట నా పన్నెండో ఏట చూశాను. మా పళైయారై అంతఃపురపు వెనుకభాగంలో ఉన్న కొలనులో నేను, నాతమ్ముడు చెల్లెలు పడవ నడుపుతూ ఆటలాడుతున్నాము. ఆట ముగిసి పడవ దిగి పూలతోట మీదుగా అంతఃపురానికి వెళ్ళాము. దారిలో మా పెద్ద నానమ్మ శెంబియన్ మహాదేవి గొంతు వినిపించింది. మేము ముగ్గురమూ నానమ్మ ముద్దుబిడ్డలుగా పెరిగినవారము. ఆమెకు మేము పడవ నడిపిన విషయం చెప్పాలనిపించి ఆమె గొంతు వినిపించిన పూపొదరింట ప్రవేశించాము. అక్కడ పెద నానమ్మతోబాటు ఇంకా ముగ్గురున్నారు. అందులో ఒకతె మాలాంటి చిన్నప్రాయపు అమ్మాయి. తక్కిన ఇద్దరూ ఆమెను కన్నవారని  తెలిసింది. ఆ అమ్మాయి గురించి వారు మాదేవి దగ్గర ఏదో చెబుతుండడం వినిపించింది. మేము పూపొదరింట దూరిన వెంటనే వారందరూ మావైపు తిరిగచూశారు. కానీ ఆ చిన్నపిల్ల ఆశ్చర్యంతో విప్పారిన పెద్ద కళ్ళతో మమ్మల్ని చూసింది మాత్రమే నాకు కనిపించింది. ఆ దృశ్యం ఇప్పుడు తలుచుకొన్నా నా మనోనేత్రం ముందు సాక్షాత్కరిస్తుంది....”

ఇలా చెప్పి కరికాలన్ తలెత్తి ఆకాశాన్ని చూస్తూ మౌనంగా ఉండిపోయాడు. ఆకాశంలో అప్పుడు మెల్లగా కదులుతున్న మేఘాలమధ్య ఆ చిన్నపిల్ల ముఖం అతనికి కనిపించిందేమో తెలియదు.

“అయ్యా! తర్వాతేం జరిగింది?” అని పార్థిబేంద్రుడు అడగగా, కరికాలన్ ఈ లోకానికి తిరిగివచ్చి కథను ముందుకు చెప్పసాగాడు.

“నానమ్మ దగ్గర కొలనులో మేము పడవ ఆట ఆడిన విషయం నా చెల్లెలు కుందవైయే చెప్పింది. అది విన్న తర్వాత పెదనానమ్మ, “బంగారూ! ఈ చిన్నారిని చూశావా, ఎంత చురుగ్గా ఉందో? వీరు పాండ్యదేశంనుంచి ఈశాన్య భట్టుగారి ఇంటికి వచ్చివున్నారు. కొన్నాళ్ళు ఇక్కడే ఉంటారు. ఈ అమ్మాయి పేరు నందిని. ఈ అమ్మాయినీ మీతో ఆటల్లో చేర్చుకోండి. ఈమె నీకు మంచి చెలికత్తెగా ఉంటుంది!” అన్నారు. కానీ నా చెల్లెలుకు ఇది నచ్చలేదని నేను గ్రహించాను. మేము ముగ్గురం అంతఃపురానికి వెళ్ళిన తర్వాత కుందవై, “అన్నా! ఆ పిల్ల ఎంత అవలక్షణంగా ఉందో చూశావా? దాని ముఖం ఎందుకు గుడ్లగూబ ముఖంలాగుంది? దానితో నేను ఆటలాడాలంటుందే నానమ్మ? దాని ముఖం చూస్తే నేను నవ్వకుండా ఉండలేనే! ఏం చేయను?” అన్నది. ఇది వినగానే నాకు ఒక ముఖ్యమైన సత్యం తెలియవచ్చింది - ఆడవాళ్ళు పుట్టేటప్పుడే అసూయతో పుడతారని. ఒక ఆడది ఎంత అందంగా ఉన్నా, ఇంకొక ఆడది అందంగా ఉంటే చూసి సహించలేదు. మా కులంలో పుట్టిన స్త్రీలలో నా చెల్లెలి సౌందర్యం లోకాతీతమైనదన్న విషయం జగద్విదితం. ఆమెకూడ ఇంకొక స్త్రీ అందంగా ఉండడం చూసి

ఓర్వలేకపోయింది. లేకపోతే ఆ అమ్మాయి గురించి ఎందుకలా మాట్లాడాలి? నేను నా సహోదరని అంత సులభంగా వదిలిపెట్టలేదు. ఆమెకు కోపం తెప్పించాలనే ఉద్దేశంతోనే ఆ అమ్మాయి అందంగానే ఉందని ఘంటాపథంగా చెప్పాను. ఇద్దరమూ తరచూ ఇందుగురించి వివాదించుకొని కొట్లాడేవాళ్ళం. మా సహోదరుడు అరుళ్మొళి ఏమో ఈ జగడానికి కారణం తెలియక ఆశ్చర్యపడేవాడు. తర్వాత కొన్నాళ్ళకల్లా పాండ్యదేశంపైన ప్రారంభించిన యుద్ధానికి మా తండ్రితోబాటు నేనుకూడ బయలుదేరివెళ్ళాను. పాండ్యసైన్యాన్ని, వారికి సహాయంగా వచ్చిన లంకదేశపు రాజు పంపించిన సైన్యాన్ని చాల చోట్ల ఓడించాము. చివరికి వీరపాండ్యుడు పారిపోయి దాక్కొన్నాడా లేక యుద్ధరంగంలో చచ్చాడా అని తెలియలేదు. వీరపాండ్యుడు మరుగైన వెంటనే పాండ్య సైన్యానికి సహాయంగా వచ్చిన లంక సైన్యం వెనుదిరిగి పారిపోయారు. వారిని తరుముకొంటూ మేము సేతువు వరకు వెళ్ళాము. చచ్చినవారు చావగా మిగిలినవారు ఓడెక్కి తప్పించుకొని పారిపోయారు. తరచూ పాండ్యరాజులకు సహాయంగా సైన్యాన్ని పంపి ఇబ్బంది కలిగిస్తున్న లంకాధిపతులకు మా తండ్రి గుణపాఠం నేర్పదలుచుకొన్నారు. కొడుంబాళూర్ చిన్న వేళార్ నాయకత్వంలో ఒక పెద్ద సైన్యాన్ని లంకపైకి దండేత్తేందుకు పంపాలని తీర్మానించారు. అందుకు కావలసిన ఓడలను, సామగ్రిని సేకరించేందుకు కొంతకాలం పట్టింది. కానీ మేము అక్కడే నిలిచిఉండి ఓడల్లో సైన్యాలను ఎక్కించి పంపాము. మామిడితోటలో మన సైన్యాలు భద్రంగా వెళ్ళి దిగారని తెలిసిన పిదప అక్కడినుంచి చోళదేశానికి తిరిగాము.

-:-

మళ్ళీ నేను పళైయారైకి తిరిగి వచ్చేటప్పటికి రెండేళ్ళకు పైబడింది. మదురైనుంచి అప్పుడెప్పుడో వచ్చిన  అర్చకుల అమ్మాయిని నేను పూర్తిగా మరిచిపోయాను. పళైయారైకు వచ్చి చూసినప్పుడు నా చెల్లెలు, ఆ అమ్మాయి గుర్తుపట్టలేనంతగా పెరిగివుండడం గమనించాను. వారిద్దరు చాల స్నేహంగా మసలడం కూడ చూశాను. నందిని పెరగడమే గాక, వస్త్రాభరణాలతో వెలిగిపోతోంది. ఇది నా చెల్లెల పని అని తెలుసుకొన్నాను. మునుపటిలాగ కాక, ఇప్పుడు నందిని నన్ను చూసేందుకు, మాట్లాడేందుకు జంకింది. అది పోగొట్టడానికి నేను చాల కష్టపడ్డాను. ఆమెతో మాట్లాడుతుంటే ఇంకెందులోను పొందని హాయిని ఆనందాన్ని పొందేవాడిని. ఇది నాకు ఆ చిన్నప్రాయంలో ఎంతటి ఆశ్చర్యాన్ని కలిగించిందో చెప్పలేను. కావేరిలో పొంగివచ్చే కొత్తవెల్లువలాగ నాలో ఏవో కొత్త అనుభూతులు పొంగాయి. కానీ ఇది నావారికెవ్వరికీ నచ్చలేదని త్వరలోనే తెలుసుకొన్నాను. నేను వచ్చినప్పటినుంచి కుందవై ఆమెపైన చిరాకు కనబరచసాగింది. ఒకరోజు మా పెదనానమ్మ మాదేవి నన్ను పిలిచి, 'నందిని అర్చకుల పిల్ల. నీవేమో చక్రవర్తి కుమారుడివి. మీరిద్దరూ ఇప్పుడు ప్రాయానికి వచ్చేశారు. కాబట్టి ఇక నీవు నందినితో మసలడం ఉచితంకాదు.' అని బుద్ధి చెప్పారు. అప్పటివరకు పెద నానమ్మంటే ఎంతో గౌరవంతో చూసే నాకు ఆమెపై కోపం రావడమేగాక, ఆమె మాటలకు విలువివ్వాలనిపించలేదు. ఆమె మాటను మీరి

నందినితో మాటలాడసాగాను. ఇది చాల కాలం సాగలెదు. ఉన్నట్లుండి ఒకరోజు నందిని, ఆమె తలిదండ్రులు పాండ్యదేశంలోని వారి ఊరికి బయలుదేరి వెళ్ళిపోయారని తెలిసింది. అప్పుడు నాకు దుఃఖం పొంగుకొచ్చింది; నన్ను మీరిన కోపంకూడ పొంగుకొచ్చింది. దుఃఖాన్ని నా మనసులో అదిమిపెట్టుకొని, కోపాన్ని నా సహోదరిపైన చూపాను. అదృష్టవశాత్తు, కొన్నాళ్ళకల్లా నేను ఉత్తరనాడుకు బయలుదేరి వెళ్ళవలసి వచ్చింది. తిరిముణైప్పాడిని, తొండైమండలాన్ని ఆక్రమించివున్న రాష్ట్రకూటులను తరిమికొట్టడానికి బయలుదేరిన సైన్యంతో నేనూ బయలుదేరి వెళ్ళాను. అప్పుడే నీవు, నేనూ కలిశాము. విడదీయలేని స్నేహితులయ్యాము.

-:-

"మలైయమాన్ రాజుగారి సహాయంతో నీవూ, నేనూ రాష్ట్రకూటులతో పోరాడి, వారిని తరిమికొట్టి కంచి నగరాన్నికూడ మళ్ళీ కైవసం చేసుకొన్నాము.అప్పుడు లంకనుంచి ఒక దుర్వార్త వచ్చింది. మన సైన్యం అక్కడ నాశనమైపోయిందనీ, కొడుంబాళూర్ చిన్నవేళార్ మరణించారని తెలిసింది. అది విని, అప్పటివరకు ఎడారిలో గుహలో దాక్కొనివున్న వీర పాండియన్, పుట్టనుంచి బయటికి వచ్చే పాములాగ బయటపడి వచ్చాడు. మళ్ళీ సైన్యాన్ని సేకరించుకొని, మదురైని కైవసం చేసుకొని చేపజెండాను ఎగరవేశాడు. ఇదంతా విన్నప్పుడు నీకూ, నాకూ ఎటువంటి వీరావేశం పొంగుకొచ్చిందో జ్ఞాపకం ఉందికద? మనమిద్దరం వెంటనే బయలుదేరి పళైయారైకు వెళ్ళాము. నాతండ్రి చక్రవర్తికి అప్పుడే అనారోగ్యం మొదలైంది. రెండు కాళ్లలోను స్వాధీనం కోల్పోయారు. కానీ పాండ్యదేశంపైన దండెత్తివెళ్ళేందుకు సిద్ధమన్నారు. నేనే వద్దని అడ్డగించాను. పాండ్యసైన్యాన్ని తుడిచిపెట్టి, మదురైని మళ్ళీ చేబట్టి, వీర పాండియన్ తలను చేబట్టేంతవరకు చోళదేశానికి తిరిగి రానని నా తండ్రిముందు ప్రతిజ్ఞ చేశాను. అప్పుడు నీవూ నాతో ఉన్నావు. నా ప్రతిజ్ఞను ఒప్పుకొని నా తండ్రి మనను యుద్ధరంగానికి పంపారు. అప్పటికే సైన్యాధిపతిగా ఉన్న కొడుంబాళూర్ బూది విక్రమకేసరి నాయకత్వం కింద మనం పోరాడాలని ఆజ్ఞాపించారు. మనం అందుకు సమ్మతించి వెళ్ళాము. దారిలో పెద్ద పళువేట్టరయ్యర్ని కలిశాము. ఆయనను సైన్యాధిపతిగా చేయక కొడుంబాళూర్ విక్రమకేసరిని చేయడం ఆయనకు అసంతృప్తి కలిగించిందని తెలుసుకొన్నాము.

"మన యుద్ధావేశాన్ని చూసి, సేనాధిపతి బూది విక్రమకేసరి యుద్ధం నడిపే బాధ్యతను మనకే అప్పజెప్పేశారు. మిత్రమా! ఆ యుద్ధంలో నీవూ, నేనూ నమ్మలేని వీరకృత్యాలను సాధించామని చెప్పుకోవడంలో తప్పులేదు. పాండ్యసైన్యాన్ని నాశనంచేసి మదురైని చేబట్టాము. అంతటితో మనం తృప్తిపడలేదు. మళ్ళీ పాండ్యసైన్యం తలెత్తలేనట్లు దాన్ని నిర్మూలించాలనుకొన్నాము. చెదరి పారిపోయిన వీరులను ఒక్కరినికూడ వదిలిపెట్టక నాశనం చేయమని మన వీరులను ఆజ్ఞాపించాము. మనమిద్దరం మాత్రం ఒక బలమైన దండును వెంటతీసుకొని వీర పాండ్యుని తరుముకొని వెళ్ళాము. ఎత్తైన చేపజెండా వీర

పాండియన్ ఏవైపు పారిపోతున్నాడో మనకు ఎత్తిచూపింది. ఆ దిశగా మనమూ వెళ్ళి వీర పాండ్యుని పట్టుకొన్నాము (అని అనుకొన్నాము). వీర పాండ్యుని చుట్టూ అతని ఆపత్కాల వీరులు కోటగోడలాగ నిలబడ్డారు. చోళదేశపు వేళక్కార దండుకన్న ఒకెత్తు మేలైన వీరులు వారు. వెనుదిరిగి పారిపోమని, ప్రాణాలొడ్డైనా తమ రాజును కాపాడుతామని ప్రతిజ్ఞ చేసినవారు. అది సాధ్యంకాక, పాండ్యరాజుకు ఆపద వస్తే, తమ తలను తామే నరికేసుకొని తమను బలి ఇచ్చుకొంటామని కూడ శపథం చేసినవారు. అటువంటి వీరులు తమ కర్తవ్యాన్ని నెరవేర్చారు. ఒక్కరు మిగలకుండ వారిని చంపివేశాము. వారి మృతదేహాలు గుట్టలుగా పడ్డాయి. కానీ వారిమధ్య వీర పాండియన్ మనకు కనిపించలేదు. చేపజెండాను చూసి మనం మోసపోయాము. ఆ చేపజెండాను ఎత్తుకొని ఒక ఏనుగు నిలబడివుంది. కానీ దానిపైనో, పక్కనో పాండ్యరాజు కనిపించలేదు! వీర పాండియన్ యుద్ధరంగం నుంచి పారిపోయి దాక్కోవడంలో సమర్థుడు కద? ఇప్పుడుకూడ అతడు పారిపోయివుంటాడని సందేహించి, సైన్యాన్ని విభజించి నాలుగువైపులా పంపించాము.

-:-

వైగైనది రెండు తీరాల వెంబడి మీరందరూ వేగంగా వెళ్ళారు. నేనూ ఊరకుండలేదు. వైగైనదిలో దిగి ఇసుకలో నడుచుకొంటూ దక్షిణంగా వెళ్ళాను. ఒక ఒంటి గుర్రపు అడుగులు ఇసుకలో కొన్నిచోట్ల కనిపించాయి. ఆ దిక్కులో ఇసుకలో రక్తపు మరకలుకూడ కనిపించాయి. ఆ ఆనవాళ్లదారిన నేను వెళ్ళాను. వైగైనది మధ్య దీవిలాగ అమరివున్న ఒక తోటను చేరాను. ఆ తోటలోపల పెరుమాళ్ళ గుడి (విష్ణుదేవాలయం) ఒకటుంది. దాని పక్కనే అర్చకుల ఇళ్ళు ఒకట్రెండు కనిపించాయి. పూజకు కావలసిన పూలచెట్లు ఆ తోటలో చాలవున్నాయి. ఒక కొలనులో తామరపూలు విరబూసివున్నాయి. మిత్రమా! నీకు జ్ఞాపకం ఉండే ఉంటుంది - ఆ తోటను చూపించి, మనవీరులెవ్వరూ పొరబాటునకూడ అందులో ప్రవేశించకూడదని ఆజ్ఞ వేశాను. అందుకు కారణం ఆ పెరుమాళ్ళ పూజకు ఎటువంటి భంగం కలగకూడదని మాత్రమే కాదు; ఆ అర్చకుల ఇంట నా మనసును దోచుకొన్న మహిళామణి ఉండడమే. ఒకరోజు నేనా తోటలో దూరినప్పుడు నందినిని చూసేశాను. ఆమె రూపురేఖలు ఇప్పుడు కాస్త మారివున్నాయి. తలవెంట్రుకలను ఆండాళ్ విగ్రహంలాగ ముందువైపు గుండ్రంగా చుట్టి దానిచుట్టూ పూలమాల ముడుచుకొంది. మెడలోను పూలమాల వేసుకొంది. 'ఇదేం వేషం?' అని అడిగాను. ఆమె నానుంచి విడివడి వచ్చిన తర్వాత మానవులెవరినీ పెళ్ళాడనని, ఆండాళ్ళులాగ కన్నెయ్యనే పెళ్ళాడేటట్లు సంకల్పం తీసుకొన్నట్లు చెప్పింది. ఇది నాకు ఒట్టి పిచ్చితనంగా తోచింది. మానవస్త్రీ దేవుని పెళ్ళాడడమేమిటి? - కానీ దానిగురించి నేనప్పుడు వాదించగోరలేదు. 'యుద్ధం ముగియనీ, తర్వాత చూసుకొందాం' అని ఊరుకొన్నాను. ఆమెకేదైనా సహాయం కావాలా అని అడిగాను. 'మీ యుద్ధవీరులెవ్వరూ ఇక్కడికి రాకుండ చేయండి. ఇక్కడ నా వయసు మళ్ళిన తలిదండ్రులు మాత్రమే ఉన్నారు. వారు అంధులు. దేశద్రిమ్మరియైన

అన్న ఒకడున్నాడు. వాడు ఇప్పుడు తిరుపతి యాత్రకు వెళ్ళాడు' అన్నది.ఆమె కోరినట్లే మన వీరులెవరూ అక్కడ అడుగుపెట్టకుండ చూసుకొంటానని మాటిచ్చి వెనదిరిగాను. తర్వాత రెండుమూడుసార్లు ఆమెను వెళ్ళి చూశాను. నాకామె పైని మోహం పదిరెట్లు పెరిగి నన్ను పిచ్చివాడిని చేయసాగింది. అప్పటికీ ఓర్చుకొన్నాను. వచ్చిన పని ముగియాలి. వీర పాండ్యుని తలతో పళైయారైకి తిరిగివెళ్ళాలి; అందుకు ప్రతిగా నందినిని పెళ్ళాడేందుకు తండ్రివద్ద అనుమతి తీసుకోవాలని నిశ్చయించాను.

"ఇలా నిశ్చయించుకొన్న స్థితిలో, ఒంటి గుర్రపు డెక్కల ముద్రలు ఆ తోటలోపలికి దారితీయడం చూస్తూనే నాకు పట్టలేనంత ఆశ్చర్యమూ, కోపమూ కలిగాయి. ఇంకా ముందుకు వెళ్ళి చూడగా, దట్టమైన చెట్ల మరుగున ఒక గుర్రాన్ని కట్టివుండడాన్ని గమనించాను. కాబట్టి తప్పించుకొని వచ్చినవాడు ఆ గుడిసెల్లో ఒకదాంట్లో ఉండే తీరాలి. నందిని ఇంటికి వెళ్ళి గవాక్షంగుండా చూశాను. మిత్రమా! నేకక్కడ చూసిన దృశ్యం కాలిన ఇనుప కమ్మీతో నా గుండెల్లో కాల్చినట్లు ముద్రించబడివుంది. ఒక పాత కుక్కి మంచంలో వీర పాండియన్ పడివున్నాడు. నందిని అతనికి శైత్యోపచారాలు చేస్తూంది. ఆమె ముఖం ఇంతకు మునుపెన్నడూ లేనంతగా వెలిగిపోతోంది. ఆమె కళ్ళలో రెండు కన్నీటి బాష్పాలు ఉబికి నిలిచివున్నాయి. నన్ను మీరి వచ్చిన కోపంతో తలుపును ధడేల్మని తన్ని లోపలికి దూకాను. గాయాలకు కట్లువేస్తున్న నందిని నన్ను చూస్తూనే అది ఆపేసి ముందుకు వచ్చింది. నాకు సాష్టాంగనమస్కారం చేసి లేచి నిలబడింది. చేతులు జోడించి, 'అయ్యా! మీరు ఒకప్పుడు నాపై కలిగివున్న ప్రేమ పైన ఆన చేసి వేడుకొంటున్నాను. వీరినేమీ చేయకండి. గాయపడి ఉన్న ఈయనను మీ చేతులతో చంపకండి!' అన్నది.

నేను తడబడుతూ, 'నీకూ, ఈ మనిషికీ ఏమి సంబంధం? ఎందుకని వాడి ప్రాణాలు కాపాడమని వేడుకొంటున్నావు?' అన్నాను.

"ఈయన న ప్రేమికుడు; ఈయన నా దైవం; నన్ను పెళ్ళిచేసుకోవడానికి సమ్మతించిన దయాళువు!" అన్నది నందిని.

"గాయపడ్డ వీర పాండ్యుని చూడగానే కలిగిన ఒకింత జాలీ అప్పుడు ఎగిరిపోయింది. ఈ పాతకుడు, ఛండాలుడు - ఎలా నాపై పగతీర్చేసుకొన్నాడు చూడు! నా రాజ్యాన్నే కైవసం చేసుకొనివుంటే బాధపడేవాడిని కాను; నా హృదయంలో వసిస్తున్న స్త్రీమణిని కద దోచేసుకొన్నాడు? వీడిపైన ఎలా జాలి చూపగలను? కానేకాదు.

"నందిని పక్కకు తోసేసి, ఆమెను దాటుకొని వెళ్ళి, నా కత్తితో ఒక్కవేటుతో వీరపాండ్యుని తల నరికేశాను. ఆ మూర్ఖభయంకర కృత్యాన్ని తలుచుకొంటే ఇప్పుడూ సిగ్గుపడుతున్నాను. కానీ, ఆ సమయంలో క్షాత్రావేశంతో బాటు క్రోధావేశంకూడ నన్ను ఆవహించాయి. ఆ ఆవేశంలో వీర పాండ్యుని చంపి ఆ ఇంటినుంచి బయటకు దాటి వచ్చేటప్పుడు నందినిని ఒక్కసారి తిరిగిచూశాను. ఆమెకూడ నన్ను

కళ్ళార్పకుండ చూసింది. అటువంటి చూపు ఈ భూలోకంలో నేను చూసి ఎరుగను. కామ, క్రోధ, లోభ, మోహ, మద మాశ్చర్యాలనే అరిషడ్వర్గాలు (వినాశకారులైన భావాలు) అంతటి అగ్నిజ్వాలలై ఆ చూపునుంచి ఎగసిపడ్డాయి. దాని అర్ధమేమని ఎన్నిసార్లు ఆలోచించి చూసినా, ఇప్పటివరకు నాకు అంతుబట్టలేదు!

‘‘అంతలో నన్ను వెతుక్కొని నీవూ , పలువురు వీరులు అక్కడికి వచ్చేశారు . వీరపాండ్యుని తలలేని మొండాన్ని , రక్తం కారుతున్న తలను చూసి అందరూ జయఘోష చేశారు . కానీ నామనసులో వింధ్య పర్వతం వంటి ఒక పెద్ద భారం పెట్టినట్లైంది ....

~~~
~~~

# అధ్యాయము - 56

## అంతఃపుర సంభవం

చాల వందల ఏళ్ళకు మునుపు మహేంద్రపల్లవ చక్రవర్తి కాంచీపురం రాజధానిగా పాలించేటప్పుడు దేశమంతటా మహాభారతాన్ని చదివే ఏర్పాట్లు చేయించాడు. బౌద్ధ, జైన మత ప్రభావం వల్ల ప్రజలు సాధువులైపోయి ఉండడం వల్ల వారిలో మళ్ళీ వీరత్వం పుట్టించడం కోసమే ఆ ఏర్పాటు చేయించాడు. భారతం చదివేందుకే చాల ఊళ్ళలో భారత మంటపాలు కట్టించాడు. ఆయన ప్రారంభించిన ఏర్పాటు ఇప్పటికీ (అంటే మన కథ జరిగేనాటికి) తొండై మండలంలో నిరాటంకంగా కొనసాగుతోంది. రాత్రిళ్ళు ప్రజలు ఆ మంటపాల్లోనో లేక బయలు ప్రదేశాల్లోనో గుమిగూడి భారత కథ వినేవారు. భారతం ముఖ్య కథను, అందులోని ఉపకథలను పాటలు, వచనాల మూలంగా మహావీరావేశంతో చెప్పగల గాయక కథకులు పలువురు ఉదయించారు.

అర్జునుడు తీర్థయాత్రలకు వెళ్ళినప్పుడు మణిపురి పక్కనున్న వనంలో నాగ రాకుమారి ఉలూపిని[6] చూశాడు. ఇద్దరూ ఒకరినొకరు ప్రేమించుకొన్నారు. ఉలూపికి ఇరవాన్ అనే ముద్దుల కుమారుడు కలిగాడు. పర్వతదేశపు రాకుమారికి, మహావీరుడైన అర్జునునికి పుట్టడంవల్ల ఆ కుమారుడు కూడ మహావీరుడై విలసిల్లాడు. భారతయుద్ధం జరగబోతోందని విని అతనుకూడ పాండవుల పక్షంలో చేరేందుకు అక్కడికి వచ్చి చేరాడు. యుద్ధం ఆరంభమయ్యేందుకు ముందు, సర్వలక్షణాలు కలిగిన ఒక యువవీరుడిని యుద్ధబలి ఇవ్వాలన్న మాట వచ్చింది. అప్పుడు ఇరవాన్ ముందుకు వచ్చి, "ఇదిగో నేనున్నాను; నన్ను బలి ఇవ్వండి!" అన్నాడు. పాండవసైన్యంలో అతనికన్న గొప్పవీరులింకెవ్వరూ లేనందువల్ల, అతన్నే బలి ఇవ్వవలసివచ్చింది.

తన పక్షం జయించాలని తన ప్రాణాలనే త్యాగంచేసిన వీర ఇరవాన్ కథ తమిళదేశపు ప్రజల మనసు దోచుకొంది. ద్రౌపదమ్మకు గుడి కట్టిన చోటల్లా ఆ గుడి పక్కనే ఇరవాన్ గుడి కట్టి తిరునాళ్ళు చేశారు.

ఆ రాత్రి మామల్లపురపు పంచరధాల వద్ద ఇరవాన్ కథాపారాయణం ముగియ వస్తున్నట్లనిపించింది. "త్రిలోకాధిపతి సుందర చోళచక్రవర్తి నూరేళ్ళుండనీ!" "కోప్పరకేసరి ఆదిత్య కరికాలన్‌కి జయహో!" అన్న జయఘోషలు వినవచ్చాయి. కథ వింటున్నవారు లేచి తమతమ దోవన వెళ్ళనారంభించారు.

"కథ ముగిసింది; మలైయమాన్ కాసేపట్లో వచ్చేస్తారు" అన్నాడు కరికాలన్.

---

6 తమిళమూలంలో చిత్రాంగద అని సూచించబడింది . కానీ అది తప్పు .

"ఇరవాన్ కథ ముగిసింది; కానీ మీరు చెబుతున్న కథ ఇంకా ముగియలేదు కద?" అన్నాడు పార్థిబేంద్రుడు.

"ఈ ప్రాయంలో మలైయమాన్ మనోదృఢత్వాన్ని చూడు! ఇప్పటికీ నడిరేయి వరకు కథ వినేందుకు వెళ్ళారు చూడు!" అన్నాడు కరికాలన్.

"పండు ముదుసలయ్యేంతవరకు బ్రతికి ఉండడం ఒక విశేషమా? ఊరిలో ఎంతోమంది ముసలివాళ్ళున్నారు. రాత్రి నిద్రపట్టక వెళ్ళి కథ వింటూంటారు...!"

"తిరుక్కోవలూర్ మిలాడుదుర్రైని అలా సాధారణ వృద్ధులతో పోల్చవచ్చా? ఎన్ని పోరాటాలను చూసినవారాయన? ఆయనంతటి వయసు వరకు మనం బ్రతికుంటామా అన్నదే సందేహం. ఉన్నా, ఆయనంత దృఢంగా ఉండబోము..."

"రాజా! పాతకాలపు మనుషులు అంత దిట్టంగా ఉండడానికి కారణం ఉంది..."

"అదేమి కారణం?"

"వారు ఆడవాళ్ల వ్యామోహంలో పడేవారు కారు. కేవలం ఒక అర్చకుని కూతురికి మనసిచ్చేసి దిగులుపడి కూర్చొనేవారు కారు. అలా పడ్డా, అలాంటి ఆడదాని జుట్టు పట్టుకొని లాక్కొని వచ్చి అంతఃపురంలో పడేసి, తదుపరి కార్యం చూసేవారు...!"

"పార్థిబా! నందిని అర్చకుల కూతురు కాజాలదు; ఆమె పుట్టుకకు సంబంధించి ఏదో రహస్యం ఉండి తీరాలి...!"

"నందిని ఎవరి కూతురైతేనేమి? అర్చకుల కూతురైతేనేమి? రాజకుమారైతేనేమి? లేక అనాథైతే మాత్రమేమి? ఆ ఇంకొక ముసలాడు పెద్ద పళువేట్టరయ్యర్ని చూడండి! ఎక్కడో దారిలో ఆమెను చూశాడు; తీసుకొచ్చి ఎనిమిదితో తొమ్మిదని అంతఃపురంలో కుక్కేశాడు..."

"మిత్రమా! అది తలుచుకొంటే నాకింకా ఆశ్చర్యంగానే ఉంది...!"

"దేన్ని తలుచుకొంటే? ఆ ముసలాడు ఎలా ఈమె వలలో పడ్డాడనే కద?"

"కాదు, కాదు! ఒకప్పుడు నన్ను ప్రేమించానని చెప్పింది, వీర పాండ్యుని ప్రేమించి వాడి ప్రాణాలను కాపాడ ప్రయత్నించింది, ఈ పండు ముసలిని పెళ్ళాడేందుకు ఎలా సమ్మతించింది? అది తలుచుకొంటేనే నాకు ఆశ్చర్యంగా ఉంది!"

"నాకదేమీ అలా తోచలేదయ్యా! మీరు చేసిందే నాకు చాల ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. చోళకులానికి పరమ శత్రువైన వీర పాండ్యుని - ఓడిపోగానే పారిపోయి దాక్కొనే పిరికిపందల్లో పిరికిపంద, 'వీర పాండియన్' అని సిగ్గులేక తనను తాను గొప్పగా పిలుచుకొనేవాడు - అటువంటి వాడికి ఆశ్రయమిచ్చి

ప్రాణభిక్షకోరిన ఆమెను మీరెలా వదిలిపెట్టారు? అదే నాకు ఆశ్చర్యాల్లో ఆశ్చర్యమనిపిస్తోంది. ఒకటి ఆమెను కూడ అక్కడికక్కడే కత్తితో నరికేసి ఉండాలి! అందుకిష్టపడకపోతే, కాళ్ళు చేతులు కట్టి బంధించి తెచ్చి ఉండాలి! ఇవి రెండూ చేయక ఊరకే తిరిగివచ్చేశారు...! ఇప్పుడు నాకు కూడ జ్ఞాపకం వస్తోంది, రాజా! ఆ గుడిసె వాకిట వీర పాండ్యుని మొండాన్ని తీసుకొచ్చి పడేశారు మీరు. అదిచూసి మేమందరమూ జయఘోష చేశాము. అప్పుడు గుడిసెలోపలినుంచి ఎవరో ఒక ఆడది వెక్కివెక్కి ఏడుస్తున్న శబ్దం విన్పించింది. అదేమని నేను అడగగా, మీరు, 'అదెవరో అర్చకుల కుటుంబీకులు. ఇప్పటికే వారు భీతిచెందివున్నారు. మీరు లోపలికి వెళ్ళి వారినింకా భయపెట్టకండి!' అని మీరన్నారు. గెలుపొందిన ఉద్రేకంలో మేముకూడ దాన్నంతగా పట్టించుకోలేదు. వెంటనే వీర పాండ్యుని తలను తీసుకొని బయలుదేరాము. మీరూ మాతోబాటు వచ్చారు. కానీ మీరు మా సంబరంలో అంతగా ఆసక్తిగాని, ఉత్సాహంగాని చూపలేదు. నేను కారణమడిగాను. మీరేదో సమాధానం చెప్పారు. మీకేమైనా బలమైన గాయం తగిలిందేమోనని సందేహించి అడిగింది కూడ నాకిప్పుడు జ్ఞాపకం వస్తోంది!" అన్నాడు పార్థిబేంద్రుడు.

"నా శరీరానికేమీ గాయం తగల్లేదు, పార్థిబా! మనసుకే ఎన్నటికీ ఆరని, తీరని గాయం ఏర్పడింది. వీర పాండ్యుడు గాయపడి పడివున్న మంచం ముందుకు వచ్చి చేతులు జోడించి ప్రాణభిక్ష అడిగిన ఆ దృశ్యం నా మనసులో అలాగే పదిలమైపోయి చెక్కుచెదరకుండ ఉంది. 'అయ్యో! ఆమె అడిగింది ఇవ్వకుండ ఇలా చేసేశామే!' అని నా మనసు విలవిల్లాడింది. నా ప్రాణాలిచ్చి వీర పాండ్యుని బ్రతికించేందుకు సాధ్యమైతే అలాగే చేసేవాడిని. అది అసాధ్యం కాబట్టి నన్ను నేనే నిందించుకొన్నాను. పార్థిబా! మన శక్తిసామర్థ్యాలు అనంతమైనవని మనమనుకొంటున్నాము. మనం చేయలేని పని ఏదీ లేదని గర్వపడుతుంటాము. 'రాజులు మహావిష్ణు అంశతో పుట్టినవారు' అని కవులు తాళపత్రాలలో రాశారని విని, అదికూడ నిజమని నమ్మేస్తున్నాము. కానీ, శరీరాన్ని విడిచిన ప్రాణాన్ని తిరిగి తేగల శక్తి మనకుందా? రాజవంశంలో పుట్టిన ఎవరికైనా అది ఉండేదా? మనకు ప్రాణం తీసేందుకు మాత్రమే సాధ్యం; కానీ, ప్రాణాలు తిరిగి ఇవ్వగల శక్తి మానవులుగా పుట్టిన ఎవరికీ లేదు...!"

"అలా ఉండకపోవడమే చాల మంచిది. ఆ శక్తి మీకే ఉండివుంటే ఎంతటి అపరాధం జరిగిపోయిఉండేది? వీర పాండ్యునికి మళ్ళీ ప్రాణం ఇచ్చి ఉండేవారు. వాడు మళ్ళీ ఏ కొండగుహాలోనైనా వెళ్ళి దాక్కొని ఉండేవాడు. పాండ్య యుద్ధం ఇంకా జరుగుతుండేదేమో! ఇదంతా ఒక ఆడదాని అబద్ధపు కన్నీటికోసం!" అన్నాడు పార్థిబేంద్రుడు.

"పల్లవా! నీవు స్త్రీకులాన్ని నిరసించే నిర్భాగ్యశాలివి! నీకు ప్రేమంటే ఏమని తెలియదు! అందుకే ఇలా మాట్లాడుతున్నావు!"

"అవును; నేను ఏ స్త్రీ చూపుల వలలోను చిక్కుకోనివాడిని. కానీ మీ అంతరంగ స్నేహితుడైన వంతిదేవుడు పసుపు పూసుకొన్న ఏముఖం చూసినా వారి మైకంలో పడిపోతాడు. అందుకే అతడంటే మీకు నాకన్న ఎక్కువ ఇష్టం కద, రాజా!"

"ఆహా! చివరికి వంతిదేవుని దగ్గరకు వచ్చి నిలిపావు కద నీ వాదాన్ని! ఏమిటింతసేపు అతన్ని మరిచిపోయావు కద అని ఆశ్చర్యపడుతున్నాను!"

"అవును, అతనిగురించి నిజం చెబితే మీకు చేదుగానే ఉంటుంది. ఆమాట ప్రస్తుతానికి వదిలేస్తాను. తర్వాత ఏం జరిగింది, రాజా! నందినిని మీరు మళ్ళీ కలవనే లేదా? వీర పాండ్యునికోసం కరిగిపోయిన ఆమె ఆ ముసలి పళువేట్టరయ్యర్ని ఎందుకు ఎలా పెళ్ళి చేసుకొందని ఆమెను అడగనే లేదా?"

"వీరపాండ్యుని చంపిన రాత్రి, విజయకోలాహలం తర్వాత మీరందరూ వసారాలో నిద్రపోయారు. నాకేమో నిద్ర రాలేదు. ఆమెను మళ్ళీ చూడాలని నాశరీరంలోని ప్రతినరమూ విలవిల్లాడింది. ఆమెను చూసి ఏదైనా ఊరట చెప్పాలని, క్షమాపణ కోరుకోవాలని అనుకొన్నాను. ఇంకొకసారి ఆమెపై పొంగుకొచ్చిన కోపాన్ని ఆమెపై కక్కాలని ఆవేశపడ్డాను. ఎలాగైనా ఆమెను మళ్ళీ చూడకపోతే మనశ్శాంతి లేదని, మళ్ళీ చోళరాజ్యానికి తిరిగి వెళ్ళలేనని అనిపించింది. కాబట్టి, అర్ధరాత్రి ఎవరికీ తెలియనట్లు, వసారానుంచి లేచి నిశ్శబ్దంగా గుర్రమెక్కి వైగై నది మధ్య ఉన్న ఆ దీవిని చేరాను. మనస్సు అదురుతుండగ, ఒళ్ళు గడగడ వణుకుతుండగ, కాళ్ళు తడబడుతుండగా, గుర్రం దిగి మెల్లగా పెరుమాళ్ళ గుడి చేరాను. అక్కడున్న గుడిసెలన్నీ కాలి బూడిదైపోయి ఉండడాన్ని చూశాను. ఒక ముసలాయన, ముసలమ్మ కాలిపోయిన ఒక గుడిసె పక్కన కూర్చొని ఏడుస్తుండడాన్ని చూశాను. ఇంకాస్త దగ్గరికి వెళ్ళి చూసినప్పుడు, వాళ్ళే ఒకప్పుడు నందినిని పళైయారై అంతఃపురపు తోటకు తీసుకొచ్చిన వారని తెలిసింది. నన్ను చూడగానే వారి దుఃఖము, భీతి పదిరెట్లైంది. ముందు వాళ్ళు ఏమాత్రం మాట్లాడలేకపోయారు. మెల్లగా ధైర్యం చెప్పి విషయం విచారించి తెలుసుకొన్నాను. నదికి అవతలి ఒడ్డున ఉన్న గ్రామంలో వారి పెద్దకూతురుందట. ఆమెకు ప్రసవకాలమని తెలియడంతో ఆమెను చూడ వెళ్ళారట. నందిని వారితో రా నిరాకరించిందట. మనసుకు తోచినట్లు చేసే ఒట్టి హఠమారి పిల్లను ఏమీ చెయ్యలేక వారు మాత్రం వెళ్ళివచ్చారట. దారిలో ఎవరో మొరటువాళ్ళు ఒక ఆడపిల్లను కాళ్ళు చేతులు కట్టి మండుతున్న చితిపైకి బలవంతంగా పడదోయ ప్రయత్నిస్తుండడాన్ని చూశారట. యుద్ధసమయంలో ఇటువంటి విపరీతాలు జరగడం సహజమేనని ఎంచి వారి దాపులకు కూడ పోకుండ వేగంగా ఇక్కడికి వచ్చేశారట. వచ్చి చూస్తే వారి గుడిసెలన్నీ కాలి బూడిదైపోయి ఉన్నాయి! నందినికూడ కనిపించలేదట. ఈ వివరాలన్నీ చెప్పి, అర్చకులు, వారి భార్య, 'యువరాజా! మా కూతురెక్కడ? మా ముద్దుల కూతురెక్కడ?' అని భోరుమన్నారు. వారు నందిని నిజమైన తలిదండ్రులు కాదన్న విషయం నాకు ముందే తెలుసు. ఇప్పుడది నిర్ధారమైంది. కన్నవారలా

తమ కూతురిని అలా వదిలి వెళతారా? కాబట్టి వారిపైన నాకు జాలి, కనికరం కలగనేలేదు. నందినికి పట్టిన గతిని గురించి తలుచుకోగా ఏర్పడిన దుఃఖాన్ని అదిమిపెట్టుకొని, "మీ కూతురు కాలిపోయిన చితిలోపడి మీరూ కాలి చావండి!' అని వారిని శపించి తెల్లవారేలోపల మీరున్న చోటికి వచ్చిచేరాను. మీరందరూ ఇంకా బాగా నిద్రపోతున్నారు. నేను వెళ్ళింది, తిరిగి వచ్చింది మీకెవరికీ తెలియదు..."

"అవును, యువరాజా! మాకెవరికీ తెలియలేదు, నిజమే. తర్వాత కూడ ఇంతకాలం ఎవరికీ చెప్పకుండ మీ మనసులోనే దాచుకొని కుమిలిపోతుండడాన్ని తలుచుకొంటే ఆశ్చర్యంగా ఉంది. స్నేహధర్మానికి విరుద్ధంగా ఇలా మీరు నడుచుకొంటారని నేననుకోలేదు. మీ పరిస్థితిలో నేనుంటే నేను మీకు చెప్పకుండా ఉండేవాడినే కాను" అన్నాడు పార్థిబేంద్రుడు.

"కానీ నీవు నాపరిస్థితిలో లేదు కద? ఈ లోకంలో ఎవరూ నా పరిస్థితిలో ఉండి ఉండలేరు. ఉండే ఉంటే, నీవెలా నడుచుకొని ఉంటావని చెప్పగలం?" అన్నాడు కరికాలన్.

"రాజా! జరిగిపోయిన దానిగురించి మనలో మనకు వివాదం వద్దు. తర్వాతేం జరిగింది? నందినిని మళ్లీ ఎప్పుడు చూశారు? పళువూర్ యువరాణి అయిన తర్వాతనా, అంతకు మునుపా?"

"అంతకు మునుపు చూసి ఉంటే, ఆమె పళువూర్ యువరాణి ఐవుండేదే కాదు. పళువేట్టరయ్యర్ పెళ్ళి జరిగినప్పుడు మనమిద్దరం ఊరిలో లేము. ఆ సమాచారం అందినప్పుడు మనమిద్దరం అది విని ఏవగించుకొన్న విషయం నీకు గుర్తుండే ఉంటుంది కద? అది జరిగిన కొన్నిరోజులకు నాకు యువరాజు పట్టాభిషేకం జరిగింది. సింహాసనానికి వారసులెవరనే విషయంలో సందేహముండకూడదనే నా తండ్రి, పెదనానమ్మ, తక్కిన పెద్దలు చేరి చేసిన ఏర్పాటది. మధురాంతకునికి ఎవరైనా దుర్బోధ చేసి చెడగొడతారన్న సందేహం వారికుండేదో ఏమో? యువరాజు పట్టం కట్టడంతో బాటు, నా పేర శిలాశాసనాలు వేయించగల అధికారంకూడ నాకు ఇచ్చారు. 'ఇక ఈ చోళ సామ్రాజ్యాన్ని ఏలే పూర్తి బాధ్యత నీదే' అని నా తండ్రి మనసారా నోరారా అన్నారు. దాన్ని దేశ, నగర ప్రజలు, అమాత్యులు, పెద్దలు అందరూ ఒప్పుకొని జయఘోష చేశారు. ఈ కోలాహలంలో నేను నందినిని పూర్తిగా మరిచిపోయాను. కానీ పట్టాభిషేకం జరిగిన కొద్దిసేపటికల్లా ఆమెను నేనెన్నటికీ మరువలేని సంభవమొకటి జరిగింది. పురాతనకాలపు చోళ వంశ మణిమకుటంతో చక్రవర్తి నన్ను అంతఃపురానికి తీసుకువెళ్ళారు- నా తల్లిదగ్గర, బామ్మ దగ్గర అంతఃపురంలోని తక్కినపెద్దల దగ్గర ఆశీర్వాదం పొందడానికి. నావెంట నా సహోదరుడు, ముఖ్యమంత్రి, పళువేట్టరయ్యర్లు కూడ వచ్చారు. అంతఃపురంలోవయసుమళ్ళిన తల్లులు, నా చెల్లెలు, ఆమె చెలికత్తెలు, ఇంకా చాల మంది యువతులు గుంపుగా నిలబడివున్నారు. అందరూ చక్కగా మంచి వస్త్రాభరణాలతో అలంకరించుకొని మారాకను ఎదురుచూస్తూ కుతూహలంతో వేచివున్నారు. కానీ అన్ని ముఖాల్లో ఒకే ఒక్క ముఖమే నాకు కనిపించింది - అది నందిని ముఖమే. కాలి

బూడిదైపోయిందనుకొన్న నా హృదయదేవతే ఆమె! ఈ అంతఃపురంలోపలికి ఎలా వచ్చింది? అంత గొప్పగా అలంకరించుకొని రాణుల మధ్య మహారాణిలాగ ఎలా నిలబడివుంది? ఆమె ముఖంలో ఏమా మందహాసం! ఆమె సౌందర్యం మునుపటికన్న పదిరెట్లు అధికంగా కనిపిస్తోంది కద, అది ఎలా? కొన్ని క్షణాల్లో నా మనసు ఎన్నెన్నో ఆకాశహర్మ్యాలను కట్టింది! చోళ సామ్రాజ్యానికి వారసుడనయ్యే హక్కు పొంది మకుటం ధరించిన ఆ రోజు నా జీవితంలోనే గొప్ప అదృష్టమైన దినం కాబోతోందా? నా మనసును ఆకట్టుకొన్న రాణిని పట్టమహిషిగా పొందబోతున్నానా? ఏదైనా ఒక ఇంద్రజాలంవల్ల అలా జరగబోతోందా...? ఇలా నేనేదేదో ఊహించుకొంటున్నప్పుడు నా తల్లి వాణమాదేవి ముందుకు వచ్చి, 'బిడ్డా!' అని నా నెత్తి తాకి ఆశీర్వదించింది! అదే సమయంలో ఎవరూ ఎదురుచూడని ఆ సంభవం జరిగిపోయింది. నా తండ్రి ఉన్నట్లుండి 'ఆః!' అని కేకవేసి కిందపడి మూర్ఛపోయారు. వెంటనే అక్కడ చాల గందరగోళమైంది. నేను, తక్కిన వారు చక్రవర్తిని లేపి కూర్చోబెట్టి మూర్ఛపోగొట్టే ప్రయత్నంలో నిమగ్నమైనాము. నా తల్లి, పెద్దనానమ్మ శెంబియన్ మాదేవి తప్ప తక్కిన స్త్రీలందరూ లోపలికి వెళ్ళిపోయారు. తండ్రికి త్వరలోనే మూర్ఛపోయి తెలివి వచ్చేసింది. నా చెల్లెలు కుందవైని ఒంటరిగా పక్కకు తీసుకువెళ్ళి, 'నందిని ఇక్కడికెలా వచ్చింది?' అని అడిగాను. నందిని పెద్ద పళువేట్టరయ్యర్ని పెళ్ళి చేసుకొని పళువూర్ యువరాణిగా చెలామణి అవుతోందని నా చెల్లెలు చెప్పింది. నా గుండెలో పదునైన శూలం చొచ్చుకొనిపోయింది, మిత్రమా! యుద్ధాల్లో నేనెన్నోసార్లు గాయపడ్డాను. కానీ, 'నందినే పళువూర్ యువరాణి' అని కుందవై చెప్పగా నా ఎదలో ఏర్పడిన గాయంఇంకా ఆరలేదు'! అని చెప్పి ఆదిత్య కరికాలన్ తన ఎదను గట్టిగా అదిమిపట్టుకొన్నాడు.

~~~
~~~

# అధ్యాయము - 57

## మాయమోహిని

మొదటినుంచే ఏమంత ఆర్ద్రత చూపకుండ కథవింటున్న పార్థిబేంద్రునికి ఇప్పుడు నిజంగా మనసు కరిగిపోయింది. తన కళ్ళలో ఉబికిన కన్నీటిని తుడుచుకొన్నాడు.

"రాజా! ఒక ఆడదాని పైని ప్రేమ ఇంతటి దుఃఖాన్ని కలగజేయగలదని నేను కలలోకూడ ఊహించలేదు! యువరాజ పట్టాభిషేకం జరిగినరోజు మీకిటువంటి అనుభవమొకటి జరిగిందని మాకెవ్వరికీ తెలియదు. కాబట్టి మీరు దిగులుపడివుండడం గమనించి ఆశ్చర్యపోయాము. ఏవేవో హాస్యసంభాషణలతో మిమ్మల్ని నవ్వించజూశాము. అదంతా ఇప్పుడు నాకు గుర్తుకు వస్తోంది!" అన్నాడు.

"అవును; మీరు హాస్యపు విలిజల్లు నాపై కురిపించారు. నన్ను ఉత్సాహపరిచేందుకు ప్రయత్నించారు. నేను పాలించేరోజుల్లో చేయబోయే మహత్కార్యాలగురించి మాట్లాడారు. లంకనుంచి హిమాలయాలవరకు చోళసామ్రాజ్యాన్ని ఆరోజే విస్తరింపజేసేశారు! ఇంకా, సముద్రాలు దాటి వెళ్ళి విదేశాలను కైవసం చేసుకొన్నారు. ఆమాటలన్నీ నాకింకా జ్ఞాపకం ఉన్నాయి. అదంతా నాకెంత దుఃఖాన్ని కలిగించిందని కూడ జ్ఞాపకం ఉంది. తర్వాత ఒకరోజు నందిని నన్ను పళువూర్ రాజగృహానికి రమ్మని ఆహ్వానం పంపింది. వెళ్ళడమా, మానడమా అని నా మనసులో ఒక పెద్ద పోరాటం లేచింది. చివరికి వెళ్ళడానికే నిశ్చయించుకొన్నాను. పలువిషయాల్లో నాకు ఏర్పడిన సందేహాలను ఆమెను అడిగి తెలుసుకోగోరాను- ఆమె పుట్టుకను గురించిన నిజాన్ని తెలుసుకోవాలని ఆశపడ్డాను; ఆరోజు నా తండ్రి అంతఃపురంలో మూర్ఛపడ్డందుకు, ఆయన ఆరోజు ఆమెను అక్కడ చూసినందుకు ఏమైనా సంబంధం ఉందా అని కూడ నా మనసులో సందేహం ఉండేది. ఆరోజు చక్రవర్తికి త్వరలోనే స్పృహ వచ్చినప్పటికీ, ఆయన తన మునుపటి ఆరోగ్యం తిరిగి పొందలేదనే విషయం నీకు తెలుసు. నందినిని చూసి మాట్లాడితే నాకంతవరకు విశదపడని మర్మమేదైనా బయటపడవచ్చని అనుకొన్నాను. ఇదంతా ఒక వ్యాజ్యంగా (సాకు) పెట్టుకొన్నానే తప్ప, నిజానికి ఆమెలోని ఆకర్షణశక్తే నేనక్కడికి వెళ్ళడానికి ముఖ్యకారణం. పళువేట్టరయ్యర్ ఊళ్ళో లేరు. ఆయన అంతఃపురంలో నన్ను అడ్డగించేవారు కూడ లేరు; నాకు, నందినికి మధ్య ఉన్న పూర్వస్నేహం గురించి తెలిసినవారక్కడ ఎవరూ లేరు. యువరాజు పట్టం కట్టుకొన్న రాజకుమారుడు పళువూర్ రాణుల ఆశీర్వాదం పొందేందుకు వస్తున్నాడనే అనుకొన్నారు. అంతఃపురపు తోటలోని లతామంటపంలో నేను నందినిని కలిశాను. పార్థిబా! సముద్రప్రయాణం చేసినవారి అనుభవాలు నీవు వినివున్నావు కద? సముద్రంలో కొన్నిచోట్ల నీటిప్రవాహాలు అనూహ్యమైన శక్తితోను, అపరిమిత వేగంతోను ఉంటాయట. వాటిలో ఓడలు చిక్కుకొంటే కొద్దిక్షణాల్లో ముక్కలు ముక్కలైపోతాయట, నేను నందిని ముందు అటువంటి పరిస్థితిలో చిక్కుపడ్డాను. నా మనసు, దేహము, హృదయం - అన్నీ వెయ్యి

ముక్కలైపోయాయి. నా నోట వచ్చిన మాటలు నాకే ఆశ్చర్యాన్ని కలిగించాయి. 'అయ్యో! మనమిదేమిటిలా మాట్లాడుతున్నాము!' అని మనసులో అనిపిస్తున్నప్పుడు, నోరు ఏదేదో పేలసాగింది. నాకు యువరాజు పట్టం కట్టినందుకు నందిని తన సంతసాన్ని వెలిబుచ్చింది.

'నాకు అందులో ఏమంత సంతోషం లేదు!' అన్నాను.

'ఎందుకు?' అన్నది నందిని.

'ఇదేం ప్రశ్న? నాకదెలా సంతోషకారణమౌతుంది, నీవిలా నాకన్యాయం చేసివున్నప్పుడు?' అన్నాను. నేను చెబుతున్నది తనకర్థంకానట్లు నటించింది. ఇలా మాటలు పెరుగుతూ వెళ్ళాయి. ఆమె నా ప్రేమను నిరాకరించడం, వీరపాండ్యుని ప్రేమించడం చేసి ఆమె చాల పెద్ద తప్పు చేసిందన్నాను. ముసలాయన పళువేట్టరయ్యర్ని పెళ్ళాడాడం ఇంకొక పెద్ద తప్పన్నాను.

'యువరాజా! మొదట మీరు నన్ను ప్రేమించారు; తర్వాత నన్ను ప్రేమించినవాడిని నా కళ్ళముందే చంపారు; నన్నుకూడ చంపకపోతే మీమనసుకు నెమ్మది ఉండదనిపించింది. నేను బ్రతికివుండడమే మీకిష్టం కాలేదు. మంచిది; నన్నుకూడ చంపి మీకోరిక నెరవేర్చుకోండి!' అని చెప్పి తన నడుమున దూర్చివున్న చురకత్తిని తీసి ముందుకు చాపింది.

'నేనెందుకు నిన్ను చంపుతాను? నీవేకద నన్ను ప్రాణాలతో ఉండగానే చంపుతున్నావు?' అన్నాను.

చివరికి, ఇప్పుడు తలుచుకొంటే సిగ్గుపడే మాటలు నానోట వచ్చాయి. 'ఇప్పటికీ మించిపోలేదు. ఈ ముసలాడిని వదిలిపెట్టి నాతో వచ్చేస్తానని చెప్పు! నీకోసం నేనీ రాజ్యాన్నే వదిలి వచ్చేస్తాను. ఇద్దరూ ఓడేక్కి సముద్రాన్ని దాటి దూరదేశాలకు వెళ్ళిపోదాం!' అన్నాను.

నందిని అది విని భయంకరంగా నవ్వింది. అది తలుచుకొంటే ఇప్పుడుకూడ నా వెంట్రుకలు నిక్కబొడుచుకొంటున్నాయి. 'కడలిదాటి దూరదేశాలకు వెళ్ళి మనం ఏం చేయడమని చెబుతున్నారు మీరు? కట్టెలు కొట్టి బతకడమా? లేక అరటితోట వేసుకొని బతకడమా?' అన్నది. 'అదంతా నీకిష్టముండదు. అర్చకుల ఇంట పుట్టినదానివి ఇప్పుడు పళువూర్ రాణి ఐపోయావు కద?' అన్నాను.

'ఇంతటితో నేను తృప్తిపడదలుచుకోలేదు. చోళసింహాసనంపైన చక్రవర్తినిగా వెలుగొందాలని నా ఉద్దేశం. మీకిష్టమైతే చెప్పండి. ఇద్దరు పళువేట్టరయ్యర్లను చంపేసి, సుందరచోళ చక్రవర్తిని చెరసాలలో వేసేసి నన్ను మీ పట్టమహిషిగా చేసుకొంటానంటే చెప్పండి!' అన్నది. 'అయ్యో! ఎంతటి భయంకరమైన మాటలంటున్నావు!' అన్నాను. 'గాయపడి విశ్రాంతి తీసుకొంటున్న వీరపాండ్యుని నాకళ్లముందే చంపడం భయంకరమైన కార్యం కాదా?' అని అడిగింది. దానితో నాకు కోపం పొంగుకొని రాసాగింది. ఆమెను నోటికొచ్చినట్లు తిట్టి అక్కడినుంచి బయలుదేరాను. అప్పటికీ ఆమె నన్ను వదలలెదు. 'యువరాజా!

ఎప్పుడైనా మీమనసు మార్చుకొంటే నావద్దకు తిరిగి రండి. నన్ను చక్రవర్తినిగా చేసుకొనేందుకు మీమనసొప్పుకొన్నప్పుడు తిరిగిరండి!' అన్నది. ఆరోజు ఆమెను విడిచి వచ్చిన తర్వాత ఆమెను మళ్ళీ కలవనేలేదు!' అన్నాడు ఆదిత్య కరికాలన్.

ఇదంతా విని భీతి, ఆశ్చర్యమూగొన్న పార్థిబేంద్రుడు, "రాజా! ప్రపంచంలో ఇటువంటి ఒక రాక్షసి ఉండ సాధ్యమా? ఆమెను మీరు మళ్ళీ కలవనిది మంచిదే!" అన్నాడు.

"ఆమెను నేను మళ్ళీ కలవలేదన్నది నిజమే! కానీ ఆమె నన్ను వదిలిపెడితే కద? రాత్రింబగళ్ళు నన్ను చుట్టివస్తూ వేధిస్తోంది - పగలు నా తలపుల్లో; రాత్రి నా కలల్లో. ఒకసారి మోహనమందహాసంతో నన్ను అక్కునజేర్చుకొని ముద్దాడవస్తుంది. ఇంకొకసారి చేత చురకత్తితో నన్ను చంపవస్తోంది. మరొకసారి కంట ఉబికివస్తున్న కన్నీళ్లతో ఏడుస్తూ వస్తోంది. మరింకొకసారి తలవిరబోసుకొని చెంపలను గోళ్లతో గీరుకొంటూ, ఏడుస్తూ వస్తోంది. ఒకసారి పిచ్చిదానిలా భయంకర వికటాట్టహాసంతో వస్తోంది. ఇంకొకసారి ప్రశాంతవదనంతో ఓదార్పు చెప్పవస్తోంది. దేవుడా! ఆ పాతకి నన్నెలా వేధిస్తోందని చెప్పలేను. ఈ రోజు సాయంత్రం తాతగారు చెప్పింది జ్ఞాపకం ఉందా? నేనెందుకు తంజావూరుకు వెళ్ళకూడదనేందుకు ఏదేదో కారణాలు చెప్పారు. నిజానికి నేను తంజావూరుకు వెళ్ళకుండ ఉండడానికి, మా నాన్నగారిని కంచికి రప్పించాలని కోరుకోవడానికి కారణం నందినే..."

"రాజా! కేవలం ఒక ఆడదానికి భయపడా మీరు తంజావూరుకు వెళ్ళకున్నారు? ఒకవేళ ఆమె వంచనతో మీకు విషమిచ్చి చంపేస్తుందని భయపడుతున్నారా?...."

"లేదు, పార్థిబా, లేదు! నీవు నన్నింకా బాగా అర్థం చేసుకోలేదు. ఆమె నన్ను చంపేస్తుందని జంకడంలెదు. ఆమె నాచేత తనకిష్టం వచ్చిన పని చేయించుకొంటుందనే నా భయం. 'నీ తండ్రిని చెరలో పెయ్!' 'నీ చెల్లెలిని దేశంనుంచి బయటకు తరిమేయి!' 'ఈ ముసలాడిని చంపి నన్ను సింహాసనమెక్కించు!' అని ఆ మాయమోహిని ఇంకొకసారి చెబితే, నాకలా చెయ్యాలనిపిస్తుందేమో అనే భయపడుతున్నాను. మిత్రమా! నందినైనా చావాలి; లేదా నేనైనా చావాలి. లేకపోతే ఈ జన్మలో నాకు మనశ్శాంతి దొరకదు!" అన్నాడు కరికాలన్.

"రాజా! ఇదేం మాటలు? మీరెందుకు మరణించాలి? నాకు అనుమతినివ్వండి! లంకకు తర్వాత వెళతాను. వెంటనే తంజావూరుకు వెళ్ళి దాన్ని చంపి వస్తాను. స్త్రీహత్యాదోషం నాకు వస్తే రానీ..."

"నీవలా ఏమైనా చేస్తే నిన్ను నా బద్ధశత్రువుగా భావిస్తాను. నందినిని చంపనే చంపాలంటే నా ఈ చేతులతో నేనే చంపుతాను. చంపి నన్ను నేనే చంపేసుకొంటాను! ఇతరులెవరూ ఆమె చిటికెనవేలికి కీడు కలిగించడంకూడ నేను సహించలేను! మిత్రమా! నీవు నందినిని మరిచిపో! తాత చెప్పినట్లు నీవు రేపే బయలుదేరి లంకకు వెళ్ళు! నా సహోదరుడైన అరుళ్మొళివర్మను ఎలాగైనా ఒప్పించి ఇక్కడకు తీసుకురా!

వాడు ఇక్కడే ఉండేలా చేద్దాము. తాత, మనుమడు మంత్రాలోచన చేసి ఏం చేయదలుచుకొంటే అది చేయనీ. మనం లంకకు వెళదాం. మళ్ళీ పెద్ద ఒడెక్కి మరింత పెద్ద దండుతో దక్షిణ సముద్రాల్లో వెళదాం. శావకం, పుష్పకం మొదలైన దేశాలకు వెళ్ళి మన విజయధ్వజాన్ని నాటుదాం. తర్వాత పడమరవైపు వెళదాం. అరబ్బు, పారశీకం, మీశిరం మొదలైన దేశాలకు వెళ్ళి అక్కడల్లా తమిళుల వీరత్వాన్ని, పులిజెండాను నెలకొల్పుదాం. పార్థిబా! ఆ దేశాల్లో మనదేశంలో ఉన్నట్లు శీలమనే కట్టుబాటు లేదని నీకు తెలుసా? రాజులు తమ ఇష్టం వచ్చినట్లు తమ ఏలికలో ఉన్న ఏ స్త్రీనైనా తీసుకువెళ్ళి అంతఃపురంలో పెట్టుకొంటారట!..." అన్నాడు కరికాలన్.

పార్థిబేంద్రుడు ఇందుకు బదులు చెప్పేలోగా తిరుక్కోవలూర్ మలైయమాన్ అక్కడికి వచ్చేరారు. "అరవాన్/ఇరవాన్ కథలాంటి అద్భుతమైన కథ ఈ లోకంలోనే లేదు. నీవిప్పుడు చెప్పుకొచ్చిన ఏదేశాల్లోను లేదు. కానీ మీరింకా నిద్రపోక మాట్లాడుకొంటున్నారా? పార్థిబా! నీవు రేపు లంకకు బయలుదేరాలన్న మాట గుర్తుందికద?" అన్నారు.

"దానిగురించే నిద్రపోక మాట్లాడుకొంటున్నాము!" అన్నాడు పార్థిబేంద్రుడు.

[ఇంతటితో **పొన్నియిన్ సెల్వన్** ప్రథమభాగం సమాప్తం]